# మాగాడు

నవల

– అత్తలూరి విజయలక్ష్మి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 257

కౌముది మాసపత్రికలో

జనవరి 2022 సంచిక నుంచి  డిసెంబర్ 2023 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

*(ప్రారంభం)*

**మాదాపూర్ లోని స్టేట్ గ్యాలరీ.**

విశాలమైన ప్రాంగణంలో “ ఎస్  ఛానల్” అని వ్రాసి ఉన్న వాన్ ఆగింది.

“జీవన చిత్రాలు“ అనే కాప్షన్ తో చిత్రకళా ప్రదర్శనకి సంబంధించిన  ఫ్లెక్సీ చూస్తూ వ్యాన్ లో నుంచి దిగాడు కెమెరామాన్ ఆనంద్.. అతని  వెనకాల మరో నలుగురు యూనిట్ సభ్యులు దిగారు. వాన్ వెనకే వచ్చి ఆగిన కారులో నుంచి ప్రొడ్యూసర్ వర్మ, యాంకర్ మేఘ దిగారు. మేఘ చెదిరిన జుట్టు సవరించుకుంటూ తలెత్తి ఆ మూడు అంతస్తుల భవనం వైపు ఒకసారి చూసి, ఫ్లెక్సీ వైపు దృష్టి సారించింది. డిజిటల్ అక్షరాలతో  ఉన్న చిత్రకళా ప్రదర్శన అన్న అక్షరాలు చదివి నెమ్మదిగా మెట్ల వైపు నడిచింది. “బాగా జనం ఉంటారు అనుకున్నాను. ఎక్కువ మంది లేరేంటి సర్?”  అంది..

“ఇది శారీ మేళా కాదు, గోల్డ్ మేళా కాదు.. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎక్సిబిషన్ కాదు. ఆర్ట్ ఎగ్జిబిషన్. ఈ మాత్రం జనం వచ్చారు సంతోషించు “ అన్నాడు వర్మ.

“ఎందుకని? దేశంలోనే  పెద్ద పేరున్న ఆర్టిస్టుల చిత్ర ప్రదర్శన అన్నారు కదా!”  సందేహంగా చూసింది.

వర్మ నవ్వాడు. “ అయితే!”

“అదీ ” ఏం మాట్లాడాలో తెలియలేదు మేఘుకి.

వర్మ మళ్ళీ నవ్వుతూ అన్నాడు. “మన దేశంలో కళలకి,  కళాకారుడికి ఎంత విలువ ఉందో నీకు తెలియదా.  నీ సంగతే ఆలోచించు..ఒక యాంకర్ గా కేవలం ఆర్టిస్టులను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చావు కానీ నీకు ఎంత మాత్రం ఇంట్రెస్ట్ ఉంది! మామూలుగా అయితే వచ్చేదానివా! ”

మేఘ అవును కదా! వచ్చేదాన్ని కాను అనుకుంది.  వర్మ అన్నట్టు తను శారీస్ ఎగ్జిబిషన్ అయితే తప్పకుండా వెళ్ళేది.

“ సో... ఇప్పుడు అర్థం అయిందిగా జనం ఎందుకు లేరో.  ఇంతకీ నీకు ఆర్ట్ గురించి ఏమన్నా తెలుసా?”

బ్లాంక్ గా చూస్తూ తెలియదు అన్నట్టు తల అడ్డంగా ఊపింది.

“మరి ఆర్టిస్ట్ లను ఏం ప్రశ్నలేస్తావు”

"మీరు చెప్పండి.." కొంచెం సిగ్గుపడుతూ అంది.

అతను అదోలా నవ్వాడు. "యాంకరింగ్ అంటే ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ బడ,బడా డబ్బాలో రాళ్ళు పోసి గల,గలలాడించినట్టు చెప్పేసి దులుపుకుని వెళ్ళిపోడం కాదు. కొంచెం చదువుకోవాలి. నాలెడ్జ్ గెయిన్ చేయాలి. ఒక మంచి యాంకర్ గా నేషనల్ లెవెల్ లో ఫేమస్ అవాలంటే ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి. ట్రై టు లెర్న్ సంథింగ్. ఒక ఆర్టిస్టుని కాని, ఒక రచయితను కానీ, ఇంటెలెక్చువల్స్ నిగాని పరిచయం చేసేటప్పుడు వాళ్ళ గురించి కొంచెం స్టడీ చేయాలి. ఒక రచయితను అయితే వాళ్ళ రచనలు చదవాలి. ఆర్టిస్ట్ లను అయితే ఆర్ట్ గురించి కొంచెం తెలుసుకోవాలి."

అతను చెప్తోంటే కొంచెం గిల్టీ గా అనిపించింది మేఘకి. డబ్బులకోసం, గ్లామర్ కోసం ఈ ఫీల్డ్ ఎన్నుకుందే కాని, నిజానికి తను చదువుకున్న ఎం.బి.ఏ సిలబస్ కూడా తనకి గుర్తులేదు. కేవలం ఫోటో జేనిక్ ఫేస్, వాక్చాతుర్యం మాత్రం చూసి యాంకరింగ్ కి తనని సెలెక్ట్ చేశారు. వర్మ గారు బాగా చదువుకున్న వ్యక్తి. సాహిత్యం పట్ల, సంగీతం పట్ల నాలెడ్జ్ ఉన్నవాడు. ఆయన అభిరుచికి తగినట్టు కార్యక్రమాలు ప్లాన్ చేస్తాడు. ఆయన కార్యక్రమాల ద్వారా తను ఫేమస్ అయింది అంతే తప్ప తన ప్రతిభతో కాదు అని ఆమెకి తెలుసు. తను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తుల స్థాయిని బట్టి తనకో గుర్తింపు వచ్చింది.

"దట్స్ ఓకె. ఫీల్ అవకు. ఇకనుంచి నేను చెప్పినట్టు చేయడానికి ప్రయత్నం చేయి. పద, పద. వాళ్ళు రెడీ గా ఉన్నారు" హెచ్చరించాడు వర్మ. యూనిట్ సభ్యులంతా కెమెరాలతో మైక్ లతో సిద్ధం అవడంతో ఆలోచనల నుంచి బయటపడి ఆయనని అనుసరిస్తూ లోపల అడుగుపెట్టింది.

విశాలమైన హాలు. అడుగుపెట్టగానే, గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న కారిడార్ లో అందమైన కుండీల్లో క్రోటన్ మొక్కలు కుడివైపు పెద్ద హాలు, ఎదురుగా మెట్లు, పక్కనే లిఫ్ట్. మూడు అంతస్తుల్లో చిత్రకళా ప్రదర్శన జరుగుతోంది. మీడియాని చూడగానే ఆర్గనైజర్ వాళ్లకి ఎదురుగా వచ్చి " మీదే ఛానెల్?" అని అడిగాడు. చెప్పాడు వర్మ.

"ఓకె. మూడు అంతస్తుల్లో ఉన్నాయి పెయింటింగ్స్. కొందరు ఆర్టిస్ట్ లు కూడా వస్తారు ఇప్పుడు. మీరు కావాలంటే వాళ్ళతో ఇంటర్వ్యూ తీసుకోవచ్చు."

"థాంక్ యూ" అతనికి కృతజ్ఞతలు చెప్పి "కమాన్" అంటూ లిఫ్ట్ వైపు నడిచాడు వర్మ. మేఘ ఆయన వెనకాల లిఫ్ట్ లో అడుగుపెట్టింది.

అప్పుడే నలుపు రంగు బైక్ దూసుకు వచ్చి ఆగింది. ఆహ్లాద దూకినట్టు దిగి ” నువ్వు పార్క్ చేసుకుని లోపలికి రా“ అని చెప్పింది అనురాగ్ కి.

“నిన్ను డ్రాప్ చేసాను కదా! నువ్వు పూర్తిగా చూడడం అయాక కాల్ చేయి వచ్చి పిక్ అప్ చేసుకుంటాను” అన్నాడు అనురాగ్ బండి మీద నుంచి దిగకుండా.

అతని వైపు చిరుకోపంగా చూసి “ ఇది చాలా పెద్ద ఎగ్జిబిషన్.. చాలా పెద్ద, పెద్ద ఆర్టిస్ట్ లు వేసిన పెయింటింగ్స్ పెట్టారు. మళ్ళీ మళ్ళీ ఛాన్స్ దొరకదు. రా లోపలికి. పైగా నాకు చాలా ఇష్టమైన ఆర్టిస్ట్ కూడా వస్తున్నారు. నేను ఆయన్ని ఇంటర్వ్యూ చేయాలి” అంది.

“ఓ... నో నాకు ఇంట్రెస్ట్ లేదు ఆహ్లాదా! నువ్వు వెళ్ళు. నా కోసం ఫ్రెండ్స్ ఎదురుచూస్తూ ఉంటారు” అనాసక్తిగా అన్నాడు అనురాగ్.

“ ఫ్రెండ్స్ రోజూ ఉంటారు. ఈ ఎగ్జిబిషన్ రెండే రోజులు ఉంటుంది” అంది ఆహ్లాద ఫ్లెక్సీ చూస్తూ.

“నాకు ఇంట్రెస్ట్ లేదు ఆహ్లాదా! నువ్వు తోడు రమ్మన్నావని వచ్చాను” అన్నాడు అనురాగ్.

“సరేలే. నీకు వెళ్ళాలి అనిపించినపుడు వెళ్ళు. కనీసం వచ్చినందుకు కొన్ని పెయింటింగ్స్ అన్నా చూడు” అంది మెట్ల వైపు నడుస్తూ.

“సరే తల్లి వస్తాను వెళ్ళు“ అంటూ బండి స్టార్ట్ చేసి పార్కింగ్ వైపు తిప్పాడు.

ఆహ్లాద మెట్లు ఎక్కుతూ ఎడమ వైపు ఉన్న ఫ్లెక్సీ పక్కనే ఉన్న మరో పెద్ద బ్యానర్ వైపు చూసింది. ఆర్టిస్ట్ ల పేర్లు వాళ్ళు ఎక్కడ నుంచి వచ్చారు ఫొటోలతో సహా ఉంది. కొన్ని లైన్స్ ఆర్ట్ గురించి చాలా అందంగా రాసి ఉన్నాయి.

“ Life is the art of drawing without an eraser... Every artist dips his brush in his own soul and paints his own nature into his pictures... so don’t miss... you are entering in a miracle world” .

ఆర్ట్ అంటే అవగాహన, అభిరుచి లేని వాళ్ళల్లో కూడా స్ఫూర్తిని కలిగించేలా ఉన్న ఆ వాక్యాలు ఆమెలో మరింత ఉత్సాహాన్ని నింపగా ఆహ్లాద రెట్టించిన ఆనందంతో లోపలకి అడుగుపెట్టి కుడి వైపు ఉన్న మొదటి అంతస్తులోని చిత్రకళా

ప్రదర్శన వైపు నడిచింది. అడుగుపెట్టగానే ఆమెని ఆకర్షించింది ఒక పెద్ద పెయింటింగ్ " My last journey" అని ఇంగ్లీషులో రాసి ఉన్న ఆ పెద్ద పెయింటింగ్ చాలా అందంగా ఉంది.

కామధేనువు పొదుగు నుండి క్షీరధారలు వర్షిస్తున్నట్టు నురగలు కక్కుతోంది సముద్రం. సప్తవర్ణాలు మేళవించిన కెరటాలు ఉవ్వెత్తున లేస్తూ అస్తమిస్తున్న సూర్యుడికి అర్ఘ్యం సమర్పిస్తున్నాయి. కుంకుమతో అలికిన ఆకాశం మీద బంతిపూవు అలంకరించినట్టు ఉంది అస్తమయ సూర్యబింబం. వింత,వింత రంగుల మేలిముసుగు కప్పుకుని, కళ్ళల్లో దాగి ఉన్నతారకల మెరుపులు హారాలుగా అల్లుతూ గగనసీమలో వెలుగుపూలు వెదజల్లుతోంది ఇంద్రచాపంలాంటి అమ్మాయి. పసుపు పచ్చ పైట క్షితిజరేఖలా సముద్రాన్ని ఆకాశాన్ని వేరుచేయడానికి ప్రయత్నం చేస్తోంది. కొంచెం దూరం నుంచి ఒక యువకుడు ఆ సముద్రం వైపు నింపాదిగా, అభావంగా నడచి వస్తున్నాడు. అతనికి దారి చూపిస్తున్నట్టు అతని తలమీదుగా ఎగురుతూ అతన్ని వెన్నంటి వస్తోంది ఓ పావురం.

ఆహ్లాద అప్పుడపుడే ఆర్ట్ నేర్చుకుంటోంది. ఆ చిత్రంలోని భావం ఆమెకి అంతుపట్టలేదు. ఒక పక్క అంతులేని సౌందర్యం, మరో పక్క నిశ్శబ్ద గీతం పాడుతున్న విషాదం. అమ్మాయిని ఇంద్రచాపంలా చూపించాడా! ఇంద్రచాపాన్నే అమ్మాయిలా వర్ణించాడా! దూరం నుంచి నడచివస్తున్న ఆ యువకుడి మొహంలో అంత ఉదాశీనత ఏమిటి? ఆ కళ్ళల్లో ఎలాంటి ఆనందం, ఉత్సాహం, ఉల్లాసం లేదు.. ప్రేమ, అనురాగం లేదు.. చాలా నిర్లిప్తంగా, కొండొకచో విషాదంగా ఉంది ఆ మొహం.. దీనికి " My last journey" అని పేరు పెట్టడంలో ఆ కళాకారుడి భావం ఏమై ఉంటుంది? ఏం చెప్పాలనుకుంటున్నాడు.? అసలీ కళాకారుడు ఎవరు? ఆమె చూపులు పెయింటింగ్ కింద కుడివైపు కనిపిస్తున్న నాలుగు అక్షరాల వైపు మళ్ళాయి. " మహాతేజ"

ఉవ్వెత్తున లేచిన ఓ కడలి తరంగం హృదయాన్ని తాకి, అలసిన కళ్ళను తడిపి, గుండెను తాకి సాంత్వన చేకూర్చిన అనుభూతి. గబుక్కున వెనక్కి తిరిగి నింపాదిగా మెట్లు ఎక్కుతూ అనాసక్తంగా వస్తున్న అనురాగ్ ని పిలిచింది ఉత్సాహంగా "అనురాగ్ ఇలారా త్వరగా". అతను అబ్బా అన్నట్టు మొహం పెట్టి రెండేసి మెట్లు చొప్పున ఎక్కి ఆమె దగ్గరకు వచ్చాడు.

అతను దగ్గరకు రాగానే ఆమె అతని చెవిలో చెప్తున్నట్టు నెమ్మదిగా చెప్పింది. "చూశావా! ఈ పెయింటింగ్ ఎంత అద్భుతంగా ఉందో."

"అవునా!" అతని దృష్టి ఆ పెయింటింగ్ వైపు సారించాడు " ఏముంది ఇందులో. సన్ సెట్, సముద్రం అంతేగా " అన్నాడు.

" ఛీ వేస్ట్ ఫెలో. పో జేమ్స్ బాండ్ సినిమాలు చూసుకో" అతని భుజం మీద గట్టిగా కొట్టింది.

"ఇందులో ఎంత మీనింగ్ ఉంటుందో తెలుసా! ఉత్తినే ఈ పెయింటింగ్ ఇక్కడ పెట్టరు. ఆర్ట్ విలువ ఎప్పుడు తెలుసుకుంటావు? "

"నువ్వు తెలుసుకున్నావుగా. అయినా ఎవరి టేస్ట్ వాళ్ళది. నీకు ఆర్ట్ అంటే ఇష్టం. నాకు మంచి ఇంగ్లీష్ మూవీ అంటే ఇష్టం. నువ్వు ఎంజాయ్ చేద్దూ. ఇంతకీ నీ అభిమాన హీరో వచ్చాడా?"

"తెలియదు లోపలకి వెళ్లి ఎవరినన్నా అడగాలి. ఈ పెయింటింగ్ ఆయనదే. మహాతేజ గారిది. కాకపోతే ఆయన వచ్చారో లేదో చూద్దాం పద. మీడియా యూనిట్ తో వచ్చింది అంటే ఆర్టిస్ట్ లను ఇంటర్వ్యూ చేయడానికేగా! కచ్చితంగా ఆయన కూడా వచ్చి ఉండచ్చు" అంటూ కుడివైపు ఉన్న పెద్ద హాలు వైపు నడిచింది. అనురాగ్ ఆమెని అనుసరించాడు.

విశాలమైన హాలు. గోడల నిండా అనేక రకాల చిత్రాలు. రాధాకృష్ణులు, ప్రకృతి అందాలు, నీలాకాశంలో ఎగిరే పక్షులు, కింద విశాలమైన జలధి. బావిలో నీళ్ళు తోడే అమ్మాయి, బిందెలు చంకన పెట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ నది దగ్గరకు నడుస్తున్న కన్నెపిల్లలు. ఒప్పులకుప్ప ఆడే అమ్మాయిలు, నోట్లో వేలేసుకుని బోసినవ్వులు చిందిస్తున్న పాపాయిలు, చిన్ని కృష్ణుడికి వెన్న తినిపిస్తున్న యశోద, ఉద్యానవనంలో చెలులతో శకుంతల. బోధి వృక్షం కింద బుద్ధుడు ఒకటేమిటి? సృష్టిలో అందాలన్నీ చిత్రాల రూపంలో కుప్ప పోసినట్టు ఉంది.

అవన్నీ చూస్తూ మైమరచి పోయింది.

"ఎప్పటికైనా నేను కూడా ఇలా వేయగలనంటావా!? " ఆశగా అడిగింది.

"ముందు మెడిసిన్ పూర్తీ చేయి. మీ మమ్మీ, డాడీల కోరిక తీర్చు. తరవాత టైం ఉంటే ఇవన్నీ చేయి."

"చదువుతో పాటు ఇతర curricular ఆక్టివిటీస్ ఉండాలి. ఎంజాయ్ ది ఆర్ట్ లెట్ మీ ఎంజాయ్. అదిగో యాంకర్ మేఘ" అంది హాల్లో ఒక వైపు నిలబడి ఉన్న మేఘని చూపిస్తూ. కెమెరా మాన్ చిత్రాలన్నీ వీడియో తీస్తున్నాడు. మేకప్ మాన్ మేఘకి టచ్ అప్ ఇస్తున్నాడు.

ఒక యువకుడు తన మొబైల్ లో ఫొటోస్ తీసుకుంటున్నాడు. మరో యువకుడు టాబ్ లో వీడియో తీసుకుంటున్నాడు. మరి కొందరు ఆసక్తిగా బొమ్మలు చూస్తున్నారు. అనురాగ్ ఒక్కోటి చూస్తూ కాజువల్ గా ముందుకు నడుస్తుంటే, ఆహ్లాద ప్రతి చిత్రం దగ్గరా ఆగి చాలా పరిశీలనగా చూస్తోంది.

అనురాగ్ ఆహ్లాదకి మంచి స్నేహితుడు. ఇంటర్ నుంచి కలిసి చదువుకున్నారు. ఆహ్లాద ఎక్కడికి వెళ్ళాలన్నా అతను తోడు ఉండాలి. కొన్నిటికి ఆసక్తిగా వెళ్తాడు. కొన్నిటికి బలవంతంగా వెళ్తాడు. ఇప్పుడు ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఉందని టి వి లో స్క్రోలింగ్ చూసిన రోజే అనురాగ్ కి చెప్పింది " నువ్వు ఆ రెండు రోజులు వేరే పనులు పెట్టుకోకు. నేను తప్పనిసరిగా ఆ ప్రదర్శనకి వెళ్ళాలి. నేను వెతుకుతున్న ఆర్టిస్ట్ ని కలిసే గోల్డెన్ ఛాన్స్ ఇది" అని.

ఆమె కోసం ఒప్పుకున్నాడే గాని అవతల ఫ్రెండ్స్ పార్టీ చేసుకుంటున్నారు. మనసంతా అక్కడే ఉంది.

విజిటర్స్ ఓ ఇరవై మంది ఉంటారు. వారిలో ఒక విదేశీయుడు కనిపించడంతో అనురాగ్ అతని వైపు ఆశ్చర్యంగా చూసాడు. దాదాపు తన వయసే ఉంటుంది అతనికి. ఆహ్లాద చూస్తున్న పెయింటింగ్ దగ్గర నిలబడి చాలా తదేకంగా చూస్తున్నాడు. అనురాగ్ కూడా ఆ పెయింటింగ్ వైపు శ్రద్ధగా చూసాడు. పెయింటింగ్ పైన ఒక సిల్క్ క్లాత్ మీద నేషనల్ ఆర్ట్ అకాడమి చిత్రకళా ప్రదర్శనలో ప్రధమ బహుమతి పొందిన చిత్రం అన్న అక్షరాలు రాసి ఉన్నాయి.

బాగా కృశించిన దేహంతో ఎడం కాలు సగం చాచి, కుడికాలు ముడుచుకుని కూర్చున్న ఒక స్త్రీ మూర్తి, ఎండిన పెదవులు. నగ్నంగా తోలుతిత్తిలా ఉన్న రొమ్ము దగ్గర బుల్లి నోరు సగం తెరిచి చూస్తున్న పసివాడు. ఆ స్త్రీ చెక్కిలి మీద ఆరిపోయిన ఆశల్లా కన్నీటి చారికలు. వెనక్కి ఒరిగిపోయి చూస్తున్న ఆ కళ్ళల్లో నిస్సహాయత. ముడుచుకున్న కాలి మీద తల, నేలమీద కాళ్ళు పెట్టి, దీనంగా పడుకుని అస్పష్టంగా కనిపిస్తున్న ఒక చిన్నపిల్ల, నేలమీద వెల్లకిలా పడుకుని కుడిచేయి బొటనవేలు చీకుతున్న మరో పసివాడు, ఎత్తుగా ఉన్న పొట్ట, పుల్లల్లా ఉన్న కాళ్ళు, వెనకాల సున్నం రాలిపోయి మిగిలిన మట్టి గోడ చిరిగిపోయిన కాన్వాస్ లా ఉంది. ఆ గోడ మీద అస్పష్టంగా లేత నారింజ, నీలం రంగుల్లో వలయాలు, వలయాలుగా కొన్ని గీతలు..

అనురాగ్ ని "హాయ్" అంటూ పలకరించాడు ఫారినర్. అతనికి ఇరవై ఏళ్ల వయసు ఉంటుంది. ఎర్రగా ఉన్నాడు. జుట్టు రాగిరంగులో ఉంది. పెదాలు ఎర్రగా ఉన్నాయి.

ముందు తెల్లబోయి తనని కాదేమో అన్నట్టు సందేహంగా అటూ, ఇటూ చూస్తున్న అనురాగ్ అతని మాటతో ఆగిపోయాడు. " కెన్ యూ ఎక్స్ ప్లెయిన్ అబౌట్ దిస్ పెయింటింగ్?" అడిగాడు ఫారినర్.

అనురాగ్ ఒక్క క్షణం తత్తరపడి తరవాత చిరునవ్వుతో అన్నాడు " నో సర్ ఐ యాం నాట్ ద ఆర్టిస్ట్.."

"ఓ సారీ" అన్నాడు ఆయన.

మేఘ, కెమెరా మాన్, ప్రొడ్యూసర్ వర్మ వాళ్ళ దగ్గరకు వచ్చారు. ముందు విదేశీయుడిని పలకరించి " హాయ్ .. ఐయాం మేఘ. యు ఆర్ ఫ్రం విచ్ కంట్రీ?" అడిగింది.

" మై నేమ్ ఆకిమ్ ఫ్రం రష్యా."

"ఓ! వెరీ నైస్. ఆర్ యు ఆర్టిస్ట్?"

"నో. ఆర్ట్ లవర్ "

"ఎక్సలెంట్. కెన్ యు సే సంథింగ్ అబౌట్ దిస్ ఎగ్జిబిషన్." .

" ఓ ష్యూర్ " అన్నాడు అతను.

కెమెరా మేన్ వైపు చూసింది. వర్మ మైక్ ఆమె చేతికి ఇచ్చి" ఇతని బైట్స్ అయాక విజిటర్స్ కొందరి బైట్స్ కూడా తీసుకో" అన్నాడు.

మేఘ సరే అన్నట్టు తల ఊపి మైక్ అతని మొహం వైపు పెట్టి కెమెరా వైపు చూసింది.

కెమెరా మాన్ ధీర్ "కొంచెం రైట్ కి రండి. కొంచెం...లెఫ్ట్.. లైటింగ్ సరిగా రావడంలేదు. కొంచెం మూవ్ అవండి" అంటూ అతనికి సూచనలు ఇచ్చి, యాంగిల్ సంతృప్తిగా అనిపించాక గట్టిగా అన్నాడు..

"స్టార్ట్."

మేఘ నవ్వుతూ చక్కటి ధారాళమైన ఇంగ్లీష్ లో "ఈ ఎగ్జిబిషన్ మీద, ఇండియన్ ఆర్ట్ మీద మీ అభిప్రాయం చెప్పండి..మీకు ఇండియన్ ఆర్ట్ అంటే ఆసక్తా..? ఇండియా ఎందుకు వచ్చారు?" అడిగింది.

" యా.. యా" అతను రష్యన్ యాక్సెంట్ లో చెప్పసాగాడు.

"నేను ఇటీవలే హై స్కూల్ చదువు పూర్తి చేసాను. ఇండియా చూడడానికి వచ్చాను. డిల్లీ విజిట్ చేసి, హైదరాబాద్ వచ్చాను. రెండు ప్రదేశాలలోనూ అద్భుతమైన, కళాత్మకమైన భవనాలు, చారిత్రక కట్టడాలు ఉన్నాయి. ముఖ్యంగా తాజ్ మహల్, కుతుబ్ మినార్, లోటస్ టెంపుల్, ఇస్కాన్ టెంపుల్స్ ఆల్ ఆర్ ఎక్సెల్లెంట్. వెరీ బ్యూటిఫుల్. ఢిల్లీలో ఒక అద్భుతమైన ఆర్ట్ ఎగ్జిబిషన్ చూసాను. అద్భుతమైన పెయింటింగ్స్. మా చిత్రాల్లో కనిపించని ఒక సొగసు ఇండియన్ ఆర్ట్ లో కనిపించింది. ముఖ్యంగా స్త్రీలు. ఎంత అందంగా ఉన్నారు! నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది. ఈ స్త్రీల చిత్రాలన్నీ

ఊహలా? లేక నిజంగా ఇలాంటి అందమైన స్త్రీలు ఉన్నారా అనుకున్నాను.  అండ్ ఐ వెంట్ మైసూర్.  అక్కడ మహారాజా పాలస్ లో రవివర్మ చిత్రాలు చూస్తూ నన్ను నేను మర్చిపోయాను.  ఇండియన్ ఉమన్ సంప్రదాయాలకు ప్రతీక అని, సంప్రదాయం లో సౌందర్యం ఉందని అర్ధం అయింది. అక్కడి నుంచి కలకత్తా వెళ్లాను. శాంతినికేతన్ చూసాను.. ఎంత అద్భుతం ఇండియన్ ఆర్ట్.. రియల్లీ ఐ లైక్ ఇట్.. ఐ వాంట్ టు నో అబౌట్ మోడరన్ ఆర్ట్. ఐ వాంట్ టు మీట్ ది గ్రేట్ ఆర్టిస్ట్స్" అంటూ అప్పటివరకూ తదేకంగా చూసిన ఆర్ట్ చూపిస్తూ " particularly ఐ వాంట్ టు మీట్ దిస్ ఆర్టిస్ట్ హూ మేడ్ దిస్ ఆర్ట్. ఇట్స్ రియల్లీ సూపర్బ్."

మేఘ మరికొన్ని ప్రశ్నలు అడిగింది "మీకు ఇండియన్ ఆర్ట్ నేర్చుకునే అవకాశం లభిస్తే ఇక్కడే ఉండి నేర్చుకుంటారా?"

అతను కొన్ని క్షణాలు ఆలోచించి " ఎస్ అఫ్కోర్స్ " అన్నాడు.

అతనికి థాంక్స్ చెప్పి మరో ఇద్దరు యువకులను అడిగి బైట్స్ తీసుకుంది. తరవాత ఆహ్లాద దగ్గరకు వచ్చింది మేఘ.

"మీరేం చేస్తున్నారు?"  అడిగింది.

"నేను మెడికో. నా పేరు ఆహ్లాద."

" ఈ ఎగ్జిబిషన్ మీద మీ అభిప్రాయం ఏంటి?"

"నాకు మహాతేజ గారి చిత్రాలు చాలా ఇష్టం ... ఇవాళ ఈ ప్రదర్శనలో వారి చిత్రాలు కూడా ఉంటాయని తెలుసుకుని వారిని కలుసుకోడానికి వచ్చాను."

"ఐసీ. ఇంతకు ముందు వారి చిత్రాలు చూసారా?"

" ఎస్.  నా దగ్గర ఐ మీన్ మా ఇంట్లో వారు స్వయంగా వేసిన చిత్రాలు ఉన్నాయి. అవి చూసాక నాక్కూడా ఆర్ట్ మీద ఆసక్తి కలిగింది. వారి దగ్గరే ఆర్ట్ నేర్చుకోవాలి అనుకుంటున్నాను. ప్రస్తుతం సరదాకి అప్పుడప్పుడు పెన్సిల్ స్కెచ్ వేస్తూ ఉంటాను.

వర్మ మేఘుకి వైండ్ అప్ చేయమని సైగ చేసాడు. మేఘ అందరికీ ధన్యవాదాలు చెప్పి, వర్మ దగ్గరగా వెళ్ళింది. ఆహ్లాద మరో పెయింటింగ్ వైపు వెళ్ళింది.

"మహాతేజ గారు వచ్చారు ఇప్పుడే. బయట మీటింగ్ లాంజ్ లో కూర్చున్నారు. కమాన్ ఇంటర్వ్యూ చేద్దాము" అన్నాడు వర్మ మేఘతో.

"ఓ... సూపర్" అంటూ ఉత్సాహంగా మరోసారి మేకప్ టచప్ చేయించుకుని వర్మ వెనకాల బయలుదేరింది మేఘ.

అనురాగ్ ఆహ్లాద దగ్గరగా వెళ్లి ఆమె చెవిలో చెప్పాడు "మహాతేజ గారు వచ్చారుట. మీడియా వాళ్ళు ఇంటర్వ్యూ చేయడానికి వెళ్తున్నారు మనం కూడా వెళ్దామా" అన్నాడు,

"ఓ వచ్చారా ! పద, పద" అని అడుగు ముందుకు వేయబోయిన ఆహ్లాద చటుక్కున ఆగిపోయింది. ఆకిమ్ వాళ్ళ వైపు రెండు అడుగులు వేసి " ఎనీ వన్ కెన్ ఎక్స్ప్లెయిన్ అబౌట్ దిస్?" అడిగాడు జాతీయ బహుమతి పొందిన చిత్రం చూపిస్తూ.

ఆహ్లాద అనురాగ్ వైపు చూసింది. అనురాగ్ పెదవి విరిచాడు. ఆహ్లాద సంకోచంగా నవ్వి " ఆర్టిస్ట్ ఈజ్ హియర్. హి విల్ ఎక్స్ప్లెయిన్" అంది.

" ఓ! కూల్. వేర్ ఈజ్ హి " అన్నాడు చుట్టూ చూస్తూ.

అప్పుడే అటుగా ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వాళ్ళల్లో ఒకతను ఆర్గనైజర్. ఆయనని గుర్తుపట్టిన అనురాగ్ అన్నాడు " హి ఈజ్ ద ఆర్గనైజర్. యు కెన్ ఆస్క్ హిమ్"

ఆ మాట విన్న ఆర్గనైజర్ ఫారినర్ వైపు చూసి చేయి చాచి షేక్ హ్యాండ్ ఇస్తూ "మే ఐ హెల్ప్ యూ" అన్నాడు.

ఆ కుర్రాడు షేక్ హ్యాండ్ ఇచ్చి "యా ఐ వాంట్ నో అబౌట్ దిస్ పెయింటింగ్" అన్నాడు.

"ఓ! ష్యూర్ . ఆయన ప్రెస్ మీటింగ్ లో ఉన్నారు చెప్తాను. పది నిమిషాల్లో వస్తారు " అంటూ మొబైల్ తీసుకుని ఫోన్ చేశాడు. ఆన్సర్ చేసిన వ్యక్తిని అడిగాడు "తేజగారు బిజీ గా ఉన్నారా? ఓ లేరా. ఐసీ. సరే అయితే గ్యాలరీకి వస్తారేమో అడిగి చెప్పు ఇక్కడ ఆయన అభిమానులు వెయిట్ చేస్తున్నారు" అన్నాడు.

అవతల వ్యక్తీ సరే అన్నట్టున్నాడు.

"ఓకే" అంటూ డిస్ కనెక్ట్ చేసి ఆ యువకుడి వైపు చూసి ఇంగ్లీషులో "వస్తున్నారు. ఆయనే వివరిస్తారు" అన్నాడు.

"థాంక్ యు" అన్నాడు ఆ కుర్రాడు.

ఆ మాట వినగానే హాలు బయటకు వెళ్ళబోతున్న ఆహ్లాద అలర్ట్ అయి ఆగిపోయింది. ఆమె గుండె దడ, దడ కొట్టుకోసాగింది. నుదుట స్వేదబిందువులు నిలిచాయి.. పక్కనే ఉన్న అనురాగ్ చేయి గట్టిగా పట్టుకుంది.

"ఏమైంది?" విచిత్రంగా చూశాడు అనురాగ్.

"ఏం లేదు జస్ట్ టెన్షన్. ఆయన ఇక్కడికే వస్తున్నారుట." అంది. ఆమె కళ్ళు డోర్ కి అతికించినట్టు రెప్పవేయకుండా చూడసాగింది.

ఆర్గనైజర్ చక్కటి ఇంగ్లీష్ ఉచ్చారణతో చెప్తున్నాడు ఫారెనర్ తో " దీన్ని మోడరన్ ఆర్ట్ అంటారు. చూడడానికి ఏవో అర్థం లేని గీతలు, పిచ్చి రంగులు లాగా అనిపిస్తుంది. కానీ బాగా జాగ్రత్తగా చూస్తే అందులో చాలా గొప్ప భావాలు, అనేక అర్థాలు కనిపిస్తాయి." అతను తలాడిస్తూ, మధ్య, మధ్య ఐసీ అంటూ వింటున్నాడు.

"నేను వెళ్ళనా!?" అన్నాడు అనురాగ్.

"ఆగు మహాతేజ వస్తున్నారు. ఇప్పుడు వెళ్ళడం ఏంటి? ఆయన్ని కలిసే ఛాన్స్ మళ్ళీ రాదు " అంది.

" అ యాం నాట్ ఇంట్రస్టెడ్. నాకు బోర్ ఆహ్లాదా. నేను వెళ్తాను. పని ఉంది" అన్నాడు అనురాగ్.

"ఓకే నువ్వు వెళ్ళు. రేపు కాలేజ్ లో కలుస్తాను" అంది అతనింకా అక్కడ ఉంటే తను అనుకున్న పని కాదు అన్న విసుగుతో.

"ఓకే.. బై" అంటూ అనురాగ్ వెళ్ళిపోయాడు.

ఆహ్లాద అతను వెళ్ళిన వైపు చూసి తలతిప్పే లోపల ఆర్టిస్ట్ రావడం, ఆర్గనైజర్ అతన్ని ఆ కుర్రాడికి పరిచయం చేయడం జరిగింది.

"హి ఈజ్ మిస్టర్ తేజ... మహా తేజ" అన్నాడు. ఆహ్లాద గుండె వేగంగా కొట్టుకోసాగింది.

**సన్నగా, పొడుగ్గా,** చామన చాయగా ఉన్నాడు.. కళ్ళద్దాల వెనకనుంచి లోతుగా, తీక్షణంగా ఉన్న చూపులు, జీవితానుభావాలను తెల్లకాగితం మీద చిక్కటి సిరాతో అలికినట్టు ఉంది జుట్టు. ఆహ్లాద ఆపాదమస్తకం

వణికింది. గొంతు తడారిపోయినట్టు అయింది. ఈయన మహాతేజ.. ఎంతో కాలంగా చూడాలని, కలుసుకోవాలని ఎదురుచూస్తున్న వ్యక్తి. దగ్గరగా వెళ్ళి అప్పటికప్పుడు తను చెప్పాలనుకున్నవిషయాలన్నీ పాఠం అప్పచెప్పినట్టు చేప్పేయాలనిపించింది.

“ వీరే మహాతేజ గారు “ ఆర్గనైజర్ మాటకి అక్కడ నిలబడ పెయిటింగ్స్ చూస్తున్న విజిటర్స్ తలలు వెనక్కి తిప్పి చూసి నిలబడిన చోటు నుంచి అతని వైపు వచ్చారు।

విదేశీ యువకుడు మహాతేజకి షేక్ హ్యాండ్ ఇచ్చాడు. “ అయాం ఆకిమ్ “ తనని తాను పరిచయం చేసుకున్నాడు.

“మీ ఆర్ట్ గురించి వివరాలు కావాలిట అతనికి” అన్నాడు ఆర్గనైజర్.

చిరునవ్వుతో అన్నాడు ఆకిమ్ “ సర్,, నేను చాలా పెయింటింగ్స్ చూశాను.. బట్ ఈ పెయింటింగ్ డిఫరెంట్ గా ఉంది.. దీని గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను !”

“ తప్పకుండా! ఎంతో దూరం నుంచి వచ్చి ఉత్సాహంగా మా కల్చర్ తెలుసుకోవాలన్న మీ ఆసక్తిని అభినందిస్తున్నాను” అంటూ తేజ చెప్పడం మొదలుపెట్టాడు.

ఆహ్లాద వాళ్ళకి కొంచెం దగ్గరగా జరిగి నిలబడి ఉత్సుకతతో వినసాగింది.

మేఘ మైక్ తో పరిగెత్తుకుని వచ్చింది.. “ ఎక్స్ క్యూజ్ మీ సర్ “ అంటూ మైక్ అతని మొహం దగ్గరకు పెట్టింది..

తేజ ఇబ్బందిగా చూస్తూ “ మీడియాకి మరోసారి తీరుబడిగా ఇంటర్వ్యూ ఇస్తాను.. ఇప్పుడు కేవలం ఈ ఒక్క ఆర్ట్ గురించి వివరిస్తున్నాను “ అన్నాడు.

“ ప్లీజ్ సర్! చెప్పండి. ఇది కూడా ఇంపార్టెంట్ సర్ ప్లీజ్ కాదనకండి “ బ్రతిమాలుతున్నట్టుగా అంది మేఘ.

“ సారీ! మీడియాకి చెప్పడం వేరు.. ఒక అభిమానికి చెప్పడం వేరు.. తప్పకుండా నేను మరోసారి మీ స్టూడియో కి వస్తాను.. ఇప్పుడు ఈ పోర్షన్ కవర్ చేయద్దు “ అన్నాడు తేజ.

మెత్తగా ఉన్నా ఆ స్వరంలో వినిపించిన షార్ప్ నెస్ గమనించిన వర్మ మేఘ భుజం మీద చేయేసి వారిస్తూ అన్నాడు “ఇట్స్ ఓ కే సర్! మిమ్మల్ని మా స్టూడియోలో చూడడంకోసం ఎదురుచూస్తాను. అయాం వర్మ ప్రోగ్రామ్ హెడ్ “ తేజకి షేక్ హ్యాండ్ ఇచ్చాడు.

" నైస్ టు  మీట్" తేజ మర్యాదపూర్వకంగా నవ్వుతూ అన్నాడు.

" ప్లీజ్ మీరు కంటిన్యూ చేయండి.." తేజతో అని మేఘ వైపు చూసి "  మేఘా! తరవాత వారిని స్టూడియో కి తీసుకుని వెళ్దాము కవర్ చేయాల్సినవి ఉన్నాయి రండి " అన్నాడు వర్మ.

తేజ థాంక్స్ అన్నట్టు చూసాడు వర్మ వైపు..

మేఘ అయిష్టంగా యూనిట్ ని అనుసరించింది.

తన వైపు ఉత్కంఠగా చూస్తున్న ఆకిమ్ ని, అక్కడ నిలబడిన అభిమానులను చూసి "చెప్పండి" అన్నాడు తేజ.

" ఈ పెయింటింగ్  భావం అర్థం కాలేదు explain చేస్తారా !" ధైర్యం చేసి అడిగింది ఆహ్లాద.

మందహాసం చేసి  కొన్ని క్షణాలు మౌనంగా ఆ పెయింటింగ్ వైపు చూస్తూ ఉండిపోయి నెమ్మదిగా మొదలుపెట్టాడు.

"జాగ్రత్తగా చూడండి ఇందులో మీకేం కనిపిస్తోంది."

ఎవరూ ఏమి మాట్లాడలేదు. ఆహ్లాద నెమ్మదిగా అంది " మాతృత్వం."

అభినందిస్తున్నట్టు చూసి  " కొంతవరకు అర్థం చేసుకున్నారు ఇంకా  జాగ్రత్తగా చూడండి" అన్నాడు. ఆహ్లాద మరో  రెండు అడుగులు ముందుకు నడిచి పెయింటింగ్ దగ్గరగా నిలబడి తదేకంగా  చూడసాగింది.

ఒక స్త్రీ, చాలా నిరుపేద స్త్రీ..  ఆమె చాతీ అనాచ్ఛాదితంగా ఉంది. ఆమె ఒడిలో ఉన్న బాబు పాలు త్రాగడానికి ప్రయత్నించి రొమ్ము వదిలేసి దీనంగా చూస్తున్నాడు. వాడి కను చివరల తెల్లని చుక్కలు ఆరిపోయిన  కన్నీటి చుక్కలు. ఏడవడానికి కూడా శక్తి లేనివాడిలా నిస్సహాయంగా, దిగులుగా ఉన్నాయి వాడి చూపులు. ఆమె మొఖంలో దుఃఖం, నిస్సహాయత. తాళ్ళలా వేళ్ళాడుతున్న తైల సంస్కారం లేని కేశాలు,  తోలు సంచీల్లా వేళ్ళాడుతున్న రొమ్ములు, ఆమె మడిచిన కాలు మీద  మరో పాప, ఆ పాప  కళ్ళల్లో నీరసం, ఆకలి!

తేజ నేలమీద పడుకుని బొటనవేలు చీకుతున్న పిల్లాడిని చూపిస్తూ చెప్పసాగాడు. " ఈ పిల్లవాడి  ఉబ్బిన పొట్ట, అస్తవ్యస్తంగా పడుకోబెట్టిన తీరు.. ఇవన్నీ ఏ భావం వ్యక్తం చేస్తున్నాయి మీకు?"  అడిగాడు తేజ.

" పావర్టీ " అన్నాడు ఆకిమ్.

" ఎస్! పావర్టీ..పేదరికం. ముగ్గురు పిల్లలు, ఆకలి బాధ, బాధ్యత లేని భర్త ఏమి చేయలేని ఆమె నిస్సహాయత తెలుస్తోంది కదా! "

ఊపిరి బిగబట్టి వింటున్న ఆహ్లాద, ఆకిమ్ మిగతా వాళ్ళు ఒళ్ళు జలదరించినట్టు అయి భుజాలు కదిలించారు. ఆహ్లాద పిల్లవాడి బొమ్మవైపు చూసింది. ఆ కళ్ళల్లో దీనత్వం చూడగానే ఆమె గుండె కరిగిపోయింది. వానపాములా ఉన్నాడు. ఎంత మంది పిల్లలు ఇలా ఆహారం లేక మరణిస్తున్నారో ఎన్నో సార్లు టి. వి లో సేవ్ ది చిల్డ్రెన్ యాడ్ లో చూస్తూనే ఉంది. సరిగ్గా లంచ్ చేసేముందు వచ్చే ఆ యాడ్ కనిపించగానే విసుక్కునేది కానీ, అదే పరిస్థితి ఇక్కడ ఈ చిత్రం లో చూస్తుంటే హృదయం ద్రవించసాగింది.

తేజ స్వరం మంద్రంగా వినిపించసాగింది. " ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది పేదవారు ఉన్నారు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి.. వాటిలో ముఖ్యమైనవి నిరక్షరాస్యత, నిర్లక్ష్యం, అసమానత ఇవి కాక స్త్రీల పరాధీనత, ఆర్థికంగా పురుషుడి మీద ఆధారపడి జీవిస్తూ ఉండడం వలన పురుషుల ఆధిక్యత స్త్రీలని నిస్సహాయులను చేస్తున్నది. ఇందులో కనిపిస్తున్న స్త్రీ కళ్ళు చూడండి..."

"ఆమె కళ్ళ చివర ఎర్రటి చుక్కలు ఉన్నాయేంటి " ఆహ్లాద గబుక్కున అంది.

తేజ పల్చగా నవ్వి అన్నాడు " కన్నీళ్లు కార్చి, కార్చి ఇంక నీరు లేక రక్తం కారుతోంది అన్న భావం వ్యక్తం చేయడం ఇదే expressionism.. Expressionism is inner layers of a person. చిత్రం చూడగానే వీక్షకులకు చిత్రం లోని వస్తువుల కన్నా అందులోని భావం అర్థం కావాలి.. రేఖా మాత్రంగా ఉన్న ఆ కళ్ళల్లో విషాదం, దుఃఖం పోటీ పడి కనిపిస్తున్నాయి. అవి తెలియడం కోసమే కోసమే చిక్కటి రంగులు ఉపయోగించాను. కళాకారుడు, లేదా ఒక కవి లేదా ఒక నటుడి హృదయంలో ఎన్నో పొరలు ఉంటాయి. ఒక్కో పొరలో ఒక్కో భావం.. ఆ భావాలను వ్యక్తీకరించడంలో అతను పడే మానసిక సంఘర్షణలో అనుసరించే ఒక పద్ధతి expressionism. ఇది ఆధునిక కళ లో వచ్చిన ఒక ప్రయోగాత్మక కళారీతి."

" సర్! ఆబ్జెక్ట్ అస్పష్టంగా ఉంది కేవలం సబ్జెక్టు పరంగా చెప్పినప్పుడు కవిత్వం లేదా నాటకం సామాన్య ప్రజలకు కూడా అర్థం అవడంలో పెద్ద కష్టం ఉండకపోవచ్చు.. కానీ, ఇలా పెయింటింగ్ లో మీరు ప్రయోగించిన format సామాన్యులకు అర్థం కాదు కదా! "

నవ్వాడు తేజ. “ ఒక కమర్షియల్ సినిమాకి, ఒక ఆర్ట్ సినిమా కి ఉన్న తేడానే ఇది కూడా.. ఆర్ట్ మూవీ ఎందుకు అవార్డులకి పరిమితం అవుతుంది.. ఎందుకు ఆర్థిక లాభాలు తెచ్చి పెట్టదు నిర్మాతలకి? కామన్ మాన్ ని ఆకట్టుకోదు కాబట్టి. కామన్ మాన్ ఎప్పుడూ సినిమా నుంచి వినోదం మాత్రమే కోరుకుంటాడు. ఆలోచనాత్మకంగా సినిమా తీస్తే అనవసరంగా తన ఆలోచనా శక్తిని ఒక సినిమా కోసం వినియోగించడం వృధా అనుకుంటాడు. అలాగే చాలా మంది తమ డ్రాయింగ్ రూమ్ లో అలంకరణ కోసం ఒక పెయింటింగ్ పెట్టుకోవాలి అనుకుంటే ఒక అందమైన అమ్మాయిదో లేదా ప్రకృతి సౌందర్యం వెల్లివిరిసేదో పెట్టుకుంటాడు. ఇలాంటివి అర్థం చేసుకోవాలి అంటే అభిరుచి ఉండాలి. ఇప్పుడు నా చుట్టూ ఉన్న మీలో ఎంత మందికి అభిరుచి ఉంది! ఆకిమ్ కి అభిరుచి ఉంది కాబట్టే రష్యా నుంచి కేవలం మన సంస్కృతీ, సంప్రదాయాలను, మన కళలను తెలుసుకోవడానికి వచ్చాడు. అతనికి నేను వివరిస్తూ ఉంటే మీరంతా కేవలం ఆసక్తి తో వింటున్నారే గానీ, అభిరుచి తో కాదు అవునా!”

ఆహ్లాద కొంచెం కలవరపడి చుట్టూ ఉన్న వాళ్ళ మొహాల్లోకి చూసింది. అందరూ ఇబ్బందిగా కదిలారు.

తేజ తిరిగి వివరించడం ప్రారంభించాడు. “ మీలో అభిరుచి కలిగించేలా వివరించే అవకాశం కళాకారుడి కి లభించడం అరుదు. నాకు లభించింది. ఈ అవకాశం నాకు ఇచ్చినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ చెప్తాను వినండి. “ మంద్రంగా ఉన్న అతని స్వరం మంత్ర ముగ్ధులయి వినసాగారు అందరూ.

“మన అందరికీ కూడా అంతరంగంలో మనకే తెలియని అనేక పొరలు ఉంటాయి. వాటిని వ్యక్తపరచడానికి ఒక్కోరు ఒకొక్క పద్ధతి అనుసరిస్తారు. కళ విషయానికి వస్తే, expressionismలో సబ్జెక్టు పరంగా అభివ్యక్తీకరించడం అనే పద్ధతిని నేను ఎక్కువగా ఫాలో అవుతాను..” అతను చెప్పడం ఒక్క క్షణం ఆపి సన్నగా నిట్టూర్చి, “ నేను poor communicatorని. నా ఎమోషన్స్ ని మాటల్లో చెప్పలేక గీతల్లో వ్యక్తం చేయడం అలవాటు చేసుకున్నాను. ఆ అలవాటే expressionism మీద ఆసక్తిని కలగచేసింది. వీక్షకుడు వస్తువు మీద కన్నా అందులోని భావం మీద దృష్టి పెట్టి, ఆ భావం అర్థం చేసుకునేలా చేయడానికి అస్పష్టమైన గీతలు, దట్టమైన రంగులు ఉపయోగిస్తాము. మోడరన్ ఆర్ట్ లో subject కన్నా ఆబ్జెక్ట్ ద్వారానే భావాన్ని చెప్పడం ఒక విశిష్టత. సున్నితమైన విషయాన్ని లైట్ కలర్స్ తో, తీవ్రమైన విషయాన్ని ముదురు రంగుల్లో ” అతని మాటలకి అడ్డువస్తూ అడిగాడు ఆకిమ్ “ ఆమె వెనకాల ఉన్న object ఏంటి?”

“ వాల్! అది ఒక గోడ, ఆమె గుడిసేకి సంబంధించిన మట్టిగోడ.. పెచ్చులు ఊడిపోయి, కూలిపోడానికి సిద్ధంగా ఉంది ఆమె జీవితం లాగా. “

“సర్! ఆ సీసాకి అర్థం ఏమిటి? ” చూపుడు వేలితో ఒక మూల విరిగిపడిన సీసా చూపిస్తూ అడిగింది ఆహ్లాద.

“ ఆ విరిగిపోయిన బాటిల్స్ ఆమె భర్త తాగి పారేసిన మద్యం తాలూకు సీసాలు. సీసాకి ఎరుపు రంగు వేయడానికి కారణం అతను తాగుతున్నది మద్యం కాదు.. భార్యా, పిల్లల రక్తం అని చెప్పడం. ఆ పిల్లలకి పాలు లేవు.. అమ్మ మురిపాలు లేవు.. ఆమె నిస్సహాయురాలు.. విషాదమయం ఆమె జీవితం. ఆమె ఒంటిమీద ఉన్న చీరకి చిరుగులు, చెంప మీద కనిపిస్తున్న గాయాలు, గుండెల మీద మచ్చలు, పిల్లవాడి శుష్కించిన దేహం..ఇవన్నీ ఆమె జీవితంలోని విషాదాన్ని తెలియచేసే విధంగా రంగులు వాడాను. ముఖ్యంగా భావ సాంద్రత అభివ్యక్తీకరించడంలో ముదురు రంగులు ఉపయోగించడం టెక్నిక్. ఉపయోగించే రంగుల ద్వారా కళాకారుడి హృదయంలో చెలరేగే అనేక రకాల భావాలను express చేయచ్చు . అదే expressionism. ఎరుపు నారింజ, నీలం, నలుపు, డార్క్ బ్రౌన్ కలర్స్ వాడడానికి కారణం ఆమె జీవితంలో పొంచుకువస్తున్న ప్రమాదం, ఆమె గుండెల్లో ఉన్న విషాదం సూచనగా చెప్పడం. పసుపు, ఆకుపచ్చ, గులాబీ వంటి ఆహ్లాదకరమైన, శుభ సంకేతం ఇచ్చే రంగులు. ఒక్కోసారి ఆకృతులను కొంచెం వక్రీకరించడంలో అనేక రకాల రంగులను గజి,బిజిగా వాడతాము. ఇదంతా వీక్షకుల దృష్టిని వస్తువు వైపు నుంచి విషయం వైపుకి మరల్చడానికి చేసే ఒక ప్రయత్నం. దురదృష్ట వశాత్తూ ఇలాంటి పెయింటింగ్స్ ని చాలా మంది కేవలం మోడరన్ ఆర్ట్ అనుకుంటారు. కానీ మోడరన్ ఆర్ట్ లో expressionism అనే ప్రక్రియ ఉందని చాలా మందికి తెలియదు. ఇరవై శతాబ్దంలో వచ్చిన మార్పులు ఇవన్నీ. “

మహాతేజ చెప్పింది విన్న ఆకిమ్ గట్టిగా చప్పట్లు కొట్టాడు. అతన్ని అనుసరిస్తూ ఆహ్లాద, ఆమెతో పాటు అక్కడ నిలబడి ఉన్న వారు అందరూ కూడా గట్టిగా చప్పట్లు కొట్టారు. ఆర్గనైజర్ అన్నాడు నవ్వుతూ… “ ఇంత అద్భుతమైన వాస్తవ జీవన చిత్రం కాబట్టి దీనికి బహుమతి వచ్చింది. మహాతేజా! వియ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యు.”

ఆకిమ్ కుడి చేయి చాచి తేజకి షేక్ హ్యాండ్ ఇస్తూ…” ఫెంటాస్టిక్ మిస్టర్ తేజ ఐ లవ్ ఇట్ “ అన్నాడు.

అప్పటివరకు కొంచెం దూరంలో నిలబడి తన మొబైలు లో అతను చెప్పినది అంతా రికార్డు చేసిన మేఘ మెరుపులా అక్కడి నుంచి మాయమై రెండో అంతస్తులో ఉన్న యూనిట్ బృందం వైపు పరిగెత్తింది విజయగర్వంతో.

తేజ వెళ్లిపోతాడన్న టెన్షన్ తో గబ,గబా అక్కడున్న అమ్మాయిలూ, అబ్బాయిలు తేజని అభినందనలతో ముంచెత్తుతూ అతనితో సెల్ఫీ తీసుకోడానికి పోటీ పడసాగారు. కొన్ని నిమిషాల్లోనే అక్కడంతా ఒకరకమైన హడావుడి మొదలవడంతో ఆహ్లాద కొంచెం ఎడంగా జరిగి గోడవార నిలబడి అతనిని ఒంటరిగా కలుసుకోవడం కోసం ఎదురుచూడసాగింది. ఒక్కొక్కరే సెలవు తీసుకుని వెళ్ళిపోయే వరకు ఆకిమ్ కొంచెం ఎడంగా నిలబడి తేజతో ఏదో అన్నాడు… తేజ ఒక్క క్షణం సాలోచనగా చూసి ఏదో సమాధానం చెప్పాడు. ఆకిమ్ కి తన విజిటింగ్ కార్డ్ ఇచ్చాడు.

తరవాత అతను కూడా సెల్ఫీ తీసుకుని జేబులోంచి ఆటోగ్రాఫ్ కోసం చిన్న నోట్ బుక్ లాంటిది తీసి తేజకి ఇచ్చాడు. ఆహ్లాద కొంచెం వాళ్ళ వైపు నడిచి కుతూహలంగా తొంగి చూసింది. ఇంగ్లీష్ లో కొంచెం పెద్ద అక్షరాలతో రాసాడు "ప్రవర్తన అనేది చెట్టు అయితే, గుర్తింపు దాని నీడ నిన్ను ఎవరన్నా గుర్తించాలంటే నువ్వు ఓ మహావృక్షం లా ఎదుగు అప్పుడే మరికొందరికి నీడనివ్వగలవు." సంతకం చేసి ఇచ్చాడు. ఆకిమ్ థాంక్స్ చెప్పి మరోసారి తేజకి షేక్ హ్యాండ్ ఇచ్చి వెళ్ళిపోయాడు.. గులాబీరంగులో సన్నగా ఆరడుగుల ఎత్తు ఉన్న ఆ యువకుడు వేగంగా నడిచి వెళ్తోంటే ఖజురహో శిల్పాలలో ఒక శిల్పం చైతన్యం వచ్చి నడిచి వెళ్తున్నట్టు అనిపించింది. కాసేపు అతను వెళ్ళిన వైపు రెప్ప వాల్చకుండా చూసిన ఆహ్లాద అతను కారు ఎక్కగానే తిరిగి చూపులు తేజ వైపు తిప్పింది.

మరో కుర్రాడితో సెల్ఫీ తీసుకుని " బై సి యు" అంటూ వేగంగా ఎగ్జిట్ వైపు అడుగులు వేసాడు. అప్పటివరకూ బొమ్మలా నిలబడిపోయిన ఆహ్లాద అలర్ట్ అయి, గబా,గబా అతని వెనకాల నడుస్తూ వెళ్లి అతన్ని కలుసుకుంది.

"సర్ ఒన్ మినిట్" అంది. అతను ఆగిపోయాడు.

"నా పేరు ఆహ్లాద... ఎం. బి. బి. యస్ సెకండ్ ఇయర్ చదువుతున్నాను. మీతో కొంచెం మాట్లాడాలి..." ధైర్యం తెచ్చుకుని అంది.

అప్పటివరకు ఉత్సాహంగా ప్రశ్నలు అడుగుతూ పెయింటింగ్ గురించి తెలుసుకున్న ఆ అమ్మాయి సమీపంగా రావడంతో అతని అటెన్షన్ ఆమె మీద పడి, ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఓ పెద్ద కెరటం ఉవ్వెత్తున లేచి విరిగిపడినట్టు అనిపించింది. ఆమె వైపు విస్మయంగా చూస్తూ " నువ్వు.. నువ్వు.. " గబుక్కున తల విదిలించి "మిమ్మల్ని ఎక్కడో చూశాను.." అన్నాడు.

ఆహ్లాద గుండె వేగంగా కొట్టుకోసాగింది.. తనని తాను కంట్రోల్ చేసుకుంటూ అంది " ఇప్పటివరకూ ఇక్కడే మీ పక్కనే ఉన్నాను మీరు చెప్పింది విన్నాను. "

అతను ఆమె మాటలు వినిపించనట్టు తీక్షణంగా ఆమె వైపే చూస్తూ రెండు క్షణాల తరవాత అన్నాడు " ఏం మాట్లాడాలి?".

"సర్ ప్లీజ్! ఇక్కడ కాదు.. మీతో చాలా మాట్లాడాలి చెప్పండి ఎక్కడ కలుసుకోమంటారు.."

"ఇప్పుడు నాకు పని ఉంది వెళ్ళాలి.. తరవాత ఎప్పుడన్నా" అని ముందుకు నడవబోతూ ఆగిపోయి అస్పష్టంగా అన్నాడు " ఎక్కడో చూసాను..."

ఆహ్లాద గుండె వేగం హెచ్చింది। చెప్పేయనా! నో.. నో  ఇది సమయం కాదు– స్థలమూ కాదు.. అందుకే మాట్లాడకుండా కళ్ళు వాల్చుకుని నిలబడిపోయింది.

అతను ఆమె వైపు అలా సాలోచనగా చూస్తూ ఉండిపోయాడు. లూజుగా వదిలేసిన జుట్టు..ఆధునికంగా, అతి నాజూగ్గా, దంతం బొమ్మలా ఉన్న  ఈ అమ్మాయిని ఎక్కడో చూసాను. ఎస్! బాగా తెలిసిన అమ్మాయి।  అతని అంతరంగం గమనించినట్టు నెమ్మదిగా అంది ఆహ్లాద.

"మీ విజిటింగ్ కార్డు ఇస్తారా! నేను ఫోన్ చేస్తాను. మీరు ఫ్రీగా ఉన్నప్పుడు ఒకసారి కలుస్తాను...ఇన్ ఫాక్ట్ వెంటనే మాట్లాడాలని ఉంది కానీ మీరు బిజీగా ఉన్నారు కదా!"

అతను రెండు క్షణాలు తటపటాయించి. విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

"థాంక్ యు. మీకు రేపు కాల్ చేస్తాను, ఎన్ని గంటలకి చేయచ్చు?"

అతను సమాధానం చెప్పకుండా  ఆమె వైపు అదోలా చూస్తూ, గొణుగుతున్నట్టు గా అన్నాడు "నిన్నెక్కడో చూసినట్టుంది.. చాలా ఫెమిలియర్ ఫేస్."

"మనిషిని పోలిన మనిషి ఉంటారు కదా సర్.." అంది తడారుతున్న గొంతు సవరించుకుంటూ.

" అవును " అన్నట్టు తల పంకించాడు..

"థాంక్ యు! మిమ్మల్ని కలుసుకోబోయే సమయం కోసం ఎదురుచూస్తాను వస్తాను" రెండు చేతులూ జోడించింది.

ఆహ్లాద అతని దగ్గర సెలవు తీసుకుని పార్కింగ్ లాట్ వైపు వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన వైపు స్థాణువులా నిలబడి చూస్తూ ఉన్న తేజ తనకి దగ్గరగా కారు ఆగడంతో ఉలిక్కిపడి కారులో కూర్చున్నాడు.

స్టూడియోకి రాగానే  కుర్చీలో కూర్చుని మొబైలు లో రికార్డు చేసిన తేజ ఉపన్యాసం వినడానికి వాయిస్ రికార్డర్ ఆన్ చేసింది మేఘ.. తేజ స్వరం స్పష్టంగా ఉన్నా జనాల గుస,గుసలు, ఆకిమ్, ఆహ్లాదల ప్రశ్నలు కలగాపులగంగా వినిపిస్తూ స్పష్టత లేకపోడంతో ఒక్కసారిగా నిరాశ ఆవరించింది ఆమెని. వర్మ చేత శభాష్ అనిపించుకునే అవకాశం అలా మిస్ అవడంతో తన మీద తనకే కోపం వచ్చింది.  మొబైలు పక్కనే ఉన్న చిన్న స్టూల్ మీద పెట్టి కుర్చీలో వెనక్కి వాలింది. బాయ్ టి తెచ్చి ఇచ్చాడు. నిరాసక్తంగా అందుకుని నెమ్మదిగా సిప్ చేయసాగింది. అసలు ఈయనకి ఇంటర్వ్యూ

ఇవ్వడానికి అభ్యంతరం ఏంటో! కోపంగా అనుకుంది. ఆమెకి వర్మ మాటలు మర్చిపోవాలన్నా మర్చిపోనివ్వకుండా పదే , పదే గుర్తొస్తూ పంతం పెరుగుతోంది. నిజంగా వర్మ అన్నట్టు తనకి ఏమి తెలియదా! ఎలాగో అనిపించింది.

న్యూస్ చదవడానికి సిద్ధంగా ఉన్న అదితి పరధ్యానంగా టి తాగుతున్న మేఘ వైపు చూసి కళ్ళెగరేస్తూ అడిగింది " ఏమైంది డల్ గా ఉన్నావు. "

మేఘ పెదవి విరిచింది." నథింగ్ " పల్చగా నవ్వి టీ కప్పు పక్కనే ఉన్న స్టూల్ మీద పెట్టింది.

"ఏమైంది? ఆర్ట్ గ్యాలరీ కి వెళ్ళావుగా ! ఎంతమందిని ఇంటర్వ్యూ చేశావు? "

మేఘ ఆమె ప్రశ్నకి సమాధానం చెప్పకుండా ఆమె వైపు తిరిగి అంది.. "అదితీ! యాంకర్స్ అందరూ బాగా చదువుకున్న వాళ్ళే అంటావా!"

అదితి వింతగా చూసింది. "ఇదేం ప్రశ్న?"

"చెప్పు– మీ న్యూస్ రీడర్స్ కి చాలా నాలెడ్జ్ ఉంటుంది కదా! రాజకీయాలు, జనరల్ నాలెడ్జ్, సినిమా, సాహిత్యం, సంగీతం, ఆర్ట్.."

" అంత సీన్ లేదు. ఇచ్చిన న్యూస్ చదివి రావడమే. ఆ తరవాత నాకు ఏం చదివానో గుర్తు కూడా ఉండదు unless it is interesting like crime story, sensational news or something like that.." నిర్లక్ష్యంగా చెప్పింది అదితి.

ఆమె చెప్పినంత నిర్లక్ష్యంగా తీసుకోలేకపోయింది మేఘ. వర్మ అన్న మాటలే ఆమె మదిలో మెదులుతూ తన మీద తనకి ఒక అపనమ్మకాన్ని కలగజేయసాగాయి. అప్పటివరకు ఉన్న ఉత్సాహం, చైతన్యం ఎవరో లాగేసినట్టు నీరసంగా, నిస్తేజంగా అనిపించింది. ఒక్కసారి తన మీద తనకు అపనమ్మకం ఏర్పడ్డాక ఆ అపనమ్మకం తనని తాను సరిదిద్దుకుని తనలోని ప్రతిభను మరింతగా మెరుగుపరచుకోడానికి ఉపయోగపడచ్చు.. ఒక్కోసారి నిస్పృహ, నిరాశ ఆవరించి నిర్వీర్యం చెయ్యచ్చు. మహాతేజని ఇంటర్వ్యూ కి ఒప్పించలేకపోయినందుకు నిరాశగా అనిపించినా, అదితి మాటలు విన్నాక ఒకలాంటి సెల్ఫ్ మోటివేషన్ లాంటిది కలిగింది. మొబైలు ఓపెన్ చేసి, గూగుల్ సర్చ్ మొదలుపెట్టింది. ఆర్ట్ అంటే ఏమిటి?

The Art is a diverse range or product of human activity that involves creative or imaginative talent expressive of technical proficiency, beauty, emotional power or conceptual ideas. There is no generally agreed definition of what cinstitutes art, and ideas have changed over time...art also called (to distinguish it from other art forms) visual art, a consciously created through an expression of skill or imaginative encompasses diverse media such as painting, sculpture, printmedia, arts, photography and ....

“మేడమ్ ! షూటింగ్ స్టార్ట్ అయింది.” ప్రొడక్షన్ బాయ్ వచ్చి పిలవడంతో ట్రాన్స్ లో నుంచి బయట పడినట్టు చూసింది. సముద్రం లోతు తెలుసుకోవచ్చేమో! కానీ కళ అనే మహాసముద్రం లోతు ఎవరన్నా తెలుసుకోగలరా ! మనసులో అనుకుంటూ మొబైలు ఆఫ్ చేసి లేచింది.

తన ఇంట్లో డ్రాయింగ్ రూమ్ కి ఆనుకుని ఉన్న సిట్ అవుట్ లో కేన్ కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూ న్యూస్ పేపర్ చేతిలోకి తీసుకున్నాడు తేజ.

భారతీయ చిత్రకళ పట్ల విదేశీయుడి ఆసక్తి అన్న హెడ్డింగ్. తేజ ఆసక్తిగా మాటర్ చదవసాగాడు. గత రెండు రోజులుగా మాదాపూర్ లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళాకారుల చిత్రాలు ప్రదర్శన జరుగుతున్నది. ఈ ప్రదర్శనకు అనూహ్యమైన స్పందన వచ్చింది. ఎందరో చిత్రకళ మీద ఆసక్తి అభిమానం ఉన్న వారు ఈ ప్రదర్శను తిలకించి ముగ్దులయారు. ముఖ్యంగా రష్యా నుంచి వచ్చిన ఆకిమ్ అనే యువకుడు ఇండియన్ ఆర్ట్ పట్ల చూపించిన ఆసక్తి, కుతూహలం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. అతను ప్రత్యేకంగా కొన్ని చిత్రాల్లో కనిపించే భావాలకు అర్థాలు అడిగి వివరంగా తెలుసుకోడానికి కనబరచిన ఉత్సాహం చూసి ప్రదర్శనకి వచ్చిన వారితో పాటు ఆర్టిస్ట్ లు కూడా ముచ్చటపడ్డారు. ముఖ్యంగా హైదరాబాద్ కి చెందిన సుప్రసిద్ధ చిత్రకారుడు, జాతీయస్థాయిలో అనేక బహుమతులు పొందిన మహాతేజ ఆ ప్రదర్శనకి రావడం యాదృచ్చికంగా జరిగినా అదే సమయానికి ఆకిమ్ ఆయన వేసిన చిత్రం గురించి తెలుసుకోడానికి ఉత్సుకత చూపడం ఆయనని ముగ్దుడిని చేసింది. ఏ కళాకారుడికైనా ఇంతకు మించి ఏం కావాలి? అని ఆయన ఎంతో ఓపిగ్గా, శ్రద్ధగా తన చిత్రాల గురించి ఆకిమ్ కి వివరించడం జరిగింది. ఈ సందర్భంలోనే అనేక ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా ఆయన ఇంటర్వ్యూ కోసం ప్రయత్నించి విఫలం కావడం గమనార్హం.

మహాతేజకి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు. ఆకిమ్ కి తన చిత్రం గురించి వివరించడం ఒక ఎత్తు అయితే, మిగతా మీడియాని తను నిర్లక్ష్యం చేసాడన్న అపప్రథ రావడం మరో ఎత్తు. ఇలా ఇంతకు ముందు కూడా అనేక సార్లు జరిగింది.

నిట్టూర్చాడు తేజ. తనకంటూ కొన్ని ప్రిన్సిపల్స్ ఉండడం తప్పా! ఈ పబ్లిసిటీ లు, ప్రచారాలు తనకేమాత్రం ఇష్టం లేదు. ఏనాడూ తను కీర్తి శిఖరాలు అధిరోహించాలని కలగనలేదు. తనకి కావాల్సింది జీవించడం– అందుకు కావాల్సింది ప్రాణ వాయువు. ఆ ప్రాణ వాయువు తను చిత్రించే బొమ్మల్లో ఉంది. ప్రతి బొమ్మలో తన పంచ ప్రాణాలు నిక్షిప్తం చేసి జీవితకాలం యజ్ఞం చేస్తున్నాడు. ఆ యజ్ఞం నుంచి ఉద్భవించినవే కీర్తి, డబ్బు. నిజానికి ఇవన్నీ ఆశించి తను చిత్రకారుడు కాలేదు. చిత్రకారుడుగా తయారు కాలేదు.. కాదు చిత్రకారుడుగా జన్మించాడు. భూమ్మీద పడేసిన ప్రతి మనిషికీ జీవనాధారం చూపించిన ఆ భగవంతుడే తనకి ఈ ఆర్ట్ అనే కళ జీవనాధారంగా ఇచ్చాడు.

మీరు ఆర్టిస్ట్ అవడానికి స్ఫూర్తి ఏమిటి అనే ప్రశ్న అనేక ఇంటర్వ్యూ లలో అడుగుతూనే ఉంటారు.. ఎన్ని ప్రశ్నలకైనా జవాబు చెప్పగలడు కానీ, ఈ ప్రశ్నకి జవాబు తన దగ్గర లేదు. డబ్బుకోసం అని అబద్ధం చెప్పలేదు.. కళ కోసం అని తనని తాను వంచించుకోలేడు.. కీర్తి, డబ్బు ఆశించకుండానే వచ్చిపడ్డాయి. మరి ఇంకా ఎందుకు ఈ వృత్తిని వదలడం లేదు? ఎవరో గట్టిగా అడిగినట్టు అనిపించింది. ఎలా వదులుతాడు! కాలో, చేయో వదిలేయగలడు కానీ ఆత్మని వదిలేయ గలడా! నిట్టూర్చాడు తేజ. పత్రికలు, ఛానెల్స్ ఎన్నో తనని ఇప్పటివరకు వందల సార్లు ఇంటర్వ్యూ చేశాయి.. కొందరిని తిరస్కరించాడు.. కొందరిని మాత్రం అంగీకరించాడు. ఎప్పుడు చెప్పినా ఒకటే! చెప్పిందే చెప్పి విసుగు వస్తోంది. వాళ్ళకి అడిగినవే అడిగి విసుగు రావడంలేదా ! ఏదన్నా కొత్తగా సాధించాడా! బహుమతులు, పురస్కారాలు. ఇవి విజయాలా ! ఇంకా ఏదో సాధించాలి అది ఏమిటి? ఎక్కడ దాని గమ్యం ?

అడుగడుగునా పడిపోతూ, లేస్తూ, పరుగులు పెడుతూ, గాయాలకు కాలం అనే మందు రాసుకుంటూ, మర్చిపోలేని జ్ఞాపకాలు మచ్చలుగా మిగిలిపోతుంటే తడిమి, తడిమి వాటిని చూస్తూ గుండెల మీద బరువుతో బతుకీడుస్తున్న తనకి గొప్పగా సాధించిన విజయాలు ఏమున్నాయి. ఒక ఉపాధ్యాయుడు మంచి విద్యార్థులను తయారుచేస్తాడు.. ఒక డాక్టర్ ప్రాణాలు పోస్తాడు.. ఒక ఇంజినీర్ భవనాలు నిర్మిస్తాడు. ఎవరి వృత్తి వాళ్ళు చేస్తున్నారు. ఆ వృత్తి ద్వారా వాళ్ళు జీవిస్తున్నారు. తనూ అంతే! ఇది ఒక వృత్తి. అంతకన్నా తను గొప్ప పని చేస్తున్నానని అతను భావించడు .

నిజానికి అతనికి మీడియా అంటే భయం. వాళ్లకి సంచలనాలు సృష్టించడం ఇష్టం.. తనకి ముక్కుకు సూటిగా మాట్లాడడం ఇష్టం. మాట్లాడే మాటల్లో సంచలనం క్రియేట్ చేసే అర్ధాలు వెతుకుతారు. తను ఒకటి చెబితే పది రాస్తారు. చాలా మామూలుగా మాట్లాడిన మాటలకి రంగులు పూసి ప్రచారం చేస్తారు. అనవసరంగా కాంట్రవర్సీ క్రియేట్ చేస్తారు. ఆ కాంట్రావర్సీ తనకి భయం..

పేపర్ పక్కన పడేశాడు. అరచేతి మందాన విరగబూసిన పసుపు పచ్చగులాబీలను చూస్తూ కాఫీ కప్పు ఎడం చేతిలోకి మార్చుకుని కుడిచేయి చాచి ఒక పూవుని మృదువుగా స్రృశించాడు.. నెమ్మదిగా చెంపకి ఆన్చుకుని పరవశంగా కళ్ళు మూసుకున్నాడు. “ నువ్వు కాలితో తన్ని తరిమేసినా, నీ జ్ఞాపకాలు జీవితమంతా నాతోనే ఉంటున్నాయి. ఈ పచ్చని గులాబీ రోజూ నా చెంప స్పృశించినప్పుడల్లా నీ చేతి స్పర్శనే గుర్తు వస్తూ ఉంటుంది. గాయం కూడా ఇంత తీయగా ఉంటుందని నీ వల్లనే తెలిసింది.. చిత్రం.. గాయాలు మానతాయి కానీ నా ఈ చెంపకీ తగిలిన గాయం గుండెల్లోకి పాకి అక్కడే స్థిర పడింది మచ్చలా కాదు మధుర స్వప్నంలా ” తడి కళ్ళకి స్టూల్ మీద ఉన్న మొబైల్ మీద వెలుగు, వెంటనే రింగ్ వినిపించింది.

unknown నెంబర్– తీయాలా, వద్దా అన్నట్టు క్షణం ఆలోచించి, మొబైల్ చేతిలోకి తీసుకుని ఆన్సర్ బటన్ నొక్కాడు.

“సర్ గుడ్ మార్నింగ్! అయాం మేఘ “ఎస్” ఛానెల్ నుంచి. మీరు ఇంటర్వ్యూ ఇస్తానన్నారు ఎప్పుడు ఇస్తారు సర్? ఈ రోజు వీలు అవుతుందా!”

నవ్వొచ్చింది. ఇప్పుడే ఈ అమ్మాయి గురించి ఆలోచించడానికి పది నిమిషాలు వృధా చేసాడు.. గంట పైన ఇంటర్వ్యూ కావాలి అంటోంది. అంటే స్టూడియో లో కనీసం రెండు గంటలు, ట్రావెలింగ్ కి గంట.. సుమారు మూడు గంటల సేపు విలువైన సమయం తన గురించి తను చెప్పుకోడానికి వినియోగించాలి. విజయానికన్నా దానికోసం చేసే ప్రయత్నం గొప్పది. ఆ మూడు గంటల్లో కొత్త ఆలోచనకి రూపకల్పన చేయచ్చు.. మరో ఆకృతికి తన కుంచెతో జీవం పోయచ్చు. తనకి పనిలో దేవుడు కనిపిస్తాడు. ప్రతి చిత్రం ఓ యజ్ఞం నుంచి ఉద్భవించే రూపం. నిజానికి తను చేసే పనిలో దేవుడుని చూడగలిగితే ప్రచారాలతో ఏం పని!

“సర్! ప్లీజ్ ఎప్పుడు రమ్మంటారు? “ మళ్ళీ అడిగింది మేఘ.

" నేను బిజీగా ఉన్నానమ్మా! టైం కావాలి. అయినా కొత్తగా నా గురించి చెప్పుకోడానికి ఏముంది? మీ అందరికీ తెలిసిందేగా! " ఆలోచనల నుంచి బయటపడి కొంచెం అయిష్టంగానే అన్నాడు.

" సర్! యాక్చువల్ గా ఇంటర్వ్యూ కాదు. మీకు నేషనల్ అవార్డు వచ్చింది కదా! ఆ సందర్భంగా మీతో డాక్యుమెంటరీ చేయాలనుకుంటున్నాము."

డాక్యుమెంటరీ! అతని పెదవుల మీద చిరునవ్వు మెరిసింది. ఇప్పటివరకూ ఎన్నో ఇంటర్వ్యూలు చేసారు. మీ తల్లి, తండ్రి ఎవరు? చిత్రకళలో మీ ఆది గురువు ఎవరు? మీకు స్ఫూర్తినిచ్చిన కళాకారుడు ఎవరు? ఇప్పటివరకు ఎన్ని చిత్రాలు వేసారు.. ఎన్ని బహుమతులు వచ్చాయి? ఇవే ప్రశ్నలు. జవాబులు చెప్పినవే చెప్పి విసుగు వచ్చేసింది. ఒక పబ్లిక్ ఫిగర్ గా కొన్ని మర్యాదలను పాటించాలి కాబట్టి తన అసహనం బయటపడనీకుండా వ్యక్తిగత విషయాలు తప్ప ఏదైనా అడగమని ముందే చెప్పి వాళ్ళు అడిగిన అన్ని ప్రశ్నలకు సహనంగా సమాధానం చెప్పాడు. ఇప్పుడు డాక్యుమెంటరీ అంటే కచ్చితంగా తన వ్యక్తిగత నేపథ్యం చెప్పాలి. ఒప్పుకోవడమా! మానడమా! ఒక ఛానెల్ యాంకర్ గా తనని ఫాలో అప్ చేయడం ఆమె బాధ్యత. ఇప్పుడు కాదు అన్నా తప్పకుండా రోజూ ఫోన్ చేస్తుంది..

" సర్ ప్లీజ్.." మేఘ మాట పూర్తికాకుండానే అన్నాడు.. " నాకు రెండు రోజులు టైం ఇవ్వండి. మీ ఫోన్ నెంబర్ ఇదే కదా నేనే కాల్ చేస్తాను ".

" ఓ! థాంక్ యు వెరీ మచ్. లుకింగ్ ఫార్వర్డ్ ఫర్ యువర్ కాల్ సర్.. " ఆమె స్వరంలో పరవళ్ళు తొక్కుతున్న సంతోషం. ఫోన్ డిస్కనెక్ట్ చేస్తూ మొహమాటం గా అంది." సర్ ! నేను నాలుగు రోజుల నుంచి ఆర్ట్ గురించి ఆర్టికల్స్ చదువుతున్నాను. మంచి ప్రశ్నలు వేస్తాను.. మీకు బోర్ కొట్టదు ప్లీజ్ ట్రస్ట్ మి."

ఆశ్చర్యంగా అనిపించింది. ఎందుకు అలా అంటోంది? తానేమీ బోర్ అనలేదే! టైమ్ లేదు అన్నాడు.. ఎందుకు ప్రత్యేకంగా ఆ మాట చెబుతోంది ! జాలేసింది తేజకీ. కుర్చీలో వెనక్కి వాలాడు. నగరంలోనే కాదు, దేశంలోనే తనొక ప్రముఖ వ్యక్తి. తనతో మాట్లాడడానికి, తనని కలుసుకోడానికి ఆసక్తి చూపించేవాళ్ళు చాలా మంది ఉన్నారు. తన ప్రొఫెషనల్ వివరాల కన్నా వ్యక్తిగత జీవితం గురించి తెలుసుకోవాలని కుతూహలం ఉండడం సహజం. ఒక సినిమా నటుడు, ఒక గాయకుడు, రచయితా, రాజకీయ నాయకుడు లాంటి సెలబ్రిటీల జీవితం పట్ల ప్రజలకు ఆసక్తి ఉంటుంది. అది తప్పు అనలేరు ఎవరూ. సహజం కూడా. ప్రజలకి వ్యక్తులే కాదు, వారి వ్యక్తిగత జీవితం తెలుసుకోవాలన్న కుతూహలం ఉండబట్టే ప్రముఖుల జీవితాలు బయో పిక్ అంటూ సినిమాలుగా తీస్తున్నారు. కొంపతీసి తన జీవితం కూడా..

దీర్ఘంగా నిశ్వసించాడు. చీకటి తెరల మాటున మూసి ఉంచిన గతాన్ని వెలుగులోకి తీసుకురావడం ఏ మాత్రం ఇష్టం లేదు. ఇప్పటివరకు మహాతేజ అనబడే తను కేవలం ప్రముఖ చిత్రకారుడుగా మాత్రమే పరిచయం. జీవితంలో తను దాటిన, ఎడారులు, కీకారణ్యాలు, మహా సముద్రాలు, వైతరణి నదులు ఎన్నని చెప్పాలి? ఈ తేజ జీవితం వడ్డించిన విస్తరికాదు. ఈ ఆడి కారు, ఈ బంగాళా, ఈ హోదా, పేరు, ప్రతిష్టలు వీటివెనక తను చేసిన పోరాటం, సంఘర్షణ, అంతులేని కృషి, ఎదుర్కొన్న సవాళ్లు, సెలఏరులై ప్రవహించిన కన్నీళ్లు, ఆకలి బాధలు ఇవన్నీ చెప్పాల్సిన అవసరం ఉందా! తెలుసుకున్న ప్రజలు తన పట్ల కుండలకోద్ది సానుభూతి చూపిస్తారేమో! ఇప్పుడు ఆ సానుభూతి తనకి అవసరమా!

“”సానుభూతి అని ఎందుకనుకుంటున్నావు తేజా! నువ్వు ప్రజల మనిషివి. ఇంతకాలం నుంచి నీ ఆనందాలు, నీ విజయాలు, నీ ఉన్నతి వీటిలో ఆ ప్రజలేగా భాగం పంచుకున్నారు. నీ చిత్రాలు చూసి, అభిమానించి, ఆదరించే ప్రజలే లేకపోతే నువ్వెక్కడ ఉండేవాడివి!” గంభీరమైన స్వరం...

తేజ ఉలిక్కిపడ్డాడు. గాలికి కదులుతున్న తెరల వెనక నుంచి ఓ నీడ తన మీద పడుతున్నట్టు అనిపించింది. సూర్య.. చిరునవ్వుతో తననే చూస్తున్నాడు. మాగాడు మహాతేజ గా మారడానికి కారకుడైన సూర్య.

## 3

తేజ కూర్చున్న చోటి నుంచి గబుక్కున లేచి కిటికీ దగ్గరకు పరుగులాంటి నడకతో వెళ్ళి పరదాలు తొలగించాడు. కిటికీ అద్దాల వెనుక విశాలమైన ఆకాశం కెరటాలతో త్రుళ్ళి పడుతున్న సముద్రంలా ఉంది. సూర్యుడు పశ్చిమం వైపు నింపాదిగా బయలుదేరాడు. లేత పసుపురంగు, నారింజరంగు కిరణాలు, మెత్తటి కుంచెతో ఆకాశం గడపకి పెయింట్ వేస్తున్నట్టు ఉన్నాయి. అలలు, అలలుగా వీస్తోంది గాలి.

అతని చూపులు ఏదో అన్వేషిస్తున్నట్టు రోడ్డు మీదకి జారాయి.

డివైడర్కి రెండు వైపులా ఉన్న పొడుగాటి రోడ్డు మీద ఒకదాన్నొకటి ఓవర్ టేక్ చేస్తూ సాగిపోతున్నాయి వాహనాలు. మధ్యలో డివైడర్ మీద అందంగా పెరిగిన రంగు,రంగు పూల చెట్లు పాదచారులకి వింజామరలు వీస్తున్నట్టు గాలికి అటూ, ఇటూ ఊగుతున్నాయి.

ఆ సౌందర్యాన్ని ఆస్వాదించే స్థితిలో లేదు తేజ మనసు. సూర్య జ్ఞాపకాలు అనే అలలు అతని మనసంతా నిండి అలజడిగా మారింది మనసు. అతని చేతిలో ఉన్న పరదా నెమ్మదిగా జారిపోయింది. నిస్తేజంగా గోడకి ఆనుకుని గుండెలలోంచి తన్నుకువస్తున్న బాధతో " సూర్యా ! " అని గొణిగాడు.

" నువ్వింకా మారలేదా తేజా? ఇంకా అదే చట్రంలో బతుకుతున్నావా ?" సూర్య స్వరం చెవిలో వినిపించింది.

తేజ ఉలిక్కిపడ్డాడు. " సూర్యా " గట్టిగా పిలిచాను అనుకున్నాడు. కానీ శబ్దం గొంతు పెగిలి బయటకు రాలేదు. " ఎక్కడ ఉన్నావు సూర్యా ?" గొణుక్కున్నాడు.

సూర్య నవ్వు తెరలు, తెరలుగా నేల రాలుతున్న పున్నాగ పూలు విరజిమ్ముతున్న పరిమళంలా మెల్ల, మెల్లగా సోకింది. తేజ చూపులు గోడలని చీల్చుకుని సూర్యని అన్వేషిస్తున్నట్టు కదిలాయి.

"అలా చూస్తున్నావేం తేజా? ఆరోజు నీకేం చెప్పాను? నిన్ను లోకం గుర్తించాలి అంటే నువ్వు ఆలోకానికి దగ్గరగా వెళ్ళాలి అని చెప్పాను కదా! లోకం అంటే నీకు తెలియనిది కాదు..నిన్ను అభిమానించే ప్రజలు. వాళ్ళ మధ్యే నువ్వు ఉండాలి..వాళ్ళతో కలిసి నువ్వు నడవాలి.. నువ్వు ప్రజల దగ్గరకు వెళ్ళడానికి ఈ ఆధునిక కాలం నీకెన్నో సులువైన మార్గాలను తెరిచింది.. దాన్నే సోషల్ మీడియా అంటారు. నీలో ఉన్న ప్రతిభ కేవలం ప్రదర్శన కోసమే కాదు. నీకు అన్నం పెట్టిన ప్రతిభ, నీకీ సౌకర్యాలు సమకూర్చిన ప్రతిభ లాకర్ లో పెట్టి దాచుకునేది అసలే కాదు. ఇంకా ఎంతకాలం ఇలా ముడుచుకుని బతుకుతావు! ఎదగాలి.. నువ్వు ఇంకా, ఇంకా ఎదగాలి. అంతర్జాతీయ స్థాయిలో నీకు గుర్తింపు రావాలంటే నువ్వు నీ చుట్టూ గీసుకున్న గిరి దాటాలి. తేజా! ఇది పోటీ ప్రపంచం. నిత్యం జరిగే పరుగుపందాల్లో జయం మనదే కావాలి అనుకుంటూ పాల్గొనే అనేకమంది ఆటగాళ్ల యుక్తులు ఏమిటో తెలుసా? ఆ పరుగు పందెం వీక్షిస్తున్న ప్రతి ప్రేక్షకుడి దృష్టి తన మీద పడేలా చేసుకునే చాతుర్యం. దాన్నే సెల్ఫ్ పబ్లిసిటీ అంటారు. ఈ సెల్ఫ్ పబ్లిసిటీ ప్రవాహంలో నువ్వు ప్రవాహపు ఒరవడి చూసి బెదిరిపోయో, ఒదిగి పోయో వెనక్కి మరలడం కానీ, నిలుచున్న చోటే ఆగిపోవడం కానీ చేయకు. ప్రవాహానికి ఎదురీదు, నీ పోటీ దారులను దాటి ముందుకు, మరింత ముందుకు వెళ్ళు. కమాన్ మూవ్."

శంఖం నుంచి వచ్చే సముద్రపు హోరులా అదో రకమైన నాదం హృదయాన్ని తాకుతొంటే మంత్రించినట్టు నిలబడిపోయాడు తేజ.

సూర్య మాటలు ఎప్పుడూ తేజకీ ఒక నాదంలాగే వినిపిస్తాయి. ఆ నాదంలో వేణువూ ఉంటుంది.. వీణా ఉంటుంది. ఆ మాటలే నేలరాలిన తేజ కళా హృదయాన్ని మమతల పందిరి వేసి నిలబెట్టాయి. ఇప్పుడూ అలాగే వినిపిస్తున్నాయి..

గోడలను, కిటికీ తలుపులను, ద్వారాబంధాన్ని పెళ్లగిస్తూ అలలు అలలుగా అతని స్వరం ప్రతి ధ్వనిస్తూ ఉంది. కంపిస్తున్న పెదాలు కదిపి " సూర్యా!" అన్నాడు.

ఓ చేప పిల్ల నీళ్ళ పైకి ఎగిరి తిరిగి నీటి అడుగుకు వెళ్ళినప్పుడు వినిపించే ఒక ధ్వని వచ్చింది తన వీపుని స్పృశిస్తున్న పల్చటి నైలాన్ తెరల చాటు నుంచి.

" తేజా! నీ వ్యక్తిగత విషయాలు దాచుకుని ఏం చేస్తావు? నీ పుట్టుకకు కానీ, నీ పరిస్థితికి కానీ నువ్వు బాధ్యుడివి కావు. నీ ప్రమేయం లేకుండా జరిగిన సంఘటనలు నువ్వు గర్వంగా చెప్పుకో. ఇందులో సిగ్గు పడడానికి , దాచడానికి ఏమి లేదు. నీ పట్ల నీ అభిమానుల్లో మరింత అభిమానం ఇనుమడిస్తుంది. "

కాదు – కాదు " గట్టిగా అరిచాడు తేజ. " నా మీద సానుభూతి ఏర్పడుతుంది. నన్ను చూడగానే వాళ్ళ కళ్ళల్లో కనిపించే జాలి నేను భరించలేను. "

" నీలోని ఆత్మన్యూనత అలా అనిపిస్తోంది. నీ మీద జాలికన్నా గౌరవం పెరుగుతుంది. పెనుగాలికి కూలిపోయిన వృక్షం ని చూసి జాలి పడరు.. అయ్యో నీడ నిచ్చే ఒక మహా వృక్షాన్ని కాపాడుకోలేకపోయామే అని బాధపడతారు. అది మనిషి స్వభావం. నువ్వు వేసే చిత్రాల్లో నెగటివ్ shades ఉన్నట్టే మనుషుల్లో కూడా కొన్ని నెగటివ్ మరికొన్ని పాజిటివ్ shades ఉంటాయి. నువ్వు పాజిటివ్ తీసుకుంటే నీకు ఈ మనోవ్యధ ఉండదు. నీ ఆనందాలు, నీ ఉన్నతి, నీ విజయాలే కాదు నీ దుఃఖాలు కూడా పంచుకోడానికి నీ అభిమానులు సిద్ధంగా ఉంటారు తేజా! నువ్వు సామాన్యుడివి కావు.. సెలెబ్రిటివి. నువ్వు ఒంటరి వాడివి కావు.. లక్షలమంది నీతో కలిసి నడవడానికి ఎదురుచూస్తూ ఉంటారు. కమాన్ తేజా ! ఛీర్ అప్ "

" నో సూర్యా! నా వల్ల కాదు. ఈ హోదా, ఈ కీర్తి, అనే ఈ ముసుగు తీయలేను. ఈ కుహనా మర్యాదలు, ఈ ఆడంబరాలు, ఈనాగరిక సమాజం నుంచి మళ్ళీ వెనక్కి వెళ్లలేను. నాకు ఆ జీవితం తలచుకోడానికే భయం.. ప్రజలకి చెప్పాలంటే ఇంకా భయం " నిలబడలేనట్టు నిస్సత్తువగా గబుక్కున కుర్చీలో కూర్చున్నాడు.

"తేజా!" వాత్సల్యామృతం కురిపిస్తూ ఒక పిలుపు.. వీపు మీద పూరేకులు రాలినట్టు మృదువైన స్పర్శ. చివ్వున వెనక్కి తిరిగాడు. కుర్చీ మీద వేసిన వెల్వెట్ కవర్ జారి వీపు మీద పడింది. " నువ్వు పిరికివాడివి కావు కదూ!"

"సూర్యా! " బాధగా పిలిచాడు. "నీ అస్తమయం నన్ను పిరికివాడిని చేసింది.. నా జీవితాన్ని నిలబెట్టిన నాలుగు స్తంభాల్లో ఒకటైన నువ్వు నన్ను ఒంటరిగా వదిలి అలా ఎలా అదృశ్యం అయావు? అందని ఆకాశం కోసం ఆరాటపడి

ఎగరలేని ఎత్తుకు ఎగరాలని ప్రయత్నించి రెక్కలు తెగి నేలరాలిన పక్షిని... నీ రెక్కలు నాకు అమర్చి నువ్వెక్కడికి ఎగిరివెళ్లిపోయావు సూర్యా! నువ్వే ఉండి ఉంటే ఈ అనామకుడి జీవితం మరోలా ఉండేది కాదా!? అలసిపోయాను సూర్యా ! వంటరీగా మైళ్లకు, మైళ్ళు నడిచి అలసిపోయాను."

"లేదు నువ్వు ఒంటరీవి కావు.. నా మాట నమ్ము మరో కాంతివంతమైన భవిష్యత్తు నీ కోసం వేచి ఉంది. "

" ఎలా కాదు అనుకోను చెప్పు? నన్ను ఆదరించిన సింహాచలం, నన్ను మనిషిని చేసిన చంద్రకాంత్ గారు, నాలుగు రోడ్ల కూడలిలో నిలబడిన నాకు చేయి అందించి తోడుగా నడిచిన శివ, నాలో అణగారిన ప్రతిభను నీ మాటలతో ప్రోత్సాహంతో ప్రపంచానికి పరిచయం చేసిన నువ్వు, నా చిత్రాలకు ఆలంబన, స్ఫూర్తి అయిన ఆమె.. ఆమె .. నన్ను " తేజ స్వరం వణికింది.

"నిన్న చరిత్ర , రేపు ఉత్కంఠ, నేడు ఒక వరం .. ఇది జీవితం"

"సూర్యా ! సూర్యా !" రెండు చేతుల్లో మొహం దాచుకుని అస్థిమితంగా కదిలాడు. తల పగిలిపోతున్నట్టుగా ఉంది. కణతలు నొక్కుకున్నాడు.

ఫోన్ మోగింది. టీ పాయ్ మీద ఉన్న మొబైలు చూశాడు. ట్రూ కాలర్లో చూపిస్తోంది ' మేఘ కాలింగ్ .' తీయనా, వద్దా మీమాంసతో కొన్ని క్షణాలు ఫోన్ మీద పడుతున్న వెలుగు చూస్తూ ఉండిపోయాడు. "లిఫ్ట్ తేజా! ఆన్సర్ ! కమాన్ " సూర్య స్వరం స్ఫూర్తినిస్తూ నాలుగు గోడల మధ్య నుంచి ధ్వనిస్తోంది. తేజ మనసులో ముసురుకుంటున్న దుఃఖపు మబ్బులు క్రమంగా చెదిరిపోసాగాయి..

వణుకుతున్న కుడిచేయి చాచి ఫోన్ అందుకున్నాడు. ఎన్నో సందేహాలు, మరేదో ఉద్వేగం నిలువెల్లా పాకింది. అవును ప్రజలకి దగ్గరగా వెళ్ళాలి.. ఆత్మీయంగా వెళ్ళాలి. ఇంతకాలం తెరవెనుక దాచిన మాగాడి పాత్ర రంగస్థలం మీదకు వచ్చే తరుణం ఆసన్నమైంది. పాత్రను సన్నద్ధం చేయాలి.

గొంతు పెగల్చుకుని " హ.. హలో " అన్నాడు.

"సర్ ! నేను మేఘ ఎస్ చానెల్ నుంచి.. మా యూనిట్ తో ఒకసారి మీ ఇంటికి వచ్చి మీ పెయింటింగ్స్ అన్నీ వీడియో తీసుకోవాలనుకుంటున్నాము. మీకు ఎప్పుడు convenient గా ఉంటే అప్పుడే వస్తాం. మాకు టైమ్ ఇస్తారా ప్లీజ్."

గట్టిగా శ్వాస తీసుకున్నాడు. " కమాన్ తేజా!" భుజం తడుతూ ప్రోత్సాహిస్తున్న సూర్య.. అప్రయత్నంగా అన్నాడు "రేపు రండి ".

"థాంక్ యు సర్! ఏ టైమ్ కి రమ్మంటారు?" ఆమె స్వరంలో అంతులేని ఆనందం.

"మీ ఇష్టం. నేను ఇంట్లోనే ఉంటాను. ఎప్పుడైనా రావచ్చు."

"Ohh నైస్ సర్! thanks a lot. వచ్చే ముందు కాల్ చేస్తాను " ఫోన్ డిస్ కనెక్ట్ చేసింది మేఘ.

"శభాష్ తేజా ! " సూర్య వీపు నిమిరి అదృశ్యం అయాడు.

తేజకి తన మనసులో ఉన్న బరువంతా సూర్య చిటికెన వ్రేలితో తుడిచినట్టు, తేలిగ్గా అనిపించింది. సూర్య. ఆపద్బాంధవుడు. ఆనాడు పక్కనే కూర్చుని భుజం తట్టి ప్రోత్సహిస్తే, ఇప్పుడు తన మనసులో నైరాశ్యం, వైరాగ్యం ఆవరించిన ప్రతి సారీ ఎక్కడి నుంచో వచ్చి అణువణువూ తట్టి ముందుకు నడిపిస్తూనే ఉన్నాడు.

"ఎక్కడ ఉన్నావు సూర్యా? ఇలా ఎండమావిలా కనిపిస్తూ అదృశ్యం అవకపోతే నాదగ్గరే ఉండచ్చుగా! " వేదనగా అనుకున్నాడు.

మనసు, శరీరం కూడా అలసినట్టు అనిపించింది. కూర్చున్న దగ్గర నుంచి లేచి నెమ్మదిగా నడుస్తూ హాల్లోకి నడిచాడు. గోడల నిండా ఎన్నో పెయింటింగ్స్. హృదయం అనే కాన్వాస్ మీద అనుభవాల కుంచెలతో చిత్రించిన సజీవ చిత్రాలు. ఒక్కో చిత్రానికి ఒక్కో కథ. వాటిని చూస్తూ పైన ఉన్న తన గదిలోకి వెళుతూ మెట్ల మీద ఆగాడు. మెట్టు, మెట్టుకీ ఉన్న బొమ్మలన్నీ అకస్మాత్తుగా సాలభంజికలుగా మారిపోయి కథలు వినిపించడానికి ఆయత్తం అవుతున్నట్టు అనిపించింది. 'నా కథ నాకే చెబుతారా!' నవ్వుకున్నాడు. వేగంగా తన గదిలోకి వెళ్లి మంచం మీద తలగడని ఆనుకుని కూర్చుని రెప్పలు మూసుకోబోతూ ఉండగా ఎదురుగా ఉన్న గోడ మీద నిలువెత్తు పెయింటింగ్ మీద మంత్రించినట్టు ఆగిపోయాయి చూపులు.

చీకటిగా ఉన్న గర్భగుడి, పొడుగాటి కుందుల్లో రెండు వైపులా వెలుగుతున్న దీపాలు.. ఆ దీపపు వెలుగు పడిన ఆ దేవత కళ్ళు మెరిసిపోతున్నాయి. ఆ కళ్ళల్లో కరుణ వెల్లువయి ప్రవహిస్తున్నది. ఆమె పాదాల మీద గులాబీలు హృదయం ఆకారంలో పేర్చి ఉన్నాయి. ఎరుపు, పచ్చ, తెలుపు రంగుల గులాబీలు, ఎప్పటికీ వాడని గులాబీలు, అప్పుడే విచ్చుకుని మంచు బిందువుల్లో స్నానించినట్టు ఉన్న గులాబీలు, స్నేహపరిమళాలు వెదజల్లుతున్న గులాబీలు. ఆమెకి ఇష్టమైన గులాబీలు ఆమె పాదాలను కడుగుతూ ఎన్నో ఏళ్లుగా తాజాగా..

ఆ రూపం, ఆ నవ్వు, ఆ నడక, ఆ మాట భావోద్వేగంలో తనని ముంచెత్తిన రోజు ధమనుల్లో, సిరల్లో ప్రవహిస్తున్న ప్రతి రక్తపు బొట్టులో ఆరాధన అనే కుంచె ముంచి వేసిన రంగులు. అందుకేనేమో ఇన్నేళ్ళు అయినా ఇంకా పరిమళిస్తూనే ఉన్నాయి.

వెలుగుతున్న ఆగరువత్తుల ధూపం వలయాలు, వలయాలుగా తిరుగుతూ నిత్యం ఆమెని అర్చిస్తూనే ఉంది. గర్భగుడి గడప మీద మోకరిల్లి ఉన్న భక్తుడు తను. కైమోడిచిన ఆ చేతుల మీద అర్పణ అనే అక్షరాలు బంగారు రంగులో మెరిసిపోతున్నాయి. 'నన్ను నేను నీ పాదాల ముందు ఆత్మార్పణ చేసుకున్నా కరుణించని కఠినత్వం దేవతామూర్తివి అయిన నీకేలా వచ్చింది?' ఎన్నో సార్లు వేసిన ప్రశ్న మరోసారి వేశాడు.

ఆ చిత్రం చూసిన ప్రతి క్షణం ఎన్నో ప్రశ్నలు.. సమాధానం లేని ప్రశ్నలు. హృదయాన్ని శస్త్రాల్లా తూట్లు పొడుస్తూనే ఉంటాయి. కానీ ఏనాడూ ఆ చిత్రం సమాధానం చెప్పలేదు. నిజంగా ఈ చిత్రం మాట్లాడితే! ఔను మాట్లాడితే! ఎంత బాగుంటుంది! ఎన్నో ప్రశ్నలు వేయచ్చు. కొన్ని సంవత్సరాలుగా సమాధానం దొరక్కుండా హృదయంలోని నాలుగు అరల్లో గందరగోళంగా తిరుగుతున్న ఎన్నో సందేహాలు తీరిపోతాయి. ఎంత ఆశ తేజా! నవ్వుకున్నాడు వేదాంతిలా.

అప్రయత్నంగా అతని రెండు కళ్ల నుంచి రెండు నీటి బొట్లు తలగడ మీదకి జారాయి.

ఎన్ని ప్రయాణాలు! ఎన్ని పరిచయాలు! ఎన్ని బంధాలు! ఎన్ని గాయాలు! అయిపోయింది. ఇంక ఈ జీవితం ముగిసిపోయే సమయం వచ్చింది. ఈ మాట అంటే "నీ మొహం ! అప్పుడే ముగిసిపోవడం ఏంటి? నీకింకా సుధీర్ఘమైన జీవితం ఉంది..సాధించాల్సిన విజయాలు చాలా ఉన్నాయి.. don't be pessimistic" అని మందలిస్తాడు సూర్య. నిజంగా ఇంకా నాకు భవిష్యత్తు ఉందా! నిన్న చరిత్ర.. రేపు ఉత్కంఠ.. నేడు వరం సూర్య మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి. రేపు అనేది ఉందా ఎలా ఉంటుంది అనుకోడమే ఉత్కంఠనా? రేపు గురించి ఎందుకింత తపన? ఎందుకీ ఉబలాటం? ఏరోజు కా రోజు ఈ రోజు నీవిచ్చిన ఈ జీవితం బాగుంది.. రేపు కూడా ఇలాగే ఉండనీ అని ప్రార్ధించమనేవాడు శివ. ఎవరి ఫిలాసఫీ కరెక్ట్ ?

తేజకీ ముందురోజు ఆర్ట్ గ్యాలరీలో జరిగిన విషయాలు, ఆకిమ్ అనే కుర్రవాడు తన చిత్రాల పట్ల కనపరిచిన ఆసక్తి, తనతో సెల్ఫీ తీసుకున్న అభిమానులు, హడావుడిగా పరిగెత్తుకు వచ్చి ప్లీజ్ సర్ ఒక్క బైట్ అంటూ వెంటపడిన మేఘ, మీ అపాయింట్మెంట్ కావాలి.. మీతో పర్సనల్ గా మాట్లాడాలి అని అడిగిన అమ్మాయి గుర్తుకు వచ్చారు. ఎన్నో సార్లు ఇలాంటి ఎగ్జిబిషన్స్ జరిగాయి. కానీ నిన్నటి రోజున కలిగిన అనుభవం తమాషాగా అనిపిస్తోంది. కానీ, నిన్న కొందరి మాటల్లో ఏదో తెలియని ఆత్మీయత ఒక మలయసమీరంలా చల్లగా తాకింది.

ముఖ్యంగా తన చుట్టూ, చుట్టూ తిరిగి మీతో పర్సనల్ గా మాట్లాడాలి. అపాయింట్మెంట్ ఇస్తారా అని అడిగిన ఆహ్లాద గుర్తుకు రాగానే ఏదో వైబ్రేషన్. ఆ అమ్మాయి పేరు ఆహ్లాద.. పేరు కొత్తగా, ఆకర్షణీయంగా ఉంది. ఆమె నవ్వు చాలా దగ్గరగా, ఆత్మీయంగా గుండెని స్పృశించింది. ఆ చూపుల్లో ఏదో తెలియని సాన్నిహిత్యం, ఆ అమ్మాయి దగ్గరగా వచ్చి మాట్లాడుతుంటే ఏదో తెలియని పాశం మెడని పూలదండలా చుట్టుకుంటున్న భావన. ఎవరామె? తనతో ఏం మాట్లాడాలనుకుంది!

గాలికి చెదురుతున్న జుట్టు పదే, పదే పైకి తోసుకుంటూ, లేత చెక్కిళ్లు పాలరాయి పలకల్లా సూర్యకాంతిలో నున్నగా మెరుస్తూ, అందమైన శిల్పానికి ప్రాణం పోసినట్టు సన్నగా, పొడుగ్గా ఎంతో అధునాతనంగా ఉన్న అమ్మాయి. పిల్లగాలికి కదులుతున్న నైలాన్ తెరలతో దాగుడుమూతలాడుతూ, తెలిమబ్బులను తొలగించుకుంటూ ఉదయిస్తున్న చంద్రబింబంలా, అతి జాగ్రత్తగా కప్పిన ఆకుల మధ్య నుంచి విచ్చుకుంటున్న చంపకంలా సుగంధ పరిమళాలు మోసుకొస్తూ, మూసుకున్న రెప్పలను తప్పించుకుంటూ మెత్తని అడుగుల శబ్దం.. ఒక్కసారిగా త్రుళ్ళిపడి లేచాడు.

చిత్రంలో దేవత కళ్ళు నవ్వినట్టు అనిపించింది. ఆ పెదవులు ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టు అరవిచ్చిన మందారాలలా కదిలాయి. ఆ నవ్వు.. ఆ నవ్వు కళ్ళు మూసుకున్నాడు. ఏవో జ్ఞాపకాలు.. పరిచితమైన నవ్వు.. ప్రశాంతంగా పారుతున్న నదిలో గుప్పెడు గులకరాళ్ళు పోసినట్టు చిన్న, చిన్న అలలు నిద్రించిన స్మృతులను చెదరగొడుతున్నట్టు.

“నువ్వేనా !? నిజంగా నువ్వేనా.. నా చిత్రాలలోంచి చైతన్య దీపికవై నడచివచ్చావా! ఎంత అదృష్టవంతుడిని!” గబుక్కున లేవబోయి మంచం పక్కనే ఉన్న కాబినెట్ కాలికి తగిలి తూలిపడబోయి నిలదొక్కుకుని తలతిప్పి చిత్రం వైపు చూశాడు.. అర్పణ అనే అక్షరాలు ఫక్కున నవ్వాయి.

నిలువునా నీరసం ఆవహించింది. నిస్సత్తువగా మంచం మీద వాలిపోయాడు. అసహనంగా అటూ, ఇటూ దొర్లి కొద్దిసేపట్లోనే గాఢ నిద్రలోకి జారాడు.

★★★

ఆనందనగర్లోని రెండంతస్తుల భవనం.. ఒక అంతస్తులో “ఎస్” ఛానెల్ కి సంబంధించిన అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్, రెండో అంతస్తులో స్టూడియో.

మెరూన్ కలర్ చుడీదార్ మీద నలుపు రంగు గీతలు, అందంగా కట్ చేసి భుజాల మీద వదిలేసిన జుట్టు, చెవుల నుంచి మెడ మీదకి పడుతున్న పొడుగాటి బ్లాక్ మెటల్ హ్యాంగింగ్స్.. రెండు చేతులకి మణికట్టు నుంచి మధ్యలో దాకా రంగు, రంగుల ఫ్యాన్సీ గాజులు, మెరూన్ కలర్ లిప్ స్టిక్.. మెడలో బ్లాక్ మెటల్ కాసులపేరు డిజైన్ ఉన్న వెడల్పాటి నెక్లెస్.

వర్మ గదికి ఉన్న గ్లాస్ డోర్ తెరుచుకుని లోపల అడుగుపెట్టింది మేఘ.

"సర్ ! అయాం రెడీ. తేజ గారు కూడా పది నిమిషాల్లో బయలుదేరుతున్నాను అని చెప్పారు. ఒకసారి నా క్వశ్చన్ పేపర్ చదువుతాను వింటారా.. ఇంకా ఏమన్నా అడిషనల్ గా ఉంటే ఆడ్ చెయ్యచ్చు."

వర్మ ఆమె వైపు ఒకసారి చూసి తల దించుకుని టేబల్ మీద ఉన్న ఫైల్ లోకి చూస్తూ అన్నాడు.

"మేఘా! నువ్వు చేస్తున్న ప్రోగ్రామ్ ఏమిటి? "

మేఘకి ఆ ప్రశ్న ఆయన ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాలేదు.. అయోమయంగా చూస్తూ మెల్లగా అంది.. " మహాతేజ గారి ఇంటర్వ్యూ .."

" కేవలం ఇంటర్వ్యూ కాదు.. archives లో భద్రపరచే అమూల్యమైన డాక్యుమెంటరీ అవునా !'

"ఎస్ సర్" నాలుక తడారిపోయినట్టు అనిపించింది.

" సో ! ఈ ప్రోగ్రామ్ లో నువ్వు చాలా కవర్ చేయాలి.. నీ ప్రశ్న షార్ట్ అయి ఉండచ్చు.. దానికి ఆయన సమాధానం పెద్దగా ఉంటుంది. ఉదాహరణకి మీ బాల్యం, విద్యాభ్యాసం చెప్పండి అంటావు.. నీ ప్రశ్న చిన్నదే కదా !

"అవును సర్!"

"దానికి ఆయన చాలా చెప్పాలి.. ఆయన తన బాల్యం గురించి చెప్పేటప్పుడు వాళ్ళ పేరెంట్స్ ఫోటోస్, ఆయన స్కూల్ యూనిఫాం లో ఉన్న ఫోటోస్ ఎట్ సెట్రా చూపిస్తాము. అలాగే నిన్న టీం అందరూ వెళ్ళి ఆయన పెయింటింగ్స్ వీడియో తీసుకుని వచ్చారు. అది పడి నిమిషాలు ఉంటుందా ! "

తలూపింది."అలాంటప్పుడు నువ్వు కనిపించే సమయం ఎంత ఉంటుంది ? "

మేఘ మాట్లాడలేదు. వర్మ రివాల్వింగ్ చెయిర్ లో వెనక్కి వాలి అన్నాడు. "మేఘా ! నీకు తెలుసు మన ఛానెల్ అన్ని ఛానెల్స్ లాంటిది కాదు. అభూత కల్పనలు, అరాచకీయ వార్తలు మనము ప్రసారం చేయము. వాస్తవాలను మాత్రమే

మనము ప్రసారం చేస్తాము.  ముఖ్యంగా ఇలాంటి ప్రముఖుల పరిచయ కార్యక్రమాలు మన ఛానెల్ చేసినట్టు ఇంక ఏ ఛానెల్ చేయదు. సెలెబ్రిటి అంటే గ్లామర్ ప్రపంచంలో ఉన్న వాళ్ళే అనుకునే అజ్ఞానం కాదు మనది. గ్లామరు కన్నా ప్రతిభను గుర్తించి గౌరవించే ఛానెల్.. అభూత కల్పనల కన్నా వాస్తవాలను మాత్రమే హుందాగా ప్రసారం చేసే ఛానెల్. కొన్ని విలువలకు కట్టుబడిన ఛానెల్.. ఇందులో యాంకర్ గా  నీకు మంచి పేరు ఉంది. చక్కటి తెలుగు మాట్లాడతావు, చక్కటి డిక్షన్ ఉంది నీకు. దానితో పాటు మధురమైన స్వరం ఉంది. అంతకన్నా స్నేహపూర్వకంగా మృదువుగా నవ్వుతావు. నీ మేకప్ నీ ప్రతిభను డామినేట్ చేయకూడదు. ఇప్పుడు నువ్వు చేస్తున్న కార్యక్రమం ఎంతో హుందా అయినది. ఈ కార్యక్రమానికి ఇంత గ్లామరస్ గా తయారవడం అవసరమా! ఇదేమి ఫ్యాషన్ షో కాదు కదా!  యాంకర్ లేదా ఒక నటికి తన అందం మీద conscious ఎంత తక్కువ ఉంటే అంత టాలెంట్ చూపించవచ్చు.   తన అందం మీద, గ్లామర్ మీదా ఎప్పుడైతే ఫోకస్ పెడతావో  there you are  failed.. ఫోకస్ నీవు చేస్తున్న కార్యక్రమం మీద ఉండాలి.  ప్రేక్షకులు నీ ఇయర్ రింగ్స్ మీదా, నీ డ్రెస్ మీదా, నీ లిప్ స్టిక్ మీదా ఫోకస్ పెడితే నీ ముందు కూర్చున్న పెద్ద మనిషి ఏం చెబుతున్నాడో వాళ్ళకి అర్థం కాదు.. నీకు చాలా ఫోన్ కాల్స్ వస్తాయి.. వందల whatsapp మేసేజెస్ వస్తాయి. ఫేస్ బుక్ లో, ట్విటర్ లో వేల లైకులు, కామెంట్స్ వస్తాయి.. కానీ అవన్నీ నీ ప్రతిభను గుర్తించినవి కావు. నీ అందాన్ని, నీ అలంకరణ ని గుర్తించేవి.  I think you catch my point.”

మేఘ మొహం పాలిపోయింది. తేజ అంగీకారం తెలుపగానే, నిన్న సాయంత్రం మాల్ కి వెళ్ళి మంచి డ్రెస్, దానికి తగిన యాక్సెసరీస్ కొనుక్కుంది. ఈ డ్రెస్ చూసి అందరూ అద్భుతమైన selection అని అంటుంటే మురిసిపోయింది. మహాతేజ అనే గొప్ప చిత్రకారుడిని, ఎవరికీ తొందరగా ఇంటర్వ్యూ లు ఇవ్వని ఆ అపురూపమైన కళాకారుడిని ఇంటర్వ్యూ చేయడం అంటే అది ఒక గొప్ప అవకాశంగా భావించి ప్రత్యేకంగా ఉండాలని జాగ్రత్తగా తయారైంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.. గిరుక్కున వెనక్కి తిరిగి గ్రీన్ రూమ్ లోకి వెళ్ళిపోయింది. వర్మ ఆమె వెళ్ళిన వైపు చూస్తూ “ అమ్మాయిలని సున్నితంగా హ్యాండిల్ చేయాలి. మీడియా అంటే కేవలం గ్లామర్ ప్రదర్శన కాదు, జ్ఞానాన్ని కూడా ప్రదర్శించ వచ్చు అనే భావన వీళ్ళల్లో కలిగిస్తే తాను సక్సెస్ అయినట్టే  అనుకున్నాడు.

తేజ కారు  “ ఎస్ “ ఛానెల్ అని అర్థ చంద్రాకారంలో ఉన్న బోర్డ్ కింద నుంచి గేటు లోపలకి దూసుకుని వచ్చింది. ఎంట్రన్స్ ముందు కారు ఆగగానే తేజ దిగాడు.  అప్పటికే  కింద రిసెప్షన్ లో కూర్చుని అతని కోసం ఎదురుచూస్తున్న ఒక యువకుడు గ్లాస్ డోర్ తెరుచుకుని ఉత్సాహంగా తేజ దగ్గరగా వెళ్లి షేక్ హ్యాండ్ ఇచ్చి “ వెల్కమ్ సర్... రండి.. మీకోసమే ఎదురుచూస్తున్నాం “ అంటూ ఎంతో మర్యాదగా లోపలికి తీసుకుని వెళ్ళాడు.

లిఫ్ట్ వైపు వెళ్తున్న అతనిని వారించి మెట్ల వైపు నడిచాడు తేజ. మార్బల్ ఫ్లోర్, స్టీల్ రైలింగ్.. మెట్టు, మెట్టు కి ఇత్తడి కుండీల్లో రక,రకాల క్రోటన్స్. మెట్లు నింపాదిగా ఎక్కుతూ పరిసరాలు పరికించాడు. ఎక్కడ చూసినా పరిశుభ్రతకి చిరునామాగా ఉంది. వెతికినా మచ్చ కనపడని గోడలు లైట్ల వెలుగులో మెరిసిపోతున్నాయి.

బలంగా ఉన్న తలుపు తోసి హ్యాండిల్ పట్టుకుని “ప్లీజ్ రండి సర్” అన్నాడు ఆ యువకుడు..

రికార్డింగ్  స్టూడియో.. ఎ.సి చల్లదనం హాయిగా తాకింది.. చల్లదనంతో పాటు మంచి రూమ్ స్ప్రే పరిమళం నాసికాపుటాలను సోకింది. అప్పటికే అక్కడ మేకప్ తో యాంకర్... రెండు కెమెరాలు సెట్ చేసుకుని కెమెరా మెన్, మరి కొందరు టెక్నికల్ స్టాఫ్ అధునాతన సాంకేతిక పరికరాలతో సిద్ధంగా కూర్చున్నారు.  తేజాని చూడగానే అందరూ మర్యాదపూర్వకంగా లేచి నమస్కరించారు.

ప్రతి నమస్కారం చేసి యాంకర్ వైపు చూశాడు. లేచి నిలబడి నమస్కరించింది “ నా పేరు మేఘ “ అంది.

తేజ చిరునవ్వు నవ్వాడు. చురుకైన అతని కళ్ళు లేత రంగు ఆధునిక దుస్తుల్లో నిరాడంబరంగా, నిరాభరణంగా ఉన్న మేఘని ప్రశంసాపూర్వకంగా చూశాయి. ఆ ప్రశంస గమనించిన మేఘ మనసు ఆనందంగా నర్తించింది.

“కూర్చోండి సర్ !” కెమెరా లకి ఎదురుగా ఎదురెదురుగా ఉన్న సోఫాలు.. ఒక దాంట్లో మేఘా, ఆమె ఎదురు సోఫాలో తేజ. వాళ్ళిద్దరి మధ్యా రెండు ఏనుగులు మోస్తున్న గాజు టీ పాయ్.. దాని మీద అందమైన ఫ్లవర్  బొకే.

వర్మ వచ్చాడు. తేజకీ షేక్ హ్యాండ్  ఇచ్చి “ వెల్కమ్ టు  అవర్ చానెల్ సర్’ అంటూ మేఘ వైపు తిరిగి సైగ చేసి దగ్గరగా పిలిచాడు. బొకే తీసి ఆమెని కూడా ఒక వైపు పట్టుకోమని తేజ చేతికి ఆ బొకే అందించాడు. మేఘ కళ్ళల్లో లిప్త పాటు మెరిసిన ఆనందం అతని దృష్టిని దాటి పోలేదు.

“మేఘా ! ఆర్ యు ఓకే” అడిగాడు.

“ఎస్ సర్ ! “

“గుడ్!” తేజ వైపు తిరిగి “కాఫీ తీసుకున్నాక స్టార్ట్ చేద్దాం”  అన్నాడు. బాయ్ తెల్లటి కప్పుల్లో కాఫీ తెచ్చాడు. కేవలం తేజకే కాక అక్కడున్న యూనిట్ సభ్యులందరికీ కాఫీ ఇచ్చాడు బాయ్. మేఘ తేజ సిప్ చేసిందాకా ఆగి తాగసాగింది.

వర్మ తేజతో మాట్లాడుతూ " మీరు కంఫర్టబుల్ గా ఫీల్ అవండి సర్.. మాకు తొందర ఏమి లేదు. రోజుకి పది కార్యక్రమాలు చేస్తాము, పది గంటలు.. మధ్య, మధ్యలో రిలీఫ్ కోసం మంచి సినిమా పాటలు పెడతాము. రోజులో అరగంట చొప్పున నాలుగు సార్లు న్యూస్ ఉంటుంది. ఇది మీ డాక్యుమెంటరీ. మేము కేటాయించుకున్న సమయం రెండు గంటలు.. ఎక్కువైనా పర్లేదు. టైమ్ అయిపోతుంది అని మీరు అనుకోవద్దు. మీకు ఏది షేర్ చేయాలి అనిపిస్తే అది చేయండి. నో లిమిటేషన్స్. ఓ కే! థాంక్ యు.. మేఘా! గెట్ రెడీ " అని మరోసారి తేజకీ షేక్ హ్యాండ్ ఇచ్చి వెళ్ళిపోయాడు వర్మ.

ఇద్దరు కెమెరామెన్ పోసిషన్ చూసుకున్నారు.. బొటన వేలు చూపించి ఓకే అన్నారు మేఘతో. అసిస్టెంట్ వచ్చి కార్డ్ లెస్ మైక్ తేజ షర్టు కాలర్ కి ఫిక్స్ చేసాడు. మేకప్ మాన్ వచ్చి " సర్ టచ్ అప్ చేయమంటారా!" అడిగాడు.

"నో" చిరునవ్వుతో అన్నాడు తేజ. మేఘ దగ్గరకు వెళ్ళాడు మేకప్ మాన్. వద్దు అన్నట్టు చేయి అడ్డు పెట్టింది మేఘ. ప్రతి ఐదు నిమిషాలకు టచ్ అప్ అని అరిచే మేఘ వద్దు అనడం ఆశ్చర్యంగా అనిపించింది అతనికి. ప్రశ్నార్ధకంగా ఆమె వైపు చూశాడు. మేఘ అతన్ని చూడలేదు.

" సర్! స్టార్ట్ చేద్దామా?" తేజని అడిగింది . మేకప్ మాన్ అక్కడ నుంచి దూరం వెళ్ళిపోయాడు.

" ఎస్" అన్నాడు తేజ...

హెడ్ ఫోన్స్ పెట్టుకున్న ప్రోగ్రాం హెడ్ ఏవో సంకేతాలు ఇచ్చాడు.. కెమెరామాన్ " స్టార్ట్" అన్నాడు..

మేఘ మొహం నిండా నవ్వు పులుముకుని " హాయ్ నమస్తే! వెల్కమ్ టు అవర్ ఎస్ ఛానెల్. జాతిరత్నాలు కార్యక్రమానికి స్వాగతం... ఈనాటి మన కార్యక్రమంలో సుప్రసిద్ధ చిత్రకారుడు, అనేక జాతీయ బహుమతులు అందుకుని ఇటీవలే అత్యంత ప్రతిష్టాత్మకమైన మరో జాతీయ పురస్కారం అందుకున్న మహాతేజ గారు మన స్టూడియో కి విచ్చేశారు.. వారు మన అందరితో చిత్రకారుడిగా తన అనుభవాలు పంచుకుంటారు " అంటూ పరిచయ వాక్యాలు చెప్పి, తేజ వైపు తిరిగి " నమస్కారం సర్.." అంది.

"నమస్తే" అందరికీ తేజ చేతులు జోడించాడు.

" సర్ ముందుగా మీకు అభినందనలు తెలియచేస్తున్నాను. మీకు అనేక బహుమతులు, పురస్కారాలు వచ్చి ఉంటాయి కదా.. ఇప్పుడు పొందిన జాతీయ పురస్కారం పట్ల మీ స్పందన ఏమిటి?"

తేజ చిరునవ్వు నవ్వాడు. “ మొదటిసారి బహుమతి వచ్చినపుడు ఎలా ఫీల్ ఆయానో ఇప్పుడు కూడా అలాగే ఫీల్ అవుతున్నాను. ఎప్పటికప్పుడు నన్ను నేను కొత్తగానే భావిస్తానమ్మా. ఇలాంటివి చాలా తీసుకున్నాను దీనిదేం ఉంది అని ఎప్పుడూ అనుకోలేదు. కొత్త పాఠం చదివిన తరవాత అందులోని సారం మాష్టారుకి ఎలా అయితే అప్పచెబుతామో, నేను నా అనుభవం ద్వారా లేదా ప్రముఖుల చిత్రాలు చూసి ప్రేరణ పొంది నేర్చుకున్న కొత్త, కొత్త పద్ధతులు అవలంబిస్తూ ఎప్పటికప్పుడు కొత్తగా స్ట్రోక్ నేర్చుకున్నట్టే ఫీల్ అవుతాను. “

“ సర్! మీకు అసలు చిత్రకళ మీద ఆసక్తి ఎలా ఏర్పడింది? మీరు ఇంత గొప్ప చిత్రకారుడు అవడానికి కృషి ఎలాంటిది?”

“ ప్రాక్టీస్.. ఏ విద్య అయినా సాధన మీద ఆధారపడి ఉంటుంది. సాధనమున పనులు సమకూరు ధరలోన అని వేమన అన్నట్టు ప్రాక్టీస్ అనేది చాలా ముఖ్యమైనది. విద్య అయితే చదివి, చదివి బట్టీ పడతారు.. సంగీతం, నాట్యం, చిత్రకళ ఇలాంటివి ప్రాక్టీస్ చేస్తాము అంతే కదా!నేను గొప్ప చిత్రకారుడిని అని ఎప్పుడూ అనుకోలేదు.. నేనింకా సాధించాల్సినది చాలా ఉంది.”

“మీరింకా నేర్చుకునే దశలో ఉన్నానని ఒక ఇంటర్వ్యూ లో చెప్పారు. ఇంకా ఏం నేర్చుకుంటున్నారు? ఎవరి దగ్గర నేర్చుకుంటున్నారు?”

తేజ మందహాసం చేశాడు. “ నా జీవితమే నాకో పెద్ద గురువు.. గడిచే ప్రతి క్షణం తిరగేసిన బతుకు పుస్తకంలోని ఒక పేజీ.”

“ సర్ ! మీరు వేసిన అన్ని చిత్రాల్లో మీకు బాగా నచ్చినదేది ?”

“ప్రతి చిన్న ఆర్ట్ విలువైనదే ఎందుకంటే అది కళాకారుడి హృదయం నుంచి ఉద్భవిస్తుంది కాబట్టి.”

మేఘ నవ్వి “ మీతో మాట్లాడుతూ ఉంటే నాక్కూడా ఒక మంచి పుస్తకం చదువుతున్నట్టే ఉంది. మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి తెలుసుకునే ముందు మీ అభిమానులకు మీరు వేసిన కొన్ని చిత్రాలు వీడియో ప్లే చేస్తాను.. ” అంది.

“ అలాగే” చిరునవ్వుతో అన్నాడు.

కెమెరా మేఘ మీదకి ఫోకస్ చేశాడు. మేఘ చిరునవ్వుతో చెప్పసాగింది.

“ ప్రముఖ చిత్రకారుడు, మహాతేజ గారితో పరిచయ కార్యక్రమం చూస్తున్నారు. సాధారణంగా మంచి పెయింటింగ్స్ చూడాలంటే చిత్రకళా ప్రదర్శనల్లో మాత్రమే చూస్తాము. అవి కూడా ప్రదర్శనకి పెట్టిన కొన్ని చిత్రాలు మాత్రమే. అలాగే మహాతేజ గారి చిత్రాలు అన్నీ, అందరూ చూడలేకపోవచ్చు. కొన్నైనా మా ప్రేక్షకులకి చూపించాలని వారి చిత్రాలను కొన్నిటిని వీడియో తీయడం జరిగింది. నిజానికి వారు వేసిన ప్రతి చిత్రం ఓ కళా ఖండం.. అందులోని భావం అనంతం. ఈ చిన్న వీడియో లో అంతులేని మహాసముద్రం లాంటి వారి ప్రతిభ చూపించాలి అనుకోడం కొండని అద్దంలో చూపించడం లాంటిదే! అయినా ఆ సాహసం చేస్తున్నాము. ఇప్పుడు వారి చిత్రాలు ఈ వీడియో లో చూడండి.

మానిటర్ లో చూస్తున్న వర్మ “ శభాష్ “ మేఘా! అనుకున్నాడు సంతృప్తిగా .

కొన్ని నిమిషాల పాటు ముందురోజు తేజ ఇంటికి వెళ్ళి తీసిన వీడియో ప్లే అయింది. అతను వేసిన బొమ్మలన్నీ పది సెకన్ల పాటు చూపిస్తూ సుమారు ఐదు నిమిషాలు ప్రెజంటేషన్ అయిన తరవాత మేఘ తిరిగి తన వ్యాఖ్యానం కొనసాగించింది.

“వెల్కమ్ బ్యాక్ టు జాతిరత్నాలు.. చూశారుగా! ఎప్పటికప్పుడు కొత్త, కొత్త ఆలోచనలతో కొత్త పద్ధతులతో ఎంతో సృజనాత్మకంగా అద్భుతమైన చిత్రాలు తన కుంచె ద్వారా చిత్రిస్తూ చిత్రకళ కి కొత్త సొబగులు దిద్దిన మహాతేజ గారు తాను నిత్య విద్యార్ధిని అంటున్నారు. మరి ఇప్పుడు వారి బాల్యం, విద్యాభ్యాసం గురించి వారి మాటల్లోనే తెలుసుకుందామా !”

“సర్! మీరు ఏ వయసు నుంచి బొమ్మలు వేయడం ప్రారంభించారు. మీకు చిత్రకళ పట్ల ఆసక్తి కలగచేసిన వారు ఎవరు? మీరు వేసిన మొదటి బొమ్మ ఏది? ”

తేజ కొన్ని క్షణాలు మౌనంగా ఉండి మందహాసం చేసి అన్నాడు. “ నాకు వయసు గుర్తు లేదు.. నా తల్లి,తండ్రులకు అసలు చిత్రకళ అనేది ఒకటి ఉందని తెలియదు.. ఇక నాలో స్ఫూర్తిని కలగచేసినది బహుశా ఆ దైవమే అనుకుంటా.

మేఘ సందేహిస్తూ అడిగింది. “ సర్ ! మీరు ఎక్కువగా చదువుకోలేదని ఒక మాగజైన్ కి మీరిచ్చిన ఇంటర్వ్యూ లో చదివాను. మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి మీ అభిమానులు తెలుసుకోవాలి అనుకుంటున్నారు. చెప్తారా! మీ జన్మస్థలం ఏది? మీరు ఎక్కడ మీ ప్రాధమిక విద్య ప్రారంభించారు.”

“ ఎక్కువగా కాదు.. నేను అసలు చదువుకోలేదు . “

“ చదువుకోకుండానే ఇంత అద్భుతమైన చిత్రకారుడిగా ఎలా ఎదిగారు ?” ఆమె స్వరంలో విస్మయం

" చదువుకి, కళకీ సంబంధం ఉందంటారా!"

మేఘ సమాధానం చెప్పలేదు. "అంటే! " అంటూ ఆగిపోయింది.

తేజ చెప్పసాగాడు. " అక్షరాలకి, గీతలకీ సంబంధం ఉంది. కానీ అక్షరాలు రాకముందే నేను బొమ్మలు వేశాను. కనీసం అక్షరం ని చూడను కూడా లేదు అప్పటికి. అయినా అ అక్షరంతో అమ్మాయి బొమ్మ గీకాను. అంకెలు తెలియకుండానే ఒకటో నెంబర్తో ముక్కు, మూడో నెంబర్ తో పెదాలు దిద్దాను. పలక మీద బలపంతో ఓంకారం దిద్దలేదు. కానీ తడిసిన ఇసకను బొమ్మలుగా మలచాను. "

మేఘ మొహంలో సంభ్రమాశ్చర్యాలు.. మొత్తం యూనిట్ సభ్యులు వర్మతో సహా నిశ్చేష్టులై వింటూ ఉండగా చెప్పసాగాడు తేజ.

" నేను ఒక కళాకారుడిగా ఎదిగి కొంచెం పేరు, ప్రతిష్టలు సంపాదించిన దగ్గర నుంచీ చాలా పత్రికల వాళ్ళు నా గురించి వారి పత్రికల్లో రాశారు. నన్ను ఇంటర్వ్యూ చేశారు. నా వ్యక్తిగత విషయాలు తప్ప కళకు సంబంధించినవి ఏవైనా సరే అడగమని చెప్పేవాడిని. అలాగే రేడియోలో, ప్రైవేట్ ఛానెల్స్ లో కూడా నా జన్మ రహస్యం తెలుసుకోవాలని ఎందరో ప్రయత్నం చేశారు. నేను అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు నా వయసు యాభై నాలుగు. ఈ వయసులో నాకే ఒక్కసారి వెనక్కి తిరిగి నేను నడచి వచ్చిన దారి చూసుకోవాలని అనిపిస్తోంది. అంతే కాక నా జీవితం ఎవరికన్నా ఒక స్ఫూర్తిని ఇచ్చి జీవించడం నేర్పిస్తుందన్న ఆశతో ఈరోజు ఈ ఎస్ ఛానెల్ ముందు నా బ్రతుకు పుస్తకం తెరుస్తున్నాను."

కొన్ని క్షణాలు మౌనంగా ఏదో స్మరించుకుంటున్నట్టు ఆగాడు. మేఘతో సహా అందరూ ఊపిరి బిగబట్టి అతను చెప్పే విషయాలు వినడానికి ఉత్కంఠ గా ఎదురుచూడసాగారు.

తన ఇంట్లో టి వి లో అతని పరిచయ కార్యక్రమం అతి శ్రద్ధగా చూస్తున్న ఆహ్లాద టి వి వెనకాల గోడ మీద ఉన్న తల్లి ఫోటో వైపు చూసింది.

గబుక్కున సోఫాలోంచి లేచి ఆవిడ ఫోటో తీసుకుని వచ్చి తన పక్కనే సోఫాలో పెట్టింది.. ఆవిడ ఫోటో వైపు చూస్తూ " అమ్మా! నువ్వు కూడా వినాలి కదా ఆయన గతం. విను.. జాగ్రత్తగా విను.. " అనుకుంది మనసులో.

టి వి తెరమీద కనిపిస్తున్న తేజ చరిత్ర చెక్కిన శిల్పంలా కనిపించాడు.

మౌనంగా ఉన్న అతను తన దృష్టి కెమెరా మీద నిలిపాడు. అతని పెదవులు విచ్చుకున్నాయి. ఆహ్లాద ఆసక్తిగా చెవులు రిక్కించింది.

**"మిత్రులారా!** నేనిప్పుడు ఒక సుదీర్ఘమైన కథ చెప్పబోతున్నాను. అది ఒక అనామకుడి కథ.. ఆ కథ విన్నాక మీ హృదయం స్పందిస్తే ఒక కన్నీటి చుక్క రాల్చండి.. లేదంటే ఒక నిట్టూర్పు వదలండి చాలు. అదే మీరు ఈ కళాకారుడికి ఇచ్చిన ఒక గౌరవంగా భావిస్తాను.

నా పేరు మహా.. అంటే నేనో మహానుభావుడిని అని కాదు. చాలా మామూలు మనిషిని. నిజం చెప్పాలంటే నన్ను చాలాకాలం ఎవరూ మనిషిగా కూడా గుర్తించలేదు. ఎందుకంటే నేనొక జాలరి కొడుకుని. జాలరి కొడుకు కళాకారుడు ఎలా అవుతాడు అని ఆశ్చర్యంగా ఉందా! ఎలా అయానో నా కథ విన్నాక మీకే తెలుస్తుంది.. నెమలికి నాట్యం నేర్పించిన గురువు ఎవరు? కోయిలకి పాట నేర్పిన గాయకుడు ఎవరు? చెట్టుకి చిగురించడం నేర్పినదేవరు ? నదికి ప్రవహించడం నేర్పింది ఎవరు? ఈ ప్రశ్నలకి సమాధానం లభిస్తే నేను కళాకారుడిని ఎలా అయాను అనే మీ సందేహం తీరినట్టే. ఇక కథలోకి వెళ్దామా! సుమారు నలభై ఏళ్ల క్రితం నాటి కథ...

నా ఇల్లు సముద్రపు ఒడ్డు...నా మిత్రులు సముద్ర కెరటాలు, నా శయ్య మెత్తటి ఇసుక.. మా ఊరుపేరు సింగన్న దిబ్బ. ఆ కుగ్రామంలో కేవలం పదిహేను గుడిసెలు మాత్రమే ఉండేవి. పిల్లా,పెద్దా అంతా కలిపి యాభై మంది జనాభా ఉండేవారు అనుకుంటా ఇంకా తక్కువేనో నాకు గుర్తు లేదు. నా తండ్రి పేరు మంగాడి అప్పన్న. చేపలు పట్టడం మా కులవృత్తి. మా ఊరు సముద్ర తీరానికి దగ్గరగా ఎత్తుగా ఉండే ఇసక దిబ్బల మీద ఉండేది. ఆ గుడిసెల్లో జీవించే కొన్ని కుటుంబాలు తప్ప ఏమి ఉండదు. ఏమన్నా కావాలంటే అక్కడి నుంచి మరి కొంత దూరంలో ఉన్న మరో చిన్న గ్రామానికి వెళ్ళాలి. గ్రామానికి, గ్రామానికి మధ్య రాక,పోకలు నడకలే. ఆ గ్రామంలో జీవించేది అందరూ మత్స్యకారులు. మట్టి గోడలు, తాటాకు కప్పులు, శిధిలావస్థలో ఉన్న ఆ పూరి గుడిసెల్లోనే వారి జీవితాలు తర,తరాలుగా సాగిపోతూ ఉన్న పరిస్థితి. తాత, ముత్తాతల కాలం నుంచీ జీవనాధారం సముద్రంలో చేపల వేట. మరి కొన్ని తరాలవరకూ అదే వాళ్ళ ఆట. వాళ్ళు, వాళ్ళ పిల్లలు, వాళ్ళ పిల్లలు...చేపలు పట్టడమే వృత్తి.. భార్యా, పిల్లల కడుపు నింపడానికి, తాము తినడానికి, తాగడానికి వేటే ఆధారం.

ఆ ఊరి పిల్లలెవరికీ బడి అనేది ఎలా ఉంటుందో తెలియదు.. బడి అంటే బడుగు జీవుల పిల్లలకి అడుగుపెట్టడానికి అర్హత లేని నిషిద్ధ స్థలం.. అందుకే ఎవరికీ నాలుగు అక్షరం ముక్కలు తెలియదు. దానికి తోడు చుట్టుపక్కల ఏ గ్రామంలో

కూడా కనీసం ప్రాధమిక విద్య సదుపాయం లేదు. కొంచెం దూరంలో కొంచెం పెద్దది అనిపించే ఊరుంది.. ఆ ఊరిలో ప్రత్యేకంగా ఆ పిల్లల కోసం ఒక మహానుభావుడు ఒక వీధిబడి పెట్టి కొంత కాలం నిర్వహించాడు. అది కొన్నాళ్ళు కుంటిగా నడిచి మూతపడింది. పిల్లలని బడికి పంపించడం పెద్ద వాళ్లకి భయం. పిల్లలకి బడంటే కోపం, వాళ్ళ స్వేచ్ఛని హరించే ఓ బందిఖానా అనుకునేవాళ్ళు . ఆ బడి ఎప్పుడు తెరిచి ఉంటుందో, ఎప్పుడు మూసి ఉంటుందో ఎవరికీ తెలియదు.. అందుకే ఆ పిల్లలు వెళ్ళినా, వెళ్లకపోయినా తల్లి,తండ్రులు పట్టించుకునేవారు కాదు. కొన్నాళ్ళకి ఏ పంతులు ఆ బడి మొదలుపెట్టాడో ఆయన అయిపు లేకుండా పోయాడు.

నాగరికతకు, అభివృద్ధికి అర్ధం తెలియని జీవులు. తలదాచుకోడానికి నీడ, కడుపునిండా తిండి కి కూడా నోచుకోని జీవులు. ఆడవాళ్ళకు రెండు చీరలు, రవికలు ఉన్నా- దాదాపు మగవాళ్ళు, పిల్లలు అర్ధనగ్నంగానే ఉండేవారు . వాళ్ళ దృష్టిలో బట్టలు అనేవి కేవలం వాళ్ళ ఆడవాళ్ళ మానాన్ని దాచే ఆచ్ఛాదన మాత్రమే.

చిత్రం ఏంటంటే అక్కడ మిగతా జాలర్లకి , నలుగురు, ఐదుగురు పిల్లలున్నారు.. కానీ మా ఇంట్లో నేను ఒక్కడినే.. పుట్టిన పిల్లలంతా పేరు తెలియని అనారోగ్యంతో రెండేళ్ళు తిరక్కుండానే పోతూ ఉండడంతో అమ్మ, నాన్న బోలెడు మొక్కులు మొక్కారట. గడ్డం పెంచిన ప్రతి వాళ్ళనీ స్వామీజీలు గా భావించి మా పిల్లలు బతికి బట్టకట్టే మార్గం చెప్పమని ప్రాధేయపడ్డారుట. అప్పుడే ఒక సాధువు నాకు పెట్టిన పేరు మహంకాళయ్య.. అంత పెద్ద పేరు పిలవడం కష్టం అనిపించి మహా అని పిలవడం మొదలుపెట్టారు. క్రమంగా “హా” కూడా కనుమరుగై నా పేరు “ మా “ గాడుగా చెలామణి అయింది. నేనంటే మా అమ్మా, నాన్నలకి ప్రాణం.. నా కాల్లో ముళ్ళు దిగితే వాళ్ళ గుండెల్లో బల్లేలు దిగినంత బాధతో విలవిల్లాడేవారు.

కొంత వయసు వచ్చాక ఆడపిల్లలైతే ఇళ్ళల్లో తల్లితో ఉండిపోయి పనీ, పాటా చూసుకున్నా, కొందరు మగపిల్లలు మాత్రం అప్పుడప్పుడు, ఒడ్డున ఉండి తండ్రులతో కలిసి వలలు వేయడం నేర్చుకునేవాళ్ళు . ఆ వయసుకి వాళ్ళు ఒడుపుగా చేపలు పట్టేస్తారని కాదు... కానీ చిన్నప్పటి నుంచే నుంచే తమ వృత్తిలో పిల్లలకి శిక్షణ ఇవ్వాలన్న ఆలోచనతో మాత్రమే కొందరు పెద్దలు పిల్లలకు వలలేయడంలో మెలకువలు నేర్పిస్తూ ఉండేవాళ్ళు. మా నాన్న అప్పన్న కూడా ఆ కొందరిలో ఒకడు.. నాకు ఏడేళ్ళ వయసులోనే తనతోపాటు చేపలు పట్టడానికి ఒక పెద్ద పడవలో కూర్చోబెట్టి సముద్రంలో కొంత దూరం తీసుకుని వెళ్ళాడు. ఆ అనుభవం నాకింకా గుర్తుంది.. బహుశా మొదటిసారి ఆ మహా సముద్రాన్ని దగ్గరగా చూసినందుకేమో.. తెడ్డు వేసినప్పుడల్లా నీళ్ళు చేసే అల్లరి, చిందులేస్తూ నా మొహం మీద ముద్రలేసే నీళ్ళ తుంపర

నాకెంతో ఇష్టం. బహుశా ఆ ముద్రలే నా భవిష్యత్తుని ఇలా నిర్దేశించాయి అనిపిస్తుంది నాకు.. అందుకే తరచూ నాన్నతో సముద్రం మీదకు వెళ్ళడానికి పేచీ పెట్టేవాడిని.

మా నాన్నలు అందరూ ఒక్కోసారి పదేసి రోజులపాటు సముద్రం మీద వేటకి వెళ్ళేవారు. అందరూ కలిసి రెండు పడవలేసుకుని వంట చేసుకోడానికి కావలసిన సరంజామా, వలలు, మోకులు, అన్ని వస్తువులు తీసుకుని తెల్లవారుజామున ఏ మూడింటికో పిల్లలం అందరం గాఢ నిద్రలో ఉన్నప్పుడు వెళ్ళిపోయేవారు. ఎందుకంటే మేమూ వస్తాము అని మారాం చేస్తాం కదా.. సముద్రంలో షికారంటే భలే సరదా. అలా అని పదేసి రోజులు మమ్మల్ని తీసుకుని సముద్రం మధ్యలోకి వెళ్ళడం ప్రమాదం కదూ! నిజానికి వాళ్ళకీ అది ప్రమాదమే.. కానీ వాళ్ళా ప్రమాదాలకి అలవాటు పడి ప్రమోదాలుగా మలచుకున్న వీరులు. మధ్య, మధ్య తీరం వెంబడి వంటలు చేసుకుంటూ పెద్ద, పెద్ద చేపలకి గాలం వేస్తూ జీవితాలను లాటరీ వేస్తూ సాహసయాత్ర చేస్తారు. వెళ్ళినవారు ఎప్పుడు తిరిగివస్తారు... వారిలో ఎంత మంది తిరిగివస్తారు అనేది భగవంతుడి నిర్ణయం అంటారు వయసు మళ్ళిన పెద్దలు కొందరు.. ఎందుకంటే వాళ్ళల్లో చాలా మంది అలా సముద్రం మధ్యలో ఉన్నప్పుడు పెద్ద తుపానులు వచ్చి కొట్టుకుపోయినవారే. అయినా చలించరు. జనన, మరణాలు మన చేతుల్లో ఉన్నాయా...అంతా పరమాత్ముడి లీల అనుకునే వేదాంతులు,, కడుపునిండా తిండి ఉన్నవాడికి బతుకు గుర్రప్పందం... కాలే కడుపుతో ఉన్నవాడి జీవితం ఒక నిత్య పోరాటం .. గెలుపే వాడి లక్ష్యం...గెలుస్తాడా! లేదా అనేది విధి నిర్ణయం. ఏది ఏమైనా తాము ప్రాణాలను పణంగా పెట్టి తమ కుటుంబాలను నిలబెట్టుకోవాలన్నదే వాళ్ళ ఆరాటం.. వాళ్లకి ఇంకో జీవనోపాధి లేదు..

మగవాళ్ళు వేట నుంచి తిరిగి వచ్చే సమయానికి ఆడవాళ్ళు గంపలు, సత్తు పళ్ళాలు పట్టుకుని కూర్చుని ఉంటారు. బరువుగా ఉన్న వలలతో వాళ్ళు రాగానే చేపలన్నీ బరువు తూచి పళ్ళాల్లో , గంపల్లో సర్దుకుని తీసుకుని వెళ్లి చుట్టు పక్కల గ్రామాల్లో అమ్ముకురావడానికి వెళ్తారు. మగవాళ్ళు తప్పతాగుతూ అలసట మర్చిపోతారు.

వేట లేని రోజులు అందరూ కబుర్లతో ఒకే కుటుంబంలా కలిసి గడుపుతారు. అక్కడ అందరికీ పేరుకి ఒక గుడిసె ఉందే కానీ తెల్లారకుండానే మగాళ్ళంతా ఒడ్డున ఖాళీ గా ఉన్న పడవల్లో కూర్చుని కాలక్షేపం చేస్తారు. కొందరు ఇసకలో కూర్చుంటారు.... బాగా ఎండగా ఉండి ఇసక నిప్పుకణికల్లా భగ్గుమంటుంటే మాత్రం ఏ సరుగుడు చెట్ల కిందో కూర్చుని చుట్టలు కాలుస్తూ కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. ఆడవాళ్ళు మాత్రం వంటపని, ఇంటిపని చేసుకున్నాక ఖాళీ సమయంలో వచ్చి కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు. వండుకున్నది కలిసి తింటారు.. లేకుంటే కలిసే పస్తులుంటారు.

గుడిసెల్లో ఉండేది చాలా తక్కువ సమయం. చేపలు దక్కినా, దక్కకపోయినా ప్రతిరోజూ ఉదయం కచ్చితంగా వలలు కెరటాల మీద దేవకన్యలు ఆరేసుకున్న వస్త్రాల్లా తేలుతూ, మునుగుతూ చేపల కోసం వేటాడుతూనే ఉంటాయి.

ఆ వలలు చూడడం కోసం  పిల్లలం కూడా నిద్ర లేస్తూనే సముద్రం ఒడ్డుకి పరిగెట్టేవాళ్ళం .. అక్కడే మొహాలు కడుక్కోడం, అక్కడే కెరటాల మీద ఊయల లూగుతూ స్నానాలు కానిస్తాం.. అమ్మలు సత్తు గిన్నెల్లో చద్దన్నాలు కలుపుకుని వచ్చి మాతోపాటు పరుగులు పెడుతూ అన్నాలు పెడతారు. అప్పుడు మేము చిన్ని కృష్ణులం అయిపోతాం.. అమ్మలంతా యశోదమ్మ ప్రతిరూపాలుగా ఉండేవారు.”

తేజ హటాత్తుగా మౌనం వహించడంతో పాజ్  కెమెరా అన్నారెవరో.  ప్రొడక్షన్ బాయ్ తేజకీ వాటర్ బాటిల్ అందించాడు, వాటర్ తాగి, కొనసాగించమన్నట్టు సైగ చేశాడు తేజ. కెమెరా ఆన్ అయింది. తేజ తిరిగి తనలో తాను చెప్పుకుంటున్నట్టు చెప్పసాగాడు. క్లుప్తంగా నా జీవన నేపథ్యం చెప్పాను. ఇంక నా కథ, తర,తరాల జాలరుల జీవిత చరిత్ర మీరు వినాలి.

పిన్ డ్రాప్ సైలెన్స్ ఆవరించింది. శ్వాస పీల్చి వదిలినా శబ్దం అవుతుందేమో అన్నట్టు అందరూ ఊపిరి బిగబట్టి వినసాగారు.

ఆహ్లాద తల్లి ఫోటో వైపు చూసింది.  తననే చూస్తున్న ఆవిడ కళ్ళు రెండు రెండు నదుల్లా అనిపించాయి. ఆమె కళ్ళల్లో కూడా గిర్రున నీళ్లు తిరిగాయి. టి వి స్క్రీన్ మీద గంభీరంగా కనిపిస్తున్న తేజకి రెండు చేతులు జోడించి మా అమ్మను క్షమిస్తారు కదూ! అనుకుంది.

తేజ చెప్పడం ప్రారంభించాడు.

ఫ్లాష్ బాక్

అది శీతాకాలం.. మధ్యాహ్నం ఎండ అమ్మ ఒడిలా నులివెచ్చగా ఉంది. సముద్రం మీద నుంచి వీస్తున్న చల్లని గాలి జో కొడుతున్న అమ్మ చేతి స్పర్శలా ఉంది.  సముద్రం గంభీరంగా, నిశ్చలంగా ఉంది.  ఎవరిదో బోటు ఒకటి నెమ్మదిగా కెరటాల మీద సాగుతూ క్రమంగా దూరం అయి ఓ చుక్కలా మారింది.

అప్పన్న  ఒక ఇసుక దిబ్బ మీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు. అతని చుట్టూ మిగతా జాలరులు కూర్చుని అప్పన్న చెప్పేది వింటున్నారు. ఎందుకంటే అప్పన్నే ఆ గూడేనికంతటికీ పెద్ద. అతని మాటే వారికి వేదం.

పిల్లలు నిక్కర్లు వేసుకుని విరిగిపడే అలల మీద పడుకుని, కూర్చుని, దొర్లుతూ తడిసిన చొక్కాలు విప్పి పారేసి ఇసకలో కేరింతలు కొడుతూ ఒళ్ళంతా అంటుకున్న ఇసక ఎండకి అద్దకంలా మెరుస్తుంటే గవ్వలు, ఆల్చిప్పలు ఏరుకుని రక,రకాల బొమ్మల్లా పేరుస్తూ ఆడుకుంటున్నారు. పిల్లల అల్లరిని , సందడిని మనసారా ఆస్వాదిస్తూ, మధ్య, మధ్య వాళ్ళని మరీ లోతుకు వెళ్ళద్దని హెచ్చరిస్తూ తిరిగి తమ కబుర్లలో మునిగి పోయి ఆడవాళ్లు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. అదొక ప్రపంచం...వాళ్ళ దగ్గరకు వెళ్తే చేపల వాసన గుప్పున కొడుతుంది. కానీ వాళ్ళ మనసులు మాత్రం మల్లెల్లా పరిమళిస్తుంటాయి.

చుట్టు పక్కల అడవుల నుంచి కొందరు కొండల దొరల తాలూకు స్త్రీలు , లంబాడీ తండాల నుంచి కొందరు పిల్లలు వచ్చి ఇసకలో ఆల్చిప్పలు ఏరుకుని తీసుకువెళ్ళి వాటితో రక,రకాల బొమ్మలు చేసి తీసుకువచ్చి ఇసకలో గుడ్డ పరిచి పెట్టుకుని అమ్ముకుంటారు.

ఆ సమయంలో విశాఖపట్నం నుంచి చుట్టుపక్కల ప్రాంతాలు పర్యటిస్తూ వచ్చిన ఒక జంట అలా అమ్ముకుంటున్న ఒక స్త్రీ దగ్గరకు బొమ్మలు కొనడానికి వచ్చారు. వాళ్ళిద్దరూ బాగా ఉన్నవారిలా ఆడంబరంగా అందంగా ఉన్నారు. కొంచెం దూరంలో కారు ఆపుకుని ఇసకలో కాళ్ళు కూరుకుపోతుంటే చెప్పులు విడిచి చేతిలో పట్టుకుని వచ్చారు.

వినాయకుడు, పండ్లమ్మే అమ్మాయి, కొంగలు, బాతులు, మొదలైన బొమ్మలు చూసి " "ఎంతమ్మా ఈ బొమ్మలు?" అని అడిగింది ఆ యువతి.

వాటికి ఒక కచ్చితమైన ధర నిర్ణయించే శక్తి లేకున్నా, వాళ్లకి తెలుసు పర్యాటకులు సగానికి సగం ధర తగ్గించి బేరం చేస్తారని అందుకే ఆ సమయానికి తోచిన ధర చెప్తారు. వాళ్ళేమి వందలు, వేల లాభాలు ఆశించే బడా వ్యాపారులు కాదు.. ఉన్నంతలో సుఖంగా చీకు, చింతా లేకుండా, మాకిది లేదు అనే వేదన లేకుండా, ఇది కావాలి అనే ఆశలు లేకుండా హాయిగా బతుకుతున్నవారు. అందుకే బేరాలు ఎలా ఉన్నా వచ్చిందే చాలు అని వాళ్ళు చెప్పిన ధరకు ఇచ్చేస్తారు. ఇప్పుడు ఆవిడ కూడా అలాగే బేరం చేసి కొన్ని బొమ్మలు కొని భర్తకు చూపించి డబ్బులు ఇవ్వమని సైగ చేసింది.

అతను జేబులో నుంచి పర్స్ తీసి డబ్బులు ఇస్తూ అడిగాడు." చేపలున్నాయా! అమ్ముతారా "

" మేము కాదు ఆయమ్మలను అడగండి" అంటూ జాలర స్త్రీల వైపు చేయి పెట్టి చూపించింది ఆ స్త్రీ.

వాళ్ళు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న జాలర స్త్రీల దగ్గరకు వచ్చి " ఏమ్మా! రొయ్యలున్నాయా.. వీశ ఎంత ?" అని అడిగారు.

" ఉన్నయి దొరా! రెండీశలుంతయి .. రెండొందలు " అంది ఆదేమ్మ.

"అంతేనా! ఇంట్లో పార్టీ ఉంది సరిపోవే" అంది ఆ యువతి.

" ఇయాల యాటకెల్లలేదు అమ్మగారూ" అంది పెంచలమ్మ .

"ఎండుసేపలున్నయి కావాలంటే" అంది చుక్కమ్మ .

" రోజూ వెళ్తారా వేటకి? " అడిగాడు ఆ యువకుడు.

" రోజూ అదిగదిగో ఆడ వలెత్తారు బాబుగారూ! సేపలు ఎక్కువ పడలాంతే లోనకి సముద్దం లోకి పోవాల. నెలకి పది దినాలు పోతారు, రోజూ యాడ బోతరు పానాలకి తెగించి. "

" వలేసిన ప్రతిసారీ బానే పడతాయా? " ఆసక్తిగా అడిగింది యువతి.

" సెప్పినాను గదా .. మా మొగోళ్ళు సద్ది కట్టుకుని సంద్రం మద్దెలోనికి ఎల్తె పడతయ్ " అంది ఆదేమ్మ

" అమ్మో! లోపలికి అంటే సముద్రంలోకా! ఎలా?" కళ్ళు పెద్దవి చేసి చూసింది ఆమె.

" ఎల్లకపోతే యాటెత్తా సాగేది " ఆమె భయం చూసి నవ్వింది ఆదెమ్మ. నల్లని ఆమె మొహంలో తెల్లని పలువరస తారాతోరణంలా మెరిసింది.

" పదేసి రోజులు సముద్రంలో ఎలా గడుపుతారు! తిండి, నీళ్ళకి ఇబ్బంది కదూ ! భయం వేయదూ!" ఆశ్చర్యంగా అడిగింది ఆవిడ.

"బయమెందుకమ్మగారూ! మా బతుకులే కత్తిమీద సాములు.. బయపడితే బతుకెల్లాగా! పానానికి తెగించే పోయేది.. ఒకోపాల మజ్జెన ఉండగానే పెద్ద, పెద్ద గాలులీత్తాయి.. సముద్దం కల్లోలం అయితాది.. మా కులదేవతను తలసుకుంటా మా పని మేము చేసుకుంటాము. ఆ దేవత కరుణిస్తే బతికి బట్ట కత్తాము .. లేకుంటే ఆ తల్లికే బలైపోతాము.. భూమ్మీద నూకలున్నన్ని రోజులేగదా ఎవురైనా బతికేది" ఆదెమ్మ మాటల్లో వేదాంతం ఆమెని నివ్వెరపోయేలా చేసింది.. ఎంత నమ్మకం వీళ్ళకి! అనుకుంది.

“ అమ్మ ఆగ్న ఉంటే ఎనక్కొత్తారు... ఆ దేవుడు  తీసుకెల్లితే ఎల్లిపోతారు. అంతా అమ్మ దయ ... అల్లగని యాటకి పోకుండా బతికేది ఎలాగా!” తేలిగ్గా అంది చుక్కమ్మ..

అందరూ వారి, వారి ఆలోచనలు, విశ్వాసాలు కలగలిపిన మాటలు చెబుతుంటే ఆ భార్యాభర్తలు వింటూ ఉండిపోయారు. కాసేపు భార్యకి ఇంగ్లీషులో వివరంగా చెప్పాడు ఆ యువకుడు.

ఆమెకి విస్మయాన్ని కలిగించినది ఏమిటంటే... ఎక్కడా వాళ్ళ మాటల్లో బతుకుమీద ఏ మాత్రం అనాసక్తి వినిపించలేదు.. కేవలం జీవితం పట్ల వాళ్ళకున్న స్పష్టత. అది ఎన్నో అనుభవాలతో కలిగిన తాత్విక చింతన కాదు...అది వేదాంతం కాదు. జీవనసత్యం తెలుసుకున్నప్పటి నిర్లిప్తత.  ఒక విధంగా చెప్పాలంటే కష్టపడడం మా బాధ్యత .. ఫలితం దైవ నిర్ణయం అనుకుంటూ  బతికే మనుషులు వాళ్ళు. వాళ్లకి ధైర్యం, వాళ్ళ కులదేవత పట్ల విశ్వాసం బాగా ఎక్కువ. జీవితాన్ని లాటరీ వేసుకుంటూ బతుకుతారు.

‘ఈ సారి యాటలో మేము వంజరాలో , కొరమీనో  ఏసుకోత్తాము అని ధృఢ విశ్వాసంతో వెళ్తారు మగవాళ్ళు. చివరి క్షణం దాకా పోరాడతారు. విజయం ఎప్పుడు, ఎవరిని వరిస్తుందో తెలియదు. ఎప్పుడన్నా సండువలో, పులసో పడక పోతుందా నేను గొప్పవాడిని అవకపోతానా అని ప్రతి వాళ్ళు ఆశిస్తారు. కానీ వాళ్ళ జీవితాల్లో ఇసుమంత మార్పు తీసుకువచ్చే మిరకిల్ ఏనాడూ జరగలేదు.. జరుగుతుందన్న ఆశ మాత్రం వీడరు. సముద్రంలో  ఆటుపోట్లు ఎంత సహజమో, జీవితంలో కష్ట,సుఖాలు అంతే సహజం అని వాళ్ళ నమ్మకం. విధి వక్రిస్తే తప్ప ఏ  విపత్తు రాదు... అలా వచ్చి ఏదన్నా అపాయం సంభవిస్తే అది అమ్మవారి ఆజ్ఞ అంటారు.

అప్పుడప్పుడూ వాతావరణ శాఖ వారి  హెచ్చరికలు వచ్చినపుడు మాత్రం ఉన్న కాసిని సామాన్లు, మూట కట్టుకుని, పిల్లలని చంకనెత్తుకుని తాటాకు పాక పీక్కుని కొంచెం దూరంగా గుడిసె వేసుకుని ముంచుకొస్తున్న ప్రళయాన్ని ఆసక్తిగా గమనిస్తుంటారు. ఉవ్వెత్తున లేచి పడే కెరటాల కరాళ నృత్యం చూసి కులదేవతని ప్రార్ధించుకుంటారు.. ఒకటి రెండు రోజుల్లో వాతావరణం శాంతించాక యధావిధిగా తమ నివాసాలు ఏర్పాటు చేసుకుని అమ్మ తమ కుటుంబాలను కాపాడినందుకు జాతర చేసుకుంటారు. ఆనందంతో నృత్యాలు చేస్తారు..పండగ చేసుకుంటారు.

వారి యాసలో చెప్పిన విషయం అంతా విని, మొత్తం కూడదీసుకుని ఒక అవగాహనకి వచ్చిన ఆ దంపతులు రొయ్యలు తీసుకుని  “ సరేనమ్మా వెళ్ళొస్తాము “ అంటూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

ఆ రోజుకి ఇంక అక్కడ కూర్చునే అవసరం వారికి కనిపించలేదు.. అందరూ లేచి వారి, వారి పిల్లలని గట్టిగా కేకేసి,,,, " రండి పిల్లకాయలూ వణ్ణం తినాల " అంటూ పిలుచుకుని వెళ్లారు.

అప్పన్న ఆరిపోయిన చుట్ట వెలిగిస్తూ " సిమాసలం శుక్కరారం పెయానం అయిదాముర్రా.. బోటులు తయారు చేయి" అన్నాడు.

" అత్నేలే పెద్దయ్యా... ఎల్తాములే... బుజ్జమ్మ లగ్గ పత్తిక రాసుకుంటాము.. అయ్యగారిని రమ్మని సెప్పినాను.. మరి డబ్బులు సాలవు.. ఎల్దాములే.. ఈ దఫా అన్నా ఒక పులస పడితే " పొయ్యిమీద కాల్చిన ఎండుచేప నములుతూ అన్నాడు సీమాసేలం.

ఫెళ్ళున నవ్వాడు అప్పన్న..." పులస .... మనకా.. దవలేశ్వరం దాటి పులస యాడ అచ్చేది. పీతలు, కొర్రమీను ఇయి దొరికేతే సాలు.. "

"పులస మా పసందుగా ఉంటాదిలే పెద్దయ్యా... ఎండి బొమ్మ మాదిరి..." పెంటయ్య అన్నాడు అప్పుడే తను పులస పులుసు తిన్నట్టు నోరు చప్పరిస్తూ..

పులస అనేది ఒక ప్రత్యేకమైన చేప.. చాలా ఖరీదైనది ...గోదావరి ముఖ్యంగా రాజమండ్రిలో మాత్రమే లభించే చేప. దాని ఖరీదు కిలో ఐదువేల దాకా ఉంటుంది. ఒక్కోసారి దాని డిమాండ్ ని బట్టి పదిహేను పదహారు వేలు కూడా పలుకుతుంది. సినిమా తారలు, రాజకీయ నాయకులు, బడా, బడా వ్యాపారులు విందుల్లో ప్రత్యేకంగా చేసుకుని తినే రుచికరమైన చేప. అది పట్టాలంటే చాలా నైపుణ్యం సహనం ఉండాలి. " పుస్తెలు అమ్మి అయినా పులస తినాలి" అంటారు. అంత విలువైన, అపురూపమైన పులస.. వర్షాకాలం ప్రారంభంలో ఇది లభిస్తుంది. రాజమండ్రి కాకుండా ఇది లభించే చోటు పశ్చిమ బెంగాల్ లోని హుబ్లీ. అక్కడ దాన్ని హిల్సా అంటారు. కొందరు జల ప్రేయసి అంటారు.. చేపలకి ఉన్న అందమైన పేరు జలపుష్పాలు..

పులస ప్రస్తావన రాగానే అందరికీ దాన్ని ఒక్కసారన్నా రుచి చూడాలన్న కోరిక కలిగింది. పులస దొరికినట్టు ఊహించుకుంటూ మౌనంగా ఉన్న మిత్రులను చూసిన అప్పన్నకి వాళ్ళ మీద, తన మీద కూడా ఎంతో జాలేసింది. నిట్టూర్చాడు.

వనమాడి సిద్దయ్య అన్నాడు.. " ఇప్పుడు మోటారు బోట్లు ఒచ్చినాయంట.. అవి కొనుక్కోతానికి పెబుత్వం అప్పులు ఇత్తున్నాదంట మనం కూడా మోటారు బొట్లు కొనుక్కోవాలిరా.. ఇట్టాంటి పడవల్లో ఎంతకాలం యాతాడతాము.. మా అయ్యా, మీ అయ్యా, మా తాత, మీ తాత మనమూ ఈ పడవల్లోనే బతుకీడుస్తా ఉన్నాము.. ".

" మోటారు బోటు నడపాలంటే జెట్టీలుండాల... మోటారు తిప్పడం మనకు రావాల..... మనకయన్నీ యాడ్నించి వత్తాయిలే పద, పద తెల్లారకుండానే పయానం గావాల " అప్పన్న అదిలింపుతో అందరూ ఉసూరుమంటూ లేచారు..

భార్యతో అప్పన్న తెల్లవారితే తాము చేయాల్సిన ప్రయాణం వివరాలు చెబుతూ " బియ్యం, పప్పులు మూటలు గట్టు.. తెల్లారకుండానే బయలుదేరి పోతాం" అన్నాడు.

మహా చెవుల్లో ఆ మాటలు దూరిపోయాయి. వాడు గెంతులేస్తూ వచ్చాడు తండ్రి దగ్గరకు....

" యాతకు నేనోత్తా" అన్నాడు.

" నువ్వేడకి నా తండ్రి... ఇప్పుడు ఎల్తే ఏనాటికి ఎనక్కి అత్తానో, అసలోత్తానో రాని బతుకాయే నాది.. మళ్లొచ్చినాక ఈడ్నే వలేద్దువులే అమ్మకాడ ఉండు " అన్నాడు కొడుకుని బుజ్జగిస్తూ.

"ఏందయ్యా ఆ మాటలు సుబమా అంటా ఎల్తా నోటికేమైనాది.. " రుద్ధమైన స్వరంతో అంది ఆదెమ్మ.

" అన్నంత మాత్రాన పోతానా ఏందీ.. అమ్మ దయ ఉండగా బయమెందుకే పిచ్చిదానా!" అన్నాడు తను నోరు జారి అన్నందుకు భార్య కళ్ళల్లో కన్నీరు చూసిన అప్పన్న.

" నేనోత్తా.. ఊ ఊ.. నేనోత్తా మారాం" మొదలుపెట్టాడు మహా.

అప్పుడప్పుడే వలలు వేయడం తండ్రి దగ్గర నేర్చుకుంటున్న మహాకి అదొక ఆట అయిపోయింది. అందుకే అప్పన్న బయలుదేరిన ప్రతిసారీ మారాం మొదలుపెడతాడు. సరదాగా ఒడ్డున కూర్చుని తను దగ్గర ఉండి వాడి, చిట్టి చిట్టి చేతులకి వల ఇచ్చి వేయించడం కాదుకదా పది రోజులు అన్నిటికీ తెగించి ఒక లక్ష్యంతో సముద్రం మధ్యలోకి వెళ్ళడం.. తమతోపాటు పిల్లల జీవితాలను కూడా లాటరీ వేయడం అప్పన్నకి ఏ మాత్రం ఇష్టం లేదు. అప్పన్నకే కాదు ఎవరికీ ఇష్టం లేదు.. అంత సాహసం చేయరు కూడా.

కానీ మహా తండ్రి మాట కాతరు చేయలేదు.. గట్టిగా  రాగం మొదలుపెట్టాడు.. అమ్మ దగ్గర ఏడ్చి తనకి కావాల్సినవి సాధించినట్టు తండ్రి దగ్గర కూడా సాధించవచ్చు అని వాడు అనుకుంటాడు. తీసుకుని వెళ్ళకపోతే ఏడవాలి.... ఏడిస్తే  అయ్య తీసుకుని వెళ్తాడు అని వాడి నమ్మకం.

తన మనసులో కోరిక  సావాసగాళ్ళ దగ్గర కూడా వెలిబుచ్చాడు ఎన్నోసార్లు  “ మన అయ్యలతో మనవూ ఎల్దాంరా సముద్దం  మజ్జలోకేల్తే ఎంత బాగుంతాదో!  సముద్దంలో పయానం ...పైన ఆకాసం , కింద నీల్లు తప్ప ఇంకేమి అగుపడ్డు ..పడవ సప్పుడుకి  సేపలు ఎగిరి పత్తాయంత.  ఎగిరే సేపను ఇత్త పత్తాలిరా బలేగుంటది ” మెరిసే కళ్ళతో అరచేయి వలలా చాపి ఒంగి నీళ్ళల్లో నుంచి చేపను లాగినట్టు అభినయించాడు.

“అమ్మో! నాకు బయం రా... నువ్వేల్లు” అన్నారు వాళ్ళు.

మహాకి వాళ్ళ పిరికితనం చూస్తుంటే కోపం వచ్చింది. “ నేను ఎల్లివచ్చి కతలు, కతలుగా సేప్పానంతే ఈ పిరికి నాయాలకి అప్పుడు తెలుత్తాది” అనుకున్నాడు. ఎలాగైనా సరే వెళ్ళాలి అని ఆరోజే  నిశ్చయించుకున్నాడు. అందుకే ఇవాళ మొండికేయసాగాడు.

ఆదెమ్మకి వాడిని ఓదార్చేసరికి తలప్రాణం తోక్కి వచ్చింది. చివరికి “ ఎల్దువు గానిలే ఏడవమాక” అంటూ ఓదార్చి బలవంతంగా తినిపించి పడుకోబెట్టింది.

మరునాడు నాలుగు అవుతుండగానే లేచి మొహం కడుక్కుని  తినుబండారాలు, మంచినీళ్ళ డ్రమ్ములు తీసుకుని భార్యకి చెప్పి కొడుకు బుగ్గ మీద నిశ్శబ్దంగా ముద్దు పెట్టుకుని బయలుదేరాడు అప్పన్న.

ఆదేమ్మ గుడిసె బయట నిలబడి నిశ్శబ్దంగా నిద్రపోతున్న సముద్రాన్ని దూరం నుంచి చూసి రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టుకుంది.. “నా పెనిమిటిని, ఆయనతో వెళ్తున్న వారిని క్షేమంగా తీసుకురా సముద్రుడా” అని వేడుకుంటూ.

అప్పన్న దూరం అవగానే తలెత్తి ఆకాశం వైపు చూసింది.. మినుకు, మినుకుమనే తారలూ కొంచెం సూరీడుని పిలిచి చెప్పండి నా పెనిమిటికి ఎలుగు పంచుతా ఎనకే పొమ్మని.. తారలు ఫక్కున నవ్వినట్టు అనిపించింది.  నిట్టూరుస్తూ గుడిసె లొపలికి నడిచింది.

అదే విషయం ఆలోచిస్తూ పడుకున్నాడేమో మహా, మధ్య, మధ్య అయ్యా నేనోత్తా అంటూ కలవరిస్తుంటే పిచ్చి తండ్రి అని ముద్దుగా విసుక్కుంటూ వాడి పక్కన పడుకుని నెమ్మదిగా మరోసారి నిద్రలోకి జారింది ఆదేమ్మ.

తెల్లారాక నిద్రలేచిన మహా, పక్కన తండ్రి లేకపోడంతో " అయ్యా...అయ్యా " అంటూ గుడిసె బయటకి పరిగెత్తాడు. సూర్యోదయం అయింది.. తూర్పున ఉదయించిన సూర్యబింబం అప్పుడు రంగులు మార్చుకుంటూ ఆకాశంలో వెలుగు పూలు వెదజల్లుతోంది. దూరంగా సముద్రంలో అలికిడి మొదలైంది. కెరటాలు శబ్దం చేస్తూ తీరానికి ఒరుసుకుని వస్తున్నాయి. అయ్యా అని అరుస్తూ సముద్రం దగ్గరకు పరిగెత్తబోతున్న కొడుకుని గోలెం లో నీళ్ళు నింపుతున్న ఆదెమ్మ చప్పున పట్టుకుని, బుజ్జగిస్తూ చెప్పసాగింది.

" యాడకిరా అబ్బాయ్ నువ్వేల్లేది... ఊరుకో. అయ్యా శాపలు తెచ్చేత్తాడులే కమ్మగా కూరొండి పెడతా! అయినా అన్ని రోజులు సంద్రంలో ప్రయాణం అంటే మాటలేంటి! నీకు ఆడుకోడానికి సావాసగాల్లుండరు...వణ్ణం పెత్తే వాళ్ళుండరు.. నువ్వే తినాల. సిరుతిండి ఉండదాయే. ఇట్నే ఉండి మంచి, మంచి గవ్వలేరు. లచ్చుమ్మత్తకి యిత్తే బొమ్మలు సేసిత్తది ఆడుకోవచ్చు. పీచు మిఠాయి, జీల్లు కొనుక్కోవచ్చు.. నా మాట ఇను. నేను పెద్ద, పెద్ద ఆల్చిప్పలు, ముత్యపు చిప్పలు తెత్తాలే యాతంటావు నా బుజ్జికదా!" వాడిని బుజ్జగించి, లాలించి, ఆశపెట్టి మొహం కడిగించి గంజి తాగించింది ఆదెమ్మ.. కానీ వాడి మనసులో బలంగా ఉన్న కోరికని మాత్రం తుడిచేయలేకపోయింది.

మహాకి ఉక్రోషం వచ్చింది... ఏడుపు వచ్చింది. తండ్రి తనని తీసుకెళ్ళకుండా వెళ్ళిపోవడం వాడికి నచ్చలేదు. తండ్రి మీద విపరీతమైన కోపం ముంచుకు వచ్చింది. వేగంగా పరిగెత్తుకుంటూ సముద్రం దగ్గరకు వెళ్ళాడు.. వలలను కట్టేసే దగ్గర నిలబడి బోటు కదలికలకు సుడులు తిరుగుతూ అందమైన ఆకారాలలో కనిపిస్తున్న అలల మీద తాను ప్రయాణిస్తూ వల వేస్తున్నట్టు ఊహించుకుంటూ అక్కడే నిలబడ్డాడు.

ఉధృతంగా ఎగసిపడిన అలలా వాడికి దుఃఖం పెల్లుబికింది. చాలాసేపు ఏడుస్తూ ఉండిపోయాడు. ఈ లోగా యధావిధిగా తోటి పిల్లలు గుంపుగా రావడంతో చొక్కాతో కళ్ళు తుడుచుకుని, దూరంగా ఇసకలో పొర్లుతున్నవాళ్ళవైపు పరిగెత్తుకుంటూ వెళ్లి వాళ్ళతో పాటు ఇసకలో దోర్లసాగాడు.

అలా కొంతసేపు దొర్లాక పిల్లలంతా లేచి ఒంటికి అంటుకున్న ఇసక దులుపుకుని గవ్వలేరుకుంటుంటే తనూ లేచి వెళ్లి వాళ్ళతో కలిసిపోయాడు. ఆటలయాక ఆకలేసి గుడిసెకి వెళ్లి చద్దన్నం తిని మళ్ళీ వచ్చి కాసేపు కెరటాలతో ఆడుకుని, తడిసిన లాగూ ఆరబెట్టుకోడానికి కాళ్ళు జాపుకుని ఇసకలో కూర్చున్నాడు. వాడికి ఇసకలో ఆడుకోడం కూడా చాలా ఇష్టం. ఆ ఇసకలో సున్నాలు చుడతాడు.. గీతలు గీస్తాడు.. ఒక్కోసారి గీతలు, సున్నాలు కలిపేస్తాడు. రెండూ కలిసిన తమాషా ఆకారాలను చూసి మురిసిపోతాడు. పెద్ద, పెద్ద అలలు వచ్చి ఆ ఆకారాలను తుడిచి వెళ్లిపోతే మళ్ళీ గీస్తాడు.

అలాగే ఇప్పుడూ గీతలు గీయసాగాడు. ముందు ఒక గీత నిలువుగా ఒకటో నెంబర్ లాగా గీశాడు.. ఆ గీత కింద మూడో అంకె తిప్పి గీశాడు. అదే అంకె మరోవైపు గీశాడు.. ఆ ఆకారం చూస్తే వాడికి క్యాలండర్ లో ఉన్న లక్ష్మీదేవి బొమ్మ పెదాలు గుర్తుకు వచ్చాయి. వాటి చుట్టూ గుండ్రంగా పెద్ద సున్నా చుట్టాడు. కళ్ల భాగంలో అరసున్నలు గీశాడు. వాడి కళ్ళల్లో మెరుపు మెరిసింది. తను ఒక మొహం గీశానని వాడికి అవగాహన కలిగింది.

ఇంతలో పరిగెత్తుకుంటూ వచ్చారు పిల్లలు. “మాగాడు బొమ్మలు గీత్తున్నాడోయ్ “ అంటూ కాలితో ఆ బొమ్మ చెరిపేసి పారిపోయారు.

**ప్రతి వైఫల్యం విజయానికి ఒక సోపానం.**

కొన్ని విజయాలు అవమానం నుంచే ఊపిరి పోసుకుంటాయి. అవమానం ఉక్రోషం కలిగిస్తే, ఆ ఉక్రోషం పట్టుదల పెంచుతుంది. ఆ పట్టుదల స్ఫూర్తిని కలిగిస్తుంది. ఆ స్ఫూర్తే ఎందరినో అనేక రంగాలలో అత్యున్నత స్థానంలో నిలబెట్టింది. భావోద్వేగాలకి ఎవరూ అతీతులు కారు. వయసు, ఆస్తి, అంతస్తు, కులం, మతం అనే తారతమ్యాలు ఉండవు.

ఆనాడు మాగాడికి తానొక కళాకారుడిగా గుర్తింపబడతానని తెలియదు. అసలు కళ అన్నా, కళాకారుడు అన్నా అర్థం తెలియదు.. కానీ స్నేహితులు చేసిన ఎగతాళి వాడిలో ఒక పట్టుదలకి పునాది వేసింది. చదువు, సంధ్యా, నాగరికత ఎరుగని ఆ లేత మనసు తాను ఎంతో కష్టపడి చేసిన బొమ్మని తన స్నేహితులే అలా కాళ్లతో తొక్కి చిందర,వందర చేయడంతో తన గుండెలమీదే వాళ్ళు అలా తొక్కినట్టు విలవిలలాడింది. ముందు బావురుమని ఏడ్చాడు.. తరవాత వాళ్ళు చెల్లా చెదరు చేసిన ఆ ఇసక మరింత కచ్చగా అటూ, ఇటూ తొక్కి, తొక్కి గుప్పిళ్ల తో తీసి నీటివైపు విసరసాగాడు. తీరాన్ని దాటి తను వేసిన బొమ్మలని తనతో లాక్కుని వెళ్తున్న కెరటాలు కూడా తన స్నేహితుల్లాగే తన ఆశలని చెల్లా చెదురు చేసినట్టు బాధపడ్డాడు. ఆ తరవాత ఏం చేయాలో తెలియక కింద కూలబడి మోకాళ్ళలో తల దూర్చి కుళ్ళి, కుళ్ళి ఏడవసాగాడు.

నలుగురు కుర్రాళ్ళు బిగ్గరగా నవ్వుతూ రెండు కాళ్లతో తన బొమ్మ తొక్కేసిన వైనం పదే, పదే కళ్లముందు కనిపిస్తూ ఉంటే వాడికే ఇదమిద్ధంగా తెలియని పంతంగా మారింది. ఆ బొమ్మే ఇంకా బాగా వేయడానికి రక,రకాల మొహాలు గుర్తుకు తెచ్చుకోసాగాడు. హటాత్తుగా వాడి కళ్ళ ముందు లచ్చమ్మత్త గవ్వలతో చేసిన వినాయకుడి బొమ్మ

కదిలింది. ఏనుగు కళ్ళు, పెద్ద తొండం, పెద్ద చెవులు, పెద్ద పొట్ట ఒకొక్కటే గుర్తుచేసుకుంటూ ఇసకలో గీతలు గీయసాగాడు. వాడి చేతులు చక,చకా కదులుతున్నాయి.. ఏకాగ్రతతో ఇసక మీదే దృష్టి కేంద్రీకరించి చెవులు, తొండం, కళ్ళు గీసాడు. ఇంతలో ఓ పెద్ద కెరటం వచ్చి వాడి బొమ్మ ఒరుసుకుని వెళ్ళిపోయింది. మహాకి మహా కోపం వచ్చింది.

ఆ క్షణంలో వాడు చదువు, సంధ్య లేని ఒక జాలరి కాదు.. ఎవరికీ తెలియని ఒక అద్భుతాన్ని ఏదో తనే సృష్టించి తనని చూసి గేలి చేసిన మిత్రుల దృష్టి లో ఒక మేధావిగా గుర్తింపబడడానికి తీవ్రమైన కృషి చేస్తున్న కృషీవలుడు. చెరపడం, గీయడం, చెరపడం గీయడం .. ఆ తడి ఇసక మీద అనేక రకాల ఆకారాలు వస్తున్నాయి.. పోతున్నాయి.

సంధ్యా దేవి నీలిరంగు మెలిముసుగు సవరించుకుంటూ ఆ తొమ్మిదేళ్ల అమాయకపు బాలుడు ఏం చేస్తున్నాడో అని చూడడానికి వయ్యారంగా తన చెలులయిన మేఘమాలికలను వెంటేసుకుని వచ్చింది. సూర్యుడు కాసిని కెంపులను, మరి కొన్ని బంగారు తీగలను విసురుతూ పడమట వైపు బయలు దేరాడు. నల్లని వస్త్రాలను సవరించుకుంటున్న నిశాకాంతని కాసేపు ఆగమని చిరునవ్వుతో సైగ చేసింది సంధ్య.

మాగాడు బొమ్మ పూర్తి చేశాడు. ఒళ్ళంతా ఇసక కాళ్ళు, చేతులు, బట్టలు, మొహం, జుట్టు పసిడిచూర్ణం లా మెరిసి పోతోంది. లేచి నిలబడ్డాడు. వాడి కళ్ళల్లో తృప్తి, ఆనందం, అనుకున్నది సాధించానన్న అతిశయం. స్పష్టంగా లచ్చమ్మత్త చేసిన గవ్వల బొమ్మలాగా ఉంది.

మహాకి బోలెడంత సంతోషం కలిగింది. పరిగెత్తుకుంటూ గుడిసెకీ వెళ్ళాడు. ఎండు చేపలు వేయిస్తోంది ఆదేమ్మ.. ఆవిడ చేయి పట్టుకుని లాగాడు.

“ యాడకి బిడ్డా.. ఆగు నాయనా.. ఏమైనాది రా నీకు?” అని రక,రకాలుగా వారిస్తున్న ఆమెని బలవంతంగా లాక్కెళ్లి తను చేసిన బొమ్మ చూపించాడు.. “బొమ్మేశా” అన్నాడు.

ఆవిడ అబ్బురంగా చూసింది.. మురిపెంగా చూసింది.. మెటికలు విరుస్తూ కొడుకుని ముద్దు పెట్టుకుని “నా తండ్రే, నా తండ్రే ఈనాయకుడి బొమ్మేసినావా! దేవుడి బొమ్మేసినావా! ఆ దేవుడు నిన్ను సల్లగా సూస్తాడు నాయనా! సల్లగా సూస్తాడు..” అంది ఉద్విగ్నంగా. వాడు కళ్ళు విశాలం చేసి బొమ్మ వైపే చూస్తున్నాడు.

“ దా పోదాం వన్నం తిందువు” కొడుకు కష్టపడ్డాడు వాడికి కచ్చితంగా ఆకలివేస్తోంది అనుకుంది ఆ తల్లి హృదయం.. కానీ అనుకున్నది సాధించిన ఆనందంతో వాడి కడుపు, మనసు కూడా నిండుగా ఉండడంతో “నువ్వు పో.. నాకిప్పుడేమొద్దు “ అన్నాడు ఆవిడ చేయి విడిపించుకుని.

"సరేలే.. నీకు ఆకలైనప్పుడే రాలే " అంటూ తృప్తి నిండిన కళ్ళతో తిరిగి, తిరిగి కొడుకుని చూసుకుంటూ గుడిసె వైపు వెళ్ళిపోయింది ఆదేమ్మ.

మహా కాళ్ళు భూమి మీద నిలవలేదు.. అమాంతంగా గేలిచేసిన స్నేహితులని లాక్కొచ్చి ఆ బొమ్మ చూపించాలి. తలెత్తి దూరంగా ఆడుకుంటున్న కుర్రాళ్లను చూశాడు. తను గట్టిగా అరిచినా వినిపించుకునే దూరంలో లేరు. దగ్గరకు వెళ్ళి పిలవాలి. మరోసారి బొమ్మ చూశాడు. వినాయకుడి కళ్ళు తననే చూస్తున్నట్టు అనిపించింది. గబుక్కున ఇసకలో కూర్చుని మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టుకుని, గడ్డం మోకాలికి ఆనించి మెరిసే కళ్ళతో ఆ బొమ్మవైపే చూస్తూ కూర్చున్నాడు. చిన్న, చిన్న వెలుగు పూలు రాలుతున్నాయి బొమ్మ మీద. వాడి మనసు ఆగలేదు..వెంటనే తన సత్తా ఏంటో స్నేహితులకి చూపించి గేలిచేసిన ఆ పెదవులతో " అబ్బా ఎంత బాగా ఏసినావురా అనే మాట వినాలి. " ఇప్పుడు సూపించాలీ నాయాలకి" అనుకున్నాడు.

చివ్వున లేచి నిలబడి రెండు చేతులూ శంఖంలా చేసి నోటికి అడ్డంగా పెట్టుకుని " ఓ ఓ " అని గట్టిగా శబ్దం చేశాడు.

ఆ శబ్దం బహుశా ఆ క్షణంలో యుద్ధానికి సన్నద్ధం కమ్మని విజయుడు చేసిన దేవదత్తం నాదంలా వినిపించినట్టు ఉంది కాబోలు దానికి ప్రతిధ్వనిగా వాళ్ళూ గట్టిగా అరిచారు.

రండి అన్నట్టు చేయి ఊపాడు.

" ఏటిరా మాగా! సీకటడుతున్నది మేం పోతన్నాం.. నువ్వూ దా .."

దానికి సమాధానంగా మరింత గట్టిగా అరిచాడు. వాళ్ళు నాలుగు వేళ్ళు మూసి బొటనవేలు చూపిస్తూ "ఏంటి" అన్నారు. "ఇలరండి " చేయి ఊపాడు దగ్గరకు రండి అన్నట్టు.

అప్పటికే వింతని చూడరండి అని పిలిచినట్టు నిశాకాంత సంధ్యని తోసుకుంటూ వచ్చింది.. ఎంతసేపటి నుంచి ఎదురుచూస్తున్నాడో చంద్రుడు సరసానికి వేళ అయింది అన్నట్టు తానూ మబ్బులను తొలగించుకుంటూ మెల్లగా రాసాగాడు. చంద్రుడిని చూసిన సాగరం పరవళ్ళు తొక్కడం మొదలుపెట్టింది.

"అలలొచ్చేత్తన్నాయి .. బొమ్మని ఈడసక పోతాయో ఏమో" దిగులుగా అనుకుంటూ గబుక్కున బొమ్మకి అడ్డంగా ఇసకలో బోర్లా పడుకున్నాడు. కెరటాల వైపు ప్రాధేయపడుతున్నట్టు చూస్తూ .. "నా సావాసగాల్లు నాను బొమ్మేసీనాని సూసిందాక ఎత్తుకెల్లమాక " మౌనంగా మాట్లాడాడు.

అల్లరి కెరటాలు ఆగుతాయా.. వాటికేం తెలుసు ఆ పసి మనసు పడిన బాధా, చేసిన కృషి.. నిర్దయగా వాడి స్నేహితులు పరిగెత్తుకుని వచ్చేలోగా ఆ బొమ్మని లాక్కుని వెళ్ళిపోయాయి.

అంతే! సముద్రం కాదు వాడి గుండె విరిగిపడింది.. బావురుమంటూ తడి ఇసక చేతుల్లోకి తీసుకుని బిగ్గరగా ఏడవసాగాడు.

పరిగెత్తుకొచ్చిన పిల్లలు "ఏరా! ఏటి రమ్మన్నా ... ఎటైనాదేటి ఏడుత్తున్నావే" అని మోకాళ్ళ మీద కూర్చుని వాడి భుజాలు పట్టుకుని ఊపారు. వాడి ఏడుపు ఆగలేదు.. వాళ్ళు మరింత గట్టిగా ఊపుతూ " ఏమైనాదిరా " అంటూ పదే పదే అడుగుతున్నా కొద్దీ వాడి దుఃఖం ఉధృతం కాసాగింది.

వాళ్ళు విసిగిపోయారు.. అలసిపోయారు ..

"సర్లే ఏడువ్ మేమెలతన్నాం " అని వెళ్లిపోడానికి లేస్తుంటే వెక్కుతూ అన్నాడు.

" ఇనాయకుడి బొమ్మ ఏసెనురా.. ఎదవ అలలు– ఎదవ అల్లలని ఎత్తుకెల్లి పోయినాయా " .

" బొమ్మేత్తుకేల్లాయా అలలు..." అంటూ పగలబడి నవ్వసాగారు ఆ పిల్లలు.

వాళ్ళు ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాని మహా ఉక్రోషంగా చూసాడు. " ఏటిరా ఎందుకల్లగ పల్లికిలిత్తున్నారు" అన్నాడు కన్నీళ్లు జలజలా రాలుతుంటే.

"నువ్వు బొమ్మేసేవేటి ... ఇనాయకుడి బొమ్మేసేవా ... "

"అవును ఎసేను.. మీకు నవ్వులాటగా ఉందేంటి– మల్లి ఏయనా " రెండు చేతులతో ఇసక దగ్గరకి జరుపుకోడానికి ఒంగిన కొడుకుని లేవనెత్తి " సాల్లేరా ఎదవల్లారా.. ఆడ్ని ఏడిపించమాకండి..నిజంగానే నా కొడుకు ఈనాయకుడి బొమ్మేసినాడు.. ఎంత ఇవరంగా ఎసినాడో .. అలలొచ్చి తుడిసిపెట్టినాయి.." చీకటి చిక్కగా అలుముకోడంతో ఇంకా రాని కొడుకుకోసం తిరిగి వచ్చిన ఆదేమ్మ ఆ పిల్లలని కసురుతూ కొడుకుని దగ్గరకు తీసుకుని పిల్లలని కసిరి "పొండి " అంటూ గుడిసె వైపు నడవసాగింది.

అది చూసిన పిల్లలంతా చప్పట్లు కొట్టి " మా గాడు బొమ్మేసేడొచ్" అని అరచుకుంటూ పరిగెత్తారు తల్లులకు చెప్పడానికి.

ఉక్రోషంతో వాడి మనసు ఉడికిపోయింది. తను ఎంతో కష్టపడి వేసిన బొమ్మ రెండుసార్లు నేలపాలు కావడంతో వాడి చిన్నారి గుండె తల్లడిల్లి పోసాగింది.

ఆ రాత్రంతా వాడి కలల్లో వినాయకుడి బొమ్మలే రక,రకాల భంగిమల్లో కనిపిస్తూ కలత నిద్రకి గురి అయాడు. తెల్లవారి లేస్తూనే మొహం కూడా కడుక్కోకుండా, తల్లి పిలుస్తున్నా వినిపించుకోకుండా ఇసకలోకి పరిగెత్తుకుని వెళ్ళాడు. మరీ తీరం వెంబడి కాకుండా కొంచెం ఎడంగా  కూర్చుని పెదాలు బిగించి, కళ్ళు చికిలించి తదేక దృష్టితో  కలలో కనిపించిన రూపాలు గుర్తుకు తెచ్చుకుంటూ మరింత అందంగా, స్పష్టంగా, జీవం ఉట్టిపడేలాగా, బొజ్జగణపతి కైలాసం నుంచి దిగి వచ్చి సముద్రపు ఒడ్డున కూర్చుని పరిసరాల సౌందర్యం వీక్షిస్తున్నట్టు మరో బొమ్మ గీశాడు.

బొమ్మ పూర్తి అవగానే లేచి నిలబడి బొమ్మ చుట్టూ తిరుగుతూ అన్ని కోణాల్లో ఎలా ఉందో చూస్తూ ఉండగా నిద్రమొహంతో వెళ్ళిన కొడుకు ఇంకా రాలేదు అనుకుంటూ  పడుతూ లేస్తూ వచ్చిన ఆదెమ్మ ఆ బొమ్మ చూసి నిశ్చేష్టురాలైంది. ఆ దేవదేవుడే తన కొడుకు చేతి వేళ్ళ మీద నర్తిస్తూ ఆ బొమ్మ గీయించాడేమో అన్నట్టు వెర్రిగా చూస్తూ నిలబడిపోయింది.

ఆవిడ చీర కుచ్చెళ్ళు పట్టుకుని ఊపుతూ బాందా అని అడిగాడు మహా. ఆమె గబుక్కున కొడుకుని ఎత్తుకుని ముద్దు పెట్టుకుని "నా తండ్రే, నా తండ్రే" అంటూ రెండు చేతులు వాడి మొహం చుట్టూ తిప్పి మెటికలు విరిచింది. గబుక్కున వాడిని దించి,  గబ,గబా పరుగులాంటి నడకతో వెళ్ళి  పొదలమీద పడేసిన చినిగిన వల తీసుకొచ్చి ఆ బొమ్మ మీద కప్పింది.

"అమ్మా ఎర్రోడికి, శీనుగాడికి సూపిత్తానే" అన్నాడు.

"అలగెలే .. పద" అంటూ వాడి చేయి పట్టుకుని చుట్టూ పక్కల ఉన్న గుడిసెల వైపు నడిచి గట్టిగా అరిచి చెప్పసాగింది.  " చుక్కమ్మా , పెంచలమ్మా , లచమ్మా.. అరే గుంటలూ రండీరా.. నా కొడుకు ఇనాయకుడి బొమ్మేసినాడు రాండి సూడండి.."

కాసేపట్లో ఆడవాళ్ళు, పిల్లలు బిలబిలలాడుతూ  గుడిసెల బయటకు వచ్చి ఆదేమ్మ చూపించిన వైపు పరుగులు పెట్టారు.

మహాకి గర్వంగా అనిపించింది. ' నాను రేపటి నుంచీ సేపలు పట్టడానికి ఎల్లక్కరలేదు.. బొమ్మేసుకుంటా ఇలనే కూసుని' అనుకున్నాడు. తల్లి చేయి విడిపించుకుని  చేతికి, కాళ్ళకి అంటిన ఇసక దులుపుకుంటూ గుడిసె వైపు పరిగెత్తాడు.

అయితే తిరిగి వాడు అక్కడికి వచ్చేసరికి గాలి వలని దూరంగా విసిరి వినాయకుడికి వీవనలు వీస్తే, కెరటాలు పాదాలు కడగడానికి తమతో తీసుకుని వెళ్ళాయి.

ఆనవాలు మాత్రం మిగిలిన అదే చోట మరోసారి అదే బొమ్మ గీయడానికి కూర్చున్నాడు కానీ ఆ బొమ్మ కనిపించలేదని దిగులు చెందలేదు.. తాను సాధించిన ఘనకార్యం నేస్తాలు చూశారు.. తను బొమ్మ గీయగలడని వాళ్ళు తెలుసుకున్నారు. అదిచాలు అనుకున్నాడేమో ప్రశాంతమైన మనసుతో కూర్చుని మరోసారి అదే బొమ్మ కోసం ఇసకను రెండు చేతులతో దగ్గరగా లాక్కున్నాడు.

ఇప్పుడు వాడి మనసు సమస్త జీవనసారం అర్థం చేసుకున్న యోగీశ్వరుడి మనసులా నిశ్చలంగా, నిర్మలంగా ఉంది.

తండ్రి వచ్చేదాకా రోజూ ఒడ్డుకి వెళ్లి బొమ్మలు గీయడం వాడికి ఒక ఆటగానూ, అలవాటుగానూ మారింది . వాడు గీయడం, కెరటాలు లాక్కుని వెళ్ళడం.. చాలా మామూలుగా అనిపిస్తోంది. ఒక్కోసారి బొమ్మ వేయడం పూర్తి అయాక అక్కడే మోకాళ్ళ చుట్టూ రెండు చేతులూ పేనవేసుకుని కూర్చుని కెరటాలు వచ్చి ఆ వినాయకుడి బొమ్మని నిమజ్జనం చేసుకునే వరకు అలా నిశ్చలంగా చూస్తూ ఉండిపోయి, గుడిసెకి వెళ్ళిపోవడం వాడి దినచర్య.

గుడిసెలో మట్టిగోడకి ఒక పాత కాలండర్ వేలాడుతూ ఉంటుంది. ఎప్పటిదో, ఎవరో కొట్టువాడు ఇచ్చిన కాలండర్. సుమారు పదిపేజీలు ఉంటాయి.. అందులో వినాయకుడు, గోవుని ఆనుకుని నిలబడి వేణువూదే కృష్ణుడు, ఆంజనేయ స్వామి, ఒక చేతిలో తామరపూవు, మరో చేతిలో నాణాలు కురిపిస్తూ మహాలక్ష్మి బొమ్మలున్నాయి,. ఆ కాలండర్ తీసుకుని వెళ్లి, ఆ బొమ్మలు చూస్తూ ఒక్కోరోజు ఒక్కో బొమ్మ ఆ ఇసకలో వేయసాగాడు. కొన్ని వంకర లేకుండా చక్కగా వస్తే, కొన్ని సరిగా రావడంలేదు. బాగా రానివి అలలు వచ్చి తోసుకుని వెళ్ళిందాకా చూస్తూ కూర్చుని మళ్ళీ గీస్తాడు. క్రమంగా వాడికి తాను వేసే బొమ్మల మీద ఆసక్తి ఎక్కువ కాసాగింది. స్నేహితులతో ఆడుకోడం, ఇసకలో గవ్వలేరడం, అమ్మని విసిగించడం లాంటివి చేయడం లేదు. చద్దన్నం తిని తీరానికి కొంచెం దూరంగా కూర్చుని బొమ్మలేయడం ఒక వ్యాపకంలా మారింది వాడికి. ఆ సైకత శిల్పాల మధ్య వాడికి తెలియకుండానే కాలం పరుగులు పెడుతోంది.

" I never dreamed about success I worked for it " ఆ మాటలు ఎవరన్నారో, వాటి అర్థం ఏమిటో, వాటి విలువ ఏమిటో తెలియని మాగాడు ఇప్పుడు కలలు కనడం రాని కృషీవలుడు.

ఇదివరకులా అదికావాలి, ఇది కావాలి అంటూ మారాం చేయకుండా ఏది పెడితే అది తిని బొమ్మలేసుకుంటూ కూర్చుంటున్న కొడుకు వల్ల తనకి ఎలాంటి చికాకూ లేకపోడంతో  కొడుకు ఆటలు చూస్తూ భర్త తెచ్చే చేపలకోసం చూస్తూ తోటి బెస్త స్త్రీలతో ఒడ్డున కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ గడుపుతోంది ఆదెమ్మ.

పదిరోజులు చక,చకా గడిచిపోయాయి. వేటకి వెళ్ళిన వాళ్ళంతా పెద్ద, పెద్ద చేపలతో వచ్చేశారు. ఆడవాళ్ళంతా చుట్టు పక్కల గ్రామాల్లో మర్నాటికల్లా అన్నీ అమ్ముకొచ్చారు.

అందరూ కలిసి చేపల పులుసు, కూర వండుకుని జాతర చేసుకున్నారు.. పాటలు పాడారు.. నృత్యాలు చేసారు.. కల్లు తాగారు.. చుట్టు పక్కల చిట్టడవుల్లోని పక్షులు, జంతువులు పిలవని పేరంటాళ్ళలా రంగు, రంగు చీరలు ధరించి మేనంతా వెన్నెల పడి మెరుపులు అద్దుతుంటే వచ్చి ఆ వినోదం చూస్తున్నట్టు మగపిల్లలు, ఆడపిల్లలు ఉత్సాహంగా చిందులేశారు ..

సముద్రుడు  తన దారిన తను అలలతో పరుగులు పెడుతూ, పున్నమి చంద్రుడిని వెన్నెలతో సహా తనలోకి ఇముడ్చుకుంటూ, అర్ధరాత్రిళ్లు ఆ ఊళ్ళ జనాలకి తన ఘోషతో జోలపాడుతూ, పిల్లలతో కేరింతలు కొడుతూ , ఒడ్డున ఉన్న ఇసుకని ఒరుసుకుంటూ నురగలు గక్కుతూ తనపని తను చేసుకుంటున్నాడు.  ఆడి, ఆడి అలసిన ప్రకృతి సోయలేకుండా పడుకుని సోయగాలు వెదజల్లుతున్నట్టు సద్దుమణగిన గుడిసెలు నిశ్శబ్దంగా మారుతూ ఉంటే చుక్కలన్నీ దిక్కులు చూస్తూ ఉంటాయి.

నాలుగు రోజుల తరవాత  ఒక సాయంత్రం...

నావలో కూర్చుని పల్లె పదాలు పాడుకుంటున్నారు అప్పన్న అతని మిత్ర బృందం. పిల్లలంతా చొక్కాలు లేకుండా చుట్టూ ఉన్న సర్వీ చెట్లల్లోకి పరుగులు పెడుతూ, దొంగాటలు ఆడుతూ, జీడి పిక్కలు ఏరుకుంటూ, కొందరు ఇసకలో దొర్లుతూ సందడిగా ఉంది. గాలికి ఊగుతూ చెట్లు నాట్యం చేస్తున్నాయి.  గాలి విపరీతంగా వీస్తోంది. ఆడవాళ్ళు గుంపుగా కూర్చుని "అతెల్ల మాకండిరా ... ఇతెల్ల మాకండిరా" అని మధ్య, మధ్య పిల్లలను మందలిస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

" ఊల్లోకి ఎవురో దొరొచ్చినాడట ... పెద్ద బంగళాలో దిగినాదంత" తనకు తెలిసిన కొత్త వార్త చెప్పడానికి ఉత్సాహపడుతూ అన్నాడు ఎర్రయ్య.

అప్పుడే వచ్చాడు విస్సబాబు...సూటు, బూటు నిగ, నిగలాడే నల్లని విగ్రహం.. అతన్ని చూడగానే పాటలాపేసి లేచారు మిత్రబృందం.

"అరేయ్ అప్పన్నెవరు? అనడిగాడు వస్తూనే.

అతని సూటు, బూటు చూసి " ఆయ్ నేనేనండి" అంటూ లేచి చేతులు కట్టుకుని నిలబడ్డాడు అప్పన్న.

" ఈ గూడేనికి పెద్దవి నీవేనంటగా " అడిగాడు కళ్ళు చికిలించి చూస్తూ..

" ఆయ్ ... వయసులో పెద్దోన్ని లెండి దొరా" అన్నాడు అప్పన్న మొహమాటంగా..

" ఏదైతే ఏంలే గాని.. ఎన్ని బోటులున్నాయిరా మీ దగ్గర " అడిగాడు కొంచెం ఎడంగా విశ్రాంతి తీసుకుంటున్న పడవలను చూస్తూ.

" ఆయ్ మా అందరికీ కలిపి రెండున్నాయండి.. ఇంకోటి ఆ సిద్దప్పగాడి తాతదండి..పూర్తిగా సినిగిపోనాదండి " వినయంగా చెప్పాడు.

"ఎంత దూరం పోతారురా యాటకి" అడిగాడు మళ్ళీ విస్సబాబు.

అప్పన్న మిగతా వాళ్ళ వైపు చూసాడు. వాళ్ళు కూడా లేచి నిలబడి, కొన్ని క్షణాలు ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకుని " ఎంత లెండి బాబు ఐదారు కోసులు ఎల్తే సాలు..మా బోతుల్లో ఎంత దూరం ఎల్లగలం! గాలి తిరగబడితే ఎనక్కి మల్లతమే " అన్నాడు.

విస్సబాబు పడవల వైపు నడిచాడు. జాలర్లంతా అతని వెనకాలే నడుస్తూ ఇతను ఎవరు అన్నట్టు ఒకరికి ఒకరు సంజ్ఞలు చేసుకున్నారు.

విస్సబాబు అప్పన్న బోటు దగ్గరగా నడిచి జీర్ణావస్థలో ఉన్న బోటు చూస్తూ " బాగా పాత పడవ కదరా! దీన్లో ఎలాగెల్తన్నారు ... ప్రాణాలకి ప్రమాదం కాదూ" అన్నాడు.

తాతల కాలం నాటి పడవనే ఇంకా నడిపిస్తున్న అప్పన్న విస్సబాబు మాటలకి ఏమని సమాధానం చెప్పాలో తెలియక చేతులు నలుపుకుంటూ "ఆయ్ " అన్నాడు.

"అయినా ఈ నాటు పడవల కాలం పోయింది..మర పడవలొచ్చినాయి.. నేను బాడిక్కి మర పడవిస్తా కట్టుకోండి" అన్నాడు.

" బాడిక్కా !" అందరి మొహాల్లో వింత సంతోషం.

" బాడిగెంత బాబయా " అడిగాడు సిద్ధప్ప కుతూహలం అణచుకోలేక.

" ఎంతో ఏముందిలే తరవాత చెప్తాను.. అది సరే! మీకెవరికన్నా ఎదిగిన కొడుకులుండారా !"

అందరూ మొహాలు చూసుకున్నారు. ఆ మొహాల్లో అనేక సందేహాలు.. అప్పన్న అడిగాడు. " ఎందుకు బాబూ!"

"వయసులో ఉన్నవాళ్లుంటే మీ కొడుకులను బయట దేశాలకు పంపిస్తా.. సంపాదన చాలా ఉంటుంది..ఎంతమంది ఉన్నారు మీకు పిల్లలు."

" బయటి దేశాలకా.." అందరూ ఒకేసారి ఆశ్చర్యంగా చూసారు విస్సబాబు వైపు.

విస్సబాబు వాళ్ళ మొహాల్లో కనిపించిన ఆశ్చర్యంతో కూడిన ఆనందం గమనిస్తూ చెప్పసాగాడు.

" ఇప్పుడు మీరంతా ఈ పాత బోటుల్లో పేనాలకు తెగించి సముద్రం మధ్యకి ఎల్తున్నారా! అయినా అంత కష్టపడినా పెద్ద చేపలు దొరుకుతాయని నమ్మకం లేదు.. మరీ లోతుకు వెళ్తే బతుకుతామన్న గ్యారంటీ లేదు.. అయినా మీరంతా బతుకుపోరాటం చేస్తున్నారు. మీ తాతలు, ముత్తాతల కాలం నుంచీ ఈ పూరి గుడిసెల్లోనే బతుకుతున్నారు. మీ పిల్లలకు చదువులు లేవు...మంచి తిండి లేదు.. మంచి బట్ట లేదు. అవునా!"

అందరూ అవును, కాదు అన్నట్టు తలాడించారు.

"అలా కాకుండా మీ పిల్లలని ఇతర దేశాలకు పంపించారనుకో అక్కడ మంచి పని ఉంటుంది.. దానికి తగిన సంపాదన ఉంటుంది.. మీ బతుకులు బాగుపడతాయి. మంచి మోటారు బొట్లు కొనుక్కుని దర్జాగా యాటకి వెళ్ళచ్చు. మోటారు బోటు అయితే లోతుకి వెళ్ళచ్చు.. పెద్ద, పెద్ద చేపలు పడతాయి ఏమంటారు " వాళ్ళ కళ్ళల్లో రెప,రేపలాడుతున్న ఆశ చూస్తూ మరింత ఆశని ఎగదొస్తూ చెప్పాడు.

అందరూ ఆలోచనలో పడ్డారు.. సంపాదన బాగుంటుంది అనగానే అందరికీ రంగు,రంగుల జీవితం కళ్లముందు కదలసాగింది. కాకపోతే వాళ్ళల్లో అందరికీ పదహారెళ్ళుకి తక్కువ వయసు పిల్లలే ఉన్నారు. అందులో సగం మంది ఆడపిల్లలు ఉన్నారు. వాళ్ళని ఏ దేశానికి పంపిస్తారు?

సిద్దప్ప రహస్యంగా అప్పన్న చెవిలో అన్నాడు." మనమే ఎల్తే పోలా! మనకేం వయసు మునిగిందని.."

అప్పన్నకి ఆ మాట సబబే అనిపించింది.. తమ గుంపులో కనీసం ఓ ముగ్గురో, నలుగురో వెళ్ళినా అందరి జీవితాలు మెరుగవుతాయి అనుకున్నాడు.

“ మర పడవైతే  బాగుంతాది.. ఎంత దూరం అయినా నిబ్బరంగా ఎల్లచ్చు” అన్నాడు కొండయ్య  పక్కనే ఉన్న ఎర్రన్నతో రహస్యంగా “ అవును, అవును” అన్నాడు ఎర్రన్న.

“మీరు తెచ్చే సేపలు నేను ధర ఇచ్చి కొంటా.. మీరు అమ్ముకోడానికి అవస్థ పడక్కర్లా ఏటంటారు” అన్నాడు వాళ్ళ బలహీనత కనిపెట్టిన విస్సబాబు మరింతగా రెచ్చగొడుతూ.

బలహీనుడు ఆశల పల్లకి పేర్చుకుంటాడు.. బలవంతుడు ఆ పల్లకి ఎక్కుతాడు..

“ అల్లాగే బాబూ... బాడిగ ఎంతుంది?” అడిగాడు నసుగుతూ అప్పన్న.

విస్సబాబు బోటులో ఎక్కి  కూర్చుని చెప్పసాగాడు.

అంతా విన్న ఆ జాలర్ల కళ్ళల్లో మెరుపులు మెరిశాయి.  ఇన్నేళ్ళ కష్టాలు అన్నీ పోయి తమకి మంచి రోజులు వస్తున్నాయి అనుకున్నారు. అందరి కళ్ళ ముందు పూరి పాకలు పోయి, మట్టి గోడలు, రేకుల షెడ్లు కదిలాయి. ఆశలే కాదు కలలు కూడా అంతకు మించి కనడానికి మాకు అర్హత లేదు అనుకునే అల్ప సంతోషులు.

“ మీరెప్పుడెలతారో చెప్తే యార్పాట్లు చేస్తా ” అన్నాడు విస్సబాబు వాళ్ళ మొహాల్లో విరుస్తున్న  కాంతుల్లో తన భవిష్యత్తు దిద్దుకుంటూ. .

“ రేతిరి కాడ అచ్చినం బాబయ్యా.. పక్షం రోజులు కావాల” అన్నాడు అప్పన్న.

విస్సబాబు తిరిగి ఇసకలో నడుస్తూ, తన వెనకాల వాళ్ళంతా చేతులు నలుపుకుంటూ వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకుంటూ వస్తుంటే “ పిచ్చి  సన్నాసులు.. వీళ్ళందరికీ తలా ఒక కల్లుముంత ఇస్తే చాలు.. మనం చెప్పినట్టు ఇంటారు.” అని మనసులోనే ఆనందపడుతూ చెప్పసాగాడు విస్సబాబు. అతని మాటలు వింటూ ఉంటే వాళ్ళందరి కళ్ళ ముందు నక్షత్ర మండలం నేలకి దిగివస్తున్నట్టు అనిపించింది.. అంతా చెప్పిన విస్సబాబు తను విజయం సాధించాను అనే తృప్తితో  “ మీరు ఆలోచించి చెప్పండి.. రేపు వస్తాను. మీలో ఇద్దరు వస్తే పట్నం తీసుకుని వెళ్తాను.. మోటారు బోటు నడపడం చూపిస్తాను..” అంటూ ఇసకలో బలంగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు.

అప్పుడే మోటారు సైకిల్ మీద వచ్చిన ఒక వ్యక్తీ అతనిని గమనించాడు.  పదిహేను రోజుల క్రితం వచ్చి బొమ్మలు కొనుక్కుని వెళ్ళిన వ్యక్తీ అతను. ఇప్పుడు భార్య కోరిక మీద ఎండుచేపలు కొనడానికి ఒక్కడే వచ్చాడు.  విస్సబాబుని చూడగానే పోల్చుకున్నాడు. ఇటీవల ప్రముఖంగా వార్తల్లో కనిపిస్తున్న వ్యక్తీ విస్సబాబు. సముద్రతీరంలోని చుట్టుపక్కల

గ్రామాలు తిరుగుతూ అమాయకులైన జాలరులకు లేని, పోనీ ఆశలు పెట్టి వాళ్ళ పిల్లలని పొరుగు దేశాలకు బానిసలుగా పంపిస్తున్న వ్యక్తి. వీడి దృష్టి ఈ గ్రామం మీద పడిందా! వీడి మాటల గాలానికి చిక్కని చేపలు అరుదే.. ఈ చిన్నిచిన్ని చేపలు ఎంతసేపు చిక్కాలి !

**అతను నెమ్మదిగా** నడుస్తూ అప్పన్న బృందం, కళ్ళతో కట్టుకుంటున్న ఇసకమేడలు దగ్గరకు వచ్చాడు.

"బాబాయ్ నిజంగానే మోటారు బోటులో ఎంత దూరమైనా ఎల్లోచ్చంతావా" అప్పన్న వైపు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ అడిగాడు సిమ్మన్న..

" పెద్దోల్లు సెబితే ఇశ్వాసం ఉండాలరా.. ఏమో! పోవచ్చేమో1 ఆ అయ్యగోరు బాడీక్కి ఇత్తానన్నారుగా.. సూద్దాం.."

"అప్పన్నా! ఏంటి ఖాళీగా కూర్చున్నారు " అని పలకరిస్తూ వచ్చాడు అతను.

అతన్ని చూడగానే అప్పన్న గుర్తించాడు. గబుక్కున లేచి నిలబడి " దండాలయ్యా " అన్నాడు.

" ఇవాళ యాటకి వెళ్ళలేదేంటి!" అడిగాడు.

"దినాం యాడ బొతాం దొరా! పోయినా సేపలు పడేది నమ్మకం లేదు.." నిరాశగా అన్నాడు ఒక జాలరి.

" తవరు ఒక్కరే వొచ్చారు అమ్మగారు రాలేదా అయ్య గారూ! " అడిగాడు సిమ్మన్న.

ఆరోజు భార్యాభర్తలు చాలాసేపు వాళ్ళతో కబుర్లు చెబుతూ చేపలవేట గురించి చేపల గురించి, అమ్మకాల గురించి వివరంగా తెలుసుకోవడం అందరికీ గుర్తుంది.. అందుకే అతన్ని చూడగానే చేపల కోసమే వచ్చి ఉంటాడన్న నమ్మకంతో " ఏం కావాలయ్యగారూ!" అని అడిగాడు అప్పన్న వినయంగా.

"రొయ్యలున్నాయేమో అని వచ్చాను. మీరు వేటకి వెళ్లలేదు కదా! సరే! ఎండు చేపలు ఉన్నాయా!"

" ఎన్ని కావాలండీ! వీశో, రెండీశలో ఉంటాయి.. "

" రెండు వీశెలు దొరుకుతాయా..."

“ఆయ్ చూత్తానండి.. ఆడొల్లని అడగాల “ అని చెప్పి  ఇసకలో ఆడుకుంటున్న పధ్నాలుగేళ్ళ చంద్రాన్ని కేకేసి, “అమ్మనడిగి రెండు కేజీలు ఎండుసేపలట్రారా “ అని ఆదేశించాడు. చంద్రం పరిగెత్తాడు.

ఈలోగా అతను సంభాషణ మొదలుపెడుతూ “ మామూలుగా మీరు వేటకి వెళితే ఏ వేళలో వెళ్తారు “ అడిగాడు.

“ నడిరేతిరి యేల పన్నెండు దాటినాకే మా యాట మొదలయ్యేది..” తేలిగ్గా అన్నాడు గంగయ్య అనే మత్స్యకారుడు.

“ఎంత ఆదాయం వస్తుంది నెలకి ?”

“అయ్యా! గతంలో రోజంతా యాతాడితే గుప్పెడు రొయ్యలు, రెండో, మూడో సిన్న సేపలు పడేవీ.. అవి మా ఆడొల్లు అమ్ముకునోత్తే నూరో, రెండు నూర్లో వచ్చేది.. అందరం కలిసి కడుపునిండా తినే ఒల్లం.. రాను, రానూ సేపలు తక్కువైపోతుండాయి.. దొరా! రొయ్యలు బాగా దొరుకుతున్నాయి..మునుపు రొయ్యలు కొనేవోల్లు కాదు..ఇప్పుడు రొయ్యలు కొంతున్నారు.. అయినా ఇప్పుడు గతంలో మాదిరి ఈడ నుంచి వలెత్తే పడ్డం లేదు సారూ! బాగా  లోతుకెల్లితేనె కొన్ని పడుతున్నాయి..!” అన్నాడు అప్పన్న.

“అందుకు కారణం తెలుసా మీకు?” అడిగాడు అతను సంధ్యారుణ కాంతుల్లో మెరుస్తున్న వాళ్ళ నల్లని కండలు చూస్తూ.

“ఏవుంతాది? మాకాడ మోతారు బోట్లు లేవు.. ఈ పడవల్లో పైపైన యాతాడితే ఏవోత్తయి..” అన్నాడు.

ఎంత అమాయకులు! ఈ అమాయకత్వాన్ని విస్సబాబు లాంటి వాళ్ళు, వాళ్ళకి అనుకూలంగా మార్చుకుని వీళ్ళని మాయమాటలతో మభ్యపెట్టి వాళ్ళ పబ్బం గడుపుకుంటున్నారు..నిజానికి చేపలు తగ్గిపోడానికి కారణంరోజు, రోజుకీ పెరుగుతున్న కాలుష్యం. ఆధునిక సౌకర్యాలు అందరికీ అందుబాటులో లేకపోవడం, తరచూ వస్తున్న తుపానులు ఇలా అనేక కారణాలు ఉన్నాయి. వచ్చిందే చాలని, పూట గడిస్తే చాలనుకునే అల్ప సంతోషులు వీళ్ళు.. వీళ్ళ బలహీనతే దళారులకు బలం.

ఏది ఏమైనా, ఏజెన్సీ ప్రజల బాగోగులు చూడాల్సిన బాధ్యత ఉన్న అధికారి తను.. వాళ్ళని కాపాడాలి.. ధృడంగా అనుకున్నాడు.

“ఇప్పుడు మీతో మాట్లాడి వెళ్ళినాయన ఎవరో తెలుసా!“ అడిగాడు.

“ తెల్దండి … ఎవురండి “

“అతనిలాంటి వాళ్ళని బ్రోకర్స్, అంటే దళారులు అంటారు. మీలాంటి అమాయకులను శ్రమను చాలా తెలివిగా వాళ్ళకి అవకాశంగా వాడుకుంటూ మరపడవలు మీకు బాడీక్కి ఇచ్చి, మిమ్మల్ని సముద్రంలో చాలా దూరం పంపిస్తారు. మోటారు బోటు కాబట్టి అంత దూరం తేలిగ్గా వెళ్లగలుగుతారు. చేపలు కానీ, రొయ్యలు కానీ బాగా దొరుకుతాయి. అవన్నీ ఒక్కరోజులో మీరు మార్కెట్ చేసుకోలేరు.. భద్రపరచడానికి మీ దగ్గర కోల్డ్ స్టోరేజ్ లేదు.. అవి బయట ఉంటే చచ్చిపోతాయి. మీరు కష్టపడి ప్రాణాలకు తెగించి, సంపాదించుకున్న సరుకు అలా పాడయితే మీరు బాధపడతారు కదా. అలా పాడు చేసేకన్నా ఎంతో కొంత వస్తుందిలే అని ఇలాంటి బ్రోకర్స్ అడిగిన ధరకు ఇచ్చేస్తారు. వాళ్ళు కోల్డ్ స్టోరేజ్ లో భద్రపరచి, మార్కెట్ లో మంచి రేటు మాట్లాడుకుని సొమ్ము చేసుకుంటారు. అదే మీ దగ్గరే కోల్డ్ స్టోరేజ్ ఉంటే మీ సరుకు మీరే మంచి ధరకు అమ్ముకోవచ్చు కదా! “

అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. ఒకొక్కరి మెదడులో ఒక్కో పిడుగు పడుతున్నట్టు వినిపించసాగాయి ఆ మాటలు. అతని మాటలు సానపెట్టిన కత్తిలా పదునుగా పనిచేయసాగాయి.

“అవునోరే.. అయ్యగారు సెప్పేది నిజవేరొ! అని ఒకరితో ఒకరు అనుకున్నారు. అది గమనించి అతను మరింత ఉత్సాహంగా వాళ్ళకి దళారులు చేస్తున్న మోసాలు మరింత ఆసక్తిగా చెప్పసాగాడు.

“అంతే కాదు, వయసులో ఉన్న మీ మగపిల్లలకి పెద్ద మొత్తం ఆదాయాల ప్రలోభాలు పెట్టి, ఉపాధి కల్పిస్తామని చెప్పి ఇతర రాష్ట్రాలకు, పరాయి దేశాలకు బానిసలుగా పంపిస్తున్నారు. ఆ పిల్లలంతా అక్కడ వందల మైళ్ళు సముద్రంలో ప్రయాణాలు చేసి, తిండి, నీళ్ళు లేక నానా యాతనలు పడి, చనిపోయిన వాళ్ళు చనిపోతే, కొందరు చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని తిరిగి వస్తున్నారు.”

అతను చెప్పేది నోళ్ళు తెరుచుకుని వింటున్న ఆ జాలరులంతా “ ఎవులండీ ఆల్లు.. మా వోల్ల పిల్లోలను సంపుతున్నారా.. ఏరా నిజవే!” ముక్కున వేలేసుకుని నమ్మలేనివాడిలా పక్కన కూర్చున్న మరొక జాలరీని అడిగాడు ఒకతను..

“ఏలకు సారూ! మా పిల్లోలనేల సంపెది? “ అడిగాడు అప్పన్న.

“ కావాలని కత్తులతో పొడిచి ఎవరూ చంపరు. కానీ అలాంటి దుర్భర పరిస్థితులు కలగచేస్తారు.. ఆ పిల్లల శ్రమ దోచుకుని వాళ్ళంతా గొప్పవాళ్ళు అవుతారు. నేను చెప్పేది ఏంటంటే, ఈ బ్రోకర్స్ మీ తెలివితక్కువ తనాన్ని ఆసరా చేసుకుని మీ జీవితాలతో ఆడుకుంటున్నారు. దేశంలో అతి పెద్ద సముద్ర తీర ప్రాంతం అయిన గుజరాత్లో మోటారు బోట్ల

వాడకం బాగా పెరుగుతున్నది. ఎందరో మత్స్యకారులు బ్యాంకుల్లో ఋణాలు తీసుకుని మోటారు బోట్లు కొనుక్కుంటున్నారు. అది చూసి మన రాష్ట్రంలో జాలరులు కూడా కొందరు లోన్స్ తీసుకుని మోటారు బొట్లు కొన్నారు కానీ, మోటారు బోటు శబ్దానికి చేపలు గల్లంతు అవుతూ వలలకు చిక్కడం లేదు. ఇంజన్ బోటు నడపడంలో నేర్పు ఇంకా అలవడక జాలరులు ఆశించంత దూరం వెళ్లలేక పోవడంతో ఎక్కువ చేపలు పట్టలేక పోతున్నారు. పట్టినవి విస్సబాబు లాంటివాళ్ళు తక్కువ ధరలకు కొనడంతో వాళ్లకి నష్టం వస్తోంది.

భయంతో కళ్ళు పెద్దవి చేసి తన వైపే చూస్తున్న వాళ్ళ వైపు పరిశీలనగా చూస్తూ మరింత ధృఢంగా చెప్పసాగాడు అతను.

"మీరే ఒక మోటారు బోటు కొనుక్కున్నారు అనుకోండి. ఎప్పటికన్నా ఎక్కువ చేపలు రావాలిగా. అలా కాకుండా ఉన్నవి కూడా పడకపోతే ఏమవుతుంది? ఒడ్డునుంచి సముద్రంలోకి పడినట్టు అవుతుందా లేదా!

" అంతేకదూ మరీ " అన్నాడు అప్పన్న తల ఊగిస్తూ.

అతను మరింత ఉత్సాహంగా చెప్పసాగాడు. "పైగా మీరు కూడా మీ పిల్లలని చదివించరు. ప్రభుత్వం ఎన్ని పథకాలు చేసినా మీ దాకా అవి చేరవు. అందుకేగా మీ పిల్లలకి చిన్నప్పటి నుంచీ మీరు వలేయడం నేర్పిస్తారు. అప్పుడప్పుడే వలలేయడం నేర్చుకుంటున్న వాళ్ళు నైపుణ్యం సంపాదించాలంటే సమయం పడుతుంది. అందుకని మీలాంటి వాళ్ళు కొందరు ఓపిక తగ్గో, లేక ఆర్ధికంగా వేయసొచ్చిన పిల్లలు మీకు ఉపయోగపడాలన్న ఆశతో మరో ఉపాధి మార్గం కోసం చూస్తారు. ఆ పరిస్థితిని ఇందాక వచ్చిన, అతని పేరు విస్సబాబు. అతని వృత్తే మోసాలు చేయడం. మీలాంటి వారికి అందరికీ తాయిలాలు చూపించి మోసం చేస్తూ ఉంటాడు. మీ పిల్లలని అలా పంపిస్తే పెద్ద మొత్తాలు ఆదాయం వస్తుంది.. మీ కష్టాలు గట్టెక్కుతాయి అని ప్రలోభపెడుతూ ఇతర రాష్ట్రాలకు వాళ్ళని పంపిస్తూ కమిషన్ వ్యాపారం చేస్తుంటాడు. ఇప్పటికి రెండుసార్లు పట్టు పడ్డాడు.. కానీ రాజకీయ పలుకుబడితో తప్పించుకుని మళ్ళీ అదే పని చేస్తూ ఉంటాడు. ఆ తాయిలం కోసం మీ పిల్లలని పంపించినా, మీరు వెళ్ళినా, జీవితం నరకం. ఇంక బతుకు మీద ఆశ వదులుకోడమే. "

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాక. కేరళ నుంచి గుజరాత్ నుంచి కూడా ఎంతోమంది ఇలాంటి వాళ్ళ వలల్లో చిక్కుకుని అరేబియా సముద్ర తీరప్రాంత రాష్ట్రాలకు వలసలు పోవడం ప్రారంభించారు. అలా వెళ్ళిన వాళ్ళు కొందరు అత్యుత్సాహంతో పాకిస్థాన్ బోర్డరు వరకు వెళ్లి అక్కడ కోస్ట్ గార్డు ల చేతుల్లో చిక్కి నానా అగచాట్లు పడుతున్నారు.

నిజానికి మన విశాఖపట్నం, శ్రీకాకుళం సముద్ర తీరాలు చాలా  విస్తారమైనవి. మోటారు బోట్లు ఉపయోగించి సుఖంగా ప్రయాణం చెయ్యచ్చు.  కానీ జెట్టీలు లేకపోడం వలన మోటారు బోట్లకు అనువుగా లేదు.  వైజాగ్ నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 260 కిలోమీటర్ల తీరప్రాంతంలో ఎక్కడ ఒక్క జెట్టీ కూడా లేదు! అలాంటప్పుడు మోటారు బోట్లతో  సముద్రంలోకి దూరం ఎలా వెళతారు?  సాధ్యం కాదుకదా! అతి కష్టం మీద వెళ్ళినా బోటు శబ్దం వినగానే చేపలు సముద్రం లోతుకు వెళ్లిపోతుండడంవల్ల, మరింత లోతుకి వెళ్ళాల్సిన పరిస్థితి వస్తోంది. అది మరీ ప్రమాదకరం. ఆ ప్రమాదం నుంచి తప్పించుకోడానికి ఇంజన్ బోటులు వాడుతున్నారు కొందరు.  ఇంజన్ బోటులకు కూడా జెట్టీలు కావాలసిందే.  ఈ విషయంలో అవగాహన ఉన్న కొందరు మత్స్యకారులు  ప్రతి ప్రాంతంలో జెట్టీలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.  ప్రభుత్వం ఆలోచిస్తోంది. అంచేత అపరిచితులను ఎవరినీ నమ్మకండి.. జాగ్రత్తగా ఉండండి.. మీకు మోటారు బోట్లు బాడిక్కి ఇస్తానని చెప్పి అధిక బాడిగ వసూలు చేస్తాడు. పిల్లలని అసలు పంపించకండి..తీసికెళ్ళి పరాయి దేశాల వాళ్లకి బానిసలుగా అమ్మేస్తాడు. ఒకసారి పంపించాక వాళ్ళు తిరిగివస్తారని మాత్రం అనుకోకండి. అందుకు సిద్ధం అయితేనే పంపండి. "

అతను చెప్తున్న విషయాలు నోళ్ళు తెరుచుకుని వినసాగారు వాళ్ళు.

వింటున్న అందరి గుండెలు దడ, దడ లాడుతూ ఎప్పటికన్నా వేగంగా కొట్టుకోసాగాయి. గభాల్న అతని కాళ్ళమీద పడి " బాబయ్యా.. ఈ ఇసయాలేవి మాకు తెలియదు.. తవరు సెప్పి మాకు మేలు సేసినారు. దండాలయ్యా! బతికుంటే సేపలు లేకున్నా, పొలుసులు తిని బతుకుతాం. మా బతుకులు మేము బతికితే సాలు బాబయ్యా..ఇదేసాలు అద్దు..ఇంకేమొద్దు" అంటూ దండాలు పెట్టసాగారు.

" జాగ్రత్తగా ఉండండి ఇలాంటి వాళ్ళు చాలా మంది ఉంటారు. ఎవరి ప్రలోభాలకి లొంగకండి. ప్రభుత్వం మీ కోసం చాలా పథకాలు చేస్తోంది.. మీ పిల్లలకి ఉచితంగా చదువులు చెప్పిస్తుంది.  మీకు మోటారు బోట్లు కొనుక్కోడానికి అప్పులు ఇస్తుంది.. మీకు కావాలంటే ఇలాంటి విషయాల్లో నేనేదన్నా సాయం చేస్తాను సరేనా.. " అంటూ చంద్రం తెచ్చిన ఎండు చేపలు తీసుకుని డబ్బులిచ్చి,  మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయాడు.

అప్పటివరకు భూమికీ , ఆకాశానికి మధ్య వేళ్లాడుతూ  పైకి ఎక్కాలా, కిందకి దిగాలా అనే సందిగ్ధావస్థలో ఉన్న అందరూ గట్టిగా ఊపిరి పీల్చుకుని గుడిసెల వైపు నడిచారు.

అయితే, జరుగుతున్నదంతా గంభీరంగా గమనిస్తున్న సముద్రుడు గుంభనగా నవ్వుకున్నాడు.

విస్సబాబు రెండు రోజుల తరవాత జీపు ఇచ్చి మనిషిని పంపించాడు..అందరూ ముక్త కంఠంతో " మేము రాము..మాకు మోటారు బొటులు ఒద్దు... మా పడవలే చాలు " అంటూ నిరాకరించారు. ఎంత చెప్పినా వాళ్ళు అదేమాట మీద ఉండడంతో చేసేది లేక అతను వెళ్ళిపోయాడు. ఆ తరవాత మళ్ళీ ఎవరూ వాళ్ళ దగ్గరకు రాకపోడంతో ఊపిరి పీల్చుకున్నారు.

**పక్షం రోజుల తరవాత** మళ్ళీ అందరూ వేటకి ప్రయాణం కట్టారు.

రాత్రి మూడో జాము.. అప్పటికే నిద్రలేచి సిద్ధంగా పెట్టుకున్న ఆహారపదార్థాలు, మంచినీళ్ళ డబ్బాలు పట్టుకుని, "ఎల్లొత్తానే ఆది.! పిల్లోడు జాగర్త...తాప, తాపకీ నీల్ల వైపు పోనీమాక" అని జాగ్రత్తలు చెప్పి గుడిసె లోంచి బయటకి వచ్చాడు అప్పన్న. గాలి విసురుగా వీస్తోంది. ఆగి ఒక్కసారి ఆకాశం వైపు చూసాడు. నల్లగా, అక్కడక్కడా నక్షత్రాలతో మెరుస్తూ ప్రశాంతంగా ఉంది.

ఇసకలో బలంగా అడుగులు వేస్తూ ఒడ్డు వైపు నడిచాడు. అప్పటికే మిగతా నలుగురు వచ్చేశారు.

"బాబాయ్! గాలి ఇపరీతంగా ఉంది...ఎల్లగలమంతవా" అడిగాడు ఎర్రన్న.

"ఏహే! ఈ గాలి మనల్నేం చేస్తాదిరా పదండి.." అంటూ అప్పటికే సిద్ధంగా ఉన్న పడవల్లో సామాను సర్ది నలుగురూ ఎక్కారు..అప్పన్న తెడ్డేసాడు. నీళ్ళు ముందుకీ, వెనక్కీ కదులుతూ పడవని ఊయల ఊపుతోంది. ప్రకృతి కన్య కాటుక కళ్ళలా ఉంది చీకటి. నెమ్మదిగా బోటు అలల మీద కదులుతూ తీరాన్ని దాటుతోంది. తెరచాపలు గాలికి కొట్టుకుంటున్నాయి. కిరోసిన్ లాంతరు భుగ భుగమంటోంది.

ఒక్కసారి ఒళ్ళంతా జిల్లుమన్నట్టు అయింది ఆ చల్లదనానికి. నావ అలల మీద శబ్దం చేస్తూ సుతారంగా కదులుతోంటే అప్పన్న గొంతులో నుంచి సుడులు తిరుగుతూ సముద్రుడు ఊదుతున్న శంఖానాదంతో లయబద్ధంగా సాగింది ఓ పదం...

**పల్లవి: పున్నమి రేతిరి పులస కోసం**

**పరుగు, పరుగున ఒచ్చీయండి.. బేగొచ్చీయండి..**

**నావెల్లి పోతాందిరో నా సిమ్మాద్రి!**

కోరస్: పోతాంది.. నావెల్లి పోతాంది

నావెల్లి పోతాందిరో  ఆదెయ్యా!  ..

మన పూల నావెల్లి పోతాందిరో !

కోరస్: హైలెస్సా ..హై లెస్సా

ఆసలన్నీ మూతకట్టి/ ముంతలోన సుట్టబెట్టి/

తెప్పలోన దాసిపెట్టి / అలల మీదా! నా కలల మీద

నావెల్లి పోతాందిరో!

సందమామ మనకి తోడు... సల్లగాలి మనకి జోడు..

ఎన్నెలొంటి పాయసంలో

సుక్కలను నంచుకుంటా

సుక్కేసుకుందాము..

కోరస్: సుక్కేసుకుందాము–

సుక్కేసుకుందాము

పల్లవి: పున్నమి రేతిరి పులస కోసం

పరుగు, పరుగున ఒచ్చీయండి.. బేగొచ్చీయండి

యాటకైనా నా నావే– కోట కైనా నా నావే/

మోటారు బోటులోద్దు.. ఇంజను ఇమానమొద్దు

ఉన్నదేదో తిందాము– కలిసి మెలిసి ఉందాము/

కోరస్: హైలెస్స –  హైలెస్సా ..

గాలితో పాటు ప్రకృతి కూడా హమ్ చేస్తున్నట్టు సాగుతూ నెమ్మదిగా దూరమైంది పాట. కింద కెరటాలు, పైన మేఘాలు ఆ పాటకి లయబద్ధంగా కదులుతూ నృత్యం చేశాయి. దూరంగా ఆకాశాన్ని అరచేతిలో పట్టుకుని కదలి వస్తున్నట్టున్న కొండలు, సంజీవిని మోస్తున్న హనుమంతుడిలా ఉన్నాయి. నావ వయ్యారంగా కదులుతోంది. ఆ సమయంలో ఆ నావలే అత్యంత ఆధునిక ఇంజను బోటుల్లా వాళ్ళని లక్ష్యం వైపు వేగంగా నడిపించసాగాయి.

నెమ్మదిగా కాలం కదిలి తెల్లవారు ఝాము ఐదు అయింది.

'ఇంక లే' అని ఎవరో చెవిలో ఊదినట్టు గబుక్కున లేచింది ఆదేమ్మ. గట్టిగా ఆవలిస్తూ గుడిసె బయటకు వచ్చింది. ఆ నిశ్శబ్దంలో కెరటాల హోరు ఆమె చెవులకి ఇంపుగా వినిపించింది.

దూరంగా కనిపిస్తున్న సముద్రం వైపు చూసి " పెద్ద సేపడితే బావున్ను ... చేతికింత, నోటికింత అన్నట్టే అయితాంది బతుకు.. ఏటో" ఆశగా అనుకుంటూ కచ్చిక ఎడం చేయి అరచేతిలో వేసుకుని కుడిచేయి చూపుడు వేలితో పళ్ళు రుద్దుకుంటూ నీళ్ళ కుండీ దగ్గర అరుగు మీద కూర్చుంది.

వీడని చీకట్లలో సముద్రం, పరచుకున్న ప్రకృతి కాంత ఒత్తైన కేశాల్లా ఉంది. ఆకాశంలో నక్షత్రాలన్నీ ఎక్కడికో వలసపోయినట్టు ఆకాశం నిర్మలంగా ఉంది. హోరుమని సముద్రం చేస్తున్న శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. గాలి మాత్రం తీవ్రంగా వీస్తోంది. ఆమెకి రోజూ భర్త తో పాటే లేవడం అలవాటు అయి చీకటితోటే లేచేస్తుంది. ఇంత త్వరగా లేచి చేసేదేమీ లేదని ఆమెకి తెలుసు కానీ సమయం దాటితే ఇంక పడక మీద ఉండలేదు. అలవాటైన ప్రాణం.. పడుకోమంటే మాత్రం పడుకుంటుందా! నెమ్మదిగా పళ్ళు తోముకుంటూ కాసేపు అక్కడే అటూ, ఇటూ నడుస్తూ గడిపేసింది.

ఆమె కాలకృత్యాలు ముగించుకుని కట్టెలు రాజేసి గంజి కాచేసరికి చీకటిని తరిమివేస్తూ సూర్యుడు మెల్లగా గుడిసెల వైపు పర్యటిస్తున్నాడు. మబ్బులన్నీ మంచు బిందువులతో ప్రక్షాళనం అయినట్టు అక్కడక్కడా తెల్లగా విచ్చుకుంటున్నాయి.

కట్టెలు కాలుతున్న వాసనకి మా గాడు గబుక్కున లేచి, పక్కకి చూసాడు. అయ్యా, అమ్మ పక్కన లేరు.. వాడు లేచి వచ్చేసరికి గుడిసె బయట ఆదేమ్మ గంజి కాస్తోంది. " అయ్యేడి" గట్టిగా అడిగాడు వాడు కళ్ళు నులుముకుంటూ.

"యాట కెల్లినాడులే ! ఎల్లి ముకం కడుక్కునిరా గంజి తాగుదువు" అంది.

"నాకేమొద్దు... నేను అయ్యతో ఎల్తా" వాడు గబుక్కున కింద కూలబడి కాళ్ళు చాచుకుని ఆరున్నొక్క రాగం ఆలపించసాగాడు..

"ఇంకా గుంతడివి యాటకి నువ్వేల్లొచ్చునా! నాయన పెద్ద సేపలు తెత్తాడులే నీకు చొక్కా, లాగు కొంతా!యాడవమాక" అని ఊరడించి వాడికి బలవంతంగా గంజి తాగించింది.

చుట్టుపక్కల గుడిసెల్లో సందడి మొదలైంది.. ప్రాభాత సమయం.. ప్రకృతి కాంత లోకమంతా మంచు కళ్ళాపి జల్లి, ముత్యాల పొడితో ముగ్గులేస్తున్నట్టు పల్చటి వెలుగు పరుచుకుంది.

ఆదేమ్మ కొడుకు ముందు కాసిని అటుకులు పెట్టి "తింతా ఈడనే కూసో.. యాడకి పోమాక. నేను తానం సెసొత్తా" అని చెప్పి తాటాకుల దడి చాటుకు వెళ్ళింది.

మాగాడు అలవాటుగా ముందు ఏడుపు మొదలెట్టినా, త్వరగానే వాడు తేరుకుని ఆటలు మొదలెట్టాడు. తల్లి స్నానం చేసి రాగానే ఆట్టే పేచీ లేకుండా ఇసకలో బొమ్మలు వేసుకోడానికి పరిగెత్తాడు.

ఆదెమ్మ కాసేపు ఆ పని, ఈ పని చేసుకుని, నడుం వాల్చింది..

సాయంత్రం నాలుగు అవుతోంది.. ఉదయం కాసిన ఎండ నెమ్మదిగా పల్చబడి ఆకాశంలో నల్లని మబ్బులు గుంపులుగా షికారు మొదలెట్టాయి. ఆదేమ్మ " ఆనపడేట్టుందే...ఈ పిలకాయ యాడున్నాడో" అని గబుక్కున లేచి "మాగా" అని అరుస్తూ వాడు ఆడుకుంటున్న వైపు బయలుదేరింది.

విసురుగా వీచిన గాలికి ఆమె చీర ఎగిరిపోతూ,ఆ చివరకు, ఈ చివరకు సీతాకోక చిలుకల్లా ఎగరసాగింది. " ఏందీ ఈ గాలి! ఇంత ఉధృతంగా ఉంది...ఆన పడతాదా! ఈ మొగోళ్ళు యాడదాకా పోయినారో ఎన్దో" కొంచెం ఆందోళనగా అనుకుంది. మళ్ళీ తనలో తానే " ఆ, నా మొకం! ఈ మబ్బులుంతాయా ! కూసింతసేపు ఉండి తేలిపోతాయి" అనుకుంది గాలికి ఎగిరిపోతున్న చీర చెంగు నడుం చుట్టూ దోపి.

తరతరాలుగా సముద్రంతో సహజీవనం చేస్తున్న వారికి ఇవన్నీ పెద్దగా లెక్కలేదు. ఇలాంటివి వారి జీవితంలో ఎన్నో చూసారు. పేదరికంతో పోరాడుతూ జీవిస్తున్న వారికి సముద్రంలో ఆటుపోట్లులాగే జీవితంలో కూడా వచ్చే ఆటుపోట్లను తట్టుకునే శక్తి పుట్టుకతో వస్తుంది. ఎలాంటి తుపానులు వచ్చినా వారి జీవన స్థితి గతుల్లో మార్పులు ఉండవు. సాధారణంగా పరిస్థితి విషమిస్తుందని అనిపించగానే వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. కానీ వాళ్ళదాకా అవి రావు.. హెచ్చరికలకు భిన్నంగా జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అందుకే అనేకమార్లు చెబితే తప్ప

వాళ్ళు అవి పట్టించుకోరు. కొన్నిసార్లు  వేటకు వెళ్ళకుండా ఉండిపోయి, అయ్యో వెళ్ళలేకపోయామే అని బాధ పడిన రోజులు వాళ్లకి సర్వ సామాన్యం. తుపాను వల్ల పెద్దగా వాళ్లకి నష్టమూ జరగలేదు, లాభమూ లేదు అందుకే తుపాను హెచ్చరికలకు వాళ్ళు నిర్లిప్తంగా ఉంటారు. రెక్కాడితే కానీ, డొక్కాడని జీవితాలు... వారు రోజు గడవడం కోసం సముద్రుడితో పోరాడాల్సిందే. చేపలు పట్టకపోతే ఇంటిల్లి పాదికీ కడుపు నిండేదేలా? అదే  మొండి ధైర్యంతో బతకడం వాళ్లను బతికిస్తుంది.

హోరుమంటూ వీస్తోంది గాలి. అలలు ఉవ్వెత్తున విరుచుకు పడుతున్నాయి. ఆ గాలికి తన బొమ్మలు చెదిరిపోకుండా చొక్కా విప్పి బొమ్మల మీద కప్పి, దాని మీద నాలుగైదు ఎండిపోయి కింద రాలిన చెట్టు కొమ్మలు అడ్డుగా పెట్టి, వెనక్కి, వెనక్కి చూసుకుంటూ గుడిసేవైపు బయలుదేరిన మాగాడు కనిపించగానే, “ దా దా నాయినా! నీ కొరకే వత్తన్న...ఆన పడేత్తుంది తడిచిపోతావు” అని వాడి భుజాల చుట్టూ చేతులేసి దగ్గరగా పట్టుకుని గుడిసె వైపు నడిచింది ఆదెమ్మ .

నెమ్మదిగా ఈదురు గాలులు వీచడం మొదలైంది. చూస్తూ ఉండగానే పెద్ద, పెద్ద కెరటాలు ఉధృతంగా ఒడ్డుకి చాలాదూరం  రాసాగాయి. ఆదెమ్మ గుడిసేకి వచ్చి మహాకి అన్నం పెట్టింది. తనూ నాలుగు ముద్దలు తిని బొంత పరిచి కొడుకుని పక్కన వేసుకుని పడుకుంది. తల్లి పెట్టిన అన్నం, చేపల వేపుడు తిని వెచ్చగా పడుకున్నాడు వాడు.

సముద్ర ఘోష ఎక్కువైంది...ఆ శబ్దం ఏవో సందేశాలు ఇస్తున్నట్టు, చెవుల్లో అనేక శంఖాలు ఊదుతున్నట్టు అనిపిస్తుంటే ఆదెమ్మకి ఏదో అనుమానం వచ్చి గబుక్కున లేచింది.

ఉన్నట్టుండి ఓరగా వేసిన చెక్క తలుపు  దబ,దబ కొట్టుకోడం, గుడిసె మీది తాటాకులు పెద్దగా చప్పుడు చేసి కింద పడడంతో  చివ్వున  బయటకు వెళ్ళింది “ ఓలమ్మో!ఈదర గాలి మొదలైనాది. మగోల్లంతా యాటకి బొయినారు తుపానత్తందా “  గట్టిగా అరుస్తూ అక్కడక్కడ గుడిసెల్లో ఉన్న ఆడాళ్ళని పిల్చింది. “చెంచలమ్మా! ఎర్రమ్మా! దానమ్మా రండి, రండి..తుపానత్తంది.”

ఆ అరుపులకి “ఓలమ్మో! తుపానే” అంటూ బిల,బిలలాడుతూ అందరూ పరిగెత్తుకుని వచ్చారు.

“ఈదర గాలి మొదలైనాది...తుపానత్తదా ఏటి“ కొండల్లా  భారంగా కదులుతున్న నల్లటి మబ్బులను చూడడానికి ప్రయత్నిస్తూ అంది ఆదెమ్మ.

అందరూ పైకి ఆకాశంలోకి చూసారు. చీకట్లో నల్ల మబ్బులు కనిపించలేదు వాళ్లకి.

కింద పడిన తాటాకులు ఏరుతూ "మగోల్లంతా ఎంతదూరం ఎల్లినారో బెగోచ్చీస్తే బాగున్నే.." అంది చెంచలమ్మ.

" రేలియోలో సెప్పనే నేదు" అంది పెంచలమ్మ.

"నీ దగ్గరే రేలియో ఉంది..నువ్వే ఇనాలి..అయ్యోర్లు సెప్పనేదేటే" అంది ఎర్రమ్మ ఆదేమ్మని ఉద్దేశించి. ఆ ఊళ్ళో ఒక్క అప్పన్న దగ్గరే చిన్న ట్రాన్సిస్టర్ ఉంది... అది పట్టుకుని ఒడ్డున తిరుగుతూ అందులో పాటలు, మాటలు వినిపిస్తుంటాడు అప్పన్న.

"అదేటో నాకేటి  తెలుత్తాది! ఆయనుంటే ఇంటాడు ఆ పాటల పెట్టి.. " అంది ఆదేమ్మ.

ఇలా అందరూ రక,రకాలుగా మాట్లాడుకుంటూ ఉండగానే గాలి తీవ్రత ఎక్కువైంది. ఒకరి మాటలు ఒకళ్ళకి వినిపించనంత భీభత్సంగా చెట్లు పెద్ద శబ్దంతో పూనకం వచ్చినట్టు ఊగసాగాయి. ఉన్నట్టుండి అందరూ ఆర్తనాదాలు చేయసాగారు.

"అయ్యో!మగోల్లు ఇప్పుడే ఎల్లినారే! ఎల్లాగ తల్లి! సీతలమ్మా! ఓ తల్లి మా మగోల్లని కాపాడుతల్లి"  అంటూ గొల్లుమన్నారు ఆ మహిళలంతా.

"ఓలమ్మో! ఓర్నాయనో!నా గుడిసె పోతాంది.. నా కొడుకో యాడన్నవ్!అమ్మ తల్లీ!నా పెనిమిటి యాడుండాడో! అమ్మోరు తల్లికి పూనకం వచ్చినాది.. లచ్చుమ్మా! పెద్దమ్మా!' ఎవరికి తోచిన విధంగా బిగ్గరగా అరుస్తూ ఉండగానే పెద్ద చినుకులతో ప్రారంభం అయి, చూస్తూ ఉండగానే ఏనుగు తొండంతో విసురుతున్నట్టు, పాలకడలి పొంగిపోతున్నట్టు వర్షం విజృంభించి కురవసాగింది.

మహేకి మెలకువ వచ్చింది.. కానీ కళ్ళు తెరిపిడి పడడం లేదు.. గుడిసె బయట హాహాకారాలు నిజం అని నమ్మకం కుదిరేలోగా తిరిగి కళ్ళు మూతలు పడుతున్నాయి. హటాత్తుగా గుడిసె మీద ఎవరో పెద్ద బాణం వేసినట్టు కప్పు ఎగిరిపోయి వర్షపు ధారలు వాడిని తడిపేస్తుంటే "అమ్మో!" అని గట్టిగా ఆక్రోశిస్తూ గుడిసె బయటకి సంధించిన బాణం లా దూసుకువచ్చాడు.

గుంపుగా ఉంది, హోరున కురుస్తున్న వర్షంలో తడిసిపోతూ గుండెలు పగిలేలా ఏడుస్తున్న స్త్రీలందరినీ చూశాడు.. వారిలో తన తల్లిని చూశాడు. దూరంగా విరుచుకుపడుతున్న కెరటాలు చూసాడు. ఒక్కసారిగా ఉరిమిన మేఘాలు పెద్ద పర్వతాలుగా మారి వాడి మీద పడుతున్న భావన.. బాధ.

"అమ్మో! నా బొమ్మే" అని శక్తి కొద్ది అరిచి పరుగు లంకించుకున్నాడు.

వెనకనుంచి ఆడవాళ్ళ స్వరాలు"మాగాడా.. అరే మాగా! నాయనా మాగా" ఆ స్వరం ఎవరిది, తనని ఎవరు పిలుస్తున్నారు వాడికి పట్టనట్టు కళ్లముందు కనిపిస్తున్న బొమ్మని కాపాడుకోడానికి పరుగుపెడుతూనే ఉన్నాడు. ఇవాళ ఉదయం నుంచీ రెండు బొమ్మలు వేసాడు. ఒక చేతిలో తామరపూవు పట్టుకుని, ఒక చేతి నుంచి నాణాలు వదులుతున్న లక్ష్మీదేవి, ఇంకోటి మురళి వాయిస్తున్న కృష్ణుడు.. అలలు వచ్చి ఆ బొమ్మలని తుడిచేయకుండా బాగా ఎడంగా తన గుడిసెకి వైపుగానే వేసాడు. కానీ, గుడిసెలనీ, మొత్తం పరిసరాలను మింగేస్తున్న రాక్షసుడిలా విరుచుకుపడుతున్న కెరటాలు చూస్తుంటే తన బొమ్మ కొట్టుకుపోతుందన్న భయం, ఎంతో కష్టపడి బొమ్మ వేయడం కాక, అవి గాలికి చెదిరిపోకుండా కప్పిన తన కొత్త చొక్కా గుర్తొచ్చి"అమ్మా! నా బొమ్మలే" అని ఏడుస్తూ పరిగెత్తుతూ, ఇసకలో వెతుకుతూ, కాళ్లతో తొక్కుతూ, బోర్లా పడుతూ, లేస్తూ,ఈదుతూ విధి ఊడ్చేసిన ఆ సైకత శిల్పాల కోసం అన్వేషిస్తూనే ఉన్నాడు.

" యాడకి ఎల్తన్నావు కొడకా! ఎల్లమాకు పెమాదం " అంటూ కొడుకు వెనకే ఆర్తనాదం చేస్తూ తానూ పరుగులు పెట్టింది ఆదెమ్మ.

"అక్కా! పెద్దమ్మా! ఆదేమ్మా!" తలా ఒక విధంగా పిలుస్తూ అందరూ ఆ ఇద్దరినీ అనుసరించారు।

ప్రళయకాల ఝుం ఝుం మారుతం... సముద్రుడు ఉగ్రనరసింహస్వామిలా ఉన్నాడు. నింగీ, సముద్రం ఏకమైనట్టు చూస్తూ ఉండగానే ఆకాశం అదృశ్యం అయిపోయింది.

"నా బిడ్డా!" ఆ మహిళల ఆర్తనాదాలు ప్రభంజనంలో కొట్టుకుపోయాయి. వేయి చేతులతో సముద్రుడు కరాళ నృత్యం మొదలుపెట్టగా, నేలని లక్ష పాదాలతో చిన్నాభిన్నం చేస్తూ ఆ స్త్రీలందరినీ మూటకట్టి విసిరివేసింది. పెద్ద ఉరుముతో ఆకాశం సముద్రుడి మీదకు లంఘించింది. పెద్ద కెరటం ఆకాశాన్ని చాపలా చుట్టి విసిరివేయబోగా భీకరమైన ఊరుములతో కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులతో ఆకాశం సముద్రుడినీ తన పిడికిట్లో బంధించబోగా, ఉగ్రుడైన సముద్రుడు విరుచుకుపడ్డాడు. ఆ బాహుబలులు ఇద్దరూ కలిసి సుమారు యాభై కోలోమీటర్ల దూరం లో ఉన్నజనావళిని, వారి ఆశలనూ ముంచేస్తూ, పేదవారి ఇళ్ళు దోచేస్తూ, ఆ జాలరుల కుటుంబాలను తమ వారితో కలపడానికి వెంట తీసుకువెళ్ళాయి.

అప్పటికి చాలా దూరం వెళ్ళిపోయిన అప్పన్న బృందం కొండల్లా కదిలివస్తున్న మబ్బులను, విసురుగా వీస్తున్న గాలినీ చూసి, అసహనంతో "ఏహే! ఊరికే బయపెత్తమాక" అని విసుక్కుంటూ నీ సంగతి మాకు తెలుసులే అనుకుంటూ

కెరటాల పైన ఊయలలు ఊగుతూ ముందుకే సాగుతున్నారు ఆశగా. వెళ్తున్నా కొద్దీ వాళ్ళకీ అర్ధమవసాగింది.. అది సముద్రుడి బెదిరింపుకాదు.. ప్రకృతి పగబట్టింది అని. ఎత్తిన వలలు గాలికి కొట్టుకుపోతుంటే ఆ వేళ పరిస్థితి వలలు వేయడానికి ఏ మాత్రం అనుకూలంగా లేవన్న విషయం జీర్ణం చేసుకోడానికి ప్రయత్నిస్తూనే మొండి బలంతో, బతుకుమీద ఆశతో, తీరాన్ని తాకుతున్న అలలు, కొన్ని చేపలనన్నా తమకోసం మోసుకొస్తున్నాయేమో అని ముందుకు వెళ్తున్నారు. కానీ ఒక్క చేప కూడా అందడం లేదు. ఏదో సాధించాలన్న లక్ష్యం మనిషిని చిన్న, చిన్నఆటంకాలు ఆపలేవు. అలాగే ఆ మత్స్యకారులు కూడా పెద్ద, పెద్ద చేపలను వేటాడాలన్న లక్ష్యంతో ఇంటినుంచి ఉత్సాహంగా బయలుదేరి, అనుకున్నది సాధించకుండా వెనక్కి మళ్ళలేక, కొంచెం, కొంచెం ముందుకి అలా వెళ్తూనే ఉన్నారు. దూరం, దూరం ఇంకా దూరం..భార్యా, పిల్లల ఆర్తనాదాలు వినిపించనంత దూరం.. వారి మనోబలం ముందు ఓడిపోడానికి ఇష్టపడని కెరటాలు ఓ పక్క ముందుకి తోస్తూనే లోలోపలకి లాగుతూ విజయగర్వంతో నావలని తల్ల కిందులు చేసాయి..హా,.హా కారాలు సముద్రం ఘోషలో కలిసిపోయాయి.

తెల్లవారే సరికి తడిసిన ఇసకలో విగతజీవులై కొందరు కనిపిస్తే, ఆనవాలు కూడా లేకుండా పోయినవాళ్ళు కొందరు. కళ్ళనిండా భయంతో, ఒంటి నిండా ఇసకతో చలికి వణికిపోతూ గువ్వల్లా. కూర్చున్నారు నలుగురు మగపిల్లలు...ఎవరెవరో వస్తున్నారు... గజ ఈతగాళ్ళు సముద్రంలోకి వెళ్ళిన వాళ్ళను గాలిస్తూనే ఉన్నారు. స్టీమర్లు, హెలికాప్టర్ లు, మంత్రులు, కలెక్టర్, ఆఫీసర్ లు చాలా మంది వచ్చారు. బిక్కుబిక్కుమంటూ, దయనీయంగా ఉన్న ఆ నలుగురికీ పులిహోర పొట్లాలు ఇచ్చారు. " మీ అమ్మ, అయ్యా ఏరిరా" అని అడిగారు..

"తెల్డుసారూ" అంటూ బావురుమన్నారు వాళ్ళు.

"అరె పాపం!" సానుభూతి వెల్లువయింది. ఆ వెల్లువ వారి ఒళ్ళంతా తడిమింది. కళ్ళల్లో ఆశల దీపాలు వెలిగించింది.

బాధపడకండి. మీకు మేమున్నాం.. మిమ్మల్ని ఆడుకోడం మా బాధ్యత..ఆశ్రయం కల్పిస్తాం.. వాగ్దానాలు.. ఆ నలుగురు కుర్రాళ్ల వెలిగిన ఆశాదీపాల కాంతిలో వాళ్ళంతా నడుచుకుంటూ వెళ్ళిపోయారు. అక్కడ జరిగిన నష్టానికి పరిహారం లేదు కాబట్టి చుట్టు పక్కల గ్రామాల్లో ముంపుకు గురైన ఇతర జాలర్ల కుటుంబాలకు నష్ట పరిహారం ప్రకటించింది ప్రభుత్వం.

జరిగిందేమిటో కూడా తెలియని అయోమయంలో దిక్కుతోచని స్థితిలో సముద్రుడు చేసిన అల్లకల్లోలంతో ఇంతకాలం ఆడుకున్న ఇసకలో వాళ్లకి ఇప్పుడు గవ్వలు, శంఖులు కనిపించలేదు..శవాలు కనిపిస్తున్నాయి. కెరటాల

కేరింతలు కాదు...వికటాట్టహాసం వినిపిస్తోంది. వాళ్ళు హృదయవిదారకంగా పెట్టిన ఆర్తనాదాలు సముద్రపు హోరులో కలిసిపోయాయి. పలకడానికి ఏ అమ్మా లేదు.. దగ్గరకు తీసుకుని ఓదార్చడానికి ఏ అయ్యా లేదు... వాళ్ళు మాత్రం మిగిలారు. కెరటాలతో పోరాడి, తిరగబడి, శిధిలాల్లా మిగిలారు. ఆకలి, దుఃఖం, భయం తోడుగా నలుగురు పిల్లలు కడుపులు చేత పట్టుకుని అన్నీ వరదల్లో కొట్టుకుపోగా ఇసక అడుగున మిగిలిన నాలుగు సత్తు గిన్నెలు, రెండు పళ్ళాలు పట్టుకుని రోడ్డెక్కారు.

భూమండలాన్ని  ఎవరో ఎత్తుకుపోయినట్టు ఎటు చూసినా తడిసిన ఇసక పరిచి పారిపోయాడు సముద్రుడు. జనసంచారం లేని వాకిళ్ళు,  ఎక్కడా ఎలాంటి శబ్దం లేకుండా నిశ్శబ్దం ఘనీభవించి ఉంది. ఎవరన్నా పిలిచి ఒక ముద్ద పెడితే బాగుండు అని ఆ ఎనిమిది కళ్ళు ఆశగా సందులు, గొందులు వెతుకుతున్నాయి. మనుషులంతా ఎక్కడికి వెళ్ళారు? మంత్రగాళ్ళు వచ్చి అందరినీ మాయం చేసారా అన్నట్టుగా ఉంది.

కాళ్ళు నొప్పి పెడుతున్నాయి, ఆకలి విజృంభిస్తోంది. అందరికీ అమ్మలు గుర్తొస్తున్నారు. కనిపిస్తున్న ప్రతి గుడిసె తలుపూ తడుతున్నారు అమ్మా అంటూ హృదయం ద్రవించేలా పిలుస్తున్నారు. కానీ ఒక్క అమ్మ కూడా కనికరించడం లేదు...కనిపించడం లేదు. వాళ్ళ లోకంలో అమ్మ కరువై దేవుళ్ళంతా ఆ ఊళ్ళల్లో ఉన్న అమ్మలను తీసుకుని వెళ్ళారా! మరి మాకు అమ్మెలా? భాష లేని కళ్ళల్లో భావాలు, వేల సందేహాలు, కోటి ప్రశ్నలు. కాళ్ళల్లో శక్తి నశిస్తోంది. ధ్వని గొంతుల్లో శిలగా మారినట్టుంది. అకస్మాత్తుగా ఆ గొంతులు అమ్మా అని పిలవడం ఆపేశాయి..పాదాలు నేలకంటుకు పోయాయి..కుప్పకూలినట్టు నేలపై వాలిపోయారు.

**మహా కళ్ళు** తెరిచేసరికి ఒక అరుగుమీద ఉన్నాడు. చుట్టూ చూసాడు. మనుషులు తిరుగుతూ కనిపించారు. నడుస్తూ, సైకిళ్ళ మీదా, మోటారు సైకిళ్ళ మీదా కొందరు, గుంపులుగా నిలబడి మాట్లాడుకుంటూ కొందరు.. ఎండ చుర్రుమంటోంది. వాడు పడుకున్న అరుగుకి కొంచెం ఎడంగా ఇద్దరాడవాళ్ళు నిలబడి మాట్లాడుకుంటున్నారు. కళ్ళు తెరిచి అన్నీ పరికించి చూస్తున్న వాడి దగ్గరకు ఒకావిడ వచ్చి “లే నాయినా ! దా అన్నం తిందువు” అంది.

మహా సమాధానం చెప్పకుండా నీరసంగా ఉన్న కళ్ళతో ఆవిడ మొహంలోకి చూసాడు.

“ఏ ఊరు?”  అని అడిగింది. వాడు ఏమి చెప్పలేకపోయాడు.

"మీ  నాయన, అమ్మ ఎవరు" అంది... వాడు సమాధానం చెప్పలేదు. తన స్నేహితుల కోసం చూసాడు. ఎవరూ కనిపించలేదు. ఆవిడ వైపు ప్రశ్నార్ధకంగా చూసాడు.

"ఆకలేస్తున్నదా! ఉండు" అంటూ లోపలికి వెళ్లి ఆకులో అన్నం, పప్పు తెచ్చి అరుగు మీద పెట్టింది. " "లే లేచి కూచుని తిను.." అంటూ మహా చేయి పట్టుకుని లేపి కూర్చోబెట్టింది.

అన్నం, పప్పు చూడగానే అణిగిపోయిన ఆకలి నిద్ర లేచింది. గబగబా తినేసాడు.

"ఎక్కడికెల్తన్నా?" అంది ఆవిడ

"మా ఇంటికి" అన్నాడు.

" యాదుండాది? " అని అడిగింది.

" సందం కాడ ..." చెప్పాడు. ఆవిడ జాలిగా చూసింది. వాడికి ఏదో జరిగిందని అర్ధం అవుతోంది కానీ ఆ జరిగింది ఒక ప్రళయం అనీ ఆ ప్రళయం తనని దిక్కులేని వాడిని చేసిందని అర్ధం కాలేదు. అందుకే ఇంటికి వెళ్ళాలి అనుకుంటున్నాడు. ఎలా వెళ్ళాలి? తానిప్పుడు ఎక్కడ ఉన్నాడు ఏమి అర్ధం కాలేదు.

"అమ్మా, అయ్యా  ఉన్నారా ఇంటికాడ?" అడిగింది.

ఒక్క క్షణం ఆవిడ మొహంలోకి చూసి అస్పష్టంగా తల ఊపాడు. మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్టు తల అడ్డంగా ఆడిస్తూ "మా నాయన  సందంలోకి యాతకేల్లాడుగా" అన్నాడు.

ఆవిడ సానుభూతిగా  చూసింది. మరో పక్క అరుగుమీద కూర్చుని చుట్ట కాలుస్తున్న మొగుడి దగ్గరకు వెళ్లి నెమ్మదిగా అంది .. "ఆ కుర్రోడికి ఏమి తెలీడం లేదు..  అమ్మా, నాయన ఉన్నారో లేరో కూడా అర్ధం కాదంలా వాడికి.. పాపం ఇల్లెక్కడ అంటే సముద్రం దగ్గర అంటున్నాడు. ఏ పక్కో ఎల్లాగ తెలిసేది" అంది.

ఆయన తలతిప్పి మహా వైపు చూసాడు. అమాయకంగా ఉన్నాడు. చామన చాయ రంగు, ఉంగరాల జుట్టు. పెద్ద కళ్ళు.. చినిగిపోయి మట్టి కొట్టుకుపోయిన బట్టలు. తుపానుకి వీడు ఎక్కడి నుంచో కొట్టుకొచ్చినట్టున్నాడు. " ఎక్కడని వెతుకుతాము పెసిడెంటు గారికి అప్పచేప్పేద్దాములే"  అన్నాడు.

ఆవిడకి ఆ మాట నచ్చలేదు. పాపం  పసివాడు ...రోడ్డు మీద  కళ్ళు తిరిగి పడిన వాడిని తెచ్చి అరుగు మీద భర్త పడుకోబెట్టాడు.. వాడు ఆకలిగా ఉన్నాడు తను అన్నం పెట్టింది.. అలాగని వాడికి ఆశ్రయం ఇచ్చి ఇంట్లో అట్టిపెట్టుకుని పోషించే ఆర్ధిక స్తోమత తమకి లేదు, పోనీ వెళ్లిపోనీ అనడానికి మనసు రావడంలేదు. అందుకే అంది “ పోనీ రెండ్రోజులు తేరుకున్నాక వాడి అమ్మా, నాయన పేరు అడిగి పంపిద్దాములే ఉండనీ రాదా “ అంది.

“సరే... నీ ఇష్టం..రెండు రోజులైతే పర్లేదు..అంతకన్నా ఎక్కువ బాధ్యత తీసుకునే శక్తి మనకేది.. మనకే నలుగురు పిల్లలు” అన్నాడు. ఆవిడ తల ఊపింది.

తుపానోచ్చింది ... రెండు రోజులు ఉధృతంగా గాలులు వీచాయి. సముద్రం ఉప్పొంగింది. తీర ప్రాంతాల్లో ఉన్నబెస్తల గుడిసెలు కొట్టుకుని పోయాయి. కొందరు బెస్తలు సముద్రం మధ్యలోకి వెళ్ళారు.. వాళ్ళ ఆనవాలు దొరకలేదు ... కొందరు స్త్రీలు, కొందరు పిల్లలు కొట్టుకుపోయారు.. మిగిలిన వాళ్లకి ప్రభుత్వం తాత్కాలిక ఆశ్రయం కల్పించిందని అందరూ అంటుంటే వింది. తమ గ్రామం బాగానే ఉంది. ఎలాంటి నష్టము, కష్టము లేదు కాబట్టి మిగతా విషయాలు తెలియవు. ఇరవై నాలుగు గంటల్లో బీభత్సాన్ని సృష్టించి ఏమి ఎరగనట్టు నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది తుపాను. జరిగిన ప్రమాదంలో ఇలాంటి  పిల్లలు ఎందరు అనాధలైనారో అనుకుంటూ  నిట్టూర్చింది ఆమె.

తరచూ ఇలాంటి ప్రమాదాలు  జరుగుతూనే ఉంటాయి. అయినా చేపలు పట్టడానికి సముద్రానికి దగ్గరగా ఉంటే బాగుంటుందని కొందరు తీరం వెంబడి ఇసుక దిబ్బల కింద వరసగా గుడిసేలేసుకుని ఉండడం మానరు.  తుపాను వచ్చే ముందు  ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసి గుడిసెలు ఖాళి చేయిస్తుంది. కొన్ని కుగ్రామాలకు హెచ్చరికలు ఆలస్యంగా అందుతాయి. అందుకే ఆ గ్రామాలు ముంపుకి గురి అవుతూ తుడిచిపెట్టుకుపోతూ ఉంటాయి.

ప్రస్తుతం దానయ్య  ఉన్న ఊరు మరీ పల్లెటూరు కాదు.. విశాఖపట్నానికి దగ్గరగా ఉండడం వల్ల  పట్నం వాసనలు అప్పుడప్పుడే ఆ ఊరి వైపు వ్యాపిస్తూ నాగరికత రెక్కలు తోడుక్కుంటూ ఉంది. విలయం యొక్క ప్రభావం  అంత తీవ్రంగా లేదు.. వర్షాలు మాత్రం బాగా కురిసి వెలిసి, పురిటి స్నానం చేసిన బాలింతలా పచ్చ, పచ్చగా, అందంగా.  ప్రశాంతంగా ఉంది. అందరూ హాయిగా నిశ్చింతగా తిరుగుతున్నారు. ప్రకృతిని పలకరించడానికి  బయలుదేరిన దానయ్య ఊరి పొలిమేర దగ్గర రోడ్డు పక్కన స్పృహ లేని స్థితిలో పడి ఉన్న నలుగురు కుర్రాళ్ళని చూసాడు. ఇద్దరు కుర్రాళ్ళకి తలకి బలంగా గాయాలు అయాయి. ఇద్దరు కుర్రాళ్ళు అచేతన స్థితిలో ఉన్నారు. వాళ్ళిద్దరినీ మరికొందరు ఊరివాళ్ళ సాయంతో

ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి మిగతా ఇద్దరికీ కొంచెం శుశ్రూష చేస్తే ఒకడు కళ్ళు తెరిచి కొత్తవాళ్ళని చూసి బెదిరిపోయి అమ్మా అంటూ పిలిచినా పలక్కుండా పరిగెత్తుకుని వెళ్ళిపోయాడు. మహా కళ్ళు కూడా తెరవకుండా పూర్తిగా అపస్మారక స్థితిలో ఉండడంతో హాస్పిటల్లో పడేసి వెళ్ళిపోడానికి మనస్కరించక తన ఇంటికి తీసుకువచ్చాడు.

ఎవరో, ఏ ఊరివాడో, పేరేంటో, పాపం వీడి తల్లి,తండ్రులు బతికి ఉన్నారో చనిపోయారో జాలిగా అనుకుంది ఎర్రమ్మ. ముందు కుర్రాడు తేరుకుంటే నెమ్మదిగా బుజ్జగించి ఊరు, పేరు, తల్లి తండ్రుల వివరాలు సేకరించి వాళ్ళ దగ్గరకు చేర్చాలి అనుకుంటూ బిక్కచూపులు చూస్తున్న మహా దగ్గరకు వెళ్ళింది.

వాడిని లోపలికీ తీసుకుని వెళ్లి సబ్బు, తుండుగుడ్డ ఇచ్చి స్నానం చేసిరా అని పంపించింది. వాడు స్నానం చేసి వచ్చేసరికి రెండో కొడుకు పాత లాగు, చొక్కా తీసిచ్చింది. దాదాపు ఆ కుర్రాడి వయసే ఉంటుంది ఆమె కొడుక్కి. బట్టలు వాడికి సరిగ్గా సరిపోయాయి.

"రేపు మీ ఊరెల్దామా ... మాకు సూపిత్తావా ఎక్కడో మీ ఇల్లు" అడిగింది.

"నాకు తెల్దు " అన్నాడు.

"దారి తెలుసా" అడిగింది.

వాడు ఒక్కసారి వీధిలోకి చూసి ఆవిడ వైపు చూసాడు.

"ఏటే పెల్లాలి " అడిగింది ఆవిడ.

తల అడ్డంగా ఊపాడు. " సందం కాడ " అన్నాడు.

" సంద్రం కాడికి తీసికేల్తే సూపిత్తావా " అడిగింది.

తలాడిస్తూ " మా అమ్మా, నాయన ఉంటారుగా" అన్నాడు మెరిసే కళ్ళతో.

ఆవిడకి వాడి అమాయకత్వం, పసితనం అర్ధం అయింది.. బొత్తిగా ఏమి తెలీని పిల్లాడు.. అమ్మెవరో, అయ్యెవరో... ఆల్లేదుంటారో కూడా తెల్దు.. వీడేం సెప్తాదు" జాలిగా చూసింది వాడివైపు. " సరేలే రేపెల్దాం పడుకో " అని చాప, దుప్పటి ఇచ్చింది.

వాడు పడుకున్నాడు. ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది.

వాడికి కొత్తగా ఉంది.. ఇలాంటి చోట ఎప్పుడూ లేదు ... పైన కప్పు, చుట్టూ గోడలు.. ఇసకలేదు.. సముద్రపు ఘోష లేదు.. అమ్మ వెచ్చని స్పర్శ లేదు.. కాకపోతే కడుపు నిండుగా ఉంది.. చలిని తట్టుకోడానికి వెచ్చగా కప్పుకున్న దుప్పటి ఉంది.. అయినా నిద్రపట్టలేదు.. కళ్ళు మూతలు వేయకుండా ఇల్లంతా పరికించాడు. మట్టిగోడలకి దేవుడి కాలండర్లు వేళ్ళాడుతున్నాయి. వినాయకుడు, వెంకటేశ్వర స్వామీ.. మహాకి హటాత్తుగా గుర్తొచ్చింది. బొమ్మలు... నా బొమ్మలు అనుకుంటూ గభాల్న లేచి కూర్చున్నాడు.

అటూ, ఇటూ అస్థిమితంగా కదిలాడు. గబుక్కున లేచి తెరిచిఉన్న తలుపుల గుండా వీధిలోకి నడిచాడు.

వాడి దృష్టి, ధ్యాస తను వేసిన బొమ్మల మీదే ఉంది. కడుపునిండా తిని విశ్రాంతి తీసుకున్నందుకేమో శక్తి వచ్చింది. పరుగు మొదలుపెట్టాడు. "అరేయ్ .... ఎక్కడికి .... రేరోయ్" అని వెనకాల నుంచి అరుపులు వినిపిస్తున్నా ఆగలేదు. ఆయాసం వచ్చిందాకా పరిగెత్తాడు.

తను ఎక్కడినుంచి వచ్చాడో, ఎక్కడికి వెళ్ళాలో వాడికి తెలియదు.. సముద్ర తీరం, ఇసక దిబ్బలు, తన గుడిసె, అమ్మ, నాన్న, స్నేహితులు, వల, బోటు, చేపలు, తన బొమ్మలు ఇవి తప్ప ఇంకేమీ తెలియని ఆ తొమ్మిదేళ్ళ పిల్లాడు అగమ్యంగా రోడ్డుమీద నడుస్తూ వెళ్తోంటే చూసిన జనానికి అది వింతగా, కూడని పనిగా అనిపించలేదు. ఎందఱో పిల్లలు తిరుగుతూనే ఉంటారు.. వీడూ వాళ్ళల్లో ఒకడు.

వాడు ఎవరినీ ఏమి అడగలేదు..అడగాలని తెలియని వయసు.. మనసు కూడా. నడవడానికి అనుకూలంగా ఉన్న దారిలో కాసేపు పరిగెత్తుతూ, మరి కాసేపు నడిచి వెళ్తున్నాడు.. వాడి కళ్ల ముందు పెద్దగా నోరుతెరుచుకుని ఆకాశాన్ని మింగేస్తూ అడ్డువచ్చిన వారిని విసిరి సముద్రంలోకి తోసిన ఉవ్వెత్తు కెరటాలు కనిపిస్తున్నాయి.. తన బొమ్మలని నిర్దయగా లాక్కుని వెళ్ళిపోయిన ఆ కెరటాల మీద కోపంగా ఉంది. ఏదో చేయాలి.. ఏం చేయాలో తెలియడంలేదు. అది విధి అని, ఆ విధే తన బొమ్మలని అమ్మని కూడా తనతో లాక్కుని వెళ్లాయని, ఆ కెరటాలే తనని దిక్కులేని వాడిగా చేశాయని తెలియదు. ఆనాడు తన బొమ్మ అలలు వచ్చి తుడిచేస్తే అమ్మ గుండెల్లో దూరి ఏడ్చినప్పుడు " మళ్లి ఏసకుందువులే బొమ్మేగా అని ఓదార్చిన అమ్మ గుర్తొస్తోంది.. అమ్మ విచ్చని ఒడి రారమ్మని పిలుస్తోంది. తను వేస్తున్న అడుగులు అమ్మ వైపే అని వాడి విశ్వాసం.

ఆ విశ్వాసంతోటే బలంగా అడుగులు వేస్తూ రోడ్డు మీదకి వచ్చాడు. బండ్లు, రిక్షాలు, ఎర్ర బస్సులు పండ్ల కోట్లు, పాకా హోటళ్ళు , సైకిళ్ళ మీద తిరుగుతున్న మనుషులు.. అంతా వింతగా ఉంది. తానూ ఎన్నడూ చూడని ఓ కొత్త ప్రపంచం లోకి వచ్చినట్టుగా ఉంది. వాడికి తెలిసిన సముద్రంలోకి కొంత దూరం నావలో వెళ్ళిన రోజు తిరిగి ఒడ్డుకి ఎలా చేరాలో తెలుసు. ఇప్పుడు చూస్తున్న జన ప్రవాహంలో అంగుళం, అంగుళం చొప్పున మునిగిపోతున్నట్టే అనిపిస్తోంది .. ఎక్కడ తేలుతాడో తెలియని అయోమయ స్థితిలో గమ్యం తెలియకుండా నడుస్తున్న వాడు ఎవరో చేయి అడ్డుపెట్టినట్టు ఆగిపోయాడు. సైకిల్ బెల్ గణగణ మోగించుకుంటూ వచ్చిన ఒక యువకుడు వాడిని మింగేసేలా చూస్తూ " ఏరా కళ్ళు మూసుకుని నడుత్తన్నావా ఎదవా.. బతకాలని లేదేంటి" అంటూ కసరడంతో బిక్కమోహంతో చూసి " సందం ఎక్కడ" అన్నాడు .

"ఏం దూకుతావా... పో అదిగో ఆ బస్సు ఎక్కు... ఇసాక పట్నం ఎల్లు ... సంద్రం అగుపడతది" అంటూ వేగంగా వెళ్ళిపోయాడు.

మహా ఆ కుర్రాడు చూపించిన వైపు చూసాడు. అప్పుడే ఒక బస్సు వచ్చి ఆగింది. మహా పరిగెత్తుకుంటూ వెళ్లి బస్సు ఎక్కాడు. బస్సు కదిలింది.

***

చేతిలో చిల్లి కానీ లేకుండా, ఒంటిమీద చొక్కా విప్పి కింద పరచుకుని పడుకుని ఆ బస్సులో విశాఖపట్నం అనే మహాపట్నాన్ని చేరాడు మహా. ఎందరో దిక్కు, మొక్కు లేని పిల్లలు అలా బస్సుల్లో ఎక్కి ఎవరూ చెప్పకుండా ఒంటి మీది చొక్కాలు విప్పి అవసరం ఉన్నా, లేకున్నా సీట్ల కింద, సీట్ల మీద దుమ్ము తుడుస్తూ, ప్రయాణీకులు రాల్చిన ఎంగిలి మెతుకులు తింటూ ప్రతి కంపార్ట్మెంట్ తిరుగుతూ, నిద్ర వచ్చినపుడు ఏదో మూల పడుకోడం సర్వ సాధారణం అవడంతో ఎవరూ వాడిని నువ్వెవరు అనికానీ, టికెట్టు లేకుండా ఎలా ఎక్కావు అని కానీ అడగలేదు.. దిగిపో అని గదమాయించి బస్సులో నుంచి దింపనూ లేదు.

బస్సు దిగి తెల్లమొహం వేసుకుని నిలబడిపోయాడు. కలలో కూడా ఏనాడూ చూడని వైభవం కనిపిస్తోంది వాడికి. అంత మంది జనాన్ని, అన్ని బస్సులను మొదటిసారి చూస్తున్నాడు.

ఎవరి దారిన వారు బస్సులు దిగి గబగబా నడిచి వెళ్తున్నారు. కొందరు రిక్షాలు, కొందరు టాక్సీలు ఎక్కి ఎటో వెళ్తున్నారు. వాడిని ఎవరూ పట్టించుకోలేదు. తెల్లవారిలేస్తే ఎందఱో అనాధలు రోడ్లమీద తిరుగుతుంటారు. వాళ్ళ అజ,పజ అడిగే సమయం ఎవరికీ లేదు.

తను ఎక్కడికి వెళ్లాలని బస్ ఎక్కాడో ఆ సముద్రం, ఆ ఒడ్డు ఆ గుడిసెలు, ఆ ఖాళీ పడవలు, ఆరేసిన వలలు, కబుర్లు చెప్పుకునే పెద్దలు ఎవరూ లేరు. వీళ్ళంతా ఎవరో కొత్త వాళ్ళు. సూటు బూటు వేసుకున్నారు. ఆడవాళ్ళు నాజూగ్గా అందంగా ఉన్నారు. అందరూ చక్కగా నవ్వుతూ తనకి తెలియని భాషలో మాట్లాడుతో వెళ్తున్నారు.

కూల్ డ్రింక్ షాపులు, కాఫీ హోటళ్ళు , కిళ్ళీ షాపులు, న్యూస్ పేపర్లు, పుస్తకాలు లభించే షాపులు అంతా కొత్త ... ఎవరూ తనతో మాట్లాడడం లేదు.. తనూ ఎవరితో మాట్లాడే సాహసం చేయడం లేదు.

మహా అలా ప్లాట్ ఫారం మీద కూలబడి పోయాడు. ఆకలేస్తోంది వాడికి. దాహం కూడా వేస్తోంది. కొంచెం దూరంలో పంపు కనిపించింది. వెళ్లి మంచినీళ్ళు తాగాడు. అరటి పళ్ళ కొట్టు దగ్గర ఆగి ఆశగా చూసాడు. దిక్కులేని వాడిగా కనిపిస్తున్న ఆ పసివాడి కళ్ళల్లో ఆకలి పసిగట్టిన కొట్టు యజమాని మానవత్వం చాటుకున్నాడు.

“ ఏరా ఎట్నించి అత్తన్నావేటి... పండు కావాలా ..” రెండు పండ్లు వాడి చేతికి ఇచ్చాడు. మహాప్రసాదం లభించినట్టుగా అందుకుని కొంచెం ఎడంగా ప్లాట్ఫారం మీద కూర్చుని ఆ పండ్లు తిన్నాడు.

అప్పటికి సాయంత్రం నాలుగు దాటింది.

అప్పుడే వచ్చి ఆగిన బస్సులో నుంచి ఒక యువతి దిగింది. ఆమె మంచి చీర కట్టుకుంది. అందంగా ఉంది. చేతిలో ఒక సూట్ కేసు, భుజానికి ఒక బాగు ఉంది. ఆమె అటూ, ఇటూ చూసి టాక్సీలు ఆగి ఉన్న వైపు నడిచింది. అప్పుడే కూర్చున్న దగ్గర నుంచి లేచి రోడ్డు మీదకి నడవబోతున్న మహాని ఆమె చూడలేదు. ఆవిడ చేతిలో పెట్టె వాడి కాలికి తగిలి వాడు వెల్లకిలా పడిపోయాడు.

అయ్యో అంటూ ఆమె గబుక్కున పెట్టె కిందపెట్టి ఒంగి వాడిని లేపింది.

“దెబ్బ తగిలిందా” అడిగింది సానుభూతిగా .

లేదు అన్నట్టు తలాడించాడు. వాడి వాలకం చూడగానే వాడి సామాజిక స్థితి ఆవిడకి అర్ధమైంది.. తన చేతిలో బరువు వాడి చేతికి ఇవ్వడానికి ఆవిడ పెద్దగా ఆలోచించలేదు.

“సారీ నేను చూడలేదు... చూడూ ఈ పెట్టె ఆ టాక్సీ దగ్గరకు తీసుకుని వస్తావా డబ్బులిస్తా” అంది.

వాడు తలూపాడు. తన లేత చేతులతో అతి బలవంతంగా ఆ పెట్టె పట్టుకుని ఆవిడ వెనకాల నడిచాడు. ఆవిడ వాడి కష్టం గమనించలేదు. ఎదురుగా ఉన్న టాక్సీ డ్రైవర్ ని అడిగింది “రామకృష్ణా బీచ్ వైపు వెళ్ళాలి ..”

“ఎక్కండి” అన్నాడు డ్రైవర్. ఆవిడ హ్యాండ్ బాగ్ తెరిచి రెండు రూపాయల నాణాలు తీసి మహా చేతిలో పెట్టి పెట్టె టాక్సీ లో పెట్టింది. మహా ఆ నాణాల వైపు ఆవిడ వైపు చూసాడు. సరిపోలేదా ఆవిడ మరో రూపాయి ఇవ్వబొయింది.

వాడు చేయి చాచలేదు. ఆవిడ వైపు చూసి “నేను మా గుడిసేకి ఎల్లాలి” అన్నాడు.

ఆవిడ ఆశ్చర్యంగా చూసి “ఎక్కడ మీ గుడిసె” అంది.

“సందం కాడ” అన్నాడు.

“ సందమా! “ అయోమయంగా చూసింది.

డ్రైవర్కి అర్ధం అయింది. వీడు బీచ్ దగ్గర ముంతకింద పప్పులు, బొమ్మలు అమ్ముకుంటూ తిరిగే వాళ్ళ కుర్రాడు.. తప్పిపోయి వచ్చినట్టున్నాడు అనుకుంటూ అమాయకంగా ఉన్న వాడి మొహంలోకి చూస్తూ అడిగాడు.

“ఏరా తప్పిపోయావా... పద నేను దింపేత్తా ఎక్కు బండి” మహాతో అని అయోమయంగా చూస్తున్న ఆవిడతో అన్నాడు. “ బీచ్ దగ్గర పప్పులు, బొమ్మలు అమ్ముకుంటారుగామ్మగారు... ఆరి కుర్రోడు.,. తప్పి పోయినట్టున్నాడు. ఎక్కనీండి మనం అటే గా ఎల్లేది.. దింపేత్తా” అన్నాడు.

ఆవిడ అసంకల్పిత గా తల ఊపింది. మరోసారి హెచ్చరించి వాడిని టాక్సీ లో ఎక్కించాడు డ్రైవర్.

వాడికి అంతా విచిత్రంగా ఉంది. పుట్టి బుద్ధెరిగాక ఏనాడు ఆ గుడిసె, సముద్రం, వల, చేపలు, తన బొమ్మలు తప్ప మరో వస్తువు చూడని వాడిప్పుడు అనేక వింతలూ చూస్తున్నాడు. బస్సు ఎక్కాడు.. ఇదేంటో బండి భలేగుంది. లోపల

సల్లగ, మెత్తగా  ఉంది అనుకున్నాడు. ఇంత మంది మనుషులు, ఇన్ని రకాలుగా కనిపిస్తుంటే వాడికి వీళ్ళంతా ఎవరు అనే అనుమానం కూడా కలుగుతోంది.

“నీ పేరెంటిరా” అడిగాడు డ్రైవర్.

తన పూర్తీ పేరు వాడికి తెలియదు “మాగాడు” అన్నాడు.

ఫక్కున నవ్వాడు డ్రైవర్... “మాగాడా ...  నువ్వు మగాడివే... నేను అడుగుతుండేది నీ పేరు..”

“మాగాడే” మళ్ళీ అన్నాడు వాడు నవ్వుతున్న డ్రైవర్ వైపు విచిత్రంగా చూస్తూ.. అతను నవ్వడానికి ఏముంది ఇందులో అనిపించింది వాడికి .

“అలాగ పిలుత్తారా ఏంటి మీ అమ్మ, అయ్యా” అన్నాడు.

అవును అన్నట్టు తల ఊపాడు మహా.

“సర్లే...” బీచ్ సమీపించడంతో అక్కడ టాక్సీ ఆపి “దిగు ఎల్లు ... “ అన్నాడు తను దిగి తలుపు తీసి పట్టుకుని. మహా అంత పెద్ద సముద్రాన్ని కళ్ళు విప్పార్చుకుని చూస్తూ దిగి ఒక్కసారిగా పరిగెత్తాడు.

“ఎందుకో ఈ కుర్రాల్లు ఊళ్లోకి వచ్చేస్తారు.. ఆల్లకి ఇల్లు, వాకిలి తెలీదు.. తప్పి పోయి ఊరంతా తిరుగుతారు” అంటూ సణుగుతూ వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చుని స్టార్ట్ చేసాడు డ్రైవర్.

బీచ్ జనంతో నిండుగా ఉంది. పిల్లలతో కళ ,కళ లాడుతోంది. ముంత కింద పప్పు, వేయించిన శేనక్కాయలు, బుడగలు, బొమ్మలు ఐస్ క్రీం అమ్మేవాళ్ళతో సందడిగా ఉంది. దూరంగా పిల్లలు, యువతీ, యువకులు కెరటాలతో ఆడుకుంటూ కేరింతలు కొడుతున్నారు. ఒక్కసారిగా వాడిలో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా అమ్మా అని అరుస్తూ పరుగు పెట్టసాగాడు దూరంగా ఒడ్డున విశ్రాంతి తీసుకుంటున్న నావల వైపు.

నెమ్మదిగా లేత నారింజ రంగుకి బూడిద రంగు మేఘం చుట్టుకుని కలనేతల పల్చని వస్త్రం సముద్రం మీద కప్పినట్టుగా ఉంది.  వస్త్రాన్ని ధరించడానికి చుక్కల ముసుగేసుకుని మరో పక్కనుంచి అడ్డు వస్తున్న మేఘాలను తొలగించుకుంటూ చిరునవ్వుతో వచ్చాడు నెలరాజు ఆ రాత్రి నింగినేలడానికి.  నావల మీద కూర్చున్న కొందరు

పర్యాటకులు ఆ అందమైన దృశ్యాన్ని కెమెరాలలో బందిస్తున్న వేళ మహా అనబడే ఆ లోకం తెలియని కుర్రాడి మరో జీవితం ప్రారంభం అయింది.

## 9

<u>మహా</u>

పాదాల కింద ఒత్తుకుపోతున్న మెత్తటి ఇసుక.. ఇసుకలో ఆడుకుంటున్న పిల్లలు, పిల్లల ఆటలను మురిపెంగా చూస్తున్న పెద్దవాళ్ళు, రకరకాల తినుబండారాలు, బూరలు, అనేక రకాల ఆట వస్తువులు, గవ్వలతో , ఆల్చిప్పలతో తయారు చేసిన బొమ్మలమ్మే అంగళ్లు.. సందడిగా, సవ్వడిగా ఉన్న ఆ సముద్రం వైపు, ఒడ్డుకి వేగంగా పరిగెత్తుకు వచ్చి కళ్ళు మూసి తెరిచేలోగా వెనక్కి వెళ్తున్న కెరటాలు.. మహా కళ్ళకి ఆ కెరటాల మీద నవ్వుతూ, తుళ్ళుతూ నడుస్తున్న అమ్మా, నాన్నా కనిపిస్తున్నారు.. కాంత నాళాలు తెగి పడేలా పిలుస్తూ, శక్తి కొద్దీ పరిగెడుతూన్న మహా ఉన్నట్టుండి బోర్లా పడ్డాడు ఇసకలో. " అమ్మా" అన్న వాడి ఆర్తనాదం గాలిలో తేలి, అలల మీద సుళ్ళు తిరిగి సింహాచలం చెవులను తాకింది. చీకటి పడుతోందని ఉన్న కాసిని కంకులు చేతిలో పట్టుకుని ఎవరికో ఒకరికి అమ్మేసుకుని సరంజామా సర్దుకుని గుడిసెకు వెళ్ళపోడానికి లేచి, జనం దగ్గరకు నడుస్తున్న సింహాచలం గబుక్కున కంకులు ఎడమ చేతిలోకి మార్చుకుని కుడిచేత్తో వాడిని పైకి లేవనెత్తి ఒంటికి అంటుకున్న ఇసక దులుపుతూ "యాడికిరా లగేత్తు తుండావు... చూడు నోట్లోకి కూడా పాయె ఇసక" అంది మందలిస్తూ.

వాడు సమాధానం చెప్పకుండా నావల వైపు చూస్తూ " అమ్మ" అన్నాడు కుడిచేయి చూపుడు వేలు చూపిస్తూ.

"ఎవరు మీ యమ్మ.. యాడుండాది? ఆల్లంతా పెద్దోల్లు.... నువ్వు అటేల్లమాక " అంది.

వాడు వస్తున్న దుఖం ఆపుకుంటూ "అమ్మ, అమ్మ" అన్నాడు.

సింహాచలానికి జాలేసింది. ఈ కుర్రాడిని ఇంతకు ముందు ఇక్కడేక్కడ సూసినట్టు లేదు. వీడేవరో కొత్తగోచ్చిండాడు. ఎవరి పిల్లడో ఏంటో.. చీకతటడుతుండాది. సూత్తుంటే అమాయకంగా, ఊరికి కొత్త కుర్రాడిలా అగుపిత్తుండాడు అనుకుంది. ఆవిడ మాతృహృదయం ద్రవించింది

"మీ అమ్మ దగ్గరకి నేను తీసకపోతా పా..." అంది వాడి చేయి పట్టుకుని.

నీళ్ళు నిండిన కళ్ళు విప్పార్చి చూసాడు ఆమె వైపు. వాడి కళ్ళల్లో పడుతున్న నక్షత్రాల కాంతిలో ఆశ రెప,రేపలాడింది. "దా నాయనా నాతొ దా!" అంటూ వాడి చేయి పట్టుకుని కంకులు అమ్మాలన్న ఆలోచన విరమించుకుని తన సరంజామా ఉన్న ప్రదేశానికి వచ్చింది. బాగా రాగిలి బూడిదగా మారుతున్న నిప్పులు ఒక పక్కగా పోసి, గాజు సీసాలో ఉన్న నీళ్ళు వాటి మీద ఒంపేసింది. వెచ్చగా ఉన్న కుంపటిని ఒక గుడ్డ సంచీలో పెట్టుకుని, సత్తు బొచ్చెలు తీసి మహా చేతికి ఇచ్చి "ఇంద ఇయి అట్టుకుని నాతో పా " అంటూ కుంపటి ఉన్న సంచీ, గాజు సీసా తను పట్టుకుని మిగిలిన నాలుగు కంకులు చంకలో పెట్టుకుని ముందుకు నడిచింది.

వాడు వెక్కుతూ మారు మాట్లాడకుండా ఆవిడతో పాటు నడిచాడు. ఎంత విశాలమైన రోడ్డు కైనా ఒక నిర్ణీత గమ్యం ఉంటుంది. భూమి మీద జన్మించిన ప్రతి జీవికీ కూడా ఒక గమ్యం ఉంటుంది.. ఆ గమ్యమే లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. ఏ గమ్యము లేకుండా, రేపు గురించి ఆలోచించకుండా నేటిని మాత్రం ఆస్వాదిస్తూ జీవించే ఆ స్త్రీ, అతి సాధారణ స్త్రీ, మాగాడు అని పిలవబడే ఆ తొమ్మిదేళ్ళ మహా అనబడే కుర్రాడి భవిష్యత్తుని ఎలా నిర్ణయిస్తోందో అన్నట్టు విరిగిపడడం మానేసి విస్మయంగా చూడసాగింది అనంతమైన ఆ సముద్రం.

బీచి దగ్గరనుంచి రోడ్డు దాటి రెండో పక్కకి వస్తే డౌన్ లో ఉన్న ఓ గుడిసె సింహాచలానిది. పైన సిమెంటు రేకులు, సున్నం కొట్టిన గోడలు, అలికిన నేల. ఒకే గది. ఓ పక్కన నులకమంచం. ఆ మంచం మీద రెండు దుప్పట్లు. ఓ బొంత, చినిగిపోయి దూది బయటకు కనిపిస్తున్న తలగడ, దండం మీద చీరలు, లంగాలు, జాకెట్లు. మరోమూల కొంచెం వంటసామాను, రెండు కుంపట్లు.. ఒకటి ఇంట్లో ఉంటె ఒకటి తీసుకుని సింహాచలం సాయంత్రం నాలుగు అవుతుండగా బీచ్ దగ్గరకు వెళ్లి మొక్కజొన్నెలు కాలుస్తూ అమ్ముకుంటుంది.

యాభై ఏళ్ల సింహాచలం మొగుడు చనిపోయి ఇరవై ఏళ్ళు అవుతోంది. పిల్లలు లేరు. ఉదయం గుడిసె బయట ఇడ్లీలు, పుదీనా పచ్చడి, పునుగులు అమ్ముతుంది....ఆ వాడలో అందరికీ సింహాచలం చేసే ఇడ్లి, పచ్చడి అంటే మహా ఇష్టం. అందుకే అక్కడ నివసించే వారంతా ఆమె దగ్గరే ఇడ్లీలు కొనుక్కుని తిని వాళ్ళ, వాళ్ళ పనుల్లోకి వెళ్ళిపోతారు. వచ్చే ఆదాయం ఆవిడకి బతకడానికి సరిపోతుంది. మెత్తటి మనసు.. తనకున్న దాంట్లోనే మహా లాంటి కుర్రాళ్ళని నలుగురిని చేరదీసి, కొన్నాళ్ళు తిండి పెట్టి పోషించింది. వాళ్ళు ఉన్నన్నాళ్ళు ఉండి చెప్పా, చేయకుండా వెళ్ళిపోయినా ఆవిడ దృష్టిలో పడిన అనాథ పిల్లలని చేరదీయడం మాత్రం మానదు. ఇలాంటి పిల్లలు ఇళ్ళల్లోంచి పారిపోయి వస్తు ఉంటారు. ఆవిడకి అది అలవాటే.

మోసుకొచ్చిన సామానంతా కిందకి దింపి, వాడి చేతిలో ఉన్న వస్తువులు కూడా తీసి కింద పెట్టి, " పోయి బయట గుండిగలో నీల్లుండాయి.. సేతులు, కాల్లు కడ్డుక్కుని రాపో.. రెండు కండెలు తిందువు.. అంది చల్లగా ఉన్న కండెల మీద చేత్తో రుద్దుతూ.

వాడు కదల లేదు.. ఆమెని, ఆ పరిసరాలని కళ్ళు విప్పార్చుకుని విస్మయంగా చూడసాగాడు. వాడి చూపులు, వాలకం గమనించిన ఆమె మెత్తగా నవ్వి వాడిని దగ్గరగా తీసుకుని "యా ఊర్రా మంది" అని అడిగింది. వాడు సమాధానం చెప్పలేదు.

" చెప్పరా యా ఊరు" అంది మళ్ళి.

" సందం కాద" అన్నాడు

" ఏ సందం రా" అంది నవ్వుతూ.

వాడు ఉన్నట్టుండి బావురుమన్నాడు. ఆవిడ స్త్రీ హృదయం విల,విలాడింది.

"మా నాయనే ఊరుకో .. ఊరుకో ... ఎదవ తుపానోచ్చి బిడ్డను అనాధను సేసీనాది కాబోలు.. పాపిష్ఠి దాన్ని" వాడినిమరింత దగ్గరకు పొదుపుకుని ఓదారుస్తూ " ఏడవమాక.. ఏమనను లే.. నా కాడే ఉండిపో. ఒంటి పిల్లిని. నాతొ పాటు ఓ ముద్ద నీకూ పెడితే నా ముల్లెలేమి కరిగిపోవు నాయనా! పోయి సేతులు కడుక్కుని రా.. ఎప్పుడు ఎంగిలి పడిన్డావో " అంటూ వాడి భుజాల చుట్టూ చేయి వేసి నడిపిస్తూ తీసుకు వచ్చి గుడిసె బయట ఉన్న నీళ్ళ తొట్టి దగ్గర నిలబెట్టింది.

మారుమాట్లాడకుండా మంత్రం వేసినట్టు ఒంగి సగం విరిగిన ప్లాస్టిక్ చెబుతో నీళ్ళు తీసుకుని కాళ్ళకి అంటిన ఇసక, చేఉలు, మొహం కడుక్కుని చొక్కాతో తుడుచుకుంటూ వచ్చాడు. సింహాచలం కుంపటి రాజేసి, చల్లారిన కండెలు పెట్టి విసనకర్రతో విసురుతూ " ఇట్టా డా.. కూర్చుండు " అని కొంచెం వేడెక్కిన కందే తీసి వాడి చేతికి ఇచ్చి "తిను" అంది. వాడరు రెండు చేతులతో అందుకుని మునిపల్లతో గింజలు కొరకుతుంటే ఆవిడ మరో కండె కాల్చి "తిను నాయనా గుప్పెడు మెతుకులు ఉడకేస్తా" అంటూ లేచి మూటలో ఉన్న బెయ్యం కొలిచి సత్తు గిన్నెలో పోసి కడిగి కుంపట్లో పెట్టింది.

కుంపట్లో కణకణ మండుతున్న నిప్పులు, ఆ నిప్పుల నుంచి రేగుతున్న రవ్వలు తదేకంగా చూస్తూ కండె కొరుక్కుని తినసాగాడు మహా. కుంపటి చుట్టు పక్కల నిప్పురవ్వల నుంచి ఏర్పడిన బూడిద మట్టి నేల మీద గాలికి సన్నగా ఎగురుతోంది. అప్రయత్నంగా మహా కండె ఎడం చేతిలోకి మార్చుకుని కుడి చేత్తో ఆ బూడిదని గీతలుగా గీసాడు. రెండు

నిలువు గీతలు, మధ్యలో రెండు గీతలు, పైన రెండు గీతల మధ్య ఒక సున్నా , ఆ సున్నాలో అటూ, ఇటూ రెండు చిన్న చుక్కలు. ఆ చుక్కల మధ్య ఒక పొడుగాటి గీత. వాడి కళ్ళు మెరిశాయి. సింహాచలం అన్నం వండి, కోడిగుడ్డు కూర చేసే లోపల కుంపటి దగ్గర ఒక బొమ్మ వెలిసింది. ఆ బొమ్మకి చీర కట్టడానికి వాడు ప్రయత్నం చేస్తున్నాడు. కుదరడం లేదు. మొత్తానికి నడుమునుంచి మోకాళ్ళ దాకా నాలుగు పొడుగు గీతలు గీసి, ఆ బొమ్మకో ఆచ్ఛాదన వేసాడు.

"ఇంద కూడు తిను" అంటూ రెండు పళ్ళాలలో అన్నం గుడ్డు కూర వేసి తనొకటి చేతిలో పట్టుకుని వాడి చేతికోటిచ్చి, వాడు వేసిన బొమ్మ చూసింది. నవ్వుతూ " ఏం నాయినా! బొమ్మలేస్తుండావా! గచ్చంతా నుసి అయితాది గందా" అంది.

వాడు బొమ్మనే చూస్తూ "అమ్మ" అన్నాడు.

గుడ్డుతో కలిపి ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న సింహాచలం ఒక్కసారిగా ఆగిపోయింది. ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అప్పుడే కళ్ళు తెరిచి మొదటిసారి తల్లి మొహం చూస్తున్న చిన్నారి కళ్ళల్లో కనిపించే కాంతి .. అమాయకమైన వెన్నెల కాంతి, చల్లని వెన్నెల కాంతి కనిపించింది ఆ కళ్ళల్లో ఆవిడకి. గబుక్కున వాడిని దగ్గరకు తీసుకుని తన చేతిలో ఉన్న ముద్ద వాడి నోట్లో పెట్టి "నేను నీ అమ్మనేరా" అంది.

వాడు ఆమెనే చూస్తూ ఆమె అందించిన ముద్దలు ఆవురావురుమని తినసాగాడు.

తొమ్మిదేళ్ళ మహా... పుట్టిన దగ్గరనుంచీ ఏ కెరటాలతో తను ఆడుకున్నాడో, ఏ సముద్రపు ఒడిలో పెరిగాడో, ఏ ఒడ్డున బొమ్మలు నేర్చుకున్నాడో అక్కడే తన చిన్న సామ్రాజ్యం కూలిపోయిందని, తల్లి,తండ్రులనే కాక మరికొందరు బంధువులను, హితులను కూడా ఆ కెరటాలు ఎక్కడికో లాక్కెళ్ళి పోయాయని తెలియని అమాయకుడైన మహా జీవనప్రయాణంలోమరో మజిలీ మొదలైంది.

త్వరలోనే సింహాచలం దగ్గర చనువు ఏర్పడింది.ఆమె చేసే ప్రతిపనిలో తనకి తోచిన సాయం చేస్తూ బయట పంపు దగ్గర నుంచి కుండల్లో నీళ్ళు తెచ్చిస్తూ, చీపురుతో గచ్చు శుభ్రం చేస్తూ ఆవిడ ఇడ్లి వేస్తుంటే ఆకుల్లో పెట్టి కాస్త పచ్చడి వేసి అడిగిన వాళ్ళందరికీ అందించడం, వాళ్ళ దగ్గర డబ్బులు వసూలు చేసి సింహాచలం పక్కన ఉన్న చిన్న చెక్కపెట్టెలో భద్రపరచడం ఇలా చిన్న, చిన్న పనులు చెప్పి చేయిస్తోంది సింహాచలం. ఎక్కడి నుంచి వచ్చాడో ఏ అమ్మ కన్న బిడ్డో ఆ దేవుడే నా ఒంటరి బతుక్కి సాయంగా పంపాడు అని చెబుతుంటుంది అందరికీ.

సింహాచలంతో సాయంత్రం నాలుగు అవగానే బీచ్ దగ్గరకు వెళ్తాడు. అక్కడ ఇసకలో బొమ్మలు గీస్తూ తల్లి వయసు స్త్రీలు ఎవరన్నా కనిపిస్తే ఆశగా, వాళ్ళల్లో తల్లిని వెతుక్కుంటూ చూస్తాడు. అప్పుడప్పుడూ అలా చివరిదాకా నడుచుకుంటూ విశ్రాంతిగా ఉన్న నావల దగ్గరకు వెళ్తాడు. అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకునే పర్యాటకులను విచిత్రంగా చూస్తాడు. ఎవరన్నా సరంగులు నావలో కూర్చుని ఉంటె వాళ్ళవైపు పరిశీలనగా చూస్తాడు. ఎక్కడో ఒక దగ్గర తన అమ్మా , అయ్యా కనిపిస్తారని వాడి ఆశ. వాడికి తన ఊళ్ళో ఉన్న సముద్రానికి, విశాఖ సముద్రానికి తేడా తెలియదు. ఎలా వచ్చాడో విధి విసిరేసినట్టు వచ్చి ఆ మహాపట్నం చేరాడు. వాడికి ప్రయాణం అంటే తెలియదు.. తను చేసిన ప్రయాణం బస్సులోనా, కారులోనా, బండా ! వాడికి తేడా తెలియదు. వాడి మనసు ఆ ప్రయాణంలోని ఆనందాన్ని కానీ, వాహనాల సౌకర్యం కానీ ఆస్వాదించే అంతగా ఎదగలేదు.

కొంతకాలం గడిచింది. మార్పు ఎంత అనివార్యమో మరపు అంతే సహజం కావచ్చు. మహా ఇప్పుడు సింహాచలం శిక్షణలో మానసికంగా కొంచెం ఎదిగాడు. వాడి కళ్ళముందు ఆనాటి మహా ప్రళయం కనిపిస్తే కన్నీళ్ళతో అనుకుంటాడు "ఎందుకు మా అమ్మ, నాన్నని తీసుకుపోయావు.. నన్నెందుకు వదిలేశావు" ఆ ప్రశ్నకి సమాధానం చెప్పడానికి విధికి నోరులేదు కదా!

సింహాచలంతో వెళ్ళేటప్పుడు నాలుగు బొగ్గులు జేబులో వేసుకుని వెళ్తాడు. ఆవిడ కండెలు అమ్ముకుని వచ్చేలోగా గేటు బయట ఫుట్ పాత్ మీద కూర్చుని రోడ్డు పక్క బొమ్మలు గీస్తాడు. వాడిప్పుడు ఆంజనేయ స్వామి, వినాయకుడి బొమ్మలు చక్కగా వేస్తున్నాడు. ఈ మధ్యే పులిచర్మం కట్టుకుని, నెత్తి మీద నుంచి కిందకి జారుతున్న గంగమ్మని జటా జూటంలో బంధించి కళ్ళు మూసుకుని ధ్యానంలో కూర్చున్న శివుడి బొమ్మ వేయడం నేర్చుకుంటున్నాడు. ఆ బొమ్మ సింహాచలం గుడిసె పక్కన గోడ మీద ఉంది. ఆ గోడ వెనకాల శివాలయం ఉంది. ఇడ్లిలు అందిస్తున్నప్పుడల్లా వాడి దృష్టి ఎక్కువగా ఆ బొమ్మ మీదే ఉంటుంది. అలా చూసి, చూసి ఆ బొమ్మని మనసు మీద ముద్రించుకున్నాడు. ఇప్పుడు అదే ప్రాక్టీసు చేస్తున్నాడు. గేటు ముందు బొమ్మలు, బూరలు, ఐస్ క్రీం అమ్మే వాళ్ళు, అటూ, ఇటూ తిరిగే వాళ్ళు ఆగి వాడి బొమ్మను చూస్తూ వెళ్తుంటే వాడు అదేమీ గమనించనట్టు తల వంచుకుని గీస్తూ ఉంటాడు.

ఐస్ ఫ్రూట్ అమ్మే అప్పల కొండ వాడికి రోజూ ఒక ఐస్ ఫ్రూట్ ఉచితంగానే ఇస్తాడు. ఆరోజు కూడా అలాగే వాడికి మిల్క్ ఐస్ క్రీం ఇస్తూ అడిగాడు " యాడ నేర్సినావురా బలే నేర్పుగేస్తుండావే."

వాడు ఐస్ క్రీం తీసుకుని తింటూ సమాధానం చెప్పలేదు..

"ఎవురు నేర్పిత్తన్నారు నీకు బొమ్మలేయడం " వాడికి తన ప్రశ్న అర్థం కాలేదేమో అని మళ్ళీ అడిగాడు.

వాడు తల అడ్డంగా ఊపి " నేనే ఎత్తన్నా" అన్నాడు.

" అబ్బో .. ఎవరూ నేర్పకుండానే నేర్సుకున్నావేం." నవ్వి అన్నాడు "కూటికి, గుడ్డకి పనికిరాని ఈ బొమ్మలెందుకు గానీ ఎల్లి మీ యమ్మకి సాయముండు . ఎల్లి నాలుగు కండెలమ్ము .. ముసల్ది ఒక్కతీ కట్టపడుతుండాది" అన్నాడు.

మహాకి అప్పలకొండ అన్నది సగం అర్థమై, అర్థం కాకుండా ఉంది. ఐస్ క్రీం తినడం పూర్తీ చేసి చేయి నిక్కరుకి తుడుచుకుని తిరిగి బొమ్మ గీసుకోసాగాడు.

అప్పలకొండ ఆ విషయం పట్టించుకోకుండా తన చుట్టూ మూగిన పిల్లలకి ఐస్ క్రీం ఇవ్వడంలో మునిగిపోయాడు.

మహా జీవితంలో మరో రెండేళ్ళు ప్రశాంతంగా గడిచిపోయాయి. వాడికి సింహాచలం, సింహాచలానికివాడు అలా ఒకరికి ఒకరుగా కలిసిపోయారు.

గుడిసె నిండా బొగ్గుతో ఆంజనేయస్వామి, అమ్మవారి బొమ్మలు గీసాడు. అవి చూసి మురిసిపోతుంది సింహాచలం. నా కొడుకు బొమ్మలేత్తాడు అని అందరికీ మురిపెంగా చెప్పుకుంటుంది.

ఒకరోజు సింహాచలం మొక్కజొన్న కండెలు తీసుకురావడానికి మార్కెట్ కి వెళ్ళింది. వాడు గుడిసె బయట రోడ్డు మీద దాకా వెళ్లి పుట్ పాత్ మీద కూర్చుని బొగ్గుతో పెద్దగా ఆంజనేయస్వామి బొమ్మ వేసాడు.. ఉదయం నుంచీ సాయంత్రం దాకా ఆ బొమ్మకి నగిషీలు చెక్కుతూనే ఉన్నాడు. అటుగా వెళ్తున్న కొందరు భక్తితో చిల్లర నాణాలు వేస్తూ వెళ్ళారు. అవి ఏం చేయాలో వాడికి అర్థం కాలేదు. అన్నీ పోగుచేసుకుని చొక్కా జేబులో పోసుకుని గుడిసేకి వెళ్ళాడు. సింహాచలం కొంగులో పోసాడు ఆ చిల్లర అంతా.

"యాడవిరా ఇన్ని డబ్బులు" అడిగింది సింహాచలం ఆశ్చర్యంగా.

తను వేసిన బొమ్మ మీద జనం వేసారని చెప్పాడు.

ఆవిడ మురిసిపోయింది. " నా తండ్రే... నా తండ్రే.." అంటూ వాడి బుగ్గలు చిదిమి మెటికలు విరిచింది. మొత్తం లెక్కపెడితే పదిహేను రూపాయల పావలా తేలింది. ఆవిడ అక్షరం ముక్క చదవకపోయినా డబ్బులెక్క విషయంలో కచ్చితంగా ఉంటుంది. ఏ మాత్రం లెక్క తప్పదు. అవన్నీ ఒక ముంతలో వేసి " ఇస్కూలుకి పంపిత్తా .. నాలుగు ముక్కలు సదువు నేర్చుకోరా నాయనా" అంది.

"ఇస్కూలా?" వాడు భయంగా చూసి గబ,గబా తల అడ్డంగా తిప్పాడు. " నేనేల్లను.. నన్ను కొత్తారు" అన్నాడు.

"ఎందుకు కోడతారురా? యవురు నిన్ను కొట్టేది.." అంది.

వాడు బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాడు..

ఆవిడ కంగారు పడిపోయింది. "మా నాయనే యాడవమాక ఎల్లమాకులే" అంటూ దగ్గరకు తీసుకుని ఓదార్చింది.

ఆ తరవాత ఆవిడ మళ్ళీ స్కూల్ విషయం ఎత్తలేదు.

జ్యేష్ఠమాసము ... వర్షాలు పడుతున్నాయి. బీచ్ కి ఎవరూ రావడం లేదు. సింహాచలం ఇప్పుడు గుడిసె లోపలే ఇడ్లీలు వేస్తోంది. ఆవిడ ఇడ్లిలకు అలవాటు పడిన వాళ్ళు గుడిసేకే వచ్చి కొనుక్కుంటున్నారు. ఓ పొడుగాటి చెక్కబల్ల ఆ వాడలో ఉంటున్న చిల్లర వ్యాపారి భీమయ్య ఇచ్చాడు. ఆ బల్ల గుడిసెలో ఓ పక్కకి వేసింది. దాని మీద కూర్చుని తినే వాళ్ళు కొందరు, అరిటాకుల్లో పొట్లం కట్టించి తీసుకుని వెళ్ళేవాళ్ళు కొందరు. ఆ వ్యాపారం లేకపోతే ఆదాయం ఉండదు. అందుకే సింహాచలం ఓపిక చేసుకుని ఎలాగోలా ఉదయం ఆరునుంచి పదింటివరకూ ఇడ్లీలు వేస్తోంది. కానీ ఆమెలో రోజు, రోజుకీ శక్తి సన్నగిల్లి పోతోంది. ఎంచేతో ఈ మధ్య సాయంత్రం అయేసరికి ఒళ్ళంతా నెప్పులు..జ్వరం తగిలినట్టు ఒళ్ళంతా సెగలు వస్తోంది. అక్కడికీ మిరియాల కషాయం తాగుతోంది. మహాకి ఆవిడ అలా పడుకుని ఉంటే తోచడంలేదు. కానీ ఏం చేయలో తెలియడం లేదు. సాయంత్రం అయేసరికి బీచికి వెళ్లి ఆవిడ కండెలు అమ్మడం, తను బొమ్మలు గీసుకోడం అనే వ్యాపకానికి వర్షాల వలన ఆటంకం ఏర్పడింది.. అది మాత్రం నచ్చలేదు. సింహాచలం ఉదయం చేయగా మిగిలిన ఇడ్లీలు మహాకి పెట్టి తను మాత్రం కషాయం, కాసిని టీ నీళ్ళతో కాలక్షేపం చేస్తోంది. ఆ ఇడ్లి తిని బొగ్గుతో ఎక్కడ పడితే అక్కడ ఏవో గీతలు గీస్తూ గడిపేస్తున్నాడు. వాడికి మనసులో ఏదోగా ఉంది. దాన్ని దిగులంటారని కూడా వాడికి తెలియదు. మధ్య, మధ్య మూలుగుతూ పడుకున్న సింహాచలం ని చూస్తూ గోడకానుకుని కూర్చుని పక్కనే గచ్చు మీద కుక్క బొమ్మ, పిల్లి బొమ్మ గీసుకుంటూ రోజులు గడిపేస్తున్నాడు. వాడికి వర్షం అంటే కోపం, ఆ వర్షం చేసే శబ్దం మరీ చిరాకు. కసిగా వీధిలోకి చూస్తూ బొగ్గులు చిన్న ముక్కలుగా చేసి విసురుతూ వర్షం ధారల మీద పగ తీర్చుకున్నాను అని త్రృప్తి పడుతున్నట్టు నవ్వుకుంటూ ఉంటాడు.

ఉన్నట్టుండి ఒక సాయంత్రం నులకమంచం మీద పడుకుని ఉన్న సింహాచలం చిన్నగా ఒక అరుపు అరిచి కళ్ళు, కాళ్ళు తేలేసింది.

ఆ అరుపుకి ఒక్క గెంతు గెంతి ఆమె మంచం దగ్గరకు వెళ్ళిన మహా గావుకేకలు పెడుతూ గుడిసె లో నుంచి బయటకు వచ్చాడు. వాడి అరుపులకు మిగతా గుడిసెల వాళ్ళంతా పరిగెత్తుకు వచ్చారు.

సింహాచలం ఇంకలేదు. అందరూ గట్టిగా ఏడ్చారు.. మహాకి కూడా దుఖం వచ్చింది. "ఇంక మాకు కమ్మటి ఇడ్లి ఎవరు పెడతారు సిమ్మాచలం" అని బావురుమన్నారు కొందరు. ఆ ఏడుపులు, ఆ శోకాలు, వాళ్ళందరి మాటలు, తన వైపు జాలిగా చూస్తున్న చూపులు వాడికి ఏమి అర్థం కావడం లేదు. వాడి పరిస్థితికి గుండె తిగిన ఆకాశం కన్నీటి సముద్రాన్ని పాయలు, పాయలుగా సృష్టిస్తున్న ఆ సాయంత్రం నలుగురు మగవాళ్ళు సింహాచలం ని మోసుకుని వెళ్లి అంత్యక్రియలు చేసి వచ్చారు.

## 10

మహా జీవితం మళ్ళీ ప్రశ్నార్ధకం అయింది. శూన్యంలోకి చూస్తూ కనిపించని భవిష్యత్తు వెతుక్కోవడంతో గడిచిపోతోంది కాలం.

ఘనీభవించిన మంచు కొంచెం, కొంచెం కరుగుతున్నట్టు కాలం కూడా మెల్లగా కరుగుతూ ఉంది. మహా జీవితంలో ఎలాంటి మార్పు లేదు. ప్రపంచం మాత్రం మార్పు వైపు పరిగెడుతూనే ఉంది..

అప్పుడప్పుడు ఎవరో ఒకళ్ళు రెండు ముద్దలు పెడితే తిని ఆ గుడిసెలో ముడుచుకుని పడుకుంటున్నాడు. ఎవరితో మాట్లాడలేదు. మాట స్పష్టంగా రాదు. తను మాట్లాడేది ఏ భాషో కూడా వాడికి తెలియదు. వాడిలో ఏదో తెలియని నిర్వేదం తప్ప శోకమూ లేదు. తల దాచుకోడానికి సింహాచలం చూపించిన ఆ చిన్ని గుడిసే వాడి ప్రపంచం.

ఇంతకు ముందులా బొమ్మలు వేయడం లేదు.. ఇడ్లీలు పొట్లాలు కట్టి ఇచ్చే పని లేదు.. మొక్కజొన్నే కండెలు మోసే పని అసలే లేదు.. ఇప్పుడు బీచికి వెళ్ళడం లేదు. గుడిసెలో తను తప్ప ఎవరూ లేరు. చుట్టూ చాలామంది ఉన్నా ఎవరూ వాడిని పెద్దగా పట్టించుకోడం లేదు. సింహాచలం ఉన్నంతకాలం ఆమెతో పాటు వాడికీ కొంత ఆదరణ దొరికింది. ఇప్పుడు ఆ అనాధను పట్టించుకునే నాధుడు ఎవరు? ఎవరి పిల్లలు వాళ్ళకున్నారు. ఎవరి జీవన పోరాటం వారిది.. వాడు కనిపిస్తే మాత్రం ఏరా! యాడ తిరుగుతుండావు? కూడు తిను అంటూ ఒక ఆకులోనో విరిగిన సత్తు పళ్ళెం లోనో నాలుగు ముద్దలు పడేస్తారు.. అదే మహా ప్రసాదం వాడికి. దాంతో ఆకలి తీరినా, తీరకపోయినా మారు అడగడు. మౌనంగా తిని పళ్ళెం కడిగి పెట్టేస్తాడు. ఇదివరకులా ఇప్పుడు ఉదయాన్నే తినే నాలుగు ఇడ్లి లేవు.. పంచభక్ష్య పరమాన్నాలు లేకున్నా వేళకి ఏదో ఇంత తిండి మాత్రం కడుపులో పడేది సింహాచలం బతికి ఉన్నంత కాలం. ఇప్పుడు ఆ తిండి ఎలా సంపాదించాలో

వాడికి తెలియదు. అందుకే ఆకలి వేసినప్పుడు గుడిసేకి వచ్చి కాళ్ళు ముడుచుకుని కడుపులో పెట్టుకుని పడుకుంటాడు తప్ప ఎవరినీ ఏనాడూ నాకింత అన్నం పెట్టండి అని నోరు తెరిచి అడగలేదు. అలా చీకట్లో పడుకుంటాడు. వాడికి చీకటంటే భయం లేదు..

బతుకంటే తెలియదు. తినడం, పడుకోడం జీవితం అని ఎవరన్నా కొత్తగా జీవితాన్ని నిర్వచిస్తే వాడు జీవిస్తున్నట్టే లెక్క. కానీ ఆ జీవితంలో వెలుగు, చీకట్ల తేడాలు, కష్ట, సుఖాల ఊసులు లేవు..
అమ్మా, నాన్నా, స్నేహితులు, బంధువులు..అందరూ ఎక్కడికి వెళ్ళారో అనుకుంటూ ఉంటాడు. తనతో పాటు అమ్మా, నాన్నలని వెతుక్కుంటూ బయలుదేరిన తన స్నేహితులు ఏమయారో తెలియదు. ఉప్పొంగిన సముద్రం విశ్వమంత చేతులు చాచి సర్వాన్ని దోచుకుని వెళ్ళిపోయింది. ఆ దృశ్యాలు మాత్రం కళ్ళ ముందు కదులుతూనే ఉన్నాయి.

సింహాచలం చనిపోయాక కొంచెం, కొంచెం బతుక్కి, చావుకీ తేడా తెలుస్తోంది. ఇప్పుడు తనకి ఎవరూ లేరని తానొక అనాథ అని అర్థం అవుతోంది. ఎవరూ లేకుండా ఎలా బతకాలో మాత్రం తెలియదు. గమ్యం తెలియదు. అమ్మనీ, అమ్మలాంటి సింహాచలం ని కోల్పోయాడు. ఆ ఇద్దరు స్త్రీ మూర్తులు కళ్ళ ముందు నుంచి అదృశ్యం అయాక ఇంక ఈ ప్రపంచంలో అలాంటి వాళ్ళు ఎవరూ ఉండరేమో అని మాత్రం అనుకుంటాడు.

మరి కొన్ని రోజులు గడిచాయి. నిజానికి గమనం కాలం లక్షణం. ఎక్కడా ఆగిపోదు. కాకపోతే కొందరికి వేగంగా, మరికొందరికి మెల్లగా గడుస్తున్నట్టు అనిపిస్తుంది. అది వారి, వారి జీవనవిధానం అనుసరించి తెలుసుకోవాల్సిందే.. నెమ్మదిగా మహా లో కొంత మార్పు రాసాగింది. ఈ మధ్య ఆకలి వేస్తే కాళ్ళు కడుపులో దాచుకుని పడుకోకుండా నెమ్మదిగా గుడిసే బయటకు వచ్చి బయట కూర్చుని కబుర్లు చెప్పుకునే మహిళల వైపు ఆశగా చూడడడం మొదలు పెట్టాడు. వాడి కళ్ళల్లో ఆకలి గమనించని కఠినాత్ములు ఎవరూ ఉండరు కాబట్టి ఎవరో ఒకళ్ళు " ఏరా ఆకలేత్తుండాదా " అని లేచి వెళ్లి పళ్ళెంలో అన్నం తెచ్చి ఇవ్వడం వాడు ఆబగా తినేయడం జరుగుతోంది. కడుపు నిండగానే అలా రోడ్డు మీదకు వెళ్లి వచ్చీ, పోయే బండ్లు, బస్సులు, కార్లు చూస్తూ కాలక్షేపం చేయడం మొదలుపెట్టాడు. అలా చూస్తూ ఉన్నప్పుడు జరిగిన సంఘటనలన్నీ కాలం అనే తెరమీద జారిపోతున్న దృశ్యాలలా కనిపిస్తూ ఉంటాయి. వాడికి తెలియకుండానే కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగి చెక్కిళ్ళ మీదకు జారతాయి. ఎవరూ చూడకుండా చొక్కాతో తుడుచుకుని గుడిసేకి వచ్చేస్తాడు.

అలా గతానికీ, వర్తమానికీ మధ్య ఊగుతూ, భవిష్యత్తు అనేది ఒకటి ఉందని తెలియకుండా నిర్వికారంగా జీవిస్తున్న "మా గాడి " జీవితంలో ఒక ఉషోదయం చిన్న వెలుగు కిరణాన్ని వాడి మీదకు వదిలింది.. ఆ వెలుగులో వాడికి

సింహాచలం దాచిన మట్టి ముంత కనిపించింది. గుడిసెలో వెల్లకిలా పడుకుని అలా శూన్యంలోకి చూస్తున్న వాడి దృష్టి చినిగిన తాటాకుల మధ్యలో దాచిన మట్టి ముంత కనిపించడంతో గబుక్కున లేచి అందుకున్నాడు. అందులో సింహాచలం డబ్బులు దాచిందని తెలుసు..కాసేపు ఆ డబ్బులు తీయడానికి ముంతని కిందకీ, మీదకీ ఒంచి ప్రయత్నించాడు. కొద్ది క్షణాలు తదేకంగా దాని వైపు చూసి బలంగా నేలకేసి కొట్టాడు.

వాడి కళ్ళు మెరిసాయి. అందులో ఆరోజు తన బొమ్మ మీద వేసిన చిల్లర సింహాచలం లెక్కపెట్టి వేసింది వేసినట్టే నయాపైసతో సహా ఉంది. ఏదో తెలియని నిశ్చింత.. ఆ డబ్బు వాడిలో కొత్త చైతన్యం నింపింది. ఆ డబ్బు తన ఆకలి తీరుస్తుందని తెలుసు.. కానీ ఎంతకాలం అనేది తెలియదు.

మర్నాడు ఉదయమే లేచి ఆ చిల్లర జేబులో వేసుకుని రోడ్డు మీదకి వెళ్ళాడు. ముందు భయంతో ఒళ్ళు జలదరించింది. అంత మంది జనంలో ఎక్కడికి వెళ్ళాలో, ఏం కొనుక్కోవాలో తెలియదు.

ఈతరాని వాడిని బలవంతంగా నీళ్ళల్లో తోసితే, బతుకు మీద ఆశతో ఎంత లోటు నీళ్ళల్లో మునిగినా ఎలాగోలా ఒడ్డుకి చేరతాడు.. జీవితం కూడా అంతే! జీవితం మీద ఆశ ఉంటే ఎలాగోలా బతకడానికే ప్రయత్నిస్తాడు. ఇప్పుడు మహా కూడా అంతే... వాడికి జీవితం మీద ఆశ కాదు ఇప్పుడు ఉన్నది ఆవశ్యకత.. జీవించాలి. ఎలా? ఎలా జీవించాలి? రోజూ, పూట, పూట ఎవరు పెడతారు తిండి?

వాడికి సింహాచలం గుర్తొచ్చింది.. ఆ వెంటనే ఆవిడ ఉదయం పూట చేసే ఇడ్లీలు, పునుకులు, సాయంత్రాలు ఎర్రటి నిప్పుల మీద కాల్చే మొక్కజొన్న కండెలు.. అవి కాలుతున్న కమ్మని వాసనా అన్నీ గుర్తొచ్చాయి.

"కట్టపడాల రా నాయినా ! కట్ట పడకపోతే ఎవురు పెడతారురా మనకి ముద్ద" ఆవిడ స్వరం చెవుల్లో ప్రతిధ్వనించసాగింది. ఆవిడలా మొక్క జొన్న కండెలు కాల్చి అమ్మలేడు... పునుగులు చేయలేడు... ఇడ్లి చేయలేడు. మరి ఏం చేయాలి? ఆ డబ్బులతో పేవ్మెంట్ మీదో, బీచ్ రోడ్డు మీదో దొరికే పప్పులో, బజ్జీలో తినచ్చు.. కానీ చేతిలో ఉన్న డబ్బులు అయిపోయాక ఏం చేయాలి అన్న ప్రశ్న మాత్రం వాడి చిన్ని మనసులో మెదలసాగింది. ఆలోచిస్తూనే తన నిక్కర్ జేబులో ఉన్న చిల్లర తడుముకున్నాడు.

ఎవరో ఫుట్ పాత్ మీద జీళ్ళు, అరటి పళ్ళు అమ్ముతున్నారు.. వెళ్లి తన చేతిలోకి వచ్చిన చిల్లర తీసి ఇచ్చాడు.. ఆ వ్యక్తీ నాలుగు అరటి పళ్ళు, కొన్ని జీళ్ళు చొక్కాలో పోసాడు. అక్కడే ఓ పక్కన కూర్చుని తిన్నాడు.. తింటూ ఉంటే

అనిపించసాగింది.. ఈ అరటి పళ్ళు రోజూ తినాలంటే ఇంకా తనేదో చేయాలి ... ఏం చేయాలో స్పష్టమైన అవగాహన లేదు.. జీవితం పట్ల అవగాహన ఉంటే కదా!

రోడ్డు మీద వచ్చి, పోయే వాహనాలు చూస్తూ రాత్రి చీకటి పడేవరకూ కూర్చుని గుడిసెకి వెళ్ళిపోయాడు....

ఒకరోజు... ఎప్పటిలాగే అరటిపళ్ళు తిని ఫుట్ పాత్ మీద కూర్చున్నాడు. రోజూ వాడిని గమనిస్తున్న అన్నవరం అడిగాడు... " ఏ ఊర్రా మంది.." మహా మాట్లాడలేదు..

వాడు దిక్కులేని వాడు అని అన్నవరంకి అర్థమైంది.. అందుకే ఆ రోజు వాడి దగ్గర అరటి పళ్ళకి డబ్బులు తీసుకోలేదు. " తినులే" అంటూ నాలుగు పళ్ళు చేతిలో పెట్టాడు.

అవి తినేసాక మహాకి తోచలేదు.. రోజూ చూసే వాహనాలు.. అదే రోడ్డు.. అదే జనం.. విసుగ్గా అనిపించింది.. నిక్కర్ జేబులు తడుముకున్నాడు. చేతికి తగిలింది బొగ్గు ముక్క. వాడిలో ఉత్సాహం ఉరకలు వేసింది. అక్కడే పేవ్ మెంట్ మీద ఆ బొగ్గుతో గీయడం మొదలుపెట్టాడు. వాడు బొమ్మ పూర్తి చేసి తలెత్తేసరికి అన్నవరం ఆ బొమ్మకేసి ఆశ్చర్యంగా చూస్తూ ఉండడం కనిపించింది..

"అరేయ్ ఏం చేత్తుండావురా! యాడ నేర్సినావు.." అన్నవరం ప్రశ్నకి బెదిరిపోతూ లేచి నిలబడ్డాడు.తను చేయకూడని పని చేస్తున్నట్టు వణికిపోయాడు.

అన్నవారం వాడి భుజం మీద చేయేసి.. " కూచుండు..ఏసుకో బొమ్మ మానమాక.. ఎవురన్నా దాతలు నాలుగు సిల్లర డబ్బులేత్తారు... అబ్బాయ్.. ఇదే నీకు ఆదారం అయితాది.. నా మాటిను" అంటూ బలవంతంగా కూర్చోబెట్టాడు. వాడి తల మీద చేయి పెట్టి.. "దిక్కులేని వాళ్ళకి దేవుడే దిక్కు నాయనా! ఆ దేవుడే నీకీ కళ ఇచ్చుండాడు. బతుకు నాయినా బతుకు.. ఎలగో బతుకు" అంటూ తన పండ్ల బుట్ట దగ్గరకు వెళ్ళిపోయాడు.

అన్నవరం మాటల్లో తెలియని శక్తి వాడి నర,నరాల్లో ప్రవహిస్తున్నట్టు అయింది..ఆ శక్తి అంతులేని బలాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది.. ఆ బలం, ధైర్యం గుండెల నుంచి జారి వేళ్ళ సందుల్లో నిలిచి వేళ్ళు కుంచెలా కదలసాగాయి... దీక్షగా మనసులో ఉన్న బొమ్మ తలచుకుంటూ గీస్తూ పోయాడు. ఆ బొమ్మ చూసి ముగ్ధుడైపోయాడేమో సూర్య భగవానుడు అస్తమించడం మానేసి నిశ్చలంగా ఉండిపోయినట్టు ఆరున్నర అయినా చీకట్లు కమ్ముకోలేదు.. వాడు కళ్ళెత్తి చూసేసరికి చుట్టూ దడి కట్టినట్టు నిలబడి ఉన్నారు జనం.. వాళ్ళందరి కళ్ళల్లో భక్తి భావం.. ఇంత జీవం ఉట్టిపడే హనుమంతుడి

మూర్తి ని ఎన్నడూ చూడని వాళ్ళలా కదలకుండా నిలబడి ఉన్న వాళ్ళని చూడగానే సిగ్గుతో, భయంతో తల బాగా భూమిలోకి వంచుకుని కూర్చుండిపోయాడు.

" ఎంత బాగా వేసావురా " అనే ప్రశంసల వర్షంతో పాటు తలా రూపాయి, రెండు రూపాయిల బిళ్ళలు వేసి దణ్ణం పెట్టుకుని వెళ్ళసాగారు.ఆఖరి వ్యక్తి కనుమరుగు అవగానే మారుతి కళ్ళ నిండా కాసుల దీవెనలు..

అవి ఏం చేయాలో, ఎక్కడ దాచాలో కూడా తెలియని మహా నిశ్చేష్టుడై అచేతనంగా కూర్చున్న దగ్గరకు మహా భుజం మీద చేయెసి.. " తీసి దాచుకో నాయినా.. ఆ స్వామే నీకీ దారి చూపించాడు.. నే చెప్పాను కదా దిక్కులేని వాళ్లకి దేవుడే దిక్కు" అంటూ కొన్ని కాసులు తీసి మహా చేతుల్లో పోశాడు అన్నవరం. అన్నవరం చేతికేసి, డబ్బుల కేసి పదే పదే చూస్తున్న వాడి జేబు బరువెక్కడంతో చూపులు జేబు వైపు చూసుకున్నాడు. కుడిచేయి అరచేత్తో ఆ జేబు మీద చేయి పెట్టి గట్టిగా అదుముకున్నాడు.

అది చూసిన భానుడు సంతృప్తిగా నవ్వుకుంటూ పడమటి దిశ కేసి ప్రయాణం సాగించాడు.

గుడిసె చేరిన మహా కి సింహాచలం చనిపోయాక శూన్యంగా మారిన ఆ గుడిసె సందడిగా కనిపించింది.. తనకు తెలియని, తనతో సంబంధం లేని మనుషులు ఎవరో ఆ గుడిసెలో ఉండడం చూసి గుడిసె బయటే ఆగిపోయాడు.బహుశా జీవించడం తెలుసుకున్నాడని అర్థం అయిందేమో గుడిసెకి. వాడికి ఆహ్వానం పలకలేదు. చెక్క తలుపు మూసి ఉంది.. లోపల నుంచి మాటలు గట్టిగా, గోలగా వినిపిస్తున్నాయి. తలుపు సందుల్లో నుంచి నలుగురు మనుషులు కనిపించారు. నిలవనీడ లేని ఆ కుర్రాడిని వాడలో వాళ్ళు ఎవరూ పట్టించుకోలేదు.. మా గుడిసెలో పడుకోరా అని ఎవరూ పిలవలేదు. అక్కడే గుడిసె బయట రాళ్ళ గుట్ట మీద పడుకుండిపోయాడు ఆ రాత్రి. తెల్లవారక ముందే ఎవరో వచ్చి లేపారు.. " ఈడ పండుకున్నావెందబ్బాయ్" అంటూ మహా మొహంలోకి తేరిపార చూసింది ఒక మహిళ.

ఆవిడ తన గుడిసె ఆక్రమించుకున్న వారిలో ఒక స్త్రీ.. బకెట్ తో పేడ నీళ్ళు కలిపి తెచ్చింది కళ్ళాపి చల్లడానికి. కళ్ళు నులుముకుని ఆమె వైపు చూసాడు చిరువెలుగులో ఆమె ముక్కుకు ఉన్న పుడక మెరిసింది.. కనిపించిన ప్రతి స్త్రీలో అమ్మని వెతికే వాడి కళ్ళకి ఆమెలో మాత్రం అమ్మ కనిపించలేదు. సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి తడబడుతూ నడచి రోడ్డెక్కాడు..

నిజానికి ఆ గుడిసె సింహాచలం ఎంతో కష్టపడి స్వయంగా వేసుకున్నది.. ఆమె స్వంతం.. ఆమె పెంపుడు కొడుకుగా వాడికి అక్కడ ఉండే హక్కు ఉంది. ఆ విషయం వాడికి ఎవరు చెప్తారు! గుడిసెలకి వీలూనామాలుండవు..

ఎవరికీ దక్కితే వాళ్ళు ఆక్రమిస్తారు.. బలంమాత్రమే అక్కడ పని చేస్తుంది.. అది ఆర్థిక
బలం, కండబలం, నోటిబలం, మనోబలం...ఏదైనా కావచ్చు. అన్ని బలాలు ఉన్న కూలీ, దగ్గరలో రోడ్డు వేయడానికి వచ్చిభార్య, ఇద్దరు పిల్లలతోఆ గుడిసె నిరాటంకంగా ఆక్రమించాడు. దురాక్రమణ అనేది ప్రపంచానికి కొత్త కాదు.. చరిత్ర తిరగేస్తే ఆక్రమణలే శాశ్వత నివాసాలు అయాయి... ఆక్రమించిన వాడు చక్రవర్తి అయాడు.. మహా లాంటి వాళ్ళు ఫుట్ పాత్ పాలైనారు.

మరోసారి ఫుట్ పాత్ చిరునామా అయింది.. రోడ్డు మీద బొమ్మలు గీయడం, దయగలవారు అలా వెళ్తూ , వెళ్తూ జార్చిన చిల్లర డబ్బులతో ఆకలి తీర్చుకుంటూ అక్కడే కొంచెం దూరంలో నిర్మాణం లో ఉన్న నాలుగంతస్తుల భవనం నీడలో తలదాచుకుంటూ జీవితం గడపసాగాడు.

ఒకరోజు... అది వేసంకాలం. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఏడింటికే రోడ్లు కాలిన పెనాలలా చుర్రుమంటున్నాయి. రామకృష్ణా బీచ్ దగ్గర నాలుగు నుంచే జనాలు వాకింగ్ కి వస్తున్నారు. పగలంతా నిర్మాణంలో ఉన్న భవనాల నీడలో సేదతీరుతూ పొద్దుపోయాక తిరిగి పేవ్ మెంట్ మీదకి చేరడం మహా దినచర్య. ఎంత కష్టపడినా, ఎంత కళాత్మకంగా వేసినా, ఆ బొమ్మల్లో ఎంత జీవం ఉట్టిపడినా ఆ పేవ్మెంట్ మీద ఒక అనామకుడు వేస్తున్న బొమ్మలకు చిల్లర నాణాలే వచ్చేది. అదే బొమ్మ ఒక కాన్వాస్ మీద వేసి, సూటు, బూటు వేసుకుని ఆ కాన్వాస్ తీసుకుని వెళ్లి ఒక ఆర్ట్ గాలరీలో పెడితే వాడు ఎంత సంపాదించేవాడో! కానీ వాడి వాలకం, రూపం చూసిన వాళ్ళు వాడిని కళాకారుడిగా గుర్తించలేదు.. భుక్తి కోసం చేసే కోటి విద్యల్లో ఇదీ ఒకటి అనుకుని దయ తలచి ఇచ్చిన దానమే తప్ప, ఆ కళకు చెల్లించిన మూల్యం ఏమి లేదు.. వాడిని కళాకారుడిగా గుర్తించగల పెద్ద మనసూ ఇంతవరకూ ఎవరికీ లేదు.

అయితే, విధి తలుచుకుంటే రాజు బిచ్చగాడు అవగలడు బిచ్చగాడు, రాజు అవగలడు... రాజు కాకున్నా రాజు దగ్గర సేవకుడిగా అయే అవకాశం విధి ఆ రోజు కల్పించింది మహాకి.

ఆ రోజు కూడా సాయంత్రం నాలుగు అవగానే పేవ్ మెంట్ మీదకు చేరి తన విద్య ప్రదర్శించడం మొదలు పెట్టాడు.

మరునాడు శ్రీరామ నవమి... నగరం మొత్తం పందిళ్ళు వేసారు.. పూల, పండ్ల, కొబ్బరికాయల అంగళ్ళతో పేవ్ మెంట్స్ కళకళ్ళాడుతున్నాయి. వాడిని ప్రతిరోజూ చూసే పండ్ల అంగడి వీరయ్య “అరేయ్ చిన్నోడా! ఇవాళ సీతా,రాముల

బొమ్మ ఏయరా” అన్నాడు. అనడమే కాదు తన దగ్గర దాచి పెట్టిన శ్రీరామ పట్టాభిషేకం పాత కాలండర్ ఇచ్చాడు ఇది చూసి “వేయరా.. నీకు యాపిల్ పండిస్తా” అన్నాడు.

మహా ఆ బొమ్మ తీసుకుని లీనమై వేయసాగాడు.

పండ్లు, పూలు కొనుక్కుని వెళ్ళేవాళ్ళతో సందడిగా ఉంది. జనం రాముడిని, సీతమ్మని చూసి భక్తితో నమస్కరించి తోచిన డబ్బులు పదిలంగా బొమ్మ మీద ఓ పక్కగా పెట్టి వెళ్తున్నారు. బొమ్మ పూర్తి అయి రాముడి చేతిలో బాణం పెడుతుండగా కనిపించింది పొడుగాటి నీడ.

11వ భాగం

సరిగ్గా తన రాముడి పాదాల మీద పడిన ఆ నీడని చూసి ఉలిక్కిపడ్డాడు మహా. వాడి చేతిలో ఉన్న బొగ్గు ముక్కలు కింద పడిపోయాయి/ భయంగా తలెత్తి చూశాడు. నిక్కరు, టీ షర్ట్ వేసుకున్న యాభై ఏళ్ల వ్యక్తి రెండు చేతులూ నడుం మీద పెట్టుకుని బొమ్మ వైపు శ్రద్ధగా చూస్తున్నాడు. ఆయన్ని అలా చూడగానే అప్రయత్నంగానే వాడు భయంగా లేచి నిలబడ్డాడు.

“ఏరా ఎవరు నేర్పారు నీకు ఈ బొమ్మ వేయడం?” ఆసక్తిగా అడిగాడు.

మాట్లాడకుండా బిక్కచచ్చిపోయి చూడసాగాడు.

“మాట్లాడవేరా! నువ్వే వేశావా బొమ్మ మొత్తం “

తలూపాడు.

“నాతో వస్తావా” అడిగాడు.

అప్పుడు చూసాడు ఆయన మొహం వైపు. ఎక్కడికి? ఎందుకు? ఎప్పుడు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు వాడి మదిలో మెదిలాయి.. కానీ ఒక్క ప్రశ్న కూడా బయటకి రాలేదు.. సమాధానం కూడా ఏమని చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాక తెల్లబోయి రెప్పవేయకుండా ఆయన వైపు చూస్తూ నిలబడిపోయాడు/ అప్పటికే సివిల్ డ్రెస్ లో ఉన్నా ఆయన ఎవరో గుర్తుపట్టిన వీరయ్యతో సహా అక్కడ ఉన్న జనం చేతులు కట్టుకుని భయం, భయంగా నిలబడి మహా ఏం తప్పు చేసాడో, పోలిస్ దొర వచ్చాడు అని నిలబడి ఏం జరుగుతుందో అన్నట్టు చూడసాగారు.

"నీకు అమ్మా, నాన్నా ఉన్నారా?" అడిగాడు ఆయన.

తల అడ్డంగా ఊపాడు.

"ఎవరున్నారు?"

మరోసారి అడ్డంగా ఊపాడు తల ..

ఆయనకీ అర్థం అయింది.. ఈ కుర్రాడు అనాథ.. దిక్కులేని వాడు. పేవ్మెంట్ మీద ఇలా బొమ్మలేసుకుంటూ జీవనం సాగిస్తున్న అభాగ్యుడు. వీడిని తనతో తీసుకుని వెళ్ళడానికి ఆ పోలీస్ ఆఫీసర్ కి ఎవరి అనుమతి అవసరం లేదు. ఆయన ఒకసారి అక్కడ ఉన్న వారందరి వైపు చూసాడు. "ఈ కుర్రాడు ఎక్కడుంటాడు?" అడిగాడు జనాంతికంగా..

వీరయ్య చెప్పాడు. " వాడిని సిమ్మాచలం కొన్నాళ్ళు సాకింది దొరా.. అది సచ్చిపోన కాడి నుంచి యాడంటే ఆడే.. ఆడికి ఇల్లు, వాకిలేది ?" అన్నాడు వినయంగా.

ఆయన ఇంక వాడి సమాధానం కోసం చూడలేదు. " ఆ డబ్బులు ఎత్తుకుని జేబులో వేసుకుని నాతొ రా" అంటూ వేగంగా కొంచెం ఎడంగా పార్క్ చేసిన కారు దగ్గరకు నడిచాడు. మహా చేష్టలుడిగినట్టు నిలబడిపోయాడు.

"ఎల్లరా.. పెద్దాయన పిలుస్తున్నాడు..ఎల్లు .. నీ దశ తిరిగిందిలే" అంటూ తొందరపెట్టాడు వీరయ్య వాడి చేతిలో నాలుగు యాపిల్స్ పెట్టి.

గబా,గబా ఆ డబ్బులన్నీ జేబులో కుక్కేసి, ఆయన వెళ్ళిన వైపు పరిగెత్తాడు మహా.

నిగ, నిగలాడుతున్న నల్లటి కారు, మెత్తటి సీట్లు చూడగానే ఒళ్ళంతా చెమట పట్టింది. మట్టి కాళ్ళతో ఎక్కితే ఆయన కోప్పడతాడేమో అని భయంతో గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయాడు. వాడి భయం అర్థం చేసుకున్న ఆయన చల్లగా నవ్వాడు. "కూర్చోరా" అంటూ డ్రైవర్ పక్క సీటు వైపు డోర్ తీసాడు.

డ్రైవర్ కి నీటుగా ఉన్న ఆ కారులో వాడిని ఎక్కిస్తుంటే అయ్యగారి మీద కోపం వచ్చింది. మహా ఒదిగి కూర్చున్నాడు. కారు కదిలింది.

బిక్క చచ్చిపోయి బొమ్మలా బిగదీసుకుని కూర్చున్న మహా ఆయన ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడు.

" నీ పేరేంటిరా " వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

గొంతు పెగలడం లేదు.. మాట రావడం రాలేదు. హటాత్తుగా మూగవాడు అయినట్టు అనిపించింది వాడికి. నాకు మాటలు రావా అనుకున్నాడు.

ఆయన కొంచెం సీటులో ఒంగి వాడిని చూస్తూ మళ్ళీ అడిగాడు. “నీ పేరేంటి?

“ మ్ .... మ్ ... మాగాడు...” నూతిలోనుంచి వచ్చినట్టు వచ్చింది స్వరం. డ్రైవర్ ఫక్కున నవ్వాడు.

“మాగాడా!” ఆయనకి కూడా నవ్వొచ్చింది కానీ బలవంతంగా నవ్వు ఆపుకున్నాడు. వాడి మీద జాలేసింది. పేరు చెప్పడం కూడా రాని అమాయకుడు. వీడి చేతిలో ఎంత అపురూపమైన విద్య ఉంది! ఈ రాయిని చెక్కితే! రామన్నే అవుతాడో! జక్కన్నే అవుతాడో! అనిపించింది ఆయనకీ.

ఆ క్షణం ఆయనకీ వచ్చిన ఆ ఆలోచనే వీరయ్య ఆశించినట్టు మహా అనబడే ఆ అభాగ్యుడి దశ తిరగడానికి నాంది అయింది.

ఆయన డి.జి.పి చంద్రకాంత్. భార్య, ఒక కొడుకు. నిజాయితీ కలిగిన ఆఫీసర్ గా ఆయనకి విశాఖపట్నంలో చాలా మంచి పేరు ఉంది. అవడానికి పోలీస్ ఆఫీసర్ అయినా దయార్ద్ర హృదయుడు. స్మగ్లర్ లకు, దొంగలకు, అవినీతి పరులకు, నక్సలైట్ లకు సింహస్వప్నం పేదల పాలిట దైవం అని అందరూ అంటారు. అది నిజం కూడా.

పోలీస్ క్వార్టర్స్.. చాలా పెద్ద బంగళా. కారు ఆగగానే జవాను పరిగెత్తుకుంటూ వచ్చి గేటు తీసాడు. ఆ పెద్ద గేటులోనుంచి పోర్టికో వైపు మళ్లి ఆగింది కారు.

వెనక సీటులో ఒదిగి, ఒదిగి భయంగా కూర్చున్న ఆ కుర్రవాడి వైపు చూసి అన్నాడు ఆయన.. “దిగరా..” డ్రైవర్ వైపు చూసి “ డోర్ తీయి వాడికి తీయడం రాదు” అన్నాడు.

ఆయన కూర్చున్న వైపు డోర్ తీయడానికి వస్తున్నా డ్రైవర్, ఆయన డోర్ తీసుకుని దిగుతూ అన్నమాటలకి అణచిపెట్టుకున్న రోతతో మహా వైపు చూసి, వెనక డోర్ తీసి “దిగు” అన్నాడు.

వాడు దిగి చేతులు కట్టుకుని ఓ పక్క నిలబడ్డాడు. చంద్రకాంత్ దిగి అక్కడే మొక్కలకి నీళ్ళు పెడుతున్న ఒక వ్యక్తిని పిలిచి “ప్రకాశం! వీడిని నీ ఇంటికి తీసుకువెళ్ళి, స్నానం చేయించి టిఫిన్ పెట్టించి తీసుకురా! అమ్మగారికి చెప్తాను బట్టలు ఇస్తారు తీసుకుని వెళ్ళు” అన్నాడు.

“అలాగే బాబయ్యా” అన్నాడు ప్రకాష్ ఆయనకి కనిపించకుండా వాడి వైపు జుగుప్సగా చూస్తూ.

ఆయన చక,చకా నడుచుకుంటూ ఆరు మెట్లు ఎక్కి పెద్ద ఓపెన్ వరండాలోకి వెళ్లి “ లక్ష్మీ!” అని పిలిచాడు.

ఆ లక్ష్మి అనబడే ఆవిడ రెండు నిమిషాల తరవాత వచ్చింది. ఆయన వెనక్కి తిరిగి కొంచెం దూరంగా పోర్టికో కి దగ్గరగా నిలబడిన మహాని ఆవిడకి చూపిస్తూ “మన చేతన్ బట్టలు రెండు జతలు వాడికివ్వు” అన్నాడు.

ఆవిడ నొసలు చిట్లించి చూస్తూ “ఎవరు వాడు?” అంది.

“చెప్తా! ముందు బట్టలివ్వు.. కవర్లో పెట్టి ప్రకాశానికి ఇవ్వు” అంటూ ఆయన లోపలికి వెళ్ళిపోయాడు.

ఆవిడ ప్రకాశాన్నిని పిలిచి “బాబు గదిలో బట్టలు తీసుకుని వెళ్ళు” అని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

అతను ఆవిడ చెప్పినట్టుగా బట్టలు తీసుకుని వచ్చి “పదరా” అన్నాడు మహా వైపు చిరాగ్గా చూసి అదలింపుగా .

**కేన్ చెయిర్ లో** కూర్చుని వార్తా పత్రిక చదువుకుంటున్న చంద్రకాంత్ స్నానం చేసి, ఇస్త్రీ పాంటు, షర్ట్ వేసుకుని, తల దువ్వుకుని కడిగిన ముత్యంలా ఎదురుగా నిలబడిన మహా వైపు ప్రశంసగా చూస్తూ అన్నాడు.

“నీ పేరు ఇవాళ నుంచీ మహాన్ ఎవరన్నా నీ పేరేంటి అని అడిగితే మహాన్ అని చెప్పు.. మాగాడు అని చెప్పద్దు అర్థం అయిందా!”

ఆ మాటలు చెప్పి మహాతేజ ఉద్వేగానికి లోనైనా వాడిలా హటాత్తుగా నిశ్శబ్దంగా అయిపోయాడు.

పిన్ డ్రాప్ సైలెన్సు బద్దలయింది.. “సర్.. వాటర్ తాగండి.. కాఫీ తాగుతారా!” వంటి ప్రశ్నలు, చేతుల్లో వాటర్ బాటిల్స్ తో సిద్ధంగా నిలబడ్డారు ఇద్దరు ప్రొడక్షన్ అసిస్టెంట్లు.

మహాతేజ ఒక బాటిల్ అందుకుని గడ,గడా నీళ్ళు తాగి బాటిల్ అతని చేతికి ఇచ్చాడు.

“సర్ .. కొంచెం సేపు రెస్ట్ తీసుకుంటారా! మిగతాది రేపు చేద్దామా!” మృదువుగా అడిగింది మేఘన.

తేజ తల అడ్డంగా తిప్పుతూ “ మీకు వేరే ప్రోగ్రాం ఉంటే తరవాత, అంటే నాకు మళ్ళీ మూడ్ వచ్చినపుడు చేద్దాం” అన్నాడు పల్చగా నవ్వి.

మేఘన గబుక్కున అంది.. “ నో! నో! ఏమి లేవు. ఉంటే రేపటికి పోస్ట్ పోన్ చేస్తాము. మీరు కంటిన్యూ చేయండి ప్లీజ్.. వెరీ ఇంటరెస్టింగ్ స్టోరీ “.

తేజ నవ్వి కొన్ని క్షణాలు ఆగి మొదలుపెట్టాడు.

ఆ క్షణం నా గుండెల్లో ఓ మహా విస్ఫోటనం.. శరీరం ఆపాదమస్తం జల్లుమంది.. కళ్ళు విశాలం అయాయి..నా చెవుల్లో అప్పుడే కెరటాలు జారవిడిచిన శంఖనాదం..

మహాన్..మహాన్.. ఎంత బాగుంది! వినసొంపుగా, గొప్పగా ఉంది.. ఆక్షణం నాకు ఆ పదానికి అర్థం తెలియదు.. కానీ ఏదో గొప్ప భావన కలగసాగింది. పదే , పదే నా పెదాల మీద ఆ మూడు అక్షరాలు గంతులేయసాగాయి. " మా గాడిగా నా జీవితంలో ఒక దశ పరిసమాప్తం అయింది.. ఇప్పుడు నేను ఒక మనిషిగా మారాను.. అవును నేను మనిషిని. నా పేరు పలుకుతుంటే తేనెనాకుతున్న తీయటి అనుభూతి.. గులాబీరెక్కతో పెదవుల మీద సుకుమారంగా రుద్దుకుంటున్నట్టు ఉంది. నా మనసు రెక్కలు విప్పుకుని ఆకాశంలో ఎగరసాగింది.

కొత్తగా మొదలైన దశ అద్భుతంగా ఉంది.. కళ్ళు మూసుకున్నాను.

ఆ అందమైన భవనం, ప్రేమగా మాట్లాడుతున్న అయ్యగారు, నన్ను పరిశుభ్రంగా తయారు చేసి, కొత్త రూపం ఇచ్చిన ప్రకాశం, అయ్యగారి పక్కన నేను వేసిన మహాలక్ష్మి బొమ్మలా కూర్చున్న అమ్మగారు అందరినీ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. రోడ్డు, గుడిసె, సముద్రం ఒడ్డు తప్ప ఏనాడూ ఎరుగని పూలతోటా, చల్లని గాలి అంతా కూడా కొత్తగా, వింతగా ఉంది. ఎక్కడో వేరే ప్రపంచంలో ఉన్నట్టు అనిపిస్తోంది.

"వీడు ఇక్కడే ఉంటాడా!" కఠినంగ వినిపించిన అమ్మగారి స్వరం విని ఊహల నుంచి బయట పడ్డాడు మహా.. కాదు, కాదు మహాన్.

తేజ తిరిగి కథలోకి జారుకున్నాడు.. తను ఒక పాత్రగా మారాడు.

లక్ష్మి గారి మాటలకి మహా బిత్తరపోయాడు. రెండు అడుగులు నిలబడ్డ చోటి నుంచి వెనక్కి వేశాడు అప్రయత్నంగా. అది గమనించిన ఆయన వాడిని చేత్తో సంజ్ఞ చేస్తూ ఆపి పక్కన కూర్చున్న భార్య లక్ష్మి మొహంలోకి చూసాడు.

ఆవిడ మోహంలో అప్రసన్నత చోటు చేసుకుంది. భర్త చూపులు లెక్క చేయలేదు.

"ఈ ముష్టి వెధవని ఇంటికి తీసుకొచ్చి , స్నానపానాదులు చేయించడం కాక నామకరణం కూడానా... ఈయనకి పిచ్చి పట్టినట్టుంది" అనుకుంది అసహనంగా.

ఆ మాటే పైకి అంది "వాడి పేరేదో వాడికుండగా మీరు కొత్త పేరు పెట్టడం ఎందుకు?"



కౌముది

ఆయన గట్టిగా నవ్వాడు.  మహా భయంగా చూసాడు.

"చాల్లెండి ఏవిటా నవ్వు? " చిరాగా  అంది ఆవిడ.

"వాడి పేరేంటో అడుగు" అన్నాడు.  ఆవిడ ఆయన వైపు, మహా వైపు చూసి మౌనంగా ఉండిపోయింది.

"చెప్పరా"  అన్నాడాయన. "నీ పేరేంటి"  అన్నాడు మళ్ళీ.

"మా–– గాడు"  భయం, భయంగా చెప్పాడు.

మళ్ళీ కుడిచేయి చూపుడు వేలు అడ్డంగా ఆడిస్తూ  "కాదు.. మహాన్ .. ఏది చెప్పు మహాన్ " అన్నాడు.

ఉక్కిరి,బిక్కిరి అవుతూ అన్నాడు వాడు "మవాన్ "

"మవాన్  కాదు.. మహాన్ ... ఏది అను..."

రెండు, మూడు సార్లు పలికించాక స్పష్టంగా చెప్పాడు "మహాన్ "

"గుడ్! రేపటి నుంచీ నువ్వు అమ్మగారు ఏ పని చెబితే అది చేయాలి. ఖాళీ సమయంలో మా అబ్బాయి పుస్తకాలు ఇస్తాడు చదువుకో.. వాడు నీకు చదువు కూడా చెప్తాడు. నువ్వు బొమ్మలేస్తావు కదా!  సుద్దముక్కలు, బొగ్గు ముక్కలు తీసుకుని గచ్చుమీద,  గోడల మీదా, ఎక్కడ పడితే అక్కడ  వేయకూడదు..నీకు డ్రాయింగ్ పుస్తకాలు కొని తెస్తాను రంగు పెన్సిళ్ళు కూడా కొనిస్తాను వాటి మీద వేసుకో"  అని అప్పుడే అక్కడికి అడుగు పెట్టిన చేతన్ని చూపిస్తూ "వాడు నా కొడుకు... వాడికి టైం ఉన్నప్పుడు నీకు చదువు చెప్తాడు నేర్చుకోవాలి.. కొన్నాళ్ళు అయాక నిన్ను బళ్ళో చేర్పిస్తాను సరేనా" అన్నాడు.

వాడికి ఆయన చెప్పినవి కొన్నే అర్థం అయాయి.. కొన్ని అర్థం అయి, అవక తల ఊపాడు. చేతన్ తండ్రి పక్కకి వచ్చి కూర్చుని కుతూహలంగా అడిగాడు  "ఎవరు డాడి ఈ అబ్బాయి" .

"అమ్మకి పనిలో సాయం చేయడానికి తీసుకువచ్చాను. వాడికి ఏమి తెలియదు.. కాసిని అక్షరాలు నేర్పు.. గాలిని గాలి అంటారని, పూలని పూలు అంటారని నేర్పు" అన్నాడాయన.

చేతన్ అప్పుడే ఇంటర్లోకి వచ్చాడు. మెరిట్ స్టూడెంట్. బుద్ధిమంతుడు. తండ్రి ఆదర్శభావాలు కొద్దిగా పుణికి పుచ్చుకుని జీవితంలో అడుగులు వేస్తున్నాడు.  చిరునవ్వుతో మహాని చూస్తూ "సరే" అన్నాడు.

మరునాటి నుంచీ ఆ ఇంట్లో మహాకి కొత్త జీవితం ప్రారంభం అయింది. చేతన్ స్కూల్ కి వెళ్ళినప్పుడు లక్ష్మికి ఇంటి పనుల్లో సాయం చేయడం, సోఫాలు, ఫర్నిచర్, కిటికీలు, తలుపులు తుడవడం, అప్పుడప్పుడు తోటపనిలో ప్రకాశానికి సాయం చేయడంలాంటి పనులు ఇష్టంగా, శ్రద్ధగా చేయసాగాడు. కమ్మటి రుచులతో కూడిన భోజనం, టిఫిన్.. వాడికి అకస్మాత్తుగా తనని ఎవరో దేవతలు ఎత్తుకుని వెళ్ళి దేవలోకంలో దింపినట్టు ఉక్కిరి,బిక్కిరిగా ఉంది.

చేతన్ ఇంటికి వచ్చి తన హోమ్ వర్క్ చేసుకున్నాక అతని దగ్గర కూర్చుని అక్షరాలు నేర్చుకోడం రాత్రిళ్ళు తనకి కేటాయించిన గదిలో పడుకుని గడిచిపోయిన కాలాన్ని, తల్లి, తండ్రులని పదే, పదే తలచుకోవడం వాడి దినచర్య.. వాడిని అందరూ మహా అని పిలవసాగారు. తన పేరు కొత్తగా, అందంగా, గొప్పగా అనిపించింది వాడికి.

మట్టిలోమాణిక్యాలు చాలా ఉంటాయి.. కాకపోతే వాటిని మాణిక్యాలు అని గుర్తించి వాటి స్థానంలో వాటిని అమర్చినప్పుడే వాటికి విలువ ఉంటుంది. అయితే ఆ విలువ గుర్తించిన వారే ఆ పని చేయగలరు. చంద్రకాంత్ మంచి మనసుకి మహా మాణిక్యంలా కనిపించకపోయినా మట్టిని మాణిక్యంగా మార్చగల శక్తి సామర్ధ్యాలు ఆయనలో ఉండడం చేత మహాని సాన పెట్టడం మొదలుపెట్టాడు. ఇప్పుడు నిజంగానే వాడు మాణిక్యంలా మెరిసిపోతున్నాడు. మంచి తిండి, నీడ పట్టున జీవితం, దిగులు, చింతా ఎగిరిపోయి ఆ స్థానంలో సంతోషం, సంతృప్తి చేరడంతో పిల్లాడు రంగు తేలి, చూడ ముచ్చటగా అయాడు.

కాలం వేగంగా గడిచిపోయింది. ఇప్పుడు వాడి ప్రవర్తనలో హుందాతనం, మాటల్లో నాగరికత వచ్చేసాయి, చిన్న, చిన్న వాక్యాలు తెలుగులో, ఇంగ్లిష్ లో రాయగలుగుతున్నాడు, చదవగలుగుతున్నాడు. కానీ, రాస్తున్నప్పుడు, చదువుతున్నప్పుడు చాలా తప్పులు వస్తున్నాయి. ఇలా లాభం లేదనిపించింది ఆయనకీ.

తనకి తెలిసిన ఒక హెడ్ మాస్టర్ తో మాట్లాడి వాడిని స్కూల్లో చేర్పించాడు చంద్రకాంత్.. వాడిని ఏ క్లాసులో చేర్చుకోవాలో ఆయనకీ అర్ధం కాకపోయినా చంద్రకాంత్ మీద గౌరవం, భయంతో రెండో క్లాసులో కూర్చోబెట్టాడు. కానీ వాడికి చదువు మీద శ్రద్ధ అంతగా లేదని, చెప్పింది అర్ధం చేసుకునే శక్తి కూడా లేదని అర్ధమైంది ఆయనకి. నెమ్మదిగా మూడు, నాలుగు, అయిదు క్లాసులు దాటించాడు.

ఒకరోజు నిద్రలేచి బాల్కనీలో నిలబడి ఉన్న చంద్రకాంత్ ఎదురుగా కనపడిన దృశ్యం చూసి ముగ్ధుడైనాడు. పనిమనిషి వీధి వాకిట్లో ముగ్గులు వేస్తుంటే కళ్ళార్పకుండా చూస్తూన్న మహా హటాత్తుగా ఆమె చేతిలో ఉన్న ముగ్గు బుట్ట అందుకుని తను వేయసాగాడు ముగ్గు. వాడి చేతి వేళ్ళ సందునుంచి జారుతున్న ముగ్గు రక,రకాల గీతలతో ఒక అందమైన ఆకృతి దాల్చింది. పనిమనిషి బుగ్గన చేయి పెట్టుకుని వింతగా చూస్తోంది. చంద్రకాంత్ కి సడన్గా గుర్తొచ్చింది. వీడు

పుట్టుకతో కళాకారుడు. దైవదత్తంగా అబ్బిన ఆ కళకి శిక్షణ ఇస్తే మరింత ప్రతిభా వంతంగా తయారవుతాడు కదా! అసలు తను వీడిని తనతో తీసుకువచ్చిన రోజు ఆలోచించింది కూడా అదే కదా ! అయ్యో ఎలా మర్చిపోయాను! ఈ కుర్రాడిలో మంచి సృజనాత్మకత ఉంది. అది శిక్షణతో రాణిస్తుంది.. తప్పకుండా వీడిని ఏదన్నా ఆర్ట్ స్కూల్ లో చేర్చాలి అనుకున్నాడు తలపంకిస్తూ.

12

మహాకి ఎంత ప్రయత్నించినా చదువు మీద ఆసక్తిని మాత్రం కలిగించలేకపోయాడు అటు గురువు కానీ, ఇటు చంద్రకాంత్ కానీ. అతి కష్టం మీద ఒక్కో పాఠం చదువుతున్నాడు కానీ అదికూడా బలవంతంగా. ఆరోజు చదివిన పాఠం మర్నాడు ఒప్పచెప్పమంటే గుర్తు ఉండదు. నోరు తిరగదు. కొంతకాలం ప్రయత్నించిన గురువు వాడికి చదువు అబ్బడం అసాధ్యం అని నిర్ణయానికి వచ్చాడు. అదే విషయం చంద్రకాంత్ తో చర్చించాడు.

చంద్రకాంత్ " ప్రయత్నించండి. ఇంకా కొంతకాలం గడవనివ్వండి. కొంచెం కష్టం అవుతుంది..కానీ మన ప్రయత్నం చేయాలిగా అన్నాడే కానీ ఆయనకీ కూడా అనిపించింది ఇలా ఎంతకాలం అనిపించింది అని. వాడికి తెలిసిన విద్యలో శిక్షణ ఇప్పిస్తే అయినా ఏదో ఒక విద్యలో ప్రావీణ్యం సంపాదిస్తాడు అనిపిస్తోంది కానీ అందుకు తనేం చేయాలో ఆలోచించే సమయం ఆయనకీ లభించడంలేదు. వృత్తిపరమైన ఒత్తిళ్లలో నిండా మునిగిపోయి ఉన్న డి.సి.పి చంద్రకాంత్ వాడిని తనతో తీసుకుని వచ్చేటప్పుడు ఏమి ఆలోచించాడో గుర్తు రావడం లేదు. ఆరోజు పేవ్ మెంట్ మీద కళ్ళు వాల్చుకుని కూర్చుని దీక్షగా శ్రీ రాముడి బొమ్మని బొగ్గు ముక్క అరిగిపోయేలా దిద్దుతున్న చినిగిన బట్టల, చెదిరిన ఆశల పేద కుర్రాడు మాత్రమే కనిపించాడు. వాడిని అలా వదలాలి అనిపించలేదు. ఒక బాధ్యతాయుతమైన పోలీసు అధికారిగా ఆ కుర్రాడిని అలా వదిలేస్తే సమాజంలో మరో నేరస్తుడు తయారు అవుతాడేమోననే భయంతోనా, లేక అద్భుతమైన కళాకారుడు విరిగిన బొక్కు ముక్కలా మిగిలిపోకూడదు అనా! ఆయనకే తెలియని ఒక సందిగ్ధం.

ఈ ప్రశ్నలు మహానీ చూసినప్పుడల్లా ఈ ప్రశ్నలు ఆయన మదిలో మెదులుతూ ఉంటాయి. కానీ సమాధానం మాత్రం ఆయనకి తట్టడం లేదు.. వాడికి భగవంతుడు ప్రసాదించిన ఒక కళ ఉంది. దానిలోనే ప్రావిణ్యం సంపాదించగలిగితే మంచి చిత్రకారుడు అవుతాడు. పనికిరాని రాయే కావచ్చు కానీ, నిపుణుడైన శిల్పి చేతిలో అందమైన శిల్పంగా మారుతుంది. వీడూ అంతే రాయిలాంటి వాడు. వాడిని శిల్పంగా మార్చే శిల్పి కావాలి. ఎవరున్నారు? ఎవరన్నా మంచి గురువు లభించేవరకు తనే ఏదో ఒక మార్గం చూడాలి. అలా అనుకున్నాక ఆయనకీ కొంచెం సంతృప్తి కలిగింది/

ఆ రోజే వాడికి కొన్ని డ్రాయింగ్ బుక్స్ తెప్పించి ఇచ్చాడు. మహాకి అవి ఎలా వాడాలో చూపిస్తూ వివరంగా చెప్పాడు. "ఇప్పటినుంచీ నీకు బొమ్మలు వేసుకోవాలని అనిపిస్తే దీని మీద వేసుకో.. ఇవిగో పెన్సిల్స్.. ముందు చక్కగా స్కెచ్ వేయడం నేర్చుకో" అన్నాడు.

"అంటే" ప్రశ్నార్ధకంగా చూసాడు మహా.

ఆయన బుర్ర గోక్కున్నాడు.. పపెయింటింగ్ బాగుందా? లేదా అని మాత్రం తను చెప్పగలడు.. అది ఎలా వేశారో చెప్పడానికి తను కళాకారుడు కాదుకదా. నవ్వొచ్చింది ఆయనకీ. చిరునవ్వు దాచుకుని అన్నాడు " నువ్వు ఇంతకుముందు బొగ్గుతో వేసేవాడివి గుర్తుందా? అవే బొమ్మలు ఈ పెన్సిల్ తో ఈ కాగితాలమీద వేయి.. నెమ్మదిగా నువ్వు నేర్చుకునేలోగా నీకు ఎవరన్నా టీచర్ దొరుకుతాడేమో చూస్తాను" అన్నాడు.

సంకల్ప బలం ఉంటె ఎలాంటి ప్రయత్నం చేయకుండానే కొన్ని కోరికలు నెరవేరతాయి. మంచి మనసుతో రోడ్డు మీద పడి ఉన్న రాయిని తీసుకొచ్చి రత్నంగా మార్చి దానికి ఒక విలువైన స్ధానం ఇవ్వాలనుకునే ఉన్నతమైన వ్యక్తిత్వంగల ఆ పోలీస్ ఆఫీసర్కి ఎక్కువ ప్రయత్నం చేయకుండానే ఒక పార్టీలో పరిచయం అయాడు శత్రుఘ్న. జాతీయంగా మంచి పేరున్న ఆర్టిస్ట్.. ఆయనకీ బాగా ఇష్టమైన ఆర్టిస్ట్ వడ్డాది పాపయ్య. ఆ చిత్రాల్లోని సొగసు, దివ్యత్వం, సౌందర్యం అతని చిత్రాల్లో చూసాడు. అద్భుతమైన పెయింటింగ్స్ . రకరకాల ఆర్ట్.. వాటర్ కలర్స్, ఆయిల్ పెయింట్స్, అక్రిలిక్ పెయింట్స్, స్కెచ్ లు, ఒకటేమిటి? ఎన్నో రకాల బొమ్మలు.. మోడరన్ ఆర్ట్ అప్పుడే బాగా ప్రాచుర్యం పొందుతున్న పరిస్థితి.. అతను వేసిన మోడరన్ ఆర్ట్ చూసి ముగ్ధుడై పోయాడు. అటు క్లాసిక్, ఇటు మోడరన్ ఆర్ట్ రెండూ అద్భుతంగా వేయగలిగినా ఇంకా నేను విద్యార్ధినే అంటాడు శత్రుఘ్న.

మహా గురించి చెప్పాడు.. "ఆ కుర్రాడు ఎక్కడివాడో నాకు తెలియదు శత్రుఘ్నా! దైవదత్తమైన అపురూపమైన కళ వాడికి ఉంది. అవలీలగా బొమ్మలేస్తాడు. కానీ బొగ్గుతో వేసినట్టు డ్రాయింగ్ పేపర్ మీద వేయలేకపోతున్నాడు. వాడు వేసిన బొమ్మ చూసాను. శ్రీ రాముడి మొహంలో ఎంత జీవకళ కనిపించిందో చెప్పలేను. కానీ, చేతులు, కాళ్ళు, కటి భాగం ఇలాంటి చోట్ల స్ట్రోక్స్ కుదరలేదు అనిపించింది నాకు. వాడికి కొంచెం సాన బెడితే మంచి చిత్రకారుడు అవుతాడు. మీరు అంగీకరిస్తే వాడిని మీకు శిష్యుడిగా పంపిస్తాను. మీ ఫీజు ఎంతో చెప్పండి " అన్నాడు శత్రుఘ్నతో.

" ఒక అనాధలోని ప్రతిభను గమనించి పెద్ద మనసుతో అతడిని వజ్రంగా మార్చాలనుకుంటున్నారు మీరు. మీరు చేసే మహత్కార్యానికి నన్ను ఒక నూలుపోగుగా మారే అదృష్టం కలిగించండి..నాకు ఫీజు అవసరం లేదు, ఆ కుర్రాడిని తప్పకుండా పంపించండి" అన్నాడు శత్రుఘ్న.

" రేపటి నుంచీ పంపనా" అడిగాడు ఆయన.

"అలాగే పంపండి"   అన్నాడు శత్రుఘ్న.

మరునాడు  ప్రకాశాన్ని తోడిచ్చి శత్రుఘ్న దగ్గరకు పంపిస్తూ  "ఆయన చెప్పేది జాగ్రత్తగా విని బాగా నేర్చుకో. చేసేపని మీద ఏకాగ్రత, శ్రద్ధ ఉండాలి.. చదువు మీద నీకు శ్రద్ధ లేదు.. దీని మీదన్నా శ్రద్ధ  చూపించు  పైకి వస్తావు " అని హెచ్చరించాడు.

శత్రుఘ్న మహాని పరీక్షగా చూసాడు. చామన చాయగా ఉన్నా ఎంతో కళగా ఉన్నాడు.  మంచి పోషణ ఉండడం వల్ల వయసుకి మించి పొడుగ్గా ఉన్నాడు.  వినయంగా, చేతులు కట్టుకుని  "మీరు ఏం చెప్తే అది చేస్తా" అన్నట్టు చూస్తున్నాడు.

"నువ్వు పేవ్మెంట్ మీద బొమ్మలేసేవాడివట .. ఏం బొమ్మలేసావు."

" దేవుడి బొమ్మలు"

ఆయన పెదవుల మీద సన్నని మందహాసం. "ఇంకా చాలా బొమ్మలు వేయచ్చు తెలుసా నీకు? అడిగాడు.

మహా సమాధానం చెప్పలేదు.. వెంటనే వాడి మనసులో ఉధృతంగా కెరటాలతో ఎగసిపడుతున్న సముద్రం, ఒడ్డున ఇసకలో గుజ్జనగూళ్ళు కడుతూన్న సావాసగాళ్ళు మెదిలారు..

"ఇలారా"   మహా   ఆయన్ని అనుసరించాడు... లోపల గోడల మీద, టేబుల్ మీద, షో కేసులో ఎన్నో పెయింటింగ్స్, పెన్సిల్ స్కెచ్స్.. అక్రిలిక్ రంగులతో, వాటర్ కలర్స్, ఆయిల్ పెయింట్స్ ఇలా రకరకాలుగా  వేసిన బొమ్మలతో నిండి ఉంది గోడ.

ఒక పెద్ద డ్రాయింగ్ పేపర్ పెన్సిల్స్ ఇచ్చి " దేవుడి బొమ్మలు తప్ప వేరేవి,  నీకు గుర్తున్న బొమ్మ వేయి"  అన్నాడు శత్రుఘ్న.

వాడు కాసేపు ఏవో గీతలు గీస్తూ ఉండిపోయాడు.

చంద్రకాంత చెప్పినట్టు  బొగ్గుతో వేసినంత సులభంగా పెన్సిల్స్ తో వేయలేకపోతున్నాడు అనుకున్నాడు. " ఆలోచించి మంచి బొమ్మ వేసి తీసుకురా చూస్తాను " అని చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిన వైపు చూస్తూ అచేతనంగా కూర్చున్న మహా కళ్ళ ముందు గాలికి విరిగిపడుతున్న చెట్లు... పొడుగాటి చేతులు చాచి ఆకాశాన్ని కిందకి లాగడానికి ప్రయత్నిస్తున్న సాగరకెరటాలు..నిర్జీవంగా ఇసకలో కూరుకుపోతున్న అమ్మ, సుడులు తిరుగుతున్న నీటిలో మునిగిపోతున్న పడవ... పైకిచాచి శరణు కోరుతున్న కొన్ని జతల చేతులు కదిలాయి.. ఆ దృశ్యాన్ని గాజుకళ్ళతో చూస్తూ మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టుకుని కూర్చున్న తొమ్మిదేళ్ళ కుర్రాడు.

విశాఖ ఆర్ట్ గ్యాలరీలో జరగబోయే ఆర్ట్ ప్రదర్శనలో తను ప్రెజంట్ చేయబోతున్న పెయింటింగ్ వేయడంలో మునిగిపోయి ఉన్న శత్రుఘ్న కాన్వాస్ మీద పడిన నీడ చూసి వెనక్కి తిరిగాడు. చేతిలో డ్రాయింగ్ పేపర్ పట్టుకుని నిలబడి ఉన్నాడు. వాడి చేతిలోంచి ఆ పేపర్ అందుకుని చూసిన ఆయన నిర్ఘాంతపోయాడు. “ ఇది ఊహించి వేసావా!” అడిగాడు..

కాదు అన్నట్టు తల ఊపాడు మహా “ మరి... నీకెలా తెలుసు ఒక తుపాను భీభత్సం ఇలా ఉంటుందని. నువ్వు.. నువ్వు...” చేష్టలుడిగిన వాడిలా చూస్తూ అడిగాడు.

మహా ఒక్కో అక్షరం కూడదీసుకుంటూ చెప్పాడు.. “ నేను చూసాను... అమ్మా, అయ్యా అందరూ చనిపోయారు.”

కొన్ని వందల కొండచరియలు తన మీది విరిగిపడుతున్న భావన ..

శత్రుఘ్న ఆపుకోలేని ఉద్వేగంతో ఆ అమాయకుడైన కుర్రాడిని గబుక్కున దగ్గరకు లాక్కుని గుండెలకు హత్తుకుని వాడి తలమీద చేయి పెట్టి “ గొప్ప చిత్రకారుడివి అవుతావు భవిష్యత్తులో.. నిన్ను నేను తయారు చేస్తాను.” అన్నాడు.

మరునాటి నుంచీ పెన్సిల్ ఎలా పట్టుకోవాలి... పేపర్ ఏ యాంగిల్ లో ఉండాలి.. మొదలైన విషయాలు ఓపిగ్గా వివరించాడు. గీతలు వంకరగా రాకుండా ఎలా గీయాలి.. కళ్ళల్లో జీవం ఉట్టి పడాలంటే కనుగుడ్డు ఎలా దిద్దాలి.. వగైరావాడికి అర్ధం అయేలా వివరిస్తూ కొన్ని స్కెచ్ లు వేయించడం చూపించాడు. బొమ్మ వేసేటప్పుడు అతనిలో కనిపించే ఏకాగ్రత చూస్తె ముచ్చటేసింది శత్రుఘ్నకి. మంచి అవగాహన ఉంది. చేసే పని మీద శ్రద్ధ ఉంది... ఇది చాలు ఇతను గొప్ప చిత్రకారుడు అవడానికి అనుకున్నాడు.

చంద్రకాంత్ మహానీ శత్రుఘ్న చేతిలో పెట్టాక చాలా నిశ్చింతగా ఉన్నాడు. మధ్యాహ్నం మూడు గంటలకి ప్రకాశం కారులో మహాని శత్రుఘ్న దగ్గర దింపేసి, ఏడింటికి పిక్ అప్ చేసుకుంటాడు. మొదట్లో ఆ విషయం పెద్దగా పట్టించుకోకపోయినా లక్ష్మీదేవికి వాడిని అలా కారుకి అలవాటు చేయడం మంచిది కాదు అనిపించింది. వాడు

ఎంతకాలం తమ దగ్గర ఉంటాడు! ఎప్పుడో ఒకరోజు వెళ్ళిపోయి, స్వతంత్రంగా బతకాలి. అప్పుడు పరిస్థితి ఏమిటో ఎవరూ చెప్పలేరు. ఇలా కార్లు భోగాలు మరిగితే వాడు కష్టపడతాడా! వాడే కాదు. ఎవరూ కూడా ఆయాచితంగా లభించిన భోగాలు వద్దు అని కష్టాలు కొనితెచ్చుకుంటారా/ అందుకే ఆవిడ భర్తతో చెప్పింది. " బస్సులో ఎలా వెళ్లి రావాలో చెప్పండి వాడికి. ఈ కారు భోగం ఎన్నాళ్ళు ఉంటుంది." ఆవిడ చెప్పాక ఆయనకీ కూడా ఆ మాటల్లో నిజం ఉంది అనిపించింది. ప్రకాష్ ని మహాకి శత్రుఘ్న దగ్గరకి వెళ్ళడానికి బస్సు ఎక్కడ ఎక్కాలి.. ఎలా వెళ్ళాలి అనే విషయాలు రెండు రోజులు చూపించమని పిలిచి చెప్పాడు.

రెండు రోజులు ప్రకాష్ తోడుగా వెళ్ళినా, మూడోరోజు నుంచీ మహా ఒక్కడే వెళ్ళాల్సి వచ్చింది. చంద్రకాంత్ గారి దగ్గరకు వచ్చాక రోడ్డు మీద ఒక్కడు కనీసం నిలబాల్సిన అవసరం కూడా రాలేదు.. ఇప్పుడు ఒక్కడే బస్సు ఎక్కి వెళ్ళడం మహా భయంతో వణికిపోయాడు నాలుగురోజులు. బిక్కు, బిక్కు మంటూ బెదురుచూపులు చూస్తూ వెళ్ళినా సరిగ్గా వారం అయే సరికి కొంచెం, కొంచెంగా అలవాటు అయింది.

బ్రతకాలన్న ఆశ ఉంటే చాలు, ఈత రానివాడిని అయినా నిట్టనిలువు నీళ్ళల్లో ముంచితే ఈత నేర్చుకుని మరీ ఒడ్డు చేరతాడు. అదే జరిగింది మహా విషయంలో. శత్రుఘ్న స్నేహస్వభావం, అతను ఆర్ట్ నేర్పించే విధానం వాడిని ఆకర్షించింది. చిత్రకళ పట్ల అభిరుచి, ఆసక్తి ఉందొ, లేదో తెలియదు కానీ బొమ్మలు గీసేటప్పుడు వంచిన తల ఎత్తడు.. చుట్టుపక్కల ఏం జరుగుతుందో కూడా ధ్యాస ఉండదు.. అలా శ్రద్ధగా తను వేయాలి అనుకున్న బొమ్మ పూర్తీ చేసిగాని కూర్చున్న చోటు నుంచి కదలడు. ఒక తపస్విలా తను చేస్తున్న పనిలో లీనమైపోయే వాడిని చూస్తె శత్రుఘ్నకి ముచ్చటగా అనిపిస్తుంది. భగవత్ దత్తమైన కళ వాడికి అబ్బింది. శిక్షణ లభిస్తే రాణిస్తాడు.. చంద్రకాంత్ అన్నట్టు ఏదో ఒక జీవనభ్రుతి కల్పించాలి.. చదువు అబ్బని ఈ కుర్రాడు ఎంతకాలం ఒకరి మీద ఆధారపడి జీవిస్తాడు? అని ఆలోచించిన శత్రుఘ్న శ్రద్ధగా నేర్పిస్తూ ఎంతో ఆదరంగా చూస్తున్నాడు. ఆయన ఆదరణతో తొందరలోనే వాడిలో ఉన్న బెరుకుపోయింది. ఇప్పుడు శత్రుఘ్న దగ్గర గడపడం చాలా ఇష్టం అయిన దినచర్య అయింది. అందుకే వంటరిగా అయినా తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ వెళ్ళడం మొదలుపెట్టడంతో త్వరలోనే తన మీద తనకి కాన్ఫిడెన్సు కూడా వచ్చింది. వాడికి అకస్మాత్తుగా తను చాలా పెద్దవాడు అయిపోయినట్టు అనిపించసాగింది. వాడి మాటలో, ప్రవర్తనలో మార్పు వచ్చింది.

ఎవరూ ఎప్పటికీ ఒకేలా ఉండరు. కాలం అనేది ఎలాంటి వాళ్ళనైనా తనకి అనుకూలంగా మార్చుకుంటుందే తప్ప ఎవరికీ అనుకూలంగా కాలం మారదు. ఇది వాస్తవం.

శత్రుఘ్న ప్రోత్సాహంతో మహా వేళ్ళు చురుగ్గా పనిచేస్తున్నాయి. వాడిలో వాడే ఊహించుకుని కూడా కొన్ని బోమ్మలు వేయగలుగుతున్నాడు. వాటిలో  దేవుడి బొమ్మలే కాదు, ప్రకృతి ద్ర్యశ్యాలు, నది ఒడ్డు, సూర్యాస్తమయం, సూర్యోదయం,  పున్నమి చంద్రుడు ఇలా ఎన్నో బొమ్మలు వేయగలుగుతున్నాడు. నెమ్మదిగా ఎక్కడ ఏ  రంగు వేయాలో ముందు కలర్ పెన్సిల్స్ తో చూపించడం మొదలుపెట్టాడు శత్రుఘ్న.

ఆరోజు చంద్రకాంత్  పుట్టినరోజు .. ఉదయం నిద్రలేచి, స్నానం ముగించి  హాల్లో కి రాగానే ఇంట్లో సందడి కనిపించింది మహాకి. తను లేచేసరికే చంద్రకాంత తలారా స్నానం చేసి, కొత్త, పైజమా, లాల్చీలో వార్తాపత్రిక చదువుకుంటూ కూర్చున్నాడు. లక్ష్మిదేవి కూడా పట్టుచీర కట్టుకుని పూజ ముగించి హారతి పళ్ళెంతో వచ్చింది.

మహాని చూడగానే నవ్వుతూ "స్నానం చేసావా! హారతి అద్దుకొ..ఇవాళ అయ్యగారి పుట్టినరోజు.." అంది.

మహా హారతి అద్దుకున్నాడు.

వాడికి పుట్టినరోజు అంటే అర్థం కాలేదు.  పుట్టినరోజులు, వేడుకలు,  కొత్తబట్టలు ఇవన్నీ తెలిసే జీవితం కాదు.. విచిత్రంగా అనిపించింది వాడికి. చరణ్ కూడా స్నానం చేసి వచ్చి తల్లి,తండ్రుల పాదాలకు నమస్కరించి, తండ్రి చేతికి కొత్త వాచీ పెట్టాడు.

"ఒరేయ్.. ఒరేయ్ నువ్వు నాకు గిఫ్ట్ ఇచ్చేంత పెద్దవాడివి అయావా !" ఆయన ఆ వాచీ చూసి మురిసిపోతూ కొడుకును దగ్గరకి తీసుకుని నుదుటి మీద ముద్దుపెట్టుకున్నాడు.

ఆ సన్నివేశం రెప్పవేయకుండా చూస్తూ ఉండిపోయాడు మహా. అంతా విచిత్రంగా ఉంది. ఆ తండ్రి కొడుకులను చూస్తుంటే ఒక్కసారి తనని కూడా ఆయన అలా దగ్గరకి తీసుకుంటే బాగుండు అనిపించింది. వాది శరీరం సన్నగా కంపించడం మొదలుపెట్టింది.. మొదటిసారిగా ప్రేమ, వాత్సల్యం, తండ్రి పరిశ్వంగంలోని తీపి వాడికి ప్రతి నరం నిశ్శబ్దంగా వివరిస్తున్నట్టుగా చిత్రమైన భావన కలగసాగింది. తను కూడా అలాంటిది ఏదన్నా ఇస్తా అలాగే దగ్గరకి తీసుకుంటాడా అయ్యగారు. ఏమివ్వాలి? అవును ఏమివ్వాలి?

సాయంత్రం శత్రుఘ్న దగ్గరకు వెళ్ళాక ఉదయం నుంచీ మనసులో మెదులుతున్న ఆ భావనని మొహమాటంగా, ఇబ్బందిగా వ్యక్తం చేసాడు.

"పుట్టినరోజు అంటే ఏమిటి?"  అడిగాడు.

ముందు ఆశ్చర్యంగా చూసాడు  శత్రుఘ్న. ఆ ప్రశ్న వేసి జవాబు కోసం ఆత్రంగా చూస్తున్న ఆ కళ్ళల్లోని అమాయకత్వం చూసేసరిని  మనసులో వాడి పట్ల అంతులేని సానుభూతి పొంగింది,.

నెమ్మదిగా పుట్టినరోజు అంటే ఏమిటో వివరించాడు. చరణ్ ఇచ్చిన వాచీ గురించి కూడా చెప్పి, నేను కూడా ఏదన్నా ఇవ్వాలి ఏమివ్వను? అన్నాడు మహా.

శత్రుఘ్న ఒక్క క్షణం ఆ కుర్రాడి మనసులో మెదిలిన ఆలోచనకి విస్తుబోయినా, వెంటనే “ ఇస్తావా” అన్నాడు.

మహా తలూపాడు.

“ సరే ఇలారా ఆ పేపెర్ తీసుకో...” అంటూ ఆర్ట్ పేపర్ చూపించాడు

13వ భాగం

**సాయం సమయం..** లాన్ లో భార్యతో కలిసి కూర్చుని టీ తాగుతూ కబుర్లు చెబుతున్నాడు చంద్రకాంత్. సూర్యాస్తమయ కిరణాలు ఏటవాలుగా పచ్చని గడ్డిమీద పడుతున్నాయి.  గడ్డి బంగారు రంగులో మెరుస్తోంది.  ప్రక్రుతి శీతాకాలానికి వీడ్కోలు పలుకుతూ వేసవికి స్వాగతం పలకడానికీ సన్నాహాలు చేసుకుంటున్న వేళ, చల్లని గాలి అతిధిలా వచ్చి పలకరించి వెళ్తోంది.

గేటు చప్పుడైంది. రెండు చేతుల్లో  భద్రంగా గుండెకి దగ్గరగా పెద్ద వస్తువేదో పట్టుకుని లోపలికి వచ్చాడు మహా. లాన్ లో కూర్చున్న చంద్రకాంత్ దంపతులను చూడగానే ఒక్కసారిగా భయంతో శరీరం కంపించింది. కాళ్ళు నేలకి అంటుకున్నట్టు గేటు దగ్గరే నిలబడిపోయాడు.

అతని వాలకం చూసి భార్యాభర్తలు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఏమైంది వీడికి? అన్నట్టు ప్రశ్నార్ధకంగా చూసాడు చంద్రకాంత్ భార్యవైపు.

ఆవిడ ఏమో అన్నట్టు భుజాలు ఎగరేసి, మహా వైపు చూసి “ ఇలారా “ అంది.

వాడు పలకలేదు.. నిలుచున్న చోటే బిక్కచచ్చినట్టు నిలబడిపోయాడు.

“ఏంటి నీ చేతులో “ అడిగింది ఆవిడ.

తల వంచి ఒకసారి చేతిలో ఉన్న వస్తువు చూసి తిరిగి ఆవిడ వైపు చూసాడు.

అనుభవజ్ఞుడైన చంద్రకాంత్ కి అనుకోకుండా తామిద్దరిని అక్కడ చూసి భయపడి ఆగిపోయాడు అని అర్థం అయింది. స్వరం మృదువుగా మార్చి రారా అన్నాడు.

ఆయన స్వరంలోని మృదుత్వానికి కొంచెం ధైర్యం వచ్చినట్టు అయి మహా వాళ్ళవైపు అడుగులు వేసాడు.

"ఏంటది?" అడిగాడు ఆయన.

మహా ఒకసారి లక్ష్మి వైపు చూసి, తిరిగి ఆయన్ని చూసి బిడియంగా తన చేతిలో ఉన్న కవర్ అందించాడు.

బ్రౌన్ paper లో చుట్టి ఒక ఫ్రేమ్ ఏదో ఉన్నట్టు గమనించిన చంద్రకాంత్ పేపర్ తీసాడు. ఒక్కసారి ఆయన కళ్ళు ఆశ్చర్యంగా విచ్చుకున్నాయి.

చంద్రకాంత్ గారి రూపం పెన్సిల్ తో స్కెచ్ వేసాడు.. ముక్కు, కళ్ళు, కనుబొమలు, ఆరోజు మొదటిసారి వాకింగ్ సూట్ లో ఉన్న తన రూపం.. "ఇది.. ఇది నువ్వే వేశావా" అడిగాడు.

"ఏంటది? " అడిగింది ఆవిడ. ఆయన ఆ ఫోటో ఆవిడ చేతికి ఇచ్చాడు.

ఆవిడ తెల్లబోయింది.. "నువ్వే వేసావా?" నమ్మశక్యం కానట్టు అడిగింది.

తలూపాడు మహా.

ఆయన కళ్ళల్లో సన్నటి నీటి తెర... భావోద్వేగంతో చూస్తూ అన్నాడు.. " ఎవరు చెప్పారు శత్రు చెప్పాడా !"

మహా గొంతు పెగిలింది.. ఆయన మొహం లో కనిపించిన ఆనందం చూసి కొంచెం ధైర్యం వచ్చింది.. "నేనే వేశాను... ఇవాళ మీ పుట్టిన రోజు కదా! అందుకు" అన్నాడు.

ఆయన గబుక్కున కుర్చీలోంచి లేచి రెండు చేతులూ చాచాడు. మహా గుండె ఆనందంతో త్రుల్లిపడింది.. గబుక్కున ఆయన చేతుల్లో వాలిపోయాడు. ఎంతో కాలంగా వాడి గుండెల్లో సుడులు తిరుగుతున్న వాంఛ ఒకటి ఆయన చేతి స్పర్శలో సాంత్వన పొందాలన్నది. ఇది అని చెప్పలేని ఒక దిగులు వాడి గుండెల్లో నిశ్శబ్దంగా నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది.. అది ఎందుకు? ఏమిటి అని వాడికి తెలియదు. చరణ్ ని ఆయన దగ్గరకు తీసుకున్నప్పుడల్లా ఆ రెండు చేతుల మధ్య తానూ ఒకసారి ఒక ఓదార్పు పొందాలని అనిపిస్తూ ఉండేది. అది ఇప్పుడు అనూహ్యంగా తీరింది. ఆయన వాడిని గట్టిగా

గుండెలకు హత్తుకుని... " గాడ్ బ్లెస్ యు నాన్నా.. తప్పకుండా నువ్వు జీవితంలో ఉన్నత స్థానం పొందుతావురా నాకా నమ్మకం ఉంది." అన్నాడు.

వాడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"వెళ్ళు.. వెళ్లి ఫ్రెష్ అయిరా .. అందరం డిన్నర్ కి బయటకు వెడదాం " అన్నాడు ఆయన.

మహా నెమ్మదిగా ఆయన కౌగిలి విడిపించుకుని బొమ్మలా కూర్చుని ఉన్న లక్ష్మీదేవి వైపు ఒకసారి చూసి తలవంచుకుని తన గదివైపు వెళ్ళిపోయాడు.

"ఒక బెస్తవాడికి ఇంత గొప్ప కళ ఎలా అబ్బిందో! నాకు ఆశ్చర్యంగా ఉంది లక్ష్మి.. ఎంత బాగా వేశాడో చూసావా !" ఎంతో సహజంగా, జీవకళ ఉట్టిపడుతూ అద్భుతంగా ఉన్న ఆ స్కెచ్ చేతిలో పట్టుకుని పరీక్షగా చూస్తూ అన్నాడు చంద్రకాంత్ .

" బాగానే ఉంది.. అది సరే ఇప్పుడు వాడు కూడా మనతో కలిసి స్టార్ హోటల్ కి డిన్నర్ కి వస్తాడా!" అడిగింది ఆవిడ.

ఆయన చిరునవ్వుతో ఆవిడవైపు చూసి, " అనాధలు స్టార్ హోటల్ కి వెళ్ళకూడదు అని ఏ శాస్త్రంలో అయినా రాసి ఉందంటావా " అన్నాడు.

ఆవిడ మొహం మట, మట లాడిస్తూ "దేనికైనా ఒక పరిమితి ఉంటుంది. మీ మంచితనానికి కూడా పరిమితి విధించుకుంటే మంచిది. మీరు, నేను మన కొడుకు కలిసి గడపాల్సిన సమయంలో వాడు మనతో ఉండడం ఏమిటి? కావాలంటే ఏదన్నా మెస్ నుంచి ఏదన్నా స్పెషల్ item తెప్పించి పెట్టండి.. వాడు మనతో రావడం నాకిష్టం లేదు " అంది.

ఆయన కొన్ని క్షణాలు ఆవిడ వంక తదేకంగా చూసి, నా పుట్టిన రోజు నాడు... పుట్టిన రోజు అంటే అర్ధం కూడా తెలియని ఒక అమాయకుడు ఇంత విలువైన బహుమతి ఇచ్చాడు. దీనికన్నా విలువైనదా స్టార్ హోటల్ డిన్నర్.. నా భార్యగా నువ్వింత సంకుచితంగా ఆలోచించడం నేను హర్షించను లక్ష్మి..దృక్పధం కొంచెం విశాలం చేసుకో.. మన అండలో ఉన్న వాడు మనవాడు అవుతాడు. ఆ స్థానం వాడికి ఇవ్వలేని విశాలహృదయం మనకు లేనప్పుడు వాడిని ఆదరించి ఆశ్రయం ఇవ్వడమే ఒక నేరం అవుతుంది నా దృష్టిలో.. దయచేసి అర్ధం చేసుకో.." ఆయన లేచి లోపలికి నడిచాడు.

ఆయన మాటలకు దిగ్భ్రాంతి చెందిన ఆవిడ కూర్చున్న చోటే చిత్తరువులా ఉండిపోయింది.

మరికొంత కాలం గడిచింది.అయితే, ఊహించేది,ఆశించేది జరగడం ఎంత కష్టమో తెలియచేస్తూ శత్రుఘ్న ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న అవకాశం వచ్చింది. పారిస్ వెళ్లి అక్కడి ఆర్ట్ నేర్చుకోవాలన్నది అతని కల. ఆ అవకాశం రావడంతో చంద్రకాంత్ దగ్గర సెలవు తీసుకుని, మరో మంచి ఆర్టిస్ట్ ని చూసి మహాకి ఇంకా బాగా మంచి ఆర్ట్ నేర్పించమని చెప్పి శత్రుఘ్న వెళ్ళిపోయాడు. హాల్లో గోడమీద తేజ ఆయని పుట్టినరోజుకి కానుకగా పెన్సిల్ స్కెచ్.. శత్రుఘ్న సలహాతో ఫ్రేమ్ కూడా కట్టించి ఇచ్చాడు. ఆయన ఆ ప్రేమకి ఒక విధంగా దాసుడయాడు.. ఆ ప్రేమకి, ఆ వాత్సల్యానికి ఆ ఫోటో హాల్లోనే గోడ మీద పెట్టుకున్నాడు.

అంతేకాదు వాడే వేసిన మరో బొమ్మ మహాత్మా గాంధీ మళ్ళీ పుట్టినట్టు జీవం తొణికిసలాడుతూ ఉంది. చిరునవ్వుతో, చేతిలో కర్రతో శబ్దం చేస్తూ ఇల్లంతా బాపూ తిరుగుతున్నట్టే ఉంటుంది.

ఇందిరా గాంధీ బొమ్మకూడా, చిరునవ్వుతో, తేజస్సుతో చాలా ప్రత్యేకంగా, జీవకళ ఉట్టిపడుతూ అద్భుతంగా వేశాడు. ఎంతో హుందాగా కనిపిస్తూ ఇంటికి వచ్చిన ప్రతివాళ్లని ఆకర్షిస్తూ ఆ ఇంట్లో ఒక కళాకారుడు ఉన్నాడని చెప్పకనే చెబుతున్నట్టు ఉంది ఆ చిత్రం. ఈ మూడు చిత్రాలూ పెన్సిల్ స్కెచ్ లో శిక్షణ అనంతరం శత్రుఘ్న వేయించినవి.

ఆ తరవాతే వాటర్ కలర్స్ ఉపయోగించడం నేర్పుతూ ఉండగా శత్రుఘ్న పారిస్ వెళ్ళే అవకాశం వచ్చింది. ప్రతి వ్యక్తికీ తనకంటూ ఒక లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్యం చేరడానికి ఎన్నో అడ్డంకులు దాటాలి.. అందుకు కావలసిన సహనం, సాహసం ఆ భగవంతుడే ప్రసాదిస్తాడు. నిజానికి శత్రుఘ్న కూడా మహా బాటలోని వాడే. కానీ అతనికి తన కుటుంబం ఏదో తెలుసు.. ఆ కుటుంబాన్ని కోల్పోయిన బాధా తెలుసు. ఆ బాధ మర్చిపోడానికి తనని తను ఒక మార్గంలో నడిపించుకుంటున్నాడు. ఆ మార్గానికి మహా కోసం అడ్డుపడే కుసంస్కారి కాదు ఆయన. ఆయన మనసు స్ఫటికం లాంటిది.. అందరినీ ప్రేమించడం మాత్రమే తెలుసు ఆయనకి. అందుకే శత్రుఘ్న చిరకాల స్వప్నం నేరవేర్చుకోవద్దని అనలేని ఆయన మనసారా అతనికి వీడ్కోలు పలికాడు.

మళ్ళీ మహా కథ మొదటికి వచ్చినట్టు అయింది.

“ ఎంత మంచివాడు అయినా, ఇంక ఎంత కాలం వాడిని ఇంట్లో పెట్టుకుంటాం! వాడికేదో ఒక ఆధారం చూపించి పంపకూడదా ” అంది లక్ష్మీదేవి ఒకరోజు భర్తతో.

"మరీ చిన్నవాడు. మంచో, చెడో తీసుకుని వచ్చాను. వాడి దారిన వాడు బతకగల ధైర్యం, కొంచెమన్నా తెలివితేటలు ఉన్నాయన్న నమ్మకం నాకు కలిగిందాకా పంపలేను లక్ష్మి. ఒకవేళ పంపించాక వాడేదన్నా తప్పు చేస్తే నేను శిక్షార్హుడిని అవుతాను. తీసుకున్న బాధ్యత సక్రమంగా నెరవేర్చాలి. ఇంకో రెండేళ్ళు టైం ఇవ్వు.. ఇప్పుడు బహుశా వాడికి పదహారేళ్ళు వచ్చి ఉంటాయి అనుకుంటున్నా.. మేజర్ అవనీ " అన్నాడాయన.

ఆవిడ మాట్లాడలేదు. ఆవిడకి భర్త మీద ఎంతో నమ్మకం మరెంతో గౌరవం ఉన్నాయి. నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ గా మంచి పేరుంది ఆయనకీ. ఖాకీ బట్టల వెనుక ఉండే గుండె ఒక పెద్ద బండ రాయిలా ఉండాల్సిన వృత్తి. కానీ ఆయనది పూవులాంటి సున్నితమైన మనసు. జాలి, దయగల మనిషి. ఇంత సున్నితమైన మనసున్నవాడు ఎలా పోలీస్ ఆఫీసర్ అయాడు అంటారు ఆవిడ కుటుంబ సభ్యులు. నేరస్తులను థర్డ్ డిగ్రీ ఉపయోగించి వాళ్ళ చేత నిజం చెప్పించాలన్న పోలీస్ పాలసీకి విరుద్ధంగా వారిలో పరివర్తన వచ్చే దిశగా వారికి కౌన్సిలింగ్ చేయాలి అనేది ఆయన పద్ధతి. కరడు గట్టిన ఖైదీలో కూడా పరివర్తన తీసుకురాగల శక్తి ఉన్నవాడు. డిపార్ట్మెంట్ లో మంచి పేరున్న ఆఫీసర్.

ఒక్కడే కొడుకు... ఆ కొడుకుతో ఒక స్నేహితుడిలా ఉంటాడు. చిన్నప్పటి నుంచీ కూడా ఏనాడూ కొడుకుని ఏ విషయంలోనూ నిర్బంధించడం, క్రమశిక్షణ పేరుతొ కఠినంగా ప్రవర్తించడం ఆయనకు తెలియదు. భార్యని కూడా స్నేహితురాలిగానే చూస్తాడు. భర్తగా అధికారం, అహంకారం ప్రదర్శించడం ఏనాడూ చేయలేదు. ఆవిడకి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. ఆదర్శాలు వల్లించని ఆదర్శమూర్తి. అందుకే ఆయన ఏం చేసినా ఆవిడ ఎదురు చెప్పదు .. తనకి మరీ ఇష్టం లేకపోతె తన అయిష్టాన్ని చూచాయగా తెలియచేసి, నిర్ణయం ఆయనకే వదిలేస్తుంది.

ఇంతకాలం మహా భవిష్యత్తు నిర్ణయం కూడా ఆయనకే వదిలేసింది.

ఇప్పటికే వాడు వచ్చి ఆరేళ్ళు అయింది.. ఇంకా రెండేళ్ళు... అప్పటికి వాడికి పద్దెనిమిదేళ్ళు వస్తాయి, మేజర్ అవుతాడు అన్నది ఆయన ఆలోచన. ఇప్పుడు ఎంత ఉంటుందో వయసు.. ఎప్పుడు పుట్టాడో, ఎక్కడ పుట్టాడో, ఎవరికీ పుట్టాడో కూడా వాడికీ తెలియదు.. తమకీ తెలియదు.. తెలిసీ తెలియని జ్ఞానంతో, వ్యక్తం చేయలేని భాషలో ఈ ఇంటికి వచ్చిన రోజు ఏదో చెప్పాడు.. ఏదో అర్థం చేసుకున్నారు. ఆ తరవాత ఏనాడూ వాడి పుట్టుక గురించి అడగలేదు.. అలా అడగడం ఆయన స్వభావం కాదు.. ఆయన చేయని ఏ పనీ తనూ చేయలేదు. వాడి ఎదుగుదల చూస్తుంటే పదహారేళ్ళు వచ్చి ఉంటాయని ఆయన ఊహ. వాడి కోర మీసం, పల్చటి గడ్డం, స్వరంలో వస్తున్న మార్పు ఇవన్నీ వాడి వయసు కచ్చితంగా కాకున్నా చూచాయగా చెప్పగలవు. వాడి వలన ఉపకారమే జరుగుతోంది... అపకారం ఏమి లేదు..బోలెడంత పని చేస్తాడు.. కానీ ఎంతకాలం వాడిని ఇలా పనివాడుగా వాడుకోగలదు! ఎప్పుడో ఒకరోజు ఆయనకీ బదిలీ అవచ్చు.

అప్పుడు వీడు ఎక్కడ ఉంటాడు.. అందుకే నెమ్మదిగా ఏదన్నా వృత్తి నేర్పించి అయినా వాడిని పంపించేయాలి.. నిట్టూర్చింది..

మహాకి  పెద్దగా పరీక్షలు రాసి సర్టిఫికెట్స్ సంపాదించే అంతగా కాకపోయినా, తెలుగు, కొద్దిగా ఇంగ్లిష్ మాట్లాడగల స్థాయికి ఎదిగాడు. శత్రుఘ్న దగ్గర దాదాపు రెండేళ్ళ పాటు అత్యంత శ్రద్ధగా నేర్చుకున్న విద్య వాడికి అన్నం పెట్టగలదా! జీవించడం అంటే తిండి ఒక్కటే కాదు.. వాడుతలదాచుకోడానికి నీడ కావాలి.. సంపాదించుకోగల శక్తి, తెలివితేటలు, లౌక్యం కావాలి.. వాడిలో ఇవన్నీ ఉన్నాయా! చంద్రకాంత్ ఆలోచిస్తూ ఉండగానే మరో ఆరునెలలు గడిచాయి. ఆయన వృత్తిపరమైన  ఒత్తిళ్ళలో మహాకి మరో టీచర్ ని వెతకాలన్న ఆలోచన తాత్కాలికంగా మరుగునపడింది.

అనుకోకుండా మన్యం ప్రాంతంలో నక్సలైట్ ల ఆగడాలు పెచ్చు మీరిపోవడంతో చంద్రకాంత్ అకస్మాత్తుగా బిజీ అయిపోయాడు. మహాకి మరో టీచర్ ని వెతికే సమయం ఆయనకీ లభించలేదు. మహా ఇంట్లోనే అమ్మగారికి అన్ని పనుల్లో సాయం చేస్తూ ఖాళీ సమయాల్లో చరణ్ ఇచ్చిన పుస్తకాలు చదువుకుంటూ నేర్చుకున్న కళ సానబెట్టుకుంటూ కాలం  గడిపేస్తున్నాడు.

చంద్రకాంత్ ఇంటి దగ్గర చాలా తక్కువ సమయం గడుపుతుండడం, ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్తూ ఉండడం లక్ష్మిదేవికి మనసులో భయంగానే ఉంది.. కరడు గట్టిన కసాయివాళ్ళు నక్సలైట్లు.. ఏ క్షణంలో ఆయన్ని ఏం చేస్తారో అని భయపడసాగింది. అయితే ఆవిడ అనుకున్నట్టు జరగలేదు.  ఏడాది లోపే వాళ్ళందరిని అదుపులోకి తీసుకున్నారు.. కొందరు లొంగిపోయారు.. కొందరు ప్రాణాలు తీసుకున్నారు.

చంద్రకాంత్ క్షేమంగా తిరిగివచ్చాడు.. ఆవిడ ఆ సర్వాంతర్యామికి కృతజ్ఞతలు సమర్పించుకుంది. భార్యా,భర్తలు తిరుపతి వెళ్లి మొక్కు తీర్చుకుని వచ్చారు.

ఈ లోగా చరణ్  బి.టెక్ పూర్తీ చేసి ఎం ఎస్ చేయడానికి అమెరికా వెళ్ళిపోయాడు. చంద్రకాంత్ కి ఎస్ పి గా ప్రమోషన్ ఇచ్చి గుంటూరు బదిలీ చేశారు.

ఇప్పుడు వచ్చింది అసలు సమస్య. ఆయనకి ఉన్న బాధ్యత మహా ..అనాధని చేరదీసి కేవలం పనివాడుగా ఇంట్లో పెట్టుకున్నాడని వాడుకుంటున్నాడు అన్న చెడ్డపేరు తనకి రాకూడదు.. అలా అని వాడి జీవితం ఎందుకూ పనికిరాకుండా సాగకూడదు.

ఆరోజు చంద్రకాంత్ కి ఒక ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి అతిధిగా రావాల్సిందిగా ఆహ్వానం వచ్చింది. ఆర్ట్ ఎగ్జిబిషన్ అనగానే ఆయన చాలా కుతూహలంగా వివరాలు అడిగాడు. ఆయన మెదడులో చిన్న ఆలోచన మెరిసింది. వాళ్ళతో మాట్లాడి వివరాలన్నీ సేకరించి మహా వేసిన మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ చిత్రాలు ప్రదర్శనకి పెట్టించాడు. ప్రారంభోత్సవానికి మహానీ ని కూడా తీసుకుని వెళ్ళాడు.

ప్రారంభోత్సవం పూర్తీ అయాక, మహాని అక్కడే ఉండమని సాయంత్రం వచ్చి ఇంటికి తీసుకువెళ్తాను అని చెప్పి ఆయన వెళ్ళిపోయాడు. అసలు అలాంటి ప్రదర్శన అనేది ఒకటి ఉంటుందని కూడా తెలియని మహాకి ఆ పెద్ద ఆర్ట్ సెంటర్ లో గొప్ప, గొప్ప వారు వేసిన చిత్రాల మధ్య తిరణాలలో తప్పిపోయిన పిల్లవాడిలా తిరగసాగాడు.తను వేసిన చిత్రాలు అక్కడ ఉండడం అద్భుతంగా అనిపిస్తున్నది.. అందరూ ఆ చిత్రాలు చూస్తూ ఏదో మాట్లాడుకోడం వింతగా, ఆసక్తిగా ఉంది. మాటల్లో వ్యక్తం చేయలేని అనుభూతికి లోనయాడు. వాళ్ళు ఏమనుకుంటున్నారో వినాలని కుతూహలం కూడా కలిగింది. కానీ ఇంగ్లీష్ లో మాట్లాడుకుంటున్న వాళ్ళ మాటలు అర్ధం కాలేదు. ఎవరూ అతనితో మాట్లాడలేదు... అతనూ ఎవరితో మాట్లాడలేదు. చంద్రకాంత్ వచ్చిందాకా అటూ, ఇటూ తిరుగుతూ, బొమ్మలు చూస్తూ గడిపాడు.

సాయంత్రం ఇంటికి తీసుకుని వెళ్తూ అడిగాడు ఆయన "ఎలా ఉంది? నీకేమనిపించింది?

"నాకు ఏమని చెప్పాలో తెలియడం లేదు అయ్యగారూ! నిజంగా ఆ రెండు చిత్రాలు నేనేనా వేసింది అని అనుమానంగా కూడా ఉంది" అప్రయత్నంగా మొదటిసారి స్పష్టంగా అన్నాడు.

" చూసిన వాళ్ళంతా ఏమన్నారు? నీతో ఎవరన్నా మాట్లాడారా!" అడిగాడు.

" లేదయ్యగారూ..వాళ్ళల్లో వాళ్ళే ఏదో అనుకున్నారు. నాకు అర్ధం కాలేదు "

"నువ్వే వెళ్లి వాళ్ళతో మాట్లాడాలి. ఆ చిత్రానికి నువ్వు వాడిన రంగులు, వాటి కలయిక, భావం, మొదలైన విషయాలు చెప్పాలి. ఎలా ఉంది అని అడగాలి. దీన్నే కలుపుగోలుతనం అంటారు. కలుపుగోలుతనం, లౌక్యం లేకపోతె బతకడం చాలా కష్టం ... సరే రేపు కూడా నిన్ను అక్కడ డ్రాప్ చేయమని డ్రైవర్ కి చెప్తాను. అక్కడ ఏం జరుగుతుందో అబ్జర్వ్ చేయి" అన్నాడాయన.

ఆయన చెప్పింది సగమే అర్ధం అయింది . అయినా అలాగే అన్నట్టు తలూపాడు

మర్నాడు అదే, చివరి రోజు కూడా మళ్ళీ పదకొండు గంటలకల్లా మహాని డ్రైవర్ ఆర్ట్ సెంటర్ లో డ్రాప్ చేసాడు. ఒక మూల నిలబడి ఆ ప్రదర్శనకి వచ్చి వెళ్తున్న వాళ్ళని పరిశీలిస్తూ ఉండిపోయాడు కానీ చంద్రకాంత్ చెప్పినట్టు

చేయలేదు. తనలో తను కుంచించుకుపోతూ రాకూడని చోటికి వచ్చినట్టు నిలబడిన మహా దగ్గరకు వచ్చాడు నిర్వాహకుల్లో ఒకతను.

"రా మహా! నీ చిత్రాలు కూడా ఉన్నాయి కదా ప్రదర్శనకి. ప్రేక్షకుల అభిప్రాయం తెలుసుకోవా" అంటూ చనువుగా చేయి పట్టుకుని తీసికెళ్ళి గాంధీ బొమ్మ చూస్తున్న ఒక విదేశీయుడికి " ఇతనే ఆ చిత్రకారుడు " అని పరిచయం చేసాడు.

ఆయన అభినందనగా చూస్తూ షేక్ హ్యాండ్ ఇస్తుంటే ఎలా స్పందించాలో తెలియలేదు మహాకి. అసంకల్పితంగా చేయి కలిపాడు. ఆయన ఇంగ్లీషులో నిర్వాహకుడితో ఏదో మాట్లాడుతూ మహా వైపు చూసి ఇంగ్లీష్ లోఏదో అడగడం చూసి అయోమయంగా నిర్వాహకుడి వైపు చూసాడు మహా

" ఈ చిత్రం ఆయనకీ కావాలిట ఇస్తావా అని అడుగుతున్నారు. దాని వెల చెబితే డబ్బులు ఇస్తారుట" అన్నాడు.

మహా బిత్తరపోయి చూసాడు. ఇలా కూడా జరుగుతుందా! తను వేసిన బొమ్మ ఒక విదేశీయుడికి నచ్చడం, ఆయన అది కొంటానని అనడం నమ్మలేనివాడిలా చూస్తూ గొణిగినట్టు అన్నాడు "నాకు తెలియదు".

వెంటనే నిర్వాహకుడు చంద్రకాంత్ కి ఫోన్ చేసాడు." సార్! మహాత్మాగాంధీ చిత్రం సేల్ కి వచ్చింది" అంటూ వివరాలు చెప్పి " మీరు ఏమంటారు.. ఆయన గాంధీ గారి భక్తుడుట.. ముప్పై వేలు ఇండియన్ కరెన్సీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు" అన్నాడు.

అవతల ఆయన ఏమన్నాడో నవ్వుతూ " తెలియదు అన్నాడు" అని చెప్పాడు.

తరవాత రెండు నిమిషాలు ఏదో మాట్లాడి ఫోన్ డిస్కనెక్ట్ చేసి, విదేశీయుడితో మాట్లాడాడు. ఆయన వెంటనే బ్యాగ్లోంచి చెక్ బుక్ తీసి అమౌంట్ రాసి, సంతకం చేసి నిర్వాహకుడికి ఇచ్చి, గాంధీ గారి చిత్రం తీసుకుని వెళ్ళిపోయాడు.. వెళ్ళిపోతూ మహాకి మరోసారి షేక్ హ్యాండ్ ఇచ్చి " యూ ఆర్ ఏ గ్రేట్ ఆర్టిస్ట్ " అంటూ వెళ్ళిపోయాడు.

నిశ్చేష్టుడిలా నిలబడిపోయిన మహా చేతికి చెక్ ఇస్తూ " దీని మీద ఎవరి పేరు రాస్తారో డి ఎస్ పి గారికివ్వు ... మిగతాది ఆయన చూసుకుంటారు ... నిజంగా నువ్వు చాలా లక్కీ" అన్నాడు అభినందిస్తూ.

ముప్పైవేలు... మతిపోయిన వాడిలా నిలబడిపోయాడు మహా . ఆ చెక్ అందుకున్న చేయి వణికిపోతోంది. తన జీవితంలో ఏదో అద్భుతం జరిగినట్టు, తను ఎత్తుకి, చాలా ఎత్తుకి పెరిగిపోతూ రెండు చేతులూ చాచి మబ్బులను

అందుకున్నట్టు, ఆ  మబ్బు తునకలతో ఎవరో తనకి వింజామరలు వీస్తున్నట్టు ఇంకా ఎన్నో చిత్రమైన అనుభూతులు హృదయం నిండా నిండిపోయి గర్వంగా ఫీల్ అయాడు.

ఇంటికి వెళ్ళగానే ఆ చెక్ తీసుకుని వెళ్లి లక్ష్మీదేవి చేతికి ఇచ్చి ఆమె పాదాలకు నమస్కారం చేసాడు.

ఆవిడ విస్తుబోతూ చూసింది " ఏంటిరా ఇది? ఎవరిచ్చారు" అంది.

అప్పుడే అక్కడ అడుగుబెట్టిన డి.ఎస్.పి చంద్రకాంత్ గంభీరంగా అన్నాడు " ముప్పై వేలు సంపాదించాడు వాడు తన ప్రతిభతో "

" అవునా! ఎంత మంచిమాట! నీకు మంచి భవిష్యత్తు ఉందిరా .. దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు " అంది.

"ఇప్పుడు నాకు నిశ్చింతగా ఉందిరా ! నువ్వు ఇంక స్వతంత్రంగా ఎవరి మీదా ఆధారపడకుండా బతకగలవు" అన్నాడు చంద్రకాంత్ భుజం తట్టి.

మహాలక్ష్మి కూడా చాలా సంతోషించి "వాడి పేరున బ్యాంకు లో వేసేయండి. వాడి మొదటి సంపాదన" అంది.

"నా మొదటి సంపాదన అయిదు వందలు.. వీడు చూడు ముప్పైవేలు సంపాదించాడు.. నాకన్నా చాలా గొప్పవాడు" అన్నాడాయన నవ్వుతూ.

మరునాడు  మహా  పేరు మీద  బ్యాంకు ఎకౌంటు ఓపెన్ చేసి ఆ చెక్ అందులో డిపాజిట్ చేసాడు.

## 14

మహా జీవితం మళ్ళీ మొదటికి వచ్చింది. కాకపోతే ఇదివరకటిలా సమాధానంలేని ప్రశ్నగా నిలబడకుండా వాడికంటూ ఒక వ్యాపకం ఏర్పడింది. శత్రుఘ్న నేర్పినవే మరింతగా మెరుగులు దిద్దుతూ కాలక్షేపం చేస్తున్నాడు. వాడి వలన తనకి ఎలాంటి నష్టం లేకపోయినా, మహాలక్ష్మి కి మాత్రం  వాడిని చూస్తుంటే  చిరాగ్గా ఉంది. మగపిల్లాడు అలా పొద్దస్తమానం ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడం ఏమాత్రం నచ్చలేదు ఆవిడకి.  వీడిలా ఇల్లు కదలకుండా కూర్చుంటే ఎందుకూ పనికిరాకుండా పోతాడు అనుకుంది.

ఆ రాత్రి భర్తకి కొంచెం గట్టిగానే చెప్పింది తన మనసులో మాట "ఆడది తిరిగి చెడింది.. మగాడు తిరక్క చెడ్డాడు" అని సామెత వాడిని ఎక్కడన్నా ఉద్యోగంలో అయినా చేర్పించండి" .

ఆయన చిరునవ్వుతో అన్నాడు.. "ఈ రోజుల్లో నువ్విలాంటి సామెతలు చెప్పకూడదు లక్ష్మి..కాలం మారిపోయింది.. ఆడవాళ్ళు నీనోట ఈ మాట వింటే నీ మీదకు దండయాత్రకు వస్తారు " అన్నాడు.

ఆవిడ కూడా నవ్వి అంది.."సామెత చెప్పాను.. నేను మాత్రం ఆడవాళ్ళని నాలాగా నాలుగు గోడల మధ్య బతకమని ఎందుకు చెప్తాను " అంది.

"అంటే నిన్ను నేను నాలుగు గోడల మధ్యా బంధించానంటావు "

ఆవిడ పక్కకి వత్తిగిలి ఆయన పొట్టమీద చేయి వేసి ఆయన మొహం లోకి చూస్తూ అంది.." అవును బంధించారు కానీ అధికారంతో కాదు.. అనురాగంతో.. మీలాటి అనురాగమూర్తి దొరికితే ఏ స్త్రీ కూడా ఇల్లు కదలడానికి ఇష్టపడదండి.."

"లేదు లక్ష్మి  ఈ సమాజ ప్రగతికి స్త్రీ పార్టిసిపేషన్ లేకపోతే దేశం ఇంత త్వరగా ఇంత బాగా అభివృద్ధి చెందేది కాదు.. ఇందిరా గాంధీ దేశాన్ని పధ్నాలుగేళ్ళు పరిపాలించింది కాబట్టే దేశం ఇతర దేశాల ముందు సగర్వంగా నిలబడింది.. స్త్రీ,పురుషులు ఇద్దరూ రెండు చక్రాల్లాంటి వారు..ఈ సత్యం తెలుసుకోని వారు ఆధిపత్య భావజాలంలో కొట్టుకుపోతున్నారు.. వారు స్త్రీ అయినా కావచ్చు, పురుషుడు అయినా కావచ్చు.. ఎవరూ ఒకరికన్నా అధికులు కారు.. సరే.. కబుర్లేనా సరసాలేమన్నా ఉన్నాయా"

ఆయన మాటల్లో చమత్కారం, నవ్వులో మమకారం చూసి ఆవిడ నవ్వి ఆయనకీ మరింత దగ్గరగా జరిగి " నా మాట మరిచిపోకండి.. వాడికేదన్నా ఒక మార్గం చూడండి " అంది.

"అది రేపటి సంగతి... ఇది ఇప్పటి సంగతి.."  సున్నితంగా ఆవిడ పెదవులు అందుకున్నాడు..మృదువుగా గుచ్చుకున్న ఆయన మీసాలు కుడిచేతి వ్రేళ్ళతో సవరిస్తూ ఆయన్ని హత్తుకుపోయింది.

ఇది జరిగి నెలరోజులు గడిచాక ఆయనకీ ఒకరోజు హటాత్తుగా గుర్తొచ్చింది.. ఎందుకంటే ఆ నెలరోజులూ ఆయన రెండుసార్లు విజయవాడ, ఒకసారి హైదరాబాద్ వెళ్లి వచ్చాడు వృత్తిపరమైన పని మీద.

ఆరోజు ఆదివారం.. బాగా అలసి ఉన్నందువల్ల బ్రేక్ ఫాస్ట్ చేసాక కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు. ఎన్నడూ లేనిది ఆయన అలా వేళకాని వేళలో పడుకోడంతో లక్ష్మికి ఎందుకో అనుమానం కలిగింది. కాసేపు అలసిపోయినట్టున్నారు పడుకోనీ అనుకుంది కానీ, లంచ్ time దాటినా లేవకపోవడంతో తనే వెళ్లి మృదువుగా తట్టి లేపింది.. " ఏమైంది? ఆరోగ్యం బాగానే ఉందా!" అడిగింది.

ఆయన కళ్ళు తెరిచి " టైమెంత" అన్నాడు..

"పన్నెండున్నర దాటింది.. చెప్పండి ఆరోగ్యం బాగానే ఉందా !" అడిగింది.

ఆయన లేచి తలగడ నిలువుగా వేసుకుని దానికి ఆనుకుని కూర్చుంటూ" భేషుగ్గా ఉంది.. కొంచెం అలసిపోయాను అంతే" అన్నాడు ఆవలిస్తూ.

"మరి రాత్రి, పగలు నేరస్తుల వెనకాల తిరిగితే అలసిపోరూ" చిరుకోపంగా అంది ఆవిడ.

"అయితే వదిలేద్దామా వాళ్ళని " నవ్వుతూ అన్నాడు.

"చాల్లెండి.. లేచి మొహం కడుక్కుని రండి బైటికి.. ఈలోగా భోజనానికి సిద్ధం చేస్తాను " అంది మంచం మీద నుంచి లేవబోతూ,,

ఆవిడ చేయి పట్టుకుని గుండెల మీదకి లాక్కుంటూ "నాకు ఆ భోజనం వద్దు.." అన్నాడు కొంటెగా.

"ఊరుకోండి.. అవతల వాడున్నాడు.. అయినా పట్టపగలు సరసాలేంటి " అంది ముద్దుగా మందలిస్తూ

వాడిపేరు చెప్పగానే ఆయన నిటారుగా అయాడు. "ఏం చేస్తున్నాడు వాడు " అడిగాడు.

" ఏం చేస్తాడు.. సాయంత్రాలు మొక్కలకి నీళ్ళు పెడతాడు.. ఉదయం అలా తోటలో తిరుగుతూ కలుపు తీసేస్తాడు.. ఆ తరవాత గదిలోకెళ్ళి ఏవో గీకుతాడు.. "

ఆయన గబుక్కున మంచం దిగాడు.

ఆవిడ డైనింగ్ హాల్లోకి వెళ్ళిపోయింది.

భోజనాలు అయిపోయిన తరవాత చంద్రకాంత్ మహా గదిలోకి వెళ్ళాడు. గదంతా నేలజారిన రంగుల డబ్బాలా ఉంది. ఎక్కడ చూసినా వాడు బొమ్మలు గీసిన ఆర్ట్ paper లు, పెయింట్స్.. బ్రష్ లు, అస్వ్యస్తంగా ఉన్న ఆ గది చూసి " ఏంటిరా ఇది నీటుగా ఉంచుకోలేవూ " అన్నాడు.

మహాకి ఆయన తన గదిలోకి రావడమే ఒక షాక్.. తన గది పరికించి అలా మందలించడం మరో షాక్ .. ఊహించని రెండు షాక్ లకి సమాధానం చెప్పలేక బిత్తరపోతూ చూసాడు.

వారి మొహంలో భావాలు గమనించిన ఆయన స్వరం మెత్తగా మారింది.. "కొత్తగా ఏం వేసావు?" అడిగాడు.

కొన్ని క్షణాలు సందేహంగా ఆయన మొహంలోకి చూస్తూ ఉండిపోయాడు. " చెప్పరా.. అసలేమన్నా వేస్తున్నావా! ఉన్నవి దిద్దుతూ కూర్చున్నావా!" ఆయన మరోసారి హెచ్చరించడంతో గబుక్కున స్టాండ్ కి ఉన్న కాన్వాస్ మీది గుడ్డ తొలగించాడు. ఒక్క క్షణం ఆయన మెదడు మొద్దుబారినట్టు అయింది.

జరీ అంచు ఎర్రని పట్టు చీర, మొహాన నయాపైసంత కుంకుమ బొట్టు, కళ్ళనిండా కాటుక, రెండు వైపుల నుంచీ మెడమీదకి వాలి, ఆమె మెడలోని హారాలతో కబుర్లు చెబుతున్న కనకాంబరాల మాల, మెడ నిండా నగలు..మహాలక్ష్మి లాంటి మహాలక్ష్మి చిత్తరువు.. సజీవంగా చిరునవ్వుతో.. అచ్చు అదే నవ్వు..ఏ మాత్రం తేడాలేదు.. ఎవరిచ్చారు వీడికి ఇంత కళ! ఎవరు నేర్పారు వీడికి ఈ గీతలు ? పేవ్ మెంట్ మీద బొగ్గుతో చేతికి వచ్చిన గీతలు గీస్తూ దారినపోయే వాళ్ళు విసిరిన చిల్లర నాణాలతో బతికిన దిక్కులేని కుర్రవాడేనా వీడు? వీడి చేతిలో ఏదన్న మంత్ర దండం ఉందా! ఇంత అపురూపమైన కళకి వీడే లా వారసుడయాడు? ఆయన అప్రయత్నంగా వాడిని దగ్గరకు తీసుకుని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు.

మహా కోరుకున్న స్పర్శ రెండోసారి.. ఆ స్పర్శలో వాత్సల్యం, ఆ స్పర్శలో ప్రేమ, ఆ స్పర్శలో ధైర్యం..

ఆయన ఆర్ద్రంగా అన్నాడు.. " నీకెందుకు వచ్చిందిరా ఈ ఆలోచన? అమ్మగారి బొమ్మ వేయాలని ఎందుకు అనిపించింది?

మహా కళ్ళు వాల్చుకున్నాడు. వాడి కనురెప్పలు అనే వంతెన దాటి కన్నీటి బొట్లు కిందరాలసాగాయి.

"మహా" ఆయన స్వరంలో కించిత్తు ఆందోళన.. ఎందుకు నాన్నా కన్నీళ్లు ? అడిగాడు.

పదేళ్ళ క్రితం ఉవ్వెత్తున ఎగసిపడి తన తల్లి,తండ్రులను లాక్కెళ్ళిన కెరటాలు మహా లోని మాగాడిని అమాంతం ఎత్తి పడేసినట్టు, మరో వ్యక్తీ కెరటాలను చీల్చుకుంటూ నడిచివచ్చినట్టు మాగాడు మహాగా మారాడు.. ఈ మహా చంద్రకాంత్ చెక్కిన శిల్పం.. ఆ శిల్పానికి అమ్మ ప్రేమ అనే అమృతంతో జీవం పోసింది మహాలక్ష్మి.. చిన్న, చిన్న పదాలతో తన మనసులో ఎగసిపడుతున్న భావాలను నెమ్మదిగా వ్యక్తం చేసాడు.

ఆయన అవాక్కై నిలబడి పోయాడు.. అమాయకంగా, మాటలే రానట్టు ఉండే ఈ కుర్రాడిలో ఇన్ని భావాలున్నాయా! స్పందించే మనసుంటే రాయి కూడా పలుకుతుంది కాబోలు.. అయిపోయింది.. మాగాడు మహా గా మారిపోయాడు. వీడు భవిష్యత్తులో మహానుభావుడు అవుతాడు. ఇప్పుడు తన కాళ్ళ మీద తను నిలబడడానికి అతడిని ఆయత్తం చేయాలి. ఇంక తన బాధ్యత అయిపోయింది. ఆ రోజు ఈ అనాధ కుర్రాడిని తీసుకుని వెళ్లి వాడిని మనిషిగా

మార్చి ఈ సమాజంలో నిలబెట్టు అని ఆ శ్రీరామ చంద్రుడే చెప్పినట్టు అనిపించింది తనకి. అందుకే ఏమి ఆలోచించకుండా తీసుకువచ్చాడు. తీసుకొచ్చినందుకు రాయిని రత్నంగా మార్చాడు. ఇప్పుడు ఈ రత్నం తన దగ్గర ఉంటే షో కేసులో ప్రదర్శనకి పెట్టినట్టు అవుతుంది. అతనికి బతకగల ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చి అతని కాళ్ళ మీద అతను నిలబడడానికి మోటివేట్ చేయడం ఇంకో బాధ్యత.. అలా అనుకున్నాక ఆయనకి అది చాలా బరువుగా అనిపించింది.

ఇంక వాడిని ఈ సమాజంలోకి వదిలేయాలి.. ఒక మిస్సైల్ తయారు చేసి, పరీక్షించడానికి అంతరిక్షానికి పంపినట్టు... ఒక రోబో తయారు చేసి, దాని పనితీరుని పరీక్షించినట్టు, ఈ చిత్రకారుడిని వదిలేస్తే ఎలా బతుకుతాడో! లోకం పోకడ తెలుసుకున్నాడు, నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకున్నాడు. అద్భుతమైన కళ చేతిలో ఉంది. ఇంక తనంతట తాను బతకాలి. .. బతుకుతాడు ధృడంగా అనుకున్నాడు.

అక్కడి నుంచి వేగంగా కదిలి లోపలికి వెళ్ళిపోయాడు చంద్రకాంత్. ఆయన వెళ్ళిన వైపు తడిసిన కనురెప్పలు విప్పి చూస్తూ నిలబడిపోయాడు మహా.

ఆ రాత్రి భోజనాలు పూర్తీ అయినతరవాత తన గదిలోకి వెళ్ళిపోతున్న మహాని ఆగమని చెప్పి లాన్ లోకి నడిచాడు చంద్రకాంత్.. మహాలక్ష్మి ఆయనని అనుసరించింది. వాళ్ళిద్దరి వైఖరి విచిత్రంగా, కొత్తగా అనిపించినా దాని అర్థం తెలియని మహా వారితో పాటు లాన్ లోకి నడిచాడు.

నవమి చంద్రుడు బలహీనంగా నవ్వుతున్నాడు. గాలిని చెట్లమధ్య బంధించినట్టు చెట్లు గంభీరంగా నిలిచి ఉన్నాయి.

కూర్చో అన్నాడు చంద్రకాంత్ రెండు చేతులు కట్టుకుని నిలబడిన మహావైపు చూస్తూ.

తటపటాయిస్తూ కేన్ కుర్చీ కొంచెం వెనక్కి జరుపుకుని అంచుల మీద కూర్చున్నాడు.

నువ్వు వేసిన చిత్రం అమ్మకి ఎప్పుడు ఇస్తున్నావు కానుకగా " అడిగాడు చంద్రకాంత్..

మహా చిరునవ్వుతో తననే చూస్తున్న మహాలక్ష్మి వైపు చూసి సిగ్గుగా తలవంచుకున్నాడు.

"నువ్వేమన్నా తప్పు చేసావా! ఎందుకలా తల వంచుకున్నావు?" అడిగాడు ఆయన.

మహా మాట్లాడలేదు. ఆయన నెమ్మదిగా మొదలుపెట్టాడు. .

“మహా ! నువ్వు పెద్దవాడివి అయావు. ఇదివరకటి అయోమయం, అమాయకత్వం అన్నీ పోయి వివేకం, విచక్షణ నీలో కలిగాయి. నీకేం కావాలో, నువ్వేం చేయాలో నీకు తెలుసనీ నేను అనుకుంటున్నాను. నీ చేతిలో ఉన్న విద్యతో నువ్వు ఇప్పుడు ఎవరి మీదా ఆధారపడకుండా నీ అంతట నీవుగా బతకగలవని నా నమ్మకం. వీలైతే నీకు శ్రద్ధ ఉంటే డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా కనీసం డిగ్రీ తీసుకునే ప్రయత్నం చేయి. నువ్వు ఎంత గొప్ప కళాకారుడివి అయినా విద్యకి ఉన్న గౌరవం వేరు. భవిష్యత్తులో నలుగురిలో తిరగాలన్నా, నలుగురితో మెలగాలన్నా నీకు కమ్యూనికేషన్ చాలా ఇంపార్టెంట్. ప్రస్తుతం సమాజంలో నువ్వు ఏం మాట్లాడుతున్నావు అనే విషయం మీద కన్నా ఎలా మాట్లాడుతున్నావు అనే విషయానికి ప్రాధాన్యత ఇస్తారు. నీ మాటల్లో సంస్కారం ఎంత ముఖ్యమో, స్పష్టత కూడా అంతే ముఖ్యం ... నెమ్మదిగా నీకే తెలుస్తాయి ఈ విషయాలు. చేపని నీళ్ళల్లో వదిలేస్తే అదే ఈదుకుంటూ వెళ్ళిపోతుంది. నువ్వు కూడా అంతే .. కొత్తల్లో భయంగా, బెదురుగా ఉంటుంది. కానీ నెమ్మదిగా బతకడం మొదలు పెడితే గొప్పగా బతికేస్తావు. అందుకే నిన్ను ఇంక ఈ విశాల ప్రపంచంలోకి పంపేయాలని నిశ్చయించుకున్నాను. “

ముగ్ధుడై వింటున్న మహా ఆఖరి మాటలు విని గబుక్కున తలెత్తి చూసాడు. ఆ చూపులో కనిపించిన భయం, బెదురు గమనించిన మహాలక్ష్మి“ భయపెట్టకండి “ అంది.

“భయం దేనికి? నువ్విప్పుడు పెద్దవాడివి అయావు .. చరణ్ వెళ్లలేదూ! దేశం కాని దేశం వెళ్ళాడు.. నువ్వు ఈ దేశం లోనే ఉంటావు.. మేము కూడా ఇక్కడ కాకపోతే మరోచోట ఇదే దేశంలో ఉంటాము. ఏం కావాలన్నా, ఎప్పుడు కావాలన్నా వచ్చేయచ్చు “

లక్ష్మి కూడా మృదువుగా అంది. “ ఆ దేవుడు నిన్ను మా కుటుంబంతో ఎందుకు కలిపాడో తెలియదు.. కలిపినందుకు సార్ నిన్ను ఒక మనిషిగా తీర్చిదిద్దారు. నువ్వు నీ దారిన బతకగల శక్తిని కలిగించారు అని నేను అనుకుంటున్నాను. నీకిప్పుడు కావాల్సింది నేను బతకగలను అనే ఆత్మవిశ్వాసం. ఎక్కడ, ఎలా ఉన్నా, నేను దర్జాగా సుఖంగా బతకగలను అనే ధైర్యం, నీ మీద నీకు నమ్మకం అవునా!”

వాళ్ళ మాటలు గోదావరి నది మీద నుంచి ఎ మహర్షో వినిపిస్తున్న వేదంలా వినిపించసాగింది.. ఆ మాటల్లో మహత్తు వాడి మీద గొప్ప ప్రభావం చూపించసాగింది.. నేను ఒంటరిగా బ్రతకగలనా ! అని అనుకుంటే ఛాతీ గర్వంతో పొంగిపోసాగింది. అవును బతకాలి.. తనని మనిషిగా మార్చిన ఈ దేవతలకి ఇంకా భారం కాకూడదు.. తలెత్తాడు.. వాడి కళ్ళల్లో అంతులేని ఆత్మ విశ్వాసం..

ఇద్దరికీ చేతులు జోడించి నమస్కరిస్తూ అన్నాడు. "మీరిద్దరూ నాకు జీవితం అంటే ఏంటో చెప్పారమ్మా.. ఆరోజు చీకటి తప్ప వెలుగుకి అర్థం కూడా తెలియని నన్ను పేవ్ మెంట్ మీద బొగ్గుతో బొమ్మలేసుకుని, చిల్లర నాణాలు పోగుచేసుకుంటూ బతికిన నన్ను ఏ మాత్రం అసహ్యించుకోకుండా తీసుకొచ్చి నాకో పేరు ఇచ్చారు, ఒక నీడ ఇచ్చారు.. అమ్మా, నాన్న, అన్నయ్య అనే బంధువులను ఇచ్చారు.. మనిషిగా నాకో గుర్తింపు ఇచ్చారు. మీరెలా చెబితే అలా చేస్తాను. "

చంద్రకాంత్ కుర్చీ లోంచి లేచి వాడి దగ్గరగా నడిచాడు. మహా కూడా లేచి నిలబడ్డాడు. ఆయన వాడి భుజం తట్టి "శభాష్ ఇది స్పిరిట్ అంటే " అన్నాడు.

"బతుకుతాను సార్ .. తప్పకుండా బతుకుతాను.. మీరు గర్వంతో తలెత్తుకునేలా బతుకుతాను " అన్నాడు.

ఆప్యాయంగా నవ్వుతూ అన్నాడు ఆయన. "ఇప్పుడేంటిరా... అప్పుడే బతికావు ... ఎలా బతికాము అనేది కాదు, ఎన్ని గడ్డు సమస్యలు ఎదురైనా బతికామా లేదా అనేది ముఖ్యం. తరవాత ఎలా బతకాలి, ఎందుకు బతకాలి అనేవి ఆలోచించవచ్చు. నువ్వు బతకగలవు.. దేవుడు రెక్కలు ఇచ్చింది ఎగరడానికే... ఎగురు... ఎంత ఎత్తుకి ఎగరగలవో ఎగురు... ఆ ఎత్తు నుంచి మాకు చేయి ఊపు... మా దీవెనలు నీకు ఎప్పుడూ ఉంటాయి."

మహా అప్రయత్నంగా ఆయన పాదాల మీద పడిపోయి బావురుమన్నాడు.

" అయ్యయ్యో ... లే , లే ఏంటి నాన్నా ... ఎందుకంత ఎమోషనల్ అవుతున్నావు.." అతని భుజాలు పట్టుకుని లేవదీసి, కళ్ళు తుడుస్తూ అన్నాడాయన "బి బ్రేవ్ ... బి స్ట్రాంగ్ ..."

లక్ష్మి కూడా అంది.. "నీ పేరున బాంక్ ఎకౌంటు లో కొంత డబ్బు ఉంది. కొంతకాలం నీకది సరిపోతుంది. నిజాయితీగా, క్రమశిక్షణగా ఉంటూ మా పేరు నిలబెట్టాలి."

మహా ఆవిడ పాదాలకు కూడా నమస్కరించాడు.

చంద్రకాంత్ అన్నాడు. " హైదరాబాద్ లో నా స్నేహితుడు ఉన్నాడు. వాడు నీకేదన్నా హెల్ప్ చేస్తాడు. నిన్ను హైదరాబాదు పంపే ఏర్పాటు చేస్తాను. నీకేదన్నా కావాలంటే నాకు ఫోన్ చేయి. ఫోన్ నెంబర్ ఒక డైరీలో రాసుకో. డైరీ మైంటైన్ చేయి.. నీ మనసులో భావాలు , ఏ రోజు ఏమి చేయాలనుకున్నావు, ఏమి చేసావు వగైరా డైరీలో రాసుకుంటే నీకది ఒక గుర్తుగా ఉంటుంది. మన ఇంటి అడ్రస్, ఫోన్ నెంబర్ రాసుకో..రేపు నీకో డైరీ ఇస్తాను "

"అలాగే " కళ్ళు తుడుచుకుంటూ నవ్వాడు మహా..

"గుడ్ బాయ్.." ఆయన మరోసారి వాడి భుజం తట్టి మహాలక్ష్మి వైపు చూసి, లోపలికి వెళ్దాం పద అన్నట్టు తల పంకించాడు. పక్క,పక్కనే కదిలి వెళ్తున్న వాళ్ళిద్దరి రూపాలు వాడి మనసులో ప్రింట్ లా పడిపోయాయి.

మర్నాడు చంద్రకాంత్ ఒక డైరీ మహాకి ఇచ్చి, " ఇందులో అడ్రస్, ఫోన్ నెంబర్ ఉన్నాయి.. రేపు ప్రయాణానికి సిద్ధం అవు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ డైరీ వైపు చూస్తూ అలాగే నిస్తేజంగా నిలబడిపోయాడు మహా.. ఒక్కో పేజీలో తన నూరేళ్ళ జీవిత కథ రాయాలా! అసలు తను నూరేళ్ళు జీవిస్తాడా! ఇక్కడి నుంచి వెళ్ళిన మరుక్షణం జీవితం భయపెట్టి, తనని తరిమికొడితే ఎక్కడికి వెళ్ళాలి.. తనకి తెలిసింది సముద్రమే.. అదేనా తన చివరి మజిలీ.. రేపటినుంచీ నా జీవితం ఏంటి? నేనేంటి? ఎలా గడుస్తుంది జీవితం!

ఒక్కసారి అతని కళ్ళ ముందు గడచిన జీవితం గిర్రున తిరిగింది.. సముద్ర కెరటాలు, ఆ కెరటాల మీద తండ్రి పక్కన కూర్చుని నావలో ప్రయాణం, నేర్పుగా వల వేయడం నేర్పిస్తున్న తండ్రి, సముద్ర తీరంలో ఇసకలో గీసిన బొమ్మలు.. అలజడి సృష్టించి తన జీవితాన్ని తారుమారు చేసిన తుపాను.. అప్పటి నుంచీ తనకి గుప్పెడు అన్నం పెట్టిన అనేక మంది స్త్రీల చేతులు...ఆదుకుని ఆశ్రయం ఇచ్చి తనకి రెండుకాళ్ళు, రెండు చేతులు, మెదడు ఇచ్చిన చంద్రకాంత్.

మహాతేజ స్వరం రుద్ధమైంది. హటాత్తుగా మాట్లాడడం ఆపేశాడు.. లైట్స్ ఆఫ్ అయినాయి. కెమెరాలు కూడా ఆఫ్ అయినాయి. మేఘన ఆయన వైపు సంకోచంగా చూస్తూ పిలిచింది "సర్ ".

మహాతేజ కళ్ళు తుడుచుకున్నాడు. మంచినీళ్ళు ఇవ్వమన్నట్టు సైగ చేసాడు. వెంటనే గాజు గ్లాసులో నీళ్ళు తెచ్చి ఇచ్చాడు అసిస్టంట్. గట గట తాగి గ్లాసు తిరిగి ఇచ్చాడు.

"సర్.. విశ్రాంతి తీసుకుంటారా! మళ్ళీ రేపు పెట్టుకుందాం షూటింగ్.." మేఘన అంది.

తేజ తలాడిస్తూ.. "ఎస్.. ఐ నీడ్ రెస్ట్ " అన్నాడు.

వెంటనే అక్కడ ఉన్న క్రూ అంతా అలర్ట్ అయారు. కెమెరాలు జరిపేసారు. మేఘన లేచి వెళ్లి ఎవరికో ఏదో చెప్పి వచ్చింది.

"రండి సర్ " అంది. తేజ లేచాడు. ఒళ్లు తూలిపోతున్నట్టు అయింది. గబుక్కున కుర్చీ పట్టుకున్నాడు.

"ఆర్ యు ఆల్ రైట్ " కంగారుగా అడిగింది మేఘన..

ఒక కుర్రాడు గబుక్కున వచ్చి చేయి అందించాడు.. "ఒద్దు అన్నట్టు చేత్తో సైగ చేసి, అయాం గుడ్ " అన్నాడు తేజ..

మేఘన ఆయనని కారు దాకా దిగబెట్టి ఆయన కారులో కూర్చున్నాక "గుడ్ నైట్ సర్.. రేపు ఉదయం కాల్ చేస్తాను " అంది.

తలూపాడు. కారు కదిలింది.

15

**రాత్రంతా** ఆలోచనలతో నిద్రపట్టక అటూ, ఇటూ అసహనంగా దొర్లుతూ తెల,తెల వారేముందు నిద్రలోకి జారిన తేజకి మెలకువ వచ్చేసరికి "సూర్య" కిరణాలు ప్రేమగా స్పృశిస్తున్నాయి.

నిద్రపోయిన నాలుగు గంటల సమయం.. సూర్య తలపులే.. ఇల్లంతా తిరుగుతూ "తేజా! మహాతేజా!" తెరువు–కళ్ళు తెరువు. అప్పుడే కళ్ళు మూయకు.. రెప్పవాల్చే సమయంలోనే సమీకరణాలు మారిపోతున్న ప్రపంచంలో ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండకపోతే, నువ్వు నిర్మించుకున్న ఈ కోట కూలిపోయే ప్రమాదం ఉంది.. నువ్వింకా సాధించాలి.. లే.. లే" తనని రెండుభుజాలు పట్టుకుని బలవంతంగా లేపుతున్న ఆ చేతుల స్పర్శ... ఆ స్వరం.. హృదయాన్ని మీటుతొంది.

"లేస్తాను సూర్యా! లేస్తాను.. నువ్విచ్చిన బలంతో చాలా దూరం నడిచాను..నా గమ్యం చేరడానికి ఇంకా బోలెడు దారి మిగిలిఉంది సూర్యా.. లేస్తాను..నీ మీద ఒట్టు.." చాచిన చేతికి మంచం పక్కన ఉన్న కాబినెట్ తగిలింది.

కళ్ళు బలవంతంగా తెరిచాడు. ఒళ్ళంతా రెండు మిషన్ ల మధ్య తొక్కివేస్తున్నట్టు ఉంది. తలంతా బరువుగా ఉంది.. పక్కకి ఒత్తిగిలి తిరిగి కళ్ళు మూసుకున్నాడు. మొబైల్ మోగింది. ఆన్సర్ చేయాలి అనిపించలేదు. కళ్ళు తెరిచి ఆ రింగ్ ఎక్కడ నుంచో కూడా చూడాలనిపించలేదు. ఒకసారి ఆగి తిరిగి మోగింది. అలా మూడు, నాలుగు సార్లు ఆగుతూ, మోగుతూ ఉంటే , విసుగ్గా తలగడ కింద పెట్టుకున్న మొబైల్ తీసి చూసాడు. మేఘన కాలింగ్ అని కనిపించింది. ఇంత పొద్దున్నే షూటింగ్ కా! బద్ధకంగా ఆన్సర్ బటన్ నొక్కి , బరువుగా ఉన్న స్వరంతో "చెప్పమ్మా!" అన్నాడు.

"సర్.. ఆర్ యు ఆల్ రైట్.. మీరు ఫోన్ లిఫ్ట్ చేయకపోతే కంగారు పడ్డాను.." మేఘన స్వరంలో కంగారు స్పష్టంగా తెలుస్తోంది.

"ఎందుకమ్మా కంగారు.. ఇప్పుడేగా తెల్లవారింది " తనకోసం ఎంతో అభిమానంతో అన్నిసార్లు ఫోన్ చేసిన ఆమె అభిమానానికి కరిగిపోతూ అన్నాడు.

"సర్.. టైం పదకొండు దాటింది "

"వాట్?" అతని చేతిలో మొబైల్ జారిపడబోయింది. గట్టిగా పట్టుకుని గబుక్కున లేచి కూర్చుని వాల్ క్లాక్ చూసాడు.

నిజమే 11. దాటి పన్నెండు నిమిషాలు..

" ఓ మై గాడ్... కాల్ యు బాక్ " అని ఫోన్ ఆఫ్ చేసి, కాలిమీద జారుతున్న బ్లాంకెట్ విసిరేసి మంచం దిగాడు.

పనిమనిషి వచ్చి ఎన్నిసార్లు కాలింగ్ బెల్ కొట్టి, కొట్టి వెళ్ళిపోయిందో.. పాల పాకెట్ బయట ఉండి ఉంటుంది బ్యాగ్ లో..

చక,చకా బ్రష్ చేసుకుని టవల్ తో మొహం తుడుచుకుంటూ డోర్ తెరిచాడు. డోర్ పక్కన షూ రాక్ మీద కూర్చుని ఉంది ఓ అమ్మాయి.. ఆ అమ్మాయిని చూస్తూనే ఉలిక్కిపడ్డాడు..

"నువ్వా.. నువ్వు.. ఎంత సేపైంది వచ్చి."

ఆమె మాట్లాడలేదు.. తల వంచుకుని నిలబడింది.

ఆమె వాలకం చూస్తుంటే నార్మల్ గా అనిపించలేదు.. రెండో రెక్క కూడా తెరిచి" లోపలికి రా" అన్నాడు.

ఆహ్లాద బాగ్ భుజానికి తగిలించుకుని లోపలికి వచ్చింది.

గోడకి తగిలించి ఉన్న బ్యాగ్ లో నుంచి పాల పాకెట్ తీసుకుని డోర్ వేసి ఆహ్లాద వైపు చూస్తూ అడిగాడు "పనిమనిషి వచ్చి వెళ్ళిందా... నువ్వు వచ్చి ఎంతసేపు అయింది.?"

ఆహ్లాద నెమ్మదిగా చెప్పింది.. " నేను ఉదయం ఎనిమిదింటికి వచ్చాను. నేను వచ్చాక ఎవరూ రాలేదు.. మూడు, నాలుగు సార్లు కాలింగ్ బెల్ నొక్కి, మీ షూ బయటనే ఉంది కదా ఇంట్లోనే ఉంటారు అని ఎదురుచూస్తూ కూర్చున్నాను. పని ఏదన్నా ఉంటే చెప్పండి నేను చేస్తాను " అంది.

ఆ మాటలకి అతని పెదవుల మీద చిన్న మందహాసం మెరిసి మాయమైంది. సమాధానం చెప్పకుండా వంట గదిలోకి వెళ్ళిపోయి, పాలు గిన్నెలో పోసి, స్టవ్ మీద పెట్టాడు. అక్కడ నుంచి డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి, టేబుల్ మీద బ్రెడ్ బాక్స్ లో ఉన్న బ్రెడ్ తీసి ఆహ్లాద వైపు చూస్తూ అడిగాడు. బ్రెడ్ తింటావా!"

తింటాను అన్నట్టు తల ఊపింది.

పాపం ఆకలేస్తున్నట్టుంది జాలిగా అనుకున్నాడు. ఆమె అలసిన వదనం చూస్తుంటే చాలాసేపు నుంచి తనకోసం ఎదురుచూస్తూ కూర్చున్న అలసట కనిపిస్తోంది.

ఈ అమ్మాయికి ఎందుకో తన మీద ఇంత ఇంట్రెస్ట్ అనుకుంటూ స్టవ్ వైపు నడిచాడు.

ఆహ్లాద సోఫాలోంచి లేచి అతని వైపు నడిచింది.

రెండు మగ్స్ లో ఇన్స్టంట్ కాఫీ కలిపి ఆమె చేతికి ఒక కప్పు ఇచ్చాడు. " ఫ్రిడ్జ్ లో జామ్ ఉంది ఇవ్వనా ! " అన్నాడు తోస్టర్ లో పెట్టిన బ్రెడ్ తీస్తూ.

"తరవాత తింటాను" అంది .

ఇద్దరూ సోఫా వైపు నడిచారు. కాఫీ సిప్ చేస్తూ అడిగాడు.. "ఇప్పుడు చెప్పు ఎందుకింత ఉదయాన్నే వచ్చావు."

ఆహ్లాద ప్రస్తుతం కాఫీ తాగడం తన కర్తవ్యమ్ అన్నట్టు మాట్లాడకుండా కూర్చుంది.

అతను కొన్ని క్షణాలు ఆమె వైపే తదేకంగా చూస్తూ.. గొణుక్కున్నట్టు అన్నాడు.. "ఎక్కడో చూసాను"

ఆహ్లాద కనురెప్పలు ఎత్తి అతని వైపు చూసింది.

"నిన్న మీరు సడన్ గా ఎమోషనల్ అయారు.. ఇంటర్వ్యూ మధ్యలో ఆపేసి వెళ్ళిపోయారు. నేను తట్టుకోలేకపోయాను. మీరెందుకలా అయారు? "

అతను ఆశ్చర్యంగా చూసాడు. " నీకెందుకంత టెన్షన్ ?" అన్నాడు.

"మీరు నా అభిమాన ఆర్టిస్ట్.. మీ జీవితం ఎంత విషాదమో తెలుసుకుంటున్న కొద్దీ దుఃఖం ఆపుకోలేక పోయాను. నేనే కాదు.. ఎందఱో అభిమానులు బాధపడి ఉంటారు కదా.. మీరలా మధ్యలో వెళ్ళిపోతే అందరూ టెన్షన్ పడతారు.. చానెల్ కి ఎన్ని ఫోన్ కాల్స్ వెళ్ళాయో తెలుసా.. నేను మేఘనని అడిగాను.. కంటిన్యూస్ గా వస్తూనే ఉన్నాయిట. ఆ తరవాత ఏమయింది చెప్పరూ ప్లీజ్.."

తేజ ఆమె వైపే చూస్తూ ఉండిపోయాడు. ఆ చూపులకి ఇబ్బంది పడుతూ అంది.." ఇవాళ కంటిన్యూ చేస్తారా... ఛానెల్ కి ఎప్పుడు వెళ్తారు?"

"వెళ్ళను" ఖాళీ కప్పు టీ టేబుల్ మీద పెట్టి అన్నాడు.

"వెళ్ళరా.. ఎలా.. సగంలో ఆపేస్తే ఎలా?" నేరస్తుడిని చూసినట్టు అతని వైపు చూసింది.

అతను సోఫాలో వెనక్కి వాలాడు.. "సగంలో ఆపేయడం ఏంటి? నా జీవితం అసంపూర్ణ చిత్రం.. సంపూర్ణం అయాక అదే తెలుస్తుంది" అన్నాడు.

ఆహ్లాద అయోమయంగా చూసింది. నెమ్మదిగా అభ్యర్ధిస్తున్న స్వరంతో అంది "సర్! ప్లీజ్.. చెప్పండి. తరవాత ఏమైంది?"

అతను సరిగా కూర్చుంటూ " ఎందుకు మీ అందరికీ అంత కుతూహలం.. నా జీవితం పట్లనేనా! అందరు సెలెబ్రిటీల గురించి ఇలాగే ఆలోచిస్తారా!"

ఆహ్లాద కాఫీ కప్పు టీ టేబుల్ మీద పెట్టి అంది.. "మీ కొనసాగింపులో నా కొన్ని ప్రశ్నలకి సమాధానం దొరుకుతుందని ఆశ."

"నీ ప్రశ్నలా ఏమిటవి? "

"చెప్పలేను.. మీ కథ పూర్తిగా విన్నాక చెబుతాను.. "

అతను ఆమె వైపు రెప్పవేయకుండా చూస్తూ ఉండిపోయాడు.

ఇవే కళ్ళు, ఇవే పెదవులు.. కదిలే మేఘాల్లాంటి కురులు.. ఇదే నవ్వు..ఎవరీమె?

అతని కళ్ళ ముందు పొరలు, పొరలుగా విడిపోతూ.. ఏవో జ్ఞాపకాలు.. ఏవో రూపాలు..

గబుక్కున లేచాడు.. " బ్రెడ్ తిను.. నేను రెడీ అయి వస్తాను." అంటూ వేగంగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆహ్లాద కళ్ళు మెరిసాయి.. అతను లోపలికి వెళ్ళిపోగానే ఖాళీ కప్పులు తీసుకుని వెళ్లి సింగ్ లో వేసింది. బ్రెడ్ ఒక స్లైస్ తీసుకుని మునిపంటితో కొరుకుతూ హాల్లోకి వచ్చి గోడలకి ఉన్న పెయింటింగ్స్ చూడసాగింది.

ఇరవై నిమిషాల్లో తెల్లని నిలువు చారల షర్టు, నేవీ బ్లూ కలర్ ప్యాంట్ .. షాంపూ చేసిన క్రాఫ్ గాలికి సున్నితంగా కదులుతుంటే వచ్చాడు.

కారు కీస్ తీసుకుని "కం" అంటూ డోర్ వైపు నడిచాడు.

చేతిలో మిగిలిఉన్న బ్రెడ్ ముక్క నోట్లో పెట్టేసుకుని, చేయి చున్నీకి తుడుచుకుంది. అతను భుజాల మీద నుంచి వెనక్కి తిరిగి ఆమె వైపు చూసి, అక్కడ నాప్ కిన్ ఉంది కదా! అన్నాడు డైనింగ్ టేబుల్ దగ్గర ఉన్న కుర్చీమీద పెట్టిన నాప్ కిన్ వైపు కళ్ళతో చూపిస్తూ.

సిగ్గుగా నవ్వి,, “పర్లేదు పాతదే డ్రెస్” అంటూ  సోఫా దగ్గరకు పరుగులాంటి నడకతో వెళ్లి, గబ,గబా బ్యాగు భుజానికి తగిలించుకుని, అతడిని అనుసరించింది.

లిఫ్ట్ లో కూడా అతను ఓరకంట ఆ అమ్మాయిని గమనిస్తూనే ఉన్నాడు.. ఎక్కడో చూసాను అనుకున్నాడు.

కారు చానెల్ వైపు కదిలాక ఆహ్లాద మేఘన నెంబర్ కి రింగ్ చేసింది.

ఆనంద్ నగర్ లోని స్టూడియో లో సరిగ్గా ముందురోజు కూర్చున్న కుర్చీలో కూర్చున్నాడు తేజ.  కెమెరా ఆన్ అయింది. మేఘన ఊపిరి బిగబట్టి చూస్తోంది తేజ వైపు..

ఆమె వైపు చిరునవ్వుతో చూసి “ ఏదన్నా అడుగుతారా “ అన్నాడు తేజ.

మేఘన తడబడింది.. అది,ఆది మీ పేరు.. తేజ.. మహా తేజ కదా.. “

అతను సన్నగా నవ్వాడు.. “ అవును.. అనామకుడి పేరు మహా.. తరవాత ఆ మహాలో తేజస్సుని నింపిన వారి ద్వారా తేజ చేరింది. “

“ ఎవరు? చ.. చంద్రకాంత్ గారేనా..!”

తేజ నవ్వుతూ నిశ్శబ్దంగా ఉండిపోయాడు.. అందరూ ఉత్సుకతతో అతని సమాధానం కోసం చెవులు రిక్కించి కూర్చుని  చూడసాగారు. అతని స్వరం గంభీరంగా పలికింది.

“ నా  జీవితంలో ప్రతి దశలో నన్ను అర్థం చేసుకుని, ఆదరించి మనసుకి చేరువైన వాళ్ళు చాలా మంది ఉన్నారు. వారిలో చంద్రకాంత గారు ఒకరు.. వారి తరవాత వచ్చిన వ్యక్తీ నా జీవితాన్నే కాదు, నన్నే పూర్తిగా మార్చేశాడు.. అతను ఎవరో చెబుతాను..”

కెమెరా ఆన్ అయింది. అందరూ అలర్ట్ గా అయారు. అక్కడ పిన్ డ్రాప్ సైలెన్సు ఆవరించింది. ఆహ్లాద ఊపిరి బిగబట్టుకుని కూర్చుంది అతని సమాధానం కోసం.  అతను తన కథ కొనసాగించాడు.

“చంద్రకాంత్ గారు, లక్ష్మిగారు ఆరోజు అల్లా చెప్పిన తరవాత మహా మెదడు మళ్ళీ తుపాను సముద్రంలా అల్ల కల్లోలంగా మారింది.. తన జీవితం ఏమవుతోందో అర్థం కాలేదు.. రాత్రంతా నిద్రపట్టలేదు. అలా తోటలో తిరుగుతూ భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ గడిపాడు..

ఎనిమిదేళ్ళ క్రితం చనిపోయిన మాగాడు మళ్ళీ బతుకుతాడా! మళ్ళీ జీవితం ఫుట్ పాత్ మీదకి వెళుతోందా! మెదడంతా గందరగోళం... మహా తిరిగి మాగాడు అవబోతున్నాడా! మహా అంతరించిపోతున్నాడు.. మాగాడు వాడిని తరిమి కొట్టబోతున్నాడు..ఎలా! అలా జరక్కూడదు.. మాగాడు ఈ పోరాటంలో ఓడిపోవాలి.. మహా గెలవాలి.. ఎస్ గెలవాలి..

‘జీవితం ఎప్పుడూ సవాళ్ళను విసురుతూనే ఉంటుంది దానిని ఎదుర్కొని నిలచిన వారికే విజయం సొంతం అవుతుంది.” చంద్రకాంత్ స్వరం మారుమోగుతోంది.

ఆలోచనలకు ఒక రూపం రావడంలేదు.. మనసంతా ఘనీభవించినట్టుగా ఉంది..

ఒక్క నిమిషంలో జీవితం ఏమి మారదు.. కానీ ఆ ఒక్క నిమిషం ఆలోచించి తీసుకొన్న నిర్ణయం మాత్రం జీవితాన్ని మార్చేస్తుంది. ఇప్పుడు తను తీసుకునే నిర్ణయం మీద భవిష్యత్తు ఆధారపడి ఉంది. . ఆలోచించి, ఆలోచించి ఎప్పుడో అర్ధరాత్రి నిద్రలోకి జారాడు. .

తెల్లవారక ముందే గభాల్న మెలకువ వచ్చింది.. ఇప్పుడు వాడి మనసు కురుక్షేత్రం తరవాత యుద్ధభూమిలా ఉంది.. నెమ్మదిగా మాగాడిని తరిమికొట్టి మహా ని ఆహ్వానించాడు. కొంచెం తేలికైన మనసుతో నిద్ర లేచి స్నానం చేసి నేరుగా బీచికి వెళ్ళాడు.

కొంచెం దూరంలో సముద్రం ... కెరటాలతో తుళ్ళిపడుతూ.. హోరు పెడుతూ... ఘోషిస్తూ..

అలా ఇసకలో నడుచుకుంటూ కెరటాలకు దగ్గరగా వెళ్ళాడు. కెరటాలు ఇసకను శుభ్రంగా కడిగి, చల్లని, మెత్తని శయ్య తయారుచేసి ఆహ్వానించాయి. ఆ తడి ఇసకలో అక్కడే కూర్చున్నాడు. ఓ పెద్ద అల వచ్చి పరామర్శించి వెళ్ళిపోయింది. ఆ అలని చేతికి చిక్కించుకోడానికి ప్రయత్నించాడు. ఫకాల్న నవ్వి పారిపోయింది. నీక్కూడా నేను అలుసే కదూ ! అనుకున్నాడు విరక్తిగా.

ఇవాళ తన జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజు. ఇప్పటివరకూ విధి బతికించింది.. ఇక నుంచీ తన బతుకు తనే బతకాలి. ఎలా? ఎలా? చెవుల్లో ఘోష ... మహా సముద్రపు ఘోష.. విధి తనని పేవ్మెంట్ మీద నుంచి చంద్రకాంత్

గారి భవనానికి తీసుకుని వెళ్ళింది. అయిపోయింది.. అక్కడ తన కథ ముగిసింది.. ఇంకో చోట,, ఇంకో కథ ... వాళ్ళు మాత్రం ఎన్నాళ్ళు భరిస్తారు తన బాధ్యత.. చేయగలిగింది చేసారు.. తను వాళ్ళకి ఏమవుతాడు! ఏమి కాదు..ఎవరికీ ఏమి కాదు.. సింహాచలానికి ఏమవుతాడు? ఏమికాదు... నేనెవరు? ఒక్కసారి అతని మనసులో ఒక ప్రశ్న కెరటంలా లేచింది.

మోకాళ్ళ చుట్టూ పెనవేసి ఉన్న ఆ  చేతులమీద కొన్ని అక్షరాలూ కనిపిస్తున్నాయి.

నేను అనాధని...

అనాధ .. తెలుగు డిక్షనరీలో నుంచి ఈ పదం , ఇంగ్లీషు నుంచి orphan అనే పదం తొలగించబడితే బాగుండు. తుళ్ళి పడుతున్న సముద్ర కెరటాలను చూస్తూ అనుకున్నాడు మహా. మెత్తటి ఇసకలో రెండు కాళ్ళు మడుచుకుని,  రెండు చేతులతో మోకాళ్లను పెనవేసుకుని,  మడచిన కాళ్ళ మీద గడ్డం ఆనించి సముద్రం వైపు చూస్తున్నాడు. ప్రభాత కిరణాలు వెచ్చగా తడుముతూ కుశలం అడుగుతున్నట్టు అనిపించింది..  రేపటి నుంచీ మళ్ళీ మనిద్దరం నేస్తాలం అని భుజం తట్టి మరీ చెబుతున్నట్టు అనిపించింది.

కొంచెం దూరంలో బేస్తవాళ్ళు వలలు పడవల మీద ఆరేసుకుని కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

యువతీ, యువకులు, పిల్లలు, కొందరు మధ్య వయస్కులు, పర్యాటకులతో విశాలమైన సముద్రతీరం సందడిగా ఉంది.  పెద్దవాళ్ళు పిల్లల చేతులు పట్టుకుని,  వాళ్ళు ఉత్సాహంతో ఎక్కువ లోతుకి వెళ్ళకుండా,  హెచ్చరిస్తూ  కెరటాలతో ఆడుకోడానికి సాయం చేస్తున్నారు.

నేను అనాధని .. మహా కళ్ల నుంచి రెండు నీటి బొట్లు రాలి ఇసకలో పడి ఇంకిపోయాయి.

“మీ అమ్మా, బాబు  ఎవరురా.. ? “

“ మా అమ్మ, అయ్యా లేరు చచ్చిపోయారు,”

“అయ్యో అనాధవా.. “

“అలా అనొద్దు.. నన్ను అనాధ అనొద్దు.”

“మరి ఎవరూ లేని వాళ్ళని ఏమంటారు?”

అవును ఏమంటారు? వాడి కళ్ళ ముందు చేతులు కాళ్ళు ఆడిస్తూ ఒక ప్రశ్న చిత్రమైన ఆకారం పొంది వికృతంగా కదిలింది.

“ఏదో ఒకటి అనాలిగా ఏమంటారు? చెప్పు “

అవును ఏమంటారు? దిక్కులేని వాడు అనచ్చా .. అలా అన్నా ఆ పదం కూడా గుండెని కోస్తుంది కదా అనిపించుకున్న వాళ్ళకి. మరెలా? అమ్మా, నాన్నా లేని వాడు.. అది ఇంకా ఎక్కువ దుఖం ..

ఉధృతంగా ఎగసిపడే అలలతో తీరాన్ని దాటి చుట్టు పక్కల ఉన్న గుడిసెలను, కొట్లను తన గర్భంలోకి లాక్కుంటూ ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తం చేయడానికి దూసుకువస్తున్నాడు సముద్రుడు.

ఎప్పుడు సముద్రాన్ని చూసినా ఇదే భావన కలుగుతుంది వాడికి.

పదేళ్ళ క్రితం తన కళ్ళతో చూసిన బీభత్సాన్ని మర్చిపోడు. ఆ భీభత్సం తన జీవితంలో సృష్టించిన అల్లకల్లోలం కూడా మర్చిపోడు. అయినా సముద్రం దగ్గరకు రాకుండా ఉండలేడు. ఉవ్వెత్తున లేచి ఒడ్డును తాకి ఇసకతో పాటు తన తల్లి,తండ్రులనే కాక అనేకమందిని తనతో తీసుకుని వెళ్ళిపోయిన సముద్రుడు ఏనాటికైనా అమ్మా, నాన్నల్ని తిరిగి తేకపోతాడా, తన చేతికివ్వకపోతాడా అని ఆశగా చూస్తూ ఉంటాడు.

ఇప్పుడు మళ్ళీ తన జీవితంలో తుపాన్ రాబోతోందా? తన జీవితాన్ని అల్లకల్లోలం చేయబోతోందా!

ఎందుకు? ఎందుకిలా తన జీవితంతో చెడుగుడు ఆడుకుంటోంది విధి.

అతనికి సమాధానం చెప్పడం ఇష్టం లేనట్టు అతని పాదాలను తాకకుండానే వెనక్కి వెళ్ళిపోయాయి కెరటాలు.

తడి ఇసక అతని పాదాల కింద చల్లగా తగులుతూ ఎన్నో కధలు చెప్పడానికి ఉవ్విళ్ళూరుతున్నట్టుగా అనిపిస్తోంది.

మోకాళ్ళ మధ్యలో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

అతని భుజం మీద వెచ్చగా తగిలింది. తడి కళ్ళతో ఆ చేయి వైపు అక్కడి నుంచి ఆ చేయి తాలూకు వ్యక్తి వైపు చూసాడు.

డి ఎస్ .పి చంద్రకాంత్ యూనిఫాం లో..

గబుక్కున కళ్ళు తుడుచుకుని లేచి నిలబడ్డాడు.

"ఎందుకేడుస్తున్నావు?" మృదు గంభీరంగా అడిగాడు ఆయన,.

మహా మాట్లాడలేదు.. తల వంచుకుని కుడికాలి బొటన వేలితో ఇసకలో సున్నాలు చుట్టసాగాడు.

ఆయన అది చూసి అతని భుజం మీద చేయెసి అన్నాడు. " చూసావా! ఇంత దు:ఖంలో కూడా నీలో నిబిడీకృతం అయి ఉన్న కళ ఎలా నీ మెదడు పొరలని చీల్చుకుంటూ ఉబికి వస్తోందో! అప్రయత్నంగానే, నీ కాలి వేలితో కూడా ఏదో చేయడానికి ప్రయత్నం చేస్తున్నావు."

ఆయన అలాగే భుజం మీద చేయేసే ఆ ఇసకలో అడుగులు వేస్తూ అన్నాడు. " మహా ! ఈ సముద్రం ఉంది చూడూ! ఇది మానవజీవితానికి నిర్వచనంలాంటిది.. ఈ ఇసక, ఈ కెరటాలు... సముద్రం ఘోష ఇదంతా జీవన నేపథ్యం. నిజానికి ప్రతి మనిషీ ఒక జాలరే.. కూలిపోయిన జీవనవృక్షాల వేళ్ళను వెతుక్కోడానికి వలలు తిరిగి, తిరిగి వేస్తూనే ఉంటాడు.. ఈ హోరులో జీవనగానానికి శృతి, లయల సంగతులు సమకూర్చుకుంటాడు... జారిపోయిన ఆశల ముత్యాలు ఏరుకోడానికి ఈ మెత్తటి ఇసకలో పాదాలు జొనిపి అన్వేషిస్తూనే ఉంటాడు. మనిషి ఆశాజీవి. నువ్వు ఒక జాలరి కొడుకువి.. మీ నాన్న హోరుగాలి హెచ్చరిస్తున్నా, కెరటాలు తోసేస్తున్నా ఏదో ఆశతో మహా సముద్రంలో ప్రాణాలకు తెగించి లోలోతులకు వలలేస్తూ తనకు కావాల్సిన చేపలు పట్టడానికి సాహసం చేసాడు. ఇంక గెలుపు, ఓటములంటావా! అవి దైవాధీనాలని పెద్దలు ఎప్పుడో చెప్పారు. నిన్ను నా దగ్గరే జీవితాంతం ఉంచుకోడానికి నాకేం అభ్యంతరం లేదు.. కానీ నేను శాశ్వతం కాదు.. నేను లేకపోతె నువ్వేంటి? మహా ! ఒకటి పక్కన సున్నా ఉంటే పది అవుతుంది... సున్నా పక్కన ఒకటి ఉంటే! జాగ్రత్తగా విను.. ఈయన మాటలు అర్థం కావడం లేదు అనుకోవద్దు.. జీవితాన్ని అర్థం చేసుకోడానికి ఏ యూనివర్సిటీ చదువు అవసరం లేదు.. అనుభవాలు చాలు.. అవే పాఠాలు. నువ్వు పదిమందిలో ఒకడిగా కాదు, ఒక్కడు.. అంటే నెంబర్ ఒన్ అనిపించుకోవాలి. అదే నా కోరిక ..

ఎస్ ... నువ్వు నెంబర్ వన్ అనిపించుకోవాలి. నీ జీవితం అనే సముద్రంలో ఒక పెద్ద తిమింగలాన్ని పట్టుకోడానికి పెద్ద వల తీసుకుని బయలుదేరావు.. పట్టుకో.. ఆ తిమింగలం పేరు సక్సెస్ ... విజయం ... ఎస్ నువ్వు విజయం సాధించాలి.. ఇంకోసారి ఈ సముద్రాన్ని చూసినప్పుడు నీ కంటి నుంచి నీరు రావద్దు.. విజయ దరహాసం రావాలి. "

మహా తల తిప్పి ఆయన మొహంలోకి విచిత్రంగా చూసాడు. " అయ్యగారూ! నాకు చదువులేదు, బతకడానికి కావలసిన ధైర్యం లేదు.. నా మనసులో ఏముందో ఎదుటివారికి అర్థం అయేలా చెప్పగలిగే భాష కానీ భావ వ్యక్తీకరణ కానీ ఏమి లేదు.. అలాగని నేను బతకలేను అనడం లేదు.. అమ్మా, నాన్న నా ఊరు, నా వాళ్ళు అందరినీ విధి మింగేసిన రోజు నేనసలు మనిషిని అవునో కానో కూడా నాకు తెలియని స్థితిలో బతికాను. నేనెవరో, ఎక్కడి నుంచి వచ్చానో నా పేరు,

ఊరు ఏమి తెలియని అయోమయపు స్థితిలో సింహాచలం అమ్మ ఆదరించింది.. ఆకలి, దాహం తీర్చింది.. బతుకు అవసరం చెప్పింది... ఆమె కూడా కాలగర్భంలో కలిసిపోయాక బతకాలంటే తిండి, నీళ్ళు కావాలని మాత్రం తెలిసింది. ఆ తిండి నీళ్ళు సంపాదించుకోడానికి ఆ దేవుడు నాకు కొన్ని గీతలు గీయడం నేర్పాడనుకున్నాను. ఆ గీతలకి నాకు తెలిసిన కొన్ని ఆకారాలు ఇచ్చాను. ఆ ఆకారాలు దేవుళ్ళని, ఆ దేవుళ్ళ మీద భక్తితో జనం చిల్లర వేస్తున్నారని కూడా నాకు తెలియదు.. ఆ చిల్లరతో ఆకలి తీర్చుకుంటూ పేవ్మెంట్ మీద బతికాను. అప్పుడు కూడా చచ్చిపోవాలన్న ఆలోచన నాకు రాలేదు.

ఆ తరవాత మీరు నన్ను చేరదీశారు. అసలు బతుకంటే ఏంటి? మనిషి లక్షణాలేంటి అనేవి నేర్పారు. రెండు కాళ్ళ మీద నిటారుగా నిలబడడం నేర్పారు. నడవడం నేర్పారు.. కానీ సార్ ఆ నడక ఎక్కడి నుంచి ఎక్కడిదాకా అని మీరు చెప్పలేదు.. నాకూ తెలియదు. బతకడం తెలుసు నాకు కానీ, అందంగా, విజయవంతంగా, కళాత్మకంగా బతకడం తెలియదు.

మీరు చెప్పే సక్సెస్ అంటే ఏమిటో, అది ఎలా సాధించాలో నాకు తెలియదు.. మీరు నాకు ఒక విద్య నేర్పించారు కానీ అది నాకు ఉపాధి అవుతుందో లేదో తెలియదు.. ఇదివరకులా పేవ్మెంట్ మీద పడుకుని, పక్కన రోడ్డు మీద ఆ విద్య ప్రదర్శించలేను. నాకు, నాకు భయంగా ఉంది. ఈ నాగరిక సమాజంలో నేను ఒక గొంగళిపురుగులాంటివాడిని. నేను ఎలా బతకగలను!" రెండు చేతుల్లో మొహం దాచుకుని రోదించసాగాడు మహా .

ఆయన ధృడంగా అన్నాడు "బతకగలవు... విజయం అనేది కంటికి కనిపించదు. విజయం సాధించాలి అన్న కాంక్ష హృదయంలో జనించి, మేధస్సులో పరిమళిస్తుంది." ఆయన స్వరం మృదువుగా మారింది. "నిన్నిలా ఉన్నపళంగా రోడ్డు మీదకి పంపిస్తాను అని ఎలా అనుకున్నావు? నిన్ను నువ్వు తెలుసుకునే వరకు నీకో అండ, దండ ఏర్పాటు చేసి పంపిస్తాను సరేనా." ఆయన జేబులో నుంచి ఒక విజిటింగ్ కార్డ్ తీసాడు. "ఇదిగో ఇది నా స్నేహితుడిది... హైదరాబాద్ లో రైల్వే లో మంచి హోదాలో ఉన్నాడు. వాడికి నీ గురించి చెప్పాను. నీకు తప్పకుండా సాయం చేస్తాడు. నీకో ఉపాధి కూడా చూపిస్తాడు. నిన్ను హైదరాబాద్ పంపించే ఏర్పాట్లు చేస్తాను. "

కన్నీటితో తడిసిన చేయి చాచాడు. ఆయన విజిటింగ్ కార్డ్ అతని చేతిలో పెట్టాడు. ఇంగ్లిష్ లో సర్వోత్తమ రావు , ఇండియన్ రైల్వేస్ అక్షరాలు చదివాడు. ఆయన కళ్ళల్లోకి చూసాడు. ఆయన మెత్తగా నవ్వాడు.. ఆ నవ్వులో అభయం కనిపించింది మహాకి .. అప్పటివరకూ వేదనతో తల్లడిల్లిన హృదయం మీద చల్లని జల్లు కురిసినట్టుగా అనిపించింది."

అప్పటివరకు మహాతేజ చెబుతున్న ఆయన జీవితగాథ వింటున్న మేఘ, కెమెరా యూనిట్, ప్రోగ్రాం హెడ్, ఇతర టెక్నికల్ స్టాఫ్ అందరూ కూడా తేజ మాట్లాడడం ఆపేయడంతో అప్పటివరకూ లీనమై చూస్తున్న సినిమా అయిపోయినట్టు దీర్ఘంగా శ్వాస తీసుకున్నారు..

రికార్డింగ్ ఆపేసి " వారికి కాఫీ ఆఫర్ చేయండి" అన్నాడు ప్రొడక్షన్ హెడ్..

ఒక కుర్రాడు ఫ్లాస్క్ లో సిద్ధంగా పెట్టుకున్న కాఫీ తీసుకుని వచ్చి ఇచ్చాడు.

కాఫీ నెమ్మదిగా సిప్ చేస్తూ చిరునవ్వుతో అడిగాడు.. " మీ అందరినీ బోర్ కొట్టిస్తున్నానా !"

" ఓ...నో సర్... వెరీ ఇంటరెస్టింగ్... మీ జీవితం మాలాంటి వాళ్లకి స్ఫూర్తినిస్తుంది.." అంది మేఘ..

అతను మాట్లాడలేదు.. నీలం రంగు బాక్ గ్రౌండ్ ని, డెకోరేషన్ ని పరిశీలనగా చూస్తూ కాఫీ తాగడం పూర్తి చేసి " కంటిన్యూ చేద్దామా ! " అన్నాడు.

ష్యూర్ అంటూ అందరూ వారి, వారి పనుల్లో అలర్ట్ అయారు.

మేఘ సంకేతాలు అందుకుని " సర్! మీ జీవితంలో జరిగిన ప్రతి సంఘటనా ఎంతో ఉత్తేజపూరితంగా ఉంది.. వింటుంటే రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి.. చంద్రకాంత్ లాంటి వ్యక్తులు అంత మంచివాళ్ళు ఈ సమాజంలో ఉన్నారా అనిపిస్తోంది.." అంది.

" ఉండేవారు అనడానికి ఆయనే ఒక నిదర్శనం.. ఇప్పుడు ఉన్నారా అంటే చెప్పలేను.. కాలం మారిపోతోంది.. విలువలు మారిపోతున్నాయి.. అనుబంధాలు అన్నీ డబ్బు చుట్టూ అల్లుకుని పోతున్నాయి.. ఈ స్వార్థపూరిత ప్రపంచంలో అలాంటి వ్యక్తులు ఉంటారని ఆశించడం సాహసమే అనుకుంటా నేను.."

" అవును సర్.. మీరన్నది నిజం అనిపిస్తుంది కొన్ని సంఘటనలు చూస్తుంటే.. అయితే మిమ్మల్ని చంద్రకాంత్ గారు ఎక్కడికి పంపించారు? ఆ తరవాత ఏం జరిగింది? ఈ విషయాలు తెలుసుకోవాలని మా అందరితో పాటు ప్రేక్షకులు కూడా టెన్షన్ గా ఉన్నారు."

తేజ ప్రశాంతంగా అన్నాడు.. " చెప్తాను.. మీకు చెప్పడం కాదు.. నా జీవితాన్ని నేనే రివైండ్ చేసుకుంటున్నాను. ఎంత దూరం ప్రయాణించామో, ఏ గమ్యాన్ని చేరామో తరచూ నడిచి వచ్చిన బాటని తడిమి చూసుకోవాలి.. లేకపోతే ఆ దారి మర్చిపోతాము. నా జీవితంలో మరో ముఖ్యమైన, కీలకమైన మలుపు అక్కడి నుంచే మొదలైంది."

16

**ఆహ్లాదకి అరచేతుల్లో** చెమటలు పట్టసాగాయి.. ఇప్పుడేనా ! ఇప్పుడేనా ! అమ్మని కలిసింది.. ఇప్పుడేనా ! ఇక్కడి నుంచి అమ్మ కథ మొదలై ఉంటుందా! ఆమె గుండెలు ఎప్పటికన్నా వేగంగా కొట్టుకోసాగాయి. తల్లి డైరీ లో ప్రతి అక్షరం ఆమె కళ్ళ ముందు చక,చకా జరిగిపోతున్నాయి. తేజ చెప్పబోయే తరవాతి కథ వినడానికి, విని తట్టుకోడానికి తనని తాను సమాయత్తం చేసుకోసాగింది.

తేజ స్వరం మోగింది.. కానీ ఇంతవరకు వినిపించిన గాంభీర్యం ఆ స్వరంలో లోపించినట్టు అనిపిస్తోంది.. కొంచెం నీరసంగా, వేదనగా ఉంది..

"ఆయనమాట ఇచ్చిన ప్రకారం నా పేరు మీద ఎకౌంటు ఓపెన్ చేసి నా ముప్పై వేలుతో పాటు మరికొంత కలిపి లక్ష రూపాయలు వేసారు. చేతి ఖర్చులకి కొంత ఇచ్చారు. అంత డబ్బు తీసుకుంటుంటే ఏదో తప్పు చేస్తున్న భావన నాలో..

" ఒద్దండి.. ఇంత డబ్బు నాకెందుకు" అన్నా వినిపించుకోలేదు.

"నీకు నేను చాలా బాకీ ఉన్నానురా.. ఇలా తీర్చుకోనీ " అన్నారు.

"ఇక నుంచీ నీకు నువ్వే గైడ్.. నీకు నువ్వే గురువు.. నీకు నువ్వే ఆలంబన.. ఇప్పటి నుంచీ నువ్వు సర్వ స్వతంత్రుడివి.." భుజం తట్టారు.

ఆ మాటలు నా రక్తంలో కొత్త ఉత్తేజాన్ని నింపాయి. నేనిప్పుడు మనిషిని అనుకున్నా.. అవును మనిషిని... మగాడిని. నా పేరు " మాగాడు" కాదు. . 'మగాడు'. ఎంత తేడా ఈ రెంటికీ ! అప్పటినుంచీ తరచూ అలాగే అనిపిస్తూ ఉండేది. అలా అనుకున్నప్పుడల్లా నా హృదయపుపొరల్లో నిద్రపోతున్న మాగాడు చటుక్కునలేచి నాలో అలజడి కలిగిస్తూ ఉండేవాడు. మహా వాడిని అణచి ఒళ్ళు విరుచుకుంటాడు. అలాంటప్పుడుమాగాడిని భూస్థాపితం చేయాలనుకునే వాడిని .. నేటికీ నాలో ఆ మాగాడు నిద్ర లేస్తూనే ఉంటాడు.. ఈజిప్షియన్ మమ్మీలాయుగ,యుగాలు నాతోటే ఉంటాడు కాబోలు అనుకుంటాను.

"మొదటిసారి రైలు ప్రయాణం... నాతోపాటు ఎందఱో ప్రయాణిస్తున్నారు. వారంతా నాకు తెలిసిన వాళ్ళు కాదు.. కానీ పలకరించారు.. "ఎక్కడికి వెళ్తున్నావు బాబూ! అలాగా! ఎవరున్నారు అక్కడ? ఏం చదువుకుంటున్నావు? " ముఖ్యంగా ఆ కంపార్ట్మెంట్ లో ఉన్న పదిమంది లో ఆ ప్రశ్న ముగ్గురు వేయడంతో మొదటిసారిగా నేను నిరక్షరాస్యుడిని అనే వాస్తవం తెలుసుకున్నట్టు అయి, కృంగిపోయాను. నేనేమి చదువుకోలేదన్న భావన చేదుగా అనిపించింది. ఏమి

చదువుకోడం లేదు అని చెప్పడానికి సిగ్గుగా అనిపించింది. నేను గొప్ప చిత్రకారుడిని అని చెప్పాలని గొంతుదాకా వచ్చిన మాటలు గొంతులోనే ఆగిపోయాయి. చదువుకి ఇంత ప్రాధాన్యత ఉందా! అనిపించింది. "నీలో ఎంత గొప్ప కళ ఉన్నా కనీసం ప్రాథమిక విద్య అయినా లేకపోతే ఆ కళకి విలువ ఉండదు మహా! కనీసం ప్రైవేట్ గా చదువుకుని ఒక డిగ్రీ సంపాదించు" చంద్రకాంత గారు తరచూ చెప్పేమాట పదే పదే గుర్తుకు రాసాగింది.

చదువు విలువ తెలియక చదువు నిర్లక్ష్యం చేశాను . ఇప్పుడిలా నాకు కొత్త అయిన ఆ చిన్న ప్రపంచంలో యాభై శాతం మంది చదువుకున్నావా! లేదా అని నిలదీస్తున్నాట్టు అనిపించి, ఎప్పటికైనా ఎలాగైనా చదువుకోవాలి అని మనసులోనే నిశ్చయించుకున్నాడు.

రైలుతో పాటు కదులుతున్న చెట్లనీ, పొదలనీ, చూస్తూ రేపటి నుంచీ నేనెవరు అనే ప్రశ్నకి సమాధానం అన్వేషిస్తూ గడిపాను .

రైలు గమ్యం చేరింది. సీటు కింద నుంచి సూట్కేసు తీసుకుని రైలు దిగాను.. ప్లాట్ ఫారం దాటి అందరితో పాటు నడిచి స్టేషన్ బయటకి వచ్చాను. .

" మీతో ఎవరూ రాలేదా.. ఒక్కరే వెళ్ళారా! హైదరాబాద్ కి వెళ్ళారా! బెంగుళూరు వెళ్ళారా!" అక్కడే కొంచెం దూరంలో కూర్చుని వింటున్న ఆహ్లాద ఆదుర్దాగా అడిగింది.

అతను ఆమె వైపు విచిత్రంగా చూసాడు. " నేను బెంగుళూరు వెళ్లానని ఎవరు చెప్పారు?"

"పాజ్ " అంది మేఘన..

"అది.. అది.". ఆహ్లాద తడబడుతూ అందరి వైపు తలతిప్పి చూసి.. " ఊరికే.. just " అంది..

అతను ఆహ్లాద వైపే విస్మయంగా చూస్తూ ఉండిపోడం గమనించిన మేఘన అంది.. " మీరు లాంజ్ లో కూర్చుని లైవ్ చూడండి మేడం ప్లీజ్..."

ఆహ్లాద "సారీ " అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది. " సర్.. కంటిన్యూ చేస్తారా !" కొంచెం ఒంగి తేజ మొహం లోకి చూస్తూ అంది మేఘన.

అతను కొన్ని క్షణాలు మౌనంగా ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

కెమెరా అతని వైపు పొజిషన్ చూసుకున్నాడు కెమెరా మాన్.. మేఘన తేజ వైపు ఆదుర్దాగా చూడసాగింది.

కొన్ని క్షణాల తరవాత అతను తమాయించుకుని నెమ్మదిగా చెప్పసాగాడు.

“ఆయన నన్ను రైలు ఎక్కించారు.. లక్ష్మి దేవి గారు కూడా వచ్చి నన్ను దీవించి వీడ్కోలు చెప్పారు.. ఆ తరవాతా...” అతను ఉన్నట్టుండి కుర్చీలో వెనక్కి వాలాడు.. మేఘన గబుక్కున కుర్చీలో నుంచి లేచింది.. లైట్స్ ఆఫ్ అయిపోయాయి. అక్కడే ఉన్న కెమెరా మాన్ తో పాటు అతని అసిస్టెంట్ కూడా కంగారుగా తేజ కుర్చీ దగ్గరకు వచ్చారు.

“సర్ ఆర్ యు ఆల్ రైట్ “ మేఘన అతని భుజం మీద చేయి వేసి అడిగింది..

“వా... వాటర్ “ అన్నాడు కుడిచేయి బొటనవేలు చూపిస్తూ..

క్షణాల్లో అతని చేతికి వాటర్ బాటిల్ అందించాడు అసిస్టెంట్.

బాటిల్ ఎత్తి గొంతులో పోసుకుంటూ ఉండగా నోట్లో పడలేదు.. జారి షర్టు కాలర్ తడిపేసింది.

మేఘన తనే బాటిల్ అందుకుని జాగ్రత్తగా అతని నోట్లో పోసింది.

అద్దంలో నుంచి ఇదంతా గమనిస్తున్న ఆహ్లాద పరుగున డోర్ తీసుకుని వచ్చి “ ఏమైంది” అంది.

“తెలియదు.. డ్రైవర్ ని పిలవండి.. డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్దాము..” అంటూనే మేఘన మరోసారి తేజాగారూ అని పిలిచింది.. అతను పలకలేదు.. చూస్తూ ఉండగానే అతని కళ్ళు మూతలు పడ్డాయి.. పెదవులు అస్పష్టంగా ఏదో గొణుగుతున్నట్టు కదలసాగాయి.

అప్పటివరకు ఏదో లోకంలో ఉన్నట్టున్న వారంతా అలర్ట్ అయారు.. డ్రైవర్ సహాయంతో తేజాని కారులో ఎక్కించారు. మేఘన, ఆహ్లాద చెరో పక్క కూర్చున్నారు. కారు హాస్పిటల్ వైపు కదిలింది.

నగరంలోని అత్యంత ఖరీదైన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్..

కారు ఆగడం, స్ట్రెచర్ తో హాస్పిటల్ స్టాఫ్ సిద్ధంగా ఉండి, తేజాని క్షణాల్లో ICU వైపు తీసుకుని వెళ్ళడం జరిగింది. మేఘన, ఆహ్లాద తేజతో సహా కారెక్కగానే వర్మ ఆ హాస్పిటల్ చీఫ్ తో మాట్లాడాడు. తేజ సంగతి చెప్పాడు.. చీఫ్ వెంటనే స్పందించి చక,చకా ఏర్పాట్లు చేసాడు.

ICU బయట ఆహ్లాద, మేఘన బిక్క మొహాలు వేసుకుని కూర్చున్నారు.

తెల్లని గోడలు , నీడలు తేలుతున్న ఫ్లోరింగ్, విశాలమైన కారిడార్, ఇత్తడి కుండీల్లో ఇంటీరియర్ ప్లాంట్స్.. తెల్లని దుస్తులు, మేడలో స్టెతస్కోప్ తో దేవదూతల్లా కదులుతున్న డాక్టర్స్, సేవే జీవిత పరమావధి అన్నట్టు ప్రశాంతమైన వదనాలతో చేతిలో కేసు షీట్స్ తో సిస్టర్స్, మధ్య, మధ్య ఆకుపచ్చ బెడ్ షీట్ లాంటిది పరచి ఉన్న స్ట్రెచర్స్ లాగుతూ హడావుడిగా తిరిగే వార్డ్ బాయ్స్...

అదంతా ఎన్నడూ చూడని ఓ అద్భుత ప్రపంచంలా ఉంది కానీ హాస్పిటల్ లాగా లేదు. భవిష్యత్తులో ఇలాంటి ఒక హాస్పిటల్ లో పని చేసే అవకాశం రావచ్చో, లేదో తెలియదు.. ఇప్పుడు మాత్రం భయంతో ఒళ్ళంతా చెమటలు పడుతున్నా, సెంట్రలైజేడ్ ఏ సి తాలూకు చల్లదనం కొంత ఉపశమనం కలిగిస్తున్నది. కాకపోతే హటాత్తుగా తేజ అలా పడిపోవడమే జీర్ణించుకు పోలేకపోతోంది ఆహ్లాద. అసలు ఆయనకీ ఏం జరిగిందో తెలుసుకుందామంటే ఒక్క డాక్టర్ కూడా లోపల నుంచి బయటకు రావడం లేదు.. వాళ్ళని లోపలికి రానివ్వడం లేదు. అప్పటివరకు బాగానే ఉన్న తేజ ఎందుకలా కూర్చున్న కుర్చీలో విరుచుకు పడ్డాడో, అక్కడ కూర్చున్న ఆ ఇద్దరు అమ్మాయిలకు అర్థం కావడం లేదు. ఆయనకి ఏమైందో ఇద్దరి మనస్సులో దిగులు.. ఆందోళన..

ఆయన.. ఆయనకీ ఏమన్నా అయితే,, అమ్మ కోరిక తను నెరవేర్చలేదు.. అమ్మ ఎన్నటికీ తనని క్షమించదు . ఆయనలా సడన్ గా సిక్ అవడానికి కారణం ఏమిటి? అమ్మ గుర్తొచ్చి ఉంటుందా ! ఎమోషనల్ అయారా ! తనేదన్నా బాధ పెట్టి ఉండచ్చా.. ఏం జరిగి ఉంటుంది! దేవుడా! తేజ గారిని కాపాడు. ఆయన చెప్పబోయే మిగిలిన ఆయన జీవిత కథలో అమ్మ చాలా ప్రధాన పాత్ర.. ఆ పాత్ర వలన ఆయన జీవితంలో వచ్చిన అనూహ్యమైన మార్పు అందరికీ తెలియాలి. ఆయన ఆరాధ్య దేవత కూతురు నేను అని ఆయనకీ తెలియాలి.. ఆహ్లాద దేవుడిని ప్రార్థిస్తూ రెండు చేతులు నలుపుకుంటూ కనురెప్పలు, మూస్తూ, తెరుస్తూ టెన్షన్ గా కూర్చుంటే, " భగవాన్ తేజగారి డాక్యుమెంటరీ పూర్తీ కాకుండా ఇంత ప్రమాదం జరుగుతుందని నేను ఊహించలేదు.. అయినా, నేనేమి ఆయనని ఇబ్బంది పెట్టె ప్రశ్న అడగలేదే.. ఎందుకలా సడన్ గా షాక్ తగిలినట్టు విరుచుకుపడ్డారు. ఆయనకీ ఏదన్నా అయితే మొత్త భారతదేశంలోని ఆయన అభిమానులంతా తనని తరిమి, తరిమి కొడతారు.. ఇప్పుడెలా? ఆయనని కాపాడు తండ్రీ... అంటూ ఇద్దరూ వారి, వారి ఆలోచనలలో తేజ క్షేమాన్ని కోరుకుంటూ కూర్చున్నారు. సిస్టర్ డోర్ తీసుకుని బయటకి వచ్చింది.. ఇద్దరూ గబుక్కున లేచారు.

మీరు ఆయనకీ ఏమవుతారు? ఇద్దరి వైపు చూస్తూ అడిగింది. ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"ఆయనకి insurance ఉందా !" అడిగింది సిస్టర్..

ఇద్దరూ ఒకరినొకరు ప్రశ్నార్ధకంగా చూసుకోడం తప్ప సమాధానం ఇద్దరి వద్దా లేదు..

సిస్టర్ కొంచెం అసహనంగా అంది.. “ఆయన ఏదన్నా మెడికల్ insurance తీసుకున్నారా ! ఆయనకీ heart attack వచ్చింది.. చాలా టెస్ట్ లు, ఆంజియో గ్రామ చేయాలి.. వాళ్ళ వాళ్ళు ఎవరన్నా ఉన్నారా!”

“ఆయన great ఆర్టిస్ట్ “ గబుక్కున అంది ఆహ్లాద.

సిస్టర్ సీరియస్ గా చూసింది.. “అది ఫ్రీ మేడికేషన్ కి అర్హత నిర్ణయించే సర్టిఫికేట్ కాదు కదా ! హాస్పిటల్ ఫార్మాలిటీస్ కొన్ని ఉంటాయి.. వివరాలు ఏమి తెలుసుకోకుండా ట్రీట్మెంట్ చేయడం రిస్క్.. కానీ చీఫ్ చెప్పారని చేస్తున్నారు.. బేసిక్ ఫార్మాలిటీస్ మస్ట్ ఫాలో ..”

మేఘన అందుకుని గబా,గబా అంది “ సిస్టర్ ! మా చానల్ లో ఇంటర్వ్యూ చేస్తుంటే ఇలా జరిగింది.. నేను మా హెడ్ తో మాట్లాడతాను.. మీరు చేయాల్సింది చేయండి.. ఆయనకి ప్రమాదం ఏమి లేదుకదా!”

ఆ ఇద్దరు అమ్మాయిల మొహాల్లో కనిపిస్తున్న ఆదుర్దా, దుఃఖం చూసి సన్నగా నిట్టూర్చింది సిస్టర్. వీళ్ళిద్దరూ ఆర్టిస్ట్ లు అయి ఉంటారు.. ఎంత గొప్ప వాళ్ళు అయినా కొన్ని లాంఛనాలు తప్పనిసరి.. రూల్స్ మారవు అని వీళ్ళకు చెప్పాలా! కాకపోతే వాళ్ళ టెన్షన్ వాళ్ళది.. అయినా తనలాంటి వాళ్లకి సెలబ్రిటీ లు ఎవరు, సామాన్యులు ఎవరు తెలిసే అవకాశం ఏది? ఇరవై నాలుగు గంటలు రోగుల సేవ తప్ప ఇంకో వ్యాపకము లేదు,, మరోధ్యాస లేదు.. సమయం దొరికితే విశ్రాంతికి మొహం వాచినట్టు పడుకోడం తప్ప టి వి కూడా చూసే అవకాశం లేదు.. కొంచెం ప్రశాంతంగా అంది ..” సరే! డాక్టర్ గారు వస్తారు.. వారితో మాట్లాడండి.” అంటూనే గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది. అద్దం దగ్గరగా మొహం పెట్టి చూస్తున్న మేఘన కి ఆమె లోపల డాక్టర్ తో మాట్లాడడం కనిపించింది.

17

**మేఘన వర్మకి** ఫోన్ చేసి పరిస్థితి వివరించింది.. “ ఆయనకి మైల్డ్ ఎటాక్ వచ్చిందిట.. డాక్టర్ చెప్పారు. బిల్ పే చేయమన్నారు.. టూ లాక్స్ ... ఎలా ?” అంది.

వర్మ ఆలోచించాడు. మహాతేజ సామాన్య వ్యక్తి కాదు.. ఏదన్నా జరిగితే ఎంతో మందికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అది కూడా తన ఛానల్ లో ఉన్నప్పుడు ఇలా జరగడం దురదృష్టం. ఆయన కోలుకోవాలి.. వెంటనే కోలుకోవాలి.. ఇప్పుడు ఈ నిస్సహాయస్థితిలో ఆయన ట్రీట్మెంట్ కి తను వ్యక్తిగతంగా కానీ, చానెల్ కానీ పే చేయాలి. ఛానెల్ పే చేయాలంటే మేనేజ్మెంట్ అనుమతి కావాలి. ప్రోగ్రాం చేయడంలో తనకి స్వాతంత్ర్యం ఉంది.. ఛానెల్ పాపులర్

అవడానికి ఎలాంటి ప్రోగ్రాం అయినా చేయచ్చు.. కానీ ఆర్థిక విషయాల్లో తనకి స్వాతంత్ర్యం లేదు.. వర్మ సీరియస్ గా ఆలోచించసాగాడు.. ఎంతసేపు ఆలోచించినా కాలయాపన జరుగుతోంది కానీ. సమస్యకి పరిష్కారం లభించడం లేదు.. అవతల మనిషి ప్రాణాపాయంలో ఉన్నాడు. ఆయన సెలబ్రిటీ కావచ్చు.. సాధారణ వ్యక్తీ కావచ్చు.. ఎవరైనా ప్రస్తుతం ఆ వ్యక్తికి అవసరం అయిన సహాయం చేయడం తన కర్తవ్యం. వర్మ కూర్చున్న దగ్గర నుంచి లేచాడు. ఏది ఏమైనా తనిప్పుడు హాస్పిటల్ కి వెళ్ళాలి. ఆయన కోలుకున్నాక మిగతా విషయాలు ఆలోచించ వచ్చు. కారు కీస్ తీసుకుని బయటకు నడుస్తూ స్థిరంగా అన్నాడు.. "నేను వస్తున్నాను.. కంగారు పడకు."

మేఘన ఊపిరి పీల్చుకుంది. వర్మ వస్తే నిశ్చింత. తనకీ ఏమి తెలియదు.. ఈ అమ్మాయి ఆహ్లాదకి ఏడవడం తప్ప ఏమి తెలిసినట్టు లేదు.. ఇంకా మెడిసిన్ చదువుతున్న పిల్ల..చిన్నది. ఈమె వాలకం చూస్తుంటే తేజకి ఈమెకి ఏదో రిలేషన్ ఉన్నట్టు అనిపిస్తోంది. అది ఏమై ఉండచ్చు.. ఆయన గురించి అన్ని రకాలుగా చాలా ఆందోళన పడుతోంది. ఏమవుతాడు తేజ ఈమెకి?

మేఘన ఆలోచనలు చెదరగొడుతూ ఆహ్లాద స్వరం వినిపించింది. " వర్మగారు వస్తున్నారా మేఘనా!"

కంపిస్తున్న ఆమె స్వరం విని విస్మయంగా చూసింది మేఘన.."నీకు తేజ గారు ఏమవుతారు?"

ఆహ్లాద మాట్లాడలేదు.. వస్తున్న దుఃఖం అణచుకోడానికి పెదాలు బిగబట్టి మొహం కిందకి దించేసుకుంది. మేఘన స్వరం మృదువుగా మారింది. "ఆహ్లాదా! నేను నిన్ను మొదటిసారి ఆర్ట్ గ్యాలరీ లో కలిసినప్పటి నుంచి గమనిస్తున్నాను. సంథింగ్ స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నావు ఆయన పట్ల.. ఏదో తెలుసుకోడానికి ప్రయత్నిస్తున్నావు.. మేము మా ప్రొఫెషనల్ లో భాగంగా చేస్తున్న డాక్యుమెంటరీ నువ్వు చాలా కీన్ గా ఫాలో అవుతున్నావు.. నీ రియాక్షన్స్ కూడా నేను ప్రతి మూమెంట్ లో గమనిస్తున్నాను.. నాకు చెప్పకూడదా మీ రిలేషన్ ఏంటో!"

ఆహ్లాద సన్నగా ఏడవడం మొదలుపెట్టింది.. చున్నీ కళ్ళకి అడ్డం పెట్టుకుని, తల బాగా వంచేసుకుని ఎవరికీ తన కన్నీళ్లు కనపడకుండా ప్రయత్నిస్తున్నది.

ఆమె చేయి తన చేతిలోకి తీసుకుంది మేఘన.." ఏడవకు.. చెప్పకూడనిది అయితే చెప్పకు. కాకపోతే ఆయన ఒంటరివాడు.. కావలసిన వాళ్ళు ఎవరూ లేరు అనుకుంటున్న పరిస్థితుల్లో నీకు, ఆయనకీ ఏదన్నా బంధం అంటూ ఉంటే ఈ సమయంలో అది మాకు ఒకింత ఉపశాంతినిస్తుంది.. ఎందుకంటే, ఒకరోజు, రెండు రోజులు చూసుకోగలను కానీ డిశ్చార్జ్ చేసాక ఆయనని ఎలా వదిలేయడం! ఎవరు చూసుకుంటారు అని ఆలోచిస్తే బాధగా ఉంది

! నర్స్ ని పెట్టచ్చు.. కానీ అయినవాళ్ళు ఎవరన్నా ఉంటే బాగుంటుంది అని ఆలోచిస్తున్నా.. నిజంగా ఆయన నీకు రిలేటివ్ అయితే నీకు ఆయన బాధ్యత అప్పచెప్పచ్చు కదా! !”

“నేను చూసుకుంటాను..” గబుక్కున అంది ఆహ్లాద.

“ఆర్ యు సీరియస్ ”

“అవును మేఘనా! నేను చూసుకుంటాను.. నిజానికి నాకూ, ఆయనకీ మధ్య ఉన్న బంధం ఏమిటో నాకూ తెలియదు.. అది తెలుసుకోడానికే నేను ఆయనని కలుసుకోడం కోసం సుమారు రెండేళ్ళుగా వెతుకుతున్నాను.. ఇప్పుడు కలిసారు.. నేనే ఆయన ఫ్లాష్ బ్యాక్ తెలుసుకోవాలి ఎలాగా అని ఆలోచిస్తున్న సమయంలో మీ ఛానెల్ ఈ ప్రోగ్రాం చేయడం లక్కీ గా ఫీల్ అయాను. కానీ సరిగ్గా అసలు కథ మొదలు పెట్టబోయే లోపల ఇలా జరగడం బాధగా ఉంది .. మేఘనా! ఆయనకి ప్రమాదం ఏమి లేదు కదూ..” చటుక్కున మేఘన చేతులు పట్టుకుని కన్నీళ్ళ మధ్య అడిగింది ఆహ్లాద.

మేఘనకి జాలేసింది.. ఏదో ఒక బంధం ఉంది.. లేకుంటే ఈమె ఎందుకు ఇంత బాధపడుతుంది! ఆయన కూడా ఆహ్లాద వేసిన ప్రశ్నకి ఎందుకో disturb అయినట్టు అనిపించింది.. సరే! ఆయన కొంచెం కోలుకున్నాక తెలుస్తుందిగా! అనుకుంటూ “తప్పకుండా కోలుకుంటారని డాక్టర్ చెప్పారుగా “ అంది.

“మేఘనా! how is he? “ అంటూ ప్రవేశించిన వర్మ మాటతో ఇద్దరూ ఉలిక్కిపడి లేచి నిలబడ్డారు.

“లోపలికి వెళ్ళనివ్వడం లేదు సర్.. ఇంటెన్సివ్ లో ఉన్నారు “ అంది మేఘన.

“Come Let us talk to Doctor “ అంటూ అతను ముందుకు నడిచాడు. మేఘన, ఆహ్లాద అతణ్ణి అనుసరించారు.

తేజ కళ్ళు తెరిచాడు. ఎదురుగా తను వేసిన పెయింటింగ్.. గర్భగుడి గడప మీద మోకరిల్లిన యువకుడి వైపు జాలిగా చూస్తున్న దేవత.. మంచం పక్కనే కుర్చీలో ఒక పక్కకి వాలి నిద్రపోతున్న ఆహ్లాద.. గాలికి మొహం మీద చెదురు, మదురుగా వాలిన శిరోజాలు, నాజూకైన చెక్కిళ్ళు.. చున్నీ భుజం మీద నుంచి జారి ఆమె చేతి మడతలో ఆగిపోయింది. కొండెక్కుతున్న కాంతి అకస్మాత్తుగా దేదీప్యమానంగా వెలిగినట్టు అతని పాలిపోయిన మొహంలో ఒక వింత కాంతి మెరిసింది. ఆ చెంపలు.. ఆ ముక్కు.. వాలిన కనురెప్పలు..కచ్చితంగా అదే రూపం.. జన్మ జన్మలకి మరచిపోని రూపం.. ఇంతకీ ఈమె ఎవరు? ఎందుకు ఇలా తనని వేటాడుతోంది?

తేజకి నీరసంగా అనిపించింది. లేవడానికి ప్రయత్నించాడు. చేతకాలేదు. "అమ్మా" అంటూ మూలిగాడు.. ఆహ్లాద చప్పున కదిలింది.. "సర్.. ఏం కావాలి మీకు? సారీ! కునుకు పట్టింది.." నొచ్చుకుంది.

అతను నీరసంగా తలగడ మీదకి వాలి, ఆమె మొహంలోకి సీరియస్ గా చూస్తూ అడిగాడు "నువ్వెందుకు ఇక్కడ ఉన్నావు?"

"అది.. అది.." ఆమె తడబడుతూ చెప్పింది.. "హాస్పిటల్ నుంచి మిమ్మల్ని డిశ్చార్జ్ చేసారు కదా! మిమ్మల్ని చూసుకోడానికి ఎవరూ లేరని నేను ఉండిపోయాను."

" నర్స్ ని పెట్టాల్సింది కదా! నేనిప్పుడే హాస్పిటల్ కి కాల్ చేస్తాను.. ఫోన్ నెంబర్ ఉందా నీ దగ్గర"

"లేదు.. వర్మగారు చెప్పారు నన్ను చూసుకోమని.."

"వర్మగారు ఎవరు?"

"మీ డాక్యుమెంటరీ చేసిన ఛానల్ ప్రొడ్యూసర్.."

"ఓ! " అతను కళ్ళు మూసుకున్నాడు.

"మీకేమన్నా కావాలా! జ్యూస్ తాగుతారా!"

అతను కళ్ళు తెరిచాడు.. ఆమె మొహంలోకి చూస్తూ అన్నాడు" నువ్వెవరు? "

ఆహ్లాద ఆశ్చర్యంగా చూసింది.. "నేను.. నా పేరు ఆహ్లాద.. మెడికో..మీ ఫాన్"

"నాకు చాలామంది ఫ్యాన్స్ ఉన్నారు.. వాళ్ళెవరూ నీలా నన్ను వెంటాడలేదు.. సేవలు కూడా చేయలేదు. నువ్వు ఎందుకు ఇవన్నీ చేస్తున్నావు.."

ఆహ్లాదకి భయం వేసింది.. అసలే అనారోగ్యంగా ఉన్న ఆయనకి ఇప్పుడు ఆ విషయాలు చెప్పడం ఎలా? మీకు జ్యూస్ తెస్తాను" అంటూ కుర్చీలో నుంచి లేవబోయింది. అతను చటుక్కున ఆమె చేయి పట్టుకుని ఆపాడు.. " చెప్పు ఎవరు నువ్వు?"

'సర్! ప్లీజ్ తరవాత మాట్లాడుకుందాం.. నేను చెప్తాను.. తప్పకుండా చెప్తాను.. కానీ ఇప్పుడు కాదు. మీ ఆరోగ్యం బాగాలేదు. ముందు మీరు కోలుకోండి ప్లీజ్." వణుకుతున్న స్వరంతో బతిమాలుతున్నట్టుగా అంది.

అతను నిస్సహాయంగా చూసాడు..” ఆహ్లాదా! నీకు అర్థం అవుతోందా! నిన్ను చూస్తున్న కొద్దీ నాకే తెలియని బాధ ఏదో గుండెల్ని తొలుచుకుంటూ బయటకి వస్తోంది. నిజం చెప్పు. నువ్వు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చావు?”

ఉన్నట్టుండి ఆహ్లాద వెక్కి, వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. “మీరు.. మీరు మా అమ్మని ఎప్పుడు కలిసారు? ఎలా కలిసారు? అమ్మకి, మీకు ఉన్న సంబంధం ఏమిటి? “

“అమ్మా!” “ కంపిస్తున్న స్వరంతో అన్నాడు.”ఎవరు మీ అమ్మ”

“ప్రియాంక “

“ప్రి.. ప్రియాంక మీ అమ్మనా! “ చివ్వున తలగడ మీద నుంచి తల కొంచెం పైకి ఎత్తి శరీరాన్ని కుడిపక్కకి వంచి లేవబోయి వెనక్కి పడిపోయాడు.

ఆహ్లాద కంగారుగా “ సర్! సర్” అంటూ ఆయన తల కింద చేయి పెట్టి తలగడ మీదకి జరిపి ఆయన గుండెల మీద చేయి పెట్టి మృదువుగా అంది..”ప్లీజ్ రిలాక్స్.. అంతా చెప్తాను.. ముందు మీరు కోలుకోండి.. మనం మాట్లాడుకుందాము.. వివరంగా మాట్లాడుకుందాము..”

అతను ఆమె వైపు చూసాడు. అతని కళ్ళల్లో నిండిన నీరు కనుకొలకుల నుంచి చెవుల పక్కగా జారిపోతోంది. వణుకుతున్న పెదాలతో “ప్రి..యాం క ఎక్కడుంది” అన్నాడు.

ఆహ్లాద పెదాలు బిగబట్టి దుఃఖం ఆపుకోడానికి విశ్వప్రయత్నం చేయసాగింది.

“చెప్పమ్మా .. ఎక్కడుంది? ఒక్కసారి.. ఒక్కసారి తీసుకుని రాగలవా! నా కోసం.. ఒక్కసారి..”

ఆహ్లాద రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి, వెక్కి ఏడుస్తూ “ అమ్మ ఈజ్ నో మోర్ “: అంది..

“నో” అతను శక్తి కొద్ది అరిచిన అరుపుకి గది గోడలు దద్దరిల్లాయి.. అతను పడుకున్న మంచం గిర్రున తిరిగిపోతున్నట్టు.. మంచంతో సహా తను ఎక్కడికో పాతాళ లోకంలోకి కూరుకుపోతున్నట్టు అవుతూ ఉండగా అతని రోదన పరిసరాల్లో ప్రతిధ్వనించింది.

డాక్టర్, వర్మ, తేజ మంచం దగ్గర నిలబడి ఉన్నారు. మేఘన అక్కడే ఓ మూల కూర్చుని మోకాళ్ళ మీద తలపెట్టుకుని వెక్కి, వెక్కి ఏడుస్తున్న ఆహ్లాదని ఓదారుస్తోంది.

"ఏడవకు ఆహ్లాదా! ఏమి కాదు ఆయనకి. He will be alright అన్నారు డాక్టర్ గారు. కొంచెం షాక్ లో ఉన్నారు అంతే.."

"నా వల్లనే... నా వల్లనే ఆయన అలా అయారు. నేను చెప్పకుండా ఉండాల్సింది ఆ వార్త.. ఐయాం ఏ స్టుపిడ్.. " కుడిచేయి అరచేత్తో నుదురు కొట్టుకోసాగింది.

"నువ్వు కావాలని చెప్పలేదుగా! ఆయన ఫోర్సు చేసారు కదా! వదిలేయ్.. అంతా సెట్ అవుతుంది. ఏడవకు.. కమాన్ లే. డాక్టర్ గారికి, వర్మ గారికి కాఫీ చేద్దాం రా" బలవంతంగా ఆమె చేయి పట్టుకుని లేపి, వాష్ బేసిన్ దగ్గరకు లాక్కెళ్ళి " మొహం కడుక్కో.. కాఫీ తాగితే కొంచెం రిలాక్స్ అవుతావు.." అంది.

ఆహ్లాద సన్నగా వెక్కిళ్ళు పెడుతూనే మొహం కడుక్కుంది.. ఇద్దరూ కలిసి కిచెన్ వైపు నడిచారు.

తేజకి ఇంజక్షన్ చేసి, " one hour తర్వాత తేరుకుంటారు.. డోంట్ వర్రీ " అంటూ సోఫా వైపు వచ్చాడు డాక్టర్. వర్మ ఆయనని అనుసరించాడు. మేఘన ట్రే లో కాఫీ కప్పులు తీసుకుని వచ్చి వాళ్లకి ఇచ్చింది. ఆమె వెనకే తల వంచుకుని నిలబడ్డ ఆహ్లాద వైపు చూస్తూ అన్నాడు డాక్టర్" ఏమి కాదమ్మా.. హి విల్ బి ఆల్ రైట్.. నువ్వు చాలా బాగా కేర్ తీసుకుంటున్నావు. "

ఆహ్లాద మాట్లాడలేదు..

'నువ్వు కాబోయే డాక్టర్. డాక్టర్స్ ఇంత సెన్సిటివ్ గా ఉండకూడదు..స్ట్రాంగ్ గా ఉండాలి. ఇంతకీ specialisation ఏమిటి?" అంటూ ఆమెని కబుర్లలో పెట్టాడు.

నెమ్మదిగా డాక్టర్ తో మాటల్లో పడిన ఆహ్లాదని చూసి నిశ్చింతగా నిట్టూర్చింది మేఘన.

అరగంట తరవాత ఆహ్లాదకి మరి కొన్ని జాగ్రత్తలు, కొన్ని ఊరటనిచ్చే మాటలు చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు. ఆహ్లాద తలుపులు వేసి బెడ్ దగ్గరగా వచ్చి ప్రశాంతంగా నిద్రపోతున్న తేజ వైపు కొన్ని క్షణాలు చూస్తూ నిలబడింది. రెండు చేతులూ జోడించి "సారీ సర్ " అని అస్పష్టంగా పలికి అక్కడి నుంచి హాల్లోకి వెళ్ళింది.

ఏమి తోచలేదు.. విశాలంగా ఉన్న ఇల్లు.. నిశ్శబ్దంగా ఉన్న పరిసరాలు.. ఫ్రెంచ్ విండో కర్టెన్ జరిపి రోడ్ వైపు చూసింది.. రద్దీగా ఉన్న రోడ్ మీద వేగంగా వెళ్తున్న వాహనాలు కాసేపు చూసి, కర్టెన్ సరిగా జరిపేసింది. గోడలకున్న పెయింటింగ్స్ ఒక్కొటే చూస్తూ బుక్స్ రాక్ దగ్గరకు నడిచింది.

వరసగా, రామాయణం, మహాభారతం, కౌటిల్యుడి అర్ధశాస్త్రం, విశ్వనాథవారి వేయి పడగలు.. కృష్ణశాస్త్రి కృష్ణపక్షం లో ప్రవాసము ఊర్వశి...ఎక్కువగా లేకున్నా ఉన్నవన్నీ చాలా విలువైన పుస్తకాలు. నెమ్మదిగా వేయిపడగలు తీసుకుంది.. దాని వెనకాల మరో వరస కనిపించింది. చాలా ఉన్నాయే అనుకుంటూ వెనక వరస నుంచి ఒక పుస్తకం తీసింది.. అది నవల కాదు..ముదురు నీలం రంగు ప్లాస్టిక్ కవర్ మీద డైరీ అని ఇంగ్లీష్ లో ఉంది. ఆమె కళ్ళు విచ్చుకున్న కమలాలు అయినాయి. డైరీ.. కచ్చితంగా ఇందులో ఆయన రహస్యాలు ఉంటాయి. ఆమె గుండె దడ, దడలాడింది. వణుకుతున్న వేళ్ళతో అట్ట తిప్పింది. చాలా పాత డైరీ.. కానీ కొత్తగానే ఉంది. వేయిపడగలు యథాస్థానంలో పెట్టి, డైరీ తీసుకుని సోఫాలో కూర్చుంది. కొన్ని పేజీలు ఖాళీగా ఉన్నాయి.. కొన్ని పేజీల్లో కొన్ని పక్షుల బొమ్మలు.. కొన్ని సముద్ర కెరటాలు..సూర్యోదయం, సూర్యాస్తమయం..రంగు పెన్సిల్స్తో వేసినవి. మరికొన్ని పేజీలు తిప్పింది. వంకర, టింకర అక్షరాలు.. ఆమె కళ్ళు ఆ అక్షరాల బారుల వెంట పరుగు పెట్టాయి.

“నాకేమీ తోచడం లేదు.. దిక్కుతోచకపోవడం అంటే ఇదేనా! చంద్రకాంత్గారి విశాలమైన బంగాళా, తోట, లక్ష్మిదేవిగారు, ఆజానుబాహువు చంద్రకాంత్ గారు, ఆయన కొడుకు, తోటమాలి, డ్రైవర్.. నాగది, పెయింటింగ్స్.. శత్రుఘ్న.. ఒకొక్క దృశ్యం కదిలిపోతోంది.. ముందుకి వెళ్తున్న రైల్లో వెనక్కి వెళ్తున్న దృశ్యాల్లా.. నాకు ఊహ తెలిసిన దగ్గర నుంచి నాకు గుర్తున్న నా జీవితంలో ఒక్కో మైలురాయి దాటిపోతున్నా. రైలు దిగి వెనక్కి వెళ్ళిపోవాలని అనిపిస్తోంది.. భయం వేస్తోంది.. చంద్రకాంత్ గారి మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఈ డైరీ నాకు ఆయనేగా ఇచ్చారు..”డైరీ రాసుకోడం అలవాటు చేసుకోరా.. తప్పులు లేకుండా రాయగలుగుతావు.. మంచి భాషకూడా అలవాటు అవుతుంది. చేతిరాత కుదురుకుంటుంది.. నువ్వు ఏ రోజు ఏం చేసావో ఇందులో రాసుకో.. నీ ఫీలింగ్స్, అనుభవాలు. జీవితం అంటే రేపు కథగా మారే నిన్నటి అనుభవం. ఆ కథే ఎన్నో పాఠాలు నేర్పుతుంది..” .

వెంటనే పెట్టెలో పెట్టుకున్న డైరీ తీసుకున్నాను. నా మనసులో అలజడి చేస్తున్న ఎన్నో భావాలు అక్షరాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాను. కానీ చేతి రాత కుదరడం లేదు. అవును నా నుదుటిరాత బాగుంటే కదా! నేను ఇంతవరకు ఎప్పుడూ ఒక పేజీకి మించి ఏమి రాయలేదు. ఇప్పుడు రాసే అవసరం వచ్చింది.. చంద్రకాంత్ గారు అన్నట్టు చెప్పుకోడానికి ఎవరూ లేకపోతే డైరీ నే ఒక ఆత్మీయుడిగా మారుతుంది. ఇప్పుడు ఇదే నాకు మిగిలింది..నాతొ వస్తోంది. అవును ఈ రోజు నుంచి డైరీ రాస్తాను.

ఈ పేజీలు నిండిపోయే దాకా రాస్తాను.. రైలు అలా కదిలిపోతూనే ఉంది. అందరూ నిద్రలు పోతున్నారు. నాకు మాత్రం నిద్ర రావడం లేదు.. ప్రయత్నిస్తున్నాను. “ఏ పని అయినా రాదు అని చేయడం మానకూడదు.. ప్రయత్నించాలి.” చంద్ర కాంత్ గారి మాటలు.. అలా వినిపిస్తూనే ఉన్నాయి.. రైలు శబ్దంలో, గాలి హోరులో, ప్రతి సవ్వడిలో.. నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాను.

“డైరీ చదువుతున్నావా! “ ఆహ్లాద ఉలిక్కిపడి లేచింది. డైరీ జారి కింద పడింది. ఆమె ఒంగి అది తీయబోతుంటే తేజ ఆమె భుజం పట్టుకుని ఆపి, సోఫాలో కూర్చోబెట్టి ఆమె పక్కన కూర్చున్నాడు.

“మీరు ఎందుకు లేచారు? కాఫీ తాగుతారా!” అడిగింది ఆహ్లాద. “తీసుకుని రా “

ఆమె వేగంగా కిచెన్ వైపు వెళ్ళింది.. కాఫీ కప్పుతో వచ్చేసరికి అతను డైరీ ఒళ్లో పెట్టుకుని సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకుని కూర్చున్నాడు.

“తీసుకోండి “ అంది ఆహ్లాద. కళ్ళు తెరిచి కాఫీ కప్పు అందుకుని “కూర్చో” అన్నాడు.

ఆమె బిడియంగా అతని పక్కనే కూర్చుంది. కాఫీ సిప్ చేస్తూ “ మీ అమ్మకీ, నాకు ఉన్న సంబంధం తెలుసుకోవాలని ఉంది కదూ నీకు. చెప్తాను. డైరీలో ఏమి లేదు.. నాకు రాయడం రాదు. ఏదో కొన్ని పేజీలు మాత్రం రాసాను.. కానీ నా హృదయం అనే డైరీ లో రాసుకున్నవి చాలా ఉన్నాయి. టివి ఛానల్ లో నా ఇంటర్వ్యూ కంటిన్యూ చేయగలనో లేదో! ప్రజలకి నా గురించి పూర్తిగా చెప్పగలనో లేదో! నీకు చెప్తాను.. అక్కడ ఆపిన కథ ఇక్కడ మొదలు పెడతాను. ఇది పూర్తి అయిలోగా నేను చనిపోతే నువ్వు ప్రపంచానికి చెప్పు.”

“అంతమాట అనకండి”

నవ్వాడు.. “చావు పుటకలు దైవాధీనాలు .. అనే డైలాగ్ ఒక సినిమాలో ఉంది.. ఆ సినిమా నువ్వు చూసి ఉండవులే. సరే! నా కథ కొనసాగిస్తున్నాను..”

ఆహ్లాద ఊపిరి బిగబట్టింది .. అతని స్వరం ఖంగ్ మంటూ మోగింది.

నిద్ర పట్టదేమో అనుకున్నా.. కానీ పట్టింది. సందడికి మెలకువ వచ్చింది. రైలు ఆగింది. జనం గోల, గోలగా దిగుతున్నారు. నేను నా పెట్టెలు తీసుకుని దిగాను.

ప్లాట్ ఫారం మీద అయోమయంగా నిలబడ్డాను. అందరూ ఎందుకో పరుగులు పెడుతున్నారు. ఎవరికోసం? ఎందుకోసం? అతనెవరో చెప్పాడు.. బయటకి వెళ్ళడానికి అటు వెళ్ళు.. చేత్తో చూపించి వెళ్ళిపోయాడు. అతను చెప్పినట్టు వెళ్ళాను.

నాకు తెలియని ప్రదేశం–అర్ధం కాని భాషలు.. రకరకాల మనుషులు. సికిందరాబాద్ స్టేషన్ ఇదే అన్నాడెవరో . నేను అడక్కుండానే చెప్తున్నారు బహుశా తెలివితక్కువ వెధవ అని అర్ధం చేసుకున్నారేమో! నవ్వొచ్చింది.

ఆటో స్టాండ్ సమీపంలో దిక్కులు చూస్తున్న నా దగ్గరకి చాలా మంది ఆటోవాలాలు వచ్చి " ఆటో.. ఆటో.. ఏడికి పోవాల? ఆటో కావాల్నా" అంటుంటే ఏం చెప్పాలో అర్ధం కాలేదు.

ఈ మహా నగరంలో ఉండే అర్హత ఉందా నాకు! ఇక్కడ చోటుందా? శంఖారావంలా వినిపించాయి చంద్రకాంత్ మాటలు.

"ఈ ప్రపంచం అందరిదీ . ఏ ఒక్క నేలా ఒక మతానికో, వర్గానికో, కులానికో, అధికారాలకో చెందింది కాదు. కొందరు స్వార్ధం కోసం చేసే అరాచాకాల్లో విడదీసి పాలించడం ఒకటి. దాన్ని మనమే ఎప్పటికప్పుడు ఖండించాలి.. అది పౌరులుగా మన ధర్మం అంతే!"

"విశాల విశ్వంలో నువ్వు ఎక్కడైనా బతకచ్చు. నిన్ను అడిగే హక్కు, అధికారం ఎవరికీ లేదు. నీ మీద నీకు మాత్రమే అధికారం ఉంటుంది. వెళ్ళు.. ఈ విశాల విశ్వం నీది.." స్ఫూర్తిమంతమైన చంద్రకాంత్ గారి మాటలు ఎప్పుడూ నాకు నూతనోత్తేజాన్ని కలిగిస్తాయి. ఇప్పుడూ అదే జరిగింది. అదే ఉత్సాహంతో అడుగులు ముందుకు వేసాను.

చంద్రకాంత్ గారు ఇచ్చిన విజిటింగ్ కార్డ్ ఆధారంగా ఆటో మాట్లాడుకుని అడ్రెస్ అతనికి చూపించాను.. " చలో సాబ్ మై లేకే జాతూం" అంటూ నా చేతిలో నుంచి పెట్టె తీసుకుని ఆటోలో పెట్టి " ఎక్కండి" అన్నాడు.

ఆ మహాపట్నం రోడ్ల మీద ఆటో రివ్వున పోతుంటే ఎక్కడి నుంచి ఎక్కడికి అనిపించింది.. అవును ఈ జీవితం ఎక్కడ ప్రారంభం అయింది? ఎక్కడకి సాగింది? ఇప్పుడు ఎక్కడికి సాగుతోంది? ఇన్ని ప్రయాణాలు, ఇన్ని మజిలీలు పద్దెనిమేళ్ళకే ఇంత ప్రయాణమా! ఇన్ని అనుభవాలా! ఆలోచిస్తుంటే బోలెడు ఆశ్చర్యం కలుగుతోంది.

ఆటో అతను హిందీలో ఏదో అడుగుతున్నాడు. నెమ్మదిగా చెప్పాను "నాకు హిందీ రాదు.. నీకు ఇచ్చిన అడ్రెస్కి నన్ను చేర్చు చాలు.."

ఒక్కసారి సైడ్ మిర్రర్ లోంచి నా  వైపు చూసి మౌనంగా ఉండిపోయాడు డ్రైవర్.

అరగంట తరవాత  సర్వోత్తమరావు గారింటి ముందు ఆగింది ఆటో.  "ఇదే బాబూ! నువ్వు  దిగాల్సిన ప్లేస్ దీన్ని ఆనంద్ నగర్ అంటారు" అన్నాడు డ్రైవర్.

నా  వాలకం చూడగానే అతనికి అర్థం అయిపోయినట్టుంది.. అతని స్వరంలో ఒక మెత్తదనం వినిపించింది నాకు. అతను అడిగిన డబ్బులు ఇచ్చి గేటు బయటే నిలబడిపోయాను.  మొహమాటంగా అనిపించింది లోపలకి వెళ్ళడానికి. మొక్కలకి నీళ్ళు పెడుతున్న వ్యక్తీ  నన్ను  చూసి "ఎవరు కావాలి" అని అడిగాడు.

"సర్వోత్తమరావుగారు" అన్నాను .

అతను లోపలికి వెళ్లి వెంటనే వచ్చి రా అంటూ  నా   చేతిలో  పెట్టె  తీసుకుని లోపలికి తీసుకు వెళ్ళాడు.

విశాలమైన హాల్లో , సోఫాలో కూర్చుని వార్తా పత్రిక చదువుకుంటున్న వ్యక్తిని చూపించి పెట్టె  ఓ పక్కకి పెట్టి వెళ్ళిపోయాడు.

"నమస్కారం  " అన్నాను.

ఆయన ఎంతో  ఆదరంగా అన్నారు "నువ్వు వస్తున్నావని చంద్ర చెప్పాడు. రా, రా... ప్రయాణం బాగా జరిగిందా! ఇల్లు సులభంగా కనుక్కున్నావా! వరసగా  ప్రశ్నలు అడుగుతూ  "అభీ" అని పిలిచాడు.

లోపలి నుంచి ఇరవై ఏళ్ల కుర్రాడు వచ్చాడు "ఏంటి డాడీ" అంటూ..

"ఈ కుర్రాడిని నీ రూమ్ కి తీసుకు వెళ్లి అతనికి ఏం కావాలో చూడు .. రెండు రోజులు మన దగ్గరే ఉంటాడు ఇతను టేక్ కేర్" అన్నాడు.

అభి నా వైపు  పరీక్షగా చూసి "సరే డాడీ " అని  రా అంటూ  పిలిచి లోపలికి వెళ్ళాడు.

" వెళ్ళు లోపలికి వెళ్లి స్నానం చేసి, ఫ్రెష్  అవు " అని చెప్పి పేపర్ లోకి తలదూర్చి మళ్ళీ తలెత్తి "  వాడు మా అబ్బాయి  నీ వయసే.. స్నేహంగా ఉంటాడు ఇబ్బందేం లేదు " అన్నారు సర్వోత్తమరావుగారు.

నేను  అభి వెనక నడిచాను .

అభి "నీ పేరేంటి" అడిగాడు.

చెప్పాను. " అదిగో బాత్ రూమ్...స్నానం చేసిరా బ్రేక్ ఫాస్ట్ చేద్దాం" అన్నాడు.

నేను స్నానం చేసి రాగానే డైనింగ్ హాల్లోకి వెళ్లేసరికి అక్కడ ఒక నలభై ఐదేళ్ళ స్త్రీ , పదహారేళ్ళ అమ్మాయి ఉన్నారు. సర్వోత్తమరావుగారు కూడా వచ్చారు.

" రావోయ్ ఈవిడ మా ఆవిడ... ఈ అమ్మాయి నా కూతురు కీర్తి. మేము నలుగురం..." అని భార్యకి చెప్పాడు.. "నేను చెప్పానే చంద్రకాంత్ దగ్గర్నుంచి ఒక కుర్రాడు వస్తాడని. ఇతనే.. పేరు మహా " అన్నాడు.

"రా ! కూర్చో" ఆవిడ ముక్తసరిగా అంది..

అభి తండ్రి పక్కన కుర్చీలో కూర్చుంటూ రా అంటూ నన్ను తన పక్క కుర్చీ దగ్గరకు ఆహ్వానించాడు. వేడి, వేడి పెసరట్లు, ఉప్మా పెట్టింది ఆవిడ.

"నువ్వు చిత్రకారుడివా" పెసరట్టు తుంచి నోట్లో పెట్టుకుంటూ అడిగాడు ఆయన.

నేను బొమ్మలు వేస్తాను అని చెప్పడానికి సిగ్గుగా ఉంది.. చదువులేని నీకు బొమ్మలేయడం వచ్చా అని అడుగుతారేమో అని భయం వేసింది. " ఏం చదువుకున్నావు" అని అడక్కుండా ఉంటె బాగుండు.. " నీ చిత్రకళ ఇంకా వృద్ధి చేసుకోవాలి అనుకుంటున్నావుట కదా! చూద్దాం. నాకు అలాంటి వాటిలో పెద్దగా అవగాహన లేదు.. నీకు ఒక చిన్న ఉద్యోగం మాత్రం ఇప్పించగలను చేస్తావా" అడిగాడు.

హమ్మయ్య.. తల ఊపాను.

" నీ డేట్ అఫ్ బర్త్ సర్టిఫికేట్ ఉందా?"

" లేదు.. బాబుగారు చెప్పారు నా వయసు పద్దెనిమిది అని".

ఆయన నొచ్చుకున్నారు. " సారీ..చంద్ర ఆల్రెడీ చెప్పాడు నేనే మర్చిపోయాను" అన్నారు.

" తప్పకుండా నీకు సాయం చేస్తాను. ఇవాల్టికి మా ఇంట్లో విశ్రాంతి తీసుకో. రేపు నిన్ను ఒక దగ్గరకు తీసుకుని వెళ్తాను డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ సంపాదిద్దాంలే ఎలాగోలా నువ్వేం దిగులుపడకు" అన్నారు.

ఆరోజు వాళ్ళింట్లో బాగానే గడిచింది. వాళ్ళ ఆతిధ్యంతో అప్పటి వరకూ ఉన్న బెరుకు పోయింది. ఆయన అన్నట్టు అభి చాలా స్నేహంగా మాట్లాడాడు. కీర్తి మాత్రం తన గదిలోంచి బయటకు రాలేదు.. ఆయన భార్య కూడా తన

విధి నిర్వర్తిస్తున్న దానిలా చాలా యాంత్రికంగా భోజన ఏర్పాట్లు చేసింది. మాటా, పలుకు లేదు. నేను ఎవరి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. చూడాలంటేనే భయంగా ఉంది. భోజనానికి తప్ప అభి గదిలో నుంచి బయటకు రాలేదు ఆ రోజంతా.

మర్నాడు సర్వోత్తమరావుగారు " ఇవాళ మనం బాలానగర్ వెళ్దాం" అంటూ కారులో బాలానగర్ తీసుకుని వెళ్ళారు . అక్కడ ఆయన తమ్ముడికి కెమికల్ ఫ్యాక్టరీ ఉంది. ఆయన పేరు గౌతమ్.

" ఏం చదువుకున్నావు" అని అడిగారు గౌతమ్ . మళ్ళీ పాతాళంలోకి క్రుంగి పోతున్న భావన.

సర్వత్తమరావు నా మొహంలో భావాలు చూసి అతనితో చెప్పాడు. " చదువుదేమి ఉంది లేరా! కుర్రాడు మంచి చిత్రకారుడు. అతనికి తగిన జాబ్ ఏదన్నా చెప్పు".

గౌతమ్ నవ్వాడు. " చిత్రకారుడికి నా దగ్గర ఉద్యోగం ఏం ఉంటుంది అన్నయ్యా! నా ఫ్రెండ్ ఒకడికి అడ్వర్టైజింగ్ కంపెనీ ఉంది. ఏవో బానర్స్, లోగోస్ అవీ తయారు చేస్తాడు. వాడికి బొమ్మలేసే వాళ్ళు కావాలిట. వాడితో మాట్లాడి రేపు చెప్తాలే" అని నాతో అన్నాడు. "చూడు బాబూ! మనకి గుప్పెడు మెతుకులు పెట్టేది చదువు ఒక్కటే.. కనీసం ప్రైవేటుగా నైనా చదువుకుని ఏదో ఒక సర్టిఫికేట్ సంపాదించుకో.. లేకపోతే వర్కర్గా తప్ప వేరే ఉద్యోగం రాదు.."

నాలో అదే వణుకు.. అదే జంకు.. అదే కృంగిపోతున్న భావన.. "మరీ అంతగా ఆ అబ్బాయిని భయపెట్టకురా. వాడి అదృష్టం బాగుంటే చిత్రకారుడిగా అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతాడేమో!" అన్నారు సర్వత్తమ రావుగారు.

"అఫ్కోర్సు నేను కాదనడం లేదు.. కానీ వేరే దేశం, వేరే ప్రాంతం వెళ్ళాల్సి వస్తే ముందు భాష రావాలి..కమ్యూనికేషన్ స్కిల్స్ కావాలి.. కాలం మారుతోంది. సర్టిఫికేట్లు ఉంటే చాలదు. అంతో, ఇంతో చదువుకోకపోతే ఎలా వస్తాయి ఉద్యోగాలు. నలుగురితో ఎలా మాట్లాడగలుగుతాడు.. సో చదువుకున్న విలువ చెప్పాలి మనం "అన్నారు గౌతమ్.

"చదువుకుంటాడు. ముందు వాడి కాళ్ళ మీద వాడు నిలబడితే చదువుకుంటాడు. ఏరా చదువుకుంటావా" అడిగాడు. అవునా, కాదా తెలియకుండా తలూపాను. .

"సరేలే రెండు రోజులాగి రా ఏదన్నా అవకాశం ఉంటే చెబుతాను" అన్నారు గౌతమ్.

నేను సర్వోత్తమరావుగారి వైపు చూసాను. ఆయన మొహంలో ఏదో మార్పు కనిపించింది.. అయిష్టత అంటారేమో! ఎందుకో నాకు ఆరాత్రి అర్థం అయింది. ఆయన భార్య స్వరం పెద్దగానే విన్పించింది.

" ఊరూ, పేరూ లేనివాడిని ఇలా ఇంట్లోకి రానిచ్చి నెత్తిన పెట్టుకోమని ఎలా చెప్తాడు మీ ఫ్రెండ్.. ఎవరినైనా నమ్మేలా ఉందా లోకం.. అందులో ఈ మహాపట్నం లో ఎవరెలాంటి వారో ఎవరికీ తెలుసు! నేను అడ్డమైన వాళ్లకి సేవలు చేయలేను.. వాడిని తెల్లారగానే పంపించేయండి"

"తెల్లారి ఎక్కడికన్నా తీసుకువెళ్ళి వేరే వసతి ఏర్పాటు చేస్తాలే అరవకు. చంద్రకి తెలిస్తే బాగుండదు" అన్నాడు బతిమాలుతూ.

"రేపు కచ్చితంగా పంపించేయండి. ఇంట్లోఎదిగిన ఆడపిల్ల ఉంది.. వీడెవడో మనకెందుకొచ్చిన తద్దినం" .

మరోసారి నేను పాతాళంలోకి కృంగిపోయాను.. ఇలా ఎన్నిసార్లు జరుగుతుందో.. నాకేం తెలుసు!

ఐదు రోజులు గడిచాయి. ఎలాంటి మార్పు లేదు.. తినడం, పడుకోడం.. ఆరోజు అభి కూడా విసుక్కున్నాడు " ఇంకా ఎన్నాళ్ళు డాడీ..నాకు ప్రైవసీ లేకుండా పోయింది".

నేను తిని కూర్చోడానికి వీళ్ళకి అతిధిని కాదుకదా! ఏదన్నా చేస్తే! ఏం చేయాలో తోచడం లేదు. ఆరోజు దేవుడు మొదటిసారి నా అవస్థ గమనించాడు. తోటమాలి మొక్కలకి నీళ్ళు పోస్తూ కింద జారిపడ్డాడు. అతన్ని లేపి ఆ రబ్బరు ట్యూబు నేను తీసుకున్నాను. కింద పడిన ఆకులన్నీ ఏరి శుభ్రం చేయడం, పురుగు పట్టిన చిక్కుడుపాదు,దొండపాదు శుభ్రం చేయడం ఇలాంటి చిన్న, చిన్న పనులు చేస్తూ ఉంటే నాకు మానసికంగా కొంత నిశ్చింత.. ఆవిడ మొహం లో కొంత తృప్తి.. ఆరోరోజు ఒక యాడ్ కంపెనీలో చిన్న ఉద్యోగం ఇప్పించారు గౌతమ్. లోగో డిజైనింగ్, బానర్స్ తయారు చేయడం. అందులో ఆర్టిస్ట్ కావాలని తీసుకున్నారు. గుణశేఖర్ అనే పాతికేళ్ళ యువకుడు ఆ కంపెనీలోనే ఐదేళ్లుగా పని చేస్తున్నాడు. అతని దగ్గర పని నేర్చుకోమన్నాడు యజమాని.

"సార్ ! ఏదన్నా హాస్టల్లో చేర్పిస్తారా నన్ను " అడిగాను .

సర్వోత్తమరావుగారు గుణశేఖర్ ని అడిగారు.." దగ్గరలో బాయ్స్ హాస్టల్ ఉందా బాబూ" అని.

"నేను ఒక్కడినే రూమ్ లో ఉంటాను సార్! నాతొ ఉండచ్చు " అన్నాడు గుణశేఖర్.

నేను అతని వైపు ఆశ్చర్యంగా చూసాను. అతను స్నేహంగా నవ్వాడు.

**అక్కడి నుంచి** ఇంటికి తీసుకుని వెళ్లి నా  సామానుతో సహా తిరిగి తీసుకుని వచ్చి గుణశేఖర్ ఉంటున్న రూమ్ దగ్గర దింపారు సర్వోత్తమ రావుగారు.

“జాగ్రత్తగా ఉండు. ఏదన్నా కావాలంటే  నా  ఫోన్ నెంబర్ ఉందిగా ఫోన్ చేయి. నీకేమన్నా డబ్బు కావాలా! “ అడిగారు ఆయన.

“వద్దండి.. ఉన్నాయి”  అన్నాను.

“సరే! అవసరం అయితే చెప్పు మొహమాటపడకు.”  అని నాకు చెప్పి.. ‘ఈ అబ్బాయికి అంతా కొత్త.. ఏమి తెలియదు.. జాగ్రత్తగా చూసుకో బాబూ ‘! అంటూ గుణశేఖర్ కి నన్ను అప్ప చెప్పారు.

“వర్రీ అవకండి సార్.! నేను చూసుకుంటా” అన్నాడు గుణశేఖర్. మా ఇద్దరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్ళిపోయారు ఆయన. అంతటితో  సర్వత్తమరావు గారితో అనుబంధం తీరిపోయింది నాకు.

గుణశేఖర్ నల్లగా, సన్నగా ఐదడుగుల నాలుగు అంగుళాలు ఉంటాడు. రింగులు తిరిగిన క్రాఫ్. ఎప్పుడూ పళ్ళతో సహా నోరంతా ఎర్రగా ఉంటుంది. కారణం పాన్ తెగ నములుతా అన్నాడు.

అప్పుడు నాకు పాన్ అంటే తెలియదు. గుణశేఖర్ వివరించడం కాదు, చూపించి, రుచి కూడా చూపించాడు. పాన్ రుచితో పాటు కొత్త జీవితం రుచి కూడా చూపించడం మొదలుపెట్టాడు.  ఆ జీవితం పేరే స్నేహం. నా  జీవితంలో స్నేహానికి నిర్వచనం తెలిపిన వాళ్ళు ఇద్దరు. ఒకరు గుణశేఖర్, మరొకరు సూర్య. సూర్య నా  జీవితంలోనే కాదు నాలో ఒక భాగం. కాదు, కాదు నేనే అతనిలో ఒక భాగం అయి మిగిలాను.

“అంటే!”  మహా మంత్రాలు చదువుతూ ధ్యానంలో ఉన్నట్టున్న అతను ఆహ్లాద ప్రశ్నకు కళ్ళు తెరిచి ఆమె వైపు చూసాడు.

సూటిగా, తన అంతరాంతరాల్లో ఉన్న భావాలను వెతుకుతున్నట్టు, స్కాన్ చేస్తున్నట్టు ఉన్న ఆ చూపులకి ఒక్క క్షణం బెదిరింది ఆహ్లాద. తడబడుతూ అంది “ మీకు పళ్ళరసం కానీ, పాలు కానీ తీసుకుని వస్తాను. బాగా అలసిపోయారు.”

అతను అదోరకంగా నవ్వాడు. “నిజమే ఆహ్లాదా! అలసిపోయాను. నాకు విశ్రాంతి కావాలి. ఒక్కసారి మీ అమ్మను పిలువు ఆహ్లాదా! అలసిన నా  మనసు, శరీరం సాంత్వన పొందాలంటే ఆమెని ఒక్కసారి, ఒకే ఒక్కసారి నేను చూడాలి.” అతని స్వరం వణికింది దుఃఖంతో.

ఆహ్లాద వస్తున్న దుఃఖం అదిమిపెడుతూ అక్కడి నుంచి లేచి వేగంగా వంట గదిలోకి వెళ్ళింది. పాలు మగ్ లో పోసి మైక్రో ఓవెన్ లో పెట్టింది. ప్రోటీన్ పౌడర్ అందులో కలిపి తీసుకుని వచ్చింది.

“పాలు తీసుకోండి” అంది.

“నాకు సేవలు చేయడానికి నువ్వు ఇక్కడ ఉండడం చాలా ఆశ్చర్యంగా ఉంది. నేనెవరిని? నీకు, నాకు ఏమిటి సంబంధం?”

“మీరు కొనసాగించబోయే కథలో తెలుస్తుంది సర్ మనకి ఉన్న అనుబంధం ఏమిటో. ఎందుకంటే అది ఇప్పుడు మీరు మాత్రమే చెప్పగలరు.”

అతను కొన్ని క్షణాలు ఆమెవైపే చూస్తూ ఉండిపోయాడు.

కళ్ళు  వాల్చుకుని మగ్ లో ఉన్న పాలలో తన ప్రతిబింబం వెతుక్కుంటున్నట్టు ఉండిపోయింది. అతను చూపులు తిప్పుకుని మగ్ అందుకుని “ ఇంకో కప్పు తీసుకునిరా. నీ సంగతి చూసుకోవా! నాకు ఇన్ని పాలు వద్దు. నువ్వు సగం తాగాలి వెళ్ళు? “ ఆజ్ఞాపిస్తున్నట్టుగా ఉన్న ఆ స్వరం ఆమెని మారుమాట్లాడకుండా వంట గదివైపు నడిపించింది.

ఖాళీ కప్పు తీసుకుని వచ్చి, తను సగం పోసుకుని మిగతాది అతనికి ఇచ్చింది.

పాలు సిప్ చేస్తూ అడిగాడు “నీకు కాలేజి లేదా”!

“లేదు నాలుగురోజులు హాలిడేస్ “

“ఎందుకు?”

“దసరా పండుగలు”

“అవునా!” ఆశ్చర్యంగా చూసాడు. “మెడికల్ కాలేజికి కూడా పండుగ సెలవులు ఇస్తే ఎలా?”

నవ్వింది. "పండక్కి ఊళ్ళకి వెళ్ళేవాళ్ళు ఉంటారు కదా! అందరూ లోకల్ వాళ్ళు ఉండరు. ఎంతో మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ గాంధీ మెడికల్ కాలేజీలో చదివేవాళ్ళు ఉన్నారు. అలాగే మా కాలేజ్ లో కూడా."

"నీకూ, ఆ అమ్మాయి పేరేంటి? టివి యాంకర్ " కళ్ళు మూసుకుని గుర్తుచేసుకుంటూ అడిగాడు.

"మేఘన"

"ఆమె ఎలా పరిచయం! ఇంతకు ముందే నీకు ఆమె తెలుసా!"

" లేదు, మీ ద్వారా అంటే మీరు ఆరోజు ఆర్ట్ ఎగ్జిబిషన్ లో కలిసారు కదా. అప్పుడు తను మీ ఇంటర్వ్యూ అడిగింది కదా! అలా నేనే పరిచయం చేసుకున్నాను. ఎందుకంటే నేను అడిగితె మీ కథ చెప్తారో లేదో, కనీసం వాళ్ళ ద్వారా తెలుసుకోవచ్చు అని ఆశ పడ్డాను."

అతను ఖాళీ మగ్ ఆమె చేతికిచ్చి తలగడ మీద వెల్లకిలా వాలి సన్నగా నిట్టూర్చాడు.

ఆమె వెళ్లి కప్పులు సింక్ లో వేసి వచ్చింది.

ఇద్దరి మధ్యా కొద్ది సేపు నిశ్శబ్దం గింగిర్లు కొట్టింది. ఫ్యాన్ గాలికి పల్చని పరదాలు సుతారంగా కదులుతున్నాయి. ఒక సస్పెన్స్ థ్రిల్లింగ్ కథ మధ్యలో ఆగిపోతే కలిగే ఉత్కంఠ కలిగింది ఆమెకి. త్వరగా చెబితే బాగుండు అనుకుంది. కంటిన్యూ చేయండి అనడానికి జంకు.. అందుకే కదులుతున్న తెరలవైపు చూస్తూ కూర్చుంది.

అతను ఆమె వైపుకి తిరిగి "నీకు నా కథ వింటుంటే బోర్ గా ఉందా !"

"లేదు, లేదు ఇంటరెస్టింగ్ గా ఉంది"

అతని పెదాల మీద సన్నని హాసరేఖ మెరిసి మాయమైంది.

నెమ్మదిగా ఆపేసిన కథ చెప్పడం ప్రారంభించాడు.

గుణశేఖర్ కి తండ్రి లేడు. తల్లి మాత్రమే ఉంది... ఆవిడ తెలంగాణలో ఒక పల్లెటూరిలో ఉంటుంది. ఒక ఎకరం పొలం ఉంది. అందులో ఏవో కూరగాయలు పండించుకుంటూ ఒక పెంకుటింట్లో ఉంటుంది. గుణశేఖర్ కూడా ఎక్కువగా చదువుకోలేదు. జీవనాధారం కోసం హైదరాబాద్ వచ్చి ఆ కంపెనీలో సెటిల్ అయాడు. అతనిలో ఉన్న ప్రత్యేకత ఏ పని అయినా ఒకసారి చెప్తే చేసేస్తాడు. ఇరవై నాలుగు గంటలు కష్టపడతాడు. నెల తిరిగేసరికి చేతిలో పడిన

ఐదారు వేలలో సగం తల్లికి ఇస్తాడు. మిగతా సగం తో తను బతుకుతాడు. తనే వంట చేస్తాడు. బయట కొనుక్కుని తినడు. రెండు జతల బట్టలు, ఒక నవారు మంచం, కొంచెం స్టీలు సామాను. ఒక కిరోసిన్ స్టవ్ ఇది అతని ఆస్తి. గది పరవాలేదు పెద్దదే ఇద్దరికి సరిపోతుంది. అతనికి ఉన్న అలవాటు పాన్ తినడం.

“అది చెడ్డ అలవాటో, మంచి అలవాటో నాకు తెలియదు. ఈ ఊరు వచ్చిన కొత్తల్లో నా దగ్గర డబ్బులు లేవు. ఆకలి తీరే మార్గం కనిపించలేదు. ఎప్పుడూ ఈ సందు చివర పాన్ షాప్ దగ్గరే చెట్టు కింద రాయి మీద కూర్చునే వాడిని. అప్పుడే పాన్ షాప్ ఓనర్ గంగారాం తో పరిచయం అయింది. మా స్నేహానికి స్వాగతం చెబుతూ ఒక మీఠా పాన్ ఇచ్చాడు. అప్పటి నుంచి పాన్ నాకు ఆహారంగా మారింది. నెమ్మదిగా పాన్ తయారుచేయడం అతని దగ్గర నేర్చుకున్నాను. అతనికి చిన్న, చిన్న సహాయం చేస్తూ ఉంటే రూపాయి, రెండు రూపాయిలు ఇస్తూ ఉండేవాడు. ఫ్రీ గా చాయ్ ఇప్పించేవాడు. అలా అలవాటు అయింది” తన పాన్ అలవాటు ఎలా అయింది చెప్పి అన్నాడు “ నువ్వు చిన్నవాడివి చదువుకోవాలి పాన్ తింటే నాలుక మొద్దుబారిపోయి చదువు రాదు అంటారు పెద్దవాళ్ళు. నువ్వు సరదాగా తింటే అప్పుడప్పుడు తిను కానీ నాలాగా అలవాటు చేసుకోకు. ఇది కూడా డ్రింక్ లాంటిదే. ఒకసారి అలవాటు అయితే వ్యసనంలా మారుతుంది. “ అన్నాడు.

నేను నవ్వి “అసలు నాకు దీని రుచి తెలియదు. దీని సంగతి తెలియదు. నువ్వు ఇచ్చావు కాబట్టి ఇదేదో తినే పదార్ధం అనుకుని తిన్నాను. రుచి బాగుంది. అలా అని పదే, పదే ఆ రుచే కావాలి అనుకునే తత్త్వం కాదు నాది. ఏది దొరికితే అది తిని బతకడం అలవాటు అయిన వాడిని.. నాకంటూ కోరికలు లేవు, ఉండవు.” అన్నాను.

నా వైపు తదేకంగా చూసాడు. ఆచూపుల్లో జాలి కనిపించింది. నేను మొహం తిప్పుకున్నాను. ఇలాంటి జాలి చూపులు ఇక ముందు నేను ఎన్ని ఎదుర్కోవాలో అనిపించింది.

గుణశేఖర్ స్వరం మెల్లిగా వినిపించింది. “నీకు ఆ సార్ ఏమవుతాడు “ అని అడిగాడు సర్వోత్తమ రావుగారిని ఉద్దేశించి.

తల అడ్డంగా ఊపాను “ఏమి కారు.. నన్ను పెంచిన చంద్రకాంత్ గారికి స్నేహితులు”

“చంద్రకాంత్ ఎవరు? మీ అమ్మా, నాన్నా ఏం చేస్తారు?”

అతని మొహం లోకి సూటిగా చూసాను. ఆ కళ్ళల్లో సానుభూతితో పాటు ఆప్యాయత కూడా కనిపించింది. “ నాకెవరూ లేరు” అన్నాను.

"అంటే నువ్వు అనాథవా"

నా పెదాలు వణికాయి. కళ్ళు నీళ్ళతో నిండాయి. "ఇంకెప్పుడూ ఆ మాట అనకు శేఖర్" అన్నాను.

"ఓ! సారీ బ్రదర్. వెరీ సారీ " అన్నాడు నా చేతిమీద చేయి వేసి.

"సారీ ఎందుకు? నా కథ నీకు చెప్పాలి. చెప్పకపోతే ఎలా? మనిద్దరం కలిసి ఎంతకాలం ప్రయాణం చేయాలో కదా! ఒకరి గురించి ఒకరు తెలుసుకోవాలి " అంటూ కొద్ది క్షణాలు మాటలు కూడదీసుకోడానికి ఆగి, నా కథ చెప్పడం మొదలు పెట్టాను..

నా గురించి తెలుసుకున్న గుణశేఖర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

" ఇంత చిన్నవాడివి ఎన్ని కష్టాలు పడ్డావు? ఆయన ఎవరో నిజంగా దేవుడు. ఆయనే నిన్ను ఆదుకోకపోయి ఉంటే నువ్వు ఫుట్ పాత్ మీద బతికేవాడివి. పోనీలే దేవుడు మంచే చేసాడు. ఇక నుంచి నీకు నా దగ్గర ఏమి ఇబ్బంది ఉండదు. నాతొ ఫ్రీగా ఉండు. నేను నీ అన్నని అనుకో" అన్నాడు.

అప్పటి నుంచీ నేను గుణశేఖర్ని అన్నయ్యా అని పిలవడం మొదలు పెట్టాను.

అప్పుడే పెట్టె తెరిచి నేను వేసిన చిత్రాలన్నీ చూపించాను. అవి చూసి నోరు వెళ్ళ బెట్టాడు గుణశేఖర్.

" నీ దగ్గర ఎంత మంచి ఆర్ట్ ఉంది. ఈ ఉద్యోగమా నీకు. నువ్వు అసలు ఇక్కడ ఉండాల్సిన వాడివి కాదు. నేను పెద్ద, పెద్ద ఆర్టిస్టుల గురించి విన్నాను. వాళ్ళంతా కార్లలో తిరుగుతారు తెలుసా!" అన్నాడు గుణశేఖర్ నేను వేసిన బొమ్మలన్నీ చూసి .

నాకు నవ్వొచ్చింది. " నేను కూడా కారులోనే తిరిగాను. నన్ను పేవ్ మెంట్ మీదకి తెచ్చింది కారే... పేవ్మెంట్ మీద నుంచి పెద్ద బంగళాలోకి తీసుకువెళ్ళింది కారే.. నీతో స్నేహం అవడానికి కూడా ఆ కారే కారణం" అన్నాను.

"అట్ల కాదులే. అట్లా అయితే నేను చాలా కార్లలో తిరిగాను. నువ్వు ఈ పెయింటింగ్స్ అమ్ముతావా! మస్తు సంపాదించుకోవచ్చుకదా " అడిగాడు.

" లేదు అమ్మను. ఇవి ఒక్కొక్కటే ఉన్నాయి. నేర్చుకోడం మొదలుపెట్టాక వేసినవి ఇవి. ట్రైనింగ్ లో ఎలా వేయాలో, ఎలా రంగులు ఎన్నుకోవాలో వివరంగా చెబుతుంటే వేసాను . ఇవి చూసి నన్ను పరీక్షలో పాస్ చేసారు మా గురువు. ఈ బతుకు ప్రయాణంలో నేను ఎక్కడికి చేరతానో, ఎంత దూరం ప్రయాణం చేస్తానో నాకు తెలియదు. ఏదో

ఒకరోజు అసంపూర్తి చిత్రంలా ఈ జీవితం ముగిసిపోతే ఈ అనామకుడి గురించి లోకం కొంతసేపన్నా తల్చుకోడానికి ఈ చిత్రాలు పదిలంగా దాచిపెడతాను .”

గుణశేఖర్ నా వైపు చూస్తున్న చూపుల్లో ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సమాధానాలు .. ఇంకా ఎన్నో సందేహాలు. బహుశా నేను వేదాంతం మాట్లాడి ఉంటాను అర్థం కాలేదేమో అనుకుంటూ అన్నీ తిరిగి పెట్టెలో పెట్టేసి శేఖర్ పక్కన కూర్చుని “అన్నయ్యా! ఎప్పటికైనా నేను నువ్వన్నట్టు పెద్ద ఆర్టిస్టుని అవాలి. రాష్ట్ర స్థాయిలో , జాతీయ స్థాయిలో నా చిత్రాలు ప్రదర్శింపబడాలి. ఇది నా కోరిక కాదు. నన్ను ఎనిమిదేళ్లపాటు పెంచి, నన్ను మనిషిని చేసిన సార్ ఎస్.పి చంద్రకాంత్ గారిది. ఆయన కోరిక నేను నెరవేర్చాలి. నా కళ నన్ను చాలా ఎత్తుకి తీసుకుని వెళ్ళాలి అనేది ఆయన కల.. ఆ కల నెరవేర్చాల్సిన బాధ్యత నాది. అన్నా! నాకో సాయం చేస్తావా!” భావోద్వేగంతో నాకు హటాత్తుగా గొంతు పూడుకుపోయినట్టు మాటలు ఆగిపోయాయి. వస్తున్న దుఃఖం అణచుకుంటూ గుణశేఖర్ చేతులు పట్టుకుని అడిగాను. నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ

“ ఏంటి ఏం చేయాలి? “ అడిగాడు గుణశేఖర్.

“ నాకు ఇంకా కొత్త, కొత్త రకాల ఆర్ట్ నేర్పే ఆర్టిస్ట్ ఎవరన్నా ఉంటె చెప్పు. ఫీజు ఇస్తాను. నాదగ్గర కొంత డబ్బుంది. కావాలంటే అందుకోసం నేను ఇంకా కష్టపడతా. రాత్రిళ్ళు కూడా ఏదన్నా పని ఉంటే చేస్తా. నేను ఆర్ట్ బాగా నేర్చుకోవాలి.” ఉద్విగ్నంగా అన్నాను .

“అరె! అంత ఎమోషనల్ అవకు. ట్రై చేద్దాం నాకు మాత్రం పెద్ద వాళ్ళతో పరిచయం ఉంటుందా! మన సార్ ని అడుగుదాం . ఆయనకి తెలుస్తారు సరేనా!”

నాకు ఎందుకో అప్రయత్నంగా దుఃఖం వచ్చింది. ఏడుస్తున్న నన్ను “ఏడవకు.. ప్లీజ్ ఏడవకు” అంటూ ఓదార్చాడు గుణశేఖర్. చాలా సేపటికి తేరుకున్నాను.

గుణశేఖర్ సిఫారసు తో అతను పని చేస్తున్న కంపెనీ యజమాని ద్వారా ఒక ఆర్టిస్ట్ తో పరిచయం ఏర్పడిందినాకు .

అతని పేరు సూర్య. అతను ఒక వారపత్రికలో పని చేస్తున్నాడు. పత్రికలో ప్రచురించే కథలకి, నవలలకి బొమ్మలు వేస్తాడు. పత్రిక అట్ట మీద కూడా అతను వేసిన బొమ్మలే. ఎంతో అందమైన అమ్మాయిలు రక,రకాల భంగిమల్లో. అవన్నీ చూపిస్తుంటే నాలో తెలీని ఆనందం కలిగింది. ఇలాంటి బొమ్మలు నేనూ వేయాలి స్థిరంగా అనుకున్నాను..

మరికొన్ని అందమైన అమ్మాయిల బొమ్మలు చూపిస్తూ చెప్పసాగాడు సూర్య. "ఇవి ఎవరు వేశారో చెప్పగలవా! "

తెలియదు అన్నట్టు చూసాను.

"ఇవి బాపుగారి బొమ్మలు. బాపు గారంటే చాలా గొప్ప ఆర్టిస్ట్. సినిమా దర్శకుడు కూడా. తన సినిమాలకి ఇలా బొమ్మలతోటే దర్శకత్వం చేయడం కానీ, స్క్రీన్ ప్లే కానీ ప్లాన్ చేసుకుంటాడు ఆయన. బాపు బొమ్మ అంటే అందమైన అమ్మాయి. అందమైన ప్రతి అమ్మాయి బాపు బొమ్మే. బాపు అలాగే ఫేమస్ అయారు. బాపు తరవాత చంద్ర. చాలా గొప్ప ఆర్టిస్ట్ లు వీళ్ళు. నాలాగే చంద్ర కూడా నవలలకు కవర్ పేజీలు వేస్తాడు.

వడ్డాది పాపయ్య తెలుసా! ఈయన వేసిన ఊర్వశి బొమ్మ ఎంతో ఫేమస్. కొంతకాలం ఒక పత్రిక వచ్చేది అందులో ఈయన బొమ్మలేకుండా ఉండేది కాదు. ఈయన రవివర్మ. దేవుడు, దేవత ఎలా ఉంటారో మనకి తెలుసా.. తెలియదు కానీ ఈయనకి తెలుసు. అందుకే ఈయన చిత్రించిన బొమ్మలనే రాముడు, కృష్ణుడు, సరస్వతి, మహాలక్ష్మి అని భావించి పూజిస్తాము. వీళ్ళంతా ఒక ప్రయోజనం కోసం పుట్టారు. ఆ ప్రయోజనం పేరే కళ.. ఆ కళని ఒక ధ్యానంలా సాధన చేసి ప్రపంచ వ్యాప్తంగా భారతీయ కళకి ఒక స్థానం కల్పించారు. ఇంకా పెద్ద, పెద్ద కళాకారులు ఇంకా చాలా మంది ఉన్నారు. వారందరి గురించి నీకు తరవాత చెప్తాను. నువ్వు కూడా ఇంత బాగా వేసేలాగా తయారు చేస్తాను. మరి నాకు నా ఫీజు ఇవ్వగలవా" అడిగాడు సూర్య.

"ఎంతండి " అప్పటికప్పుడు అన్నీ నేర్చేసుకోవాలి అన్నట్టు ఉద్విగ్నంగా అడిగాను.

నవ్వుతూ "లక్ష " అన్నాడు సూర్య.

ఆ సంఖ్య వినగానే గుండె ఆగినంత పనైంది. లక్షా! ఒకటి పక్కన ఎన్ని సున్నాలుంటాయో కూడా నాకు తెలియదు. లక్ష ఎలా ఇస్తాను? వెంటనే గుర్తొచ్చింది. చంద్రకాంత్ గారు ఇచ్చిన డబ్బు ఉంది. అది ఇచ్చేయచ్చు. కానీ ఉన్న డబ్బులు మొత్తం అతనికి ఇచ్చేస్తే బతకడం ఎలా? సూర్యవైపు చూసాను. అతని కళ్ళల్లో ఒక అల్లరి నవ్వు కనిపిస్తోంది. ఇది ఎగతాళా! నా పేదరికాన్ని, నా నిస్సహాయతని ఎగతాళి చేస్తున్నాడా! నాలో ఆ క్షణం ఒక పంతం అనేది ఓ సుడిగాలిలా ప్రవేశించింది. ఇస్తాను. ఆ డబ్బు శిక్షణ కి ఖర్చు చేస్తూ, ఇక్కడ ఇచ్చిన జీతంతో బతకలేనా అనిపించింది.

"ఇస్తా" అన్నాను.

సూర్య అదే చిరునవ్వుతో గుణ శేఖర్ వైపు చూసాడు.

"అంత డబ్బు ఇస్తావా ఎక్కడిది నీకు " ఆశ్చర్యంగా అడిగాడు గుణశేఖర్..

"అయ్యగారు  నా పేరున బ్యాంక్ లో కొంత డబ్బు వేసారు. బహుశా లక్ష ఉండచ్చు. ఆ డబ్బుతో నేర్చుకుంటాను. ఇంతకన్నా విలువ వేరే  ఉందని నేను అనుకోను" అన్నాను  ధృఢమైన స్వరంతో.

సూర్య గట్టిగా నవ్వేశాడు.

"ఆర్ట్ నేర్చుకోవాలన్న ఆసక్తి  నీలో ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో లక్ష రూపాయలు అన్నాను కానీ,  నిజంగా నీ దగ్గర డబ్బు తీసుకుంటానా మహా!  నీ  దగ్గర ఉన్న డబ్బంతా సునాయాసంగా ఇవ్వడానికి సిద్ధపడిన  నీ అంకిత భావం నన్ను  ముగ్దుడిని చేసింది.  నీకు తప్పకుండా నేర్పిస్తా.. ఫ్రీగా " ఫ్రీగా అన్న పదం ఒత్తి పలుకుతూ  అన్నాడు సూర్య.

నా మీద ఇంత నమ్మకమా! నేను నిజంగా గొప్ప కళాకారుడిని అవుతానని ఇతనికి ఎలా తెలుసు! తను ఉచితంగా విద్య నేర్పిస్తే ఆ విద్యకి నేను న్యాయం చేయగలనా!  "నిజంగా ఫ్రీగా నేర్పిస్తారా!" అడిగాను నమ్మలేని వాడిలా.

"  రేపు నువ్వు  పేరు, ప్రతిష్టలు సంపాదించుకుని ఒక కళాకారుడిగా జీవించడం మొదలు పెట్టిన నాడు నాకు లభించే తృప్తి, ఆనందం ముందు లక్ష ఏపాటి! " అన్నాడు నా భుజం మీద చేయిసి ఆత్మీయంగా దగ్గరకు తీసుకుని.

ప్రేమంటే ఏమిటి?  అనే ప్రశ్న వస్తే ప్రేమంటే ఒక స్పర్శ అని చెప్పగలను.

ఆ క్షణం నుంచి నన్ను తన ఆత్మీయ శిష్యుడిగా   చేసుకున్నాడు సూర్య.

ఆ విధంగా నా  జీవితంలో ఇంకో అధ్యాయం మొదలైంది. యాడ్ కంపెనీలో డిజైనర్గా పని చేస్తూ, గుణశేఖర్కి అన్ని విధాలుగా తోడ్పాటుగా ఉంటూ, సాయంకాలాలు కంపెనీ నుంచి ఆలస్యంగా వచ్చినా సూర్య దగ్గరకు వెళ్లి  నా కళను మెరుగుపెట్టుకోడానికి సాధన మొదలుపెట్టాను సూర్య శిక్షణలో .

" ముందు ఇసకలో, తరవాత బొగ్గుతో , ఆ తరవాత పెన్సిల్ తో నువ్వు ఇప్పటివరకు వేసినవి ఇవి అవునా! " అడిగాడు సూర్య.

" ఒకసారి వాటర్ కలర్స్ తో గాంధి గారి బొమ్మ వేశాను.  అది ఒక విదేశీయుడు కొనుక్కున్నాడు."

" ఓ! గ్రేట్! నువ్వు మామూలు కళాకారుడివి కావనమాట.  సరే నాకు తెలిసినవన్నీ నేర్పిస్తాను.  రెండేళ్ళుపోయాక నాకన్నా పెద్ద ఆర్టిస్ట్ అవుతావు " అంటూ పెద్ద, పెద్ద ఆల్బమ్స్ బయటకు తీసాడు సూర్య.

" ఇది నా మొదటి చిత్రం... ట్రేస్ పేపర్ మీద గీసి తరవాత దాని మీద దిద్దాను.. తరవాత కలర్ పెన్సిల్స్ వాడి రంగులేసాను. గడ్డిని కలర్ పెన్సిల్ తో ఇంత నాచురల్ గా గీసినందుకు నా గురువు వాటర్ కలర్స్ బాక్స్ బహుమతిగా ఇచ్చాడు. ఆ తరవాత మెల్లగా వాటర్ కలర్స్ ఉపయోగించడం నేర్చుకున్నాను. ఇదిగో వాటర్ కలర్స్ ఉపయోగించి వేసాను.."

చుట్టూ అర్ధ చంద్రాకారంలో కొండలు... కొండల వెనుక అస్తమిస్తున్న సూర్యుడు, కింద పరవళ్ళు తొక్కుతున్న నది, నది ఒడ్డున కొబ్బరిచెట్లు.. ప్రకృతి సౌందర్యానికి పట్టుచీర కట్టినట్టు ఉంది..

" ఇవి ఆయిల్ పెయింటింగ్స్,"

తామరపూవు మీద కూర్చున్న లక్ష్మి దేవి, ఆమె పాదాల దగ్గర రెండు ఏనుగులు.. ముదురు నీలం జరీ అంచు పట్టు చీర, ఎరుపు రంగు జాకెట్టు, మెడలో పెద్ద హారాలు, ఒక చేతిలో కలువ, మరో చేతిలో నుంచి జారుతున్న నాణాలు.

"ఎంతో బాగున్నాయి సూర్యగారూ " మనస్ఫూర్తిగా అన్నాడు తేజ.

"అంతా ఆ అమ్మవారి దయ. వీటికి నాకు చాలా బహుమతులు వచ్చాయి. ఇవి చూసే నాకీ ఉద్యోగం కూడా వచ్చింది. కానీ, బతకడానికి ఇది సరిపోదు . నేను నేర్చుకోవలసింది ఇంకా చాలా ఉంది. కానీ నేర్చుకోవాలంటే కావాల్సింది ఆసక్తి మాత్రమే కాదు, ఆర్ధిక బలం కూడా ఉండాలి. " నిట్టూర్చాడు.

ఆ మాటలు అంటున్నప్పుడు సూర్య మొహంలో ఒక విషాదం కనిపించింది. ఈ ప్రపంచంలో నేనే కాదు.. చాలా మంది ఉన్నారు దురదృష్టవంతులు అనుకున్నాను . కాకపోతే ఒక్కోరిది ఒక్కో గాధ.

" సూర్యాగారూ! నేను మీకు ఫీజు ఇస్తాను ప్లీజ్ " అన్నాను .

సూర్య నవ్వాడు. " తప్పకుండా తీసుకుంటాను. ముందు కోర్సు పూర్తీ కానీ " అన్నాడు.

"అలాకాదు.. ఉచితంగా నేర్చుకునే విద్య ఒంట పట్టదు అన్నారు మా చంద్రకాంత్ గారు.."

"ఉచితంగా నేర్పనులే తేజా! ఇద్దరం కలిసి మోడరన్ ఆర్ట్ నేర్చుకుందాం.. దానికి కావలసిన ఖర్చునువ్వు చూసుకుందువుగాని" అన్నాడు సూర్య.

"మోడరన్ ఆర్టా ! అంటే!"

సూర్య నవ్వి చెప్పడం మొదలుపెట్టాడు. “సంప్రదాయ విలువలతో కూడిన చరిత్రను తిరస్కరించి నూతన విధానాలను అవలంబిస్తూ కొత్త, కొత్త సంప్రదాయాలకు ఆహ్వానం పలికేదే ఆధునాతన జీవన విధానం..అలాగే ఇప్పుడు రవివర్మ చిత్రాల్లో మన  సంస్కృతీ , సంప్రదాయాలు, ప్రతిబింబిస్తూ ఉంటాయి కదా.. దీనికి పూర్తిగా విరుద్ధంగా రెండు రకాల భావప్రకటనలనుకొన్ని రేఖల ద్వారా ఆరేఖలు కూడా సవ్యదిశలో కాక గజిబిజిగా గీసి, కొన్ని ముదురు రంగులతో భావాన్ని వ్యక్తం చేసేది మోడరన్ ఆర్ట్. ఉదాహరణకి ఈ రెండు బొమ్మలు చూడు.  రెండూ స్త్రీ మూర్తులవే కానీ తేడా ఉంది కనిపెట్టావా! ”

“అవును “ అన్నాను.  జీవం ఉట్టిపడుతూ, అందంగా ఉన్న స్త్రీలు ఒకటి, అస్పష్టంగా కేవలం గజి,బిజీ గీతాలతో ఉన్న స్త్రీల చిత్రాలు ఒకటి.  రెండు చిత్రాలూ బాగున్నాయి.. కానీ ఏది  గొప్ప చిత్రమో తెలుసుకునే పరిజ్ఞానం నాకు లేదు.! సూర్య వైపు ప్రశ్నార్థకంగా చూసాను.

“ క్లాసులు ప్రారంభించాక ఇంకా వివరంగా చెప్తాను. ఇప్పుడు చెప్పినా నీకు అర్థం చేసుకోడం కష్టం అవుతుంది. ఇది చూడు. “  మరికొన్ని బొమ్మలు తీసి, ఒక్కోటి చూపిస్తూ చెప్పసాగాడు.”  నీలాగే నేను పుట్టుకతో ఆర్టిస్ట్ ని కాను.. శిక్షణఅనే ఉలితో చెక్కబడిన శిల్పాన్ని మహా ! నేను పెన్సిల్ తో  మొట్టమొదటి వేసిన బొమ్మ ఇది“

నెత్తిమీద తాటాకు బుట్ట, గోచీ పోసి కట్టిన గళ్ళ చీర మోకాళ్ళ పైకి ఉంది. కాళ్ళకు కడియాలు, చేతుల నిండుగా గాజులు, కళ్ళనిండా కాటుక, సిగలో పూలు, మెడలో రక,రకాల పూసల దండలు, ఎంతో అందంగా ఉన్న గ్రామీణ యువతి, ఆమె పాదాల కింద ఆకుపచ్చని గడ్డి మెత్తటి తివాచీలా పరచినట్టు ఉంది.

“ చాలా బాగా వేసారు” అన్నాను.

“ నా పేరు సూర్య తేజ. నీకు సూర్యా అని పిలవాలి అనిపిస్తే అలా పిలువు. లేదంటే తేజా అను. అన్దీలు, గిన్దీలు జాన్తా నయి. నేను అసలు , సిసలైన తెలంగాణా బిడ్డను. మాకు గిసొంటి కృత్రిమ మర్యాదలు నచ్చవు. గొంతు ఎత్తి హాయిగా తేజా అని పిలువు “ అన్నాడు సూర్య.

నేను నెమ్మదిగా తేజా, తేజా అని గోణిగాను. “ అరె గట్టిగా పిలువు భాయ్” అన్నాడు సూర్య గట్టిగా.

అతను అలా అనడంలో ఒక దగ్గరితనం, ఆత్మీయత నా మనసు తొలకరి జల్లులకు తడిసిన నేలమ్మలా పరవశించింది.

సూర్య కూర్చున్న దగ్గర నుంచి లేచి చెప్పులు వేసుకుంటూ ‘ ఇప్పుడే వస్తా నువ్వు కూర్చో’ అంటూ బయటకి వేగంగా వెళ్ళిపోయాడు. నన్ను ఒక్కడినీ అలా వదిలేసి వెళ్ళడంతో బిత్తరపోయాను. ఎంత నమ్మకం నా మీద అనిపించింది. కానీ అతని గది పరికించి చూస్తే “ఇందులో ఏముందని నన్ను శంకించడానికి అనుకున్నాను. ఒకే గది, సగం గోడ అవతల వంటగదిలా ఒక గట్టు, ఒక పంపు, పంపు చుట్టూ సిమెంట్ తో అడ్డుగా గట్టు కట్టారు. ఖాళీగా ఉన్న ప్రదేశంలో అంట్లు గిన్నెలు తోముకోవచ్చు. గోడల నిండా అతను వేసిన పెయింటింగ్స్ ఫ్రేమ్ కట్టి తగిలించి ఉన్నాయి. అక్కడక్కడా గోడల మీద పెయింట్ మరకలు..ఒక టేబుల్, రెండు కుర్చీలు. ఆ టేబుల్ మీద కూడా పెయింట్ మరకలు. కాకపోతే గుణశేఖర్ రూమ్ కన్నా కొంచెం పెద్దది.

నేను మొత్తం పరికించి చూస్తూ ఉండగానే వచ్చాడు సూర్య.

ఒక కవర్లో ఒక బాటిల్, పచ్చి మిరపకాయ బజ్జీలు, పకోడీలు. కవర్ టేబుల్ మీద పెట్టి గాజు గ్లాసులు తెచ్చాడు అలమర లో నుంచి. కుర్చీ టేబుల్ దగ్గరకు లాక్కుని కూర్చున్నాడు. బాటిల్ ఓపెన్ చేసి, అందులో ఉన్న ద్రవం రెండు గ్లాసుల్లో సగం వరకు పోసాడు. ఒక గ్లాసు నాకు అందిస్తూ “కమాన్. ఛీర్స్ “ అన్నాడు.

“ఏంటిది? “ గ్లాసు నా దగ్గరకి రాగానే గుప్పున కొట్టిన వాసనకి ముక్కు మూసుకుంటూ అడిగాను.

గట్టిగా నవ్వాడు. “నువ్వింకా లైఫ్ స్టార్ట్ చేయలేదు. ఇప్పుడు స్టార్ట్ చేయి. దీన్ని విస్కీ అంటారు” అన్నాడు.

గబుక్కున కుర్చీ వెనక్కి జరుపుకుని “నాకొద్దు. “ అన్నాను గట్టిగా.

నా వైపు వింతగా చూసాడు. “ నీకు విషం ఇవ్వడం లేదు. just మన ఫ్రెండ్ షిప్ సెలెబ్రేట్ చేస్తున్నాను”అన్నాడు.

“నాకొద్దు..ఇది చెడ్డ అలవాటు నువ్వు కూడా మానేయ్” అన్నాను.

నాకు ఇవ్వబోతున్న గ్లాసు తిరిగి టేబుల్ మీద పీట్టి తన గ్లాసు తీసుకుని ఒక గుక్క తాగి “ఎంతకాలం బతుకుతామో తెలియదు బతికినన్నాళ్ళు లైఫ్ ఎంజాయ్ చేయమన్నాడు ఒకాయన. ఆయన అంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఆయన మాటలు ఆచరిస్తున్నాను ” అన్నాడు.

“ఎవరాయన” అడిగాను.

సూర్య సమాధానం చెప్పకుండా మరో గుక్క తాగి “Be happy for this moment. This moment is your life”

Drink wine. This is life eternal. This is all that you will give you. It is the season for wine, roses and drunkent friends. Be happy for this moment.  అర్థం తెలుసా! ఈ క్షణం నీది దీన్ని అనుభవించు. నీకు ఆనందాన్ని ఇచ్చే  వైన్  ఇది తాగు.  నీకో విషయం తెలుసా! నాది కూడా ఉమర్ ఖయాం ఫిలాసఫీనే. అందమైన గులాబీల సౌందర్యాన్ని, వైన్ రుచిని ఆస్వాదించడం మన హక్కు.  జీవితాన్ని  అనుభవించడమే మన దినచర్య . “

“ఎవరాయన?” కంపరంగా అడిగాను. నాకు ఇలాంటి విషయాలు చంద్రకాంత్ గారు చెప్పలేదే. ఆయన జీవితంలో ఎలా పైకి ఎదగాలి? ఆటుపోట్లను ఎలా తట్టుకోవాలి అనే ఫిలాసఫీ చెప్పాడు. ఈయన ఎవరు? చెడ్డ అలవాట్లు నేర్చుకోమని చెప్పడం ఫిలాసఫీ నా! అసలు ఫిలాసఫీ అంటే ఏమిటి?

ఆలోచిస్తున్న నాకు సూర్య స్వరం తమాషాగా వినిపించింది. “ ఉమర్ ఖయాం . ఆయన ఒక పెద్ద కవి తత్వవేత్త, mathematician ..మహా పండితుడు. ఆయన రుబాయిలు చదివితే నూరేళ్ళ జీవితాన్ని చదవడం కాదు అనుభావించేసాము అనిపిస్తుంది. “ మరో గుక్క తాగాడు.

నాకు భయం వేసింది. అక్కడ ఉండాలనిపించలేదు. సూర్య మంచివాడు అనుకున్నాను. కానీ ఇతను తాగుబోతు. ఇతనికన్నా గుణశేఖర్ ఎంతో మంచివాడు. మంచివాళ్ళతో స్నేహం చేయి, మంచిని గుర్తించడం కష్టం.. కానీ ప్రయత్నించు” అని చెప్పారు చంద్రకాంత్ గారు. ఇలాంటి స్నేహం చేసాను అని తెలిస్తే ఎంత బాధపడతారు? గబుక్కున లేచాను. “నేను వెళ్తాను “ అన్నాను.

“ఎలా వెళ్తావు? నేను దింపుతాలే. అంతవరకు కూర్చో. నిన్ను బలవంతం చేసి తాగుడు అలవాటు చేయను. “ అన్నాడు.

నాకు ఒక్క క్షణం కూడా ఉండాలని అనిపించలేదు. సూర్య కళ్ళల్లో ఎర్ర జీరలు కనిపించాయి. మాట ముద్దగా వస్తోంది. కానీ తూలడం లేదు అయినా నాలో భయం నెమ్మదిగా పాకుతోంది. కానీ,  నాకు దారి తెలియదు. ఎలా వెళ్ళడం? ఇప్పుడు నేను ఇక్కడ నుంచి బయట పడాలన్నా సూర్య ఆసరా కావాల్సిందే. బిక్కు, బిక్కుమంటూ కూర్చున్నాను.

“బజ్జీ తిను అందులో విస్కీ లేదు” అన్నాడు.

“ఒద్దు” అన్నాను.

గ్లాసు టేబుల్ మీద పెట్టి నాకు దగ్గరగా వచ్చాడు. నేను వణికిపోతూ కూర్చున్నాను.

"మహా! తాగగానే చెడ్డవాళ్ళు అయిపోతారా! మనిషి అన్నాక ప్రతి వారికీ వారివంటూ కొన్ని అభిరుచులు, సరదాలు ఉంటాయి. నేను ఒంటరివాడిని. కష్టపడుతున్నా.. నా ఇష్టం వచ్చినట్టు, నాకు నచ్చినట్టు బతుకుతా. నా లైఫ్ స్టైల్ నచ్చినవాళ్ళే నాతో స్నేహం చేయచ్చు. బలవంతం లేదు. పద నిన్ను డ్రాప్ చేస్తాను " అన్నాడు.

నేను క్షణం ఆలస్యం చేయకుండా లేచి బయటకు నడిచాను. నన్ను గుణశేఖర్ ఇంటి ముందు డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు సూర్య.

నేను మౌనంగా లోపలికి నడిచాను. గుణశేఖర్ అప్పుడే కోడి గుడ్డు ఉడకపెడుతున్నాడు. నన్ను చూసి " అయిపోయిందా ఇవాళ నీ ట్రైనింగ్ " అని నవ్వుతూ పలకరించాడు.

"ట్రైనింగ్ లేదు, పాడు లేదు. వేరే ఎవరినన్నా చూడు అతని దగ్గర నేర్చుకోను" అన్నాను.

"ఏం? ఎందుకు? ఏమైంది?" గుణశేఖర్ చేతులు కడుక్కుని నా దగ్గరగా వచ్చి చేతులు పట్టుకుని అడిగాడు .

"అతను తాగుబోతు. అలాంటి వాడితో స్నేహం చేశానని తెలిస్తే చంద్రకాంత్ గారు ఎంత బాధపడతారు!" అన్నాను.

గుణశేఖర్ అప్రయత్నంగా నా చేతులు వదిలేశాడు. కాసేపు మౌనంగా అటూ, ఇటూ పచార్లు చేసి, "నీకు సూర్య సంగతి తెలిస్తే ఈ మాట అనవు" అన్నాడు.

నేను అతని మొహంలోకి చూసాను.

గుణ సూర్యసంగతి చెప్పడం మొదలుపెట్టాడు.

" నాకు అమ్మ ఉంది. అంతో, ఇంతో తినడానికి అమ్మ చేతి ముద్దా ఉంది. కానీ అమ్మ రెక్కలు ఇచ్చాక ఆవిడ మీద నేను ఆధారపడి బతకడం మగతనం కాదనిపించి ఈ ఊరు వచ్చి, ఒక ఉద్యోగం వెతుక్కుని, అప్పుడప్పుడూ అమ్మ దగ్గరకు వెళ్ళి, అమ్మ ఒడిలో సేద తీరతాను. నువ్వు పేదరికంలో పుట్టినా కనీసం కొంతకాలం అమ్మా, నాన్నల ప్రేమ రుచి చూసావు. ఆ తరవాత రోడ్డున పడినా, సింహాచలం అనే అమ్మ ఆదుకుని ఆదరించింది. మళ్ళీ చంద్రకాంత్ గారు ఆశ్రయం ఇచ్చారు.. నీకు బతకడానికి శక్తి ఇచ్చారు. అంటే మనిద్దరం కొంత వరకు అదృష్టవంతులం. కానీ, మహా! సూర్య పుట్టగానే అనాథ అయ్యాడు. అతని తల్లి ఎవరో తెలియదు.. తండ్రి ఎవరో తెలియదు. రోడ్డు పక్కన కాలవ దగ్గర పడేసి వెళ్లిందో కఠినాత్మురాలు. చెత్త ఏరుకునే వాడు ఎత్తుకుని తీసుకువెళ్ళి పెంచాడు. వాడూ అనాథే. కానీ ఐదేళ్ళు అన్నం పెట్టాడు. ఆ

తరవాత తనతో పాటు చెత్త లో పారేసిన ఎంగిలాకులు వెతుక్కునే పని నేర్చాడు. ఆ పనే చేసుకుంటూ, అడుక్కుతింటూ కొంతకాలం బతికాడు. చిల్లర మూకతో తిరిగాడు..వాళ్ళు పెట్టింది తిన్నాడు.. బిచ్చగాళ్ళతో ఫుట్పాత్ మీద కూర్చున్నాడు. కాలక్షేపానికి దొరికిన చిత్తు కాగితాల్లో ఏదో ఉంది అని వెతుక్కుంటే నాలుగు అక్షరాలు కనికరించాయి. పదేళ్ళు వచ్చాక పిల్లలంతా ఒకే లాంటి బట్టలు వేసుకుని, బ్యాగులు తీసుకుని వరసగా వెళ్తూ ఉంటే వాళ్ళతో కలిసి స్కూల్ గేటులోకి వెళ్ళాడు. వాడి ఆసక్తి గమనించి స్కూల్ వాచ్మాన్ ప్రిన్సిపాల్ కి వాడి గురించి చెబితే, ఆయన వాడికి అన్నదానం, కాసిని అక్షరాల దానం చేసాడు.

సూర్య ఒక్కనాడు కూడా ఒక క్లాస్ లో కూర్చోలేదు.. ఒక్క పరీక్ష కూడా పాస్ అవలేదు. కానీ అపారమైన జ్ఞాపకశక్తి ఉంది. ఏదైనా ఒక్కసారి చూసాడంటే కళ్ళతోటే గ్రహిస్తాడు. భగవంతుడు వాడికి ఇచ్చిన ఒకే ఒక్క వరం అది. అదే వాడిని ఒక గొప్ప కళా కారుడిని చేసింది. గొప్ప సాహిత్యం చదివే శక్తి ఇచ్చింది. భాషా పరిజ్ఞానం ఇచ్చింది. మహా! పూలన్నీ అందమైన తోటలో, పద్ధతిగా పెంచేతేనే పూయవు. కొన్ని గడ్డిపూలు ఉంటాయి. వాటికీ పరిమళం ఉంటుంది.. వాటికీ ఒక సౌందర్యం ఉంటుంది. తుప్పల్లో పూసినా, రోడ్డు పక్కన పూసినా ఆ పూవుకీ ఒక విలువ ఉంది. సూర్య తుప్పల్లో పూసిన పూవు.. అయినా, పారిజాతం అంత విలువ ఇవ్వాల్సిన వాడు. ఒంటరిగా ఉండే మగవాడికి ఎలాంటి అలవాట్లు ఉండకుండా ఉండదు. అంతమాత్రాన సూర్య చెడిపోయినవాడు కాదు. ఈ సమాజం చేత చెడగొట్టబట్టాడు. అతన్ని అసహ్యించుకోకు.

గుణ చెప్పడం ఆపేసరికి నా కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. "నిజంగా ఇంత విషాదమా అతని జీవితం!" అన్నాను.

గుణ నవ్వాడు. "ఈ మాట సూర్యతో అనకు.. ఈ ప్రపంచంలో నాకన్నా ఆనందంగా ఉన్నవాడిని చూపించు" అంటాడు.

"నేనిప్పుడు సూర్యకి క్షమార్పణ చెప్పాలి నన్ను ఒక్కసారి తీసుకుని వెళ్ళవా !" కన్నీళ్ళతో అడిగాను
" రేపు వెళ్ళినా తనేమి అనుకోడు. ఇప్పుడు బాగా లేట్ అయింది.. తను కూడా పడుకుంటాడు. పైగా నువ్వు అట్లా వచ్చినందుకు ఇంకా కొంచెం ఎక్కువ తాగి ఉంటాడు. రేపు వెళ్దాములే.. నువ్వు ఫ్రెష్ అయి రా. అన్నం తిందాము " అన్నాడు నన్ను రెక్కపట్టుకుని లేవదీస్తూ.

నా మనసంతా వేదనతో నిండిపోయింది. సూర్య నన్ను క్షమిస్తాడా! తన స్నేహాన్ని తిరిగి అందిస్తాడా!

# 19

**వాటర్ కలర్స్ మిక్స్ చేయడం**, ఆయిల్ పెయింటింగ్స్, ఆక్రిలిక్ పెయింటింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వసాగాడు సూర్య. గుణశేఖర్ తో పాటు యాడ్ ఏజెన్సీ లో పని చేస్తూ నెలకి వచ్చే అయిదారు వందల జీతంలో సగం గుణశేఖర్ కి ఇంటి ఖర్చులకు, సగం నాకు కావలసిన పేపర్స్, కలర్స్ కాన్వాస్లు వగైరా కొనుక్కోడానికి వినియోగిస్తున్నాను. బ్యాంకు లో ఉన్న లక్ష రూపాయలకి వచ్చే వడ్డీ సేవింగ్స్ ఎకౌంటు కి ట్రాన్స్ఫర్ చేయించాడు గుణశేఖర్. ఇప్పుడు సూర్య నా దగ్గర డబ్బులు తీసుకోవడం లేదు. తన దగ్గర ఉన్న కొన్ని పెయింట్స్ కూడా నా కోసమే వాడే స్తున్నాడు. అవి కూడా కొననివ్వడు. నేనే చెప్పకుండా కొన్ని కొని తీసుకుని వెళ్తాను.

అప్పుడప్పుడు బయట నుంచి భోజనం, సూర్యకి కావాల్సిన పకోడీలు, బూందీ లాంటివి కూడా కొంటాను. గుణ ఇంటి నుంచి సూర్య రూమ్ కి ఎక్కువ దూరం ఉండదు. గుణ ఉండే రూమ్ రాణిగంజ్ లో ఉంటుంది. సూర్య రూమ్ కవాడీగూడలో ఒక చిన్న సందులో ఉంటుంది. ఆ దారిలోనే నాకు కావాల్సిన వస్తువులు దొరుకుతాయి. ఒక సైకిల్ కొనుక్కున్నాను. సైకిల్ మీద వెళ్తాను ఎక్కడికైనా. గుణ ఒకరోజు మాత్రమే నేర్పించాడు సైకిల్ తొక్కడం. త్వరగానే నా అంతట నేను తొక్కడం నేర్చేసుకున్నాను కాబట్టి transport ఇబ్బంది లేదు.

నాకు ఆర్ధికంగా కొంత వెసులుబాటుగానే ఉంది. ఆ విషయం చెప్పినా సూర్య నా దగ్గర డబ్బులు తీసుకోకుండానే నా కోసం ప్రతి రోజు సాయంత్రం మూడు గంటల సేపు శిక్షణ ఇస్తున్నాడు. మామూలుగా మాట్లాడేటపుడు ఎంతో సరదాగా ఉండే సూర్య శిక్షణ సమయంలో చాలా సీరియస్ గా ఉంటాడు. కోర్స్ పూర్తీ అయాక ఈ డబ్బు సూర్యకి గురుదక్షిణ కింద ఇవ్వాలి. తనకి మాత్రం ఎక్కడి నుంచి వస్తాయి? పాస్బుక్ ఒకసారి చూసి, లోపల పెట్టేసాను.

సూర్య చిత్రలేఖనంతో పాటు చదువు కూడా చెప్పసాగాడు. త్వరలోనే చిన్న, చిన్న ఇంగ్లీష్ పదాలు మాట్లాడే స్థాయికి తీసుకువచ్చాడు. ఇప్పుడు మునుపటికన్నా ఎంతో మంచి భాష మాట్లాడగలుగుతున్నాను. ఇదివరకు మాటల్లో యాస దొర్లేది. ఇప్పుడు అది పూర్తిగా పోయింది. “గండిపేట నీళ్ళు ఒంటపట్టేసాయి బ్రదర్” అన్నాడు ఒకరోజు సూర్య. తిరిగి తనే నా భుజం తట్టి “గుడ్ ఇలాగే ఉండాలి. కాలాన్ని బట్టి, వాతావరణాన్ని బట్టి, పరిస్థితులను బట్టి మనలను మనం మార్చుకుంటూ ఉంటేనే ఎత్తుకి ఎదుగుతాము” అన్నాడు.

సూర్య పాఠాలే కాదు, మాటలు కూడా నాకు మంత్రాలే అనిపిస్తాయి. అతను మాట్లాడే ప్రతి అక్షరంలో ఏదో ఒక నిగూఢమైన భావం వినిపిస్తుంది. ఒకోసారి తననే అడుగుతాను ఆ భావం ఏమిటో చెప్పమని.. ఒక్కోసారి నేనే ఆలోచిస్తూ అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాను. కానీ ఎంత అర్థం చేసుకున్నా, ఎప్పుడూ ఒక కొత్త పజిల్ లాగే కనిపిస్తాడు.

కాలం నిలడగానే కదులుతోంది.. గుణశేఖర్, సూర్యల స్నేహం లభించడం నా అదృష్టం కదా! లేకుంటే ఈ మహానగరంలో మరో ఫుట్ పాత్ బతుకే మొదలయేది. ఇలా ఒక గదిలో నాలుగు గోడల మధ్య, ఒక రూఫ్ కింద ఒక మంచి మిత్రుడితో కలిసి జీవించే అవకాశం కలుగుతుందని కల్లో కూడా భావించలేదు. మరో మంచి మిత్రుడు నాలోని కళకి సాన పెట్టి నన్ను ఒక మంచి కళాకారుడు గా తయారు చేయగలడని ఊహించానా! కళతో పాటు చదువు కూడా చెబుతున్నాడు. పరీక్షలకి కట్టు మహా అని ప్రోద్బలం చేస్తున్నాడు. కానీ చదివినవి గుర్తు పెట్టుకుని, పరీక్షలో చూడకుండా రాయగల శక్తి నాకులేదు. సర్టిఫికెట్ కేవలం ఉపాధి కోసమేగా! నేను నా కళ ద్వారా స్వతంత్రంగా జీవిస్తాను. దానినే ఉపాధిగా ఎంచుకుంటాను" అన్నాను.

"మంచి ఆలోచనే కానీ, సౌఖ్యంగా బతకాలంటే కళ సరిపోదు, శాంతిగా బతకాలంటే చాలు. నువ్వెలా బతకాలని అనుకుంటున్నావు" అనడిగాడు.

నాకు అర్థం కాలేదు. "అంటే!" అన్నాను సందేహంగా.

నవ్వాడు. "నేను కళాకారుడినే కదా! నాకు ఉద్యోగం లేదు. నీలాంటి నలుగురు శిష్యులను చేరదీసి, నా కళ నేర్పిస్తూ, నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నాను. ఆ సంపాదన నా మందు బాటిల్స్ కి, నా తిండికి, ఈ రూమ్ రెంట్ కి సరిపోతుంది. ఖాళీగా ఉన్నప్పుడు నాకు ఇష్టమైన పాటలు వినడానికి ఈ రేడియో ఒక్కటే నా దగ్గర ఉన్న లగ్జరీ. నేను సుఖంగా ఉన్నట్టా! శాంతిగా ఉన్నట్టా!"

సుఖం, శాంతి ఈ పదాలకు అర్థం తెలిసినా, నిర్వచనం తెలియదు. అందుకే మౌనంగా అతనేం చెబుతాడో అన్నట్టు చూడసాగాను.

"సుఖంగా, శాంతిగా ఉన్నాను. ఇది నా అభిప్రాయం. కానీ, మరెవరన్నా నన్ను చూస్తే, ఏంటిరా నీ బతుకు? ఒక సోఫాలేదు, ఒక టి వి లేదు, ఒక స్కూటర్ లేదు, మంచి బట్టలు లేవు..ఇంత దరిద్రంగా బతుకుతున్నావా! అంటారు. అది వాళ్ళ అభిప్రాయం. నీకు ఏమనిపిస్తుంది? ఈ రెండు అభిప్రాయాల్లో ఏది కరెక్ట్ అనిపిస్తుంది."

ఆలోచించాను. సూర్య అన్నట్టు అది సౌఖ్యమా, భోగమా! కనీస సౌకర్యాలు అంటే ఏమిటి? ఇప్పుడు సూర్య దగ్గర ఉన్నవి కనీస సౌకర్యాలు కాదా! పడుకోడానికి ఏదో ఒక మంచం ఉంది.. కోర్చోడానికి కుర్చీ ఉంది.. అన్నం తినడానికి కంచం ఉంది. కష్టపడే తత్త్వం ఉంది. అన్నిటికీ మించి మంచి మనసుంది. ఇవి చాలవా బతకడానికి.

సూర్య నా భుజం మీద చేయేసి ఆప్యాయంగా నొక్కాడు. "మహా! జీవితం పట్ల ప్రతి మనిషికీ వారి, వారి అభిరుచులను బట్టి అనేక రకాల అభిప్రాయాలు, ఆశలు ఉంటాయి. ఇదే మంచిది, ఇదే కరెక్ట్ అని చెప్పడం కష్టం. నీకు నీ కళతో బతకగలనన్న నమ్మకం ఉంటే బతికేస్తావు."

నాకు ఎవరి దగ్గరైనా పని చేయాలంటే భయం. నాకేమి తెలియదు. తెలియకుండా ఎవరి దగ్గరో పని చేస్తూ వాళ్ళ ఆగ్రహానికి గురి అవుతూ, అడుగడుగునా అవమానాలు భరిస్తూ బతకడం నాకు కష్టం సూర్యా! మూడు పూటలా తిండి, తలదాచుకోడానికి నీడ, నీ ప్రేమ, గుణ ఆదరణ ఇవి చాలు" అన్నాను గాద్గాదికంగా.

" జీవితం ఎమోషన్ కాదు మహా! ఎమోషన్స్ తో నిర్ణయాలు తీసుకోకు. అయినా, ఇంకా నీకు టైం ఉంది అవన్నీ ఆలోచించడానికి. ఈరోజు ఆనందంగా ఉన్నామా అని సంతోషించు..రేపటి గురించి ఆలోచించకు. పడుకో" అన్నాడు. అప్పటికే కొంచెం ఎక్కువే తీసుకున్నాడు డ్రింక్. అతని కళ్ళు మూతలు పడుతున్నాయి. నేను కూడా ఆరోజు సూర్య గదిలోనే పడుకున్నాను.

సూర్య నిజానికి చూడ్డానికి ఆకర్షణీయంగా ఉంటాడు. కానీ చాలా నిర్లక్ష్యంగా ఉంటాడు. చాలా వత్తుగా, రింగులు తిరిగి ఉంటుంది క్రాఫ్. ఏనాడూ చిటికెడు నూనె కూడా రాయడం నేను చూడలేదు. రాయను అని చెప్పాడు కూడా. రోజూ తలస్నానం చేసి, కుడి చేతి వ్రేళ్ళతో పైకి సర్దుకుంటాడు కానీ దువ్వెనతో దువ్వుకోడు. ఎప్పుడూ గడ్డం పెరిగి ఉంటుంది. అప్పుడప్పుడు ఆ గడ్డాన్ని షేపు చేయిస్తాడు. రోజూ ఉతికిన ప్యాంట్, చొక్కా తోడుక్కుంటాడు. తన బట్టలు తనే ఉతుక్కుంటాడు. ఎక్కువగా బ్రెడ్ టోస్ట్ చేసుకుని తింటాడు. వంట చేసుకోడు. అన్నం తినాలి అనిపిస్తే అతని ఇంటికి దగ్గరలో ఒక ఉడిపి హోటల్ ఉంది అక్కడ తినేస్తాడు. నెలకి ఇంత అని ఇస్తాడు హోటల్ ప్రొప్రయిటర్ కి. ఎప్పుడూ హిందీ పాటలు కూనిరాగం తీస్తూ ఉంటాడు. నవ్వుతూ, చలాకీగా ఉన్నట్టు కనిపిస్తున్నా, కళ్ళ చివర ఏదో విషాదం లీలామాత్రంగా కదులుతూ ఉండేది. తన పరిధిలో ఎవరికి , ఎలాంటి సహాయం కావాలన్నా ముందు ఉంటాడు. తన దగ్గర పదిరూపాయలు ఉంటే, ఐదు తనకి, ఐదు ప్రజలకి అన్నట్టు ఉండేవాడు. మొత్తానికి సూర్య స్నేహం నాలో నాకే తెలియని ఒక కొత్త వ్యక్తిని వెలికి తీస్తున్నట్టు అనిపించసాగింది.

అప్పుడప్పుడు గుణశేఖర్ తో కలిసి ముగ్గురం షికారు వెళ్తుంటాం. వాళ్ళిద్దరూ అనేక విషయాలు కలబోసుకుంటారు. వాటిలో నాటి రాజకీయాలు, సినిమాలు ప్రధానంగా ఉండేవి. సూర్య హిందీ పాటల గురించి మాట్లాడుతూ, వాటి అర్థాలు చెబుతూ ఉండేవాడు. నాకు హిందీ రాకపోయినా, తను చెబుతుంటే ఆసక్తిగా వినేవాడిని.

నెమ్మదిగా నాకూ  హిందీ పాటల మీద అనురక్తి మొదలైంది. నాకో చిన్న రేడియో కొనిచ్చాడు సూర్య.  అప్పుడప్పుడు సంగీత థియేటర్ లో ఇంగ్లీష్,  హిందీ సినిమాలు చూపించేవాడు.

ఒకరోజు ట్యాంక్ బండిమీదకితీసుకుని వెళ్ళారు ఇద్దరూ నన్ను. అక్కడ నెమ్మదిగా ప్రవహిస్తున్న ఆ విశాలమైన నది..చుట్టు పక్కల ప్లాట్ ఫారం మీద రక,రకాల బొమ్మలు, ఆహారపదార్ధాలు అమ్ముకునే చిన్న, చిన్న వ్యాపారస్తులు, ఏకాంతం వెతుక్కుని ఏ చెట్టు చాటునో కూర్చుని, యవ్వనాన్ని ఎంజాయ్ చేసే జంటలు, పిల్లలతో ఆటలాడుతూ ఉల్లాసంగా తిరిగే భార్యాభర్తలు, వంటరిగా వచ్చే వాళ్ళు, మాలాంటి స్నేహితులు ఇలా ఆ పరిసరాలు ఉత్సాహంతో, ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది.

కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న పిల్లలని చూస్తూ అన్నాడు సూర్య" నిజంగా బాల్యం అనేది ఎంత మధురమైనది! బతుకు తెరువు గురించి ఆరాటాలు, వర్తమాన జీవనపోరాటాలు, భవిష్యత్తు గురించిన భయాలు, ఏమి ఉండవు.. గతం తాలూకు వ్యధలు అసలే ఉండవు.. ఆకాశంలో హాయిగా ఎగిరే గాలిపటం బాల్యం.  నా కంటూ బాల్యంలో  ఎలాంటి మధురమైన జ్ఞాపకాలు లేవు.. మీకేమన్నా ఉన్నాయా!" అడిగాడు సూర్య నన్ను, గుణని చూస్తూ.

గుణ నవ్వాడు. "నా స్థాయికి తగిన మిత్రులు నాకూ ఉండేవాళ్ళు.  చెట్లెక్కడం, దెబ్బలు తగిలించుకోవడం, అందరిళ్ళల్లో జామకాయలు తెంపుకుని వాటితో పాటు దెబ్బలు కూడా తినడం ఇలాంటివే ఉన్నాయి. "

నేను మాట్లాడలేదు. కళ్ళల్లో తిరుగుతున్న నీళ్ళు చెంపల మీదకి జారితే వాళ్ళు చూస్తారని కొంచెం దూరంలో మొక్కజొన్న కండెలు కాలుస్తున్న స్త్రీ దగ్గరకు వెళ్లి మూడు కండేలు కొనుక్కొచ్చాను.  అవి  తింటూ ఉంటే సింహాచలం గుర్తొచ్చింది.   ఆమెగుర్తుకు రాగానే నా చిన్నతనం, అమ్మ, నాన్న, తుపాను భీభత్సం,  కెరటాలు లాగేసిన నా సైకత శిల్పాలు అన్నీ గుర్తొచ్చి,  మనసంతా వేదనతో నిండిపోయింది. అమ్మ జన్మనిచ్చింది.. సింహాచలం మరో జన్మ ఇచ్చింది.

ఆ రోజు భయంతో అమ్మ వెచ్చని గుండెల్లో ముడుచుకుని ఉన్న  నన్ను  ఏవో అదృశ్యహస్తాలు అమ్మ నుంచి దూరంగా విసిరేసి, ఆవిడని ఎత్తుకుని వెళ్ళిపోయినట్టు  మాయం అయిపొయింది.

పూలదండల్లాంటి చేతులతో చుట్టేసి, తన గుండెలో దాచుకున్న అమ్మ వెచ్చని స్పర్శ ఇంకా అలాగే ఉంది. అమ్మ ఎక్కడికి వెళ్లిందో తెలియదు.  గుడిసెలో వెతికాను .. ఇసకలో వెతికాను, కెరటాల్లో వెతికాను, మేఘాల్లో వెతికాను. ప్రతి చీర కొంగులో అమ్మకోసం వెతుక్కున్నాను.   సింహాచలం అమ్మలాగే ఆదరించింది.. అమ్మలాగే పిలిచింది.. అమ్మలాగే

తిండి, నీళ్ళు ఇచ్చింది. సింహాచలం కూడా నేను చూస్తూ ఉండగా, నా కళ్ళ ఎదురుగానే నిర్జీవం అయింది. ఎందుకిలా అయింది?

" ఏమైందిమహా " గుణశేఖర్ ప్రశ్నతో త్రుళ్ళిపడ్డాను. ఆలోచనల నుంచి తేరుకుని తల అడ్డంగా ఆడిస్తూ "అమ్మ నీడలో పెరగడానికికూడా అదృష్టం ఉండాలి కదూ!" అన్నాను.

గుణశేఖర్ నా భుజం ఆప్యాయంగా తట్టి " లేని దాన్ని గురించి ఆలోచించకు ! దుఃఖం ఎక్కువ అవుతుంది.. ఉన్న దానితో తృప్తి పడదాం" అన్నాడు.

" బాల్యంలో మధురస్మృతులు ఉంటే తలచుకో.. లేవని విచారించకు" అన్నాడు సూర్య.

నేనేమి మాట్లాడలేదు. మొక్కజొన్న కండె కొరుకుతూ, ఏకాంతంగా ఒకరినొకరు హత్తుకుని కూర్చున్న జంటలను చూస్తూ అన్నాడు సూర్య. "వీళ్ళెంత మూర్ఖులు, జీవితంలో అతి ముఖ్యమైన దశని ఇలాంటి ఆకర్షణలతో, ప్రలోభాలతో వృధా చేస్తుంటారు. అసలు ప్రేమ మీద నాకు నమ్మకం లేదు.. నీకుందా" నన్ను, గుణని ఉద్దేశించి అడిగాడు సూర్య.

గుణ నవ్వి "ప్రేమ లేకుంటే బతుకేడిది భయ్యా" అన్నాడు.

సూర్య నీ అభిప్రాయం ఏమిటి అన్నట్టు నా వైపు చూసాడు.

"నాకింకా అనుభవంలోకి రాలేదు కదా" అన్నాను.

"వచ్చినా స్వీకరించకు. ఎవరన్నా అమ్మాయి నిన్ను ప్రేమిస్తున్నా అని చెప్తే మాత్రం నమ్మకు.. ఎవరూ ఎవరినీ ప్రేమించరు.. అంతా ట్రాష్.. వట్టి హంబగ్ .. అది ప్రేమ కాదు అవసరం. నీతో అవసరం ఉంటే నీ మీద ఎక్కడలేని ప్రేమ పుట్టుకుని వస్తుంది. నీతో అవసరం తీరాక ఆ ప్రేమకి రెక్కలొస్తాయి. ఎగిరిపోయి, మరో కొమ్మ మీద వాలుతుంది. ఈలోగా మన జీవితం మటాష్ " అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ.

నేను నవ్వేసి ఊరుకున్నాను. గుణ మాత్రం సూర్యని సూటిగా చూస్తూ "నీ మాటలని బట్టి నువ్వు ప్రేమలో ఫెయిల్ అయినావు అనిపిస్తుంది.. ఎవరు భయ్యా ఆ పిచ్చి అమ్మాయి."అనడిగాడు.

సూర్య మాట్లాడలేదు. రైలింగ్ మీద ఒక కాలు పెట్టి, కొంచం ఒంగి చిన్నగా, గుండ్రంగా తిరుగుతున్న నీటిలోని సుడులు చూస్తూ" జీవితం అనేది ఒక పెద్ద సముద్రం అయితే, ప్రేమ, ప్రేయసి ఇవి సుడిగుండాలు. మనలను మడతపెట్టి తనలోకి లాగి నిలువునా ముంచేస్తాయి. అందుకే ప్రేమించకు..ఎప్పటికీ ప్రేమించకు."

మరికొంత కాలం గడిచింది. చేయి తిరిగిన చిత్రకారులకి తీసిపోని విధంగా నన్ను తయారు చేయడానికి కృషి చేస్తున్నాడు సూర్య.

ఆరోజు నన్ను ప్రత్యేకంగా తన గదికి పిలిచి చెప్పాడు సూర్య.. " కళాభవన్ లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఉంది. నీ చిత్రాలు ప్రదర్శనకి పెడదాము.. నా మిత్రుడే కండక్ట్ చేస్తున్నాడు ఆ ప్రదర్శన. రెండు రోజులు ఉంటుంది. దాని కోసం ఒక చిత్రం ప్రత్యేకంగా వేసి తీసుకురా."

" నేనా! అప్పుడేనా! ఇంకా నేర్చుకుంటున్నాను కదా! అంత బాగా వేయగలనా !ప్రదర్శనకి అంటే చాలా పెద్ద, పెద్ద వాళ్ళవి ఉంటాయి కదా! " అన్నాను విస్మయంగా .

సూర్య నవ్వాడు. "ముందు చిన్నగా ఉన్నవాళ్ళే పెద్దవాళ్ళు అవుతారు. ఇది ప్రారంభం. ఇలాంటి ప్రదర్శనలు అనేకం జరుగుతాయి.. ఇంక నువ్వు ఇలాంటి వాటిలో పాల్గొనాలి. లేకపోతే ఎలా ఎదుగుతావు? మహా " చటుక్కున ఆగిపోయి నా వైపు నిశితంగా చూస్తూ అన్నాడు " నీ పేరు అసంపూర్ణంగా ఉంది. దానికి ముందు, వెనక ఏదన్నా ఉండాలి. అంటే రావు, శాస్త్రి, రెడ్డి, చౌదరి, గౌడ ఇలా ఏదో ఒకటి.." ఆలోచిస్తూ అన్నాడు "ఒకే ఇప్పటి నుంచి నా పేరులో సగం నీకు ఇస్తున్నాను. నీ పేరు ఈ రోజు నుంచీ మహాతేజ. ఓకేనా" నేను నిశ్చేష్టుడి నై చూస్తూ ఉండిపోయాను." మహాతేజ అనబడే పెద్ద ఆర్టిస్ట్ పుట్టాడు, పెరిగాడు మనలోనే ఉన్నాడు అని ఈ ప్రజలకి, సమాజానికి ఎలా తెలుస్తుంది?"

నా గుండెల్లో సప్తసముద్రాలు పొంగాయి. కళ్ళు చెమ్మగిల్లాయి అతని ఆత్మీయతకి . అతణ్ణి కౌగలించుకుని " ఎక్కడినుంచి వచ్చావు సూర్యా! నీకు, నాకు ఈ బంధం ఏనాటిది?" అన్నాను. .

సూర్య నా వీపు మీద చేయి వేసి నిమిరాడు. ఆ స్పర్శలో ఎన్నో అర్థాలు, మరెన్నో భావాలు"ఇప్పటి నుంచీ నిన్ను నేను తేజా! అని పిలుస్తాను" అన్నాడు మనస్ఫూర్తిగా.

సూర్య ఇచ్చిన ప్రోత్సాహంతో ఒక రాత్రి, ఒక పగలు కూర్చుని ఒక కొత్త బొమ్మ వేసి తీసుకుని సూర్య దగ్గరకు వెళ్లాను.

పదేళ్ళ పిల్లాడు తను వేసిన మొట్టమొదటి డ్రాయింగ్ చూపించి టీచర్ అభినందన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్టు చూసాను సూర్యవైపు.

చిరునవ్వుతో రోల్ చేసిన కాన్వాస్ తెరిచిన సూర్య విభ్రమంతో చూస్తూ ఉండిపోయాడు. అతని నోటినుంచి ఎలాంటి శబ్దం రాలేదు.. చేష్టలుడిగి అలా చూస్తూ ఉండిపోయాడు. సూర్య మోహంలోకే తదేకంగా చూస్తున్న నా గుండె కొట్టుకోసాగింది.. ఏదన్నా తప్పు చేశానా ! అనుకుంటూ ఊపిరి బిగబట్టి చూడసాగాను.

సూర్య నెమ్మదిగా తల తిప్పి నా వైపు చూసి " తేజా! నీ గురించి నువ్వు ఇంత నిశ్శబ్దంగా చెప్పుకోవడం ఎలా నేర్చుకున్నావు? దీన్ని expressionism అంటారు ... కేవలం గీతలతో ఒక జీవితాన్ని ఆవిష్కరించడం మామూలు విషయం కాదు. మై డియర్..యు ఆర్ గ్రేట్" నన్ను గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు.

ఇంద్రధనుస్సు లోని రంగులన్నీ నా మీద వెదజల్లుతున్నట్టు అనిపించింది .

"నిజంగా బాగుందా " అన్నాను అపనమ్మకంగా .

" ఇంతకన్నా గొప్పగా చెప్పలేను తేజా నా ఆనందాన్ని.. నాకు నువ్విచ్చిన గురుదక్షిణ ఇదే."

చదివేసిన పుస్తకం పుటలు తిప్పేస్తున్నట్టు, విరిగిపడుతున్న కెరటాలు చూస్తూ, గతానికి, వర్తమానానికి కట్టిన వారధి మీద నిలబడి భవిష్యత్తు వైపు ప్రశ్నార్ధకంగా చూస్తున్న ఒక యువకుడు.. అతని తల మీద నీలాకాశం. పాదాల దగ్గర మహాసముద్రం..చుట్టూ ఏకాంతం. పల్టీలు కొడుతూ గమ్యం వెతుక్కుంటున్న ఒకే ఒక పక్షి. అదే ప్రదర్శనకి నేను కొత్తగా వేసిన చిత్రం. సూర్య శిక్షణలో నేను నేర్చుకున్న కొత్త పద్ధతిలో వేసిన చిత్రం.

సూర్యతో పాటు కళాభవన లో అడుగుపెడుతుంటే రక్తప్రసరణ తీవ్రం అయి, ఉద్వేగంతో వణికిపోయాను . ఎందఱో గొప్ప చిత్రకారుల చిత్రాల మధ్య నేను వేసిన చిత్రం . మొదటిసారి చంద్రకాంత్ ప్రోత్సాహంతో, విశాఖపట్నంలో జరిగిన చిత్రప్రదర్శన లో ప్రదర్శించిన గాంధీ బొమ్మ విదేశీయుడు కొనడం గుర్తు వచ్చింది. ఆరోజు కొండంత అండగా చంద్రకాంత్ గారు.. ఇవాళ విశ్వమంత ప్రేమ చూపించే సూర్య..

" ఇక్కడ మన చిత్రాలు ప్రదర్శన మాత్రమే. ఎవరన్నా కొంటాను అంటే ఇవ్వకు. తరవాత ఇదే చిత్రం పోటీకి పంపుదువుగాని తప్పకుండా బహుమతి వస్తుంది.. నాకు నమ్మకం ఉంది" అన్నాడు సూర్య.

నేను అసలు ఏమి ఆలోచించడం లేదు. నా చిత్రం చూసే ప్రజల కళ్ళల్లో కదిలే భావాలు చదవడానికి ఎదురుచూస్తున్నాను. సూర్య అన్నట్టే రెండురోజుల పాటు జరిగిన ఆ ప్రదర్శనలో అనేక మంది ప్రముఖ, వర్ధమాన చిత్రకారుల చిత్రాల ప్రదర్శన జరిగింది. కొందరు శిల్పాలు కూడా ప్రదర్శించారు.

ఆఖరి రోజు, ఆఖరి గంట.. మరో గంటలో ప్రదర్శనా గడువు పూర్తి అవుతుంది. నేను, సూర్య కారిడార్ లో నిలబడి ఉన్నాము. లోపల గ్యాలరీలో చిత్రకళ మీద అభిమానంతో వచ్చిన ప్రేక్షకులు ఒక్కో చిత్రం చూస్తూ నెమ్మదిగా నడుస్తున్నారు.

సూర్య స్నేహితుడు, ఆ ప్రదర్శన నిర్వాహకుడు వంశీ మా దగ్గరగా వచ్చాడు. సూర్యకి షేక్ హ్యాండ్ ఇచ్చి వచ్చి అన్నాడు. " సూర్యా! just excellent. నీ శిష్యుడు చాలా పెద్ద చిత్రకారుడు అవుతాడు భవిష్యత్తులో. అందరి కళ్ళు అతని చిత్రం మీదే. బెంగుళూరులో జాతీయ స్థాయి ప్రదర్శన జరుగబోతోంది. వెంటనే ఎంట్రీ ఇవ్వు.. తప్పకుండా బహుమతి వస్తుంది. ఐ బిలీవ్" అన్నాడు.

సూర్య చిరునవ్వుతో నా వైపు చూసాడు. నేను ఉక్కిరిబిక్కిరి అయాను. సూర్యవైపు ప్రశ్నార్ధకంగా చూస్తూ నిలబడిపోయాను.

"నన్ను చూస్తావేం తేజా! చెప్పు నీకు ఒకే నా" అన్నాడు. నాకేం చెప్పాలో అర్ధం కాలేదు.

సూర్య "తేజా! పెద్దవాడివి అవుతున్నావు. స్వయం నిర్ణయాలు తీసుకోడం నేర్చుకో. నీ మీద నీకు నమ్మకం, నీ ప్రతిభ పట్ల విశ్వాసం ఉండాలి. బహుమతి వచ్చినా, రాకపోయినా స్పోర్టివ్ గా తీసుకునే ఆత్మబలం ఉండాలి. మన work ప్రదర్శనకి పెట్టడం ఎందుకంటే మన గురించి నలుగురికీ తెలియచేయడం కోసం. నలుగురితో మనకి పరిచయాలు కలగడం కోసం. బెంగుళూరు వెళ్లి ప్రదర్శనలో పాల్గొంటే నీకు కొత్త అనుభవం కలుగుతుంది. ధైర్యం వస్తుంది. "

అతని మాటలు పూర్తికాకుండానే గబా,గబా అన్నాను "వెళ్తాను. ఎంట్రీ పంపిద్దాం."

"గుడ్ " నా భుజం తట్టాడు. వంశీ వైపు చూసి, విన్నావుగా" అన్నాడు.

వంశీ చిరునవ్వుతో "ఓ కే ఆ ఏర్పాట్లు చేద్దాం" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళాక అడిగాను "నువ్వెందుకు నీ చిత్రాలు ప్రదర్శించవు? నువ్వు కూడా బెంగుళూరు రావచ్చు కదా!"

సూర్య బాటిల్ మూత తెరిచి గ్లాసులో విస్కీ పోసుకుంటూ నవ్వాడు.

" నేను నమ్ముకున్న, నన్ను నమ్ముకున్న కళ చిత్రకళ. దీనిలో శిక్షణ ఇస్తూ, నా వారసులను తయారు చేస్తాను. అదికూడా నేను బతకడానికి నేను ఎంచుకున్న ఉపాధి మార్గంకాబట్టి. నాకు కొత్తగా ఎవరి ప్రశంసలు, బహుమతులు ఇష్టం లేదు. నువ్వు చూస్తున్నావుగా! నాకంటూ విలువైన వస్తువులు, బ్యాంక్ లో బాలన్స్, ఆస్తులు ఏమి లేవు. అవన్నీ

సంపాదించుకుని నేనేం చేయాలి? నాకెవరూ లేరు విల్లు రాసివ్వడానికి. అలాగే కీర్తి కూడా నాకు అవసరం లేదు. అపకీర్తి రాకుండా ఉంటే చాలు.”

“నాకు మాత్రం ఎవరున్నారు సూర్యా!నన్నెందుకు ప్రోత్సహిస్తున్నావు?”

“నీకు భవిష్యత్తు ఉంది.. నాకు కేవలం వర్తమానమే ఉంది”.

“అదే భవిష్యత్తు నీకూ ఉంటుందిగా! నువ్వూ పెళ్లి చేసుకుని పిల్లలని కంటే నీకంటూ ఒక కుటుంబం ఏర్పడుతుంది కదా!”

“పెళ్ళా!” ఒక గుక్క తాగి, ఫక్కున నవ్వాడు. “ఈ క్షణం మాత్రమే నాది, మరో క్షణం ఏమవుతానో అనే సంశయంతో బతికే నేను పెళ్లి చేసుకుని ఏం చేయాలి?”

సూర్య చిన్న కళ్ళల్లో, నుదుటి మీద నుంచి కళ్ళ మీదకి పడుతున్న క్రాఫ్ మధ్యలో నుంచి, కొట్టిచ్చినట్టు కనిపించిన బాధ నా గుండెని తాకింది.

“సూర్యా! నువ్వేమి అనుకోకపోతే ఒక విషయం అడగనా!”

గ్లాసు పెదాల దగ్గర పట్టుకుని, నా వైపు చూడకుండా “అడుగు” అన్నట్టు తలాడించాడు.

“నువ్వెందుకు జీవితం పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉంటావు.”

సూర్య నా వైపు చూసాడు. “ఇంతకన్నా వేరుగా ఎలా బతకాలో నాకు తెలియదు. ఎవరూ నేర్పలేదు”

“బతకడం ఎవరు నేర్పిస్తారు?.”

అవును అన్నట్టు మొహం, కిందకీ, పైకి ఆడించి “నిజమే! ఈ బతుకుమాత్రం ఎవరు నేర్పారు? బహుశా కాలమే నేర్పింది అనుకుంటా. ఇంకా కొంతకాలం బతికి ఉంటే ఇంకా బాగా బతకడం నేర్పిస్తుందేమో”అన్నాడు.

నేను కలవరపడ్డాను. “అదేం మాట సూర్యా! అలా విరక్తిగా ఎందుకు మాట్లాడతావు?”

“నీకిది విరక్తిగా మాట్లాడినట్టు అనిపిస్తోందా? నాకు ప్రాక్టికల్ గా అనిపిస్తోంది” అని గ్లాసు ఎత్తి మిగిలినది తాగేసి, మరి కొంచెం పోసుకున్నాడు.

బాధగా అనిపించింది. విషం అని తెలిసీ ఎందుకు తాగుతున్నాడు? సూర్యకి అన్నీ తెలుసు. అజ్ఞాని కాదు. “ఎందుకు నిన్ను నువ్వు హింసించుకుంటున్నావు? సూర్యా నువ్వు ఎవరినన్నా ప్రేమించావా!” అడిగాను.

సూర్య మాట్లాడ లేదు. మార్దవంగా అడిగాను. “నాకు చెప్పకూడదా!”

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరవాత కూర్చున్న దగ్గర నుంచి లేచి కిటికీ దగ్గరగా వెళ్లి కర్టెన్ సరిచేసాడు. తిరిగి వచ్చి కూర్చున్నాడు. కొన్ని క్షణాలు అలాగే కూర్చుని లేచి కిచెన్ వైపు వెళ్ళాడు. అతని వాలకం చూస్తుంటే చాలా అస్థిమితంగా ఉన్నట్టు అనిపిస్తోంది. ఆందోళన కూడా మొహంలో కొట్టొచ్చినట్టు కనిపించింది.

గబుక్కున అన్నాడు.”ప్రేమించాను. నాకు అర్హత లేకపోయినా ప్రేమించాను. అందుకు దారుణమైన శిక్ష అనుభవించాను. ఎవరిని ప్రేమించాను? ఆ ప్రేమ ఎందుకు విఫలం అయింది చెప్పాలంటే నా కథ చెప్పాలి.”

నేను ఊపిరి బిగబట్టి వినసాగాను.

“నేను ఒక తల్లి గర్భం నుంచే పుట్టాను. కానీ, తండ్రి ఎవరు అని ప్రశ్నిస్తాను అనుకుందేమో ఆ తల్లి జవాబు చెప్పలేక కృష్ణలో దూకింది. కానీ, తల్లి,తండ్రి పేర్లు చెప్పలేని నేను ఎక్కడ దూకాలో, ఎక్కడ తేలాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నాను. , తేజా! నిత్యం ఈ ప్రపంచంలో ఎన్నో వింతలు, అద్భుతాలు జరుగుతూ ఉంటాయి. కొన్ని బయటకు వస్తాయి. కొన్ని రెండో కంటికి తెలియకుండా కనుమరుగు అవుతాయి. నా విషయంలో అదే జరిగింది. ఒక అద్భుతం జరిగింది. సాధారణంగా చెత్తకుండీలో నానా చెత్తా వేస్తారు.. పాత డబ్బాలు, విరిగిపోయిన సీసా ముక్కలు, మిగిలిన, అన్నం, పప్పు, కూరలు, రకరకాలు. అవి ఏవి కూడా నా బుల్లి ప్రాణం తీయలేక పోయాయి. బతికి ఉన్నానని అందరికీ చాటేలా గుక్కపట్టేలా ఏడుస్తుంటే, రెండు చిన్నారి చేతులు నన్ను తన భుజం మీద వేసుకుని తన తల్లి దగ్గరకి తీసుకువెళ్ళాయి. ఆ చిన్నారి పేరు రేణుక .

ఎక్కడి నుంచో వలస వచ్చి ఫుట్ పాత్ మీద బతుకుతున్న కుటుంబం. ఆ కుటుంబం లో ఉన్న ఆరుగురిలో ఏడో మెంబెర్ గా నన్ను చేర్చుకున్నారు. నాతోపాటు , మరి ఇద్దరు చిన్నారులను, చెట్టుకి చీరతో ఉయ్యాలలా కట్టి ఊపుతూ పెంచింది ఆ తల్లి. వాళ్ళు అన్నం తింటే అన్నం, రొట్టె తింటే రొట్టె. ఆ చుట్టు పక్కల ఎక్కడన్నా, విందులు వినోదాలు అయితే, రక,రకాల స్వీట్లు, బిరియానీలు, పులిహోరలు పండగ భోజనం పెడుతూ, మూడేళ్ళు పెంచింది ఆ తల్లి. ఈ లోగా అక్కడ వేస్తున్న రోడ్డుపని అయిపొయింది.. మరో చోటికి మరికొన్ని రోజులు బతకడానికి వెళ్ళాలి. నన్ను ఏం చేయాలో అని ఆలోచన వచ్చింది పోలయ్యకి . మనకే నిలకడ లేదు.. ఊరూరూ, వాడ,వాడా తిరిగే మనం ఈ పిల్లాడిని కూడా తిప్పడం

సబబేనా అని భార్యా,భర్తలు ఆలోచించుకున్నారు. "అన్నని కూడా మనతోనే తీస్కబోదం నాయనా అంది అక్క బాల.. అవును నాయనా తమ్ముణ్ని మనతోనే తీస్కబోదము అంది రేణుక. వాళ్లతోపాటే మరో ప్రదేశానికి రైలెక్కాను. అది ఏ స్టేషనో తెలియదు. మంచినీళ్ళ కోసం, నేను, రేణుక రైలు దిగి ఎదురుగా కనిపిస్తున్న పంపు దగ్గరకు వెళ్లి కడుపునిండా నీళ్ళు తాగాము. చల్లని ఆ నీళ్ళు మొహాల మీద చల్లుకున్నాము. ఒక ప్లాస్టిక్ బాటిల్ లో నిండా నీళ్ళు నింపుకున్నాము. రైలు కూత వేసింది. ఆ కూత నేను బయలుదేరుతున్నాను అని చెప్పడం అని తెలియని నేను, రేణుకా నెమ్మదిగా టాప్ ఆపేసి వెనక్కి తిరిగి రైలు వైపు నడుస్తూ ఉన్నాము. రైలు మెల్లగా కదిలింది. పోలయ్య తలుపు దగ్గరకు వచ్చి చేతులు ఊపుతూ, " రాండి రాండి ఉరికి రాండి" అంటూ అరుస్తున్నాడు. రైలు శబ్దం చేస్తూ వేగం పెంచింది. మేము పరిగెత్తాము. రైలు మాకన్నా వేగంగా పరిగెత్తింది. రైలు గెలిచింది. మేము ఓడిపోయాము." సూర్య చెప్పడం ఆపాడు.

"ఆ తరవాత ఏం జరిగింది?" ఆత్రుతగా అడిగాను.

ఇద్దరం గట్టిగా నాన్నా, అమ్మా అంటూ ఏడుస్తూ కూర్చున్నాం. అది చాలా చిన్న స్టేషన్. జనం పల్చగా ఉన్నారు. గోలీసోడా కొట్టుకుని బతికే తిరుపతి ఇద్దరినీ దగ్గరకు తీసుకున్నాడు. చల్లని సోడా ఇచ్చాడు. ఏడవకండి. మీ అమ్మా, నాన్నా వస్తారు. ఇక్కడే నా దగ్గరే ఉండండి. రేపో, ఎల్లుండో వస్తారు మీ కోసం అన్నాడు. వాళ్ళింటికి తీసుకుని వెళ్ళాడు. అమ్మా, నాన్నా రాలేదు. రేణుక వాళ్ళింట్లో పనిమనిషి అయింది. నేను అతని కొట్టులో హెల్పర్ అయాను. రోజులు, వారాలు, నెలలు గడిచాయి. రేణుక వయసుకి మించిన పనితో జబ్బుపడి చనిపోయింది. చెత్త కుండీలో పడి ఉన్న నన్ను చిన్నారి చేతులతో ఎత్తుకుని తీసుకుని వెళ్లి నేనీ లోకాన్ని చూడడానికి దోహదపడిన అక్క ..నేనంటే ప్రాణం పెట్టె అక్క, నాకెంతో ప్రాణం అయిన అక్క ఇంక లేదు.. ఎప్పటికీ రాదు. ఈ వాస్తవం జీర్ణం అయ్యాక నాకు అక్కడ ఉండాలని అనిపించలేదు. అప్పుడు నా వయసు ఏడేళ్ళు. మిగతా అక్కలను, తమ్ముళ్ళను, దేవుడిచ్చిన అమ్మ, నాన్నలను వెతుక్కుంటూ కనిపించిన రైలెక్కాను. ఎక్కడ దిగానో, అది ఏ స్టేషనో తెలియదు. అదే లాస్ట్ స్టేషన్ అని దింపేశారు.

ప్లాట్ఫారం మీద ఏడుస్తూ కూర్చున్నాను. ఆకలి, దాహం, భయం, దిగులు.. ఒక దయామయుడు నన్ను చూసాడు. వివరాలు అడిగాడు. తనతో తీసుకుని వెళ్ళాడు. అక్కడ నా కొత్త జీవితం ప్రారంభం అయింది. ఆయనకీ పెళ్లి కాలేదు..ఆహా, చేసుకోలేదు. గడ్డం, మీసాలు లేని స్వామీజీ. ఆయన పేరు పరమహంస. ఒక్కడే ఉండేవాడు. ఆయనే వంట చేసేవాడు. ఆయన దగ్గర ఎన్నో పుస్తకాలు. రామాయణం, భారతం, భాగవతం, వివేకానందుడి ఉపన్యాసాలు, మరెన్నో గ్రంధాలు. ఎప్పుడూ చదువుకుంటూ, లేదా బొమ్మలు గీసుకుంటూ ఉండేవాడు. నెమ్మదిగా నాకు కూడా చదువు చెప్పడం, బొమ్మలు గీయడం నేర్పడం మొదలుపెట్టాడు. నేను ఆయనని స్వామీ! అని పిలిచేవాడిని.

రోజూ ఉదయం నిద్ర లేచి ఇల్లంతా శుభ్రం చేయడం, ఆయన చదివి టేబుల్ మీద వదిలేసిన పుస్తకాలు రాక్స్ లో సర్దడం, వంట చేస్తుంటే సాయం చేయడం, గిన్నెలు కడగడం ఇలా ఆయనకీ నేను కుడిభుజం అయ్యాను.

ఒకరోజు నన్ను ఒక ఆశ్రమం లాంటి స్కూల్ కి తీసుకుని వెళ్ళారు. అది గురుకులం. అక్కడ నన్ను ఒక గురువుగారికి అప్పచెప్పి, "ఇక్కడే ఉండి బాగా చదువుకో. మంచి భవిష్యత్తు ఉంటుంది. నేర్చుకున్నవి మర్చిపోకుండా ప్రాక్టీసు చేస్తూ ఉండు. నా దగ్గర ఎక్కువ కాలం ఉంటే నీకు భవిష్యత్తు ఉండదు" అని నాకు ధైర్యం చెప్పి వెళ్ళిపోయారు. నేను గుండె పగిలేలా ఏడ్చాను. కానీ ఆయన సర్వసంగ పరిత్యాగి. నువ్వు ఆయనకీ ఒక కొత్త బాధ్యత. ఆ బాధ్యత ఆయన ఎక్కువకాలం మోయలేరు. ఇక్కడ నీకు ఏ లోటూ ఉండదు. నాతొ రా" అంటూ ఆశ్రమం లోపలికి తీసుకుని వెళ్ళారు గురువుగారు.

అక్కడే స్కూల్ ఫైనల్ దాకా చదువుకున్నాను. స్వామీజీ దగ్గర నేర్చుకున్న చిత్రకళకి నా సృజనాత్మకత జోడించి ఆ కళను ఇంప్రూవ్ చేసుకున్నాను. ఆశ్రమం వాళ్ళదే డిగ్రీ కాలేజి కూడా ఉంది. అక్కడ నా బి.కాం పూర్తీ చేసాను. రెక్కలు ఇవ్వడం వరకే వాళ్ళ బాధ్యత.. ఎగిరిపోవడం మా నిర్ణయం. నేనూ ఒక ఉద్యోగం చూసుకుని గురువుగారి దగ్గర సెలవు తీసుకున్నాను."

సూర్య చెప్పడం ఆపి మంచినీళ్ళు తాగి, "ఇక్కడ నుంచి మరోకథ మొదలు. అది రేపు చెబుతాను" అన్నాడు.

నా ఆత్రుత ఆపుకుని సరే అన్నాను.

## 20

ఆ రాత్రి సూర్య గురించే ఆలోచిస్తూ పడుకున్నాను. చాలాసేపు నిద్రపట్టలేదు. మధ్య, మధ్య లేచి, మంచినీళ్ళు తాగి మంచం మీద అచేతనంగా కూర్చుని, అతని మాటలు మననం చేసుకుంటూ ఉంటే, ఈ ప్రపంచంలో నేనే కాదు, నాలాంటి దౌర్భాగ్యులు చాలామంది ఉన్నారన్న నగ్నసత్యం బోధపడినట్టు అనిపించింది. . ఒక విధంగా గుణ కూడా కష్టాల్లోనే ఉన్నాడు.. అవి ఆర్దికపరమైనవి. అతనికి అమ్మా, నాన్న, చెల్లి అందరూ ఉన్నారు. కానీ, నాకూ, సూర్యకి ఎవరూ లేరు. మేము బతికి ఉన్నా, చనిపోయినా బాధపడేవాళ్ళు ఎవరూ లేరు. మహా అంటే గుణ కొన్ని రోజులు బాధపడతాడు.. ఆ తరవాత మర్చిపోతాడు. మనసు నిండా శూన్యం ఆవరించింది.

గాఢ నిద్రలో ఉన్న గుణ బాత్రూమ్ కి వెళ్ళాల్సి వచ్చి లేచాడు. చీకట్లో నడి మంచం మీద కూర్చున్న నన్ను చూసి ముందు ఉలిక్కిపడి, తరవాత " ఏమైంది మహా! ఎందుకట్లా కూర్చున్నావు? నిద్రపట్టడం లేదా!" అని అడిగాడు.

"అవును గుణా! ఎందుకో నిద్రపట్టడం లేదు. భయంగా ఉంది" అన్నాను.

"అరె భయం ఎందుకు? చిన్నపిల్లానివా! పడుకో " అన్నాడు నా భుజం మీద చేయేసి.

సూర్య చెప్పిన అతని విషాద గాథ గుణ కి చెప్పుకోవాలి అనిపించింది. కానీ అంత రాత్రివేళ తన నిద్ర చెడగొట్టడం ఇష్టం లేక, నిశ్శబ్దంగా దిండు మీదకి వాలాను. చాలా సేపటి తరవాత నిద్రాకన్య కరుణించింది.

మర్నాడు నేను, గుణ మా యాడ్ ఏజన్సీ కి వెళ్లేసరికి, కొత్త సినిమా కి సంబంధించిన బొమ్మలేవో వేయాలిట. మమ్మల్ని చూడగానే మా యజమాని "రండి. రండి.. ఈ బొమ్మలు పెద్ద, పెద్ద కట్ ఔట్స్ చేసి, థియేటర్ కాడ  పెట్టాలె. సినిమా నెక్స్ట్ మంత్  రిలీజ్ ఆయితది.. చిరంజీవి ఫ్యాన్స్ చెప్పి పోయిన్రు.. జల్ది చేయుండ్రి" అన్నాడు.

ఆరోజు పని ఒత్తిడి వల్ల తాత్కాలికంగా సూర్య ఆలోచనలు బాధించలేదు.  రెండు రోజులు ఆ పనితోటే నేను, గుణ కూడా బిజీ అయిపోయాము. సూర్యని కలవలేకపోయాను. మూడోరోజు ఉదయమే సూర్య మా రూమ్ కి వచ్చాడు.

"ఏమై పోయావు ? నేషనల్ కాంపిటీషన్ కి నీ పెయింటింగ్ ఇవ్వలేదేంటి? దానికి ఎంట్రీ ఇవ్వాలి." అన్నాడు.

నిజమే! నేనా విషయమే మర్చిపోయాను. "సారీ సూర్యా! work లో కొంచెం బిజీ అయాను.. ఇవాళ సాయంత్రం వస్తాను." అన్నాను.

గుణ కూడా నాకు సపోర్ట్ గా "అవునన్నా! చిరంజీవి సినిమా రిలీజ్ అంట.. కట్ అవుట్ లు చేస్తున్నాం " అన్నాడు.

"సరే!, సరే! సాయంత్రం త్వరగా వచ్చేయ్.  టైం లేదు ఎంట్రీ గడువు అయిపోతుంది. నేను ఇప్పుడు పబ్లిక్ గార్డెన్ లో చిల్డ్రెన్ ఫెస్టివల్ కి వెళ్తున్నా.. వస్తాను.. బై " అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

"ఎంట్రీ ఏంటి? ఎక్కడ కాంపిటీషన్?" అడిగాడు గుణ.

విషయం అంతా వివరించి, సూర్య గురించి కూడా చెప్పి, "నువ్వన్నట్టు సూర్య జీవితం ఎంతో విషాదం. నిజానికి సూర్య చాలా గొప్పవాడు. అతని గొప్పదనం ఈ సమాజం ఎందుకు గుర్తించదు! అన్నాను.

గుణ కొంత సేపు మౌనంగా ఉండి, నా మీద తట్టి " దీపం మాట్లాడదు.. నిశ్శబ్దంగా  కాంతిని ప్రసరిస్తుంది, విజయం సాధించిన వాళ్ళు  దాన్ని  ప్రదర్శించుకోరు.. వారు సాధించిన విజయాలే వారిని గొప్పవాళ్ళను  చేస్తాయి. అతను చాలా కష్టపడ్డాడు. కానీ అది ఎప్పుడూ, ఎవరికీ  చెప్పడు." అన్నాడు.

“కానీ, సూర్య అంత గొప్పవాడు అయి ఉండి, ఇంత సింపుల్ గా ఉండడం ఏమిటి అనిపిస్తుంది. “ అన్నాను.

“అరె భాయ్.. ఇది జీవితం” అన్నాడు గుణ మరింత సింపుల్ గా.

“లైఫ్ అంటే ఇలా ఉంటుందా? మాది లైఫ్ అయితే, నోట్లో బంగారం స్పూన్ పెట్టుకుని బతికేవాళ్ళది ఏమిటి? ఏది లైఫ్? అసలు జీవితానికి సరైన అర్థం ఏమిటి? ఇలా అనేక ప్రశ్నలు నన్ను ఈగల్లా ముసురుతుంటే యాంత్రికంగా కంపెనీకి వెళ్ళి, త్వరగా పని ముగించుకుని సూర్య దగ్గరకు వెళ్లాను.

అప్పటికే సూర్య తన సరంజామా తో నా కోసం ఎదురుచూస్తున్నాడు.

“రావోయ్! కూర్చో.. ఇదిగో ఈ ఫారం ఫిల్ చేయి” అంటూ నా చేతికి ఒక అప్లికేషన్ ఫారం ఇచ్చాడు.

నేనెప్పుడూ ఎలాంటి దరఖాస్తులు చేయకపోడం వల్ల నాకు అది ఏమిటో, ఎలా చేయాలో అర్థం కాలేదు. సూర్యవైపు తెల్లమొహం వేసుకుని చూస్తూ “ ఇదంతా చూస్తుంటే నాకు భయం వేస్తోంది సూర్యా! చదువు రాదు నాకు. నీలాగా హిందీ, ఇంగ్లీష్ మాట్లాడలేను. దీనికి నాకు అర్హత ఉందా “ బేలగా అన్నాను..

“అవన్నీ ఆలోచించకు. నువ్వు గొప్ప కళాకారుడివి. నీ వ్రేళ్ళలో మాజిక్ ఉంది తేజా! బోలెడు ప్రదర్శనల్లో ఎన్నో బహుమతులు పొందిన నాకే లేని గొప్ప ఆర్ట్ నీదగ్గర ఉంది. నీ గురించి నీకు తెలియడం లేదు.. అందుకే అలా కుంచించుకుని పోతున్నావు.. అలా ఉండకు.. ధైర్యంగా ఉండు.. ఆత్మవిశ్వాసంతో ఉండు..“ గీత బోధిస్తున్న శ్రీకృష్ణుడిలా అనిపించాడు సూర్య.

“ నీ మీద నీకు నమ్మకం లేకపోతే నువ్వు అడుగు కూడా ముందుకు వేయలేవు తేజా! మనం వేసే ప్రతి అడుగు ప్రగతికి తోడ్పడాలని కోరుకుంటూ వేయాలి.. ఓటమి ఎదురైనా గెలుపు కోసం పరుగు తీయాలి.. ఇది జీవితం” అన్నాడు.

సూర్య మాటల్లో ఏదో మత్తో, మజానో తెలియదు. నేను ఎదురుచెప్పలేను. ఆ మాటలే నాలోని బెరుకుని, మొహమాటాన్ని పటా పంచలు చేస్తూ, న్యూనతా భావం అనే మంచు పరదాలను తొలగించుకుంటూ, ఒక విధమైన ధైర్యం వెచ్చని సూర్యకిరణంలా తాకసాగింది నన్ను . అతను చెప్పిన చోట సంతకాలు చేసాను. ప్రతిసారి నా డేట్ ఆఫ్ బర్త్ దగ్గర పెద్దగా ప్రశ్నార్థకం నన్ను వెక్కిరిస్తుంది. అయితే, చంద్రకాంత్ గారు సృష్టించిన డేట్ ఆఫ్ బర్త్ నే అసలుది గా భావించి తృప్తి పడడం అలవాటు అయింది. నా తండ్రి పేరు అప్పన్న అని గుర్తుంది, కానీ ఇంటిపేరు తెలియదు. అమ్మని అమ్మా అని పిలవడం తప్ప అమ్మకీ ఒక పేరుంటుందని కూడా తెలియని అయోమయస్థితి నుంచి బయటపడినా, అమ్మ పేరు మాత్రం తెలుసుకోలేకపోయాను.

ఆ రాత్రి చంద్రకాంత్ గారికి నేను సాధించిన విజయం గురించి చెప్పాలని అనిపించింది. . కానీ, అవకాశం లభించలేదు.. ఇంటి పక్కన ఉన్న పబ్లిక్ ఫోన్ పాడైంది .. ఎస్ టి డి చేయాలి.. కుదరలేదు.

ఆయన చెప్పినట్టే డైరీ మాత్రం రాయడం మర్చిపోడం లేదు.. ఆ రాత్రి కూడా జరిగినవన్నీ ఆయనకీ చెబుతున్నట్టుగా డైరీ లో రాసుకున్నాను. చివరలో ఇలా రాసుకున్నాను. "అయ్యగారూ! మీరు నన్ను దీవించి పంపారు కదా! అవి వృధా అవలేదండి. త్వరలో నేను జాతీయస్థాయి చిత్రకళా ప్రదర్శనలో పాల్గొనబోతున్నాను. మీ దీవెనలు కావాలి. ఇస్తారుగా!"

కళ్ళు మూసుకుని గతానికి, వర్తమానానికి సంధిచేసుకోడానికి ప్రయత్నిస్తూ పడుకున్నాను.

మరునాడు ఉదయం ఏడింటికే సూర్య తలుపు కొట్టాడు.. గుణశేఖర్, తలుపు తీసి సూర్యని చూసి నన్ను లేపాడు. సూర్య తన చేతిలో ఉన్న వార్తాపత్రిక నాకు ఇస్తూ " ఇదిగో ప్రత్యేకంగా నీ చిత్రం ఫోటో వేసి, అద్భుతమైన చిత్రం అంటూ రాసారు.. రెండు రోజులు జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్ గురించిన వార్తా కథనం " అన్నాడు.

నా శరీరం యావత్తూ కంపించింది. నా పేరు పేపర్లో వచ్చిందా! నేను అంత గొప్పవాడినా! వణుకుతున్న చేతులతో ఆ పేపర్ తీసుకున్నాను. నా కళ్ళు ఆత్రంగా అక్షరాల వెంట పరిగెత్తాయి.

ఒక్కసారిగా నా గొంతులో నుంచి బిగ్గరగా ఒక శబ్దం వచ్చింది. గుణ, సూర్య ఇద్దరూ అదిరిపడి, పడిపోతున్న నన్ను గట్టిగా పట్టుకున్నారు.

నాకు ఆ పేపర్ లో కనిపించింది నా చిత్రం కాదు.. నా పేరూ కాదు. యునిఫారం లో గంభీరంగా, హుందాగా ఉన్న చంద్రకాంత్ ఫోటో, దాని కింద పెద్ద అక్షారాల్లో ఉన్న శీర్షిక.

ఎస్. పి చంద్రకాంత్ మీద మావోయిస్ట్ ల దాడి.

కుటుంబంతో శ్రీ సూర్యనారాయణ స్వామీ దేవాలయం దర్శించుకుని తిరిగి వస్తున్న......

నా చేతిలో పేపర్ జారిపోయింది.. రెండు చేతులూ మొహానికి అడ్డు పెట్టుకుని. " బాబుగారూ! మీరూ నన్ను మోసం చేశారా!" అంటూ పెద్ద పెట్టున ఏడవసాగాను. సూర్య, గుణశేఖర్ నిశ్చేష్టులై స్తంభించినట్టు నిలబడిపోయారు.

“అయిపోయింది మిత్రులారా! నాకున్న ఒకే ఒక కొండంత అండ కూలిపోయింది. ఇంక నాకెవరున్నారు? అని భోరున ఏడుస్తున్న నన్ను చెరో చేత్తో పట్టుకుని మంచం మీద కూర్చోబెట్టి సూర్య, గుణ ఓదార్చసాగారు. కానీ, ఎందరు ఓదార్చినా ఆగడానికి నా కంట కారుతున్నది మామూలు కన్నీళ్లు కాదు, మహా సముద్రాలు”.

నిజాయితీకి, క్రమశిక్షణకి మారు పేరైన చంద్రకాంత్ గారిని చంపడానికి ఆ దుర్మార్గులకి చేతులెలా వచ్చాయి? ఆయన అందరికీ ఉపకారమే తప్ప చీమంత అపకారం కూడా చేయలేదే! దేవుడా! నీలో ఎంత కాఠన్యం ఉంది! ఎంత అణచుకున్నా దుఃఖం ఆగడం లేదు.  ఆ దుఃఖం నుంచి బయట పడేయడానికి గుణశేఖర్, సూర్యలకి చాలా కష్టం అయింది. మూడు రోజులు తిండి, నీళ్ళు మానేసి ఒంటరిగా కూర్చుని ఏడ్చాను.. ఎందుకు నా జీవితం తో ఆడుకుంటున్నాడు దేవుడు?  నా అనే వాళ్ళను అందరినీ ఎందుకింత నిర్దయగా నా నుంచి లాక్కుంటున్నాడు?  నేను చేసిన నేరం ఏంటి? అని కన్నీళ్ళతో అడుగుతున్న నావైపు ఇద్దరూ నిస్సహాయంగా చూసారు.

గుణశేఖర్ సూర్యని పట్టుకుని వెక్కి, వెక్కి ఏడుస్తూ “ నువ్వే కాపాడన్నా దోస్త్ ను“ అన్నాడు.

“ భగవంతుడు మనుషులను కలుపుతూ ఉంటాడు,  విడదీస్తూ ఉంటాడు.. ఇలా ఎందుకు చేస్తావు? అని కానీ, ఎందుకు చేసావు? అని కానీ మనం భగవంతుడిని ప్రశ్నించలేము..“ అని నిట్టూర్చి, నాకు దగ్గరగా  కూర్చుని తనకి తోచిన మాటలు చెబుతూ నన్ను మామూలు మనిషిని చేయడానికి విశ్వప్రయత్నం చేసాడు .

ఏది జరిగినా, ఎలా జరిగినా సూర్య,చంద్రులు గతి తప్పరు.. ఋతువులు మారకా తప్పదు. హేమంతం, వసంతం, గ్రీష్మం, అన్నీ యధావిధిగా తమ కర్తవ్యమ్ నెరవేరుస్తూనే  ఉంటాయి. నేనూ నా కర్తవ్యమ్ నెరవేర్చాలి. బతకాలి..

నెమ్మదిగా ఒక వారం తరవాత  కొద్దిగా కోలుకుని తిరిగి తన రొటీన్ లో పడ్డాను. పగలు పనిలో పడి మర్చిపోయినా,  రాత్రిళ్ళు మాత్రం వెక్కి, వెక్కి ఏడుస్తూ ఉండడం చూసి గుణశేఖర్  ఏం చేయాలో పాలుపోక,  మరునాడు మా  యజమాని దగ్గర  ఐదువేలు అడ్వాన్స్  తీసుకుని, ఒక చిన్న టి.వి కొనుక్కుని వచ్చాడు.  గుణ నన్ను ఆ విషాదం నుంచి బయట పడేయడానికి చేస్తున్న కృషి చూసి, నన్ను నేను తిట్టుకున్నాను.  నా వలన నా మిత్రుడికి కూడా శాంతి లేకుండా చేస్తున్నానా అనిపించింది. మామూలుగా అవడానికి నన్ను నేను ఆయత్తం చేసుకోడానికి, టి వి లో సినిమాలు చూస్తూ, నెమ్మదిగా కోలుకున్నాను.

రెండు నెలల తరవాత బెంగుళూరు లో నా  చిత్రాల ప్రదర్శనకి అనుమతి లభించింది. దానికి సంబంధించిన వ్యవహారం మొత్తం సూర్య చూసుకున్నాడు.

బెంగుళూరు బయలుదేరాల్సిన రోజు చేతిలో టికెట్స్ పెట్టి, గుణని కూడా తోడుగా తీసుకుని వచ్చి, బెంగుళూరు వెళ్ళే రైల్లో ఎక్కించి ఎన్నో జాగ్రత్తలు చెప్పి, "శుభవార్తతో తిరిగి రా తేజా! అంతా జయం కలుగుతుంది" అని వీడ్కోలు చెప్పాడు.

గుణ కూడా బై చెప్పి, " జాగ్రత్త తేజా! నీకేదన్నా తెలియకపోతే ఎవరినైనా అడుగు.. మన తెలుగువాళ్ళు చాలా మంది ఉంటారు" అని చెప్పాడు. వాళ్ళ ప్రేమకి, అభిమానానికి నా మనసు పులకించిపోయింది. చేతులూపుతూ వెళ్తున్న నా ప్రియమైన స్నేహితులను చూస్తూ ఉంటే, సూర్య మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనించాయి. "మన దగ్గర ఆస్తులు, ఆశలు ఏమీ లేవు అంటే మన తప్పు కాదు, కానీ మన దగ్గర ఒక స్నేహితుడు కూడా లేకపోతే మాత్రం అది మన తప్పే."

నేను ఏ తప్పు చేయలేదు మిత్రులారా! బెంగుళూరు వైపు వెళ్తున్న యశ్వంత్ పూర్ ఎక్స్ ప్రెస్ లో విండో సీటు లో కూర్చుని కదిలిపోతున్న దృశ్యాలు చూస్తున్నాను. చాలాకాలం తరవాత ఒంటరితనం వెతుక్కుంటూ వచ్చి నా మనసులోకి దూరినట్టు అనిపించింది. గుణశేఖర్, సూర్యల స్నేహం ఎడారి లాంటి నా జీవితంలో అనూహ్యంగా విరిసిన పూదోట.. ఆ స్నేహ పరిమళాలు నన్ను బతికించడమే కాదు.. బతుకు మీద మమకారాన్ని కలిగించాయి. కానీ, హాయిగా ఆనందంగా సాగుతున్న జీవితంలో మరో కల్లోలం చంద్రకాంత్ గారి మరణం. సాక్షాత్తూ మహాలక్ష్మి అవతరించినట్టు చిరునవ్వుతో, నుదుట పెద్ద కుంకుమ బొట్టుతో, గద్వాల చీరలతో కనిపించే అమ్మగారు ఇప్పుడు కళావిహీనంగా నా కళ్ళముందు కనిపిస్తున్నది.. చరణ్ ఎలా ఉన్నాడో! తండ్రి పోయిన దుఖాన్ని ఎలా తట్టుకుంటున్నాడో! వెళ్లి ఒక్కసారి పలకరించాలన్నా వాళ్ళు ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారో తెలియదు. తెలుసుకుని వెళ్ళడం పెద్ద కష్టం కాదు.. కానీ, తనని గుర్తుపడతారా. ఒకవేళ గుర్తుపట్టినా, ఆదరిస్తారా! అన్నీ ప్రశ్నలే.. సందేహాలే.. మనసు వెళ్లాలని తహ,తహలాడుతోంది.. వెళ్లి ఏం చేస్తావు? ఏమనిఓదారుస్తావు? అని అంతరాత్మ ప్రశ్నిస్తోంది.

సంఘర్షణ, సమరం.. మనసుకీ, మెదడు కీ మధ్య యుద్ధం.. కళ్ళుమూసుకున్నాను ..మూసుకున్న రెప్పల మీద లక్ష్మీదేవి కొత్త రూపం కదులుతూ గుండె బద్దలై పోతోంది.. పరిగెడుతున్న రైలు శబ్దంకన్నా నా గుండె కొట్టుకుంటున్న శబ్దం పెద్దగా వినిపిస్తోంది. నాకేనా! చుట్టూ కూర్చున్న ప్రయాణీకులందరికీ నా గుండె శబ్దం వినిపిస్తోందా ! చుట్టూ కలయ చూశాను.

కొందరు కిటికీలోంచి బయటకి చూస్తున్నారు. కొందరు ఆకలి వేస్తోందేమో తెచ్చుకున్న పోట్లాలు విప్పి అందులోని పదార్థాలు తింటున్నారు. కొందరు పుస్తకాలు చదువుకుంటున్నారు. అందరూ వారి, వారి పనుల్లో

ప్రశాంతంగా ఉన్నారు. నాలా ఎవరూ టెన్షన్ గా ఉన్నట్టు అనిపించలేదు. ఎందుకుంటారు? అవును ఎందుకుంటారు? అందరూ నాలాంటి దురదృష్టవంతులే ఉండరు కదా!.

నిజానికి ఎంతో సంతోషంగా ఉండాల్సిన సమయం.. కానీ లేదు.. సంతోషం అసలు లేదు. నా ప్రగతిని హృదయపూర్వకంగా ఆస్వాదించి, అభినందించే ముఖ్యమైన వ్యక్తి వెళ్ళిపోయాడు.. ఇంక ఎవరికోసం ఈ పోటీలు? ప్రదర్శనలు?.

స్టేషన్ కి ఎవరో వచ్చి , నన్ను తీసుకుని వెళ్లి రెండు రోజులు ఆతిథ్యం ఇస్తారు అని చెప్పాడు సూర్య. " నీకేం భయం లేదు.. ఇది నీకు వచ్చిన సువర్ణావకాశం.. ఎంతోప్రయత్నం చేస్తే కానీ ఎవరికీ దక్కని ఒక మంచి అవకాశం.. గుడ్ లక్" అని అభినందించి పంపించాడు.

ఎవరీ సూర్య? ఎవరీ గుణశేఖర్? వాళ్ళకీ, నాకూ ఏమిటి సంబంధం! అసలేంటి ఈ జీవితం? ఎక్కడినుంచి ఎక్కడికి తీసుకువెళ్తోంది? నా అనే వాళ్ళని, నా వాళ్ళని నిర్దయగా తీసుకువెళ్ళిన ఈ విధి నాకేమి సంబంధం లేని వాళ్ళతో ఎందుకిలా కలుపుతోంది! సూర్య ఎంత మంచివాడు!దేవుడు.. అవును దేవుడు నెత్తిన కిరీటంతో ఒంటినిండా నగలతో, పట్టు వస్త్రాలతో, మెడలో పూల దండలతో సినిమాల్లో చూపించినట్టు ఉంటాడా! దేవుడు మనిషి రూపంలోనే ఉంటాడు.. ఎప్పుడు, ఏ సమయంలో ఎంతవరకు ఆదుకోవాలో అంతవరకే ఆదుకుంటాడు . అలాగే ఆదుకున్నాడు. ఒకసారి సింహాచలం లాగా, ఒకసారి చంద్రకాంత్ గారిలాగా, ఇప్పుడు సూర్య, గుణశేఖర్ లాగా.. కళ్ళల్లో సుడులు తిరుగుతున్న నీళ్ళు తోటి ప్రయాణీకుల దృష్టిలో పడకుండా అలా కిటికీ లో నుంచి చూస్తూనే ఉన్నాను.

చీకట్లో దృశ్యాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏవో పెద్ద, పెద్ద చెట్లు వెనక్కి వెళ్తూ ప్రయాణీకులను ఆటపట్టిస్తున్నాయి. దయ్యాలు, భూతాలు కలిసి చేస్తున్న నాట్యానికి లయబద్ధంగా పాట పాడుతున్నట్టుగా ఉంది రైలు శబ్దం.

పక్కన కూర్చున్న యువకుడు పలకరించాడు. "హలో! నా పేరు అజయ్.. సాఫ్ట్ వేర్ ఇంజనీర్" అన్నాడు పరిచయం చేసుకుంటూ. పచ్చగా, పొడుగ్గా, అందంగా, రిచ్ గా ఉన్నాడు.

నేను వేసుకున్న సాధారణమైన పాంట్, ఖాకీ చొక్కా అతని బట్టల ముందు వెల ,వెల బోతుంటే కొంచెం న్యూనతా భావంతో "నా పేరు మహా.. మహాతేజ" అన్నాను సూర్య పేరులో సగం కలిపి.

"గుడ్ నేమ్ ఏం చేస్తున్నావు?" ఏక వచనంతోటే సంభాషణ సాగిస్తూ అడిగాడు.

సిగ్గుగా అనిపించింది. సాఫ్ట్ వేర్ కాదు.. మామూలు గ్రాడ్యుయేట్ కూడా కాదు.. కొన్ని అక్షరాలు మాత్రం తెలిసిన ఒక అనాథని అని చెప్పడానికి గొంతులో ఏదో అడ్డు పడినట్టు అనిపించింది.

" మీది బెంగళూరా!" అడిగాడు సమాధానం కోసం ఎక్కువ సేపు ఎదురు చూడకుండా.

" కాదు హైదరాబాద్.." అప్రయత్నంగా అన్నాను.

అతనికి నేను చిత్రకారుడిని అని చెప్పాలనిపించింది. నాలో ఉన్న ఒక చిన్న గొప్పతనం చెప్పుకోడానికి వచ్చిన అవకాశం వదులుకోకుండా కొంచెం ఉత్సాహం తెచ్చుకుని చెప్పాను " ఆర్ట్ ఎగ్జిబిషనలో పాల్గొనడానికి వెళ్తున్నా.."

" ఓ నువ్వు ఆర్టిస్టా! " అతని కళ్ళల్లో ప్రశంస ..

" అవును నాకు ఆర్ట్ అంటే చాలా ఇష్టం .. చిన్నప్పటి నుంచి ఏది కనిపిస్తే అది గీయడం అలవాటు"రెట్టించిన ఉత్సాహంతో చెప్పాను .

" ఓ ! గుడ్ .. ఎన్ని రోజులు ఆర్ట్ ఎగ్జిబిషన్ ?" కుతూహలంగా అడిగాడు.

" రెండు రోజులు.. "

" నీ పెయింటింగ్స్ పంపించావా! "

" నా ఫ్రెండ్ పంపించాడు. "

" మంచి ఫ్రెండ్... స్నేహితుడు అంటే అలాగే ఉండాలి." నవ్వుతూ అన్నాడు అజయ్. తిరిగి అడిగాడు " సేల్ కి పెడతావా! "

నేను మాట్లాడలేదు. నాకు మాత్రం ఏం తెలుసు! దేవుడి దయ వల్ల గాంధీ చిత్రం కొనుక్కున్నట్టు ఎవరైనా అభిరుచి గల గొప్ప వ్యక్తి కనిపిస్తే, అవి అమ్మడానికి ఏమాత్రం అభ్యంతరం లేదు.

"విదేశాల్లో ఇలాంటి ప్రదర్శనలప్పుడే వాళ్ళ పెయింటింగ్స్ కింద రేటు కూడా రాస్తారు. అక్కడ ఆర్టిస్ట్ లని ఎంతో గౌరవిస్తారు.. ఎంత ఖరీదు అయినా నచ్చిన పెయింటింగ్ కొంటారు.. పికాసా తెలుసా!"

" సూర్య చెప్పాడు.. "

" మన దగ్గర కొనే వాళ్ళు తక్కువ...చూసేవాళ్ళు ఎక్కువ.. నువ్వు అదే ప్రొఫెషన్ గా తీసుకోవాలంటే ఎంతో కొంత రేట్ ఫిక్స్ చేసి పెట్టు.. ఎవరైనా కొనుక్కోవచ్చు. "

అజయ్ సూచన నచ్చింది.. అవును ఇంక ఇదే నా జీవనాధారం. కనీసం ఆ బొమ్మలు వేయడానికి అయిన ఖర్చు, కలర్స్ , కాన్వాస్, పెన్సిల్స్ , రోజులు, రోజులు, నిద్రాహారాలు మాని వెచ్చించిన అమూల్యమైన సమయం విలువ అయినా, చిత్రాల ద్వారా వస్తే చాలు.

"అకామడేషన్ ఎక్కడ ఇచ్చారు? వెన్యూ ఎక్కడ?" అడిగాడు అజయ్.

"నాకేం తెలియదు.. వాళ్ళు రమ్మన్నారు వెళ్తున్నా. స్టేషన్ కి ఎవరో వచ్చి రిసీవ్ చేసుకుంటారుట. ఆ తరవాత వాళ్ళు ఎక్కడికి తీసుకు వెళ్తే అక్కడికి వెళ్తాను."

నా వైపు చిరునవ్వుతో చూస్తున్న అజయ్ మొహంలో నా పట్ల ఏదో అభిమానం కనిపించింది.

" మొదటిసారి వస్తున్నావా బెంగుళూరు" అడిగాడు.

" అవును...".

ఇంతలో డిన్నర్, డిన్నర్ అంటూ వినిపించడంతో, " డిన్నర్ తెచ్చుకున్నావా" అడిగాడు అజయ్. లేదు అన్నట్టు తల అడ్డంగా ఊపాను . రెండు డిన్నర్ అంటూ చెప్పి పర్స్ తీసి తనే డబ్బులిచ్చాడు అజయ్..

" ఒద్దండి..." కంగారుగా అన్నాను.

" దట్స్ ఓకే .... సరదాగా కలిసి తిందాం " అన్నాడు అజయ్. అతనిలోని ఆ స్నేహ స్వభావం నన్ను మూగవాడిని చేసింది. ఎంత మంచివాడు! చిత్రం. దేవుడు నాకు ఎప్పుడూ మంచి మనుషులతోటే స్నేహబంధాలు కలుపుతున్నాడు.

"మీ పేరెంట్స్ ఏం చేస్తుంటారు.." అటూ, ఇటూ ఊగుతున్న రైలు కదలికలకి, సన్నగా వీస్తున్న గాలికి కదిలే చెట్టు కొమ్మలా ఊగుతూ అడిగాడు అజయ్.

అబ్బా! రాకూడని ప్రశ్న.. అప్రయత్నంగా తల వంచుకుని " నాకెవరూ లేరండి.. సూర్య, గుణ అని ఇద్దరు స్నేహితులు మాత్రం ఉన్నారు."అన్నాను .

సీటుని ఆనుకుని కూర్చున్న అజయ్ గబుక్కున కొంచెం ముందుకి ఒంగి, నా కుడిచేయి తన చేతిలోకి తీసుకుని ఆదరంగా నొక్కి.. " ఒకే...ఓకే..సారీ" అన్నాడు.

మండుటెండలో మలయమారుతం అనిపించింది ఆ స్పర్శ.

" సూర్యనేఈ ఎగ్జిబిషన్ లో నా ఆర్ట్ ప్రెజెంట్ చేయడానికి ఎంట్రీ పంపాడు. తన ప్రోత్సాహం తోటే బయలుదేరాను.. నాకు ఇంత పెద్ద ప్రదర్శనలో పాల్గొనే ధైర్యం లేదు.."

సానుభూతిగా చూసాడు అజయ్. " నిన్ను పిక్ అప్ చేసుకోడానికి ఆర్గనైజర్స్ వస్తారు అన్నావుకదూ!"

" అవును సూర్య చెప్పాడు"

" గుడ్...వాళ్ళ ఫోన్ నెంబర్, అడ్రెస్ తెచ్చుకున్నావా !"

తలూపాడు తేజ. ఇంతలో డిన్నర్ వచ్చింది.

ఇద్దరూ తినడం పూర్తి చేసాక అప్పర్ బర్త్ మీదకి వెళ్ళిపోయాడు అజయ్. మిడిల్ బెర్త్ వచ్చిన ఒక మధ్య వయస్కుడికి, నా లోయర్ బెర్త్ ఇచ్చి, నేను మిడిల్ బెర్త్ మీదకి వెళ్ళి పడుకున్నాను.

స్టేషన్ రాగానే అజయ్ ముందుగానే లేచి బెర్త్ దిగి నా కాళ్ళ మీద కొట్టి లేపాడు.

ఉలిక్కిపడి లేచి, బెర్త్ దిగి అడిగాను "ఇదేనా బెంగుళూరు స్టేషన్.."

" ఎస్" అన్నాడు అజయ్.

బ్యాగ్ తీసుకుని అతనితో పాటే రైలు దిగాను. ప్లాట్ ఫార్మ్ మీదకి వచ్చాక అటూ, ఇటూ చూస్తూ నిలుచున్నాను. తను వెళ్ళిపోబోతూ ఆగి, "వచ్చారా నిన్ను పికప్ చేసుకునే వాళ్ళు" అడిగాడు అజయ్.. " వాళ్లేవారో నాకు తెలియదు కదా! చూస్తున్నాను" అన్నాను వెతుకుతూ.

"సరే! వాళ్ళు వచ్చిందాకా వెయిట్ చేస్తాను" అని బ్యాగ్ భుజానికి తగిలించుకుని, నాతొ పాటు ఎదురుచూస్తూ నిలబడ్డాడు. పది నిమిషాలు గడిచినా ఎవరూ రాలేదు. "వాళ్ళ ఫోన్ నెంబర్ ఉందా నీ దగ్గర" అడిగాడు.

" ఉంది" అంటూ జేబులో నుంచి వాళ్ళ దగ్గరనుంచి వచ్చిన ఆహ్వానం లెటర్ తీసి చూపించాను. అది చూసి " ఓ ఈ ఆడిటోరియమా! మా ఇంటి దగ్గరే.. నాతో రా నేను తీసుకుని వెళ్తాను" అన్నాడు.

సందేహంగా చూసాను. నా సందేహం గమనించి నవ్వుతూ " ఫర్వాలేదు రా.. నేను కూడా వెళ్ళిపోతే నీకు ఇబ్బంది అవుతుంది. వాళ్ళు ఎవరో వచ్చే ఉంటారు కానీ, నిన్ను గుర్తు పట్టలేదేమో! కమాన్ మనం వెళదాం నిన్ను పది గంటలకు అక్కడ దింపే బాధ్యత నాది" అన్నాడు.

అతని బలవంతం మీద అతనితో కలిసి టాక్సీ లో అతని ఇంటికి వెళ్ళాను. ఒక చిన్న ఇండిపెండెంట్ ఇల్లు. గేటు చప్పుడు అవగానే లోపలి నుంచి దాదాపు పరిగెత్తుకుంటూ వచ్చింది ఆమె. ఇరవై రెండేళ్ళు ఉంటాయి.. నిండుగా పూసిన జాజిపూల పందిరిలా, సౌరభాలతో నిండిన పూలవనంలా, చంద్రుడి నుంచి వెన్నెల అద్దుకుని కిందికి జారిన మబ్బుతునకలా ఆమె.

అజయ్ ఆమె నడుం చుట్టూ చేయేసి "హవార్యూ డార్లింగ్" అంటూ, తేజాని చూపిస్తూ అన్నాడు. " ఈ అబ్బాయి ఆర్టిస్ట్ ... ఇక్కడే ఆర్ట్ ఎగ్జిబిషన్లో పార్టిసిపేట్ చేయడానికి వచ్చాడు. అతన్ని రిసీవ్ చేసుకోడానికి ఎవరో వస్తామన్నారట కనిపించలేదు.. మనకి దగ్గర కదా! నేను డ్రాప్ చేస్తానని నాతొ రమ్మన్నా.. పాపం ఫస్ట్ టైం వచ్చాడు బెంగుళూరు" అని ఆమెకి చెప్పి నా వైపు చూసి "ఈమె నా భార్య ప్రియాంక" అన్నాడు.

జీవితంలో మొదటిసారిగా ఒక అపురూపమైన స్త్రీని చూస్తున్నాను. స్త్రీ అంటే ఇలా ఉంటుందా!

"రండి లోపలికి" చిరునవ్వుతో ఆహ్వానించింది ప్రియాంక ..

అజయ్, ఆమె ముందు నడుస్తుంటే వెనకే నడుస్తున్న నాలోని చిత్రకారుడు నిద్రలేచాడు. వంపులు తిరిగిన ఆమె నడుం, పిరుదుల దాకా వేళ్ళాడుతున్న పెద్ద జడ, పచ్చటి మెడ, వెనక నుంచి చూస్తూ ఈమేనా ఊర్వశి అంటే! వడ్డాది పాపయ్య గారి బొమ్మకి ప్రాణం వచ్చిందా! ఇంతవరకూ అమ్మాయిలను, ఇంత దగ్గరగా చూడలేదు. నేను పని చేసే చోట నలుగురు అమ్మాయిలుఉన్నారు. వాళ్ళని ఏనాడూ కళ్ళెత్తి సరిగా చూడలేదు. రోడ్డు మీద ఎందఱో అమ్మాయిలు తిరుగుతారు. ఎవరి వైపు చూడలేదు.. ఎవరితో పరిచయం, స్నేహం ఏమి లేవు. అమ్మాయి అంటే ఇంత అందంగా ఉంటుందా! ఈ అమ్మాయి మాత్రమే ఇంత అందంగా ఉందా! వెన్నెల మడుగు, పూలతోట సంగమిస్తే ఉద్భవించిందా ఈ సౌందర్యరాశి!

21 వ భాగం

**"నువ్వు స్నానం** చేసి రెడి అవు తేజా! బ్రేక్ ఫాస్ట్ చేసి మనం వేన్యుకి వెళదాం నిన్ను డ్రాప్ చేసి నేను ఆఫీస్ కి వెళ్తాను" అన్నాడు అజయ్ ..

నా కళ్ళ ముందు ప్రియాంక దేవలోకం నుంచి దిగివచ్చిన దేవతలా కదలాడుతుంటే అన్యమనస్కంగా ఉన్న నేను, అజయ్ మాటలతో ఉలిక్కిపడి తడబడుతూ "అ.. అలాగే అన్నాను. "

"రా! నీకు బాత్రూం చూపిస్తాను." యాంత్రికంగా అజయ్ ని అనుసరించాను.

స్నానం , రెడీ అయి వచ్చేసరికి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న అజయ్ " రా తేజా! బ్రేక్ ఫాస్ట్ చేద్దాం" అంటూ పిలిచాడు. మొహమాటంగా, అడుగులో అడుగు వేస్తూ నడిచి వెళ్లి కుర్చీలో చివరికి అంచు దగ్గరగా కూర్చున్నాను .

" అంత మొహమాట పడకు ఫ్రీగా ఉండు " అన్నాడు అజయ్.

ఇడ్లి ప్లేట్ లో వేస్తున్న ఆమె చేతులని చూస్తున్నాను. పసుపు, కుంకుమ రంగరించి, గులాబీ రేకులు వేళ్ళ చివర అద్దినట్టు ఉన్నాయి. ఎర్రటి మట్టి గాజుల మధ్య మెరుస్తున్న బంగారు గాజులు, మణి కట్టు మీద ఆమె చేయి కదలికలకు అనుగుణంగా, లయ బద్ధంగా కదులుతూ గాలిలో సితార్ తీగలు మీటుతున్నట్టు ధ్వనిస్తున్నాయి.

" తినవోయ్" అజయ్ హెచ్చరికతో ఉలిక్కిపడ్డాను

" నీ శిష్యుడికి బాగా సిగ్గు, మొహమాటం ఉన్నట్టుంది అజయ్" నవ్వుతూ అందిప్రియాంక .

" కళాకారుడు కదా! కళాకారులంతా ఇలాగే ఉంటారేమో! " అన్నాడు అజయ్ ..

నా మొహంలోకి వెచ్చటి రక్తం పొంగుకు వచ్చినట్టు, సెగలు రాసాగాయి. మౌనంగా ఉండిపోయాను. ఆమె ముగ్గురి ప్లేట్స్ లో ఇడ్లి, చట్నీ పెట్టి, సాంబారు చిన్న, చిన్న బౌల్స్ లో వేసి ప్లేట్ ముందు పెట్టింది. అజయ్ పక్కన కుర్చీలో కూర్చుని స్పూన్ తో ఇడ్లి కట్ చేస్తూ అంది.

" నీ పేరు మహాతేజా! తేజ అనే పేరు విన్నాను కానీ, మహాతేజ ఇప్పుడే వింటున్నాను. బాగుంది.. ఎక్కడ నేర్చుకున్నావు ఆర్ట్? " ఎదురుగా కూర్చుని ఎంతో ఆసక్తిగా ఆమె అడుగుతుంటే సూటిగా ఆమె వైపు చూస్తూ సమాధానం చెప్పడానికి ఏదో బెదురు... భయం.

తలవంచుకుని కూర్చున్న నా కంటికి, చిలక పచ్చ చీర కుచ్చిళ్ళు జీరాడుతున్న ఆమె పాదాలు కనిపించాయి. పచ్చిక మీద కూర్చున్న కుందేళ్ళ జంటలా...అలల మీద తేలుతున్న కలువపూలలా..

" అతను పుట్టుకతోటే కళాకారుడు.. " నవ్వుతూ అన్నాడు అజయ్..

" ఓ! నిజం" అభినందనగా చూస్తూ అంది " అయితే నీ పెయింటింగ్స్ చూడాలి.. సాయంత్రం చూపించు ఉన్నాయా నీ దగ్గర"

కళ్ళు ఇడ్లి ప్లేట్ వైపే ఉన్నాయి. చేత్తో చిన్నముక్క తుంచుకుని చట్నీలో అద్దుకుని నోట్లో పెట్టుకుంటూ తలూపాను . నోట్లో పెట్టుకుంటే మెత్తగా కరిగిపోతున్న ఇడ్లి, సాంబారు, చట్నీ రుచి.. వడ్డిస్తున్న ఆ చేతుల సౌందర్యం, తీయగా తేనె జాలువారుతున్నట్టున్న ఆమె స్వరం..నాకు తెలియకుండానే ఐదు ఇడ్లి తినేసాను. వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లి చేతులు కడుక్కుని రాగానే నా చేతికి కాఫీ కప్పు అందించింది. దేవతే స్వయంగా తన ప్రసాదం అందిస్తున్న భావన.

నాకేదో అవుతోంది. ఒక స్త్రీని చూస్తే ఇంత అలజడి చెలరేగుతుందని తెలిస్తే, అసలు ఆమెని కళ్ళెత్తి చూసేవాడిని కాదు. కానీ విరితోట నడిచి వస్తే, దాటుకుని ఎలా వెళ్ళడం! ఎంత ప్రయత్నించినా ఆమె మీద నుంచి చూపులు మరల్చలేకపోతున్నాను .

అట్లా చూడడం తప్పే కాదు, ప్రమాదం అని నా అంతరాత్మ హెచ్చరిస్తూనే ఉంది.. కానీ చూడకుండా ఉండలేకపోతున్నాను. ఈ అనుభూతి కొత్తగా ఉంది. ఎన్నడూ ఎరుగని విచిత్రమైన స్పందనలు హృదయంలో. ఆమె దగ్గరకు వస్తే ఓ పరిమళం ఉక్కిరి, బిక్కిరి చేస్తోంది. ఆమె నడుస్తున్నా, మాట్లాడుతున్నా, నవ్వుతున్నా అన్ని భంగిమల్లో ఆమె ఓ అద్భుతంలా అనిపిస్తోంది. నా కళ్ళ ముందు కొన్ని వేల ఇంద్ర ధనుస్సులు విరుస్తున్నట్టు, చెవుల్లో ఎవరో చాలా శ్రావ్యంగా, మధురంగా శంఖం ఊదుతున్నట్టు, వందల రకాల పూల వనంలో విహరిస్తున్నట్టూ అనిపిస్తోంది.

కాఫీ తాగడం పూర్తి అయాక అడిగాడు అజయ్ " వెళదామా! " అసంకల్పితంగా తల ఊపాను. నాకిప్పుడు దేని మీదా ఆసక్తి లేదు.. నా మనసులో కొన్ని క్షణాల్లోనే చెదరని, చెరగని చిత్రంలా ఆమె నిలిచిపోయింది. నా చేతి వ్రేళ్ళు ఆమె అందాలని చిత్రించడానికి తహ, తహలాడుతున్నాయి. ప్రపంచంలోని అందాలన్నీ నా ముందు కుప్పపోసినట్టున్న ఈ బొమ్మ ముందు ఇంక ఏ బొమ్మ పనికివస్తుంది అనిపిస్తోంది.

బలవంతంగా బ్యాగ్ తీసుకుని అజయ్ వైపు నడిచాను. దగ్గరగా వచ్చి చేయి అందిస్తూ " ఆల్ ద బెస్ట్ " అంది ఆమె.

త్రుళ్ళి పడ్డాను.. అణువణువూ ఉద్వేగంతో వణికింది. ఆమె యాదాలాపంగా చాచిన ఆ చేతిని తాకాలన్నా, నా గుండె భయంతో వేగంగా కొట్టుకోసాగింది. ఆమెని తాకితే ఎక్కడ ఏ మచ్చ పడుతుందో అన్నంత సుకుమారంగా ఉన్న లతాంగి.. ఎలా తాకడం! అంటీ, అంటనట్టు తాకి "థాంక్స్" అన్నాను.

“ ప్రియా! నీకు ఆర్ట్ ఎగ్జిబిషన్ చూడాలని ఇంట్రెస్ట్ ఏమన్నా ఉందా!” అడిగాడు అజయ్.

“లేదు.. చూస్తే కొనేస్తా.. ఆ తరవాత నువ్వు తిడతావు గోడలు కనిపించకుండా ఈ పెయింటింగ్స్ ఏంటి అని “ అంది నవ్వుతూ..

“తనకి ఆర్ట్ అంటే చాలా ఇష్టం... చూసావుగా ఎన్ని ఉన్నాయో ” అజయ్ నన్ను ఉద్దేశించి చెప్తూ తలెత్తి గోడల వైపు చూపించాడు.

అప్పుడు చూసాను తలెత్తి. గోడల నిండా అందమైన పెయింటింగ్స్. అంతవరకు చూడలేదు. “ ఆమెనే ప్రాణం వచ్చిన రవివర్మ చిత్రంలా కళ్ళ ముందు కనిపిస్తుంటే నేను ఇవన్నీ ఎలా చూస్తాను” .

“ ఆర్గనైజర్స్ కి ఫోన్ చేసి వెళ్ళండి.. అక్కడ తెలిసిన వాళ్ళు ఎవరూ లేకపోతే ఎలా?” అంది ప్రియ.

“ ఓ కరెక్ట్ ... మర్చిపోయాను. ఏది నీ దగ్గర ఉన్న నెంబర్ ఇవ్వు” అడిగాడు అజయ్ మొబైల్ తీసుకుని. నేను నా ప్యాంట్ జేబులో పెట్టుకున్న చిన్న పాకెట్ డైరీ తీసి, అందులో ఉన్న నెంబర్ చెప్పాను. వెంటనే అవతల వ్యక్తి ఆన్సర్ చేసాడు. తేజ వివరాలు చెప్పి అతన్ని తను ఆడిటోరియం కి తీసుకువస్తున్నట్టు చెప్పాడు.

అతను కన్నడ కలిసిన తెలుగులో చెప్పాడు. నా ఫోటో తీసుకుని పిక్ అప్ చేసుకోడానికి ఉదయం స్టేషన్ కి వెళ్లానని, నేను కనిపించలేదని చెప్పి పదే, పదే కలిగిన అసౌకర్యానికి క్షమించమని అడుగుతూ, నా రాకకోసం ఎదురుచూస్తూ ఉంటానని చెప్పాడు. ఫోన్ డిస్కనెక్ట్ చేసి, నా భుజం చుట్టూ చేయి వేసి, ప్రియకి బై చెప్పి బయటకు నడిచాడు అజయ్.

నాకు హటాత్తుగా గుర్తుకొచ్చింది నా లగేజ్ తీసుకోవాలి కదా అని. గరాజ్ లోంచి కారు తీస్తున్న అజయ్ తో అన్నా “ నా లగేజ్...”

“ నీ అకామడేషన్ కన్ ఫర్మ్ అయాక తీసుకు వెళ్ళు.. అక్కడ ఎక్కడ పెట్టుకుంటావు?”

ఆ మాట కోసమే ఎదురు చూస్తున్నట్టు ‘సరేనండి’ అంటూ కారు డోర్ తీసుకుని గబుక్కున ఎక్కేసాను.

కారు రోడ్డు ఎక్కగానే, ఆమె గేటు మూసి వెళ్ళిపోవడం సైడ్ మిర్రర్ లో నుంచి గమనించాను.

అదృశ్యం అవుతున్న చందమామలా అనిపించింది.

" ఇదే మొదటిసారా నీ ఆర్ట్ ప్రదర్శనకి పెట్టడం.." అడిగాడు అజయ్.

" లేదు.. మొదటిసారి విశాఖపట్నం లో, రెండోసారి హైదరాబాద్ కళాభవన్ లో.. ఇది మూడోసారి"

" ఓ! నిజమా! మరి అడిగేవరకు చెప్పవేం? నువ్వెక్కడ దొరికావయ్యా బాబూ! రూపాయి టాలెంట్ ఉంటే వందరూపాయల బిల్డ్ అప్ ఇస్తున్నారు ఈ రోజుల్లో. నీకింత మొహమాటం ఏంటి? " అన్నాడు మనస్ఫూర్తిగా అభినందిస్తూ..

" థాంక్ యు" ఇబ్బందిగా నవ్వి చెప్పాను. కుడి చేత్తో స్టీరింగ్ పట్టుకుని ఎడం చేత్తో నా భుజం తట్టి " బి కాన్ఫిడెంట్ " అన్నాడు.

ఆ ఆత్మీయతకి నా హృదయంచిత్రంగా స్పందించింది.. జల,జల రాలుతున్న పొగడపూల చెట్టు కింద నిలబడిన ఫీలింగ్.

ఆడిటోరియం సమీపించింది కారు. గేటు దగ్గరే ఎదురుచూస్తున్నాడు ఆర్గనైజర్. నమస్కారాలు పెడుతూ మళ్ళీ ఉదయం జరిగిన అసౌకర్యానికి క్షమార్పణలు చెబుతూ, 'నా పేరు నటరాజ్' అంటూ తనని, తాను పరిచయం చేసుకుని " రండి, రండి " అంటూ మర్యాదగా ఆహ్వానించాడు.

" నేను ఆఫీస్ కి వెళ్ళాలి... అతనికి బెంగుళూరు కొత్త ప్రదేశం.. ప్లీజ్ టేక్ కేర్ ఆఫ్ హిమ్" అని చెప్పి నా తో "ఈ వినింగ్ నేను వస్తాను పిక్ అప్ చేసుకుంటాను " అని చెప్పి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు అజయ్ .

" రండి సార్" అంటూ నటరాజ్ లోపలికి దారి తీస్తుంటే పరిసరాలను గమనిస్తూ అతణ్ణి అనుసరించాను. అంత పెద్ద హాలు, అక్కడి ఏర్పాట్లు చూస్తుంటే కొంచెం బెరుకుగా అనిపించింది. కానీ నటరాజ్ తన కలివిడితనంతో నాలోని బెరుకును అతి కొద్ది నిమిషాల్లో పోగొట్టాడు. నా కోసం గెస్ట్ హౌస్ ఏర్పాటు చేశామని, ఎక్కడికి వెళ్ళాలన్నా, వెహికల్ కూడా ఉందని చెప్పడంతో నా మనసుకి కొంచెం ఊరట కలిగింది. ఉన్నట్టుండి నేను చాలా ఎత్తుకి ఎదిగినట్టు కొంచెం గర్వంగా అనిపించింది. ఉదయం నన్ను రిసీవ్ చేసుకోడానికి ఎవరూ రాకపోవడం వల్ల అజయ్ కి శ్రమ ఇవ్వాల్సి వచ్చిందని, వాళ్ళింటికి వెళ్ళాల్సి వచ్చిందని చెప్పాను .

"మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాను. మన్నించండి. ఇక అలా జరగదు. మీరు ఉన్న మూడు రోజులు మీకు కొంచెం కూడా ఇబ్బంది లేకుండా చూసుకునే పూచీ నాది" అన్నాడు నటరాజ్.

కాఫీ, బిస్కట్స్ అందించాడు. "వద్దు నేను టిఫిన్ తినేసి వచ్చాను" అని మృదువుగా తిరస్కరించాను .

విశాలమైన హాల్లోకి తీసుకుని వెళ్ళాడు నటరాజ్. లోపల అడుగుపెట్టగానే నిలువెత్తు పెయింటింగ్.. వీణ వాయిస్తున్న సరస్వతి, చిన్ని కృష్ణుడితో యశోద ఎంతో అందంగా, ఆకర్షణీయంగా హృదయాన్ని దోచేలా కనిపించాయి. అవి చూడగానే మనసులోనే నమస్కరించాడు. సూర్య మాటలు గుర్తొచ్చాయి. దేవతలను ఎవరూ చూడలేదు. సరస్వతి ఎలా ఉంటుందో, మహాలక్ష్మి ఎలా ఉంటుందో కృష్ణుడు ఎలా ఉంటాడో, ఎవరికీ తెలియదు. కానీ ఇలా ఉంటారని ఆ మహానుభావుడే చూపించాడు.. ఆయనే రవివర్మ. ఇప్పుడు ఆ రవి వర్మ చిత్రాలు చూస్తుంటే అణువణువూ పులకించిపోతోంది.

'రవివర్మ అంటే చిత్రకారులందరికీ గాడ్ ఫాదర్ ' అన్నాడు సూర్యే. అక్కడ చిత్రాలు చూస్తోంటే నా మనసులో నుంచి ప్రియాంక కొంచెం పక్కకి జరిగి, సూర్య వచ్చేసాడు. ప్రతి అంగుళం, అందమైన చిత్రాలతో అలంకరించారు. ఆ చిత్రాలు చూస్తుంటే సూర్య మాటలు, అతని నవ్వు ప్రతిక్షణం నన్ను పలకరిస్తూ, ఒక విధమైన ఆహ్లాదాన్ని కలిగించసాగాయి. గ్యాలరీలో అలంకరించిన చిత్రాలు చూడడంలో మునిగాను .

పొడుగాటి టేబుల్స్ మీద, మొత్తం దేశంలోని ప్రముఖ చిత్రకారుల చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. కొందరు వర్ధమాన చిత్రకారులు స్వయంగా వచ్చి పర్యవేక్షించుకుంటున్నారు. దగ్గరగా వెళ్లి ఒక్కో చిత్రం చూడసాగాను .

ఒక వైపు బాగా దగ్గర, దగ్గరగా కొన్ని బ్లాకు అండ్ వైట్ చిత్రాలు. అవి చూస్తూ కింది భాగంలో ఉన్న పేర్లు చూస్తుంటే నాకు ఒళ్ళంతా చెమటలు పట్టేసింది. మరింత దగ్గరగా వెళ్లి రెప్పవాల్చకుండా చూడసాగాను . ఎందఱో పెద్ద, పెద్ద చిత్రకారుల పేర్లు చూస్తుంటే గుండె దడ, దడ లాడింది. వీళ్ళపేర్లు తలచుకోవాలంటేనే భయం. అలాంటిది వారి చిత్రాలతో పాటు, విశాలమైన గోడ మీద ఒక పక్కగా ఉన్న నా చిత్రం చూస్తుంటే ఆనందంతో గంతులేయాలి అనిపించింది.

ఆర్గనైజర్ భోజనం ఏర్పాటు చేసాడు. సాయంత్రం అయిదు వరకూ ప్రదర్శన కొనసాగింది. పదకొండు గంటల నుంచి చాలా మంది వచ్చారు. కొందరు కొన్ని చిత్రాలు కొన్నారు. నేను ఈ ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వేసిన చిత్రం. హైదరాబాద్ లోని పాతబస్తీ లోని చిన్న, చిన్న, సన్నని సందుల్లో నివసిస్తున్న ప్రజల జీవనచిత్రం. "దాన్నే రియలిస్టిక్ థాట్" అంటారు అన్నాడు సూర్య.

సాయంత్రం ఆరు గంటలకి అజయ్ వచ్చి ఇంటికి తీసుకుని వెళ్ళాడు. నాకు అకామడేషన్ ఏర్పాటు చేయడంలో సంస్థ వారు చిన్న పొరపాటు చేయడంతో ఆ రాత్రి కూడా అజయ్ ఇంట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. నా పేరు మహాతేజ స్థానంలో మహోదయ అనే పేరు రాయడంతో కలకత్తా నుంచి వచ్చిన ఆర్టిస్ట్ మహోదయ ఆ రూమ్ ఆక్రమించుకున్నాడు. ఆయన ఇటీవల చాలా ప్రముఖ చిత్రకారుడుగా పేరు పొందాడు. ఆయన ప్రోటో కాల్ లో తేడా రావడం ఇష్టం లేని ఆర్గనైజర్ మరోసారి నాకు క్షమార్పణలు చెప్పి, రేపు ఉదయానికల్లా వేరే రూమ్ బుక్ చేస్తానని చెప్పాడు. నాకేం పెద్ద బాధ అనిపించలేదు. కారణం ప్రియాంకని మరికొంత సేపు చూడచ్చు.. ఆమె సమక్షంలో మరి కొన్ని గంటలు గడపచ్చు.

రాత్రి అయింది. నాకు గెస్ట్ రూమ్ ఇచ్చారు. మెత్తటి పరుపువేసిన మంచం, మెత్తటి బ్లాంకెట్.. నిశ్శబ్దంగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్.. నడుం వాల్చగానే, హాయిగా అనిపించింది. ఒక రేకుల షెడ్డులో , దడ ,దడ శబ్దం చేస్తూ తిరిగే పాత టేబుల్ ఫ్యాన్ దగ్గరగా, ఒక బొంత మీద నిత్యం యంత్రాల హోరుల మధ్య, కార్ఖానాలాంటి గదిలో పడుకునే నాకు , ఆ గది, ఆ చల్లదనం, ఏదో తెలియని పరిమళం ఎంతో ఆహ్లాదంగా అనిపించింది. ఆ బెడ్ మీద పడుకుని ప్రియాంక గురించి ఆలోచిస్తూ ఉంటే ఇంకా బాగుంది. మొదటిసారి జీవితం ఇంత బాగుంటుందా అనిపించింది. ఎటు చూసినా ఆమె రూపమే కనిపిస్తోంది.. నిద్రపట్టలేదు.. అలల మీద తేలుతున్న రెండు కలువలు. దిగ్గున లేచాను.

గబుక్కున మంచం దిగి, నా బ్యాగ్ లో నుంచి, రోల్ చేసి రబ్బరు బాండు చుట్టి పెట్టిన కాన్వాస్ తెరిచాను. రంగుల డబ్బాలు , కుంచె చేతిలోకి తీసుకున్నాను. పవిత్రమైన యజ్ఞం చేయడానికి కూర్చున్న సోమయాజిలా, దీర్ఘ తపస్సుకి కూర్చున్న మౌనిలా నిశ్శబ్దంగా చిత్రం గీయసాగాను. ఎప్పుడు పూర్తి చేసానో, ఎప్పుడు పడుకున్నానో కూడా నాకు తెలియదు.

తలుపు మీద దబా,దబ బాదుతోంటే మెలకువ వచ్చింది. కంగారుగా లేచి తలుపు తెరిచాను.

"బాప్ రే ఇంత మొద్దు నిద్రా! లే త్వరగా రెడీ అవు తేజా! నిన్ను ఆడిటోరియంలో డ్రాప్ చేసి నేను ఆఫీస్ కి వెళ్తాను." అజయ్ చెప్పాడు.

సిగ్గుపడుతూ తలూపాను . పది నిమిషాల్లో స్నానం చేసి రెడీ అయి వచ్చిన నన్ను చూసి ఆమె " గుడ్ మార్నింగ్" అంది హిమాలయాల మీద పూసిన నందివర్ధనం పూవులా నవ్వుతూ.

ఎంత సౌందర్యం! ఈ సౌందర్యం వర్ణించడానికి కవినైతే ఎంత బాగుండేది! అవును కవినైతే... నిరక్షరకుక్షిని.. కవినెలా అవుతాను! కానీ అవాలి. ఈ సౌందర్య రాశిని వర్ణించడానికి కవి అవాలి. ఈగీతల్లో, ఈ రంగుల్లో చెప్పలేని భావాలెన్నో అక్షరాలతో చెబితే ఎంత బాగుంటుంది! ఆమె పాదాల మీద వాలాయి నా చూపులు.

" అలల మీద తేలుతూ ప్రయాణం చేస్తున్న కలువలు... ఆమె చరణాలు " గొంతులోనే ఒదిగిపోయాయి. రాత్రంతా వేసిన బొమ్మ నగిషీలు చెక్కాలి. మరికొన్ని గంటల్లో నేను ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలి. ఇంక ఈ పాదాలు కనపడవు. ఈ నవ్వు వినపడదు. కానీ ఈ పరిమళం మాత్రం జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. ఆమె నన్ను మర్చిపోతుంది.. కానీ నేను ఆమెని మర్చిపోలేను. ఎక్కడో చదివిన వాక్యాలు గుర్తొచ్చాయి. " నువ్వు నన్ను మర్చిపోయినా నేనది తప్పుగా భావించను... అది నీ హక్కు...నీ హక్కు " అవును అది ఆమె హక్కు.

" కమాన్ తేజా! ఏంటి ఆలోచిస్తున్నావు.. ఇవాళ నీ అదృష్టానికి పరీక్ష ..పద, పద" అజయ్ తొందర చేశాడు.

ఉలిక్కిపడి తలెత్తి ఆమె వైపు చూశాను . ఆమె మొహం నిండా నవ్వు . "ది హీవెన్ ఇన్ ఎ బిగ్ ఫ్లవర్. స్వర్గం నుంచి రాలిన ఒక అందమైన పుష్పం.. "ఆమె నవ్వుతుంటే కొన్ని వందల సువర్ణ పుష్పాల సౌరభాలు గుప్పుమని తాకిన అనుభూతి..

కదలడానికి మొరాయిస్తున్న కాలు బలవంతంగా కదిపాను .

ఆర్ట్ గ్యాలరీ లో అడుగుపెట్టినా, అడుగడుగునా ఆమె రూపమే! ప్రతి చిత్రంలో ఆమే.. తప్పు చేస్తున్న భావన ఒకవైపు... చేయకుండా ఉండలేని నిస్సహాయత ఒకవైపు. ఆమె వివాహిత.. ఆమె వివాహిత అంతరాత్మ హెచ్చరిస్తోంది.

అయితే ఏం? నేనేం తప్పు చేస్తున్నాను? అందాన్ని ఆరాధించడం తప్పు అవుతుందా!

మహాలక్ష్మి లాంటి అమ్మగారిని కూడా అలా ముగ్ధుడిని అయి చూస్తూ ఉండేవాడిని. ఆమెని చూసినప్పుడు అమ్మవారి పటం చూసినట్టు అనిపించేది. ఈమెని చూస్తుంటే గర్భగుడిలో దేవతని చూస్తున్నట్టు అనిపిస్తోంది. దేవతని ఆరాధించే హక్కు భక్తుడికి ఉండదా! ఆ హక్కు కాదనే వాళ్ళు ఎవరు?

ఆమెని కలిసిన వేళా విశేషం.. నా చిత్రానికి చాలా అభినందనలు వచ్చాయి. ఒకరిద్దరు దాని ఖరీదు అడిగారు అని కూడా చెప్పాడు నిర్వాహకుడు.

ఆ వార్త విన్నాక ఎగిరి గంతేయాలనిపించలేదు. ఆమె దగ్గరకు పరిగెత్తుకుని వెళ్లి ఆ కళ్ళల్లోకి చూస్తూ నా సంతోషాన్ని పంచుకోవాలనిపించింది.

ఆ వార్త తెలుసుకున్న అజయ్ " అద్భుతం తేజా! నాకు తెలుసు తప్పకుండా నీకు ఆఫర్ వస్తుందని.. యు ఆర్ ఏ బోర్నేడ్ ఆర్టిస్ట్. పదేసి వేలు ధర నిర్ణయించు" అన్నాడు.

ఇంట్లో అడుగుపెట్టగానే ఆమె నాకు షేక్ హ్యాండ్ ఇచ్చింది. " అభినందనలు తేజా! నీకోసం గులాబ్ జామ్ చేసాను" అంటూ చేయి వదలకుండా, ఎడం చేయి చాచి టేబుల్ మీద సిద్ధంగా పెట్టుకున్న గులాబ్ జామ్ బౌల్ అందించింది. అజయ్ చిరునవ్వుతో చూసాడు.

" మీక్కూడా" మరో కప్పు అజయ్ కి అందించింది..

"నీ నెక్స్ట్ ప్రోగ్రాం ఏంటి ?" అడిగాడు అజయ్.

ఉలిక్కిపడ్డాను. ఏముంది? వెళ్లిపోవాలి... ఈ స్వర్గం నుంచి వెళ్లిపోవాలి. చేతిలో బౌల్ వణికింది.. గొణిగినట్టు అన్నాను " వెళ్లిపోవాలి కదా!"

" సరే! రేపు బస్ లో వెళ్ళు. ఇవాళ డిన్నర్ కి బయటకు వెళ్దాం ప్రియా! నువ్వేం ప్రిపేర్ చేయకు "

" ష్యూర్ " భర్త ప్రపోజల్ కి అంగీకరించింది.

నాకు కేటాయించిన గదిలోకి వచ్చేసాను. . రాత్రంతా వేసిన బొమ్మ... గోడకి అలా ఉంది. కోనేటి నీటిలో జలకమాడుతున్న దేవకన్యలా, జీవం పోసుకున్న అందమైన ప్రతిమలా ఉంది బొమ్మ. ఆకుపచ్చ చీర కుచ్చిళ్ళు జీరాడుతున్న పాదాల వేళ్ళ గోళ్ళకి ఎరుపురంగు వేశాను. ఆ పాదాల మీద గులాబీ రేకులు చల్లుతున్నట్టు గులాబీ రంగుని బ్రష్ తో చిలకరించాను. అటూ, ఇటూ తూగుతున్న కలువలు సింబాలిక్ గా.. ఆమె పాదాలను గుర్తు తెచ్చేలా తీర్చిదిద్దాను. చెంపల మీద కెంపురంగు షేడ్ ... తుమ్మెద గుంపులా ఎగురుతున్నట్టు కేశాలు.. నగిషీలు దిద్దిన ఆ చిత్రం అపూర్వంగా, ఓ గంధర్వ కన్య వ్యాహ్యాళి కి వచ్చి కోనేటి గట్టు మీద కూర్చుని నీటి అలలతో ఆడుకుంటున్నట్టు. సంతృప్తిగానే కాదు, సంతోషం నిలువెల్లా పొంగిపోయింది.

ఎంతో జాగ్రత్తగా రెండు చేతులతో ఆ చిత్రం పట్టుకుని, గదిలో నుంచి బయటకు వచ్చాను .

భార్యా,భర్తలు సోఫాలో పక్క,పక్కన కూర్చుని నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

అదిరే గుండెలు చిక్కబట్టుకుని వాళ్ళ దగ్గరకి నడిచాను. నా చేతిలో కాన్వాస్ చూస్తూ “ ఏంటి తేజా! కొత్త బొమ్మ వేశావా!” అడిగాడు అజయ్. తల ఊపాను.

“ఏది చూపించు” కుతూహలంగా అంది ప్రియాంక.

భక్తిగా, దేవతకి పూలు అందిస్తున్నట్టు, రెండు చేతులతో జాగ్రత్తగా ఆమె చేతికి ఇచ్చాను .

“ వావ్! బ్యూటిఫుల్... భలే వేశావే! ఎప్పుడు వేశావిది ?” ఆశ్చర్యంగా చూసింది.

“ రాత్రి... మీ కోసమే... మీకు గిఫ్ట్ “

“ ఓ! థాంక్ యూ ...థాంక్ యు వెరీ మచ్.. సో స్వీట్ “ ఆమె రకరకాలుగా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తుంటే అలా చూస్తూ ఉండిపోయాను మాటలు రాని పసివాడిలా .

“ చాలా బాగా వేశావు తేజా! రెండు పూటలు నీకు అన్నం పెట్టినందుకు మీ వదినకి లక్షణుడి భక్తిభావం ప్రదర్శించావు. సీతని రావణాసురుడు ఎత్తుకుని వెళ్ళిపోయాక, గరుత్మంతుడు ఆవిడ ఆభరణాలు చూపిస్తూ ఇది సీతదేనా, ఇది సీతదేనా అని హారాలు, కంకణాలు చూపిస్తుంటే నాకు తెలియదు అన్న లక్షణుడు మంజీరాలు చూపిస్తే మాత్రం అవును ఇవి సీతవే అన్నాడట. అంటే వదినగారి పాదాలు మాత్రమే చూసాడట లక్షణుడు. ఈ పాదాలు ఇంత అందంగా వేసావంటే నువ్వు లక్ష్మణుడు కాక మరేమవుతావు! “

అజయ్ మాటలతో మనసు కెలికినట్టు అయింది. నేరం చేసిన భావనతో గిల్టీగా తలవంచుకుని అక్కడినుంచి వెళ్తుంటే ప్రియాంక స్వరం వినిపించింది “ త్వరగా రెడీ అవు తేజా! డిన్నర్ కి వెళదాం “

ఖరీదైన హోటల్ లో అడుగుపెడుతుంటే, అర్హత లేని భోగాలు ఎన్నో అయాచితంగా లభించినట్టు మనసు ఆనందంతో నాట్యం చేస్తోంది. వాళ్ళిద్దరూ ఒకవైపు, నేను ఒక వైపు కూర్చున్నాము టేబుల్ దగ్గర.. పల్చని వెలుతురు టేబుల్ మీద ఫోకస్ అవుతోంది. నాకు తెలియని, నేనేనాడు రుచి చూడని ఐటమ్స్ ఏవో ఆర్డర్ చేస్తున్నారు. నేను అదేమీ ఆస్వాదించే స్థితిలో లేను. నా ముందు ఒక మహత్తరమైన సౌందర్య శిల్పం ఉంది. ఆ సౌందర్యాన్ని కళ్ళ ద్వారా నా గుండెల్లో నిక్షిప్తం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాను. కాలం ఎలా గడిచిందో నాకు స్పృహ లేదు.. వాళ్ళు ఏవో ప్రశ్నలు అడుగుతున్నారు. చాలా యాంత్రికంగా అనాసక్తంగా జవాబులు చెప్తున్నాను కానీ, నేను చెప్పే జవాబులు నాకే సంతృప్తి కరంగా లేవు.

అజయ్ నా వాలకం గమనించి “నువ్వు రాత్రంతా నిద్రపోకుండా బొమ్మ వేస్తూ కూర్చున్నావు .. అందుకే నిద్ర మత్తుతో ఉన్నావు. ఇంటికి వెళ్ళగానే పడుకో.. రేపు ఉదయం నీ ప్రయాణం ఉందిగా”అన్నాడు.

తలూపాను .

ఎదురుచూడని సమయం వచ్చింది. నేను ఇంక అక్కడి నుంచి వెళ్లిపోవాలి. కొంత విజయాన్ని, మరికొంత విరహాన్ని నా వెంట పెట్టుకుని, ఆమె దగ్గర సెలవు తీసుకున్నాను.

“మంచి, మంచి బొమ్మలు వేసి, గొప్ప చిత్రకారుడివి అవాలని విష్ చేస్తున్నాను” అంది మనసారా.

“థాంక్స్” అంటూ అజయ్ తో పాటు నా బ్యాగు, వస్తువులు తీసుకుని గేటు దాటుతూ, మరోసారి మా వెనకే వీడ్కోలు చెప్పడానికి గేటు వైపు వస్తున్న ఆమె వైపు చూసా. నవ్వుతున్న ఆమె మొహం లిప్తపాటు ఆ చూపుకి ముకుళించినట్టు అయింది. ఆమె కళ్ళల్లో “ఏంటి ఇలా చూస్తున్నాడు “ అన్న భావన కనిపించింది. గిరుక్కున మొహం తిప్పుకుని కారులో కూర్చున్నాను . గుండె దడ, దడ లాడింది.

కారు బస్ డిపో వైపు సాగుతోంది. నా ఆలోచనలు ప్రియాంక చుట్టూ తిరుగుతున్నాయి. అజయ్ ఏదో చెబుతున్నాడు. అవేవి చెవిలోకి ఎక్కడం లేదు. ఇంక ఈమెని నేను చూడనా! ఆ ఒక్క ప్రశ్న నా మనసుని అతలాకుతలం చేస్తోంది.

డిపోలో దింపి, బస్ వచ్చిందాకా ఉండి బస్ ఎక్కిన తరవాత“ జాగ్రత్త. ఇదిగో నా ఫోన్ నంబర్.. ఎప్పుడన్నా బెంగుళూరు వస్తే మా ఇంటికి తప్పకుండా రా. రావడం కాదు మా ఇంట్లోనే ఉండాలి నువ్వు. నీ పరిచయం అవడం మేము ఇద్దరం కూడా మా అదృష్టంగా భావిస్తున్నాం “ హృదయపూర్వకంగా అన్నాడు అజయ్.

నా కళ్ళు ఆ అభిమానానికి, ఆత్మీయతకి చెమర్చాయి. చేతులు జోడించి సెలవు తీసుకున్నాను .

బస్ కదిలింది. నాకు అందులో నుంచి దూకేయాలని, పరిగెత్తుకుంటూ ఆమె దగ్గరికి వెళ్లి “ నిన్ను విడిచి వెళ్ళలేను.. నీ పాదాల దగ్గర బానిసగా ఉండనివ్వు” అని ప్రాధేయపడాలని బలంగాఅనిపించింది. ఏదో వెలితి.. ఏదో కోల్పోయిన భావన. ఏం కోల్పోయాను ? తెలియడం లేదు. నిద్రలేచి ఆ దేవత మొహం చూసిన రెండు రోజులు ఎంత బాగా గడిచాయి! రేపటి నుంచి రోజు గడిచేదెలా!

పగలబడి నవ్వుతున్న అంతరాత్మ " ఇంతకాలం ఎలా గడిచింది! రెండు రోజులకే గిల,గిలా తన్నుకుంటున్నావు" అని అడిగింది.

అవును ఎలా గడిచింది! నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

ప్రేమకి ఉన్న మహత్తు అదే! ఒక్కసారి గుండె తలుపు తెరిస్తే అనుమతి లేకుండానే ప్రవేశించి తిష్టవేస్తుంది. గడిచిన జీవితం అంతా మిధ్య అని, వర్తమానమే వాస్తవం అని నమ్మమంటుంది.

ప్రేమా! నేనామెని ప్రేమిస్తున్నానా! How dare you? అజయ్ నిప్పులు కురిపిస్తూ చూస్తున్నాడు.

లేదు, లేదు.. ఆరాధిస్తున్నాను. నిజం నేను ఆమెని ఆరాధిస్తున్నాను. ఒక దేవతలా పూజిస్తున్నాను. నేను ద్రోహిని కాదు.. గట్టిగా కళ్ళుమూసుకున్నాను . "నీకు ప్రేమ ఏంటిరా పిచ్చి వెధవా! నీ నుదుట ప్రేమ అనే రెండక్షరాలు రాయలేదు బ్రహ్మ. ఇంకెప్పుడూ ప్రేమ గురించి మాట్లాడకు...ఆలోచించకు" వెన్ను మీద చరిచి మందలించింది అంతరాత్మ.

అవును. నిజమే! నాకు ప్రేమేంటి? అడ్రస్ లేని వెధవని.. నాకు ప్రేమేంటి? లేదు.. ప్రేమించను కావాలంటే ప్రమాణం చేస్తాను. ప్రమాణాలతో మనసుని నియంత్రించగలవా! పిచ్చివాడా! మళ్ళీ నవ్వింది అంతరాత్మ.

అలజడి.. అలజడి.. మనసంతా అలజడి. బలవంతంగా కళ్ళు మూసుకుని, నిద్ర పోడానికి ప్రయత్నించాను.

బస్సు దిగి ఇల్లు చేరేసరికి గుణశేఖర్, సూర్య పూల దండలతో స్వాగతం చెప్పారు..

" అయాం ప్రౌడ్ ఆఫ్ యు తేజా!" అన్నాడు సూర్య నన్ను ఆలింగనం చేసుకుని.

గుణశేఖర్ కూడా రెండు చేతులతో దగ్గరగా తీసుకుని "నువ్వు నా స్నేహితుడు అవడం నా అదృష్టం తేజా!" అన్నాడు.

వాళ్ళ నిష్కల్మషమైన, స్వచ్ఛమైన స్నేహ మాధుర్యం నన్ను వివశుడిని చేసింది. కొంచెం, కొంచెం మనసు చల్లబడుతోంటే, రొటీన్ లో పడిపోయాను కానీ, ప్రియాంక ఆలోచనలు మాత్రం నన్ను వదలడం లేదు. తిరిగి బెంగుళూరు వెళ్ళే అవకాశాల కోసం అన్వేషించ సాగాను.

రోజులు గడుస్తున్నాయి.

బెంగుళూరు నుంచి వచ్చిన దగ్గరనుంచి నాలో నాకే తెలియని ఏదో మార్పు... ఆ మార్పు ఒక్క గుణశేఖర్ మాత్రమే పసిగట్టాడు. అతనితో మాట్లాడుతూ, మాట్లాడుతూ నేనేదో ఆలోచనల్లో మునిగిపోవడం, పిలిచిన వెంటనే పలక్కపోవడం, ఎక్కువగా ఒంటరిగా గడపడం గమనించిన గుణశేఖర్ " ఏమైంది తేజా! నీలో ఏదో మార్పు కనిపిస్తోంది" అని అడిగాడు ఒకరోజు.

" మార్పా! ఏం లేదే! ఏమిలేదు గుణా! మామూలుగానే ఉన్నాను" తడబడుతూ అన్నాను.

"లేదు. ఏదో పోగొట్టుకున్నట్టు బాధపడుతున్నావు. నీ విజయం చూసి సంతోషించే అమ్మా, నాన్నా లేరని బాధపడుతున్నావా!. చంద్రకాంత్ గారిని మర్చిపోలేక పోతున్నావా ! రెండూ నీ బాధకి కారణం అవడంలో తప్పేం లేదు. కానీ, అందుకోసం ఇలా కుమిలిపోడం మంచిది కాదు. నీ కెరియర్ మీద దెబ్బ తీస్తుంది. రెండు రోజులు మా ఊరు వెళదాం వస్తావా! కొంచెం మార్పు ఉంటుంది. అమ్మకి ఆరోగ్యం బాగాలేదుట... వెళ్లి చూసి వద్దాం"

అవును ఎటన్నా వెళ్లి నాలుగురోజులు తిరిగివస్తే ఆమె నా ఆలోచనలనుంచి దూరం అవుతుందేమో! నేను తప్పు చేస్తున్నాను. ఒక వివాహితురాలిని మోహిస్తున్నానా! లేదు, లేదు... ఆరాధిస్తున్నాను. అది కూడా తప్పేగా అంది అంతరాత్మ. ఆమెని మర్చిపోవాలి... అవును మర్చిపోవాలి...

"వస్తాను.. తప్పకుండా వెళదాం " గబుక్కున అన్నాను. .

మర్నాడే ఇద్దరం గుణశేఖర్ ఊరుకి బస్సులో బయలుదేరాము.

"నేను పేదవాడిని తేజా! లేకుంటే నీ అంత గొప్ప వాడిని కారులో తీసుకుని వెళ్ళేవాడిని." అన్నాడు నొచ్చుకుంటూ గుణశేఖర్.

" నీకన్నా నేను గొప్పవాడినా గుణా ! గొప్పతనం మనిషిలో కాదు... మనసులో ఉంటుంది."

గుణ నావైపు ఒక అపరిచితుడిని చూసినట్టు చూసాడు.

"అలా చూస్తున్నావేంటి గుణా!" అడిగాను.

"నువ్వేనా! మా తేజావేనా అని అనుమానం వచ్చింది." నవ్వుతూ అన్నాడు.

నాకూ నవ్వొచ్చింది. నాకే చిత్రంగా ఉంది నాలో వచ్చిన మార్పుకి. నేను నేనేనా! అనిపిస్తోంది. సూర్య 'మహా' అనే అమాయకుడిని 'తేజా!' అనే పేరుతో గొప్ప వ్యక్తిగా మార్చినట్టున్నాడు. పేరు మార్చాక మహాలో మార్పు వచ్చింది.

నేను అలా అనుకున్న వెంటనే అన్నాడు గుణ. " సూర్య నీ పేరులో తేజ చేర్చి, నీలో తేజస్సుని నింపాడు..."

నేను గుణ వైపు చూసి అవును అన్నట్టు తలాడిస్తూ" నిజమే! తేజ అనే పేరుతొ నాలో నాకే తెలియని మార్పు వచ్చింది. ముడుచుకున్న పూవు విచ్చుకున్నట్టు అయింది నా మనసు..." అన్నాను.

గుణశేఖర్ శభాష్ అన్నట్టు నా భుజం మీద ఆప్యాయంగా చేయి వేసి నొక్కాడు.

తెలంగాణలో వరంగల్ దగ్గర ఉన్న ఒక అభివృద్ధి చెందని గ్రామం గుణశేఖర్ ఊరు. పెంకుటిళ్ళు, రేకుల ఇళ్ళు తప్ప మేడలు ఒకటో, రెండో కనిపిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేదు. ప్రజలు రోడ్డు పక్కన యధేచ్ఛగా కార్యక్రమాలు కానిస్తున్నారు. ఊరు పెద్ద అందంగా లేదు. పేద ఊరు...పేద ప్రజలు... గుణశేఖర్ ఇల్లు కూడా పెంకుటిల్లు, ఒక వరండా, ఒక చిన్న గది, దాని వెనక కట్టెల పొయ్యి ఉన్న చిన్న వంట గది...

నేను, గుణశేఖర్ తో కలిసి ఆ ఇంట్లో అడుగుపెట్టేసరికి ఆతని తల్లి నులకమంచంలో పడుకుని ఉంది. ఖళ్, ఖళ్మని దగ్గుతో లుంగలు చుట్టుకుపోతూ ఉంది. తండ్రి కింద చాపమీద పడుకుని ఉన్నాడు. అతని చెల్లెలు కాబోలు కట్టెల పొయ్యి మీద వంట చేస్తోంది... ఇల్లంతా పొగ...

ఆ సన్నివేశం చూసిన గుణ కళ్ళు వర్షించడం మొదలయాయి. చేతిలో బ్యాగ్ గోడవారగా పెట్టి, "అమ్మా! ఎట్లున్నవే " అంటూ తల్లి మంచం దగ్గర కింద కూర్చుని, తల్లి మీద చేయి వేసి గాద్గదికంగా అడిగాడు.

ఆ వాతావరణం చూడగానే నా హృదయం ద్రవించిపోయింది. నాకు పేదరికం తెలుసు. ఇంతకన్నా పేదరికం అనుభవించాను. కానీ, అప్పుడు అది పేదరికం అని, ఈ ప్రపంచంలో అందరూ అలా ఉండరని తెలియదు. అందరూ మాలాగే ఉంటారనుకున్నాను. అదే బతుకు అని కూడా అనుకుని ఉంటాను. ఇప్పుడు ప్రపంచం చూడడం మొదలు పెట్టాక, పేదరికానికి, గొప్పతనానికి అర్థం తెలుస్తోంది. ఆ ఇంట్లో ఉన్న ఆ ముగ్గురు వ్యక్తులు గుణశేఖర్ మీద ఆధారపడి బ్రతుకుతున్నారని, అతను లేకపోతే ఆ కుటుంబం లేదని అర్థం అయింది. అయితే, అంత పేదరికం లో కూడా వాళ్ళ మధ్య పెనవేసుకుని ఉన్న అనుబంధం రుచి మాత్రం నాకు అనుభవంలోకి రాకుండానే అందరినీ కోల్పోయి అనాథ అయినాను. నేను అనాథ అని గుర్తు వచ్చిన ప్రతి సారీ, నా గుండె మీద పెద్ద ముళ్ళ కంప పెట్టి గుచ్చుతున్నట్టు అనిపిస్తూ ఉంటుంది. అయినా, బంధువులే లేని నాకు బంధాలేం తెలుస్తాయి!

చాప మీద పడుకుని ఉన్న తండ్రి బాగా కృశించి ఉన్నాడు. ఆయనకి కళ్ళు సరిగా కనపడడం లేదు కాబోలు, బలవంతంగా లేచి కూర్చుని, నా వైపు కళ్ళు చిట్లించి చూస్తూ "ఎవలు బిడ్డా!" అని అడిగాడు గుణని.

"నా దోస్త్ నాయనా! నాతోని ఉంటడు... నేనే ఊరు చూడనీకి తోల్కొచ్చిన" అన్నాడు గుణశేఖర్. తెలంగాణా గ్రామీణ భాషలో మాట్లాడుతున్న గుణ నాకు వేరుగా అనిపించాడు. .. నాకు తెలిసిన గుణ కాదు.

"ఏమున్నది బిడ్డా ఈ ఊర్ల? సూడనీకి" అంటూ, నా వైపు చేయి ఊపి, "కూసో బిడ్డా" అన్నాడు తన పక్కన చోటు చూపిస్తూ.

గుణ తల్లి మౌనంగా చూసింది నా వైపు. ఆవిడ దగ్గు అడ్డుపడి మాట్లాడలేకపోతోంది. లోపల కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న చెల్లెలు వచ్చి, నాకు, గుణకి టీ ఇచ్చింది. నా వైపు ఒక పాత చెక్క కుర్చీ జరిపి "కూసో అన్నా" అంది.

ఆ పిలుపు నా గుండెలోని అనుబంధాల తంత్రుల్ని మీటినట్టు అనిపించింది. బాగా పాతబడిన పరికిణీ, ఓణీలో కట్టెల పొగతో మండుతూ ఎర్రబడిన కళ్ళు, చెదిరిన జుట్టు, చామనచాయగా ఉన్నా, కళగా ఉన్న మొహం.

జబ్బుతో ఉన్న ఆ పెద్దవాళ్ళు, ఆమెకలలు, ఆశలు కట్టెల పొయ్యి పొగలో చూరుకి అంటుకుని పోతున్నా, చిరునవ్వుతో ఆ అమ్మాయి చూపించిన ఆదరణ, అభిమానం మర్చిపోలేని అనుభూతులుగా నా హృదయంలో శాశ్వతంగా ఉండిపోయాయి. రెండు రోజులు పూర్తిగా కాకున్నా, ఒకటిన్నర రోజు అక్కడ ఉండడంలో నాకేం కష్టం కనిపించలేదు. వాళ్లకి ఉన్న దాంట్లోనే నాకు కొసరి, కొసరి వడ్డిస్తుంటే, వాళ్ళ ఆప్యాయతని అన్నంలో కలుపుకుని కడుపునిండా తిన్నాను. నాకూ నలుగురు బంధువులు ఉన్నారు అన్న తృప్తితో దోమలు పాడుతున్న సంగీతం జోలపాటలా భావిస్తూ కంటినిండా నిద్రపోయాను.

రెండో నాడు ఉదయమే మేము బయలుదేరి వస్తుంటే, మంచం మీద నుంచి బలవంతంగా లేచి కూర్చుని, " నా కొడుకుని మంచిగ చూసుకో బిడ్డా... నీ అమ్మ కడుపు సల్లగా " అంది ఆవిడ దగ్గుతూ.

"నువ్వు మంచిగ బొమ్మలు గీస్తావంట గదా... మంచిగఏయి నాయనా! నా కొడుక్కి కూడా నేర్పియ్యి" అన్నాడు పెద్దాయన.

" అన్నా! చాయ్" అంటూ హ్యాండిల్ విరిగిన పింగాణీ కప్పులో వేడి టీ తెచ్చి ఇచ్చింది అతని చెల్లెలు.

నా ప్యాంటు జేబులో ఉన్న నోట్లు గుప్పిటతో తీసి ఆమె చేతిలో పెట్టి "అమ్మా, నాన్నలకి మంచి మందులిప్పించు" అన్నాను.

"ఒద్దన్నా" కంగారుగా తిరిగి ఇచ్చేయబోతున్న ఆమె గుప్పిట మూసి " ఇవి తిరిగి ఇస్తే నన్ను అన్నా అని పిలవద్దు " అన్నాను .

నీళ్ళు నిండిన కళ్ళతో "తీసుకో" అన్నట్టు చెల్లెలికి సైగ చేసాడు గుణశేఖర్.

"మల్ల రా బిడ్డా " అన్నారు వాళ్ళు... "ఎప్పుడన్న వస్తుండు అన్నా" అంది ఆ అమ్మాయి. తప్పకుండా వస్తాను అని మాట ఇచ్చి బయట పడ్డాను.

ఇద్దరం బస్ స్టాండ్ వైపు నడుస్తూ ఉండగా అన్నాను గుణతో .

"ఇదేంటి గుణా! మీ ఊరు ఇలా ఉందేంటి? ఎవరూ పట్టించుకోరా! అసలు డెవలప్ చేయాలన్న ఆలోచన ఎవరికీ లేదా?"

"పట్నాలనే తప్ప పల్లెటూళ్ళ గురించి ఎవరికీ పట్టదు తేజా! గ్రామాలు అభివృద్ధికి పట్టుకొమ్మలు అని నినాదాలు ఇచ్చేవరకే.. . కానీ అభివృద్ధి ఎలా జరుగుతుంది? మా బాధ్యత ఎంత? అని ఆలోచించే హృదయం ఏ నాయకుడికీ ఉండదు.. . పేద ప్రజలు ఓట్ల కోసం మాత్రమే పనికివస్తారు... తరవాత వాళ్ళు, బురదగుంటలో తిరిగే పందులతో సమానం అనుకుంటారు. వదిలేయ్... మా ఊళ్ళో ఒకే ఒక అందమైన ప్రదేశం ఉంది చూస్తావా! నువ్వు బొమ్మలేసుకోడానికి పనికివస్తుందేమో " టాపిక్ డైవెర్ట్ చేస్తూ అన్నాడు.

"ఎక్కడ" కుతూహలంగా చూసాను.

"రా చూపిస్తాను" అని ఎడం పక్క కనిపిస్తున్న సందు వైపు తిరిగాడు. ఇరుగ్గా ఉన్న ఆ సందులో నుంచి కిలో మీటర్ దూరంలో కనిపించింది జీవన సత్యం. దాదాపు పది మంది, యువకులు, పన్నెండేళ్ళ పిల్లలు కలిసి రాళ్ళు కొడుతున్నారు. అర్ధనగ్నంగా ఉన్న వాళ్ళ దేహాలు చెమటతో తడిసిపోయాయి. శుభ్రమైన బట్టకి, రుచికరమైన తిండికి నోచుకోని వాళ్ళు...

"వీళ్ళు రాళ్ళు కొట్టి జీవించే బడుగు జీవులు, తర,తరాలుగా వీళ్ళ వృత్తి ఇదే. ఇప్పుడు రోళ్ళు, రోకళ్ళు పోయి, యంత్రాలు వచ్చాయి... ఆడవాళ్ళు నాగరికతకి, నాజూకుదనానికి అలవాటు పడ్డారు. ఇవేవీ వాళ్లకి ఆనవు... కానీ వాళ్ళు మాత్రం వాళ్ళ వృత్తి మానరు..." గుణ చెప్పుకుపోతున్నాడు.

జీవితం అంటే సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, నదీ తీరాలు, అందమైన అమ్మాయిలూ, పచ్చని చెట్లు, రంగుల పూలు కాదని... జీవితపు లోతుల్లోకి వెళితే మనకు తెలియని ఒక అద్భుతం ఉందని నాకు ఇప్పుడే తెలుస్తోంది... ఒక చిత్రకారుడిగా నా దృష్టి లోతుల్లోకి వెళ్తోంది... స్వచ్ఛమైన ముత్యంలో కనిపించీ, కనిపించక ఉండే రంగులు ఏవో, శ్రమ జీవుల స్వేదబిందువుల్లో కనిపిస్తున్నాయి... జీవన సౌందర్యం కొత్తగా, వింతగా కనిపిస్తోంది. కానీ, ఆ సౌందర్యం ఆస్వాదించేది కాదు... ఆవేదన చెందేది.

ఇద్దరం వెనుతిరిగి బస్టాండ్ చేరాము. వెంటనే బస్ వచ్చింది. దారి పొడుగునా, ఏవో చెప్తూనే ఉన్నాడు గుణ... కానీ, మా చెవులు పనిచేయడం లేదు.. కేవలం నా మెదడు మాత్రమే పని చేస్తోంది... ఆ మెదడు నిండా గుణ చెప్తున్న జీవితాల చిత్రాలే.

మేము హైదరాబాద్ చేరేసరికి మా గుండెల్ని బద్దలు చేసే వార్త ...

సూర్య, ప్రముఖ చిత్రకారుడికి ప్రమాదం అన్న హెడ్డింగ్ తో కనిపించిన వార్త చూడగానే మా ఇద్దరి గుండెలకు అంతకన్నా పెద్ద ప్రమాదం జరిగింది. రెండు గుండెలు బ్రద్దలైనాయి. సూర్య దిల్ సుక్ నగర్ వద్ద బండికి కారు గుద్దడంతో బండి బోల్తాపడి అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

ఎంతటి విషాదం! ఇది విషాదమా కాదు... ఇంకా ఏదో... మా కళ్ళ నుంచి, రక్తం కారుతోంది. కుప్పకూలిపోయాను. ప్రపంచం అంతా చీకటిగా మారిపోయింది. సూర్య లేడా! ఇంక రాడా! లేదు.. సూర్య

ఉన్నాడు... బతికే ఉన్నాడు... కచ్చితంగా ఉన్నాడు. నన్ను వదిలి ఎక్కడికి వెళ్తాడు? వెళ్ళడు... నా చుట్టూ ఉన్న పరిసరాలు మసకబారాయి... భూగోళం మొత్తం గిర,గిరా తిరుగుతున్నట్టే అనిపిస్తోంది... చీకట్లు కమ్మాయి.. "తేజా" అన్న గుణశేఖర్ పిలుపు మాత్రం వినిపించింది.

దెబ్బ మీద దెబ్బ... విధి కొట్టిన కొడవలి దెబ్బలతో నిలువునా కూలిపోయిన నన్ను కాపాడడం తన విధి అన్నట్టుగా సేవలు చేసిన గుణ నేను కళ్ళు తెరిచేసరికి నా ముందు మూర్తీభవించిన విషాదంలా కూర్చుని ఉన్నాడు.

"గుణా" అంటూ తనని పట్టుకుని కుళ్ళి, కుళ్ళి ఏడ్చాను.

"ఏడవకు తేజా!" రుద్ధమైన స్వరంతో నన్ను ఓదార్చే ప్రయత్నం చేసాడు.

"నేను కూడా పోతే ఎంత బాగుంటుంది తేజా! అయినవాళ్ళను, ఆత్మీయులను కోల్పోయాక ఎందుకు బతకాలి నేను?"

"నువ్వు మామూలు మనిషివి కావు తేజా! మహావృక్షానివి. కొన్ని లక్షల మందికి నీడనివ్వాల్సిన మహా వృక్షం నీవు. భావి చిత్రకారులనే ఫలాలను దేశానికి అందించాల్సిన వృక్షం ... కూలిపోడానికి వీల్లేదు... నిన్ను రక్షించాలి"

గుణశేఖర్ విషాదంతో గుండె పగిలి పిచ్చివాడిలా మారిన నన్ను కంటికి రెప్పలా చూసుకోసాగాడు.

ఎంతగా ప్రయత్నించినా నేను మామూలు మనిషి కాలేకపోయాను. పనికి వెళ్లకపోవడంతో ఉద్యోగం పోయింది... నేనెంత గొప్ప చిత్రకారుడైనా యజమానికి మాత్రం నేను సేవకుడునే కదా! ... బాధ్యత విస్మరిస్తే క్షమించి చేరదీసే విశాల హృదయం ఆయనకీ ఎందుకు ఉంటుంది? ఇప్పుడు గుణశేఖర్ నా బాధ్యత తీసుకున్నాడు... కానీ ఎంతకాలం! అతనూ బతకాలి.. తన మీద ఆధారపడిన మూడు జీవాలని బతికించాలి... అందుకేనేమో ఒకరోజు అన్నాడు గుణశేఖర్.

" తేజా! బెంగుళూరులో మంచి ఆర్టిస్ట్ ఉన్నాట్ట... నీలాంటి వారికి నేర్పించడంకాక, పోటీలు, ప్రదర్శనలు వంటి అవకాశాలు కూడా కల్పిస్తాడట... చాలా మంచివాడుట... నాతోపాటు పనిచేసే శివ చెప్పాడు... వెళ్తావా"

అచేతనంగాఉన్న నాలో చిన్న కదలిక... బెంగుళూరు ఆ పేరు వినగానే నరం, నరం ఉత్తేజితమైంది... కళ్ళల్లో వెలుగు ప్రసరించింది... గబుక్కున గుణశేఖర్ చేతులు పట్టుకుని ఉద్వేగంగా అడిగాను " ఎప్పుడు? ఎప్పుడు పంపిస్తావు? "

గుణశేఖర్ ముందు విచిత్రంగా, తరవాత సంతోషంగా నా వైపు చూసి చెప్పాడు..

"రేపు వివరాలు తెలుసుకుని చెప్తాను. రెండురోజుల్లో వెళ్దువుగాని సరేనా!"

ఆ క్షణం నాలో కలిగిన భావోద్వేగం వర్ణించడానికి నా దగ్గర భాష లేదు. అందుకే గుణని గట్టిగా కౌగలించుకుని ఉద్వేగంగా అన్నాను .

"వెళ్తాను... వెళ్తాను.. నా ఆఖరి మజిలీ అదే... వెళ్లి తీరాలి" నాలో నేను అనుకుంటున్నట్టు గొణుక్కుంటూ అక్కడి నుంచి వెళ్తున్న నా వైపు తెల్లబోయి చూస్తూ నిలబడిపోయాడు గుణశేఖర్.. బెంగుళూరు పేరు చెప్పగానే నాలో అకస్మాత్తుగా కలిగిన చైతన్యంకి అర్థం తెలియలేదు... తెలుసుకోడానికి ఎక్కువ ప్రయత్నించలేదు అనుకుంటా... లేక ఎక్కడోక్కడ అతనికి నచ్చిన చోట అన్నీ మర్చిపోయి కొత్త జీవితం ప్రారంభిస్తే చాలు అనుకున్నాడో గుణశేఖర్ నాకు తెలియదు కానీ నాలోని మార్పుని మాత్రం ప్రశ్నించలేదు.

అనుకున్నట్టే గుణశేఖర్ తనతో పనిచేస్తున్న ఆర్టిస్ట్ ద్వారా బెంగుళూరులో ఉన్న ప్రముఖ చిత్రకారుడి అడ్రెస్, ఫోన్ నెంబర్ సంపాదించాడు.

"ముందు వెళ్లి పరిస్థితి చూసుకుని మళ్ళీ వచ్చి సామాను తీసుకుని వెళ్ళు... అక్కడ నీకెవరూ లేరు కదా ఎక్కడ ఉంటావు?"

చిత్రాలు, బట్టలు, అన్నీ సర్దుకుంటున్న నాతో అన్నాడు గుణ. ఎవరూ లేకపోవడం ఏమిటి? నా నూరేళ్ళ భవిష్యత్తు అక్కడే ఉంది... నా ఆనందం, సంతోషం, నా ప్రగతి, నా సర్వస్వం అన్నీ అక్కడే ఉన్నాయి అనుకున్నాను మనసులో. పైకి ఏమి మాట్లాడలేదు. మౌనంగా నాకు సంబంధించిన వస్తువులు అన్నీ చంద్రకాంత్ గారు ఇచ్చిన పెట్టెలో సర్దుకున్నాను. పెట్టె మూతవేసి, గుణ వైపు తిరిగి ప్రశాంతంగా అన్నాను.

" నా గురించి చింతించకు గుణా ! నాకిక్కడ ఎవరున్నారని హైదరాబాద్ వచ్చాను. ఎవరున్నారని ఏమి తెలియని వయసులో గాలికి కొట్టుకుని వెళ్లినట్టు విశాఖపట్నం వెళ్లాను... నాకు అమ్మ, నాన్న, తోబుట్టువులను ఇవ్వకపోయినా నీలాంటి, సూర్యలాంటి ఆత్మీయులని, చంద్రకాంత్ గారిలాంటి మానవతామూర్తులను ప్రతిచోటా దాచి ఉంచుతాడు... ఎవరో ఒకళ్ళు తప్పకుండా నన్నాదరిస్తారు.. ఆశ్రయం ఇస్తారు... నేను వెళ్ళిపోతాను గుణా!... ఇంతకాలం నువ్వు పంచిన ఆత్మీయతకు ప్రతిగా ఏమి ఇవ్వలేని పేదవాడిని ఎపుడన్నా భగవంతుడు అవకాశం ఇస్తే నీ ఋణం తీర్చుకుంటాను సెలవు..."

గుణ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. చటుక్కున నన్ను ఆలింగనం చేసుకున్నాడు. ఇద్దరం ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగిపోయి అంతులేని నాలుగేళ్ల మా స్నేహాన్ని పరస్పరం గుండెల్లోకి ప్రవాహింప చేసుకున్నాము... మా ఇద్దరి కళ్ళనుండి ప్రవహించిన కన్నీరు ఆ గదిలో గద్దకట్టినట్టు పరిసరాలన్నీ అచేతనం అయినాయి. ఎక్కడి నుంచో మిగిలిపోయిన చినుకులు మా తలపైన కురుస్తున్నట్టు అనిపించింది. బహుశా అది మా స్వచ్ఛమైన స్నేహపు జల్లు అనుకుంటా...

గుణశేఖర్ రైలు ఎక్కిస్తూ నా చేయి నొక్కుతూ అన్నాడు. "నన్ను మర్చిపోతావా!"

"నిన్నా!" ఆశ్చర్యంగా చూసాను. నా శరీరంలో ఒకభాగం ఇక్కడ పెట్టి వెళ్తున్నా గుణా! ఆ భాగం ఎలా మర్చిపోతాను? అది అప్పుడప్పుడు చూసుకోడం కోసం వస్తూనే ఉంటాను... నన్ను నమ్ము..."

కన్నీళ్లు తుడుచుకుంటూ నవ్వాడు గుణ.

రైలు కదిలింది. నా కళ్ళకు గుణ మసగ్గా కనిపిస్తుంటే ఇదేంటి అప్పుడే చాలాదూరం వెళ్ళానా అనుకున్నాను… కానీ కదులుతున్న అతని కుడిచేయి నా కళ్ళు తుడుస్తున్నట్టు అనిపించి, నా కళ్ళల్లో నిండిన నీళ్ళ మధ్య గుణ అస్పష్టంగా కనిపిస్తున్నాడని అర్థం అయింది.

బెంగుళూరు చేరగానే నిర్మొహమాటంగా అజయ్ కి ఫోన్ చేసాను స్టేషన్ నుంచి.

నా స్వరం వినగానే అజయ్ పొంగిపోయాడు..” నేను వస్తున్నాను నిన్ను ఇంటికి తీసుకుని వెళ్తాను అక్కడే ఉండు” అన్నాడు.

నా మనసు పరవశంతో పరవళ్ళు తొక్కసాగింది… చాలా రోజుల తరవాత దర్శించబోతున్న దేవత రూపం నా కళ్ళ ముందు కదిలింది. ఎట్టి పరిస్థితుల్లోనూ నేను ఇక్కడి నుంచి ఇంక ఎక్కడికీ వెళ్ళద్దు అనుకున్నాను. ఆమె వయ్యారంగా నడుస్తూ వచ్చి గేటు తెరుస్తుంటే, ఆమె హృదయకవాటాలు నా కోసం తెరిచి ఆహ్వానిస్తున్నట్టు అనిపిస్తోంది. , అభిమానంగా, తీయంగా“తేజా” అంటూ పిలిచే ఆమె పిలుపులో ఎన్నెన్నో సంగీత వాయిద్యాలు వినిపిస్తున్నాయి.

నా భుజం మీద చేయి పడింది…”హాయ్“ అజయ్ నవ్వుతూ నిలబడ్డాడు ఎదురుగా.

“ఎలా ఉన్నారు అజయ్! “ అడిగాను ఎగసిపడుతున్న ఆనందపు అలల మీద ఊగిపోతూ.

“నాకేం బ్రహ్మాండంగా ఉన్నాను. ప్రియ నన్ను చంటిపిల్లవాడిని చూసుకున్నట్టు చూసుకుంటుంది.” అన్నాడు అజయ్ కళ్ళల్లో మెరుపులు కురిపిస్తూ.

అసూయ నా మనసులో విషబిందువులను చిలకరించింది. బలవంతంగా నవ్వాను. ఇప్పుడు ఈ మానసిక స్థితిలో వాళ్ళ ఇంటికి వెళ్తే నా వలన వాళ్ళకి కచ్చితంగా ఏదో అపకారం జరుగుతుందని నా అంతరాత్మ గట్టిగా హెచ్చరించింది. అందుకే గుణ ఇచ్చిన అడ్రెస్ వివరాలు చెప్పి నన్ను “అక్కడ డ్రాప్ చేస్తారా” అని అడిగాను.

“తప్పకుండా చేస్తాను. ముందు మా ఇంటికి వెళ్లి, కొంచెం సెటిల్ అవు. నేను ఎంక్వయిరీ చేసి తీసుకుని వెళ్తాను “ అన్నాడు అజయ్.

“కానీ, మీకు ఇబ్బంది..” మొహమాటంగా అన్నాను. “ నేను మీ దగ్గరే ఉండే అవకాశం నాకు లభించాలి” అని మనసులో అనుకుంటూ.

“ నీ మొహం ఇబ్బందేమిటి? నిన్ను ప్రియ కూడా ఇంటికే తీసుకురమ్మని చెప్పింది. పద, పద” అంటూ భుజం మీద చేయేసి నడిపించుకుని వెళ్ళాడు.

“వచ్చేసావా! రా, రా లోపలికి…. ఏవీ నువ్వు వేసిన కొత్త బొమ్మలు చూపించు…” అని అడుగుతూ తన నవ్వుల పూవులు నా మీద చల్లుతూ నన్ను ఆహ్వానిస్తూ ప్రియ.

"ఏంటోయ్ కొత్త విశేషాలు? నీ ఫ్రెండ్స్ ఎలా ఉన్నారు?" అన్న అజయ్ ప్రశ్నతో ఉలిక్కిపడ్డాను.

సూర్య గుర్తుకువచ్చాడు. సూర్య ఇంక లేడు అన్న వాస్తవం కూడా గుర్తొచ్చింది. మనసంతా విషాదంతో నిండిపోయింది. వణుకుతున్న స్వరంతో అన్నాను "సూర్య లేడు... నన్ను, గుణని వదిలి వెళ్ళిపోయాడు."

"అలాగా! అరె ఎప్పుడు? ఎలా?" ఆత్రంగా అడిగాడు అజయ్.

జరిగిన విషయం చెప్పాను.

"సో సాడ్... సారీ తేజా! వెరీ సారీ... ఈ సమయంలో నువ్వు ఇక్కడికి వచ్చి మంచిపని చేసావు. గుణకి నా తరఫున కూడా థాంక్స్ చెప్పు. " అన్నాడు.

"నా పేరులో సగం సూర్యదే... సూర్య తేజ అన్న తన పేరులో చివరి రెండు అక్షరాలు నాకు ఇచ్చాడు సూర్య. అలాంటిది నన్ను విడిచి శాశ్వతంగా వెళ్లిపోతాడని నేనెన్నడూ ఊహించలేదు అజయ్ గారూ!" అన్నాను. అలా అంటున్నప్పుడు నా స్వరం గాద్గదికం అయింది.

ఎడం చేత్తో స్టీరింగ్ పట్టుకుని కుడి చేయి నా భుజం మీద వేసి ప్రేమగా, అభయం ఇస్తున్నట్టు నొక్కాడు అజయ్. " కొన్నాళ్ళు, నీ మనసులో ఉన్న దిగులు, బాధ మర్చిపోయే వరకు మా దగ్గరే ఉండు. తరవాత వెళ్ళచ్చు ... " అన్నాడు అజయ్.

నా మనసు ఆనందతరంగం అయింది అని వేరే చెప్పాలా!

కారు హారన్ వినగానే గేటు దగ్గరకు వచ్చి సాదరంగా ఆహ్వానించింది ప్రియాంక.

" నీకూ, మాకూ ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుంది తేజా అందుకే దేవుడు నిన్ను మళ్ళీ ఇక్కడికి పంపించాడు. అనవసరంగా మొహమాట పడకు... ఇబ్బంది పడకు... ఫ్రీగా ఉండు... నీకెన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు హాయిగా ఉండచ్చు " అని చెప్పింది.

నాకు కొంచెం గిల్టీగా అనిపించింది. వాళ్లిద్దరి ప్రేమాభిమానాలు ఆగిపోయిన గుండె చప్పుడుని తిరిగి కొట్టుకునేలా చేస్తుంటే ఆందోళనతో ఉన్న మనసుకి సాంత్వన లభించినట్టు అయింది.

రెండు రోజుల తరవాత అజయ్ నేనిచ్చిన వివరాలు తెలుసుకున్నాడు. గుణ చెప్పిన ఆర్టిస్ట్ వారం ముందే లండన్ వెళ్ళాడని తెలిసింది.

ఆ వార్త వినగానే నీరసంగా, నిస్సత్తువగా అనిపించింది. కారణం నేను నాలోని కళను మెరుగుపరచుకునే అవకాశం పోయిందని కాదు, ఇంక అక్కడ చేయడానికి, శాశ్వతంగా ఉండిపోడానికి ఇప్పుడు ఎలాంటి అవకాశం లేదు. నేను తిరిగి వెళ్లిపోవాలి. ఎలా వెళ్ళడం? నా పంచప్రాణాలు ఇక్కడ వదిలి ఎలా వెళ్ళడం?

అజయ్ అన్నట్టు పోనీ ఇక్కడే ఈ ఇంట్లోనే కొంతకాలం ఉండిపోవాలన్నా ఏ కారణంతో ఉండగలడు? కర్తవ్యమ్ తోచలేదు అతనికి. ఇప్పుడేం చేయాలి? ఏ విధమైన కారణం లేకుండా వీళ్ళ ఇంట్లో ఎన్నాళ్ళు ఉండాలి? మనసు పరి,పరి విధాల పోతోంది... ప్రియాంక సమక్షంలో ఎన్ని గంటలు, రోజులు కూర్చున్నా క్షణాల్లా గడిచిపోతాయి... అలాగనిఎప్పటికీ ఇలాగే ఉంటుందా? ఇప్పుడు ఉన్న గౌరవం ఇంకా కొంతకాలం వాళ్ళింట్లో కూర్చుని తింటే ఉంటుందా! ఏమి అర్థం కాలేదు.

"నేను హైదరాబాద్ వెళ్ళిపోతాను" అన్నాను అజయ్ తో...

" నాకు తెలిసిన ఇంకో ఆర్ట్ స్కూల్ ఉంది.. . అందులో మాట్లాడతాను. హాస్టల్ సౌకర్యం కూడా ఉంది అనుకుంటా... లేదంటే ఏదన్నా ఉద్యోగం చూద్దాము... అక్కడైనా నీకు ఎవరూ లేరన్నావుగా... వెళ్లి ఏం చేస్తావు " అన్నాడు అజయ్..

ఓ పక్క ఆనందం, మరో పక్క సందేహం... ఏమి మాట్లాడలేకపోయాను.

## 23

**మరో నాలుగురోజులు గడిచిపోయాయి**. నా మనసునిండా ప్రియాంక రూపం అనేక భంగిమల్లో నిండిపోతోంది... ఇప్పుడు నేనే బొమ్మ గీసినా, ఏ ప్రతిమ చెక్కినా అది ఆమె ప్రతిరూపం అవుతోంది. నేను గతంలో చూసినప్పటికీ, ఇప్పటికీ ఆమెలో అందం అణువణువునా పెరుగుతోంది. అయితే, అప్పటికీ, ఇప్పటికీ ఒక్కటే మార్పు. ఇప్పుడు ఆమె గర్భవతి. పల్చగా ఉన్న పొట్ట ఇప్పుడు నిండుగా ఉంది. ఆమె నడకలో చిన్న మార్పు. అయినా చలాకీతనం ఏ మాత్రం తగ్గలేదు. అదే నవ్వు, అదే చనువు... అదే చైతన్యం.

అజయ్ బయటకు వెళ్ళినపుడు ఒంటరిగా ప్రియాంకతో ఉండాలంటే భయం వేస్తోంది.

ఏ క్షణాన నేను, నేను కాకుండా పోతానో అని భయం. నా చిత్రాలలాగే నా భావాలు కూడా రంగులు మారుతున్నాయి. ఆమెని కలిసిన క్షణం నుంచి నాలోని మాగాడు మాయమైపోయి, మహాతేజ అనబడే కళాకారుడు జూలు విదిలించి, రెక్కలు ఝాడించి లేచి, ఒళ్ళు విరుచుకుని కేవలం మగాడిగా మారుతున్నాడా అని నాకే భయం కలుగుతోంది. కాకపోతే ప్రేమించడం, ఆరాధించడం నేరమా అని నన్ను నేనే ప్రశ్నించుకుంటూ ఉంటాను.

స్త్రీని, స్త్రీగా చూస్తున్న మగాడిని... నిజమే! నాకు స్త్రీ స్త్రీగానే కనిపిస్తుంది. అందులో విపరీతం ఏమిలేదు. కారణం నా జీవితంలోకి స్త్రీ మరో విధంగా ప్రవేశించలేదు... నన్ను ఆకర్షించలేదు... నాకింత సన్నిహితంగా రాలేదు... నన్నే విధంగానూ శాసించలేదు. ఏది ఏమైనా, నేను నేరగాడిని కాకుండా, కళాకారుడిగా మాత్రం మిగిలిపోవాలంటే నన్ను నేను అన్ని రకాలుగా నియంత్రించుకోవాలి. అలా నిర్ణయించుకున్న తరవాత ఆమె నుంచి తప్పించుకోడానికి కొంతసేపు బయటకు వెళ్లి అటూ, ఇటూ తిరిగి మూడు అవుతుండగా ఇంటికి రావడం మొదలుపెట్టాను. రాగానే నాకు

కేటాయించిన గదిలో దూరి కొత్త, కొత్త చిత్రాలు వేసుకుంటూ ఉండడం ఒక యజ్ఞంలాగే అనిపిస్తోంది. నేను సోమయాజిని కావాలంటే, ఎంతో నిగ్రహంతో నా కర్తవ్యం నిర్వర్తించాలి...

అయితే, నా నిర్ణయం తెలుసుకోలేని ఆమె నాతో ఎప్పటిలాగే ఉంటోంది... ప్రేమగా మాట్లాడుతూనే ఉంది. ఆమె నా పట్ల చూపిస్తున్నది సానుభూతితో కూడిన అభిమానం కావచ్చు, ఆప్యాయత కావచ్చు... కానీ నా వయసు మరో విధంగా ఆలోచించడం మాత్రం మానలేదు. ఆమెకి నేనంటే ఎందుకు ప్రేమ ఉంటుంది? అది ప్రేమనా! వాంఛనా! ఆమె నన్ను  వాంచించడానికి అజయ్ కన్నా నేను అందగాడినా! లేక ఆమెకి అజయ్ మీద అనురాగం లేదా! ఇలాంటి ఆలోచనలు నాకు రాకపోవడం దురదృష్టం. వచ్చి ఉంటే  మా కథ మరో మలుపు తిరిగేది.

ఒకరోజు యథాప్రకారం నేను చుట్టుపక్కల ఉన్న రోడ్లన్నీ నా కళ్ళతోటే కొలతలు వేసి, ఇంటికి వచ్చి నా గదిలో దూరిపోయాను. కొద్దిసేపు ఆమె అడుగుల శబ్దం కోసం నా చెవులు, ఆమె రూపం కోసం నా కళ్ళు పరిసరాలు పరిశోధించినా, నిగ్రహం, నిగ్రహం అనుకుంటూ విగ్రహంలా కాన్వాస్ ముందు కూర్చున్నాను. కొద్ది క్షణాల తరవాత నా చెవులకి ఇంపుగా వినిపించింది ఆమె అడుగుల ధ్వని...

టీ తీసుకుని చనువుగా గదిలోకి వచ్చి , "ఎక్కడికి వెళ్ళావు? రోజూ లంచ్ చేసి ఎటు వెళ్తున్నావు? అంటూ టీ కప్పు నా ముందు ఉంచింది.

నా ఉలికిపాటు కప్పిపుచ్చుకుంటూ "ఎక్కడికీ వెళ్ళలేదు... కలర్స్ తెచ్చుకున్నాను." అన్నాను.

ఆమె ఫకాల్న నవ్వి, "రోజూ కలర్స్ కోసమే వెళ్తున్నావా"  అంటూ నేను వేస్తున్న చిత్రాలు ఆసక్తిగా చూస్తూ "ఏది నీ కొత్త బొమ్మ చూపించు"  అంది.

ఒక్క క్షణం నా గుండె దడదడలాడింది.  నేను వేస్తున్న చిత్రం ఆమె చూస్తే! నిజానికి నేను వేస్తున్నది ఆమె కోసమే. కానీ, ఇప్పుడే ఆమె చూడడం నాకిష్టం లేదు. ఆమె సమక్షం నాకిష్టం... ఆమె మాటలు వినడం నాకిష్టం... ఆమెతో మాట్లాడడం మరీ ఇష్టం. ఆమె ఏది అడిగినా, అన్నిటికీ ఎంతో ఇష్టంగా సమాధానం చెప్తాను.  ఆమెకి సమాధానాలు చెప్పడం, ఆమెతో మాట్లాడడం అనేవి నా జీవితంలో అతి ప్రాముఖ్యత కలిగిన అంశాలుగా నేను భావిస్తాను.  ఆమెకి ఆర్ట్ అంటే ఎంతో అభిమానం.  ఆ ఇష్టంతోటే నేను వేసే చిత్రాల్లో గీతల దగ్గర నుంచి రంగులు కలపడం దాకా ప్రతి ఒక్కటి చాలా శ్రద్ధగా అడిగి తెలుసుకుంటుంది. ఈ క్రమంలోనే  ఆమెతో కొంచెం చనువుగా మాట్లాడగల ధైర్యం వచ్చింది.  ఆ చనువే నన్ను నేరగాడిగా మారుస్తుందేమో అనే భయంతోటేగా దూరంగా ఉంటున్నాను...

"ఏంటి ఆలోచిస్తున్నావు? చూపించడం ఇష్టం లేకపోతే వద్దులే" కొంచెం నిష్టూరంగా అంది.

"అబ్బే అదికాదు..." నేను చెప్పబోయే లోపలే ఆమె గల,గలా నవ్వి, నా నెత్తి మీద సున్నితంగా మొట్టికాయ వేసి, " హాయిగా బొమ్మలేసుకో... నిన్ను డిస్టర్బ్ చేయనులే" అని వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన వైపు తలతిప్పిన నా కంటికి ఆమె నిండుగా పూచిన పూలతోటలా కనిపించింది.

మరో వారం గడిచింది. చాలా మందిని విచారించి, ఒక మంచి ఆర్ట్ స్కూల్ లో నన్ను జాయిన్ చేసాడు అజయ్. హాస్టల్ సౌకర్యం లేకపోడంతో "మరి కొన్నాళ్ళు ఉండి ఏదన్నా ప్రైవేటు హాస్టల్ కి వెడుదువుగాని అందాకా ఇక్కడే ఉండు... నీకేదన్నా ఇబ్బంది ఉందా ఇక్కడ " అన్నాడు.

"ఇబ్బందా! ఎప్పటికీ ఇక్కడే ఉండిపొమ్మన్నా ఉంటాను" అనుకున్నాను కానీ అనలేదు.

రోజులో రెండు గంటలు క్లాసు, రెండు గంటలు ప్రయాణానికి గడచిపోగా మిగిలిన సమయం మొత్తం ఆమె సమక్షంలోనే గడుస్తూ ఉండడంతో ఆమె మీద ప్రేమో, అభిమానమో, ఆరాధనో, మోహమో తెలియని భావం ఊపేస్తోంది. ఆమెకి నెలలు నిండుతున్నాయి. ఐదో నెల వచ్చింది అని తెలిసింది. బరువుగా కదులుతోంది. ఒంగడం, లేవడం కష్టపడుతోంది. ఆమె అలా కష్టపడుతుంటే నా ప్రాణం విలవిల్లాడుతోంది. గబుక్కున వెళ్లి ఆమె చేతిలో పని అందుకుంటున్నాను.

వీలైనంత వరకు ఆమె కష్టపడకుండా చూడడం నా బాధ్యత అనుకుంటూ, వంట దగ్గర కూడా కూరలు తరిగిస్తూ, బియ్యం కడిగిస్తూ ఉంటే " నీకెందుకు ఈ పనులన్నీ పనమ్మాయి ఉంది కదా! నువ్వెళ్ళి బొమ్మలేసుకో... నువ్వింకా బాగా ఎదగాలి తేజా!... ఈ పనులన్నీ నువ్వు చేయడం ఏమిటి?" అంటూ మందలించసాగింది.

బొమ్మలేయడం కన్నా ఈ బొమ్మని పదిలంగా చూసుకోడమే నాకిష్టం అనుకున్నాను.

"మీరు కష్టపడుతుంటే నేను చూడలేను" అన్నాను ఒకసారి అప్రయత్నంగా.

ఆమె ఆశ్చర్యంగా చూసింది...

ఒకరోజు, సోఫాలో కూర్చుని ఉన్నదల్లా గబుక్కున ఏదో పనిమీద లేచి ముందుకు నడుస్తుంటే, ఆమె కాలికి టీపాయ్ కొట్టుకుంది. నేను అప్పుడే క్లాస్ నుంచి వచ్చాను. గబుక్కున వెళ్లి, మోకాళ్ళ మీద కూర్చుని ఆమె కాలు పట్టుకుని "గట్టిగా తగిలిందా!... ఏదన్నాక్రీం రాయనా" అని ఆదుర్దాగా అడిగాను. ఆమె ఆరోజు నావైపు చూసిన చూపు

నేనిప్పటికీ మర్చిపోను. ఆ చూపులో ఏంటి ఇతని శ్రద్ధా! ఎందుకు అంతగా కలవరపడుతున్నాడు? ఇతను మంచివాడేనా! వంటి అనేక ప్రశ్నలు, సందేహాలు కనిపించాయి.

మరో రోజు ఆమె మొక్కలకి నీళ్ళు పోస్తుంటే వరండాలో నిలబడి రెప్పవేయకుండా ఆమెనే చూస్తూ ఉంటే ఆమెకి ఏమనిపించిందో, గిర్రున వెనక్కి తిరిగి, "నువ్వెందుకు ఇక్కడ నిలబడ్డావు? వెళ్ళి విశ్రాంతి తీసుకో" అంది వాడిగా.

"నేను పోస్తాను నీళ్ళు" అన్నాను ఆమె దగ్గరగా వెళ్ళి చేతిలో నుంచి ట్యూబు అందుకుంటూ.

ఆమె చూపులు స్కానర్లాగా తగిలాయి. గుండెలోతుల్లోకి గుచ్చి చూస్తున్న ఆ కళ్ళు నా గుండెలో ఏముందో చూడడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపించింది.

నా చూపుల్లో, ప్రవర్తనలో మార్పు ఆమె పసిగడుతోంది అనే అనుమానం కలిగినా నేను పట్టించుకోలేదు. నాకు కావలసింది ఆమె సమక్షం, ఆమె క్షేమం. మిగతావన్నీ నా దృష్టిలో చాలా అల్పమైనవి.

అది గమనించడం మొదలుపెట్టాక ఆమెని ఒక భయం ఆవరించినట్టుంది... ఇతను తను అనుకున్నట్టు అమాయకుడు కాదు... చిన్నపిల్లాడు అసలే కాడు... అనుకుందేమో నెమ్మదిగా మా ఇద్దరిమధ్యా నేను ఊహించని ఒక దూరం ఏర్పడింది... ఆ దూరం ఆమె ప్రయత్నపూర్వకంగానే సృష్టించినట్టు అనిపించింది.

నాలో యవ్వనం మొగ్గ తొడుగుతోంది... నాకు తెలుసు... నేను ఆమెని ఆరాధిస్తున్నాను, ప్రేమిస్తున్నాను... కానీ కామించడం లేదు. ఆమె చేతిలో నుంచి ట్యూబు లాక్కున్నా, ఆమె పడకుండా పట్టుకున్నా, ఓ పూవుని ఎలా అయితే జాగ్రత్తగా కాడ దగ్గర పట్టుకుంటామో అలాగే స్పృశిస్తున్నాను. కానీ, ఒక స్త్రీగా ఆమె భయం ఆమెది కదా! అందుకే అప్పటి నుంచి నా గదిలోకి రావడం మానేసింది.

నాకా దూరం భయంకరంగా అనిపిస్తోంది...

నేను వేసే చాలా చిత్రాల్లో ఆమె పోలికలే ప్రతిఫలిస్తున్నాయి. అందుకు నేనేమి ప్రత్యేకమైన ప్రయత్నాలు చేయడం లేదు... నాకు తెలీకుండా నా వ్రేళ్ళు ఆమె ముక్కు, ఆమె కళ్ళు, పెదాలు అన్నిట్లో ఆమె పోలికలనే గీస్తున్నాయి.

ఒకరోజు... ఆరోజంతా ప్రియాంక నాకు కనిపించలేదు... తన గదిలో నుంచి బయటకు రాలేదు. నాకు పిచ్చి పట్టినట్టు అయింది. కాఫీ కూడా పనమ్మాయి తెచ్చి ఇచ్చింది. టిఫిన్ కూడా నా గదిలోకి తెచ్చి ఇచ్చింది పనమ్మాయి. ప్రియాంక ఎక్కడ? అని అడగలేకపోయాను. టిఫిన్ తినాలనిపించలేదు. అలాగే వదిలేసి, పది అవుతూ ఉండగా

ఉండబట్టలేక హాల్లోకి వచ్చాను. అంతటా నిశ్శబ్దంగా ఉంది. ఒక గిటార్ ధ్వనిలా వినిపించే ఆమె మంజీరనాదం ఎక్కడా లేదు... పారిజాత పరిమళంలాంటి ఆమె ఒంటి నుండి వచ్చే సువాసనలు లేవు... మలయమారుతంలాంటి ఆమె పలుకులేదు... మొదటిసారిగా ఇల్లంతా తిరిగాను. వంటగది వైపు ఉండే పెరడు ఎప్పుడూ చూడలేదు. వంటగది వెనుక వాకిలి నుంచి పెరట్లోకి వెళ్లాను. గుత్తులుగా కాసిన జామకాయలు, నిమ్మకాయల పరిమళం నాసికాపుటాలను తాకింది కానీ, మల్లెల సౌరభం మాత్రం నన్ను తాకలేదు.

తిరిగి హాల్లోకి వచ్చి సందేహంగా, సంకోచంగా ఆమె బెడ్రూమ్ వైపు వెళ్లాను. తలుపు మూసి ఉంది. లోపల నుంచి ఎలాంటి అలికిడి లేదు. కొన్ని క్షణాలు తటపటాయిస్తూ అక్కడే ఆ మూసిఉన్న తలుపుల దగ్గరే కొంచెం దూరంలో నిలబడి ఆ తలుపుల వైపు చూస్తూ ఉండిపోయాను... కొన్ని క్షణాల తరవాత అడుగుల చప్పుడు. ఎవరో చెళ్ళున వీపు మీద చరిచి తోసినట్టు నా గదివైపు వెళ్ళిపోయాను వేగంగా.

దడ,దడలాడుతున్న గుండె చిక్కబట్టుకుని మంచం మీద కూర్చోబోతూ ఉండగా అజయ్ స్వరం వినిపించింది "తేజా!" అంటూ. ఉలిక్కిపడి అలాగే నిలుచున్న చోటే నిటారుగా ఉండిపోయాను.

అజయ్ లోపలికి వచ్చాడు. పాలిపోయినట్టున్న నా మొహం చూస్తూ " ఏంటి? అలా ఉన్నావేం? ఏమైంది" అని అడుగుతూ నా దగ్గరగా వచ్చాడు.

తడబడుతూ అన్నాను " అబ్బే! ఏమీ లేదు..." అని నెమ్మదిగా అన్నాను "ఇవాళ టిఫిన్, కాఫీ నా గదిలోకి పంపించారెందుకు?"

"అదా! ప్రియకి నలతగా ఉంది... పడుకుంది. నేను ఆఫీస్ కి వెళ్ళడం లేదు. కొంచెం వంటలో సాయం చేస్తావా!" అన్నాడు.

నా గుండె జారిపోయింది. ప్రియకి అనారోగ్యమా!

తప్పకుండా చేస్తాను అంటూ అతని వెంట వంటగదిలోకి వెళ్తూ ఆమె బెడ్ రూమ్ వైపు కనుచివరల నుంచి చూసాను.

వంట అయ్యాక అజయ్ "నువ్వు భోజనం చేసేయ్. నేను, ప్రియ లోపల తింటాము' అంటూ ప్రియకి భోజనం గదిలోకే తీసుకుని వెళ్ళాడు.

మొదటిసారిగా అజయ్ మీద అసూయ కలిగింది.

డైనింగ్ టేబుల్ దగ్గర ఒక్కడినే మిగిలిపోయాను. సయించలేదు. బలవంతంగా నాలుగు మెతుకులు కతికి గదిలోకి వెళ్ళిపోయాను.

ఎంత ప్రయత్నించినా ప్రియని చూడలేకపోయాను ఆరోజంతా. అజయ్ కూడా ఆ గదిలోనే గడిపాడు.

అస్థిమితంగా గడిపాను... గదిలోలైట్ ఆఫ్ చేసి అటూ, ఇటూ పచార్లు చేసాను... ఆమె ఎలా ఉందో! గాలికి కదిలే చిగురాకు సడి కూడా ఆమె వైపు వెళ్ళకుండా కాపలా కాయాలి... ఈ ప్రపంచంలో ఏ శక్తి ఆమెని బాధించకూడదు. ఎలా? ఎలా? ఆమెని ఒక్కసారి చూడాలి... పడుకుంటే నిద్రపట్టలేదు.. ఏవేవో పీడకలలు... ఆమె నన్ను మెడపట్టుకుని బయటకు గెంటి తలుపు వేసుకున్నట్టు నేను తలుపు తీయమని అరుస్తూ, ఏడుస్తూ గడప మీద తల కొట్టుకుంటున్నాను. ప్రవహిస్తోన్ననెత్తురు నది. గబుక్కున లేచాను... చెమటతో ఒళ్ళంతా తడిసిపోయింది. ఏమిటి ఈ కల! దేవుడా నాకేమవుతోంది! తల రెండు చేతుల్లో పట్టుకుని కూర్చున్నాను వివాహితురాలు అయిన స్త్రీని మనసులోకి రానివ్వడం ఎంత పాపం! ఆదరించి, ఆశ్రయం ఇచ్చి ఆత్మీయత పంచినందుకు నేను ఆ అనురాగమూర్తులకు చేస్తున్న ఉపకారమా ఇది? ఉపకారం చేయకున్నా అపకారం చేయకూడదు.. ఉపకారికినపకారం నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ! సూర్య చెప్పిన సుమతీశతకంలోని పద్యం గుర్తొచ్చింది. దేవతలాంటి ఆమె పట్ల నీచమైన ఆలోచనలు రాకూడదు...కానీ వస్తున్నాయి. నేను ఆమెని పవిత్రమైన భావంతో చూస్తున్నాను... నాది కేవలం ఆరాధన నా అంతరాత్మకి నచ్చచెప్పే ప్రయత్నం చేసాను.

“అయినా పరాయి స్త్రీని ఆరాధించే హక్కు కూడా నీకు లేదు... అతనికి ఈ విషయం తెలిస్తే నిన్నుచంపి ముక్కలు చేస్తాడు... వెళ్ళిపో... తక్షణం ఇక్కడి నుంచి వెళ్ళిపో!” అంతరాత్మ వేయి స్వరాలతో శాసిస్తోంది... ఆజ్ఞాపిస్తోంది.

“నో... వెళ్ళను... వెళ్ళలేను... ఆమె లేకుండా బతకలేను...” హృదయం ఆక్రోశిస్తోంది.

ఒక్కరోజు చూడకపోతేనే విలవిలలాడుతున్నాను... జీవితాంతం ఎలా జీవించడం? ఆమెని చూడాలి... ఇంకా, ఇంకా చూడాలి...ఈ కళ్ళతో ఆ రూపాన్ని గుండె మీద చెక్కుకోవాలి.. . చేతిలో ఉన్నది బ్రష్ కాదు... ఉలి... ఈ ఉలితో ఆమె శిల్పాన్ని చెక్కుకోవాలి... ఆ కళ్ళు, బరువుగా వాలే రెప్పలు, లేత గులాబీ రేకుల్లాంటి ఆ పెదవులు, నల్లని మేఘాల్లాంటి ఆ కురులు... ఆమె అంగాంగ వర్ణన చేయడానికి నేను కవి కాదు... చిత్రకారుడు. ఆమెని ఆరాధిస్తూ, పూజిస్తున్న భక్తుడు... ఆమె ఓ శిల్పంలా, నా గుండె గుడిలో దేవతఅయింది...

తెల్లవారుతోంది... తిరిగి రాత్రి అవుతోంది... కాలం నాకు తెలియకుండా పాదరసంలా ప్రవహించి పోతోంది... నా కళ్ళు తెల్లవారుతూనే ఉదయభానుడిని కాదు... ఉదయకిరణాల్లో విరిసి మెరిసే నందివర్ధనంలాంటి ఆమె వదనం చూడడానికి ఆత్రంగా వెతుకుతాయి... ఉదయభానుడు ఆమె నుదుట కుంకుమలా అనిపిస్తాడు... ఆ కాటుక కళ్ళు... సంధ్య వాకిళ్ళు...

అజయ్ ఎప్పటిలా ఆఫీసు కి వెళ్తున్నాడు... కానీ, ఆమె మాత్రం ఇదివరకులా కనిపించడం లేదు. కావాలనే తప్పించుకు తిరుగుతోంది అనిపిస్తోంది . ఇదివరకు నాతో కూర్చుని లంచ్ చేస్తూ కబుర్లు చెప్పేది... ఇప్పుడు నా ఒక్కడికే టేబుల్ మీద అన్నీ అమర్చి లోపలకు వెళ్ళిపోతోంది.

ఆ పరిస్థితి నరకంలా ఉంది.. . నన్ను వెలివేస్తున్నట్టుగా అనిపిస్తోంది. నేను చేసిన తప్పుకి ఆమె వేస్తున్న శిక్ష అనిపిస్తూ ఉన్నా, నేను తప్పు చేసాను అన్న న్యూనతా భావం మాత్రం నాలో కలగడం లేదు.

నేనేం తప్పు చేసాను అని ఆలోచిస్తున్నానే కానీ , తప్పు చేస్తున్నాను అని నా మనసు అంగీకరించడం లేదు. మనసుకీ, నా ఆలోచనలకీ మధ్య ఒక భీకర సంగ్రామం జరుగుతోంది. ఆమెతో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నా కానీ మాట్లాడలేకపోతున్నాను. ఎవరో నా గొంతు నొక్కేస్తున్నట్టు, భూగర్భం నుంచి కిందికి పాతాళంలోకి తోస్తున్నట్టు శక్తులన్నీ నిర్వీర్యం అయిపోతున్నట్టు... నేను నిర్జీవంగా అవుతున్నాను. ఆరోజు క్లాస్ కి కూడా వెళ్ళాలనిపించలేదు. గదిలో మౌనంగా, ఆమె దర్శనం కోసం తపస్సు చేస్తున్నట్టు కూర్చున్నాను.

కొంతసేపటికి గది బయట సన్నని మువ్వల శబ్దం.. గబుక్కున తలుపు తీసాను. .నిండుగా పూచిన మల్లెపొదలా ఆమె...

"ఒకసారి బయటకు రా..." పిలిచింది. మంత్రం వేసినట్టు ఆమెని అనుసరించాను. పెరట్లోకి నడిచింది.

"కూర్చో" కేన్ కుర్చీ చూపించింది తనూ ఒక కుర్చీలో కూర్చుంటూ.

ఆమె ఎప్పటిలా నవ్వుతూ, చైతన్య స్రవంతిలా లేదు. గంభీరంగా ఉంది. జంకుగా, ఒదిగి, ఒదిగి కూర్చున్నాను.

బాణంలా సంధించింది ప్రశ్న." మీఅమ్మా, నాన్నా ఎలా పోయారు?"

ఆశ్చర్యంగా చూసాను . ఏనాడూ అడగని ప్రశ్న.. ఇప్పుడెందుకు అడుగుతోంది..

"ఎలా పోయారు?" మళ్ళీ అడిగింది.

"తు... తుపానులో కొట్టుకుపోయారు."

ఆమె భ్రుకుటి ముడిపడింది... "తుపానా! ఎలా?".

" మేము సముద్రం ఒడ్డున ఇసుకదిబ్బల మీద పూరి గుడిసెల్లో జీవించే మత్స్యకారులం... చేపలు పట్టడం మా వృత్తి... మా నాన్న నాకు ఏడేళ్ళ వయసులోనే వల వేయడం నేర్పాడు. సముద్రం మా అందరికీ తల్లి. మా అమ్మ పసివాడినైన నన్ను ఆ సముద్ర కెరటాల మీద ఊయల ఊపింది. ఆ కెరటాలు చూపిస్తూ కథలు చెప్పింది... పాటలు పాడింది. ఆ కెరటాల హోరే నాకు భాష నేర్పింది. నాతో ఆడుకున్నాయి... నేను సముద్రం ఒడ్డున పుట్టి, అలల ఒడిలో పెరిగిన వాడిని... కానీ," కంఠం రుద్ధమైంది." ఆ అలలే నా సర్వస్వాన్ని దోచుకుని నన్ను అనాధని చేశాయి. నా మిత్రులు, హితులు, నా శ్రేయోభిలాషులు అందరినీ ఆ అలలే తీసుకుని వెళ్ళిపోయాయి... ఏనాటికైనా నేను కోల్పోయినవన్నీ నాకు తెచ్చి ఇస్తాయి అని ఆశగా ఆ అలల చుట్టూ తిరుగుతున్నాను. నేను సముద్ర పుత్రుడిని. "

కొంతసేపు సూది పడినా వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది. ఆమె వదనంలో నా పట్ల క్షణకాలం సానుభూతి కాబోలు మెరుపులా మెరిసింది. కానీ, ఎందుకో, బహుశా కావాలనే మనసుని కఠినం చేసుకున్నది కాబోలు కఠినంగా అంది... " నీగురించి నీకు తెలుసుకదా! అలాంటప్పుడు నీ హద్దుల్లో ఉండడం నువ్వు నేర్చుకోవాలి అవునా!"

బిత్తరపోయి చూసాను. " నేనేం చేశాను."

అగ్నికణాలు రాలుతున్నట్టు చూస్తూ చెంగు చాటున ఉన్న చేయి పైకి తీసి చేతిలో ఉన్న పోస్టర్ చూపిస్తూ " ఏంటిది? నా బొమ్మ నా అనుమతి లేకుండా ఎందుకు వేసావు? ఎవరిచ్చారు నీకీ చనువు? ఎంత ధైర్యం నీకు? చిన్నపిల్లవాడివని, దిక్కులేని వాడివని ఆదరిస్తే తిన్న ఇంటి వాసాలు లెక్కపెడతావా! నీకసలు విశ్వాసం ఉందా! ఈ విషయం ఆయనకి తెలిస్తే నిన్ను మెడపట్టుకుని బయటకి గెంటేస్తారు... ఆతరవాత నీ బతుకు ఫుట్ పాత్ బతుకు అవుతుంది తెలుసా! "

ఆమె చూపులు దహించి వేస్తుంటేనిర్ఘాంతపోయి చూస్తున్న నాకు ఆమె చివరి వాక్యాలు వినగానే ఆపుకోలేనంత గట్టిగా నవ్వాలనిపించింది. ఫక్కున నవ్వాను.

" ఎందుకు నవ్వుతున్నావు?"మండిపడింది.

" నేను కొత్తగా ఫుట్ పాత్ మీదకి వెళ్ళడం ఏంటి అని నవ్వొస్తోంది మేడం... నేను పుట్టిన దగ్గర నుంచీ నా బతుకు ఫుట్ పాత్ మీదే గడిచింది ఎక్కువ భాగం... నా చిరునామానే ఫుట్ పాత్."

ఆమెజుగుప్సగా చూసింది.. ." అయినా సిగ్గులేదూ! నీ బతుక్కి నన్ను కామిస్తావా! నిన్ను..." .పళ్ళు కొరుకుతూ అంది..."ఒక్క క్షణం కూడా నువ్వు ఇక్కడ ఉండద్దు... గెట్ అవుట్... తక్షణం వెళ్ళిపో.. ఇంకోసారి నీ మొహం చూపించద్దు... ఛీ " అంటూ విసురుగా కుర్చీ లోంచి లేచింది... "సాయంత్రం ఆయన ఇంటికి వచ్చేలోపల నువ్వు నా ఇంటి గేటు దాటాలి. ఎక్కడ ఉంటావో, ఎలా బతుకుతావో నాకు అనవసరం... నువ్వు చచ్చినా నాకు తెలపద్దు ..."

నిలుచున్న చోటే నిలువునా కాలిపోతే బాగుండు అనిపిస్తోంది. ఆ పోస్టర్ నా కోసం వేసుకున్నాను. అది ఆమె చేతికి ఎలా వెళ్ళింది? ఎంత పని జరిగింది! ఏది జరగకూడదని ఆశించానో అదే జరిగింది... ఎన్ని మాటలు! తేనెలూరే ఆ స్వరం నుంచి అంత కఠినాతి కఠినమైన మాటలు వినలేకపోయాను. ఏమిటీ దారుణం ! నేనామెని కాంక్షించానా!ఆమెని కామ దృష్టితో చూసానా! ఆరాధన తప్ప మరో ఆలోచనే లేదే! గర్భగుడిలో దేవతని కామించేంత నీచుడినా నేను? అమ్మాయిలూ, ప్రేమ,కామం, మోహం వీటి అర్ధాలు కూడా తెలియని నా జీవితంలోకికమ్మని రాగంలా ప్రవేశించింది... ఆ రాగాన్ని మనసులోనే భక్తిగా ఆలపించానే కానీ, ఏ వికారాలు వ్యక్తం చేయలేదు.. ఆమె మీద లేలేత ఆకురాలిపడినా, పూరేకు వాలినా అమ్మవారి మీద నిర్మాల్యం తొలగించినట్టు తీసాను... ఆమె కాలికి సోఫా తగిలితే చందనం అద్దాను... షోడశోపచారాలు చేయాలని తహతహలాడాను ... అదే నేను చేసిన నేరమా! అనాల్సినవి అని చేయాల్సిన గాయం చేసేసి ఆమె వెళ్ళిపోయింది... నా గుండెల మీద నుంచి నడుస్తూ వెళ్ళిపోయింది.

యాంత్రికంగా నడుస్తూ నా గదిలోకి వెళ్ళాను. నా వస్తువులు అన్నీ కుప్పగా వేసి పెట్టెలో దూర్చాను . పెట్టె పట్టుకుని గది బయటకు వచ్చాను. హాల్లో నుదుటి మీద చేతులు పెట్టుకుని సోఫాలో కూర్చుని ఉన్న ఆమె నా అడుగుల శబ్దం విని గబుక్కున లేచి లోపలికి వెళ్ళబోయింది...

" ఒక్క క్షణం ఆగండి... ప్లీజ్" అన్నాను ప్రాధేయపూర్వకంగా.

"ఎందుకు?" రెండు కత్తులు గుండెల్లో గుచ్చుకున్నట్టు అనిపించింది ఆ చూపులకి.

రెండు అడుగులు ఆమె వైపు వేశాను" ఒక్కసారి... ఒకే ఒక్కసారి మీ పాదాలు తాకవచ్చా."

" గెట్ అవుట్ " గొంతు పెగల్చుకుని అరిచి వేగంగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

వెక్కి, వెక్కి ఏడుస్తోంది ఆహ్లాద. నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు తేజ.

పూడుకుపోయిన గొంతు సవరించుకుంటూ నెమ్మదిగా, జాలిగా అడిగాడు. "నన్ను అసహ్యంచుకుంటున్నావా ఆహ్లాదా!"

ఆహ్లాద సమాధానం చెప్పలేదు.

అప్పుడు బద్దలైంది దుఃఖాగ్ని పర్వతం... అప్పుడు ఎగసింది మహా సముద్రం కన్నీటి తరంగమై... బావురుమంటూ చిన్నపిల్లాడిలా ఏడుస్తున్న తేజాని చూసిన ఆహ్లాద తన గుండెల్లో ఎగసిపడుతున్న దుఃఖాన్ని మరచిపోయి, విస్తుబోయింది.

ఈయనేనా సమస్త భారతదేశపు కళాకారులు ఆరాధించి, అభిమానించే మహాతేజ...

వెక్కిళ్ళు ఆపుకుంటూ అంది "మీరు... మీరు కూడా ఏడుస్తారా!"

అతను ఏడుస్తూనే నవ్వాడు. "నేను మగవాడిని కాబట్టి ఏడవకూడదు అవునా!" అన్నాడు.

"అదికాదు..." అంది మాటల కోసం తడుముకుంటూ.

"లేదు ఆహ్లాదా! నేను ఏడవడం లేదు... ఆ దేవత పాదాలు అభిషేకించడానికి అందుబాటులో నీరు కనిపించడం లేదు... అందుకే నా కన్నీళ్ళతో అభిషేకించడానికి గుండెను గుక్కెడు నీళ్ళు అప్పడిగాను."

ఆహ్లాదకి మరోసారి దుఃఖం ఆగలేదు. ఆగి, ఆగి నవ్వాడు. "ఏమవుతుంది? మహాతేజ మళ్ళీ రోడ్డున పడ్డాడు... తిరిగి ఫుట్ పాత్ చేరాడు... ఆశ్రయం లేదు... ఆత్మీయత లేదు... ఆకలి తీరే మార్గం లేదు.. గమ్యం లేదు... జీవితం వెనక్కి నడిచి వెళ్ళిపోతోంది... చిత్రకారుడు తేజ 'మాగాడు' గా మళ్ళీ అవతరించాడు...

ఆహ్లాద "అలా అనకండి..." అంటూ మరింత బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది. తేజ బాధ ధ్వనిస్తున్న స్వరంతో అన్నాడు... "అయాం సారీ ఆహ్లాదా! నువ్వింతగా ఇన్వాల్వ్ అవుతావని అనుకోలేదు. ఇంక ముగిస్తాను నా కథ" అన్నాడు.

"లేదు, లేదు... ప్లండి ప్లీజ్... మీ జీవితం చాలా మందికి ఒక పాఠం అవుతుంది... ఎందరికో ఒక దిక్సూచి అవుతుంది... మీలోని మాగాడి లాంటి వాళ్ళు ఎందరో ఉన్నారు ఈ సమాజంలో... వాళ్ళంతా చరిత్ర పుటల్లో ఎక్కాలంటే మీ కథ తెలుసుకోవాలి... ఆపకండి..." కళ్ళు తుడుచుకుంటూ రుద్ధమైన స్వరంతో ఉద్విగ్నంగా అంది.

ఏ. సి చేస్తున్న సన్నని జుం అంటున్న శబ్దం తప్ప అంతటా నిశ్శబ్దం వ్యాపించింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వినిపించింది అతని స్వరం."కడలి కెరటాల నుండి కలల తీరం వైపుకు సాగుతున్న నన్ను మళ్ళీ ఓ పెనుతుపాను ఎత్తి కుదేసింది.... అంత భీభత్సం నా జీవితంలో జరుగుతుందని అనుకోలేదు. తుపాను... తుపాను... ఓ పక్క గాలి కెరటాలు... మరోపక్క సముద్ర కెరటాలు... ఉవ్వెత్తున ఎగసిపడుతూ పరిసరాలను ఊడ్చుకుని వెళ్ళిపోతున్నాయి... ఏమిటవి? చెట్లా! పొలాలా! మనుషులా! మేడలా! భవనాలా! కాదు... కాదు... నాఆశలు, ఆశయాలు, కోరికలు,సర్వస్వం

కొట్టుకుపోతున్నాయి. అల్లరి చేసిన కెరటాలు, ఆడుకున్న కెరటాలు, నాకు జోలపాడిన కెరటాలు నాకంత ద్రోహం చేస్తాయని నేనెన్నడూ ఊహించలేదు. నీలినీలి అలలతో అందంగా ఉండే సముద్రం అంత భీకరంగా ఉంటుందని కూడా నాకు తెలియదు. పగిలిపోయిన గుండె, చెదిరిపోయిన స్వప్నాలు... ఎటు చూసినా శూన్యం... కనిపించిన వాహనాలు ఎక్కుతూ, దిగుతూ ప్రయాణం చేసాను. అంతులేని ప్రయాణం... గమ్యం తెలియని ప్రయాణం... ఎందఱో బాటసారులు నాతోపాటు నడిచారు... కొందరు కొంతదూరంలో చీలిపోయారు.. కొందరు అసలు నడవకుండానే వెళ్ళిపోయారు... ఒంటరితనం, ఆకలి, దారిద్ర్యం, దుఃఖం నా చిన్ననాటి మిత్రులు నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. ఆకలి... ఆకలి... ఆకలితో కడుపులో పేగులు చీలికలై కడుపు చీల్చుకుని బయటకు వచ్చినా, ముడుచుకున్న మోకాళ్ళతో లోలోపలికి నెట్టడం తప్ప, ఏనాడూ, ఎవరినీ దేహి అనని ఆత్మాభిమానం. ఎక్కడ పడితే అక్కడ కళ్ళు తిరిగిపడిపోవడం... పడుతూ, లేస్తూ, తిరిగి, తిరిగి పడుతూ ప్రయాణం చేస్తూనే ఉన్నాను. అది ఎంత ఎంత దూరమో, ఎక్కడో తెలియకుండానే కలకత్తా వెళ్లాను.

ఈ ప్రపంచంలో మానవత్వం చనిపోలేదు అని ఋజువు చేస్తూ నేను అడక్కుండానే ఎందఱో నా ఆకలి తీర్చారు. ఒక రాష్ట్ర స్థాయి చిత్రకళా ప్రదర్శనలో అద్భుతమైన చిత్రాలు ప్రదర్శించి ఎందరి మెప్పో పొందిన తేజ మళ్ళీ 'మాగాడి' గా మారి రైల్వే స్టేషన్ లో సేకరించిన బొగ్గు కన్నీళ్ళతో తడిపి, కలకత్తాఫుట్ పాత్ మీద బొమ్మలు వేసుకోడం మొదలుపెట్టాడు.

వచ్చిన చిల్లర లెక్కపెట్టుకోడం వచ్చింది ఇప్పుడు.. .ఆ లెక్కలో రోజుకి నాకు సరిపోతుంది అనిపించిన మోతాదులో మాత్రం కొనుక్కుని తింటూ , మిగిలినచిల్లర దాచుకుంటూ ఎక్కడో అక్కడ చిన్న గూడు దొరక్కపోతుందా అని ఆశ పడుతూ , మరింత నేర్పుగా జీవం ఉట్టిపడేలా బొమ్మలు వేస్తున్నాను. పగలంతా నా బొమ్మలు చూస్తూ చిల్లర వేస్తూ, మధ్య, మధ్య నన్ను పలకరిస్తూ ఎందఱో బాటసారులు... వీళ్ళంతా నాకు ఆత్మీయులేగా అనుకున్నాను. ఏ బంధాలు, వ్యామోహాలులేని జీవితం.. . బానే ఉంది... మనసుని చెదరగొడుతూ, ప్రశాంతతని భగ్నం చేస్తూ ముసిరే జ్ఞాపకాలను తరిమికొట్టడానికి ప్రయత్నిస్తూ, నిశ్శబ్దంలో కరిగే మౌనిగా మారాను. మళ్ళీ చిల్లర నాణాలు... గుణకారాలు, గుణింతాలు లేని, ఏ ఆశలు, కోరికలు నన్ను చేరడానికి సాహసించని ఈ జీవితమే బాగుందేమో అనుకున్నాను. నాకెందుకో సముద్రానికి నాకూ చాలా పోలిక ఉందనిపిస్తుంది... ఎందఱో పర్యాటకులు వస్తుంటారు... కెరటాలతో ఆడుకుంటారు...వెళ్ళిపోతారు... మళ్ళీ ఒంటరిగా తనలో తనే భాషించుకుంటూ మిగిలిపోతుంది... నేనూ అంతే! చిన్న జీవితంలోకి ఎందఱో వచ్చారు... చేరదీసారు... ఆదరించారు... ఆడుకున్నారు.. . వెళ్ళిపోయారు... ఒంటరిగా మిగిలాను. నాకు జీవితాంతం ప్రేమని పంచి తోడుగా నిలిచేవారు ఎవరూ లేరు...

ప్రేమ అనే రెండక్షరాలకి నేనంటే ఎంత పగ! అనిపించింది.. అమ్మ ప్రేమ, నాన్న ప్రేమ, అక్కచెల్లెళ్ళు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఎవరి ప్రేమా నాకు దక్కడం లేదు... దక్కినట్టే దక్కి కవ్విస్తూ, రెచ్చగొడుతూ దూరం అవుతున్నాయి... జీవితంలో ప్రేమించని ప్రేమంచబడని జీవితం వృధా అని ఒక కవి అన్నట్టు చెప్పాడు సూర్య... ప్రేమించబడడానికిఅర్హత కావాలేమో... ప్రేమించడానికి, మూగగా ఆరాధించడానికి కూడా అర్హత కావాలని నాకు ఎవరూ చెప్పలేదు... నేను మనిషిని... మనసున్న మనిషిని ఇది చాలదా ! నా కులం, నా పేదరికం, నా సాంఘిక హోదా ఇవన్నీ అర్హతలు నిర్ణయిస్తాయా! ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సందేహాలు... అన్నిటికీ సమాధానం విధి మాత్రమే చెప్పగలదు అని మరోసారి ఋజువు చేసింది.

అడుగడుగునా వికటాట్టహాసం చేస్తూ విధి ఎంత హాని చేస్తోందో అంత మేలు కూడా చేస్తూ వచ్చింది. అప్పుడు కూడా అదే విధి కొంత మేలు చేసింది.. .

అక్కడ బెనర్జీ పరిచయం అయాడు. అది కూడా చిత్రంగానే జరిగింది. ఒకేదగ్గర స్థిరంగా ఉండడానికి నేనున్నది పాలస్ కాదు... పబ్లిక్ రోడ్డు... ఒకరోజు ఎవరో వచ్చారు గుంపుగా... నాబొమ్మలు కాలితో చెరిపేశారు.. . నన్ను మెడపట్టుకుని నాకు తెలియని భాషలో తిడుతూ నడి రోడ్డు మీదకి తోసారు. నాకున్న ఒకే ఒక్క ఆస్తి నా పెట్టె... నా మీదకి విసిరేశారు... నాస్థలాన్ని ఆక్రమించారు.. .ఇది కూడా ఒక రకమైన దురాక్రమణ... అయినా ఎదుర్కొనే శక్తి లేని వాడిని... మౌనంగా అడుగులు వేశాను శూన్యంలోకి.

రోడ్డు దాటుతూ ఉండగా వేగంగా వచ్చిన బెనర్జీ కారు నన్ను గుద్దేసింది. నేనో పక్క, నా పెట్టె ఒక పక్కా. అతను కారు ఆపి వచ్చి నన్ను లేవదేసాడు... రద్దీ ఎక్కువలేని ప్రదేశం వల్లనేమో ప్రమాదకరమైన దెబ్బలు తగల్లేదు నాకు. నన్ను కారులో కూర్చోబెట్టి నా పెట్టె తీసుకురావడానికి వెళ్ళాడు. పెట్టె మూట విడిపోయి అందులో ఉన్న నా చిత్రాలు చెల్లచెదరు అయాయి. అవి చూసి బెనర్జీ విస్తుబోయాడు. ‘నువ్వు కళాకారుడివా’ అన్నాడు..

నవ్వి ఊరుకున్నాను. తన ఇంటికి తీసుకుని వెళ్లి రెండు రోజులు ఆశ్రయం ఇచ్చి నా కథ తెలుసుకుని నా మీద జాలి పడ్డాడు... “ నీకో సాయం చేయగలను... ఆ తరవాత నువ్వే పదిమందికి సాయం చేస్తావు” అని చెప్పి తీసుకుని వెళ్లి శాంతినికేతన్ లో చేర్పించాడు. అక్కడి నుంచీ నా జీవితం మరో మలుపు... అడుగడుగునా మలుపులే... గమ్యం మాత్రం చేరడం లేదు...” తేజ కొన్ని క్షణాలు ఆగి తిరిగి చెప్పసాగాడు.

కొంతకాలం గడిచింది.. . ప్రశాంతమైన వాతావరణం, తపస్సులో మునిగి ఉండే కళాకారులు... శాంతినికేతన్ ద్వారా జీవితంలో శాంతి అంటే ఏమిటో తెలిసింది... అలాగే నాకు జీవితం విలువ కూడా తెలియడం మొదలైంది.. .

ఏడాది గడిచింది.

బయటకు వచ్చాను... బతకాలి... ఎలా? బతకాలంటే డబ్బు కావాలి... నాకున్న విద్య నా కళ... నాగరిక సమాజంలో కళని అమ్ముకుంటే బతకగలం... నమ్ముకుంటే బతకలేం అన్న సత్యం తెలిసింది...నా కళని అమ్ముకోవాలంటే ముందు ప్రదర్శించాలి. సూర్య మాటలు గుర్తొచ్చాయి. అవును.. నా ప్రతిభ పదే, పదే ప్రదర్శించుకుంటే తప్ప నాకు ఈ సమాజంలో గుర్తింపు లభించదు. ప్రదర్శించాలంటే డబ్బుండాలి. నేను వేసిన చిన్న, చిన్న చిత్రాలు కలకత్తా రోడ్ల మీద వందకి, రెండు వందలకి అమ్మడం మొదలుపెట్టాను. అలా అమ్ముతున్నప్పుడు నేను గౌరవంగా, నాకంటూ ఒక ఉనికిని ఏర్పరచుకుని బతకాలి అన్న లక్ష్యం మాత్రమే ఉండేది... అవమానంగా కాని, ఆత్మ న్యూనత కానీ లేకుండా దాదాపు ఆరేడు నెలలు అలా కలకత్తా రోడ్ల మీద నా చిత్రాలు అమ్ముకుంటూ, కాళిఘాట్ లో తలదాచుకుంటూ, అమ్మవారిని వివిధ రూపాల్లో నా మనో మందిరంలో ఊహించుకుంటూ, ఆ ఊహలన్నీ కాన్వాస్ మీద చిత్రిస్తూ నా ప్రస్థానం ప్రారంభించాను.

చిత్రం...ఎందులోనూ కాళి అమ్మవారి రూపం కనిపించలేదు...నా హృదయంలో ప్రతిష్ఠించుకున్న దేవత రూపమే ప్రతి చిత్రంలో... నా అదృష్టం... ఎవరికీ ఆమె తెలియదు... నేను అమ్మవారికి కొత్త అందాలు సృష్టించానని, అమ్మకి జీవం పోస్తున్నానని నన్ను పొగడ్తలతో ముంచెత్తారు... కాళిదాసుకి నాలుక మీద బీజాక్షరాలు వ్రాస్తే, నా చేతివ్రేళ్ళ మీద వ్రాసిందని, నేను అమ్మవారి ఉపాసకుడిని అని నాకో ప్రత్యేకమైన గుర్తింపు లభించసాగింది... అది నాకు ఆనందాన్ని కలిగించలేదు...భయం, ఆత్మాన్యూనతా... అనుకున్న లక్ష్యం సాదించాను కానీ, అది నాకు తృప్తిని ఇవ్వలేదు... అమ్మవారి పట్ల నేను అపరాధం చేసిన భావన క్రుంగ దీయసాగింది. ఫలితం రాత్రికి రాత్రి బయలుదేరి ఎవరికంటా పడకుండా హైదరాబాద్ చేరాను. దేవతల బొమ్మలు వేయడం మానేశాను... హృదయాన్ని స్పందింప చేసే ప్రతి దృశ్యం నా కాన్వాస్ మీద చిత్రమై వేలిసేది... ప్రకృతి సౌందర్యం, అమ్మాయిల సౌందర్యం, జీవనసౌందర్యం... నేను చేసే ప్రతి పనిలో ఒక అందం... ఒక ఆనందం... ఎదిగాను... చిత్రకారుడిగా.. .అంతర్జాతీయ స్థాయికి ఎదిగాను.

ఇప్పుడు నేను నీ ఎదురుగా నా విజయపరంపరను చెప్పుకుంటూ కూర్చునే స్థాయి వెనక దృశ్యాలన్నీ అప్పుడప్పుడూ స్పష్టంగా, ఎప్పుడన్నా అస్పష్టంగా.. . అలా సెల్యులాయిడ్ మీద కదిలే బొమ్మల్లా... నా మనోపథంలో కదులుతూ ఉంటాయి. కొన్ని అంతర్ధానం అవుతూ ఉంటాయి. కొన్ని నా గుండె గోడల మీద వ్రేలాడదీసిన బొమ్మల్లా

ఉండిపోతాయి. ఇప్పుడు చెప్పు ఆహ్లాదా! నేను ప్రేమించకూడదా! మీ అమ్మ నన్నెందుకు అసహ్యించుకుంది! ఎందుకు నన్ను రోడ్డు మీదకి విసిరేసింది? చెప్పు ఆహ్లాదా! నేను చేసింది నేరమా! ఎందుకు మీ అమ్మ నన్ను అంతగా ద్వేశించింది?"

కుమిలి, కుమిలి ఏడుస్తున్న ఆహ్లాద గట్టిగా ఆక్రోశిస్తున్నట్టు అరిచింది. గబుక్కున లేచి వెళ్లి డైనింగ్ టేబుల్ మీద పెట్టిన తన హ్యాండ్ బాగ్ తెరిచి, ఒక పుస్తకం తీసుకుని అతని తలగడ మీద పెట్టి అంది " మా అమ్మ మిమ్మల్ని ద్వేషించలేదు"

అతను నిర్ఘాంతపోయాడు. "మీ అమ్మ నన్ను ద్వేషించలేదా!"

"ఎస్. ద్వేషించ లేదు. ఈ డైరీ చదవండి. చదివాక నాకు ఫోన్ చేయండి వస్తాను బై" అంటూ వేగంగా పరిగెత్తుతున్నట్టు ద్వారం దగ్గరకు నడించింది.

అతను స్వప్నావశిష్టుడిలా తలగడ మీద ఉన్న డైరీ చేతిలోకి తీసుకున్నాడు.

24 వ భాగం

" ఆహ్లాదా! నా తల్లి..." ఉలిక్కిపడ్డాడు...

ఇదిఉత్తరం.. ఆహ్లాదకి... చివర సంతకం వైపు ఉద్వేగంగా చూసాడు. మీ అమ్మ ప్రియాంక. చేతులు వణికాయి... ఆకాశాన్ని మబ్బులు కమ్మినట్టు కనురెప్పల మీద నీటి బిందువులు తెరలు పరిచాయి. ఆ తెరలు చీల్చుకుంటూ... అక్షరాల బారుల వెంట చూపులు సారించాడు.

ఆహ్లాదా! నేనిప్పుడు జీవితం ఆఖరి అంచున ఉన్నాను.. . నాన్న పోయిన దగ్గర నుంచీ నువ్వు నన్ను అమ్మలా కాక నీ బిడ్డలా చూసుకున్నావు ... నా ఆరోగ్యం బాగుపడాలని ముక్కోటి దేవతలను ప్రార్ధిస్తున్నావు ... కానీ నాకు తెలుసు తల్లీ నేనింక ఎక్కువరోజులు ఉండను. మీ నాన్న లేకుండా ఒక్క రోజు కూడా జీవించలేదు... అలాంటిది ఆయన పోయి ఏడాదిన్నర అయినా ఇంకా బతికే ఉన్నాను... ఎలా బతికి ఉన్నానో నాకే అర్ధం కావడంలేదు. బహుశా ఆయన ప్రతిరూపం అయిన నిన్ను చూస్తూ, నీలో మీ నాన్నని చూస్తూ బతికి ఉంటాను.

ఆహ్లాదా! ఎంతో కాలంగా నా హృదయంలో దాగి ఉన్న ఒకే ఒక్క కోరిక తీరకపోతుందా అన్న ఆశతో ఇంతకాలం ఎదురుచూస్తూ జీవించాను. కానీ, ఆ ఆశ కూడా ఆవిరి అవుతోంది... ఆయన నన్ను రా, రమ్మని పిలుస్తూ చేతులు చాస్తున్నారు... వెళ్లిపోవాలి... ఇప్పటికే ఆలస్యం అయింది... వెళ్లేముందు ఒక్క కోరిక... నాకు తెలుసు... ఏ తల్లి, కూతురిని

కోరకూడని కోరిక కోరుతున్నాను.  ఏంటా కోరిక అని భ్రుకుటి ముడుస్తున్నావా! ఈ డైరీ మొత్తం చదువు... నా కోరిక ఏమిటో తెలుస్తుంది... నువ్వు కాదనవని అడుగుతున్నా... తప్పకుండా నా కోరిక తీరుస్తావు కదూ!

అమాయకుడని, దిక్కు, మొక్కు లేనివాడని, ఒక మంచి కళాకారుడిని ఒక అనాధని  చేరదీసాము... ప్రేమరాహిత్యంలో ఉన్న అతడికి ప్రేమా, అభిమానం, ఆత్మీయత పంచాము.  మొదటి సారి వచ్చినపుడు నా పాదాలను, పాదాల మీద జీరాడే చీర కుచ్చిళ్ళను ఎంతో అందంగా చిత్రించి నాకు కానుకగా ఇస్తే మీ నాన్న అతడిని సీతమ్మవారి పాదాలు మాత్రం చూసిన  లక్ష్మణుడు అన్నారు. నేను ఆ కానుక చూసి ఎంతో ఆనందించాను.  కానీ, ఆ రోజు అతను వెళ్తూ, వెళ్తూ వెనక్కి తిరిగి చూసిన చూపు, చూపు కాదు... అది ఒక బాకులా అనిపించింది నాకు. ఆ చూపే నాలో ఏదో అనుమానం రేకెత్తించింది... ముందు కలవరపడినా, కొన్ని రోజుల తరవాత మర్చిపోయాను. రెండోసారి వచ్చినపుడు ఎప్పటిలాగే ఆదరించాను. కొన్ని రోజులు మొహమాటంగా, బిడియంగా ఉంటే నేనే ఆ బిడియం పోగొట్టాలని సరదాగా, చనువుగా మాట్లాడాను. ఆ తరవాత అతని చూపుల్లో, మాటల్లో. ప్రవర్తనలో ఏదో మార్పు... అనేకసార్లు నన్ను తదేకంగా చూస్తూ ఉండిపోడం గమనించాను. నా అనుమానం అర్థరహితం అనుకున్నాను. మీ నాన్నకి చెప్పాలనుకున్నాను... కానీ జంకాను... ఆయన నమ్మచ్చు, నమ్మకపోవచ్చు... ఒకరోజు అతని గది శుభ్రం చేయడానికి వెళ్ళిన పనిమనిషి అతని మంచం మీద ఉన్న పోస్టర్ చూసి నాకు చూపించి, “ అమ్మగారూ! ఈ బొమ్మ మీ బొమ్మలాగే ఉందండి”  అంటూ పిట్టగోడ మీద కొంచెం ఒంగి పావురంతో మాట్లాడుతున్న అమ్మాయి చిత్రం  చూపించింది.  నిజంగానే అచ్చు గుద్దినట్టు నా పోలికలు... నాకు భయంతో పాటు పిచ్చి కోపం వచ్చింది. మీ నాన్న ఆ బొమ్మ చూస్తే ఎలా రియాక్ట్ అవుతారో తెలియదు... ఆయన చూడకుండా దాచాను... కానీ అతను ఇంతటితో అగుతాడని అనిపించలేదు. ఒకరోజు అతను లేనప్పుడు గదిలోకి వెళ్లి వేసిన బొమ్మలన్నీ చూసాను... నాకు షాక్ తగిలినట్టు అయింది... ఒళ్ళంతా దహించుకుపోయింది...  ప్రతి అమ్మాయి బొమ్మలో నా పోలికలు.. ఉద్రేకంతో, ఆవేశంతో ఒళ్ళు తెలియలేదు... అతను కనిపిస్తే చెంప పగలకొట్టి మెడపట్టి గెంటాలని అనుకున్నాను. కానీ రభస అవుతుంది మీ నాన్నకి తెలుస్తుంది... పనిమనిషికి తెలుస్తుంది... అందుకే ఒకరోజు వంటరిగా ఉన్నప్పుడు పిలిచి నోటికి వచ్చినట్టు తిట్టి ఇంటి నుంచి వెళ్ళగొట్టాను.  మీ నాన్న వచ్చి “తేజ ఎక్కడ?”  అని అడిగేతే “తెలియదు... బయటకు వెళ్తున్నా అని చెప్పి వెళ్ళాడు... ఇంకా రాలేదా!”  అన్నాను నాకేమీ తెలియనట్టు .

నాన్న చాలా సేపటివరకు అతనికోసం ఎదురుచూసి ఎందుకో అతని గదివైపు వెళ్లి చూసి, “ పెట్టె కూడా లేదు.. ఎక్కడికి వెళ్ళాడు?” అని అడిగారు.

నేనే వెళ్ళగొట్టాను అని చెప్పలేని నిస్సహాయత... ఏం సమాధానం చెప్పాలో అర్ధంకాని అయోమయం. ఆహ్లాదా! చేసిన పాపం చెబితే పోతుందని అంటారు... నేను చేసిన పాపం పోతుందో లేదో నాకు తెలియదు.. అయినా చెబుతున్నాను. నానవరత్నాల నెక్లెస్ దాచిపెట్టి, అది పోయిందని అతనే తీసుకుని పారిపోయాడని, అనామకులని నమ్మితే ఇలాంటివే జరుగుతాయని మీ నాన్నని నమ్మించాను.

బహుశా ఈ కథ ఇంతటితో ముగిసిపోతే వేరేగా ఉండేది... కానీ, సరిగ్గా వారం రోజుల తరవాత గేటుకి ఉన్న లెటర్ బాక్స్ మీద ఫ్రేమ్ కట్టిన పెయింటింగ్ ఒకటి పెట్టి ఉంది... నేను ఏమిటా అని తీసి చూసాను. గర్భగుడిలో దేవత... రెండువైపులా వెలుగుతున్న దీపాలు... గడప మీద తల ఆనించి మోకాళ్ళ మీద వాలిన యువకుడు... ప్యాకింగ్ మీద ఇది మీకే అని మాత్రం రాసి ఉంది... కింద సంతకం అనాధ, కేరాఫ్ ఫుట్ పాత్... ఆ దేవత నా పోలికలతో... ఆవేశంతో అవమానకరంగా భావించి, వణికిపోయాను. కాళ్ళు, చేతులూ ఆడలేదు. నిస్సత్తువగా సోఫాలో కూర్చుని మరోసారి ఆ ఫోటో చూసాను... నాలో ఆవేశం నెమ్మదిగా దిగిపోయి ఆ స్థానంలో ఆలోచన. ఇది ఒక పవిత్రమైన భావన... ఇందులో నేను ఆవేశపడిపోవాల్సినంత విషయం లేదు. నేనెందుకు ఇలా ఆలోచిస్తున్నాను. నన్ను దేవతలా ఆరాధిస్తున్నాడా అతను... నేను అపార్ధం చేసుకున్నానా !

ఆవేశం తగ్గుతూ ఉంటే నాహృదయం అతని పట్ల జాలితో నిండిపోసాగింది. ఏ అర్ధరాత్రో వచ్చి ఎవరూ చూడకుండా లెటర్ బాక్స్ మీద పెట్టి వెళ్ళాడు అంటే అతను ఈ ఊళ్లోనే ఉన్నాడు. కానీ ఎక్కడ ఉన్నాడు? ఎలా ఉన్నాడు? అసలే అమాయకుడు..! ఎక్కడ ఉన్నాడో, ఏం చేస్తున్నాడో, ఏం తింటున్నాడో అనే దిగులు నన్ను ముంచేసింది.

ఆ చిత్రం, కింద సంతకం... కేరాఫ్ ఫుట్ పాత్ అన్న అక్షరాలూ కత్తుల్లా గుచ్చుతున్నాయి నన్ను... ఎంత పని చేసాను! అపరాధభావన నన్ను దహించడం మొదలుపెట్టింది. నాలో అంతులేని ఘర్షణ... నేను తప్పు చేసాను... కాదు, కాదు పాపం చేసాను. అన్నం పెట్టిన కడుపు మీద కాలితో తన్నాను. ఏదో ఆవేదన... ఏదో దుఃఖం నా గుండెని నలిపేయసాగింది. రోజులు గడిచిపోతున్నాయి. గేటు మీద పక్షి వాలినా, అతనేనా అనే ఆరాటంతో నా కళ్ళు వాకిలి చుట్టూ పరిభ్రమించసాగాయి.

నాకు తెలియకుండానే నాలో ఒక ఆవేదన రగలడం మొదలైంది. తప్పు చేసాను... తప్పు చేసాను... అతను నన్ను చూసినంత మాత్రాన కామిస్తున్నాడు అనుకోడం స్త్రీ సహజ స్వభావమా! ఇది బలహీనతా! లేక అంతరాంతరాల్లో ఎక్కడో అతను పురుషుడు, నన్ను స్త్రీగానే చూస్తున్నాడు అనే తృప్తా... ఆనందమా! ఏది? ఏది? నేనతనిని చూడకుండా ఉంటే,

అతను నన్ను చూస్తున్నాడని ఎలా తెలుస్తుంది! అతని చూపులు పదునుగా నా అంగాంగాలను గుచ్చుతుంటే ఎలా తెలియకుండా ఉంటుంది!

ప్రశ్నలు, సందేహాలు... నాలో అనూహ్యమైన మార్పు... పరధ్యానం ఎక్కువైంది. మీ నాన్న నా పరధ్యానం గమనించారు. "ఏమైంది ప్రియా! ఈ మధ్య అదోలా ఉంటునావు?" అని అడిగారు. ఏమని చెప్పను? చెప్పలేకపోయాను. "ఏమైందిరా! ఏదన్నా ఉంటే చెప్పు నాన్నా!" అని అంటున్న మీ నాన్న లాలనతో కూడిన స్వరం నన్ను మరింత బాధించసాగింది.

అతని గురించిన ఆలోచనలు రోజు, రోజుకి ఎక్కువ అవుతున్నాయి. సానుభూతి క్రమంగా అభిమానంగా మారుతోందా! ఈ అభిమానం ఎలా మారుతుంది! తొండ ముదిరి ఊసరవెల్లి అవుతుంది. నా సానుభూతి ఇంకేదో భావనకి తావీయడం లేదుకదా! అజయ్ ని మోసం చేస్తున్నానా! నేను అతన్ని వాంఛిస్తున్నానా! ప్రేమిస్తున్నానా! అదే జరిగితే! గుండె పగిలిపోతే బాగుండు అనిపించింది..

ప్రతి గాలి సవ్వడి అతనేనా అనే ఉలికిపాటు. ఎలాఅతడిని కలుసుకోవడం! ఎక్కడ ఉన్నాడో, ఏం చేస్తున్నాడో? తట్టుకోలేని బాధ... అప్పటికప్పుడు అతన్ని తీసుకుని రావాలనిపించింది... కానీ ఎక్కడని వెతకను! ఎవరిని అడగను! మీ నాన్న తప్ప నాకు ఎవరున్నారు? తనని అడిగే అర్హత నా అంతట నేనే కోల్పోయాను. చాలా చెడ్డవాడు, మోసగాడు, దొంగ అని మీ నాన్న మనసులో బలమైన ముద్ర వేసింది నేనే... కాదు మంచివాడు తీసుకురండి అని ఎలా అడగను! ఎవరికీ చెప్పుకోలేని బాధ... తీరని వేదన.. ఒక్కసారి అతన్ని చూడాలని నాకు తెలియకుండానే తహ,తహలాడసాగాను.

ఒక వ్యక్తీ గురించి నిరంతరం ఆలోచించడం, ఆ వ్యక్తీ క్షేమం కోరుకోడం ప్రేమా! అభిమానమా! అతన్ని ఒక్కసారి కలుసుకుని, ఆదరించి, గుప్పెడు మెతుకులు పెట్టి, నన్ను క్షమించు అని అడగాలన్న ఆరాటం క్షణం, క్షణం పెరుగుతూనే ఉంది. ఆ భావన తప్ప నాలో మరో ఆలోచన లేదు. నాది ప్రేమకీ, ఆరాధనకీ అతీతమైన భావాన్. బహుశా అతను కూడా నన్నిలాగే అభిమానించాడా! నేను అతన్ని అపార్థం చేసుకున్నాను. ప్రేమ అంటే కేవలం కామం అనుకోడం ఎంత తప్పో మొదటిసారి తెలుసుకున్నాను. మనిషికీ, మనిషికీ మధ్య జనించే భావన ఆరాధనతో కూడిన ప్రేమ అని అది భౌతిక సుఖాలకు అతీతమైనదని అప్పుడే తెలుసుకున్నాను. నాలో పశ్చాత్తాపం దహించివేయసాగింది. అప్పటి నుంచీ నాలో మార్పు... అయితే సరిగ్గా అదే సమయంలో నాకు డెలివరీ అయి నువ్వు పుట్టావు కాబట్టి నాలో కలిగిన మార్పు మీ నాన్నకి తెలియకుండా జాగ్రత్త పడ్డాను. నా మనసు నిండా నువ్వు ఆక్రమించి క్రమంగా అతని ధ్యానం నుంచి, కేవలం ధ్యాసగా మార్చుకున్నాను.

ఆహ్లాదా!ఎన్నో రాత్రులు అతన్ని తలచుకుని బాధపడేదాన్ని... ఎక్కడ ఉన్నాడో, ఎలా ఉన్నాడో, బతికి ఉన్నాడో లేదో ఇలా ఎన్నో ఆలోచనలు . ఆ తరవాత కొన్ని ఏళ్లకు అతని గురించి వార్తా పత్రికల్లో చదివి, హమ్మయ్య బతికే ఉన్నాడు.. . జీవితంలో పైకి వచ్చాడు అని తృప్తి పడ్డాను. కానీ, నేను అతని పట్ల చూపించిన నిరాదరణ, రాక్షసత్వం గుర్తొస్తే నన్ను క్షమించుకోలేకపోయాను. అతని పట్ల మీ నాన్న మనసులో వేసిన ముద్ర చేరిపివేసే సాహసం నేను చేయలేకపోయాను. ఆయన చివరివరకు అతడిని ద్వేశిస్తూనే ఉన్నారు... అతను మంచివాడని, దొంగ అన్న ముద్ర నేను వేసింది అని మీ నాన్నకి చెప్పి, పాప పరిహారం చేసుకునే అవకాశం ఇవ్వకుండా ఆయన నన్ను విడిచివెళ్ళిపోయారు. అతన్ని కలుసుకునే అవకాశం నాకు శాశ్వతంగా పోయింది.

ఆహ్లాదా! ఒకే ఒక్క కోరిక నాది.. మహాతేజ అనబడే గొప్ప చిత్రకారుడి చిరునామా లభించడం నీకు కష్టం కాదు... తప్పకుండా లభిస్తుంది... ఒక్కసారి కలిసి ఈ డైరీ అతనికి ఇచ్చి “ మా అమ్మను క్షమించండి “ అని అడుగు... తప్పకుండా క్షమిస్తాడు... ఎంతోఉన్నతమైన సంస్కారం ఉన్న వ్యక్తీ...

అతను ఇప్పుడు అనామకుడు కాదు... దేశంలో ప్రముఖ వ్యక్తి... జీవితంలో వచ్చే ఆటుపోట్లను, ఓటమిని, కష్టాలను ఎలా దాటాలి, అవమానాలను సహించి ఉన్నత స్థానాన్ని చేరి, అసహ్యించుకున్న వాళ్ళతో ఎలా గౌరవింపబడాలి అనేవి అతన్ని చూసి నేర్చుకోవాలి అందరూ.. . ఉవ్వెత్తున లేచి పడిన కెరటం మళ్ళీ , మళ్లీఎత్తుకి లేస్తూనే ఉంటుంది... అతను మీ యువతకి ఆదర్శం... అతను అందరికీ స్ఫూర్తి... అతను నన్ను ఒక్కసారి క్షమిస్తే చాలు నా ఆత్మ శాంతిస్తుంది... లేకుంటే చేసిన పాపం జన్మ, జన్మలకూ నా వెంట వస్తూనే ఉంటుంది. తప్పకుండా కలుస్తావు కదూ! ఒకవేళ కలుసుకునే అవకాశం దొరక్కపోతే అడ్రస్ అడిగి ఈ డైరీ అతనికి పంపించే ఏర్పాటు చేయి... ఆహ్లాదా! ఇది డైరీ కాదమ్మా రెండు పవిత్ర హృదయాల ఆవిష్కరణ జరిగిన వేదిక.

వణుకుతున్న చేతుల్లోంచి జారిపడింది డైరీ... దిగ్గున లేచి పరుగులాంటి నడకతో బయటకు వచ్చి బాల్కనీ మీద నుంచి గేటు వైపు చూసాడు. కైనెటిక్ హోండా గేటులో నుంచి రోడ్డు మీదకు దూసుకువెళ్ళి పోయింది. దాని మీద చుడీదార్ వేసుకున్న యువతి... ఒక ఆర్తనాదం అతని గొంతులోనే ఉండ చుట్టుకుని ఆగిపోయింది “ఆహ్లాదా!” ఆక్రోశంతో, నవనాడులూ క్రుంగిపోయినట్టు అయి కుప్పలా కూలిపోయాడు. గుంపులు, గుంపులుగా సాగిపోతున్న మేఘాలన్నీ తెరలు, తెరలుగా జారుతూ జరిగిన సంఘటనలన్నీ గగనవేదిక మీద ప్రత్యక్షం అవసాగాయి.

గట్టిగా దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు “ప్రియాంకా!”

మేఘాలన్నీ శిఖరాలై కూలి మీదపడిపోయాయి... అతని కళ్ళు మూతపడ్డాయి.

తేజ కళ్ళు తెరిచేసరికి ఆహ్లాద అతని వైపు ఆందోళనగా చూస్తూ మంచం పక్కనే కుర్చీలో కూర్చుని ఉంది.

తడారిపోతున్న గొంతు సవరించుకుని " దాహం" అన్నాడు.

ఆహ్లాద పక్కనే ఉన్న స్టూల్ మీద ఉన్న జగ్ లో నుంచి గాజుగ్లాస్ లో నీళ్ళు పోసి అతని మెడకింద ఒక చేయి వేసి నెమ్మదిగా తల పైకెత్తి తాగించింది.

"ఏమైంది" నీరసంగా అడిగాడు.

"మీరు డైరీ చదివేవరకు ఒంటరిగా వదిలేయాలని, కాసేపు బయట తిరిగి ఒక గంట తర్వాత తిరిగి వచ్చాను. వచ్చేసరికి మీరు బాల్కనీలో పడిఉన్నారు. వెంటనే నా ఫ్రెండ్ కి ఫోన్ చేసి మిమ్మల్ని తన సాయంతో తీసుకువచ్చి పడుకోబెట్టాను. చిన్న దెబ్బ తగిలింది మీ తలకి ... తగ్గిపోతుంది." అంది లాలనగా.

అతని కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. "ఆ...హ్లా... దా!" అన్నాడు గాద్గదికంగా.

ఆహ్లాద దుఃఖం ఆపుకుంటూ అంది "మీకేం కాదు... చిన్న దెబ్బే".

పేలవంగా నవ్వాడు. " చిన్నది కాదు. చాలా పెద్ద దెబ్బ తగిలింది.. ఇది మానేది కాదు" అనుకున్నాడు.

" కాఫీ తాగుతారా !" అడిగింది. తలూపాడు.

ఆమె వెళ్లి కాఫీ తెచ్చింది.. . నెమ్మదిగా లేచి తలగడని ఆనుకుని కూర్చుని ఒక్కో చుక్కా తాగుతూ మౌనంగా ఉండిపోయాడు.

" మీకు డిన్నర్ బయట ఆర్డర్ చేశాను ... వస్తుంది... నేను వెళ్ళచ్చా... బాగా ఆలస్యం అయింది. మళ్ళీ రేపు వస్తాను " అంది.

"వెళ్ళు... నాకేం ఫర్వాలేదు." అన్నాడు.

ఆహ్లాద సంశయిస్తూ అంది" మీరు అమ్మ రాసింది చదివారు అనుకుంటా... మా అమ్మ చేసింది తప్పే... క్షమిస్తారు కదూ"

గబుక్కున ఆమె చేయి పట్టుకుని "ఒద్దమ్మా అలా మాట్లాడకు... దేవత ఎప్పటికీ దేవతే " అన్నాడుగాద్గదికంగా.

కన్నీళ్లు చెంపల మీద కారుతూ ఉంటే రెండు చెతులూ జోడించి అక్కడి నుంచి వెళ్ళిపోయింది ఆహ్లాద.

" వెళ్ళద్దూ... ప్లీజ్ వెళ్ళకు... ఆహ్లాదా! నిన్ను చూస్తుంటే మీ అమ్మని... నా దేవతని చూస్తున్న అనుభూతి..." తేజ ఆమె వెళ్ళిన వైపు చూస్తూ మెల్లగా గొణిగాడు.

అతని అంతరంగంలో సునామీ అలలు విరిగిపడుతున్నాయి. భయంకరమైన శబ్దం చేస్తూ సముద్రం అతనికి బాగా చేరువగా వస్తున్నట్టు అనిపిస్తోంది... ఆ అలల మీద నుంచి చినిగిన నిక్కరు, ఆచ్చాదన లేని ఛాతీ ఎగిరెగిరి పడుతోంటే ఎవరో తనవైపే వస్తున్నారు.

" మాగాడా !" గొంతు చించుకుని అరిచాడు.

ఆవ్యక్తి  దగ్గరగా, బాగా దగ్గరగా వచ్చాడు...  తేజ రెండు చేతులూ చాచాడు. ఆ వ్యక్తీ  నెమ్మదిగా ఒక్కో అడుగే వేస్తూ అతని దగ్గరగా వచ్చాడు... తేజ ఆ వ్యక్తిని రెండు చేతులతో అందుకుని ఆతని గుండెల్లో తలదాచుకున్నాడు.  ఆ వ్యక్తీ నెమ్మదిగా ఒక్కో ఆక్షరం విడదీస్తూ " మాగాడా! ఇంకెప్పుడూ నన్ను విడిచి వెళ్ళవు కదూ!" అన్నాడు.

"వెళ్ళను... ఎప్పటికీ వెళ్ళను నాన్నా! నిన్ను, అమ్మని విడిచి ఎక్కడికీ పోను... ఇదిగో వచ్చేసాను... నాన్నా నన్ను ఇంకా, ఇంకా నీ దగ్గరకు, నీ హృదయంలోకి తీసుకోవూ... ఈ ప్రపంచంలో నాకు చోటు లేదు... నాకు బతకాలని లేదు నాన్నా!  నేను చాలా చెడ్డవాడిని.  నా తల్లి,తండ్రులను, బంధువులను, మిత్రులను ఆ సముద్రానికి అప్పచెప్పి నా మానాన నేను తప్పించుకుని అక్కడి నుంచి దూరంగా వచ్చాను... స్వార్ధపరుడిని కదూ! ఆరోజే నేనూ ఎగసిపడే ఆ కెరటాల మీద నడిచి వచ్చి ఉంటే మీతోటే ఉండేవాడిని కదా! నిజం నాన్నా నన్ను నమ్ము... నాకప్పుడు ఏమి తెలియదు... గాలికి కొట్టుకుపోతూ జీవితం ఎటు తోస్తే అటు నడిచాను... ఎంతోమందిని కలిసాను... ఎన్నో చేతులు నన్నాదుకున్నాయి... అనాగరికుడుగా ఉన్న నన్ను నాగరికంగా మార్చారు.. . నాకు భాష నేర్పారు... బతకడం నేర్పారు... కానీ, శాశ్వతంగా దాచుకోడానికి చిటికెడు ప్రేమ మాత్రం దక్కలేదు.  అసలు ప్రేమంటే ఏమిటో తెలియని రోజుల్లో ఎంతో సుఖంగా ఉన్నాను. ఏ క్షణాన బెంగుళూరు వెళ్ళానో అప్పుడే ప్రేమ అనే రెండు అక్షరాల మహత్యం తెలిసింది... తెలిసిన తరవాత ప్రేమించకుండా ఉండలేకపోయాను...  అసలు నేను బెంగుళూరు వెళ్ళకుండా ఉంటే ఎంత బాగుండేది! మహాతేజగా మారకుండా " మాగాడిగా" ఉండిపోయినా బాగుండేది... నిజం నాన్నా! నాకలాగే అనిపిస్తోంది... మాగాడు ప్రముఖ చిత్రకారుడు మహాతేజగా మారకపోయి ఉంటే  ఈ విషాదాలు, వేదనలు, ప్రేమ రాహిత్యం, దుఃఖం ఇవేవీ తెలిసేవి కావు... ఆ సముద్రపు ఒడ్డు, ఇసకదిబ్బలు, పడవలు, తెరచాపలు, సరుగుడు చెట్లు, చేపలు ఎంత హాయిగా ఉండేది! తోటి మనుషుల సాంగత్యం లేకుండా సాగరం నుంచి వచ్చి సాగరంలో కలిసిపోయి ఉంటే ! మనసు, మమత, బంధాలు,

అనుబంధాలు ఇవన్నీ ఎంత మిధ్య! ఎక్కడో చదివిన వాక్యం గుర్తొస్తోంది.. “ Sometimes it is better to be alone nobody can hurt you “

ఈ సమాజంతో సంబంధ లేకుండా వంటరిగా జీవిస్తే ఎంత బాగుంటుంది... అవును... వంటరి ఎప్పటికీ వంటరే... ఇప్పటికైనా మించిపోయింది లేదు. నేను నా నాగరిక చర్మం వదిలేస్తున్నాను పాము కుబుసం విడిచినట్టు... మహాతేజ మరణించాడు...’ మాగాడు’ తిరిగి జన్మించాడు. ఇప్పుడు నేను మాగాడిని.. నాజీవితం ముగింపు దశకు చేరింది... నేను తెలుసుకున్న ఒక నగ్న సత్యం నాకు తత్వాన్ని బోధించింది. జీవితం అనే సముద్రంలో పడేయడమే దేవుడి బాధ్యత ... మునిగిపోతామా,ఒడ్డుకి చేరతామో ఎవరికీ తెలుసు! మనిషి పొందే ఆనందాలు, విషాదాలు,ప్రేమలు,కోపాలు, అభిమానాలు, ఆవేశాలు ఇవన్నీ విరిగిపడే అలలు మాత్రమే.. అవును... నాకిక్కడ ఇంక ఏమి పనిలేదు... నీతో వచ్చేస్తాను నాన్నా... నన్ను తీసుకుని వెళ్ళవూ!

ఆ వ్యక్తీ నవ్వాడు.,. తెరలు, తెరలుగా, అలలు, అలలుగా ఆ నవ్వు ప్రతిధ్వనిస్తోంటే ఆయన స్వరం వేయి స్వరాలై మారుమ్రోగసాగింది. “ నాన్నా.. మాగా! రావడం, పోవడం మన చేతుల్లో లేదురా... నేను అప్పుడే పోవాలని అనుకోలేదురా! వేటకి వెళ్ళేటప్పుడు తిరిగి రావాలని, చేతినిండా డబ్బులతో వచ్చి ఆ డబ్బుల మీద నిన్ను జోకొట్టాలని అనుకున్నారా... కానీ విధి నన్ను వెళ్ళద్దు అని వెనక్కి లాగింది... నేను నిస్సహాయుడిని నాన్నా... నిస్సహాయుడిని... అందుకే విధి చేతికి లొంగిపోయాను. నువ్వూ అంతే... ఎవరూ విధికి మినహాయింపు కాదు... నువ్వు వెళ్ళే రోజు వచ్చిన నాడు ఎవరు మాత్రం ఆపగలరు! అందాకా నువ్వు చేయవలసిన పనులు, సాధించవలసిన విజయాలు ఎన్నో మిగిలే ఉంటాయి.. . అవి అన్నీ పూర్తీ చేసాక రా తండ్రి... నీ కోసం అద్దాల మేడ కట్టి అమ్మా, నేను ఎదురుచూస్తూ ఉంటాము.. “

ఆ వ్యక్తీ చేతులు అప్రయత్నంగా తేజ చేతుల నుంచి విడిపోయాయి... నెమ్మది, నెమ్మదిగా అదృశ్యం అవసాగాడు.

“నాన్నా!“ గట్టిగా అరుస్తూ మంచం మీద నుంచి లేచాడు తేజ... అతనిశరీరం గాలిలో తేలిపోతోంది...అడుగులు తడబడుతున్నా బలంగా, ధైర్యంగా పడుతున్నాయి. కానీ ఆ అడుగులు తండ్రి వెళ్ళిన వైపు కాదు మరో ప్రపంచం వైపు పడుతున్నాయి. ఒక్కో అడుగే వేస్తున్నాడు.. అడుగుకో మెట్టు... మెట్లన్నీ ఎక్కుతున్నాడు... ఆఖరి మెట్టు మీద కాలుపెట్టగానే మోహాన్ని కమ్మేయసాగాయి మబ్బులు.. రెండు చేతులూ చాచి మబ్బులను అందుకున్నాడు. ఆ రెండు చేతులనూ ఆప్యాయంగా అందుకున్నాయి మబ్బులు... తన చేతులు సాయం ఇచ్చి పైకి లాగాయి... ఇప్పుడు తేజ మబ్బుల మీద ప్రయాణం సాగిస్తున్నాడు. ఎక్కడినుంచో ఓ తీయని రాగం వినిపిస్తోంది. అతని కళ్ళముందు ఓ రూపం, అతని గుండెల్లో చెక్కుకున్న ఓ శిలకి ప్రాణం వచ్చినట్టు, అతని గుండెల ధమనుల తెరలు తొలగించుకుంటూ ఆవిష్కృతం అవుతోంది.

వెలిసిపోయిన నిక్కరు, చినిగిన చొక్కా, ఇసకలో దొర్లి, దొర్లి ఒళ్ళంతా అతుక్కున్న ఇసక, ఉక్రోషం కంటనీరుగా మారి వడలిన చెక్కిళ్ళ మీదచూరు మీద నుంచి కారుతున్నవర్షపుధారలా కారుతోంటే, మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టుకుని ఇసకలో కూర్చుని కెరటాలతో ఎగసిపడుతున్న సముద్రాన్ని చూస్తున్న బాలుడు, పూరిగుడిసెలు, గిర,గిరా తిరుగుతూ ఉత్సాహంగా ఆడుకుంటున్న తోటి పిల్లలు– పెద్ద, పెద్ద పడవల్లో చేపలను వేసుకొచ్చి ఒడ్డున కూర్చుని పంచుకుంటున్న జాలరులు, వాళ్ళు తెచ్చిన చేపలు చుట్టు పక్కల ఊళ్ళల్లో అమ్ముకు రావడం కోసం గంపలతో కూర్చున్న స్త్రీలు, ఇసకలో గీసిన బొమ్మలన్నీ నిర్దయగా తనతో లాక్కుని వెళ్ళిపోతున్న కెరటాలు... ఎన్నో... ఎన్నోస్మృతులు... ఓ పెద్ద అల వచ్చి కళ్ళ మీద వాలినట్టు కళ్ళు రెండూ నీళ్ళతో నిండాయి. ఆ నీటి మీద తేలుతోంది గడిచిన ఓ జీవితం ... నేనిప్పుడుమహానగరం నుంచి, నాగరిక సమాజం నుంచి అనాగరిక బాలుడిగా మారిసముద్రం ఒడ్డున నిలబడి ఉన్నాను...నన్నెవరూ అందుకోలేరు".... గొంతు చించుకుని అరిచాడు. అతని గొంతు అతనికే తిరిగి వినిపించింది. "ఎవరూ వినడం లేదా... వినండి... నేను వెళ్ళిపోతున్నాను... ఎక్కడికా! చెప్తాను" తేజ స్వరం హటాత్తుగా మంద్రంగా మారింది..

" అమ్మకడుపు చీల్చుకుని ఈ భూమ్మీదకు వచ్చిన వారు అందరూ తిరిగి నిష్క్రమించేటప్పుడు నేలతల్లి గర్భంలోకి వెళ్తారు. నేను మాత్రం సముద్ర గర్భంలోకే వెళ్తాను. నా అమ్మా, అయ్యా, తాత, ముత్తాత, ముత్తమ్మ అందరూ ఈ సముద్ర గర్భంలోనే ఉన్నారు. చూడండి ఈ కెరటాలు నా పితృదేవతల హస్తాలుగా మారి , నన్ను ఎంతో ప్రేమగా, తీయగా ఆహ్వానిస్తున్నాయి. ప్రేమ రుచి ఎరుగని నాకు సముద్రాన్ని మధించి ప్రేమామృత కలశాలను సంపాదించారు. అదిగో ఆ కలశాలతో నాకు స్వాగతం పలుకుతున్నారు. అక్కడే... అక్కడే నా దేవత కూడా ఉంటుంది... నాకు తెలుసు... ఆమె అక్కడే ఉంటుంది... అదిగో దిగంతాల అవతల మేఘాల మీద ఇంద్ర ధనుస్సులా పడుకుని నాకోసమే ఎదురుచూస్తోంది... తన లేలేత చేతులు చాచి నన్ను ఆహ్వానిస్తోంది. వెళ్తున్నాను– మరికొన్ని క్షణాల్లో ఆమె ఒడిని చేరతాను. This is my last journey... విగతజీవిగానైనా సరే ఒక్క లిప్తకాలం ఆ చేతి స్పర్శ నా మేను నిమిరితే నా జన్మ ధన్యం అవదూ! ప్రాణం ఏదో ఒక రోజు పోవాల్సిందే కదా!నా ప్రాణం కూడా పోతుంది... నా ఆత్మ మాత్రం జీవించే ఉంటుంది... ఎందుకంటే నా ఆత్మ ఆమె చుట్టూ తిరుగుతూ ఉంటుంది.. ఆమె ప్రేమతో కూడిన " మాగా" అని పిలిచే ఒకే ఒక్క పిలుపు కోసం తహతహలాడుతూ ఆమె కోసం అన్వేషిస్తూనే ఉంటుంది... నా ప్రేమకి మాత్రం మరణం ఉండదు...ఎందుకంటే నాది పవిత్ర ప్రేమ.

ఎక్కడినుంచోకోలాహలం" మా–– అరేయ్ మా.... రా, రా"